వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

శాంతి పర్వం - 2

దాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

దాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

9365

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

శాంతి పర్వం - 2

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894.82781
రామ - మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

శాంతి పర్వం - 2

ప్రథమ ముద్రణ : వినాయకచవితి (సెప్టెంబరు 2010)

20 సంపుటాల వెల : రూ. 720/-

C 27488

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No. 96365
నల్లకుంట, హైదరాబాద్-500...

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, పోలకంపాడు,
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

కీ॥శే॥ కొరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజామీనాక్షి



టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్ముల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి స్మృత్యర్థం

ట్రైటిల్ బోర్డు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ



కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి స్మృత్యర్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి

రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,

వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

శాంతి పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కొరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, ఆధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, వి.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).*

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాబ్జేషు యే
లోకానాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంసయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్వ్యాయాసుః పురుషోత్తమాబ్జభవ శ్రీకన్ధరా శ్శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

---

* మహాభారతం యథాతథంగా అనగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	2. ఆపద్ధర్మ పర్వము (43)	
131.	ఆపదలో రాజకర్తవ్యము. (14)★	19
132.	రాజర్షి వృత్తము. (22)	20
133.	కోశాగారమును నింపు విధానము. (20)	22
134.	బలము యొక్క మహత్త్వము, దోపిడి చేసిన పాపమునకు ప్రాయశ్చిత్తము. (17)	23
135.	కాయవ్యో పాఖ్యానము. (26)	24
136.	కోశ సంగ్రహణము. (11)	26
137.	శాకులోపాఖ్యానము - మూడు చేపల కథ. (24)	27
138.	మార్జాల మూషిక సంవాదము. (221)	28
139.	బ్రహ్మదత్త పూజనీ సంవాదము. (113)	40
140.	కణికోపదేశము. (71)	47
141.	విశ్వామిత్ర శ్వపచసంవాదము. (102)	53
142.	ఆపత్కాల రాజధర్మ నిర్ణయము. (38)	60
143.	కపోతలుబ్ధక సంవాదోపక్రమము. (33)	63
144.	భార్యా ప్రశంస. (17)	65
145.	కపోత వాక్యము. (14)	66
146.	కపోతలుబ్ధక సంవాదము. (26)	66
147.	లుబ్ధక వైరాగ్యము. (11)	68
148.	కపోత స్వర్గగమనము. (12)	69

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
149.	లుబ్ధకుడు స్వర్గమున కేగుట. (19)	69
150.	ఇంద్రోత పారిక్షితీయ సంవాదము - 1. (19)	71
151.	ఇంద్రోత పారిక్షితీయ సంవాదము - 2. (22)	72
152.	ఇంద్రోత పారిక్షితీయ సంవాదము - 3. (39)	73
153.	గృధ్రగోమాయు సంవాదము. (122)	76
154.	పవన శాల్మలీ సంవాదము - 1. (21)	84
155.	పవన శాల్మలీ సంవాదము - 2. (18)	85
156.	పవన శాల్మలీ సంవాదము - 3. (19)	86
157.	పవన శాల్మలీ సంవాదము - 4. (16)	87
158.	లోభము వలన గలుగు అనర్థములు, మహాపురుష లక్షణములు. (35)	88
159.	అజ్ఞాన మాహాత్మ్యము. (14)	91
160.	దమ మాహాత్మ్యము. (38)	92
161.	తపోమహిమ. (13)	94
162.	సత్యమహిమ. (26)	95
163.	కామక్రోధాదులైన పదమూడు దోషములు - వాని నాశనోపాయములు. (22)	97
164.	నీచ పురుష లక్షణములు. (13)	99
165.	నానావిధ పాపములు - ప్రాయశ్చిత్తములు. (78+$\frac{1}{2}$)	100
166.	ఖడ్గోత్పత్తి, మాహాత్మ్యము. (89+$\frac{1}{2}$)	106
167.	ధర్మార్థ కామ విషయమున విదుర పాండవుల అభిప్రాయములు - షడ్జగీత. (51)	111
168.	కృతఘ్నోపాఖ్యానము - 1. (52)	115
169.	కృతఘ్నోపాఖ్యానము - 2. (24)	118

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
170.	కృతఘ్నోపాఖ్యానము - 3. (26)	120
171.	కృతఘ్నోపాఖ్యానము - 4. (35)	121
172.	కృతఘ్నోపాఖ్యానము - 5. (25)	123
173.	కృతఘ్నోపాఖ్యానము - 6. (26)	125
	3. మోక్షధర్మ పర్వము (192)	
174.	బ్రాహ్మణ సేనజిత్తుల సంవాదము. (63+3)	127
175.	పితాపుత్ర సంవాదము. (39+1$\frac{1}{2}$)	132
176.	శంపాకగీత. (23)	135
177.	మంకిగీత. (54)	136
178.	బోధ్యగీత. (13)	140
179.	ఆజగర ప్రహ్లాదసంవాదము. (37)	141
180.	శృగాల కాశ్యపసంవాదము. (54)	143
181.	శుభాశుభ కర్మఫలానుభవము. (20)	147
182.	భృగు భరద్వాజ సంవాదము - 1. (38)	148
183.	భృగు భరద్వాజ సంవాదము - 2. (17)	150
184.	భృగు భరద్వాజ సంవాదము - 3. (44)	151
185.	శరీరములో అగ్నివాయువుల స్థితి. (17)	154
186.	జీవస్వరూపాక్షేపము. (15)	155
187.	జీవస్వరూపనిరూపణము. (31)	156
188.	వర్ణవిభాగ కథనము. (20)	158
189.	వర్ణ స్వరూప కథనము. (18)	160
190.	సత్యాసత్య, సుఖదుఃఖ విచారణ. (16)	161

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
191.	బ్రహ్మచర్య గృహస్థాశ్రమ ధర్మవర్ణన. (18)	162
192.	వానప్రస్థ సంన్యాస ధర్మవర్ణన. (27)	164
193.	ఆచార విధి. (33)	167
194.	అధ్యాత్మజ్ఞాన కథనము. (63)	169
195.	ధ్యానయోగ వర్ణన. (22)	173
196.	జాపకోపాఖ్యానము - 1. (23)	175
197.	జాపకోపాఖ్యానము - 2. (13)	176
198.	జాపకోపాఖ్యానము - 3. (11)	177
199.	జాపకోపాఖ్యానము - 4. (128)	178
200.	జాపకోపాఖ్యానము - 5. (34)	187
201.	మను బృహస్పతి సంవాదము - 1. (27)	189
202.	మను బృహస్పతి సంవాదము - 2. (23)	192
203.	మను బృహస్పతి సంవాదము - 3. (23)	194
204.	మను బృహస్పతి సంవాదము - 4. (20)	196
205.	మను బృహస్పతి సంవాదము - 5 (పరబ్రహ్మ పాప్త్యుపాయము). (26)	197
206.	మను బృహస్పతి సంవాదము - 6. (32)	199
207.	సర్వభూతోత్పత్తి. (49+23)	201
208.	దిశా స్వస్తికము. (36)	205
209.	అంతర్భూమి విక్రీడనము (అనుస్మృతి). (36+86 $\frac{1}{2}$)	206
210.	వార్ణేయాధ్యాత్మ కథనము - 1. (46)	213
211.	వార్ణేయాధ్యాత్మ కథనము - 2. (17)	216

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
212.	వార్ష్ణేయాధ్యాత్మ కథనము - 3. (33)	217
213.	వార్ష్ణేయాధ్యాత్మ కథనము - 4. (21)	220
214.	వార్ష్ణేయాధ్యాత్మ కథనము - 5. (29)	221
215.	వార్ష్ణేయాధ్యాత్మ కథనము - 6. (27)	224
216.	వార్ష్ణేయాధ్యాత్మ కథనము - 7. (20)	226
217.	వార్ష్ణేయాధ్యాత్మ కథనము - 8. (38)	227
218.	పాఖండ ఖండనం. (49)	230
219.	పంచశిఖవాక్యము. (52+15)	236
220.	దమ ప్రశంస. (20+108 $\frac{1}{2}$)	241
221.	అమృత ప్రాశనికము. (17+1)	248
222.	శక్ర ప్రహ్లాద సంవాదము. (37+45 $\frac{1}{2}$)	249
223.	బలివాసవ సంవాదము - 1. (30+2)	254
224.	బలివాసవ సంవాదము - 2. (60)	256
225.	శ్రీ సంనిధానము. (38)	260
226.	శక్రనముచి సంవాదము. (23)	263
227.	బలివాసవ సంవాదము. (119)	264
228.	శ్రీవాసవ సంవాదము. (96)	272
229.	జైగీషవ్య - అసిత సంవాదము. (25)	278
230.	వాసుదేవ - ఉగ్రసేన సంవాదము. (24)	279
231.	శుకునకు వ్యాసుడు కాలస్వరూప మెరిగించుట. (31)	281
232.	వ్యాసుడు శుకునకు సృష్టి యుత్పత్తిని యుగధర్మాలను వివరించుట. (43)	283
233.	బ్రాహ్మప్రలయ - మహాప్రలయ వర్ణనము. (19)	286

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
234.	బ్రాహ్మణ కర్తవ్యము - బ్రాహ్మణ దానమహిమ. (38)	288
235.	బ్రాహ్మణ కర్తవ్య ప్రతిపాదనము - కాలనదీతరణోపాయము. (32)	290
236.	ధ్యాన - యోగ - సాంఖ్య నిరూపణము. (41)	292
237.	బుద్ధి ప్రాధాన్యము - ప్రాణుల తారతమ్య వర్ణనము. 25	295
238.	కర్మతత్త్వ వివేచన - యుగధర్మవర్ణన - కాలమాహాత్మ్యము. (21)	297
239.	జ్ఞానసాధన - జ్ఞానమహిమ. (34)	298
240.	యోగము ద్వారా పరమాత్మప్రాప్తి. (36)	301
241.	కర్మజ్ఞాన తారతమ్యము - బ్రహ్మప్రాప్తికి ఉపాయము. (20)	303
242.	ఆశ్రమ ధర్మప్రస్తావన - బ్రహ్మచర్యాశ్రమ వర్ణన. (30)	305
243.	గృహస్థ ధర్మ వర్ణన. (29)	307
244.	వానప్రస్థ - సంన్యాస ధర్మవర్ణన. (31+$\frac{1}{2}$)	309
245.	సంన్యాసాశ్రమ పాలన - జ్ఞాని అయిన సంన్యాసి ప్రశంస. (36)	312
246.	పరమాత్మ శ్రేష్ఠత - పరమాత్మ దర్శనోపాయము. (23)	315

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
శాంతి పర్వం - 2

131. ఆపదలో రాజకర్తవ్యము.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'భరతనందనా ! సైన్యం, ధనసంపత్తి క్షీణించినవాడు, బద్ధకస్థుడు, బంధువులపై జాలితో వారు చచ్చిపోతారనే భయంతో యుద్ధం చేయనివాడు, అందరిపై సందేహం కలవాడు, తన రహస్యాలు వెల్లడి అయినవాడు, దేశంలో కొన్ని భాగాలు శత్రువులచే ఆక్రమింపబడినవాడు, ద్రవ్యం లేక మిత్రుల ఆదరాన్ని కోల్పోయినవాడు, శత్రుపక్షంలో చేరిన మంత్రులు కలవాడు, శత్రుసైన్యాలచే చుట్టుముట్టబడినవాడు, బలిష్ఠుడైన శత్రువు చేతిలో చిక్కిన రాజు ఆ పరిస్థితుల నుండి బయటపడటానికి ఏం చెయ్యాలి ?' భీష్ముడు ఇలా అన్నాడు. 'ధర్మరాజా ! ఎదుటివాడు గెలవగలిగి, ధర్మం తెలిసినవాడు, అర్థాన్ని సాధించగలవాడు, పరిశుద్ధుడు అయితే రాజు వెంటనే అతనితో సంధి చేసుకొని అతని ఆక్రమణలో ఉన్నవానిని విడిపించుకోవాలి. అవతలివాడు అధర్మమార్గంలో గెలిచేవాడు, బలవంతుడు, పాపపుపనులు చేసేవాడు అయితే వాడికోసం కొంత వదులుకొని అయినా సంధి చేసుకోవాలి. రాజధానినో, ద్రవ్యాన్నో వదులుకొని ఆపదనుండి తప్పించుకోవాలి. ప్రాణాలతో ఉంటే రాజోచితమైన గుణాలతో ద్రవ్యాన్ని మళ్లీ సంపాదించుకోవచ్చు. కోశాన్నీ, సైన్యాన్ని వదులుకొంటే తొలగిపోయే ఆపదల కోసం అర్థధర్మాలు తెలిసినవాడు తన ప్రాణాలు ఎలా వదులుకొంటాడు ? శత్రువుల ఆక్రమణలో అంతఃపురరక్షణకు గట్టిగా ప్రయత్నించాలి. తనచేయిదాటి అది శత్రువు సొమ్ము అయితే దానిపై కూడా దయలేకుండా సాధ్యమైనంతవరకు తనను తాను పరులపాలు కాకుండా కాపాడుకోవాలి.'

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. 'పితామహా ! రాజ్యం, కోట శత్రువులకు స్వాధీనమై, ఆంతరంగికులైన మంత్రులు మొదలైనవారు కోపించినప్పుడు, కోశాగారం క్షీణించి, రహస్యాలు బయటకు పొక్కుతున్నప్పుడు ఏం చెయ్యాలి ?' భీష్ముడు ఇలా

అన్నాడు. 'ఆ స్థితిలో ఉన్నవాడు వెంటనే సంధి అయినా చేసుకోవాలి. పరాక్రమమైనా చూపించాలి. దానితో శత్రువును వెళ్లగొట్టటమో, తానే పరలోకానికి వెళ్లటమో వెంటనే తేలిపోతుంది. తనను ప్రేమిస్తూ, ఇష్టపడుతూ, సంతోషంగా ఉన్న సైన్యం కొంచెం ఉన్నా రాజు విజయాన్ని సాధిస్తాడు. చనిపోతే స్వర్గానికి పోతాడు. శత్రువును చంపితే భూమిని గెలుస్తాడు. యుద్ధంలో ప్రాణాలు వదిలితే ఇంద్రునితో కలిసి స్వర్గలోకంలో ఉంటాడు. ఉపాయంగా లోకాన్ని అంతటినీ మెత్తదనంతో ఆకట్టుకోవాలి. విశ్వాసంతో శత్రువు తలవంచి, యుద్ధాన్ని మానుకొనేటట్లు చేయాలి లేదా తానే అతనిని విశ్వసించి నట్లుండాలి. మంచితనంతో, తియ్యని మాటలతో శత్రుపక్షాన్ని అనుకూలం చేసుకొని రాజ్యం నుంచి బయటకు పోయి, తనవారిని కూడదీసుకొని, మళ్లీ తన రాజ్యాన్ని ఆక్రమించే ప్రయత్నానికి ఉపక్రమించాలి.'

132. రాజర్షి వృత్తము.

ధర్మరాజు ఇలా అడిగాడు. 'తాతగారూ ! లోకులందరూ ఆచరించవలసిన పరమధర్మం క్షీణించినప్పుడు, భూమిమీద జీవనమంతా దొంగలపాలు అయినప్పుడు, ఆ చేటు కాలంలో పుత్రపౌత్రులను విడిచిపెట్టలేని బ్రాహ్మణుడు ఎలా బ్రతకాలి ? భీష్ముడు ఇలా చెపుతున్నాడు. 'ధర్మరాజా ! అలా ఉన్నవాడు తన విజ్ఞానబలంతో జీవించాలి.లోకంలో కనిపించే ధనాదులన్నీ మంచివారి కొరకే. చెడ్డవారి కోసమేదీ లేదు. చెడ్డవారి నుండి సొమ్ము సేకరించి, మంచివారికి అందించే సాధనంగా ఉన్నవాడు ఆపద్ధర్మం తెలిసినవాడే. తన రాజ్యాన్ని తాను కోరుకుంటూ, దానిని అల్లకల్లోలం చేయకుండా బ్రాహ్మణాది సమస్తజాతుల క్షేమం కోసం రాజ్యంలోని ధనవంతుల ధనం తనదిగా భావించి, వారు ఇవ్వకపోయినా బలవంతంగా నయినా తీసుకోవచ్చు. విజ్ఞాన బలంతో పవిత్రుడై, ఏ వృత్తికి ఎవరు సమర్థులో తెలిసిన ధీరుడు రాజ్యరక్షణకోసం నిందింపదగిన పనులు చేసినా అతనిని ఎవరు నిందింపగలరు ? బలంతో, పరాక్రమంతో జీవించేవాడు మరొక విధమైన వృత్తికి ఇష్టపడడు. బలవంతులు పరాక్రమంతో కూడిన పనులే చేస్తారు. ఆపద్ధర్మంలో ఉపయోగపడే సామాన్య శాస్త్రాన్నే విశేష శాస్త్రం జోలికి పోకుండా రాజు పాటించాలి. మేధావి అయినవాడు రెండిటిలో మేలైన దానిని ఆచరించాలి.* తనచే

* *సామాన్యశాస్త్రం : తన రాజ్యం నుండి కాని ఇతర రాజ్యాల నుండి కాని సొమ్ము సేకరించి కోశాన్ని నింపాలి.*

విశేష శాస్త్రం : దండనార్హులైన ధనవంతుల నుండి బలవంతంగా నైనా ఏ రాజ్యంలోనివారి నుండి అయినా ధనం సేకరించవచ్చు. (నీల)

ఇంతకుముందు సత్కరింపబడిన ఋత్విజులను, పురోహితులను, ఆచార్యులను, బ్రాహ్మణులను కొట్టి సొమ్ము తీసుకోకూడదు. అలా చేస్తే పాపాలను పొందుతాడు. లోకానికి ఇదే ప్రమాణం. ఇదే సనాతనమైన దృష్టి. రాజు దీనిని అనుసరించి మాత్రమే ఎంతటి ఆపదలోనైనా మంచిపని గాని, చెడుపని గాని చెయ్యాలి. ఎందరో గ్రామవాసులు రోషంతో, అసూయా ద్వేషాలతో ఒకరిపై ఒకరు చాడీలు చెపుతూ ఉంటారు. ఆ మాటలను బట్టి రాజు వారిని మన్నించటం గాని, దండించటం గాని చేయకూడదు. **రాజు ఎవరినీ నిందించరాదు. నిందలను వినరాదు. చెవులు అయినా మూసుకోవాలి. లేదా అక్కడ నుండి వెళ్లిపోవాలి. ధర్మరాజా ! ఇతరులను గురించి నిందలు, చాడీలు చెప్పటం చెడ్డవారి లక్షణం. మంచివారు ఇతరులలోని మంచిగుణాలనే చెపుతారు.**

చక్కని ఆకారం, మంచి శిక్షణ కలవై, మెడల మీద కాడి సరిగా వేసుకొని, బరువు సమానంగా మోసే ఎద్దులు బండిని ఎలా లాగుతాయో అట్లా రాజు రాజ్యభారాన్ని వహిస్తూ పనులు చక్కబెట్టుకోవాలి. రాజు పరిపాలన విషయంలో ఇతరుల సహాయం తీసుకోవాలని కొందరు చెపుతారు. దేనికైనా ఆచారమే అన్నిటికి మించిన ధర్మలక్షణం. *శంఖలిఖిత సిద్ధాంతాన్ని ప్రేమించేవారు మాత్యర్యంతోనో, లోభంతోనో దీనికి ఇష్టపడరు. చెప్పరు. చెడుపని చేసినవానిని పడగొట్టటం ఆర్షసమ్మతం అవునా ? కాదా ? అని కూడా చూస్తారు. దానితో సమానమైన ప్రమాణం మరొకటి ఎక్కడా కనబడదు. **దేవతలు కూడా చెడ్డపనులు చేసే నరాధముని వరకానికి వడదోస్తారు. మోసంతో ధనం సంపాదించేవాడు ధర్మభ్రష్టుడు అవుతాడు.** ఐశ్వర్యాభివృద్ధికి ప్రధానకారణంగా ధర్మవేత్తలచేత అంతటా అంగీకరించబడి, తన మనస్సుకు సమ్మతమైన దానిని ధర్మంగా స్వీకరించి, ఆచరించాలి. వేదవిహితం, స్మృతి సమ్మతం, సజ్జన సేవితం, తనకు ప్రియమైనది అనే నాలుగు గుణాలతో కూడిన ధర్మాన్ని చెప్పేవాడే ధర్మవేత్త. పాము పాదాలను వెదకటంలాగానే ధర్మం నడకను వెదకటం చాలా కష్టం. దెబ్బతిన్న జంతువు కాలిగుర్తులు, నెత్తురు మరకల ద్వారా వేటగాడు దాని ఉనికిని కనిపెట్టినట్లు నాలుగుగుణాల ద్వారా ధర్మం యొక్క యధార్థస్వరూపాన్ని కనిపెట్టి చెప్పవచ్చు. యుధిష్ఠిరా ! ఈ విధంగా శ్రేష్ఠులు వెళ్ళినదారిలో నీవు కూడా వెళ్లాలి. రాజర్షుల నడవడిక ఇలాగే ఉంటుందని తెలుసుకో. '

---

* శంఖమనగా నుదుటి ఎముక. దానిపై బ్రహ్మవ్రాసిన దానిని నమ్మేవారి సిద్ధాంతం

133. కోశాగారమును నింపు విధానము.

భీష్ముడు చెపుతున్నాడు. 'కౌంతేయా ! రాజు తనరాష్ట్రం నుండి, పరరాష్ట్రం నుండి సంపద కూడబెట్టాలి. దానిపైనే ధర్మరక్షణ, రాజ్యాభివృద్ధి ఆధారపడి ఉన్నాయి. కనుక కోశాన్ని పెంపొందించుకోవాలి. దానిని సరియైన పద్ధతిలో సంరక్షించుకోవాలి. అలా కాపాడుతూ జాగ్రత్తగా అభివృద్ధి చెందేటట్లు చేయాలి. ఇదే సనాతన ధర్మం. ఆచార విచారాలతో పరిశుద్ధుడైనవాడు కాని, మిక్కిలి క్రూరుడైనవాడు కాని కోశాన్ని కూర్చలేడు. మధ్యేమార్గాన్ని అనుసరించి కోశసంగ్రహణం చెయ్యాలి. బలహీనుడికి ధనసంపద ఎలా ఉంటుంది ? ధనసంపదలేని వాడికి బలం ఎలా ఉంటుంది ? బలం లేనివాడికి రాజ్యం ఎలా ఉంటుంది ? రాజుకాని వాడికి సంపద ఎక్కడిది ? **గొప్పస్థితిలో ఉన్నవాడికి సంపద లేకపోవటం చావుతో సమానం. కాబట్టి రాజు కోశాన్ని, సైన్యాన్ని, మిత్రులను పెంపొందించుకోవాలి.** సంపదలేని రాజును ప్రజలు చులకనగా చూస్తారు. అతని స్వల్పధనంతో తృప్తిపడరు. అతని పనులు చేయటానికి ఉత్సాహం కూడా చూపించరు. సంపద కారణంగానే రాజు గొప్ప గౌరవాన్ని పొందుతాడు. వస్త్రం స్త్రీ మానాన్ని కాపాడినట్లు సంపద అతని పాపాలను కప్పి ఉంచుతుంది. మునుపు రాజువలన అపకారం పొందిన వారు అతని సంపదను చూసి, ఉడికిపోతూ ఉంటారు. అతనిని చంపటానికే ఎప్పుడూ ఇంటికుక్కల్లాగా కపటవిశ్వాసాన్ని ప్రకటిస్తూ, దగ్గరకు చేరుతూ ఉంటారు. ఇటువంటి రాజుకు సుఖం ఎక్కడిది ? అందువలన రాజు ఎప్పుడూ సైస్థాయిలోనే ఉండాలి. లొంగకూడదు. ప్రయత్నమే పౌరుషాన్ని పెంచుతుంది. కణుపులేని చోటనైనా విరగగొట్టగలగాలి. ఎవడికీ తలవంచకూడదు.

అడవికి పోయి మృగాలతో నయినా తిరగవచ్చు గాని మర్యాదాహీనులైన దొంగలు, మోసగాళ్లతో కలిసి ఉండరాదు. హింసాత్మకమైన భయానకకృత్యాలకు అడవి దొంగలతో సైన్యాన్ని తయారు చేయటం తేలిక అవుతుంది. ఎప్పుడూ అమర్యాదగానే చూస్తుంటే ఎవడైనా తిరగబడతాడు. దయలేని వాడిని దొంగలు కూడా అనుమానిస్తారు. ప్రజలందరి హృదయాలను ప్రసన్నపరచే మర్యాదను రాజు ఎప్పుడూ పాటిస్తూనే ఉండాలి. ఈ లోకంలో చిన్నవనికి అయినా మర్యాద ముఖ్యం అవుతుంది. **ఇహమూ లేదు, పరమూ లేదు అవే విశ్వయావికి వచ్చిన వాస్తికుడు భయావికీ, అమమావానికీ స్థానం అవుతున్నాడు. అతనిని ఎవ్వడూ విశ్వసించడు. మంచివారైన దొంగలు ఇతరుల సొమ్ము అపహరించినా అది అహింసయే అవుతుంది. మర్యాద పాటించే దొంగల ద్వారా ఎన్నోప్రాణులు**

రక్షింపబడతాయి కనుక అందరూ వారిని అభిమానిస్తారు. యుద్ధం చేయనివాడిని చంపటం, పరుల భార్యలను బలాత్కరించటం, కృతఘ్నత, బ్రాహ్మణధనాన్ని అపహరించటం, ఏమీ మిగల్చకుండా లాక్కోవటం, కన్యలను దొంగిలించటం, ఇతరుల గ్రామాలపై పెత్తనం చేయటం - అనేవి దొంగలు కూడా చేయదగనివి. పర స్త్రీ సంపర్కాన్ని కూడా వదులు కోవాలి. నష్టపోయినవారు శత్రువుకు నమ్మకం పుట్టించి, వాడితో కలిసిమెలిసి, ఆనుపానులు తెలుసుకొని, వాడి సొమ్ము మొత్తం తప్పకుండా కాజేస్తారు. కాబట్టి దోచుకొనేవారు కొంత మిగిల్చి, దోచుకోవాలి. బలం ఉందికదా అని క్రూరమైన పనులు చేయరాదు. ఎదుటివారికి మిగిలేటట్లు చేసేవాడికి జనం కూడా మిగిలేటట్లు చేస్తారు. నిలువుదోపిడి చేసినవాడికి అటువంటి భయమే వెన్నాడుతూ ఉంటుంది.'

134. బలము యొక్క మహత్త్వము, దోపిడి చేసిన పాపమునకు ప్రాయశ్చిత్తము.

భీష్ముడు ఇలా చెపుతున్నాడు. 'రాజా ! అనుభవజ్ఞులైన విద్వాంసులు ఈ విషయంలో ఒక ధర్మాన్ని ఇలా చెపుతూ ఉంటారు. విజ్ఞుడైన క్షత్రియునకు ధర్మం, అర్థం రెండూ ప్రత్యక్షమౌతాయి. **ధర్మాధర్మవిచారణతో కర్తవ్యాన్ని ఆలస్యం చేయకూడదు. ఎందుకంటే ధర్మఫలితం ప్రత్యక్షం కాదు. నేలమీద పడిన కాలిగుర్తులు కుక్కవో, తోడేలువో తెలుసుకోవటం ఎంత కష్టమో ధర్మాధర్మనిర్ణయం కూడా అలాంటిదే.** ధర్మ, అధర్మ ఫలితాలను ఎవ్వడూ, ఎప్పుడూ ఇహలోకంలో ప్రత్యక్షంగా చూడలేదు. కనుక రాజు బలాన్ని పొందటానికే ప్రయత్నం చెయ్యాలి. ఎందుకంటే ఏదైనా బలవంతునికి వశమౌతుంది. ఈ లోకంలో బలవంతుడు సంపదను, సైన్యాన్ని, మంత్రులను అన్నిటినీ పొందుతాడు. ధనం లేనివాడు పనికిమాలినవాడు. వాని దగ్గర కొంచెం ఉన్నా అది ఎంగిలి మెతుకే. ఎవరూ ముట్టరు. బలవంతుడు తప్పుచేసినా భయంతో లోకం అతనిని ఏమీ అనదు. బలమూ, ధర్మమూ రెండూ సత్యం అధీనంలో ఉండి, మానవులను మహాభయం నుండి రక్షిస్తాయి. ధర్మం కన్నా బలమే గొప్పది అని నా అభిప్రాయం. బలంతోనే ధర్మం నిలబడుతుంది. నేల మీద జీవులు నిలబడినట్లు బలం మీదనే ధర్మం నిలబడుతుంది. గాలితోపాటు తిరిగే పొగలాగా ధర్మం బలాన్ని అనుసరిస్తుంది. తీగ చెట్టును ఆశ్రయించి, అల్లుకొన్నట్లు స్వయంశక్తి లేని ధర్మం ఎప్పుడూ బలంపైనే ఆధారపడి ఉంటుంది. భోగసామగ్రిగల సంపన్నుల అధీనంలో సుఖం ఉన్నట్లే బలవంతుల

అధీనంలో ధర్మం ఉంటుంది. బలవంతులకు అసాధ్యం లేదు. బలవంతుల వస్తువులు, పనులు ఏవైనా పవిత్రమైనవే. ఎవని బలం తగ్గుతుందో, ఎవడు దురాచారుడు అవుతాడో వానిని రక్షించటానికి ఎవడూ నిలబడడు. తోడేలును చూసి, పారిపోయినట్లు చిరాకుతో తప్పుకొంటారు. ఐశ్వర్యాన్ని కోల్పోయిన వాడు అందరి నుండి అవమానానికి, నిర్లక్ష్యానికి గురి అవుతాడు. దుఃఖమయమైన జీవితాన్ని గడుపుతాడు. చులకన అయిన బ్రతుకు మరణం వంటిది. పాపపునడవడితో బంధువులకు దూరమైనాడని లోకులు పలికే సూటిపోటి మాటల బాణాలతో గాయపడి, మరింత క్రుంగిపోతాడు. అధర్మంగా ధనం సంపాదించిన పాపం పోగొట్టుకోవటానికి ఆచార్యులు ఉపాయం ఇలా చెప్పారు. వేదాధ్యయనం చెయ్యాలి. బ్రాహ్మణులను పూజించాలి. చూపుతో, మాటతో, పనితో అందరినీ ప్రసన్నం చేసుకోవాలి. పెద్దమనసుతో ఉండాలి. గొప్పవంశంలో వివాహసంబంధం ఏర్పరచుకోవాలి. 'నేను అనామకుణ్ణి, మీ సేవకుణ్ణి. మీరు గొప్పవారు' అంటూ ఎదుటివారి గుణాలను కొనియాడుతూ ఉండాలి. స్నానాలు, జపాలు చేస్తూ మెత్తగా ఉండాలి. వీలైనంత మౌనంగా ఉండాలి. ఇతరులకు కష్టసాధ్యమైన మంచిపనులు చాలా చాలా చేస్తూ బ్రాహ్మణ క్షత్రియ సమాజంలో ప్రవేశం సంపాదించాలి. లోకులు తిట్టినా, పొగడినా పట్టించుకోకుండా మంచిపనులు ఇంకా ఇంకా చేస్తూ ఉండాలి. ఇట్లా చేసినవాడు పాపరహితుడై త్వరలో ప్రజాభిమానాన్ని పొందుతాడు. అనేకవిధాల సుఖాలను అనుభవిస్తాడు. అతడు చేసిన మంచిపనే అతనిని కాపాడుతుంది. లోకంలో అందరిమన్ననలు అందుకొంటాడు. ఇహంలో, పరంలో గొప్పఫలాలను పొందుతాడు.'

135. కాయవ్యో పాఖ్యానము.

భీష్ముడు చెపుతున్నాడు. 'యుధిష్ఠిరా ! ఎంత దోపిడికాడు అయినా మర్యాదను పాటిస్తే మరణానంతరం దుర్గతిని పొందడు. ఈ విషయంలో విద్వాంసులు ఒక పురాతనమైన ఇతిహాసాన్ని ఉదాహరిస్తూ ఉంటారు. కాయవ్యుడు అనేపేరుగల ఒక ఎఱుకలవాడు దోపిడికాడు అయినప్పటికీ సిద్ధిని పొందాడు. అతడు బలిష్ఠుడు, బుద్ధిమంతుడు, శూరుడు, చదువుకొన్నవాడు, క్రూరత్వం లేనివాడు, నాలుగు ఆశ్రమాలలో ఉన్నవారి ధర్మాలను కాపాడుతున్నవాడు, బ్రహ్మజ్ఞానం కలవాడు, గురువులను పూజించేవాడు. ఆ కాయవ్యుడు క్షత్రియుని వలన ఒక నిషాదికి జన్మించాడు. క్షత్రియ ధర్మాలను చక్కగా పాటించే ఆ నిషాదుడు దస్యు డయినా సిద్ధి పొందాడు. అరణ్యంలో ప్రొద్దున సాయంత్రం మృగాల గుంపులను ఉత్తేజపరుస్తూ ఉంటాడు. వివిధ జాతుల మృగాల స్వభావాలన్నీ అతనికి

తెలుసు. ఆటవికులలో అందరికంటె అతడు నిపుణుడు. దస్యునకు అడవిలోని అన్ని ప్రదేశాలూ తెలుసు. పారియాత్ర పర్వతంపై ఎప్పుడూ తిరుగుతూ ఉంటాడు. అన్ని ప్రాణుల ధర్మాలు అతనికి తెలుసు. అతని బాణం గురితప్పదు. అతని అస్త్ర శస్త్రాలు అన్నీ మిక్కిలి దృఢంగా ఉంటాయి. వందల కొలదీ ఉన్న సైన్యాన్ని దస్యుడు ఒక్కడే గెలిచాడు. ఆ మహారణ్యంలో ఉన్న వృద్ధులు, అంధులు, చెవిటివారు అయిన తన తల్లిదండ్రుల సేవ, పూజ చేసేవాడు. తేనె, మాంసం, దుంపలు, పండ్లు, పలురకాలయిన అన్నాలతో తల్లిదండ్రులకు సత్కార పూర్వకంగా మంచి భోజనం పెట్టేవాడు. వారితో పాటు పూజ్యులైన పెద్దలకు కూడా పరిచర్యలు చేసేవాడు. అరణ్య వాసులను, సంన్యాసులను, బ్రాహ్మణులను గొప్పగా గౌరవిస్తూ, నిత్యమూ వారున్న తావులకు వెళ్లి, వారికి అన్నం మొదలైన వస్తువులను ఇచ్చేవాడు. ఎవరైనా దొంగసొమ్ము తినరాదని తీసుకోకపోతే తెల్లవారే సరికి వారి ఇళ్లలో ఆహార పదార్థాలు పెట్టి వెళ్లేవాడు. దయాదాక్షిణ్యాలు, హద్దుపద్దులు లేని దొంగలు కొన్ని వేలమంది అతనిని తమ నాయకునిగా ఎన్నుకొన్నారు.' దస్యులు ఇలా అన్నారు. 'తగిన సమయమూ, దేశమూ, కాలమూ తెలిసిన ప్రాజ్ఞుడవు, శూరుడవు, చెదరని వ్రతదీక్ష కలవాడవు. నీవు మాకు ముఖ్యనాయకునిగా ఉండు. ఇది మా అందరి ఆకాంక్ష. నీవు ఎలా చెపితే మేము అలా చేస్తాం. మాకు ఏది న్యాయమో అది చేస్తూ తల్లి, తండ్రిలాగా మమ్మల్ని కాపాడు.'

కాయవ్యుడు ఇలా అన్నాడు. 'స్త్రీని, భయపడ్డవానిని, పసివానిని, తాపసిని, నీతో యుద్ధం చేయనివానిని చంపకూడదు. స్త్రీలను బలాత్కరించరాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ, అన్ని ప్రాణులలోనూ స్త్రీని చంపకూడదు. ఎప్పుడూ బ్రాహ్మణుని మేలుకోరుతూ ఉండాలి. వారికోసం పోరాడాలి. ఎక్కడ దేవతలు, పితృదేవతలు, అతిథులు పూజింపబడుతూ ఉంటారో అక్కడ పూజనీయ ద్రవ్యాలను అపహరించి, శుభకార్యాలకు ఆటంకం కలిగించకూడదు. అన్ని ప్రాణులయందు బ్రహ్మజ్ఞాన సంపన్నుడైన బ్రాహ్మణుడు మోక్షానికి అర్హుడు. మన సర్వస్వం సమర్పించి అయినా వారికి అభివృద్ధి కలిగించాలి. వారు ఎవనిచే అవమానింపబడి మనస్సులో కోపిస్తారో వానిని రక్షింపగలిగినవాడు ముల్లోకాలలో ఒక్కడూ లేడు. ఎవడు బ్రాహ్మణులను నిందిస్తూ, వారి నాశనాన్ని కోరుకొంటాడో వాడు సూర్యోదయంలో చీకటిలాగా తప్పక పరాభవాన్ని పొందుతాడు. మానవుడు కూర్చున్న చోటునుంచి కదలకుండా అన్నివైపుల నుండి ఫలితాలు వచ్చేటట్లు చేయాలి. ఎవరెవరు మనకు ఇవ్వాల్సింది ఇవ్వరో వారి పైకి దాడి వెళ్లాలి. దుష్టులను శిక్షించటానికే

దండోపాయం ఏర్పడింది. సంపద పెంచుకోవడానికి కాదు. ఎవరు సజ్జనులను బాధిస్తారో వారికి మరణదండన చెప్పబడింది. ఎవరు దేశాభివృద్ధిని అడ్డుకొని, తమ ఉన్నతికి ప్రయత్నిస్తారో వారు కళేబరంలో క్రిములాగా నశించిపోతారు. **ఏ దస్యులు ధర్మశాస్త్రం ప్రకారం నడుచుకొంటారో వారు దొంగలు అయినా త్వరగా సిద్ధిని పొందుతారు.'** భీష్ముడు ఇలా అన్నాడు. 'కాయవ్యుని ఆదేశాలను, ఉపదేశాలను దొంగలు అందరూ ఆచరించారు. దానితో వారు అన్నివిధాలా వృద్ధి పొందారు. పాపకర్మలను విరమించుకొన్నారు. **కాయవ్యుడు ఈ పుణ్యకర్మలో సాధుజనులకు క్షేమాన్ని కలిగిస్తూ, దొంగలను పాపాలనుండి నివారిస్తూ గొప్పసిద్ధిని పొందాడు.** ఈ కాయవ్యచరిత్రను నిత్యమూ తలుచుకొనే వాడికి అరణ్య ప్రాణులనుండి కొంచెంకూడా భయం ఉండదు. ధర్మరాజా ! కాయవ్యచరిత్ర విన్నవాడికి ఏ ప్రాణి నుండి అయినా భయం కలుగదు. వాడు అరణ్యాలకు అధిపతి అవుతాడు.'

136. కోశ సంగ్రహణము.

భీష్ముడు అన్నాడు. 'రాజు ఏమార్గంలో కోశాన్ని ఏర్పరచి వృద్ధిచేస్తాడో దానిని గురించి బ్రహ్మదేవుడు గానం చేసిన కొన్ని గాథలను పురాణవేత్తలు చెపుతున్నారు. యజ్ఞానుష్ఠానం చేసే బ్రాహ్మణుల ధనాన్ని, దేవతల సొమ్మును రాజు కొల్లగొట్టరాదు. దొంగలు, సోమరిపోతుల సొమ్మును క్షత్రియుడు హరించవచ్చు. ధర్మరాజా ! సమస్తప్రజలు, రాజ్యభోగాలు, సమస్త ధనమూ క్షత్రియులవే. ఇతరులవి కావు. కాని ఆ ధనం సైన్యానికీ, యజ్ఞానుష్ఠానానికి మాత్రమే వినియోగించాలి. యుధిష్ఠిరా ! తినటానికి పనికిరాని ఓషధులను నరికి, వానితో తినటానికి పనికివచ్చే ఔషధాలను మానవుడు తయారు చేస్తున్నాడు కదా ! దేవతలను, పితృదేవతలను, మానవులను హవిస్సులతో పూజించనివాని ధనం పనికిమాలినదని ధర్మజ్ఞులు చెపుతారు. ధార్మికుడైన రాజు ఆ ధనాన్ని తీసుకొని, దానితో ప్రజలకు సౌకర్యాలు కలిగించి, సంతోషపెట్టాలి. ఆ ధనంతో కోశాన్ని నింపుకోరాదు. తనను వంతెనగా చేసుకొని, దుష్టులనుండి ధనాన్ని సేకరించి, సజ్జనులకు అందజేసే రాజు సంపూర్ణ ధర్మవేత్తగా గౌరవింపబడతాడు. ధర్మజ్ఞుడు అయిన రాజు తన శక్తిని అనుసరించి చెట్లపైకి నెమ్మదిగా ప్రాకి బ్రతికే చీమలు మొదలైన ప్రాణులవలె లోకాలను జయించాలి. ఎట్లా పుడతాయో తెలియకుండా పుట్టే పురుగులు కొన్ని ఉన్నట్లే యజ్ఞవిరోధులు, కర్తవ్యహీనులు కూడా లోకంలో పుడుతూ ఉంటారు. దోమలను, ఈగలను, గండుచీమలను

ఎలా నివారిస్తామో అదే విధానాన్ని వారి విషయంలో ధర్మప్రకారం అనుసరించాలి. ఏ విధంగా అకస్మాత్తుగా నేలపైన దుమ్ము ఏర్పడుతుందో అలాగే ఈ లోకంలో ధర్మస్వరూపం సూక్ష్మంగా, సూక్ష్మతరంగా ఏర్పడుతుంది.'

137. శాకులోపాఖ్యానము - మూడు చేపల కథ.

భీష్ముడు చెపుతున్నాడు. 'యుధిష్ఠిరా ! సంకటాలు రాకమునుపే వాటి నివారణకు ఉపాయం ఆలోచించేవాడు అనాగత విధాత. సరియైన సమయంలో ఆత్మరక్షణకు ఉపాయం వెతికేవాడు ప్రత్యుత్పన్నమతి. వీళ్లు ఇద్దరూ సుఖంగా ఉన్నతిని పొందుతారు. కాని ప్రతిపనికీ అక్కరలేని ఆలస్యం చేసేవాడిని దీర్ఘసూత్రుడు అంటారు. వాడు నశించిపోతాడు. చేయదగినవి, చేయదగనివి నిర్ణయించటంలో మిక్కిలి ఆలస్యానికి ఉదాహరణగా ఒక చక్కని కథ చెపుతాను. శ్రద్ధగా విను. **కుంతీనందనా ! ఎక్కువ లోతులేకుండా చాలా చేపలు ఉన్న ఒక చెరువులో కార్యకుశలతగల మూడు చేపలు స్నేహంతో కలిసి జీవిస్తున్నాయి. ఆ మూడు చేపలలో ఒకటి మిక్కిలి ముందుచూపుగలది. రెండవది సమయానికి తగినపనిచేసే తెలివితేటలు గలది. మూడవది ప్రతిపనికీ అక్కరలేని ఆలస్యం చేస్తూ తగిన నిర్ణయం తీసుకోలేనిది.** ఒకసారి కొందరు బెస్తవాళ్లు ఆ చెరువు గుంటలలో ఉన్ననీటిని వివిధ పద్ధతులలో తోడి పారబోస్తున్నారు. నీరు తగ్గిపోతున్న చెరువును చూసిన దీర్ఘదర్శి భయంతో తన ఇద్దరు స్నేహితులతో ఇలా అన్నది. 'మిత్రులారా ! ఈ చెరువులో నివసించే ప్రాణు లన్నిటికి ఆపద వచ్చింది. తప్పించుకొనే దారి చెడకముందే ఇక్కడి నుంచి మరొకచోటికి పోదాం. రాబోయే కీడును అది రాకముందే చక్కని ఉపాయంతో తొలగించుకొనే వానికి ప్రాణభయం ఉండదు. మరొక మడుగుకు పోదాం. రండి.' వారిలో దీర్ఘసూత్రం ఇలా అన్నది. 'మిత్రమా ! నీవు చెప్పింది బాగుంది. కాని మనం తొందరపడవలసిన అవసరం లేదని నా దృఢనిశ్చయం.' ఆ తరువాత దీర్ఘదర్శితో ప్రాప్తకాలజ్ఞం ఇలా అన్నది. చెలికాడా ! 'సమయం వచ్చినప్పుడు నా బుద్ధికి తగినన్యాయం, యుక్తి తోస్తుంది. అది ఎప్పుడూ నవ్వులపాలు కాదు.' చక్కని తెలివిగల దీర్ఘదర్శి ఇది విని, ఆ సన్నని నీటిదారిలో మరొక పెద్ద మడుగులోకి చేరుకుంది. తరువాత నీరు బాగా తగ్గిపోయిన ఆ చెరువును జాలరులు చూసి, అనేక విధాలుగా దానిలో ఉన్న చేపలను పట్టుకొన్నారు. నీరు ఎగజిమ్మబడిన ఆ చెరువులోని మిగిలిన చేపలతోపాటు దీర్ఘసూత్రం కూడా వలలో చిక్కుకుంది. చేపలు చిక్కిన వలలను

పైకిలాగేటప్పుడు ప్రాప్తకాలజ్ఞమనే చేప తాను కూడా వలను నోటితో పట్టుకొని దొరికినట్లు కనిపించింది. జాలరులు 'చేపలు అన్నీ వలలో ఉన్నాయి' అనుకొన్నారు. ప్రాప్తకాలజ్ఞం త్రాటిని నోట కరచుకొని మిగిలిన చేపలతోపాటు పైకి వచ్చింది. తరువాత ప్రక్కన ఉన్న పెద్ద చెరువులో ఆ చేపలు ఉన్న వలను ముంచి కడుగుతున్నప్పుడు ప్రాప్తకాలజ్ఞం త్రాడును వదలి నీటిలోకి జారిపోయింది. **చొరవ, తెలివిలేని దీర్ఘసూత్రం మాత్రం కదలలేకుండా అన్ని ఇంద్రియాలు పట్టుతప్పి చచ్చిపోయింది. ఈ విధంగా నెత్తిమీదకు వచ్చినదానిని ఆ కాలానికి అయినా తెలుసుకోలేని మూర్ఖుడు దీర్ఘసూత్రం అనే చేపలాగా అప్పటికప్పుడే నశిస్తాడు.** 'నేను తెలివిగలవాణ్ణి, అవసరం అయినప్పుడు ఆలోచించవచ్చులే' అని నిర్లక్ష్యం చేసేవాడు ప్రాప్తకాలజ్ఞుడు అనే చేపలాగా ప్రాణసంశయంలో చిక్కుకొంటాడు. **రాబోయేదానిని ఊహించి ముందే జాగ్రత్తపడేవాడు, సమయానికి తగిన బుద్ధిని ఉపయోగించేవాడు - ఈ ఇద్దరు సుఖంగా వృద్ధిలోకి వస్తారు. తెగని ఆలోచనతో మెదలకుండా ఉన్నవాడు నశిస్తాడు.** కాష్ఠలు, కళలు, ముహూర్తాలు, పగలు, రాత్రి, లవాలు, నెలలు, పక్షాలు, ఆరు బుతువులు, కల్పం, సంవత్సరాలు, భూమి, దేశం అనబడే ఆ కాలం కంటికి కనబడదు. తాను కోరినదాన్ని పొందటానికి వీలుగా దానిని తలుచుకొంటాడు. 'ధర్మ, అర్థ, కామ, మోక్ష శాస్త్రాలు అన్నిటిలోనూ అనాగత విధాత, ప్రత్యుత్పన్నమతి అయినవారు ఇద్దరే అభిమతాలను సాధించగలుగుతారు' అని మహర్షులు చెప్పారు. **చక్కగా పరిశీలించి, ఏకాగ్రతతో ముందు చూపుతో, దేశకాలాలను అనుసరించి, నడిచేవాడు ఆ రెండిటినుండి మంచి ఫలితాలను పొందుతాడు.'**

138. మార్జాల మూషిక సంవాదము.

ధర్మరాజు ఇలా అన్నాడు. 'భరతశ్రేష్ఠా ! పితామహా ! 'ముందుగా మేల్కొన్న, తెలివి, అప్పటికప్పుడు పుట్టిన తెలివి శ్రేష్ఠమైనది. సాగతీస్తూ తేలని ఆలోచన నాశనం చేస్తుంది' అని నీవు చెప్పావు. శత్రువులు చుట్టుముట్టినపుడు ధర్మంలో, అర్థంలో నైపుణ్యం కలవాడు, ధర్మశాస్త్రం బాగా తెలిసినవాడు అయిన రాజు ఏ విధంగా ఆలోచిస్తే తెలివి కోల్పోకుండా బయటపడతాడో వివరించమని నిన్ను ప్రార్థిస్తున్నాను. చాలామంది శత్రువులకు చిక్కిన రాజు ఎట్లా ప్రవర్తించాలి ? దానిని ఉన్నది ఉన్నట్లు మొత్తం నాకు వినాలని ఉంది. ఒక రాజు ఆపదలో ఉన్నపుడు పూర్వం అతనిచే బాధింపబడిన శత్రువులు అందరు కలిసి, అతనిని పెకలించటానికి ప్రయత్నిస్తారు. బలవంతులైనవారు అంతా కలిసి బలహీనుడైన,

ఒంటరి వానిని కూల్చటానికి ప్రయత్నిస్తున్నపుడు ఆ రాజు ఎలా నిలబడగలడు ? అటువంటివాడు మిత్రుని, శత్రువును ఎలా పొందుతాడు ? అతడు శత్రు-మిత్రుల మధ్య ఎలా ప్రవర్తించాలి ? అన్నీ బాగుగా తెలిసిన ఆప్తమిత్రుడు బద్ధశత్రువు అయితే అప్పుడు మానవుడు ఏం చేస్తే సుఖాన్ని పొందుతాడు ? ఎవనితో విరోధం పెట్టుకోవాలి ? ఎవనితో సంధి కుదుర్చుకోవాలి ? తాను బలవంతుడు అయినా శత్రువులనడుమ ఉన్నప్పుడు ఎలా ఉండాలి ? కర్తవ్యాలు అన్నిటిలో ఇదే పరమకర్తవ్యం. దీనిని చక్కగా వివరించి చెప్పగలవాడు భీష్ముడు తప్ప మరొకడులేడు. ఆయన చెప్పిన దానిని వినగలిగినవాడు కూడా అరుదు. కనుక బాగా పరిశీలించి అది అంతా నాకు చెప్పు.' భీష్ముడు ఇలా చెపుతున్నాడు. 'యుధిష్ఠిరా ! నీవు అడిగిన ప్రశ్న సుఖదాయకం. అతినిగూఢమై ఆపదలలో ఉపయోగపడే విషయాన్ని వివరంగా చెపుతాను విను. **ఆయా పనులలోని లాభనష్టాలు, ఎచ్చుతగ్గుల కారణంగా శత్రువు మిత్రుడు అవుతాడు. మిత్రుడు చెడ్డవాడు అవుతాడు. వీటి గతి అశాశ్వతమైనది.** అందువలన ఇది చేయదగినదా ? కాదా ? అనేది నిశ్చయించేటప్పుడు దేశాన్ని, కాలాన్ని గమనించి దానినిబట్టి, ఎదుటివారిపై నమ్మకం ఉంచాలి. లేదా వైరం పెట్టుకోవాలి. ఎదుటివారు మనమేలు కోరేవారు, మేధావులు అయితే వారు శత్రువులు అయినా ఎప్పుడూ వారితో కలయికనే కోరుకోవాలి. ప్రాణాలను రక్షించుకోవటం ముఖ్యం కదా! తెలివి తక్కువవాడై శత్రువులతో సంధి చేసుకోనివాడు ఏ ప్రయోజనాన్నీ, అల్పమైన ఫలాన్నికూడా పొందలేడు. ఎవడు ప్రయోజనలాభాన్ని గమనించి శత్రువుతో సంధిని, మిత్రునితో విరోధాన్ని ఏర్పరుచుకొంటాడో వాడు మంచి ఫలితాలను పొందుతాడు. ఈ సందర్భంలో మట్టిచెట్టుపై ఉన్న పిల్లికి, ఎలుకకు పూర్వం జరిగిన సంవాదాన్ని ఉదాహరిస్తారు.

ఒక కారడవిలో పలురకాల తీగెలు, పక్షులతో నిండిన పెద్ద మట్టిచెట్టు ఉండేది. చాలా కొమ్మలతో పెద్ద మబ్బులాగా ఉండి, చల్లని నీడతో అది మనసుకు హాయిగొలుపుతోంది. ఎన్నోపాములు, జంతువులకు ఆలవాలమై అది అడవి అంతా విస్తరించింది. ఆ మట్టిచెట్టు మొదట్లో నూరు కన్నాల కలుగు త్రవ్వుకొని, దానిలో పలితం అనే పేరుగల చాలా తెలివైన ఎలుక నివసిస్తూ ఉండేది. ఆ మట్టికొమ్మలపై పక్షులను తింటూ 'లోమశం' అనే పిల్లి సుఖంగా నివసించేది. ఆ అడవిలో గుడిసె కట్టుకొన్న వేటగాడొకడు నిత్యమూ సాయంత్రం చీకటి పడేవేళకు మట్టిచెట్టు క్రింద బోను ఏర్పాటుచేసి, సన్నని నరాలతో అల్లిన వలలను పరిచి, ఇంటికిపోయి, సుఖంగా నిద్రించి తెల్లవారుతూ ఉండగా వచ్చేవాడు. ఆ వలలో నిత్యమూ చాలా జంతువులు పడుతూ ఉండేవి. ఎంతో అప్రమత్తంగా ఉండే

పిల్లి ఒకనాడు వలలో చిక్కుకొంది. మహాబలశాలి, తనప్రాణానికి ప్రమాదమైన శత్రువు అయిన ఆ పిల్లి వలలో చిక్కటం చూసిన పలితం భయంలేకుండా దానిముందు తిరిగింది. ఆ అడవిలో ధైర్యంగా తిరుగుతున్న ఆ యెలుక ఆహారం కోసం వెతుకుతూ చాలా సేపటికి పిల్లి చిక్కినవలపై ఉన్న మాంసాన్ని చూసింది. పైకి ఎక్కి దానిని తినేసింది. శత్రువు వలలో పడినందుకు మనసులో సంతోషిస్తూ మాంసం తింటూనే ఒకసారి చుట్టూరా చూసేసరికి... మరోఘోర శత్రువు ముంగిస రావడం చూసింది. అది రెల్లు పువ్వులా ఉంది. భూమిలో కన్నంలో పడుకొని ఉంది. అది హరిణం అనే ముంగిస. ఎర్రని కనులు కలది. అది ఎలుక వాసన గ్రహించి తొందరగా వచ్చింది. ఆ ముంగిస నేల మీది నుంచి తల పైకెత్తి, ఎలుక కోసం నాలుక చాచి, నాకుతోంది. ఇంతలో ఎలుకకు కొమ్మమీది తొర్రలో మరోశత్రువు కనపడింది. చంద్రకం అనే పేరుగల గుడ్లగూబ అది. అది రాత్రి పూట తిరుగుతూ ఉంటుంది. దాని ముక్కు చాలా వాడిగా ఉంటుంది. ఎలుక అలా ముంగిస, గుడ్లగూబల బారిన పడింది. ఎలుకకు చాలా భయంవేసి ఇలా ఆలోచించింది.

"ఎదుట మృత్యువు సిద్ధంగా ఉంది. ఎంతో ఆపద చుట్టూ కనిపిస్తోంది. భయం కలుగుతోంది. ఇపుడు నా మేలుకోసం ఏమి చెయ్యాలి" ? అన్ని వైపులా శత్రువులే. ఎటు చూసినా భయమే గోచరిస్తోంది. అలా భయంతో పరితపిస్తూ గొప్ప ఆలోచన చేసింది. వినాశంతో కూడిన ఆపదలలో చిక్కుకొన్న వారు చేయవలసిన పని జీవితం దక్కించుకోవడం. అన్ని వైపులా సంశయమే. ఆపద రానే వచ్చింది.నేల మీదికి వెడితే ముంగిస నన్ను తినేస్తుంది. ఇక్కడే ఉంటే గుడ్లగూబ తింటుంది. వల తెంచుకొంటే పిల్లి మింగేస్తుంది. నావంటి తెలివైనవాడు ఇలా మోహపడరాదు. మరణం స్వీకరించేవరకూ జీవితంకోసం యుక్తితో ప్రయత్నం చేస్తాను. **నీతి శాస్త్రం తెలిపిన బుద్ధిమంతుడూ, తెలివిగలవాడూ ఎంత దారుణమయిన ఆపద కలిగినా మునిగిపోడు/ క్రుంగిపోడు.** నాకిపు డీ పిల్లిని మించి మరో గతి కనపడదు. కాని ఇది కూడ కష్టంలో ఉంది, శత్రువు. నేను దీనికి చేయవలసిన పని కూడా చాలా గొప్పది. ఇపుడు నన్ను ముగ్గురు శత్రువులు తినాలని చూస్తున్నారు. ఎలా జీవించాలి ? అందుచేత శత్రువయినా పిల్లిని ఆశ్రయిస్తాను. నీతిశాస్త్రాన్ని ఆశ్రయించి, ముందు పిల్లికి హితం ఉపదేశిస్తాను. దానితో నా బుద్ధి బలంతో శత్రుసముదాయాన్ని మోసగిస్తాను. నాకు ఇది చాలా తీవ్రశత్రువు. కాని విషమపరిస్థితిలో ఉంది. ఇందులోని స్వార్థాన్ని గ్రహించటానికి ఇది తెలివి తక్కువది. అందుచేత దీని సాంగత్యంతో నా ప్రయత్నం సఫలం అవుతుందేమో ! ఆపదలో ఉంది కనుక ఇది నాతో సంధిచేసుకోవచ్చును. ఆపదలో ఉన్న బలవంతుడు కూడ జీవితం

కోసం దగ్గరి శత్రువుతో కలియటమే తగినపని అని గురువులు చెపుతారు. అపండితు డయిన మిత్రుని కంటె పండితు డయిన శత్రువే శ్రేష్ఠుడు. నా బ్రతు కిపు డీ శత్రు వయిన పిల్లిమీద ఆధార పడి ఉంది. తన్ను తాను రక్షించు కోవడం ఎందుకో దీనికి చెపుతాను. నా స్నేహంతో ఇది తెలివిగలది కావచ్చును కూడ.

ఇలా ఎలుక శత్రువుపట్ల చేయవలసిన పనిని గూర్చి ఆలోచించింది. అపుడు ప్రయోజనం యొక్క స్థితినీ, తత్త్వాన్ని, సంధి విగ్రహాల సమయాన్ని తెలిసిన ఎలుక మంచి మెత్తని మాటలతో పిల్లితో ఇలా అంది. 'మార్జాలమా ! మంచి మనసుతో అడుగుతున్నాను. బాగున్నావా ? నీ హితమే నేను కోరుతూ ఉంటాను. మన ఇద్దరికీ శ్రేయస్సు సమానమే కదా ! సౌమ్యుడా ! భయపడకు. సుఖంగా ఉంటావు. నన్ను నీవు చంపాలని అనుకోకపోతే.... నిన్ను నేను ఉద్ధరిస్తాను. కొంచెం కష్టమయినా నాకు ఒక ఉపాయం తోచుతోంది. నీవూ విముక్తి పొందుతావు. నేనూ మేలు పొందుతాను. నా తెలివితో నేను ఒక ఉపాయం ఆలోచించాను. అది నాకూ, నీకూ కూడా శ్రేయస్కరం. ఆ మేలు ఇపుడు ఇద్దరికీ సాధారణమే, సమానమే. ఇదిగో ! ఈ ముంగిస, గుడ్లగూబ పాపబుద్ధితో పొంచి ఉన్నాయి. నిన్ను చూసి నన్ను బెదిరించటం లేదు. అందుచేత ఇప్పటికి నాకు మేలుగానే ఉంది. పాపి అయిన గుడ్లగూబ గ్రుడ్లు తిప్పుతూ కూస్తోంది. చెట్టు కొమ్మ మీది నుంచి నన్ను చూస్తోంది. దానితో నాకు వణుకు పుడుతోంది. **సజ్జనులతో స్నేహం వీడుమాటలతో వీర్పడుతుంది. పండితుడవైన నీవు నాకు స్నేహితుడవయ్యావు. నీతో కలిసి నివసిస్తాను. ఇక నాకు ఇపుడు భయమే లేదు.** మార్జాలా ! నేను లేకుండా నీవు పాశం త్రెంచుకోలేవు. నన్ను నీవు తినకుండా ఉంటా నంటే నీ పాశాలు నేను కొరికేస్తాను. చెట్టు పైభాగం నీవు ఆశ్రయించుకొన్నావు. క్రింది భాగం నేను ఆశ్రయించుకొన్నాను. ఇద్దరమూ చాలా కాలంగా ఈ చెట్టు మీదే ఉంటున్నాం. ఇది నీకూ తెలుసును. ఎవరినీ నమ్మనివాడు, ఎవరికీ నమ్మకం కలిగించనివాడు - ఈ ఇద్దరూ నిత్యమూ భయపడుతూ ఉంటారు. ధీరులు వారిని మెచ్చుకోరు. అందుచేత మన ఇద్దరికీ నిత్యమూ ప్రీతి, స్నేహమూ పెరుగును గాక. ప్రయోజనం కాలతీతమై పోతే పండితులు మెచ్చుకోరు. ఇందులో ఉన్న ప్రయోజనం ఏమిటో చెపుతా విను. నేను నీ జీవితాన్ని కోరుతున్నాను. నీవు నా జీవితాన్ని కోరుతున్నావు. లోతయిన నదిని ఒకడు ఒక కట్టెతో దాటుతున్నాడు. అపుడతడు ఆ కట్టెను కూడ దాటిస్తున్నాడు. ఆ కట్టెతోనే తానూ దాటుతున్నాడు. మన కలయిక ఇటువంటిది. ముందుముందు ఇంకా విస్తరిస్తుంది కూడ. నేను నిన్ను తరింపజేస్తాను.' నీవు నన్ను తరింపజేస్తావు. సమయోచితమయిన

కార్యం తెలిసిన పలితం (ఎలుక) ఇద్దరికీ హితమై, యుక్తియుక్తమై, గ్రహింపదగిన మాట చెప్పింది. చక్కని యుక్తితో కూడి, స్వీకరింపదగిన మాట విని వివేకం కల పిల్లి అంది.

పిల్లి తెలివైనది. మంచిగా మాట్లాడగలదు. ఎలుక మాటలను ప్రశంసిస్తూనే, తన అవస్థను సమీక్షించింది. మంచితనంతోనే ఎలుకను గౌరవించింది. వాడి కొనల దంతాలు, మణివైడూర్యాల వంటి కనులూ కల పిల్లి (లోమశం) మెల్లగా తలపైకెత్తి ఎలుకను చూసి ఇలా అంది. 'సౌమ్యుడా ! సంతోషం. నేను జీవించాలని నీవు కోరుతున్నావు. నీకు శుభమగుగాక. శ్రేయస్సు ఏదో నీకు తెలిస్తే ఆచరించు. ఇక ఆలోచించకు. నేను పెద్ద ఆపదలో ఉన్నాను. అంతకంటె పెద్ద ఆపదలో నీవున్నావు. ఆపదలో ఉన్నవారికి సంధి కలుగుతుంది. చెయ్యి. ఆలస్యం చెయ్యకు. నీకు సిద్ధికర మయిన పనిని సమయం వచ్చినపుడు చేస్తాను. ఈ ఆపద నుండి నేను బయటపడితే నీవు చేసిన పని చెడిపోదు. **నా అభిమానం విడిచాను. నీ భక్తుడను, శిష్యుడను. నీ మేలు చేసేవాడను. నీ ఆజ్ఞ పాటించేవాడిని. నీకు శరణాగతుడను.**' పిల్లి తన వశమైనట్లు పలికే సరికి పలితం అర్థవంతమూ, ప్రయోజన మహితమూ, హితమూ అయిన మాట ఇలా చెప్పింది. 'ఉదారంగా నీవు చెప్పినమాట నీవంటి వారికి కొత్తేమీ కాదు. నీ హితం కోసం నేను అనుసరించే మార్గం గురించి చెపుతాను. నాకు ఈ ముంగిస వల్ల చాలా భయంగా ఉంది. నేను నీదగ్గరకు చేరుతాను. నన్ను రక్షించు. చంపకు. అపుడు నిన్ను నేను రక్షించగలుగుతాను. నీచమయిన గుడ్లగూబ నన్ను తినా లనుకొంటోంది. దాని నుండి నన్ను రక్షించు. నేను నీ పాశాలను కొరికివేస్తాను. ఒట్టువేసి చెపుతున్నాను.' సముచితమైన ఆ మాట లోమశం విని, సంతోషంతో పలితాన్ని చూసి, స్వాగతం చెప్పి, గౌరవించింది. స్నేహంతో నిలిచిన పిల్లి, చక్కగా ఆలోచించి, ప్రీతి, ధీరత, కల్గి పలితాన్ని ప్రశంసించి, ఇలా అంది. 'త్వరగా రా. నీకు శుభం కలుగుతుంది. నాకు ప్రాణ సఖుడవు నీవు. నీ అనుగ్రహంతో నేను జీవితం పొందుతాను. ఇది ఇలా జరిగితే నీవేది చెపితే అది చేస్తాను. ఆజ్ఞాపించు. మిత్రమా ! మనకు సంధియే కలుగుగాక ! ఈ ఆపద నుండి బయటపడి నేను నా మిత్ర బంధువులతో కలిసి నీకు ప్రియహిత కార్యాలన్నీ చేస్తాను. సౌమ్యుడా ! నేనీ ఆపదనుండి తొలగి నీకు ప్రీతి కలిగిస్తాను. సత్కారం చేస్తాను. **ఎన్నో ప్రత్యుపకారాలు చేసినవాడు ముందుగా ఉపకారం చేసిన వానితో సమానుడు కాడు, ఒకడు చేసిన దానికి ప్రత్యుపకారం చేస్తాడు. ఇంకొకడు నిష్కారణంగానే ఉపకారం చేస్తాడు.**'

'ఇలా ఎలుక పిల్లికి ప్రయోజనం ఎరపెట్టి, నమ్మించి, తనకు పిల్లి కీడుచేసే జాతి అయినా సరే దాని ఒడిలోకి చేరింది. పిల్లి ఊరడించింది. తెలివైన ఎలుక తల్లిదండ్రుల దగ్గరున్నట్లు పిల్లి రొమ్ము మీద నమ్మకంతో నిద్రించింది. పిల్లి రొమ్ముపై అంటుకుపోయి పడుకొన్న ఎలుకను చూసి ముంగిస, గుడ్లగూబ ఆశ వదులుకొన్నాయి. అలాగే ఆ రెండిటికీ భయమూ, అలసట ఏర్పడ్డాయి. పిల్లి ఎలుకల ప్రీతిని చూసి, ముంగిసకు, గుడ్లగూబకు చాలా సంతోషాశ్చర్యాలు కలిగాయి. బలం, బుద్ధి కలిగి, సత్ప్రవర్తన కలిగి, దగ్గరగా ఉన్నా ముంగిస గుడ్లగూబ రెండూ సంధినీతితో ప్రవర్తించిన పిల్లి ఎలుకలను తమ బలంతో వశపరచుకో లేక పోయాయి. కార్యం కోసం సంధి చేసుకొన్న పిల్లి ఎలుకలను చూసి, ముంగిస, గూబ రెండూ వాటి నివాసాలు చేరాయి. పిల్లికి అంటుకొని పోయిన పలితం దేశకాలాలు ఎరిగినది. కాలంకోసం నిరీక్షిస్తూ మెలమెల్లగా కొద్దికొద్దిగా వలత్రాళ్లను కొరుకుతోంది. బంధంలో క్లేశపడుతున్న పిల్లి తొందరపడుతూ, మెల్లగా త్రాళ్లు కొరుకుతున్న పలితాన్ని తొందర పెట్టడం ఆరంభించింది. 'సౌమ్యుడా ! తొందరపడవేమి ? నీ పని తీరిందని నన్ను అవమానిస్తున్నావా ? ఆ చండాలుడు రాకముందే త్వరగా త్రాళ్లు కొరుకు.' అలా తొందరపెడుతోంది పిల్లి. తెలివైన ఎలుక తెలివి తక్కువ పిల్లితో తనకు ప్రియమూ, హితమూ అయిన మాట ఇలా పలికింది.

పిల్లీ ! ఊరుకో. తొందర, కంగారు పడకు. మనమే ఇపుడు కాలం తెలిసిన వాళ్లం. కాలాన్ని పరిహసించకు. కాలం మించిపోలేదు. **అకాలంలో ఆరంభించిన పని కర్తకు ప్రయోజనం చేకూర్చదు. తగిన కాలంలో ఆరంభించిన పనే గొప్ప ప్రయోజనం సమకూర్చుతుంది.** అకాలంలో విడుదల అయితే నీ వల్లనే నాకు భయం కలుగవచ్చు. అందుచేత కాలం కోసం నిరీక్షించు. ఎందుకు తొందర పెడతావు మిత్రమా ? మన ఇద్దరికీ సమానంగా భయం కలిగినపుడు, ఆయుధం చేతిలో ధరించి వచ్చే చండాలుని చూశాక నీ పాశాలను నేను కొరికివేస్తాను. అపుడు విడుదల పొంది నీవు చెట్టు ఎక్కగలవు. నీకు ప్రాణం దక్కించుకోవడం తప్ప మరో కార్యం లేదు కదా! లోమశా ! భయంతో నీవు తప్పించు కొన్న తరువాత నేను కన్నంలో దూరుతాను. నీవు చెట్టు ఎక్కుతావు.' తన మేలుకోసం పలితం ఇలా అనగానే బ్రతుకు మీద ఆశ గల్గి, మహామతియై వాక్యతత్త్వ మెరిగిన పిల్లి ఇలా అంది. తనపని మీద తొందర పడే లోమశం నమ్మకం కలిగిస్తూ, ఆలస్యం చేస్తున్న ఎలుకతో ఇలా అంది. 'మిత్రుల పనులను సంతోషంతో చేసే సజ్జనులు ఇలా చెయ్యరు. తొందరపడి నేను నిన్ను వెంటనే కష్టం నుండి విడిపించాను కదా ! అలాగే నాకు హితమయిన కార్యం నీవూ త్వరగా చెయ్యాలి. మహాబుద్ధీ ! మన

ఇద్దరికీ రక్షణ కలిగేటట్లు ప్రయత్నించు. అలా కాకుండా పూర్వ వైరాన్ని తలచుకొంటూ కాలం గడపాలని కోరుతున్నావా ? అలా చెడ్డపని చేద్దామనుకొంటే... చూడు ఇప్పటికే నీకు ఆయువు మూడి ఉండేది. ఒకవేళ నేను తెలియక ఏ కొద్దిపాటి చెడ్డపని అయినా చేసి ఉంటే దాన్ని మనస్సులో పెట్టుకోకు. నిన్నూ నేను అలాగే క్షమిస్తాను. నాపట్ల అనుగ్రహించు. చక్కని తెలివి, శాస్త్రబుద్ధి కల ఎలుక అలా అంటున్న పిల్లితో హితంగా ఇలా అంది.

మార్జాలమా ! నీ ప్రయోజనాన్నే కోరుకొనే నీ మాట విన్నాను. నా ప్రయోజనం నేను గ్రహించి ఉన్నానని నీకూ తెలుసును. భయపడి నట్లున్న మిత్రుని పనీ, నిజంగా భయంతో నిండిన మిత్రుని పనీ పామునోటిలో నుంచి చేతిని తీసుకొన్నట్లు రక్షించుకోవాలి. బలవంతునితో సంధి చేసుకొన్నాక తన్ను తాను రక్షించుకోలేనివాడు అపథ్యపదార్థం తిన్నవాని వలె ప్రయోజనం పొందడు. లోకంలో ఎవడూ ఎవడికీ మిత్రుడూ కాడు, శత్రువూ కాడు. మిత్రులు కాని శత్రువులు కాని ప్రయోజనాన్ని బట్టి ఏర్పడుతారు. ఏనుగులతోనే అడవి ఏనుగులను పట్టుకొంటారు. అలాగే ప్రయోజనాలతోనే ప్రయోజనాలు కట్టుబడతాయి. పని పూర్తి అయ్యాక ఎవడూ కర్తను గురించి పట్టించుకోడు. అందుచేత పనులన్నీ పూర్తిగా చేయకుండా కొద్దిగా మిగిలి ఉండేటట్లు చెయ్యాలి. ఆ చివరి సమయంలో నీవు చండాలుడు వస్తున్నాడనే భయంతో పారిపోవటానికే ప్రయత్నిస్తావు కాని నన్ను పట్టుకొనేందుకు శక్తుడవు కావు. చాలా త్రాళ్లను కొరికే వేశాను. ఒక్కపోగు మిగిలి ఉంది. దాన్ని కూడా త్వరగానే కొరుకుతాను. లోమశా ! సుఖంగా ఉండు.' ఆపదలో చిక్కుకొన్న ఆ రెండూ ఇలా మాట్లాడుకొంటూ ఉండగానే రాత్రి గడిచి పోయింది. పిల్లికి భయం పట్టుకొంది. తెల్లవారు తుండగానే పరిఘుడనే చండాలుడు ఆయుధం చేత పట్టుకొని వస్తూ కనపడ్డాడు. వాడు నలుపు పసుపుకలసిన రంగులో ఉన్నాడు. పెద్ద పెద్ద పిరుదులతో వికృతంగా, భయంకరంగా ఉన్నాడు. చుట్టూరా కుక్కల గుంపు ఉంది. మేకుల వంటి చెవులూ, పెద్ద నోరూ కలిగి మలినంగా, భయంకరంగా ఉన్నాడు. యమ దూతలా ఉన్న వాడిని చూసి పిల్లి భయంతో "ఇపుడేం చేస్తావు" అంది. ఈ భయంకర దృశ్యం, గందరగోళం చూసి ముంగిస, గుడ్లగూబ కూడ చాలా భయపడి నిరాశ చేసుకొన్నాయి. ముంగిస, గుడ్లగూబ రెండూ బలం కలవి. తెలివి కలవి. కలిసి ఉన్నాయి. అయినా (పిల్లి ఎలుకల) నీతి బలం వల్ల పిల్లి ఎలుకలను తమ శరీరబలంతో దెబ్బ తీయలేక పోయాయి. ప్రయోజన దృష్టితో సంధి చేసుకొన్న పిల్లి ఎలుకలను చూసి ముంగిస, గుడ్లగూబ తమ తమ నివాసాలకు వెళ్లిపోయాయి. అప్పుడు పిల్లి యొక్క

వలత్రాడును మూషికం కొరికింది. పిల్లి బయటపడి ఒక్క దూకులో చెట్టు ఎక్కింది. అలా పిల్లి భయ మనే సుడిగుండంనుండి శత్రువు ద్వారా బయటపడింది. ఎలుక కన్నంలో దూరింది. పిల్లి కొమ్మను చేరింది.

చండాలుడు వల తీసుకొని చుట్టూరా పరికించి, ఆశవిడిచి అక్కడి నుండి తనయింటికి పోయాడు. అపుడు చెట్టు మీది పిల్లి భయం పోయి, జీవితం మళ్లీ పొంది, కన్నంలో ఉన్న ఎలుకతో ఇలా అంది. 'ఒక్కమాట కూడా చెప్పకుండా ఒక్కదూకు దూకేశావు. కృతజ్ఞురాలిని, నీకు మేలు చేసిన దానిని నన్ను అనుమానించటం లేదు గదా ! నా నమ్మకం పొంది, నాకు జీవితం ఇచ్చి మిత్రసౌఖ్యం అనుభవించే సమయంలో నాదగ్గరకు రావటం లేదేమి ? ముందు స్నేహం చేసి, తరువాత ఆస్నేహాన్ని కొనసాగించక పోతే ఆ దుర్మతి ఆపదలలో మిత్రులను పొందలేడు. మిత్రమా ! నీచేత నేను ఉపకారం పొందాను. స్నేహం పొందిన నన్ను కలిసి సుఖపడటానికి నీవు అర్హుడవు. ప్రియమైన గురువును శిష్యులు పూజించినట్లు నా మిత్రులు, బంధువులు అందరూ నిన్ను పూజిస్తారు. మిత్ర బంధువులతో కూడిన నిన్ను నేను కూడా పూజిస్తాను. బ్రతుకు నిచ్చిన వానిని కృతజ్ఞుడు పూజించకుండా ఉంటాడా ? నా శరీరానికి, గృహానికి, సంపదలకూ అన్నిటికీ నీవే స్వామివి. నాకు అనుశాసనం చేసే గురువువు కమ్ము. ప్రాజ్ఞుడా ! నాకు మంత్రివి అగుము. తండ్రివలె నన్ను శాసించు. నావల్ల నీకు భయం లేదు. నా జీవితం మీద ఒట్టువేసి చెపుతున్నాను. నీవు బుద్ధిచేత సాక్షాత్తు శుక్రాచార్యుడవు. మేము బలవంతులం. నీవు నాకు జీవితం ప్రసాదించి మంత్ర బల సహితుడ వయ్యావు.' ఇలా పిల్లి ప్రశాంతంగా పలికింది. ఇతరుల ఊహలు తెలిసిన ఎలుక తనకు హితకరంగా ఇలా అంది.

'లోమశా ! నీవు చెప్పినదంతా విన్నాను. నాకు తోచిన దేదో నేనూ చెపుతాను. విను. మిత్రులను తెలుసుకోవాలి. శత్రువులనూ కనిపెట్టాలి. ఈ లోకంలో ప్రజ్ఞాసహితులకు సమ్మతమయి బాగా సూక్ష్మమైన అంశం ఇది. శత్రురూపంలో మిత్రు లుంటారు. మిత్ర రూపంలో శత్రువు లుంటారు. కామ క్రోధాలకు వశమయిన వారు కలిసి ఉన్నా తెలియరు. శత్రు వని ఎవడూ ఉండడు. అలాగే మిత్రుడూ ఉండడు. ప్రయోజనాన్ని బట్టి మిత్రులూ, శత్రువులూ ఏర్పడతారు. బ్రతికి ఉండగా తన ప్రయోజనాన్ని చూసేవాడు, చనిపోయాక బాధ పడేవాడూ తనకు మిత్రుడు. అది కూడా ఈ భావం వ్యతిరేకం కాకుండా ఉండేంతవరకే. స్థిరమైన మైత్రి కాని, స్థిరమైన శత్రుత్వం కాని ఉండవు. ప్రయోజనాన్ని బట్టి మిత్రులూ, శత్రువులూ ఏర్పడతారు. కొంతకాలం అయ్యేసరికి మిత్రుడు శత్రువు కావచ్చు. శత్రువు మిత్రుడు కావచ్చు. ఇందులో స్వార్థమే (తన ప్రయోజనమే) బలవత్తరం. ప్రయోజనం

తెలుసుకోకుండా ప్రీతి మీదనే మనసుంచి, మిత్రులను నమ్మేవానికీ, శత్రువులను నమ్మనివానికీ మిత్రుల మీద కాని, శత్రువు మీద కాని మనసు మారవచ్చును. **నమ్మరాని వారిని నమ్మకూడదు. నమ్మదగిన వారిని మితి మీరి నమ్మకూడదు. నమ్మకంవలన భయం పుట్టి మూలచ్ఛేదం చేస్తుంది.** తండ్రి, తల్లి, కొడుకు, మేనమామలు, మేనల్లుళ్లు, ఇంకా ఇతరమైన చుట్టాలు - అందరూ ప్రయోజనాన్ని బట్టే సన్నిహితు లవుతారు. ఇష్టుడైనా పతితు డయిన కొడుకును తలిదండ్రులు కూడ వదలిపెడుతున్నారు. లోకం తనను రక్షిస్తోంది. చూడు స్వార్థం యొక్క శ్రేష్ఠత ఎంతటిదో. లోమశా ! ఆపద గడిచిన తరువాత (మన ఇద్దరికీ) నిష్కృతి సమానమే. ఇక్కడే నీవు నిస్సంశయమైన సుఖోపాయంతో శత్రువును వెదకుతూ ఉంటావు కదా ! ఇక్కడే నీవు చెట్టు దిగివచ్చి, ఇంతకు ముందు నిన్న పన్నిన వలను చపలత్వంతోనే కదా తెలియ లేకపోయావు. **చపలుడు తనకే ఉపయోగపడడు. ఇక ఇతరులకు ఎలా ఉపయోగపడతాడు ? అందుచేత చపలుడు నిస్సంశయంగా అన్ని పనులను చెడగొడతాడు.** నేను నీకు ప్రియ మయిన వాడనని తియ్యగా ఇపుడు మాట్లాడుతున్నావు. మిత్రమా ! దాని కారణమంతా వివరంగా చెపుతా విను. ఏదో ఒక కారణం చేతనే ఒకనికొకడు ప్రియుడు కాని, ద్వేషింపదగినవాడు కాని అవుతాడు.

ఈ జీవలోకమంతా ప్రయోజనాన్నే కోరుతుంది. అంతేకాని ఎవడూ, ఎవనికీ సహజంగా ఇష్టుడు కాడు. ఒకే తల్లికి పుట్టిన అన్నదమ్ములకు గాని, దంపతులకు కాని ఒకరి పట్ల మరొకరికి ఉండే సఖ్యం ఇటువంటిదే. కారణం లేని ప్రీతి నాకెక్కడా ఈ లోకంలో కనపడదు. ఒక వేళ సోదరులకు కోపం వచ్చినా, భార్యకు కోపం వచ్చినా స్వభావం వల్ల ఆ సోదరుడూ, భార్య మళ్లీ ప్రీతి నొందవచ్చునేమో కాని ఇతరు డట్లా ప్రీతిని పొందడు. ఒకడు దానంచేత ప్రియుడు కావచ్చును. ఇంకొకడు ప్రియంగా మాట్లాడితే ప్రియుడు కావచ్చు. మరొకడు మంత్ర హోమ జపాదులతో ప్రియుడు కావచ్చు. కాని మానవుడు ప్రయోజనం వల్లనే ప్రీతి పొందుతాడు. మన ఇద్దరికీ ఒక కారణం వల్ల ప్రీతి ఏర్పడింది. మరో కారణంలో మొదటి కారణ స్థానం నశిస్తుంది. దానితో పూర్వప్రీతి సహజంగానే మళ్లుతుంది. కాని నేను నీకు ప్రియం కావడానికి కారణం భోజన ప్రయోజనం కాకుండా మరొకటి కూడా ఉందని నాకనిపిస్తోంది. అందులోనూ మనం పండితులమే కదా ! కాలం హేతువును వికృతపరుస్తుంది. మార్చివేస్తుంది. స్వార్థం దాన్ని అనుసరిస్తుంది. ఆ స్వార్థాన్ని ప్రాజ్ఞుడు తెలుసుకొంటాడు. లోకం ప్రాజ్ఞుడినే అనుసరిస్తుంది. స్వార్థంలో పండితు డయిన వాని దగ్గర నీవు ఇలా మాట్లాడరాదు. నీవు

సమర్థుడవే. అయినా కాలం కలిసి రాక నాతో స్నేహం చేశావు. అసలు కారణం అది. అందుచేత నా ప్రయోజనం మీద నేను నిలుస్తాను. సంధి, విగ్రహం ఈ రెండింటిలోను స్థిరంగా ఉంటాను. కొంతమంది మేఘాలవలె క్షణక్షణమూ రూపాలు మార్చేస్తూ ఉంటారు. నేడే ఇందాక నాకు నీవు శత్రువువు. ఇపుడు మళ్లీ స్నేహితుడవు. మళ్లీ కొద్ది సేపటిలో శత్రువువు. చూడు యుక్తులు ఎంత చంచలాలో ! పూర్వం ఉన్న హేతువును బట్టి, అది ఉన్నంత కాలం మనకు మైత్రి ఏర్పడింది. ఆ కాలం, ఆ హేతువూ పోయేసరికి ఆ మైత్రీ పోయింది. నీవు నాకు జాతి, చేత శత్రువువు. ప్రయోజనం వల్ల మిత్రుడ వయ్యావు. ఆ పని తీరిన తరువాత సహజమైన శత్రుత్వమే ఉంటుంది. ఇలా పుట్టిన శాస్త్రాల తత్వం తెలిసి, నేను మళ్లీ నీకోసం వలలో ఎందుకు పడతాను ? చెప్పు. నేను నీ శక్తితో విడుదలయ్యాను. నీవూ నా శక్తితో అలాగే అయ్యావు. అన్యోన్య సహాయం అయిపోయింది. మళ్లీ మన కలయిక ఉండదు కదా !

సౌమ్యుడా ! నీ ప్రయోజనం నీవు పొందావు. నా ప్రయోజనం నేను పొందాను. ఇక నీకు నాతో పని ఏముంది ? మింగడం తప్ప ? నేను అన్నాన్ని. నీవు భోక్తవు. నేను బలహీనుడాలిని. నీవు బలవంతుడవు. ఇద్దరి బలాలూ సమానం కానపుడు మనకు సంధి ఎలా పొసగుతుంది ? నీకీ తెలివి తేటలు విడుదల అయ్యాక వచ్చాయను కొంటా. సుఖోపాయంతో నీవిప్పుడు భక్ష్యాన్ని వెదకుకొంటున్నావు. ఇది నిజం. నీవు తిండి కోసమే వలలో పడ్డావు. విడుదల పొంది ఆకలితో బాధపడుతున్నావు. దానికోసం శాస్త్ర బుద్ధిని ఆశ్రయించి, నన్ను తప్పక తినేద్దా మనుకొంటున్నావు. నీకు ఆకలిగా ఉందనీ, ఇది నీకు భోజన సమయమనీ తెలుసు. అందుచేత నీవు నన్ను మోసగించి ఆహారం కోసం వెదుకుతున్నావు. నీవూ పిల్లలతో, భార్యతో ఉన్నావు. నాతో సంధిని చేకూరుస్తున్నావు. నాశుశ్రూషకోసం ప్రయత్నిస్తున్నావు. కాని మిత్రమా ! నాతో సంధి తగదు. నీతో కలిసి ఉన్న నన్ను చూసి నీ భార్యాపుత్రులు, సంతోషంగా నన్ను తినకుండా ఎందుకు ఉంటారు ? నీతో నేను కలవను. కలిసే కారణం ఇపుడు లేదు. నేను చేసిన మంచి పనిని స్మరించే టట్లయితే స్వస్థుడవై నాకు శుభం కలగాలని కోరుకో. దుష్ట డయిన శత్రువు ఆకలితో క్లిష్టదశలో ఉండి ఆహారం కోసం వెదకుతుంటే వాని దగ్గరకు ఏ బుద్ధిమంతుడు వెడతాడు ? నీకు శుభమగు గాక. నేను వెళ్లిపోతాను. దూరంగా ఉన్నా నీకు నేను ఉద్వేగం కలిగిస్తాను. నమ్మినా, పొరబడినా ఇదే చేయదగినపని. బలవంతునికి దగ్గరగా ఉండటం మంచిది కాదు. లోమశా ! నేను నీతో కలవను. వెనుదిరుగు. నామంచి పనిని గుర్తిస్తే నాతో స్నేహాన్ని కొనసాగించు. పాపాత్ముడు బలవంతుడై శాంతంగా ఉన్నా వానికి ఎప్పుడూ

భయపడాలి. నీకు స్వార్థమే లేకపోతే నేను చేయవలసిన పనేమిటో చెప్పు. నా సొమ్ము అంతా ఇస్తాను కాని నన్ను మాత్రం ఎన్నడూ అర్పించను. తన కోసం సంతాన మయినా, రాజ్య మయినా, రత్నాలు సంపద అయినా వదలుకో వచ్చును. సర్వస్వమూ విడిచి అయినా తనను తాను రక్షించుకోవాలి. జీవించి ఉంటే శత్రువులు లాక్కున్న ఐశ్వర్యధనరత్నాలు అన్నీ మళ్లీ తెచ్చుకోవడం కనిపిస్తూనే ఉంది. విన్నాం కూడా. అంతేకాని ధనరత్నాలవలె తన్ను తాను సమర్పించుకోరాదు. భార్యా, సంపదలను ఇచ్చి అయినా తన్ను తాను సర్వదా రక్షించు కోవాలి. తనను తాను రక్షించుకొనే నేర్పు కలవారికి, ఆలోచించి పనులు చేసే వారికి తమ దోషం వల్ల కలిగే ఆపదలు కలగవు.* దుర్బలు లయినా బలవంతు డయిన శత్రువును గురించి బాగా తెలిసికొని, శాస్త్రార్థంతో నిశ్చయించుకొనే వారి బుద్ధి ఎన్నడూ చలించదు.' ఇలా ఎలుక స్పష్టంగా గద్దించి, బెదిరించి పలికే సరికి పిల్లి సిగ్గుపడి ఎలుకతో ఇలా అంది.

లోమశం అన్నది. 'నిజం ఒట్టువేసి చెపుతున్నా. నీవు నన్ను మిత్రద్రోహి అని నిందించావు. అది నీ తెలివి అనే అనుకొంటున్నాను. నీవు నా హితమునందు ఆసక్తి కలవాడవు. వేరు భావం కల నీతో నేను ప్రయోజన దృష్టితో మాట్లాడాను. ఈ విషయంలో నన్ను నీవు మరోవిధంగా గ్రహింపకూడదు. నీవు నాకు ప్రాణదానం చేశావు. దానితో నాకు మంచి మనసు కలిగింది. ధర్మజ్ఞురాలిని, గుణజ్ఞురాలిని అయ్యాను. విశేషించి కృతజ్ఞురాలిని. మిత్రుల మీద ప్రేమ కలదానిని. నీ మీద భక్తికల దానిని. సత్పురుషా ! నీవు కూడా నామీద అదే భావంతో ప్రవర్తించు. నన్ను నీవు నిందిస్తే నేను నాబంధువులతో కలిసి ప్రాణాలు విడుస్తాను. నావంటి మంచి మనసు కలవారి మీద పండితులకు నమ్మకం కనిపిస్తూనే ఉంటుంది. అందుచేత ధర్మతత్త్వజ్ఞుడా ! నన్ను నీవు శంకింపదగదు.' ఇలా పిల్లి ప్రశంసిస్తూ ఉన్నా గంభీర భావం కల ఎలుక పిల్లితో ఇలా అంది. నీవు మంచిదానవు. నీ మాట విన్నాను. నీ మీద నాకు ప్రీతి ఉంది కాని. నిన్ను నమ్మలేను. ఈ స్తుతులతోను, ధనరాసులతోను నన్ను నీవు వశపరుచుకోలేవు. ప్రాజ్ఞులు శత్రువులకు నిష్కారణంగా లొంగరు. ఈ విషయంలో శుక్రుడు బోధించిన రెండు గాథలు (శ్లోకాలు) ఉన్నాయి. తెలుసుకో. సమానమయిన కార్యంలో బలవంతుడైన శత్రువుతో సంధి చేసుకొని ఉపాయంతో మెలకువతో మెలగాలి. ప్రయోజనం పొందిన తరువాత కూడా నమ్మకూడదు. నమ్మరానివానిని నమ్మకూడదు. నమ్మదగిన వానిని కూడ మితిమీరి నమ్మరాదు. ఇతరులకు నమ్మకం కలిగించాలి. కాని ఇతరులను నమ్మకూడదు. అందుచేత

* ఆత్మా హి సర్వదా రక్ష్యః దారైరపి ధనైరపి ।

సర్వకాల సర్వావస్థలలోనూ తన జీవితాన్ని రక్షించుకోవాలి. బ్రతికి ఉంటే (ఉన్నవానికి) ద్రవ్యాలు, సంతానం – అన్నీ సమకూరుతాయి. పూర్తి అవిశ్వాసం నీతిశాస్త్రాల సారం. అందుచేత మానవులలో అవిశ్వాసమే పుష్కలంగా హితం కలిగిస్తుంది. దుర్బలు లయినా నమ్మకం లేనివారు శత్రువులచేత వధింపబడరు. బలవంతులు నమ్మకం కల్గి దుర్బలులకు వధింప దగిన వారవుతారు. మార్జాలమా ! నన్ను నేను మీ వంటి వారి నుండి సదా రక్షించు కోవాలి. జాతి చేతనే పాపాలు చేసే చండాలుని నుండి నీవూ నిన్ను కాపాడుకో.' ఇలా ఎలుక అంటూ ఉండగానే భయసంభ్రమాలు కలిగి, పిల్లి కొమ్మ మీది నుంచి పారి పోయింది. ఇలా శాస్త్రార్థతత్త్వాలు తెలిసిన ఎలుక తన బుద్ధి సామర్థ్యం వినిపించి మరో కన్నంలోకి వెళ్లిపోయింది. తెలివయిన ఎలుక బలం లేక పోయినా, ఒంటరి దయినా, బుద్ధిబలంతో చాలామంది బలవంతులయిన శత్రువులను మోసగించింది. సమర్థు డయిన శత్రువుతో పండితుడు సంధి చేసుకోవాలి. ఎలుక పిల్లి ఒక దానినొకటి ఆశ్రయించుకొని ఆపద నుండి బయట పడ్డాయి కదా ! ఇలా క్షత్రియ ధర్మాన్ని నేను నీకు చాలా చోట్ల విస్తారంగా చెప్పాను. ఇపుడు సంక్షిప్తంగా కూడా చెపుతాను విను.

పరస్పర శత్రుత్వం కల ఎలుక, పిల్లి ఉత్తమ మయిన ప్రీతి పొందాయి. వాటి బుద్ధి పరస్పరమూ వంచించుకొనటానికి పనికి వచ్చింది. చక్కని బుద్ధిని ఆశ్రయించి నందువల్ల ప్రాజ్ఞుడు ఇతరుని మోసగింపగలడు. ప్రమాదపడితే ప్రాజ్ఞుడు కూడ తెలివిగల ఇతరుల వంచనకు లోబడతాడు. అందుచేత భయపడినా భయపడనట్లు; నమ్మకపోయినా నమ్మినట్లు ఉండేవాడు పొరబడకుండా స్థిరంగా ఉంటాడు. చలిస్తే, పొరబడితే నశిస్తాడు. నరాధిపా ! సంధి తత్త్వజ్ఞులు కాలాన్ని అనుసరించి శత్రువుతో సంధిని, మిత్రునితో వైరమూ చెయ్యాలని నిత్యమూ చెపుతారు. మహారాజా ! ఇది తెలిసి రాజు శాస్త్రార్థం గ్రహించి, ప్రయత్నపరుడై, అప్రమత్తుడై భయపడకుండానే భయపడినట్లు నటించాలి. బలవంతు డయిన శత్రువును భయపడుతూనే చేరాలి. విడిపోయేటప్పుడూ భయపడుతూనే విడిపోవాలి. భయం వల్ల, అప్రమత్తమయిన ఏకాగ్రత వల్ల ఆపదలను తొలగించుకొనే బుద్ధి కలుగుతుంది. భయం రాకముందే భయపడేవానికి భయమే కలగదు. ఏమరుపాటుతో నిర్భయంగా ఉంటే వానికి గొప్పభయం ఏర్పడుతుంది. నిత్యమూ భయరహితంగా తిరిగే వానికి ఏరహస్యమూ చెప్పరాదు. వానికి తెలిసినది దాచుకొనే జ్ఞానం లేకపోవటం వల్ల అది మూలదర్శనం చేయగల వారి దగ్గరకు చేరుతుంది. అందుచేత భయపడినా భయపడనట్లు, నమ్మకపోయినా నమ్మినట్లు ప్రవర్తిస్తూ ఉండాలి. కార్యభారంతో అసత్య కృత్యం ఏమాత్రం చేయరాదు. ధర్మజా ! నేను నీకీ కథ చెప్పాను. దీన్ని విని మిత్రుల

మధ్య తగినట్లు ఆచరించు. ఏకాగ్ర బుద్ధిని పొంది, శత్రు మిత్రుల తేడా తెలిసికొని, సంధి విగ్రహకాలాలను, ఆపదల నుండి బయటపడే ఉపాయాలను తెలుసుకో. శత్రువుకూ, నీకూ సమానమయిన పనిలో బలవంతునితో సంధి చేసుకొని, కలిసి, తరువాత యుక్తితో సంచరించాలి. కృతార్థుడవయిన తరువాత కూడా నమ్మిఉండకూడదు. ధర్మార్థ కామాలకు విరుద్ధంకాని ఈ నీతిని నా నుండి విని, ప్రజలను రక్షిస్తూ అభ్యుదయం పొందు. బ్రాహ్మణులతో కలిసి నీయాత్ర సాగుగాక ! వారే ఇహమందు పరమందు మిక్కిలి శ్రేయస్సు చేకూర్చుతారు. వీరు ధర్మవేత్తలు. సదా కృతజ్ఞులు. పూజితులయి శుభం చేస్తారు. అందుచేత వారిని పూజించాలి. రాజా ! రాజ్యాన్ని, శ్రేయస్సును, యశః కీర్తులను పొందుతావు. అవిచ్ఛిన్నమైన వంశం యథాన్యాయంగా, యథాక్రమంగా పొందుతావు. బుద్ధి విశేషం కలిగించే సంధివిగ్రహాలు రెండిటిని గూర్చి నీకు చక్కగా చెప్పాను. సదా రాజు దీన్ని మెలకువతో పరిశీలించి శత్రువుల సముదాయం మీద ప్రయోగించాలి.

139. బ్రహ్మదత్త పూజనీ సంవాదము.

యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. 'మహాబాహూ ! శత్రువులయందు నమ్మకం ఉండరాదు అనే రాజనీతిని చెప్పావు. ఎక్కడా నమ్మకం లేకుండా రాజు ఎలా వ్యవహారాలను సాగిస్తాడు ? రాజా ! విశ్వాసం వలన రాజులకు భయం కలుగుతోంది. మరి ఎవరినీ నమ్మకుండా రాజు శత్రువులను ఎలా గెలుస్తాడు ? పితామహా ! ఈ నా సందేహాన్ని తీర్చు. విశ్వాసం పనికిరాదు అనే మాట వింటే నా బుద్ధి తికమకపడుతోంది.' భీష్ముడు ఇలా అన్నాడు.' ధర్మరాజా ! బ్రహ్మదత్తుని ఇంటిలో జరిగిన వృత్తాంతాన్ని చెపుతాను. విను. ఇది బ్రహ్మదత్తమహారాజు పూజనితో జరిపిన సంవాదం.

కాంపిల్యనగరంలో బ్రహ్మదత్తుని అంతఃపురంలో పూజని అనే పక్షి చాలాకాలంగా ఉంటోంది. ఆ పూజని జీవజీవక పక్షివలె సర్వప్రాణుల భాషలను అర్థం చేసికొనగలది. పక్షి జాతిలో పుట్టినప్పటికీ అన్నీ తెలిసినది. అన్ని తత్త్వాలను అవగతం చేసికొన్నది. అక్కడది మంచివన్నెకల ఒక పిల్లకు జన్మనిచ్చింది. అదే రోజు బ్రహ్మదత్తునకు రాణిగర్భాన ఒక కొడుకు పుట్టాడు. కృతజ్ఞురాలైన ఆ పక్షి-పూజని- రోజూ సముద్ర తీరానికి పోయి ఆ పిల్లల కొరకు రెండు పండ్లను తెస్తుండేది. తనపిల్లా, రాజుకొడుకూ పుష్టిగా పెరగాలని వారిద్దరికీ చెరొక పండును ఇచ్చేది. ఆ పండ్లు అమృతం వలె రుచికరమయినవి. బలాన్నీ, తేజస్సునూ వృద్ధిపొందించేవి. పూజని ఆ పండ్లను క్రమం తప్పకుండా తెచ్చి వెంటనే వారికిచ్చేది. ఆ పండ్లను తినటంవలన రాజపుత్రుడు బాగా ఎదిగాడు. ఆ రాజుకొడుకును

ఒక రోజు దాది ఎత్తుకొని త్రిప్పుతోంది. ఆ బాలకుడు ఆ సమయంలో బాల్యచాపల్యంతో ఆ పక్షి పిల్లను చూచాడు. చిన్నతనంతో ఉత్సాహంగా ఆ పక్షితో ఆటలాడసాగాడు. రాజా ! ఆ రాజు కొడుకు తనతోపాటు పుట్టిన ఆ పక్షిపిల్లను, ఎవ్వరూ లేని చోటికి తీసికొనిపోయి, దానిని చంపి, దాది ఒడిలోనికి చేరాడు. రాజా ! అప్పుడు పూజని పండ్లను తీసికొని వచ్చింది. రాజు కొడుకు చంపిన తన పిల్ల నేలపై పడిఉండటాన్ని చూచింది. ఆ పూజని మరణించిన తన బిడ్డను చూసి, విలపించింది. కన్నీరు ముఖాన్ని నింపింది. దుఃఖ సంతప్తయై విలపిస్తూ అది ఇలా అన్నది. క్షత్రియులకూ స్నేహం లేదు, ప్రేమ లేదు, మంచితనమూ లేదు. ఏదైనా పనిబడ్డప్పుడే ఇతరులను అనునయిస్తారు. పని ముగియగానే విడిచిపెడతారు. అందరికీ అపకారం చేయగల క్షత్రియులను నమ్మరాదు. అపకారం చేసి కూడా నిరర్థకంగా అనునయించటం వారికి అలవాటే. ఈ బ్రహ్మదత్తుడు కృతఘ్నుడు, మరీ క్రూరుడు, విశ్వాస ఘాతుకుడు. ఇప్పుడు ఇతడు చేసిన దానికి తగిన ప్రతీకారాన్ని నేను చేస్తాను. తనతో పుట్టి పెరిగిన వానిని చంపటం, తనతో కలిసి భోజనం చేసిన వానిని చంపటం, శరణు కోరివచ్చిన వారిని చంపటం - ఇలా పాతకం మూడు విధాలుగా ఉంటుంది.' అలా పలికి, ఆ పూజని రాజకుమారుని కళ్ళను కాళ్ళతో పొడిచి, పీకి, గగనతలంలో నిలిచి, ఇలా అన్నది. **ఇష్టపూర్వకంగా పాపం చేస్తే దాని ఫలం ఆ పాపిని వెంటనే చేరుతుంది. అయితే తాను చేసినది ప్రతిక్రియమాత్రమే అయితే ఆ కర్త అంతకుముందు చేసిన శుభాశుభకర్మలు నశించవు. రాజా ! ఒక వేళ పాపకృత్యాన్ని చేసినా దాని ఫలం కర్తను చేరినట్లు కనిపించకపోతే అతని పుత్రులో, మనుమలో, ముది మనుమలో దానిని అనుభవించవలసివస్తుంది.** పూజనివలన కండ్లను పోగొట్టుకొన్న తన కుమారుని చూసి, బ్రహ్మదత్తుడు దానిని తనకుమారుడు చేసిన పనికి ప్రతిఫలంగా భావించి, పూజనితో ఇలా అన్నాడు. 'మేము నీకు అపకారం చేశాం. నీవు ప్రతీకారం తీర్చికొన్నావు. రెండూ సరిపోయాయి. పూజనీ ! మా దగ్గరే ఉండు. ఎక్కడకూ వెళ్ళవద్దు.'

పూజని ఇలా అన్నది. 'ఒక సారి తప్పుచేసిన వాడు మరల ఆ స్థానాన్నే ఆశ్రయించి యుండటాన్ని పండితులు అభినందించరు. అక్కడ నుండి వెళ్ళపోవటమే శ్రేయస్కరం. దెబ్బతిన్నవాడు సాంత్వనవచనాలు పలికినా ఎప్పుడు వానిని నమ్మదగదు. శత్రుత్వ మెప్పుడూ ఉపశమించదు. నమ్మిన మూర్ఖుడు శీఘ్రంగానే హత్యకు గురి అవుతాడు. పరస్పరం శత్రుత్వాన్ని పెంచుకొంటూపోతే వారి పుత్రపౌత్రులను కూడా అది పట్టిపీడిస్తుంది. పుత్రపౌత్రులు నశిస్తే పరలోకంలో కూడా అది వెన్నాడుతుంది. ఒకరికొకరు

అపకారం చేసినవారికి ఒకరినొకరు నమ్మకపోవటమే సుఖహేతువు. విశ్వాసఘాతకులు ఎప్పుడూ విశ్వసించకపోవటం అవసరం. **నమ్మదగనివానిని నమ్మరాదు. నమ్మదగిన వానిని కూడా మిక్కిలిగా నమ్మరాదు. విశ్వాసంవలన పుట్టిన భయం విశ్వసించినవానిని సమూలంగా నశింప జేస్తుంది. అందరినీ నమ్మించగలగాలే కానీ తాను ఎవ్వరినీ నమ్మకూడదు.** బంధువులలో తల్లిదండ్రులు అందరికన్న ఎక్కువ. భార్య అంటే రూపుకట్టిన వార్ధక్యం. పుత్రుడు తన అంశయే. సోదరుడు శత్రువు. తన పని తీరేదాకా నిలుస్తాడు మిత్రుడు. సుఖ దుఃఖాలను తానే అనుభవించాలి. పరస్పరం శత్రుత్వమున్నవారి మధ్య సంధి పొసగదు. నేను ఒక కారణంగా నీ దగ్గర నివసించాను. ఇప్పుడది తొలగిపోయింది. ఒక సారి అపకారం చేసినవానిని అపకారాన్ని పొందినవాడు దానమానాలతో గౌరవించినా అపకర్త మనస్సు విశ్వసించదు. దుర్బలులను తాము చేసిన తప్పులే భయపెడతాయి. ఒకప్పుడు గౌరవాన్ని పొంది, ఆ తర్వాత పరాభవానికి గురి అయితే సత్త్వసంపన్నుడైన మనిషి ఆ స్థానాన్ని తప్పక విడనాడాలి, శత్రువు చేత సత్కరింపబడుతున్నాసరే ! నీ కొలువులో మన్నన పొందుతూ చాలా కాలం నివసించాను. ఇప్పుడు వైర మేర్పడింది. వెంటనే వెళ్ళిపోవటమే సుఖకరం. కాబట్టి నేను వెళ్తాను.

బ్రహ్మదత్తు డిలా అన్నాడు. 'ఒకరు చేసిన పనికి ప్రతీకారం చేసినవాడు తాను తప్పుచేసినట్లు కాదు. అతడు దోషిగా భావింపబడడు. ప్రతీకారానికి గురి అయినవాడు కూడా ముందు చేసిన తప్పునుంచి విముక్తుడు కాగలడు. పూజనీ ! ఇక్కడే ఉండు. వెళ్ళవద్దు.' పూజని ఇలా అన్నది. 'ప్రత్యపకారికి, అపకారాన్ని అనుభవించినవానికీ మధ్య మరల సఖ్యం కుదరదు. వారి మనస్సులలో పూర్వస్థితి మెదులుతూనే ఉంటుంది.' బ్రహ్మదత్తు డిలా అన్నాడు. 'ప్రత్యపకారికీ, అపకారాన్ని అనుభవించిన వానికీ మధ్య మరల సంధి పొసగుతుంది. ప్రతీకారంతోనే వైరం నశిస్తుంది. అపకార ఫలాన్ని ప్రత్యపకారి పొందనవసరం లేదు.' పూజని ఇలా అన్నది. 'వైర మెప్పుడూ కడచిపోదు. 'అనునయింపబడ్డాను కదా' అని విశ్వసించగూడదు. నమ్మినందువలననే ప్రాణాల మీదకు రావచ్చు. కాబట్టి కనిపించకుండా పోవటమే శ్రేయస్కరం. ఆడయేనుగుల సహకారంతో మదపుటేనుగులను బంధించినట్లు, వాడి ఆయుధాలతోనయినా వెంటనే బంధింపలేనివానిని మంచి మాటలతో / మంచితనంతో బంధించవచ్చు.' బ్రహ్మదత్తు డిలా అన్నాడు. 'ప్రాణహాని చేసే ప్రాణులతో అయినా సహవాసం వలన స్నేహం కలుగుతుంది. పరస్పరం విశ్వాసం కలుగుతుంది. శునకానికి చండాలునితో స్నేహ విశ్వాసాలు కలుగుతున్నాయి గదా ! పరస్పరవైరంగల ప్రాణులలో అయినా సహవాసం వలన వైరం కూడా మార్దవంగా మారిపోతుంది. తామరాకు

మీది నీటి బొట్టువలె ఆ శత్రుత్వం నిలువదు.' పూజని ఇలా అన్నది. **'వైరం అయిదు కారణాలవలన కలుగుతుందని పండితులంటారు. అయిదు కారణాలివి. 1. స్త్రీ 2. ఇల్లు/భూమి 3. మాట 4. జాతిగతవైరం 5. ఏదయినా అపరాధం.** ఈ అయిదింటిలో ఏదయినా కారణమున్నా కూడా పరోపకారిని చంపకూడదు. విశేషించి క్షత్రియుడు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ అటువంటి వానిపై బడరాదు. జరిగిన తప్పులోని బలాబలాలను గుర్తించి, ఆ తరువాతనే అడుగు ముందుకు వేయాలి. వైరమేర్పడిన తరువాత మిత్రుని అయినా సరే నమ్మరాదు. కట్టెలో కనిపించకుండా నిప్పుఉన్నట్లు వైరం పైకి కనిపించకపోయినా లోపల దాగి ఉంటుంది. **రాజా ! ధనదానం వలన గానీ, బెదిరింపుల వలనగానీ, అనునయింపుల వలనగానీ, శాస్త్ర బోధలవలన గానీ కోపాగ్ని శమించదు. సముద్రంలోని బడబాగ్నివలె మండుతూనే ఉంటుంది.** రాజా ! ఎగిసిపడుతున్న వైరాగ్ని కానీ, అపరాధం వలన చేసిన కర్మ కానీ, ఏదో యొక పక్షం నశించిపోయేదాకా చల్లబడదు, సమసిపోదు. అపకారం చేసిన వానిని అపకారం పొందినవాడు అర్థమానాలతో సత్కరించినా అటువంటి శత్రువుపై విశ్వాస ముంచరాదు. దుర్బలులను వారు చేసినపనులే భయపెడతాయి. ఇంతవరకు నేను నీకేమీ అపకారం చేయలేదు. నీవు కూడా నా కేమీ అపకారం చేయలేదు. అందువలన నేను నీ ఇంట నివసించాను. ఇప్పుడు నేను నిన్ను నమ్మలేను.'

బ్రహ్మదత్తు డిలా అన్నాడు. 'కాలమే అన్ని పనులు చేస్తుంది. కాలప్రభావం వలననే వివిధ క్రియలు జరుగుతుంటాయి. మరి ఎవరు ఎవరికి అపరాధం చేసినట్టు ? మరణమూ, జననమూ సమానంగానే జరుగుతుంటాయి. కాలం కారణంగా జన్మిస్తారు. ఆ కారణంగానే మరణిస్తారు. కొన్ని ప్రాణులు సామూహికంగా మరణిస్తాయి. కొన్ని ఒక్కొక్కటిగా మరణిస్తాయి. కొన్ని చిరకాలం జీవిస్తాయి. ఇంధనాన్ని అంటిన నిప్పులా కాలమే సర్వప్రాణులనూ దహిస్తుంది. కళ్యాణీ ! పరస్పరం జరిగే అపరాధాలకు నీవూ కారణం కాదూ, నేనూ కారణంకాదు. ప్రాణుల కెప్పుడూ సుఖ దుఃఖాలను కలిగించేది కాలమే. కాబట్టి పూజనీ ! స్నేహంతో, స్వేచ్ఛగా, ఏ బాధపడకుండా ఇక్కడే నివసించు. నీవు చేసినతప్పు నేను క్షమించాను. నీవు కూడా నన్ను క్షమించు.' పూజని ఇలా అన్నది. 'కాలమే అన్నింటికీ కారణమైతే, ఎవరితోనూ ఎవ్వరికీ వైరమే లేకపోతే తమ వారిని ఎవరయినా చంపినపుడు హతుని బంధువులు ప్రతీకార మెందుకు తీర్చుకొంటారు? కాలం వలననే మృత్యువూ, సుఖ దుఃఖాలు, పెరుగుదల తరుగుదలలు జరిగేటట్లయితే గతంలో దేవతలూ, రాక్షసులూ ఒకరినొక రెందుకు చంపుకొనే వారు ? వైద్యులు

రోగులకు చికిత్స చేయాలని ఎందుకు అనుకొంటారు ? కాలమే అందరినీ చంపుతూంటే మందులవలన ప్రయోజన మేమున్నది ? శోకమోహితు లయినవారు ఎందుకంతగా విలపిస్తారు? కాలమే ప్రమాణ మయితే కర్మపరులకు విధినిషేధరూప మయిన ధర్మాచరణ మెందుకు ? రాజా ! నీ కుమారుడు నా బిడ్డను చంపాడు. నేను నీ కొడుకును చంపాను. ఇక నీవు నన్ను చంపటమే కదా తదుపరి విధి. నేను పుత్రశోకంతో నీ కుమారునియెడ పాపం చేశాను. అలాగే నీవు నన్ను చంపుతావు. ఇక్కడొక తత్త్వ మున్నది చెపుతాను. విను. మానవులు ఆహారం కోసం, ఆటలకోసం పక్షులను కోరుకొంటారు. వధబంధనాలు తప్ప హేతుబద్ధ మయిన మరో సంబంధ మేమీ లేదు. వధబంధనాల భయంవలననే ముముక్షువులు మోక్షతంత్రాన్ని ఆశ్రయిస్తున్నారు. జనన మరణాల వలన కలిగే దుఃఖం భరింపరాని దని వేదవేత్త లంటారు. ప్రాణాలు అందరికీ ప్రియమైనవే. సంతాన మందరికీ ఇష్టమైనదే. అందరూ దుఃఖంవలన ఉద్వేగాన్ని పొందుతారు. అందరికీ అభీష్టమైనది సుఖమే. **బ్రహ్మదత్తా ! ముసలితనం దుఃఖం, అర్థనాశనం దుఃఖం, ఇష్టంలేనివారితో కలిసి బ్రతకటం దుఃఖం, ఇష్టజన వియోగం దుఃఖం. వధబంధనాల వలన జనులకు దుఃఖం కలుగుతుంది. స్త్రీ కారణంగా లేదా స్వాభావికంగా కూడా దుఃఖం కలుగుతుంది. సంతానంవలన కూడా ఎప్పుడూ దుఃఖమే.**

కొందరు మూర్ఖులు పరదుఃఖంలో దుఃఖ ముండదని అంటుంటారు. అంతేకాదు దుఃఖ స్వభావం తెలియని ఆ మూఢులు తమ భావాన్ని పెద్దలముందు గొప్పగా ప్రకటిస్తుంటారు. దుఃఖార్తుడై బాధపడేవాడూ, తన బాధలాగే అందరి బాధను అర్థం చేసికొనగలవాడు అటువంటి మాటలు మాటాడలేడు. అరిందమా ! రాజా ! నేను నీపట్ల చేసిన పనీ, నీవు నాపట్ల చేసిన పని వందల సంవత్సరాలు గడిచినా మరపులేనిది. మనం ఒకరికొకరు అపకారం చేసికొన్నాం. మరల సంధి పొసగదు. నీ కొడుకును తలచుకొంటున్నకొద్దీ నీలో క్రొత్త వైరం పుడుతుంటుంది. శత్రుత్వపు అంచులదాకా వెళ్ళినవాడు మరలస్నేహం చేద్దామన్నా కుదరదు. పగిలిన కుండ మరల అతుకుపడదు గదా ! విశ్వాసమే దుఃఖహేతువు అని అర్థశాస్త్రాలన్నీ నిశ్చయించాయి. తొల్లి శుక్రుడు ప్రహ్లాదునకు రెండు గాధలిలా చెప్పాడు. తేనె మీది శ్రద్ధతో ఎండుగడ్డికప్పిన కూపాలలో పడి ప్రాణాలమీదికి తెచ్చుకొన్నట్లు శత్రువుల సత్యాలపై కానీ, అసత్యాలపై కానీ విశ్వాస ముంచిన వారు చంపబడతారు. ఏ వంశంలో అయినా దుఃఖహేతు వయిన వైర మున్నంత కాలం శాంతి ఉండదు. ఎవరో యొకరు దాన్ని కదుపుతూనే ఉంటారు. కాబట్టి వంశంలో

ఏ ఒక్కడు జీవించి ఉన్నా ఆ వైరం కొనసాగుతూనే ఉంటుంది. రాజా ! లోపల వైరాన్ని దాచుకొని, కొందరు పైకి అనునయవాక్యాలు పలుకుతుంటారు. నిండుకుండను రాతిపై పడవేసి బ్రద్దలు చేసినట్లు సమయం చూసి, నమ్మిన వానిని విసిరికొడతారు. రాజా ! ఎవరికయినా అపకారం చేసిన తరువాత ఎప్పుడూ నమ్మక ముంచుకొనరాదు. ఇతరులకు అపకారం చేసి, ఆ పై వారిని నమ్మితే దుఃఖపడవలసి వస్తుంది.' బ్రహ్మదత్తు డిలా అన్నాడు. 'అవిశ్వాసంతో జీవితంలో దేనినీ పొందలేము. ఏ పనీ చేయలేము. మనస్సులో ఒకవైపు ఎప్పుడూ భయముంటే ఆ మనుషులు మృతప్రాయులే.'

పూజని ఇలా అన్నది. 'గాయపడిన పాదాలతో ఇంకా పరుగులు పెడుతుంటే, ఎంతగా ముడుచుకొని, పరుగెత్తినా ఆ పాదాల గాయాలు పెద్దవే అవుతాయి. రోగగ్రస్తమయిన కళ్ళతో గాలికెదురునిలిచి చూస్తుంటే ఆ గాలివలన ఆ కళ్ళు మరీ చెడిపోవటం నిశ్చయం. తనశక్తి నెరుగక మోహవశుడై చెడుదారిలో నడువ సాగితే ఆ జీవితం అక్కడే అంతమవుతుంది. వానరాకడను తెలియకుండా పాలం దున్నితే ఆ కర్షకుని పురుషార్థం వ్యర్థమవుతుంది. అతడు పాలంలో పంటను పొందలేడు. **చే దయినా, వగ రయినా, మధుర మయినా, రుచికర మయినా తనకు హితమయిన ఆహారాన్నే ఎప్పుడూ స్వీకరించే వాడు అమృతత్వాన్ని పొందుతాడు. పరిణామాన్ని గ్రహించకుండా మోహంతో పథ్యమయిన పదార్థాన్ని వీడి, అపథ్యమయిన భోజనం చేస్తుంటే వాని జీవితం అక్కడకు అంతమయినట్లే. దైవమూ, పురుష ప్రయత్నమూ ఒకదాని నొకటి ఆశ్రయించి ఉంటాయి. ఉదారమయిన ఆలోచనగలవారు సత్కర్మను ఆశ్రయిస్తారు. నపుంసకులు దేవుని మీద భారం వేస్తారు. తనకు హితాన్ని కలిగించే పనినే చేయాలి.** అది కఠోర మయినా, మృదు వయినా సరే ! కర్మను పరిత్యజించినవాడు దరిద్రుడై ఎప్పుడూ అనర్థాలకు బలి కావలసి వస్తుంది. **కాబట్టి కాలం, దైవం, స్వభావం వీటినన్నింటినీ అతిక్రమించి మనిషి ఉద్యమించాలి. దేనినైనా సరే విడినాడి, తనకు హితమైన పనినే నరుడు ఆచరించాలి. విద్య, శౌర్యం, సామర్థ్యం, బలం, ధైర్యం - ఈ అయిదు మనుష్యునకు నైసర్గిక మిత్రులు. వాటిద్వారానే విద్వాంసులు జీవనయాత్ర సాగిస్తారు.*** ఇల్లు, లోహాలు, పాలం, భార్య, మంచిమిత్రులు - వీరంతా ఉపమిత్రులు. మనిషి వీటిని ఎక్కడయినా పొందవచ్చు. ప్రాజ్ఞుడు ఎక్కడయినా ఆనందంగా ఉండగలడు. ఎక్కడయినా రాణించగలడు. తానెవ్వరికీ భయపడడు. ఎవ్వరూ

---

* విద్యా శౌర్యం చ దాక్ష్యం చ బలం ధైర్యం చ పంచమమ్ ।
మిత్రాణి సహజాన్యాహుః వర్తయంతీహ తైర్బుధాః ॥ 85

అతనిని భయపెట్టలేరు. బుద్ధిమంతుని దగ్గరనున్న ధనం స్వల్ప మయినా అది నిత్యమూ వృద్ధి పొందుతుంది. సమర్థతతో పని చేస్తూ సంయమనం ద్వారా అతడు ప్రతిష్ఠ వందగలడు. గృహాసక్తిచే బంధింపబడిన మందబుద్ధు లయిన నరుల మాంసాన్ని కుకాంత తినివేస్తుంది. అతనిని సుఖపెడుతున్నట్లు కనిపిస్తున్నా ఆడఎండ్రి/ పీత మరణానికి సంతానమే కారణమైనట్లు నాశనానికి కారణమవుతుంది. బుద్ధి విపర్యయంవలన కొంతమంది నా ఇల్లు, నా పొలాలు, నా మిత్రులు, స్వస్థలం మొదలయిన వాటిని గురించి చింతిస్తూ దుఃఖపడుతుంటారు. తన ఊరు వ్యాధులకూ, కరువుకాటకాలకూ లోనయితే అక్కడ నుండి నిష్క్రమించాలి. మరొక తావున నివసించటానికి వెళ్ళాలి లేదా అక్కడే గౌరవంగా బ్రతకగలగాలి.

కాబట్టి రాజా ! నేను మరొక చోటునకు వెళ్తాను. ఇక్కడ ఉండాలనిపించటం లేదు. నేను నీ కొడుకువిషయంలో చేయరాని పని చేశాను. **చెడ్డ భార్యను, చెడ్డకొడుకును, చెడ్డరాజును, చెడ్డమిత్రుని, చెడ్డ బంధువులను చెడిన ప్రదేశాన్ని దూరం నుండియే విడనాడాలి. చెడ్డకొడుకుపై విశ్వాస ముండదు. చెడ్డభార్యతో సుఖ ముండదు. చెడ్డరాజ్యంలో శాంతి ఉండదు. చెడ్డతావులో** బ్రతుకుతెరువు **ఉండదు.** చెడ్డవానితో స్నేహం ఎప్పుడూ అస్థిరమే. కాబట్టి కుమిత్రునితో మైత్రి కుదరదు. సంబంధం చెడినచోట స్వప్రయోజనాలలో తేడా వస్తే అవమానం జరుగుతుంది. **ప్రియంగా మాట్లాడగలదియే భార్య. ప్రశాంతతను చేకూర్చగలవాడే కొడుకు. నమ్మదగిన వాడే మిత్రుడు. బ్రతకగలగిన ప్రదేశమే మంచి ఊరు.** ప్రజలపై బలాత్కారం లేకుండా, భయానికి అవకాశం లేకుండా పరిపాలింపగలరాజే మంచి రాజు. దరిద్రుని కూడా గౌరవింపగలిగినపుడే రాజుకూ, ప్రజలకూ మధ్య సత్సంబంధ మున్నట్లు. రాజు గుణవంతుడై, ధర్మపరాయణుడైనపుడు మాత్రమే భార్య, పుత్రులు, మిత్రులు, వియ్యంకులు, బంధువులు, రాజ్యమూ కూడా సద్గుణ, సంపన్న మవుతుంది. రాజుకు ధర్మం తెలియకపోతే అతని ప్రజలు రాజు దుర్మార్గత వలన నశిస్తారు. ధర్మార్థకామాలకు పాలకుడే మూలం. అందుకే రాజు బాగా సావధానుడై పరిపాలించాలి. ప్రజల ఆదాయంలో ఆరవభాగాన్ని పన్నుగా వసూలు చేసిన రాజు దానిని తానే అనుభవిస్తూ, ప్రజలను సరిగా పరిపాలించకపోతే ఆ రాజు **దొంగ.** ప్రజలకు అభయమిచ్చిన రాజు అర్థలోభంతో తానే దానిని పాటించకపోతే ఆ పాపాత్ముడు లోకులందరి పాపాన్నీ మూటగట్టుకొని, నరకానికి వెళ్తాడు.

ప్రజలకు అభయమిచ్చి, ధర్మపూర్వకంగా పరిపాలన చేస్తూ, తన ప్రతిజ్ఞను పాటించిన రాజు ప్రజలందరి సుఖాలకూ కారకుడవుతాడు. మనువు రాజుకుండవలసిన

లక్షణాలను ఏడింటిని చెప్పాడు. తల్లి, తండ్రి, గురువు, రక్షకుడు, అగ్ని, కుబేరుడు, యముడుగా రాజు ప్రజలను నడిపించాలి. ప్రజల నెప్పుడూ దయతో చూడగలిగిన రాజు ఆ రాజ్యానికి తండ్రివంటివాడు. అటువంటిరాజు దగ్గర దొంగ వినయాన్ని నటించే మనిషి తిర్యగ్జాతులలో జన్మిస్తాడు. రాజు దీనులను కూడా చైతన్యపరచి, వారిని ఆదరిస్తాడు కాబట్టి తల్లివంటివాడు. అప్రియులను అగ్నివలె దహించేవాడు రాజు. దుర్మార్గులను నియంత్రిస్తాడు కాబట్టి రాజు యమునివంటివాడు. రాజు ప్రియప్రజలకు అర్థదానంచేసి వారి కోరికలను తీర్చగలడు కాబట్టి కుబేరుని వంటివాడు. ప్రజలకు ధర్మోపదేశం చేస్తాడు కాబట్టి రాజు గురువు. అందరినీ రక్షిస్తాడు కాబట్టి రక్షకుడు కూడా. రాజు తాను స్వయంగా ధర్మానుష్ఠానం చేస్తూ పౌరులనూ, జానపదులనూ కూడా రంజింపజేయగలిగితే ఆ రాజ్యం ఒడిదుడుకులకు లోనుగాదు. తాను స్వయంగా పౌరులనూ, జానపదులనూ ఆదరించగల రాజు ఇహపరలోకాలలో సుఖిస్తాడు. **రాజ్యంలోని ప్రజలు పన్నుల భారంతో పీడించబడుతూ, ఎప్పుడూ ఉద్వేగంతో జీవించవలసి వచ్చి, రకరకాల అనర్థాల బారిన పడుతుంటే ఆ రాజు పరాభవాన్ని పొందవలసి వస్తుంది.** ఏ రాజు ప్రజలు సరస్సులోని పద్మం (కలువ)వలె బాగా వృద్ధి పొందుతారో ఆ రాజు సమస్త పుణ్యఫలాలనూ పొంది, స్వర్గలోకంలో సత్కారాన్ని పొందుతాడు. రాజా ! బలవంతులతో యుద్ధం ఎప్పుడూ మంచిది కాదు. బలవంతులతో విగ్రహించిన రాజునకు రాజ్యం నిలువదు. (నిలిచినా) సుఖముండదు.' భీష్ముడిలా చెప్తున్నాడు. 'రాజా ! ఆ పక్షి (పూజని) బ్రహ్మదత్తునితో ఈ రీతిగా చెప్పి, ఆయన నుండి వీడ్కోలు తీసికొని, తనకిష్టమైన దిశగా వెళ్ళిపోయింది. రాజశ్రేష్ఠా ! పూజనీ బ్రహ్మదత్తుల మధ్య జరిగిన ఈ సంవాదాన్ని నీకు నేను చెప్పాను. ఇంకా ఏమి వినాలనుకొంటున్నావు ?'

140. కణికోపదేశము.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. పితామహా ! కృత త్రేతా ద్వాపరయుగాలు ముగియ బోతున్నాయి. లోకంలో ధర్మం నశిస్తోంది. దొంగలు కూడా బాధిస్తున్నారు. ఈ స్థితిలో ఎలా జీవించాలి ?' భీష్ముడిలా చెప్తున్నాడు. 'భారతా ! ఆపత్కాలంలో పాటించవలసిన నీతిని నీకు వివరిస్తాను. ఆపత్కాలంలో దయమాలి అయినా రాజు సమయోచితంగా ప్రవర్తించాలి. ఈ విషయంలో భారద్వాజుడైన కణికునకు, శత్రుంజయమహారాజుకు మధ్య జరిగిన సంవాదాన్ని ప్రాచీనేతిహాసంగా ఉదాహరిస్తుంటారు.

సౌవీరదేశంలో శత్రుంజయుడనే రాజుండేవాడు. ఆయన మహారథుడు. ఆయన

భారద్వాజుని దగ్గరకు వచ్చి కర్తవ్య నిర్ణయాన్ని గూర్చి ఇలా ప్రశ్నించాడు. 'లేనిదానిని ఎలా పొందాలి ? పొందినది ఎలా వృద్ధి చెందుతుంది ? వర్ధిల్లిన దానిని కాపాడటమెలా ? రక్షించిన దానిని ఎలా వినియోగించాలి ?' ఆ శత్రుంజయుడు నిశ్చితంగా శాస్త్రవిజ్ఞానం కలవాడు. అయినా భారద్వాజుని కర్తవ్య నిశ్చయాన్ని గూర్చి ప్రశ్నించాడు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు - భారద్వాజుడు యుక్తియుక్తంగా మంచిమాట లిలా చెప్పాడు. 'రాజు ఎప్పుడూ శిక్షించటానికి సిద్ధపడి ఉండాలి. ఎప్పుడూ పరాక్రమ ప్రదర్శన చేస్తుండాలి. తనలో లోపా లుండకూడదు. శత్రువుల దౌర్బల్యాలను పసిగట్టాలి. సందు దొరికితే పరాక్రమించాలి. ఎప్పుడూ శిక్షించటానికే సిద్ధపడేరాజును చూసి, ప్రజలు భయపడతారు. అందువలన సమస్త ప్రాణులనూ దండనతోనే లొంగదీసికోవాలి. ఈ రీతిగా తత్త్వజ్ఞానులయిన పండితులు దండననే అభినందిస్తారు. కాబట్టి సామ దాన భేద దండాలలో దండోపాయమే ప్రధానం. మూలాధారం నశించిపోతే దానిని ఆశ్రయించిన అందరి జీవనమూ నశించినట్లే ! చెట్టువేరును నరికివేస్తే కొమ్మలు ఎలా నిలువగలుగుతాయి ? కాబట్టి తెలివిగలవాడు ముందుగా మూలాన్నే నరికివేయాలి. ఆ తరువాత సహాయకులకూ, పక్షపాతులకూ మూలానికి పట్టిన గతినే కలిగించాలి. **ఆపత్కాలంలో బాగా ఆలోచించాలి. బాగా పరాక్రమించాలి. దీటుగా యుద్ధం చేయాలి. తెలివిగా పారిపోవాలి. ఆపదలో వీటిలో ఏది అవసరమో దానిని పాటించాలి. అంతే కానీ చింతించకూడదు.** మాటలలో వినయ ముండాలి. హృదయం కత్తిలా తీక్ష్ణంగా ఉండాలి. నవ్వుతూ తానే ముందు పలుకరించాలి. కామక్రోధాలను విడనాడాలి. శత్రువుతో వ్యవహరించే వేళలో సంధి తర్వాత అయినాసరే శత్రువును నమ్మకూడదు. పని ముగిసిన తర్వాత వెంటనే అక్కడనుండి వెళ్ళిపోవాలి. శత్రువు నైనా మిత్రునిగా భావిస్తూ మంచిమాటలతో అనునయిస్తుండాలి. అయితే పాముదూరిన ఇంటిని చూసి భయపడ్డట్టు ఆ శత్రువువిషయంలో ఎప్పుడూ ఉద్విగ్నంగానే ఉండాలి. **బుద్ధి వికలమయిన వానిని కడచిపోయిన విశేషాలు చెపుతూ ఓదార్చాలి. దుర్బుద్ధిని భవిష్యత్తుపై ఆశచూపుతూ సమ్మతింపజేయాలి. పండితుని అప్పటికప్పుడు సత్కారాలతో లొంగదీయాలి.** ఐశ్వర్యాన్ని కోరే రాజు అదను చూసి, శత్రువుదగ్గర చేతులు జోడించవచ్చు. ప్రతిజ్ఞలు చేయవచ్చు. శత్రువును అనునయించవచ్చు. తలవాల్చి నమస్కరించవచ్చు. అవసరమయితే కన్నీరు కూడా తుడవవచ్చు.

కాలం మన వైపు తిరిగే దాకా శత్రువును భుజాలపై మోయాలి. కాలం అనుకూలించగానే రాతి మీద కొట్టి కుండను బద్దలు చేసినట్లు నేలకు వేసి

కొట్టవచ్చు. రాజేంద్రా ! క్షణకాలమైనా సరే ! శత్రువుఎదుట తుమ్మికి కట్టెమంటలాగా ప్రజ్వరిల్లాలి. పాట్టునిప్పులాగా ఎంతోకాలం రాజుతూ పొగచిమ్మితే ప్రయోజనం లేదు. వివిధ ప్రయోజనాలను ఆశించేవాడు కృతఘ్నునితో ఆర్థిక సంబంధాలను విడిచిపెట్టకూడదు. ఏ పనినీ పూర్తి చేయకూడదు. పని ఉన్న వాడినే లొంగదీయగలం. పని అయిపోయిపోతే మేలు చేసిన వారిని కూడా నిర్లక్ష్యం చేస్తారు. కాబట్టి ఏ పనినయినా కొంతకొంత మిగిల్చి పెట్టాలి. కోకిలలలో, పందులలో, మేరు పర్వతంలో, శూన్యగృహంలో, నటునిలో, ఆప్తమిత్రునిలో గల శ్రేష్ఠగుణాలను రాజు అలవరచుకోవాలి.* రాజు ప్రతిదినమూ నిదురలేచిన పిదప సావధానుడై శత్రువు ఇంటికి వెళ్ళాలి. ఒక వేళ శత్రువు క్షేమంలో లోప మేర్పడితే వెళ్ళి కుశల ప్రశ్నలు వేసి శుభాన్ని కోరాలి. **సోమరులు, నపుంసకులు, ఆత్మాభిమానులు, లోకాపవాదానికి భయపడేవారు, ఎప్పుడూ అదనుకై ఎదురు చూసే వారూ తమ అభీష్టాలను నెరవేర్చుకొనలేరు.** తనలోపం శత్రువులకు తెలియకూడదు. శత్రువుల లోపాలను తాను తెలిసికోవాలి. తాబేలు తన అంగాలను ముడుచుకొన్నట్లు తన లోపాలను దాచుకొనగలగాలి. **కొంగలా అర్థచింతన చేయగలగాలి. సింహంలా పరాక్రమించగలగాలి. తోడేలు వలె ఆక్రమించగలగాలి. బాణంలా శత్రువుపై పడాలి. పానం, జూదం, స్త్రీ, వేట, సంగీత గోష్ఠి - వీటిని తగిన స్థాయిలోనే సేవించాలి. వీటిపై తీవ్రాసక్తి అనర్థహేతువు.** రాజు వెదురుతో ధనుస్సును తయారుచేయించుకోవాలి. జింకలా మెలకువతోనే నిదురించాలి. గ్రుడ్డితనం అవసరమైనప్పుడు గ్రుడ్డివాడుగా నటించాలి. అవసరాన్ని బట్టి చెవిటితనాన్ని కూడా ఆశ్రయించాలి. రాజు విచక్షణ జ్ఞానంతో తగినవేళలో, తగిన తావులోనే విక్రమించాలి. దేశకాలాలు తప్పి ప్రదర్శించిన పరాక్రమం నిష్ఫలమవుతుంది. తగిన కాలమా ? కాదా ? తన బలం ప్రబలమా ? బలహీనమా ? – ఈ రీతిగా ఆలోచించి, శత్రుబలాన్ని కూడా తెలిసికొని, అప్పుడు సంధిమార్గంలోనో, యుద్ధ మార్గంలోనో తనను తాను నియోగించుకోవాలి. దండోపాయంతో లొంగదీసికొనిన శత్రువును ఆ తర్వాత కూడా రాజు నియంత్రణలో ఉంచాలి. లేకపోతే కంచర గాడిద మృత్యువు కోసమే గర్భాన్ని ధరించినట్టు తాను మృత్యువును ఆహ్వానించటమే అవుతుంది. పూత నిండుగా ఉన్నా పండ్లు ఉండకూడదు. పండ్లున్నా ఆ చెట్టు నెక్కటం అంత తేలిక కాకూడదు. కాయ పచ్చిదయినా పండులా కనిపించాలి. ఎప్పుడూ రాలిపడకూడదు. రాజు ప్రవర్తన

---

* *విశేషం కోకిల కంఠమాధుర్యానికి ప్రసిద్ధి. పంది దాడిని ఎదుర్కొనటం చాలా కష్టం. మేరువులోని గుణం ఔన్నత్యం. శూన్యగృహం చాలామందికి ఆశ్రయాన్ని ఇవ్వగలదు. నటుడు తన నటనతో ఇతరులను ఆనందింపజేయగలడు. ఆప్తమిత్రునిలో గుణం హితాన్నే కోరటం. (నీల)*

కూడా ఇలాగే ఉండాలి. రాజు తనకు లొంగిన శత్రువుల ఆశలను తీర్చటంలో పనిగట్టుకొని ఆలస్యం చేయాలి. దానికెన్నో ఆటంకాలు కల్పించాలి. ఆటంకాలకు కారణాలను చూపించాలి. ఆ కారణాలు యుక్తియుక్తంగా కనిపించాలి. **భయపడవలసిన సన్నివేశం మీదపడేదాకా భయపడుతున్నట్లుగా దానిని తప్పించే ఆలోచన చేయాలి. భయకారణం మీద పడిన తరువాత నిర్భయంగా శత్రువును దెబ్బతీయాలి.** ప్రాణసంకటా లయిన కష్టాలు వస్తే కానీ మనిషి శుభాలను పొందలేడు. ప్రాణ సంకటస్థితి వచ్చిన తర్వాత బయటపడితే శుభాలను సందర్శించగలడు. రాబోయే సంకటస్థితిని ముందే గ్రహించగలగాలి. మీద పడిన భయాన్ని అణిచివేయగలగాలి. అణిగిపోయిన భయం మరల పెరగవచ్చు. కాబట్టి అది తొలగిపోనట్లే సావధానంగా ఉండాలి.

సుఖపడే సమయం సమీపించినపుడు సుఖాన్ని పరిత్యజించటం, రాబోయే సుఖాల మీద ఆశపడటం - ఈ రెండూ బుద్ధిమంతుల నీతి కాదు. శత్రువుతో సంధి చేసికొని, విశ్వసించి, సుఖంగా నిద్రించే రాజు చెట్టుకొమ్మ చివరన పడుకొని నిద్రించినట్టే. క్రిందపడి మేల్కొనవలసివస్తుంది. మనిషి ఏదో ఒక ఉపాయంతో అది మృదువయినా సరే, దారుణమయినా సరే, ముందు తన్ను తాను ఉద్ధరించుకోవాలి. ఆ తరువాత శక్తి పుంజుకొని ధర్మబద్ధంగా ప్రవర్తించాలి. రాజు తన శత్రువుల శత్రువులను అందరినీ సేవించాలి. శత్రువులు తనపై నియోగించిన గూఢచారులను గుర్తించగల ప్రయత్నాలు కూడా చేయాలి. తన రాజ్యంలోనూ, శత్రురాజ్యంలోనూ తాను నియోగించిన గూఢచారులను గురించి ఎవ్వరికీ తెలియ నివ్వరాదు. నాస్తికవేషధారులు, తాపసులు మొదలగువారిని పరరాజ్యంలో గూఢచారులుగా నియోగించాలి. ఆ గూఢచారులు ఉద్యానవనాలలో, విహార స్థలాలలో, చలివేంద్రాలలో, ధర్మశాలలలో, మద్యశాలలలో, నగర ప్రవేశద్వారాలలో, తీర్థాలలో, సభలలో సంచరించాలి. కపటంగా ధర్మాచరణ చేసేవారు, పాపాత్ములు, దొంగలు, లోకకంటకులు వేషాలు మార్చుకొని తిరుగుతుంటారు. వారిని గుర్తించి బంధించాలి లేదా, వారిని వారి ప్రవృత్తి నుండి మరలించాలి. **నమ్మదగనివారిని నమ్మరాదు. నమ్మదగిన వానిని కూడా మరీ నమ్మరాదు. నమ్మకం వలన భయం కలుగుతుంది. కాబట్టి పరీక్షించకుండా ఎవ్వరినీ నమ్మకూడదు.** ఏదైనా వాస్తవికమయిన కారణంతో శత్రువును నమ్మించాలి. ఆ తర్వాత అతని అడుగులు తడబడినవేళ బలహీనతను గుర్తించి, అదను చూసి, దెబ్బతీయాలి. అనుమానింపదగని వానిని కూడా అనుమానించాలి. వారిపట్ల జాగరూకుడై ఉండాలి. అనుమానించిన వానివలన ఏ భయ మయినా కలుగవచ్చు. సావధానంగా ఉండాలి. అనుమానింపదగని వారి వలన కలిగే భయం సమూలంగా

AC No 96365

నాశనం చేస్తుంది. అవధానంతో, మౌనంతో, కాషాయవస్త్రాలతో, జటాజినాలతో శత్రువును నమ్మించి, సమయం చూసి, తోడేలువలె ఆక్రమించాలి. ఐశ్వర్యాన్ని కోరే రాజు తన అర్థప్రాప్తికి అడ్డుతగిలితే కొడుకునయినా, సోదరుని అయినా, తండ్రినయినా, మిత్రుని అయినా సరే చంపివేయాలి. అహంకరించి, కర్తవ్యాకర్తవ్యాలను తెలియక, దారి తప్పి ప్రవర్తిస్తే గురువు నయినా సరే దండించవలసినదే. దండనయే వారిని దారికి తెస్తుంది. శత్రువు సమీపించినపుడు లేచి, ఎదురేగి, స్వాగతం పలికి, నమస్కరించాలి. ఏదైనా కానుక ఇవ్వాలి. ఈ రీతిగా అతనిని వశపరచుకొని, ఆ తర్వాత తీక్ష్ణమైన చంచూపుటాలతో పక్షి చెట్టు మీది పూలనూ, పండ్లనూ వేరువేరుగా రాల్చి వేసినట్లు శత్రువును విడివిడిగా చీల్చిచెండాడాలి.

రాజు మత్స్యకారునివలె ఇతరుల మర్మాలను ఛేదించకుంటే, ఎటువంటి దారుణ కృత్యాలనూ చేయకుంటే, ఎందరి ప్రాణాలనో తీయకుంటే గొప్ప సంపదను పొందలేడు. **పుట్టుకతో ఎవ్వడూ శత్రువు కాదు. ఎవ్వడూ మిత్రుడూ కాదు. సామర్థ్యవినియోగాన్ని బట్టియే మిత్రులయినా, శత్రువు లయినా ఏర్పడుతారు.** దీనంగా బ్రతిమిలాడినా కూడా శత్రువును విడువదగదు, గతంలో తనకు అపకారం చేసిన వానిని చంపితీర వలసినదే కాని అక్కడ జాలి చూపదగదు. ఐశ్వర్య కాంక్ష గలరాజు దోషదృష్టిని వీడి అందరినీ కలుపుకొని పోతూ, వారిపై అనుగ్రహాన్ని ప్రదర్శిస్తుండాలి. ప్రయత్న పూర్వకంగా శత్రువులను నిరోధించాలి. దెబ్బతీయబోయేటప్పుడు కూడా ప్రియంగానే మాటాడాలి. దెబ్బ తీసిన తరువాత కూడా ప్రియంగానే మాటాడాలి. కత్తితో శత్రువుతల నరికి కూడా అతనికై దుఃఖించాలి, విలపించాలి. ఐశ్వర్య కాంక్షి అయిన రాజు మంచిమాటలతో, సత్కారాలతో, సహనంతో ఇతరులను తన దగ్గరకు రప్పించుకోవాలి. అదే లోకారాధనం. కాబట్టి ఆ పని తప్పక చేయాలి. **శుష్కవైరం పెట్టుకొనదగదు. బాహువులతో నదిని దాటరాదు. అది నిరర్థకమూ, ఆయుర్వినాశమూ అయిన పని. కుక్క ఎద్దు కొమ్మును తినటం వంటిది. దంతాలకు శ్రమయే కాని రసాస్వాదన ముండదు.** ధర్మార్థకామ సేవనలో మూడు బాధలూ, మూడుఫలాలూ ఉంటాయి. లోభం, మూర్ఖత్వం, దౌర్బల్యం బాధలు. శాంతి, సత్కర్మ, ఉపభోగమూ. ఫలాలు. ఈ ఫలాలు మంచివి. ఆ బాధలు ప్రయత్నపూర్వకంగా పోగొట్టుకొనవలసినవి. **ఋణశేషమూ, అగ్నిశేషమూ, శత్రుశేషమూ మరల మరల పెరుగుతూనే ఉంటాయి. కాబట్టి ఈ మూడింటి విషయంలో శేష ముంచరాదు. పెరుగుతున్న అప్పు, అవమానానికి గురిఅయిన శత్రువులు, ఉపేక్షింపబడిన వ్యాధులు - మిగిలిఉంటే తీవ్రభయాన్ని కలిగిస్తాయి.**

ఏ పనిని అయినా సరిగా ముగించకుండా విడిచిపెట్టరాదు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. శరీరంలో గ్రుచ్చుకొన్న ముల్లును సరిగా/పూర్తిగా వెలికి తీయకపోతే చాలాకాలం వికారాన్ని కలిగిస్తుంది. మనుష్యులను చంపటం ద్వారా, దారులను పాడు చేయటం ద్వారా, ఇళ్ళను కూల్చివేయటం ద్వారా శత్రురాజ్యాన్ని నాశనం చేయాలి. **రాజు గ్రద్దలా చూడగలుగుతూ, కొంగలా లక్ష్యంపై దృష్టిపెడుతూ, కుక్కలా మెలకువతో ఉంటూ, సింహంలా విక్రమిస్తూ, కాకివలె ఎప్పుడూ అనుమానిస్తూ, అనుద్విగ్నుడై ఇతరుల బిలాలలో అదనుచూసి ప్రవేశించే పాములా శత్రువుల నాక్రమించాలి.**

తనను మించిన శూరుని చేతులు జోడించి, పిరికివానిని బెదిరించి, లోభిని ధనాదులను దానంచేసి, లోబరచుకోవాలి. సమానునితోనే యుద్ధం చేయాలి. ఇతరుల శ్రేణుల ప్రధానులలో భేదాన్ని కల్గించే సమయంలోనూ, తన కిష్టులయిన వారిలో అనునయాలతో ఇతరులు భేదం కలిగించే అవకాశమున్న వేళలోనూ, అంతటా భేదనీతి, కూటమి కట్టుట జరుగుతున్నప్పుడు రాజు తన అమాత్యులను జాగరూకతతో రక్షించుకోవాలి.* రాజు ఎప్పుడూ మృదువుగా ప్రవర్తిస్తే అవహేళన చేస్తారు. తీక్ష్ణంగా ఉంటే ఉద్విగ్నులై దూరమవుతారు. కాబట్టి కఠినంగా ఉండవలసినప్పుడు కఠినంగానూ, మృదువుగా ఉండవలసినప్పుడు మృదువుగానే ఉండాలి. **కోమలత్వంతో కోమలుడైన శత్రువును చంపవచ్చు. కోమలత్వంతోనే దారుణమైన శత్రువునూ చంపవచ్చు. కోమలత్వంతో సాధించలేనిది లేదు. అందువలన మార్దవమే కాఠిన్యాన్ని మించిన కాఠిన్యం.** మృదువుగా ఉండవలసినప్పుడు మృదువుగానూ, కఠినంగా వ్యవహరించలసినప్పుడు కఠినంగానూ ప్రవర్తించిన రాజు తన కార్యాలను సిద్ధింపజేసికొనటమే కాక శత్రువులపై పై చేయిగా ఉంటాడు. **పండితునితో విరోధాన్ని తెచ్చికొని "నేను దూరంగా ఉన్నానులే" అని నిశ్చింతగా ఉండకూడదు. బుద్ధిమంతుని బాహువులు చాలా పొడవైనవి. దూరంగా నిలిచియే తనను హింసించిన వానిని ఆ చేతులతో పండితుడు హింసించగలడు.** దాటలేని నదిని దాటే ప్రయత్నం చేయగూడదు. ఇతరులు తిరిగి అపహరింపగల దానిని అపహరింపదగదు. సమూలంగా పెకలింపలేని దానిని పెకలించే ప్రయత్నం తగదు. తలను ఖండించే అవకాశమివ్వని వీరుని దెబ్బకొట్టగూడదు. ఇప్పుడు చెప్పిన ఈ వ్యవహారశైలి పాపంతో కూడినది. సమర్థ డెవ్వడూ దీనిని పాటించరాదు. అయితే శత్రువు తనతో ఈ రీతిగా ప్రవర్తించినప్పుడు ప్రతీకారానికై దీనిని గూర్చి

* *వివిధ జాతులవారు వీదో కార్యసాధనకై ఒక్కటైతే ఆ కూటమికి శ్రేణి అని వ్యవహారం. (నీల)*

ఆలోచించవచ్చు. అందుకే నీ హితం కోరి నీకిది చెప్పాను. తనమేలు కోరుతూ భారద్వాజ కణికుడు చెప్పిన ఈ మాటలను విని సౌవీరదేశ నరపాలుడు వాటిని తగిన రీతిగా పాటించి, అదీనచేతస్కుడై సబాంధవంగా సముజ్జ్వల రాజ్యసంపదను అనుభవించాడు.

141. విశ్వామిత్ర శ్వపచసంవాదము.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'రాజా ! లోకంలో అందరూ ధర్మాన్ని అతిక్రమిస్తున్నారు. ఉన్నతధర్మం క్షీణిస్తోంది. అధర్మం ధర్మమవుతోంది. ధర్మం అధర్మమవుతోంది. అన్నింటి హద్దులూ చెరిగిపోతున్నాయి. ధర్మ నిర్ణయం నలిగిపోతోంది. శత్రువులే కాక పాలకులు కూడా ప్రజలను వీడిస్తున్నారు. ఆశ్రమాలన్నీ కర్తవ్యాన్ని తెలియలేకున్నాయి. కర్మలు నశిస్తున్నాయి. కామలోభ మోహాలవలన అందరిలోనూ భయం కనిపిస్తోంది. ఎవరికీ ఎవ్వరి మీదా నమ్మకం లేదు. అందరికీ నిత్యమూ భయమే. లోకులు కపటంగా ఒకరినొకరు మోసగించి చంపుకొంటున్నారు. దేశమంతా మండుతోంది. బ్రాహ్మణులు పీడింపబడుతున్నారు. వానలులేవు. ఒకరంటే ఒకరికి పడదు. లోకంలో జీవించే సాధనాలన్నీ దొంగ వ్యవహారాలుగా తయారయ్యాయి. ఇటువంటి అధమకాలంలో బ్రాహ్మణుడు ఏ మార్గంలో జీవించాలి ? నరాధిపా ! పితామహా ! ఈ స్థితిలో బ్రాహ్మణుడు పుత్రపౌత్రులపై జాలితో వారిని వీడటానికి సిద్ధపడకపోతే బ్రతికే దెలా ? ఈ విషయాన్ని నాకు చెప్పండి. పరంతపా ! లోకం కలుషితమయినప్పుడు రాజు ఎలా జీవించాలి ? ఏ రీతిగా ధర్మార్థాలనుండి జారకుండా నిలువగలడు ?' భీష్ముడిలా చెప్తున్నాడు. 'మహాబాహూ ! యోగమూ, క్షేమమూ, సువృష్టి, ప్రజలలో వ్యాపించే వ్యాధులు, మరణమూ, భయమూ – ఇవన్నీ రాజును బట్టి జరుగుతుంటాయి. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం – ఇవన్నీ రాజునుబట్టియే జరుగుతాయని నా అభిప్రాయం. ఈ విషయంలో సందేహం లేదు. ప్రజలను ఇబ్బందిపెట్టే అటువంటి కాలం ఏర్పడినపుడు బ్రాహ్మణుడు విజ్ఞానబలాన్ని ఆశ్రయించి, జీవించాలి. ఈ విషయంలో కూడా చండాలుని ఇంట విశ్వామిత్ర చండాలురమధ్య జరిగిన సంవాదాన్ని ప్రాచీనేతిహాసంగా ఉదాహరిస్తుంటారు.

త్రేతాద్వాపరయుగాల సంధికాలంలో లోకంలో దైవికంగా ఘోరమయిన అనావృష్టి కలిగింది. అది పండ్రెండు సంవత్సరాల దాకా ఉంది. త్రేతాయుగం దాదాపు ముగిసిపోయి ద్వాపరయుగం ప్రారంభమయ్యే సమయంలో జనసంఖ్య పెరిగిపోయింది. వర్షాభావంవలన అది వారికి ప్రళయం వచ్చినట్టే అనిపించింది. ఇంద్రుడు వానలు కురిపించలేదు. గురువు వక్రించాడు. చంద్రుడు వికృతరూపుడై దక్షిణమార్గాన సంచరించసాగాడు. ఆ సమయంలో

అక్కడ పొగమంచు కూడా లేదు. ఇక మేఘాలు ఎక్కడనుండి వస్తాయి ? నదులలో ప్రవాహం మందగించింది. కొన్ని నదులు కనిపించకుండా పోయాయి. సరస్సులు, నదులు, బావులు, సెలయేళ్ళు - అన్నీ దైవికంగా, స్వాభావికంగా కూడా శోభను కోల్పోయి అదృశ్యమయ్యాయి. చిన్న చిన్న జలాశయాలు పూర్తిగా ఎండిపోయాయి. చలివేంద్రాలు మూతబడ్డాయి. యజ్ఞ స్వాధ్యాయాలు లోపించాయి. వషట్కారాలు, కళ్యాణోత్సవాలు అసలు లేవు. వ్యవసాయం, గోరక్షణం పాడయి పోయాయి. బజారులు, అంగళ్ళు మూతబడ్డాయి. యూపాలు, యాగసంభారాలు ముగిశాయి. గొప్ప గొప్ప ఉత్సవాలు నశించిపోయాయి. అంతటా ఎముకల ప్రోవులు. అంతటా ప్రాణుల ఆర్తనాదాలు. నగరాలలో చాలా భాగం శూన్యమయినది. ఇళ్ళూ, గ్రామాలు తగలబడిపోయాయి. కొన్ని చోట్ల దొంగలభయం, కొన్ని తావుల శస్త్రాస్త్రాల భయం. కొన్ని చోట్ల రాజభయం. కొన్ని చోట్ల ఆకలిభయం. కొన్నిచోట్ల ఒకరిని చూసి ఒకరికి భయం. ఈ కారణాలవల్ల నేలపై చాలా భాగం జనహీన మయింది. దేవాలయాలూ, మఠాలు, మందిరాలవంటి సంస్థానాలూ తొలగిపోయాయి. వృద్ధులు, బాలురు చనిపోతున్నారు. గోవులు, మేకలు, గొర్రెలు, గేదెలు లేకుండాపోయాయి. ప్రజలు ఒకరినొకరు కొట్టుకొంటున్నారు. బ్రాహ్మణులు నశించారు. రక్షకులు కూడా నశించారు. ఓషధిసమూహాలు నశించాయి. భూమండలమంతా సర్వప్రాణుల ఆర్తనాదాలతో నిండిపోయింది. యుధిష్ఠిరా ! అటువంటి భయానకకాలంలో ధర్మం నశించింది. ఆకలిబాధతో మనుషులు ఒకరినొకరు తినసాగారు. ఋషులు నియమాలను వీడి, అగ్నిదేవతను వీడి, ఆశ్రమాలను వదలి ఎటుబడితే అటు పారిపోయారు. ఆ సమయంలో ధీమంతుడూ, పూజ్యుడూ అయిన విశ్వామిత్రమహర్షి ఆకలిబారిన పడి అన్నివైపులా పరువెత్తసాగాడు. భార్యనూ, పిల్లలను ఎక్కడో ప్రజల మధ్య వదలి పెట్టి, అగ్నినీ, ఆశ్రమాన్ని కూడా వీడి తినదగినవి, తినదగనివి అనే భేదాన్ని కూడా విస్మరించి తిరుగసాగాడు.

ఒకనాడు ఆ విశ్వామిత్రుడు ఒకొనొక అడవిలో ప్రాణులను వధించి, హింసించే చండాలుర వాటికను చేరాడు. ఆ ఇంటిలో పగిలిపోయిన కుండలు అంతటా పడి ఉన్నాయి. కుక్కల మాంసాన్ని ఒలిచే పనిముట్లు అక్కడున్నాయి. పందులు, గాడిదల ఎముకల ముక్కలు, కుండపెంకులు, కుండలు చెల్లాచెదరుగా కనిపిస్తున్నాయి. శవాల గుడ్డపీలికలు ఇళ్ళలో వ్రేలాడుతున్నాయి. శవాల నిర్మాల్యం (పూలమాలల) తో ఇళ్ళు అలంకరింపబడి ఉన్నాయి. పాము కుబుసాల మాలలు అక్కడి ఇళ్ళకూ, మరాలకూ గుర్తులుగా ఉన్నాయి. కోడికూతలు అక్కడ బాగా వినిపిస్తున్నాయి. గాడిదల అరుపులు

అక్కడ ప్రతిధ్వనిస్తున్నాయి. పెద్దగా అరుస్తూ కఠోరవాక్యాలతో వారు పరస్పరం కలహిస్తున్నారు. అక్కడ దేవాలయాలలో గుడ్లగూబల అరుపులు వినిపిస్తున్నాయి. అక్కడి ఇళ్ళు లోహపు ఘంటలతో అలంకరింపబడి ఉన్నాయి. కుక్కల గుంపులు ఇళ్ళ చుట్టూ తిరుగుతున్నాయి. ఆకలిగొన్న ఆ మహర్షి విశ్వామిత్రుడు ఆ పల్లెలోనికి ప్రవేశించి, ఆహారంకోసం తీవ్రప్రయత్నంతో అన్వేషణ మొదలుపెట్టాడు. విశ్వామిత్రుడు అక్కడ ఇంటింటా యాచించినా కూడా మాంసం కానీ, అన్నం కానీ, పండు కానీ, దుంపకానీ, మరేదయినా కానీ ఎక్కడా దొరకలేదు. "అయ్యో ! నా కెంత కష్టంవచ్చింది" అనుకొంటూ విశ్వామిత్రుడు బలహీనత వల్ల ఆ చండాలవాటికలో నేలమీద పడిపోయాడు. రాజశ్రేష్ఠా ! "ఇప్పుడు నేనేం చేస్తే బాగుంటుంది ? తిండి లేక చావకుండా తప్పించుకొనే మార్గమేది ?" అని ఆ విశ్వామిత్ర మహర్షి ఆలోచించసాగాడు. రాజా ! ఆ సమయంలోనే చండాలుని ఇంటిలో అప్పుడే కత్తితో నరకబడిన ఒక కుక్కతొడమాంసపు ముక్కను ఆ విశ్వామిత్రుడు చూశాడు. అది పెద్ద ముక్క. అప్పుడిలా ఆలోచించాడు విశ్వామిత్రుడు. 'నేనిక్కడ దొంగతనం చేయాలి. ప్రాణాలను రక్షించుకొనేందుకు ఇప్పుడు మరో ఉపాయం లేదు. ఆపదలలో బ్రాహ్మణునకు ప్రాణరక్షణకై తనకన్న గొప్పవారి దగ్గరయినా, సాటివారిలోనయినా, హీనులదగ్గరయినా దొంగతనం చేయటం శాస్త్రీయమయిన నిర్ణయమే. ముందుగా హీనుల ఇంట ఆహారాన్ని దొంగిలించే ప్రయత్నం చేయాలి. దొరకకపోతే సమానుని ఇంట. అక్కడా ఏమీ లభించకపోతే తనకన్న విశిష్టుడైన ధార్మికుని ఇంట పదార్థాలు దొంగిలించాలి. కాబట్టి నేను ఈ చండాలుని ఇంటినుండి కుక్క తొడమాంసపు ముక్కను అపహరిస్తాను. యాచించటం కన్న దొంగతనం చేయటం పెద్ద తప్పు అనిపించటం లేదు. అందువలన దొంగతనమే చేస్తాను.' భారతా ! ఆ రీతిగా నిర్ణయించుకొని విశ్వామిత్ర మహర్షి చండాలుని ఇంటి సమీపంలో నిదురించాడు. అర్ధరాత్రి అయింది. చాండాలవాటిక నిదురించింది. అప్పుడు విశ్వామిత్రుడు మెల్లగా లేచి చండాలుని ఇంటిలో ప్రవేశించాడు. చండాలుడు నిదురించినట్లున్నాడు. పుసికట్టిన కళ్ళు మూతబడినట్లున్నాయి. కానీ అతడు మేలుకొనియే ఉన్నాడు. భయంకరంగా చూడటానికి వీలు కానట్లుగా అతడు కనిపిస్తున్నాడు. మునిరాకను గమనించి కటువుగా ఇలా అన్నాడు.

"చండాలవాటిక అంతా నిదురిస్తోంది. ఎవడిప్పుడు కుక్కతొడను దొంగిలిస్తున్నాడు ? నేను మేలుకొనే ఉన్నాను. నిదుర పోలేదు. దారుణంగా చస్తావు". దానితో విశ్వామిత్రుడు భయపడి, సిగ్గుతో, తలదించుకొని, తాను హీనకర్మను తలపెట్టినందులకు ఉద్వేగపడుతూ వెంటనే చండాలునితో ఇలా అన్నాడు. 'చిరంజీవీ !

నేను విశ్వామిత్రుడను. ఆకలిగొని వచ్చాను. సద్బుద్ధి ! సరిగా అర్థంచేసికో, నన్ను చంపవద్దు.' మహానుభావుడయిన విశ్వామిత్రమహర్షి మాటలు విని, చండాలుడు కంగారు పడి, తన పక్కమీదనుండి లేచి, విశ్వామిత్రుని దగ్గరకు వెళ్ళాడు. ఆ చండాలుడు విశ్వామిత్రుని మీది గౌరవంతో చేతులు జోడించి, కళ్ళు చెమర్చగా "బ్రాహ్మణా ! ఇంతరాత్రి వేళ ఏ పనిమీద వచ్చారు?" అని విశ్వామిత్రుని అడిగాడు. విశ్వామిత్రుడు చండాలుని అనునయిస్తూ ఇలా పలికాడు. "నేను ఆకలితో ఉన్నాను ప్రాణాలు పోతున్నాయి. కుక్క తొడను/ పిక్కను అపహరిస్తాను. ఆకలిబాధతో ఈ నీచకృత్యానికి దిగాను. ఆకలితీర్చుకోటానికి అన్నం వెతుక్కొనేవాడికి ఏ సిగ్గూ ఉండదు. ఆకలి నన్ను పాడుచేస్తోంది. కుక్క తొడను/ పిక్కను అపహరిస్తాను. నా ప్రాణాలు పోతున్నాయి. ఆకలితో వినికిడి శక్తి కూడా నశిస్తోంది. ఒంట్లో శక్తిలేదు. స్పృహ తప్పేటట్లుంది. తినదగినదో తినదగనిదో అన్న ఆలోచన కూడాలేదు. ఇది అధర్మమని తెలుసు. అయినా కుక్కతొడను/ పిక్కను దొంగిలిస్తాను. మీ వాడ అంతా తిరిగి యాచించినా భిక్ష దొరకలేదు. అప్పుడు దొంగతనం చేయాలన్న పాపిష్ఠిబుద్ధి కలిగింది. కుక్క తొడను/పిక్కను దొంగిలిస్తాను. అగ్ని దేవతలకు ముఖం, పురోహితుడు, పవిత్ర యాగ ద్రవ్యాలను గ్రహించేవాడు, మహాత్ముడు అయినా సరే సర్వభక్షకుడయ్యాడు. అలాగే బ్రాహ్మణుడనయినా నేను సర్వభక్షకుడ నవుతాను. కానీ ధర్మాన్ని బట్టి నేను బ్రాహ్మణుడనే." అప్పుడు చండాలుడు విశ్వామిత్రునితో ఇలా అన్నాడు. "మహర్షీ ! నా మాట విన్న తర్వాత నీ ధర్మం భంగపడని విధంగా కర్తవ్యాన్ని నిర్ణయించుకో. బ్రహ్మర్షీ ! నేను నీకు చెప్తున్న ధర్మవచనాన్ని విను. కుక్క నక్కకన్న హీనమయినదని బుద్ధిమంతులంటారు. కుక్క శరీరంలో కూడా తొడ/పిక్క భాగం అన్నింటికన్న హీనం. మహర్షీ ! నీవు చేస్తున్న పని తగనిది. చండాలుని సొమ్ము అపహరించటం, అందునా తినదగని దానిని అపహరించటం ధర్మ నిందితమయిన పని. మహామునీ ! నీ ప్రాణాలను రక్షించుకొనటానికి మరో మార్గాన్ని అన్వేషించు. మాంసలోభంతో నీ తపస్సును నశింపజేసికొనవద్దు. ధర్మం తెలిసినవాడవు. తెలిసి తెలిసీ ధర్మసంకరం చేయవద్దు. నీవు ధర్మాత్ములలో శ్రేష్ఠుడవు. ధర్మపరిత్యాగానికి పాల్పడవద్దు." 'రాజా ! చండాలుడు అలా పలుకగానే విశ్వామిత్ర మహాముని ఆకలిబాధ ననుభవిస్తూ చండాలునికి ఇలా సమాధానమిచ్చాడు.

"ఆహారం లేకుండా తిరుగూతూ ఇప్పటికే చాలా కాలం గడచిపోయింది. ప్రాణాలు నిలుపుకొనేందుకు నాకు మరే ఉపాయమూ లేదు. ఆకలితో చనిపోతూ ఉన్నవాడు ఏ ఉపాయాలతో అయినా, ఏ కర్మలతో అయినా ప్రాణాలను రక్షించుకోవాలి. సమర్థుడయ్యాక ధర్మం ఆచరించవచ్చు. క్షత్రియులకు పరిపాలన (ఇంద్రసంబంధమైనది) ధర్మం.

బ్రాహ్మణులకు అగ్నికి సంబంధించినది ధర్మం. బ్రహ్మస్వరూపమైన అగ్ని నా బలం. కాబట్టి ఆకలి తీర్చుకోటానికి అగ్నివలె నేను దేనినైనా తింటాను. బ్రతకటానికి ఏది అవసరమో ఆ పనిని సిగ్గుపడకుండా చేయవలసినదే. మరణం కన్న జీవనం మేలయినది. జీవించి ఉంటేనే ధర్మాన్ని ఆచరించటం కుదురుతుంది. అందువలన నేను జీవించగోరుతూ తినదగనిదానినైనా తినటానికి బుద్ధిపూర్వకంగానే సిద్ధమయ్యాను. నీవు ఒప్పుకోవాలి. సూర్యాది గ్రహాలు గాఢాంధకారాన్ని తరిమికొట్టినట్లు నేను కూడా తపస్సుచేతనో, విద్యచేతనో నన్ను బలవంతుని చేసికొనగలిగితే అశుభకర్మలను నశింపజేయగలను." చండాలు డిలా అన్నాడు. 'దీనిని తినటం ద్వారా నీకు దీర్ఘాయువు కలుగదు. నీ ప్రాణాలూ నిలువవు. అమృతపానంతో కలిగినట్లు తృప్తి కలుగదు. మరేదైనా భిక్షను కోరుకో. కుక్క మాంసంపై మనసు పడవద్దు. బ్రాహ్మణులు కుక్కను తినదగదు.' విశ్వామిత్రు డిలా అన్నాడు. 'ఈ దుర్భిక్షవేళలో మరోమాంసం సులభం కాదనిపిస్తోంది. చండాలా ! నా దగ్గర డబ్బులేదు. ఆకలి బాధతో ఉన్నాను నేను. గతిలేదు. నిరాశ ఏర్పడుతోంది. ఈ కుక్క మాంసమే షడ్రసభరిత మనుకొంటున్నాను.' చండాలు డిలా అన్నాడు. 'బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు పంచనఖాలు గలిగిన అయిదు జాతుల ప్రాణులనే ఆపత్కాలంలో తినవచ్చునని శాస్త్రాలు చెప్పుతున్నాయి. తినదగని దానిపై మనస్సు పెట్టవద్దు.' విశ్వామిత్రు డిలా అన్నాడు. 'ఆకలిగొన్న అగస్త్యుడు వాతాపి అనే అసురుని మాంసాన్ని భక్షించాడు. అదే రీతిగా ఆపత్కాలం కాబట్టి, ఆకలితో ఉన్నాను కాబట్టి నేను కుక్క తొడను/పిక్కను తింటాను.' చండాలు డిలా అన్నాడు. 'మరేదైనా భిక్షను తెచ్చుకో. ఇక్కడ కుక్క మాంసాన్ని స్వీకరించటం తగదు. లేదా స్వేచ్ఛగా కుక్క తొడను/పిక్కను తీసికొనిపో. కానీ ఇది మాత్రం నీకు తగనిపని.' విశ్వామిత్రు డిలా అన్నాడు. 'ధర్మాచరణకు శిష్టులే కారణం. కాబట్టి వారి ప్రవర్తననే నేనూ అనుసరిస్తాను. ఈ కుక్క తొడనే/పిక్కనే నేను పవిత్రమైన గొప్ప ఆహారంగా భావిస్తున్నాను.' చండాలు డిలా అన్నాడు. 'అసత్పురుషుడెవడో ఆచరించినది సనాతన ధర్మమైపోదు. కాబట్టి నీవు ఇక్కడ చేయరాని పని చేయవలదు. ఏదో నెపంపెట్టుకొని అశుభకృత్యానికి పాలుపడవద్దు.' విశ్వామిత్రు డిలా అన్నాడు. 'ఋషి అయినవాడెవ్వడూ పాతకాన్ని కానీ, నిందార్హమైన పనులు కానీ చేయడు. కుక్కనూ, జింకనూ నేను సమానంగానే భావిస్తాను. కాబట్టి నేను కుక్క తొడను/పిక్కను తింటాను.' చండాలు డిలా అన్నాడు. 'బ్రాహ్మణుల రక్షణకై వారి అభ్యర్థనమేరకు ఆ ఋషి ఆ స్థితిలో చేసిన అసురమాంస భక్షణ ధర్మమే. పాపం కొంచెం కూడా లేనిదే ధర్మం. గురువులయిన బ్రాహ్మణులను సర్వోపాయాలతోనూ సంరక్షించాలి.' విశ్వామిత్రు డిలా అన్నాడు. 'ఈ బ్రాహ్మణుని

శరీరం నాకు మిత్రుడు. లోకంలో అన్నిటికన్న నాకు పూజింపదగినదీ, ఇష్టమయినదీ ఇదే. ఆ శరీరాన్ని కాపాడటం కోసమే నేను ఈ మాంసాన్ని అపహరిస్తున్నాను. కాబట్టి ఈ అశుభకర్మను గురించి నేను భయపడను.'

చండాలు డిలా అన్నాడు. 'సజ్జనులు ప్రాణాలనైనా హాయిగా పరిత్యజిస్తారు కానీ తినదగని దానిని తినటానికి ఇష్టపడరు. విద్వాంసుడా ! అందువలననే వారికోరికలన్నీ తీరుతున్నాయి. కాబట్టి నీవు కూడా ఆకలితోనే, ఉపవాసం ద్వారానే నీ కోరికలను తీర్చుకో.' విశ్వామిత్రు డిలా అన్నాడు. "ఉపవాసాదులతో మరణిస్తే మరణానంతరం ఏ మవుతుందో అనుమానం. అభక్ష్యభక్షణం ద్వారా పుణ్యకర్మలు నశించటం నిస్సంశయం. అయితే శరీర ముంటుంది. అప్పుడు మరల నిత్యమూ వ్రతాలు చేసి, శమాదుల నభ్యసించి ప్రాయశ్చిత్తం చేసికోవచ్చు. ధర్మానికి మూలమయిన శరీరాన్ని రక్షించాలి కాబట్టి తినదగని దానినయినా తింటాను. బుద్ధితో ఆలోచించి అభక్ష్యభక్షణ చేస్తే ధర్మమూలమయిన ప్రాణరక్షణకై చేస్తున్నాం కాబట్టి పుణ్యకర్మయే. మోహాసక్తితో కుక్కమాంసాన్ని తింటే అది దోషమే. నేను సంశయిస్తూనే ఈ పని చేస్తున్నాను అయినా నేను నీ వలె చండాలుడను కానని విశ్వసిస్తున్నాను (దోషానికి ప్రాయశ్చిత్తం చేసికొంటాను కాబట్టి)." చండాలు డిలా అన్నాడు. 'నీవు కుక్క మాంసాన్ని తినేందుకు సిద్ధపడటం దుఃఖింపదగిన విషయం. దానినుండి నిన్ను రక్షించాలి. నేను బ్రాహ్మణేతరుడనై కూడా పదే పదే నేను సలహాల నివ్వబూనటం పాపకృత్యమే.' విశ్వామిత్రు డిలా అన్నాడు. 'కప్పలు అరుస్తున్నా గోవులు చెరువులో నీరు త్రాగుతూనే ఉంటాయి. ధర్మోపదేశం చేయటానికి నీకు అధికారం లేదు. నిన్ను నీవు ప్రశంసించుకొనే స్థితి కూడా వద్దు.'

చండాలు డిలా అన్నాడు. 'బ్రాహ్మణా ! మిత్రభావంతో నీకు సలహాలనిస్తున్నాను. నీ పై జాలి కలుగుతోంది. శ్రేయోదాయకమయిన నా మాటను వినండి. లోభంతో పాపపుపనులు చేయవద్దు.' విశ్వామిత్రు డిలా అన్నాడు. 'నీవు నాకు మిత్రుడవయితే, నీవు నా సుఖాన్ని కోరుకొంటుంటే ఈ ఆపదనుండి నన్ను ఉద్ధరించు. నా ధర్మమేమిటో నాకు తెలుసు. కుక్కతొడను/పిక్కను నాకివ్వు.' చండాలు డిలా అన్నాడు. 'ఈ అభక్ష్యపదార్థాన్ని నేను ఇవ్వలేను. అలా అని నీవు దొంగిలిస్తుంటే చూస్తూ ఉండలేను. ఇస్తున్న నాకూ, బ్రాహ్మణుడవై కూడా స్వీకరిస్తున్న నీకూ పాపం తగులుకొంటుంది. నరకానికి వెళ్ళవలసివస్తుంది.' విశ్వామిత్రు డిలా అన్నాడు. 'ఇప్పుడు నేను పాపకర్మ చేసినా ప్రాణాలు నిలిస్తే మహాపవిత్రకర్మలు ఆచరిస్తాను. దానితో పవిత్రుడనై ధర్మఫలాన్నే పొందుతాను. ఉపవాసంతో ప్రాణాలు వదలటం - జీవించి ధర్మాచరణచేయటం ఈ రెండింటిలో

ఏది మంచిదో చెప్పు.' చండాలు డిలా అన్నాడు. 'కులధర్మాలను పాటించే విషయంలో ఎవరికి వారే సాక్షి. అభక్ష్యభక్షణంలోని పాపమేమిటో నీకే తెలుసు. శ్వమాంసాన్ని భక్షణీయంగా భావించి ఆదరించే వానికి ఈ లోకంలో పరిత్యజింపదగిన దేదీ ఉండదు.' విశ్వామిత్రు డిలా అన్నాడు. 'నీ దగ్గరనుండి దానం తీసికోవటం, తినదగనిదానిని తినటం రెండూ తప్పే. అయితే శాస్త్రాలలో పని మించిపోయేటప్పుడు పాటింపదగిన అపవాదవచనాలు ఎప్పుడూ ఉంటాయి. ఇక్కడ హింసాదోషం కానీ, అసత్యదోషం కానీ లేవు. అభక్ష్యభక్షణ దోషం మాత్రమే. అది స్వల్పదోషం.' చండాలు డిలా అన్నాడు. 'ఆత్మరక్షణ మన్నది ఒక్కటియే కుక్కమాంసాన్ని తినటంలో నీకు కారణమయితే వేదంతో కానీ, శిష్టాచారంతో కానీ ఇక పనిలేదు. కాబట్టి బ్రాహ్మణోత్తమా ! తినటంలోనూ, మానటం లోనూ కూడా దోషం లేదు. అయితే తినాలన్న పట్టుదలలోనే లోపముంది.' విశ్వామిత్రు డిలా అన్నాడు. 'అభక్ష్యభక్షణం వలన మహాపాతకం వస్తుందనేందుకు ప్రమాణం లేదు. సురాపానం వలన బ్రాహ్మణుడు పతితు డవుతా డని మాత్రమే శాస్త్రవచనం. వివిధ కార్యాలు నిషిద్ధాలు. వాటిలో అభక్ష్యభక్షణ మొకటి. ఆపత్కాలంలో స్వల్పపాపం చేసినంత మాత్రాన పుణ్యకర్మ నశించదు.' చండాలు డిలా అన్నాడు. 'తగని చోటకానీ, అనుచిత కర్మద్వారా కానీ, నిందితపురుషుల ద్వారా కానీ దానం తీసికోవటం పండితుల సదాచారాన్ని బాధిస్తుంది. అయితే పట్టుబట్టి కుక్కమాంసాన్ని తింటే మాత్రం దానికి తగిన దండనను కూడా సహించవలసివస్తుంది.'

భీష్ముడిలా అన్నాడు. 'ఆ రీతిగా చెప్పి మాంతగుడు విశ్వామిత్రుని నిరోధించే పనినుండి తప్పుకొన్నాడు. విశ్వామిత్రుడు కుక్క తొడను/పిక్కను తీసికోవాలనే నిర్ణయించుకొన్నాడు కాబట్టి తీసికొని వెళ్ళాడు. జీవితాన్ని నిలుపుకొనదలచిన ఆ విశ్వామిత్ర మహర్షి అప్పుడు కుక్కమాంసాన్ని తీసికొన్నాడు. తీసికొని అరణ్యంలోనికి పోయి భార్యతో కలిసి దానిని తినబోయాడు. అప్పుడు విశ్వామిత్రున కొక ఆలోచన వచ్చింది. శాస్త్రోక్తంగా ఈ కుక్కతొడను/పిక్కను ముందుగా దేవతలకు నివేదించి, ఆ తరువాత ఇష్టంగా తినాలనుకొన్నాడు. ఆ రీతిగా ఆలోచించి విశ్వామిత్రుడు వేదోక్త విధానంతో అగ్నిస్థాపన చేసి ఇంద్రుని, అగ్నిని ఉద్దేశించి స్వయంగా చరువును వండి సిద్ధం చేసికొన్నాడు. భారతా ! ఆ తరువాత దైవకర్మనూ, పిత్కకర్మనూ ప్రారంభించాడు. ఇంద్రాది దేవతలను ఆవాహన చేసి, విధిపూర్వకంగా, క్రమంగా, ఎవరిభాగాన్ని వారికి అర్పించాడు. అదే సమయంలో ఇంద్రుడు ప్రజలనందరినీ బ్రతికిస్తూ, ఓషధులను ఉద్భవింపజేస్తూ వానలు కురిపించాడు. దీర్ఘకాల తపస్సుచే పాపాలను దహింపజేసికొని విశ్వామిత్రుడు కూడా

పరమాద్భుతమైన సిద్ధిని పొందాడు. ద్విజసత్తముడైన విశ్వామిత్రుడు తన కర్మను వదిలి ఆ హవిస్సును (కుక్కమాంసాన్ని) తినకముందే దేవతలను, పితరులనూ సంతోషపెట్టాడు. ఈ రీతిగా ఇబ్బందులలో పడి, జీవితాన్ని రక్షించుకొనగోరే పండితులు దీనత్వానికి లోనుకాక, ఉపాయాలను అన్వేషించి, సర్వోపాయాల ద్వారా దైన్యం నుండి తమ్ము తాము ఉద్ధరించుకోవాలి. ఇటువంటి జ్ఞానాన్ని పొంది, ఎప్పుడూ బ్రతకటానికే ప్రయత్నం చేయాలి. బ్రతుకున్నప్పుడే మనిషికి పుణ్యప్రాప్తి శుభానుభవమూ కలుగుతాయి. కాబట్టి కౌంతేయా ! జితేంద్రియుడైన పండితుడు ధర్మాధర్మ నిర్ణయం చేయటంలో బుద్ధిని స్థిరంగా నిలుపుకొని, తదనుగుణంగా ఈ లోకంలో ప్రవర్తించాలి.'

142. ఆపత్కాల రాజధర్మ నిర్ణయము.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'ఆపత్కాలంలో మహాత్ములకు కూడా ఇటువంటి అశ్రద్దేయం, అనృతం అయిన కర్మ కర్తవ్యంగా విధింపబడితే ఇక దొంగలకు హద్దులేమిటి ? వాటిని నేను పరిహరించాలి గదా ! ఈ కథను విన్న తరువాత నాకు మోహం, విచారం కలుగుతున్నాయి. ధర్మోత్సాహం శిథిలమవుతోంది. నన్ను నేను ఎంత సమాధాన పరచుకొన్నా ప్రయత్నశీలతను పొందలేకున్నాను.'

భీష్ముడిలా చెప్తున్నాడు. 'నేను నీకు వినిపిస్తున్న ధర్మానుశాసనం కేవలం శాస్త్రాలలో విన్నది మాత్రమే కాదు. తేనెటీగలు తేనెను సమకూర్చినట్టు కవులు బహువిధవిచారధారలతో కూర్చిపెట్టినది. **రాజు అక్కడక్కడనుండి రకరకాల మనుష్యుల నుండి రకరకాల ఆలోచనలను అభ్యసించాలి. ధర్మంలోని ఏదో ఒక శాఖను పట్టుకొని ఉండరాదు. ఆపత్కాలంలో ఈ ఆలోచనలు ఆత్మరక్షకు దారి చూపుతాయి. కౌరవ్యా ! ధర్మమూ, శిష్టాచారమూ ఎప్పుడూ బుద్ధి నుండి పుట్టినవే. బుద్ధి ద్వారా తెలిసికొనవలసినవే. ఈ నా మాటను బాగా గ్రహించు.** ధీమంతులు, విజయాభిలాషులు అయిన రాజులు ధర్మాన్ని పాటిస్తారు. కాబట్టి రాజు నానాప్రాంతాలనుండి బుద్ధిద్వారా విషయజ్ఞానాన్ని పొంది, ధర్మాన్ని చక్కగా ఆచరించాలి. ధర్మంలోని ఏదో ఒక భాగంతో రాజునకు ధర్మనిర్వహణ కుదరదు. అధ్యయన కాలంలోనే పూర్ణప్రజ్ఞను పొందాలి. అప్పుడు పొందలేక రాజు దుర్బలు డయితే ఆ తరువాత ఎలా లభిస్తుంది ? **భారతా ! బుద్ధిద్వైధాన్ని (ఒకే పనిని ఒకమారు ధర్మంగా మరొక సారి అధర్మంగా స్వీకరించటం) ముందుగానే తెలిసికోవాలి. అది తెలియని వాడు ద్వైధమార్గంలో సంశయాలలో పడిపోతాడు.** చర్చల వేళలో ప్రాజ్ఞుడు తన ప్రత్యేక కార్యాన్ని రహస్యంగా

ఉంచి చర్చించాలి. నిర్ణయమైన తర్వాత దానిని బయట పెట్టాలి. లేకపోతే జనులు తాను పాటించే ధర్మాన్ని మరోరీతిగా భావిస్తారు. కొందరు నిజంగా జ్ఞానులు. కొందరు మిథ్యా జ్ఞానులు. వారి స్వరూపాన్ని యథాతథంగా తెలిసికొని యథార్థజ్ఞానుల నుండియే జ్ఞానాన్ని స్వీకరించాలి. ధర్మద్రోహులయిన మనుషులు శాస్త్రాల ప్రామాణికతను దెబ్బతీస్తారు. వారు అర్థజ్ఞానశూన్యులు కాబట్టి అర్థశాస్త్రం విషమ మని ప్రచారం చేస్తుంటారు. రాజా ! జీవికకోసం విద్యాధ్యయనం చేసి, అంతటా కీర్తికోసమో, అర్థంకోసమో ప్రాకులాడే వారు పాపాత్ములూ, ధర్మద్రోహులూ. అపరిపక్వబుద్ధు లయిన మూఢమానవులు తత్త్వాన్ని గ్రహించలేరు. శాస్త్రజ్ఞానహీనులై అంతటా సరిపోలని యుక్తులపై ఆధారపడి వ్యవహరిస్తుంటారు. ఎప్పుడూ శాస్త్రాలలోని దోషాలనే చూసేవారు వాటి మర్యాదను భంగపరుస్తారు. అర్థశాస్త్రజ్ఞానం సరిగా కుదరని దని వారంటుంటారు. మాటనే అస్త్రాలుగా, బాణాలుగా చేసికొని వారు పరవిద్యలను నిందించి, స్వవిద్యను గొప్పగా ప్రచారం చేసికొంటుంటారు. వారు విద్యాఫల మయిన తత్త్వజ్ఞానానికి కూడా ద్రోహం చేసినట్లే. అటువంటివారు విద్యావ్యాపారవేత్తలు. రాక్షసులవలె పరద్రోహం చేసేవారు. వారి నడవడికారణంగా సజ్జనులు ప్రతిపాదించి, ఆచరించే ధర్మం నశిస్తుంది. **కేవలం తార్కికబుద్ధితో లేదా కేవలం శాస్త్రవచనాలతో ధర్మ నిర్ణయం కుదరదు. రెండింటి సహకారంతోనే ధర్మాన్ని నిశ్చయించాలి. అని బృహస్పతిమతం. స్వయంగా ఇంద్రుడే దానిని చెప్పాడు.** పండితులు నిష్కారణంగా ఏమాటనూ చెప్పరు. అయితే కొందరు ఎందరో అభ్యసించి, పాటిస్తున్న శాస్త్రవచనం ప్రకారం ప్రవర్తించటానికి ఇష్టపడరు.

శిష్టాచారాన్నే ధర్మంగా బుద్ధిమంతులు చెపుతుంటారు. అయితే పండితుడు సజ్జనులకై శాస్త్రం విధించిన ధర్మాన్ని స్వయంగానే ఊహించుకొనవచ్చు. బుద్ధిమంతుడైనా అమర్షతో కానీ, శాస్త్ర వ్యామోహంతో కానీ, అవగాహనా రాహిత్యంతో కానీ శాస్త్రప్రవచనం చేస్తే జనసమూహంపై దాని ప్రభావ ముండదు. **వేదశాస్త్రాలు అంగీకరించిన, తర్కసహమయిన బుద్ధితో ప్రవచిస్తే దాని ద్వారా శాస్త్రం ప్రశంసింపబడుతుంది. అయితే కొందరు అజ్ఞానంవలన జ్ఞానప్రాప్తికి తార్కిక మార్గమే మంచిదని భావిస్తారు.** కొందరు తార్కికదృష్టితో " ఈ యుక్తితో ఈ శాస్త్రం ఖండింపబడుతోంది కాబట్టి శాస్త్రం వ్యర్థం " అంటారు. అది కూడా అజ్ఞానమే. సంశయచ్ఛేదక మయిన ఈ మాటను గతంలో శుక్రాచార్యుడే రాక్షసులకు చెప్పాడు. సంశయాత్మకమైన జ్ఞానం ఉన్నా లేకున్నా ఒకటే. కాబట్టి సంశయాన్ని మొదలంటా పీకి, దూరంగా నెట్టివేయాలి. నీవు నీతియుక్తమయిన నా వాక్యాన్ని అంగీకరించక పోవచ్చు. కానీ అది తగినది కాదు.

ఎందుకంటే నీవు ఉగ్రకర్మకోసమే సృష్టింపబడ్డావు. కాబట్టి నా మాటలపై నీ దృష్టి నిలువదు. ఔరా ! నన్ను చూడు. రాజ్యాభిలాషగల రాజులందరకూ నేను సంసారబంధాలనుండి విముక్తి కల్గించాను. కానీ ఇతరులు నా పనిని అంగీకరించటంలేదు. మేక, గుర్రం, క్షత్రియుడు - ఈ ముగ్గురినీ బ్రహ్మ ఒకే దృష్టితో సృష్టించాడు. వీరి ద్వారా ప్రాణులకు ఎప్పటి కప్పుడు ఏదో ఒక జీవయాత్ర సిద్ధిస్తూనే ఉంటుంది. చంపదగని వానిని చంపటం, ఎంత తప్పో చంపదగిన వానిని చంపక పోవటం కూడా అంతే తప్పు. ఆ దోషమే చంపకుండటానికి హద్దు. కానీ క్షత్రియుడు ఆ హద్దును విడనాడాలి. కాబట్టి కఠినంగా ఉన్న రాజు మాత్రమే ప్రజలను స్వధర్మాలలో నిలుపగలడు. లేకపోతే ప్రజలు తోడేళ్ళవలె ఒకరినొకరు తింటూ స్వేచ్ఛగా తిరుగుతారు. ఏ రాజు రాజ్యంలో కొంగలు నీటినుండి చేపలను పట్టినట్టు దొంగలు పరుల సొమ్మును అపహరిస్తూ తిరుగుతారో, ఆ రాజు క్షత్రియవంశానికి కలంకం వంటివాడే. రాజా ! ఉన్నతవంశస్థులను, వేదవిద్యావిశారదులను మంత్రులుగా చేసికొని ప్రజలను ధర్మబద్ధంగా పరిపాలిస్తూ భూమినేలుకో ! సత్కర్మహీనుడై, న్యాయరహితుడై, ఉపాయమెరుగని మనిషిని అమాత్యుని చేసినరాజు నపుంసకక్షత్రియుడి క్రింద లెక్క. కేవలం తీక్ష్ణత కానీ, కేవలం మార్దవం కానీ రాజనీతి మేరకు ప్రశంసకు నోచుకోవు. రెండింటినీ అతిక్రమించగూడదు. ఉగ్రంగా ఉంటూనే మృదువుగా ఉండాలి. క్షత్రియధర్మం కష్టసాధ్యం. నీపై నాకు స్నేహ భావమున్నది కాబట్టి చెప్తున్నాను. ఉగ్రకర్మకై సృష్టించబడ్డావు కాబట్టి రాజ్యాన్ని ఏలుకో. భరతర్షభా ! ఆపదవేళలో ఎప్పుడూ చెడ్డవారిని నియంత్రించటం, మంచివారిని రక్షించటం కర్తవ్యం కావాలి. ధీమంతుడైన శుక్రుడు ఇది చెప్పాడు.'

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'సజ్జనశ్రేష్ఠా ! పితామహా ! ఇతరులు ఎవ్వరూ అతిక్రమించలేని హద్దు లోకంలో ఏదయినా ఉన్నదా ? ఉంటే నాకు చెప్పు ! అడుగుతున్నాను.' భీష్ముడిలా చెప్తున్నాడు. 'విద్యావృద్ధులూ, తపస్సంపన్నులూ అయి శాస్త్రజ్ఞానం, ఉత్తమ ప్రవర్తన, సదాచారం గల బ్రాహ్మణులను సేవించు. ఇది ఉత్తమ పవిత్ర కార్యం. రాజా ! దేవతలపై ఎటువంటి భావముంటుందో అటువంటి భావమే బ్రాహ్మణులపై ఎప్పుడూ ఉండాలి. కోపించిన విప్రులు రకరకాల అద్భుత కర్మలు చేయగలరు. బ్రాహ్మణులు ఆనందిస్తే విస్తారయశస్సు లభిస్తుంది. కోపిస్తే తీవ్రభయం ఏర్పడుతుంది. ప్రసన్నులైన విప్రులు అమృతం వంటివారు. కోపించిన విప్రులు విషతుల్యులు.'

143. కపోతలుబ్ధక సంవాదోపక్రమము.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'సర్వశాస్త్ర విశారదా ! మహాప్రాజ్ఞా ! పితామహా ! శరణాగత రక్షకుడు పాటించ వలసిన ధర్మమేమిటో నాకు చెప్పండి.' భీష్ము డిలా చెప్తున్నాడు. 'భరతసత్తమా ! మహారాజా ! శరణాగత రక్షణం గొప్పధర్మం. ఇటువంటి ప్రశ్న నడగటానికి తగినవాడవు నీవే. రాజా ! మహానుభావులయిన శిబి మొదలగు రాజులు శరణాగతులను రక్షించి పరమసిద్ధిని పొందారు. ఒక పావురం శరణుకోరి వచ్చిన శత్రువును తగిన రీతిగా సత్కరించి, తన మాంసంతో ఆహార మందించిన కథను వింటుంటాం.' యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'భారతా ! శరణుకోరి వచ్చిన శత్రువుకు పావురం తన మాంసాన్ని ఎలా నివేదించింది ? ఎటువంటి సిద్ధిని పొందింది ?'

భీష్ము డిలా చెప్తున్నాడు. 'రాజా ! సర్వపాపవినాశకమయిన ఈ దివ్య కథను విను. ఈ కథను పరశురాముడు ముచుకుందరాజుకు వినిపించాడు. కౌంతేయా ! ఇదే విషయాన్ని గతంలో ముచుకుందనరపాలుడు పరశురామునకు నమస్కరించి, అడిగాడు. రాజా ! కపోతం సిద్ధి పొందిన ఈ కథను వినాలని ముచ్చట పడుతున్న ముచుకుందునకు పరశురాముడు ఇలా చెప్పాడు. 'మహాభుజా ! రాజా ! ఈ కథ ధర్మనిశ్చయంతో కూడినది. అర్థకామాలకు ఆలవాలమయినది. చెపుతాను. సావధానంగా విను. ఒకప్పుడు ఒక మహారణ్యంలో ఒక బోయవాడు తిరుగుతున్నాడు. అతడు నీచమయిన ప్రవర్తన కలవాడు. భీకరంగా భూలోకయము డన్నట్లు కనిపిస్తున్నాడు. కాకివలె నల్లని శరీరం. ఎఱ్ఱటికళ్ళు. యమునివంటిరూపం. పెద్ద పెద్ద పిక్కలు. చిన్న పాదాలు పెద్ద ముఖం. పెద్ద దవడలు. ఇదీ అతని రూపం. అతనికి మిత్రులెవ్వరూ లేరు. బంధువులు కానీ, సంబంధీకులు గానీ లేరు. అతని క్రూరకర్మల కారణంగా వారంతా అతనిని విడిచిపెట్టారు. పాపప్రవృత్తి గల నరుని పండితులు దూరంగా విడిచిపెట్టాలి. తనను తానే మోసం చేసికొనేవాడు ఇతరులకేం మేలు చేయగలడు ? క్రూరులై, దుర్మార్గులై, పరుల ప్రాణాలను అపహరించే నరులు సర్పాల వంటివారు. వారు సర్వప్రాణులనుండి ఉద్వేగానికి గురి అవుతారు. రాజా ! ఆ బోయవాడు నిత్యమూ వల తీసికొని, అరణ్యానికి పోయి, పక్షులను పట్టి, చంపి, వాటిని అమ్మేవాడు. ఇది నిత్యకృత్యం. ఈ రీతిగా ఆ దురాత్మునకు అదే వృత్తిలో చాలా కాలం గడచి పోయింది. కానీ అతని కెప్పుడూ అది అధర్మ మనిపించలేదు. ఎప్పుడూ భార్యతో కలిసి క్రీడిస్తూ జీవిస్తున్న ఆ బోయవాడు దైవయోగంవలన మూడు డయ్యాడు. మరే వృత్తీ అతనికి రుచించలేదు. ఆపై ఒకానొకదినాన అతడు అరణ్యంలో

ఉండగా నాల్గుదిక్కుల నుండి తుఫాను చెలరేగింది. చెట్ల నన్నింటినీ కూల్చివేయసాగింది. ఆకాశమంతా మబ్బులు క్రమ్మాయి. మెరుపు తీగెలు ఆకాశాన్ని అలంకరించాయి. నావికులతో నిండిపోయిన సాగరంలా క్షణకాలంలో జలధారా సమూహంతో కప్పబడిన ఇంద్రుడు గగన మండలంలో ప్రవేశించాడు. ముహూర్తకాలంలో నేలనంతా నీటితో నింపివేశాడు. కుండపోతగా వాన కురుస్తోంది. బోయవాడు చలితో బాధపడుతూ, దాదాపు అచేతనుడై, వ్యాకుల హృదయంతో వనమంతా తిరుగసాగాడు. ఆ బోయవానికి గుంటలు, మిట్టలు తెలియటంలేదు. వనంలో అతడు సంచరించే బాట జలప్రవాహంతో నిండి పోయింది. వర్షవేగంవలన పక్షులు మరణించి నేలగూలాయి. మృగాలు, సింహాలు, పందులు ఎక్కడో నేలను ఆశ్రయించి పడుకొన్నాయి.

వనవాసులందరూ ఆ తీవ్రమయిన గాలివానకు భయపడి, మూకుమ్మడిగా భయంతో, ఆకలితో వనమంతా తిరుగసాగారు. ఆ బోయవాడు చలికి వణుకుతున్న శరీరావయవాలతో కదలలేక పోయాడు, నిలువలేక పోయాడు. అప్పుడు చలికి వణుకుతూ నేలపై పడిఉన్న ఒక పావురాన్ని చూశాడు. తానుకూడా ఆర్తుడైనా ఆ పాపాత్ముడు ఆ పావురాన్ని చూసి బుట్టలో పడవేశాడు. తాను దుఃఖపడుతూ కూడా ఇతరులకు దుఃఖాన్నే కలిగించాడు. పాపప్రవృత్తిగల ఆ పాపాత్ముడు పాపాన్నే చేశాడు. అంతలో ఆ చెట్లసమూహంలో మేఘంలా నల్లగా ఉన్న ఒక చెట్టు అతనికి కన్పించింది. నీడనూ, నివాసాన్ని, పండ్లనూ కోరుతూ పక్షిసమూహాలెన్నో దానిని సేవిస్తుంటాయి. పరోపకారం కోసం బ్రహ్మ సృష్టించిన సాధువువలె అది కనబడుతోంది. అంతలో క్షణంలోనే ఆకాశం నిర్మలమయినది. తారకలు ప్రకాశింపసాగాయి. వికసించిన కలువలతో వెలుగొందే నిండైన జలాశయంలా ఆకాశం కన్పించింది. ప్రభూ ! ఆకాశం తారకలతో నిండి కలువలతో శోభించే సరోవరంలా నిర్మలంగా ఉంది. మబ్బు విడిచిన ఆకాశాన్ని చూసి, చలికి వణుకుతున్న ఆ బోయవాడు దిక్కులు కలయజూశాడు. గాఢాంధకారంతో నిండిన రాత్రిని గమనించి 'మా ఇల్లు ఇక్కడకు చాలా దూరంలో ఉన్న"దనుకొన్నాడు. ఆ రాత్రి ఆ చెట్టుక్రిందనే విడిది చేయదలచుకొని, చేతులు జోడించి, ఆ చెట్టుకు నమస్కరించి "ఈ చెట్టుపై నున్న దేవతలనందరనూ శరణుకోరుతున్నా"నని ఆ చెట్టుతో అన్నాడు. ఆ బోయవాడు రాతిపై తలనుంచుకొని, నేలపై ఆకులు పరచుకొని, చాలా దుఃఖపడుతూ నిద్రించాడు.'

144. భార్యా ప్రశంస.

రాజా ! ఆ చెట్టు కొమ్మపై ఒక పక్షి చాలా కాలం నుండి మిత్రులతో కలిసి నివసిస్తోంది. రంగురంగుల రెక్కలు దానికున్నాయి. దాని భార్య ప్రొద్దుటే ఆహారం కోసం వెళ్ళింది. ఇంకా తిరిగి రాలేదు. రాత్రి కావటాన్ని గమనించి ఆ పక్షి పరితపిస్తోంది. 'పెద్ద గాలివాన వచ్చింది. నా భార్య ఇంకారాలేదు. ఇంకా రాకపోవటానికి కారణమేమై ఉంటుంది ? అరణ్యంలో ఆ నాభార్య క్షేమంగానే ఉన్నది గదా ! ఆమె లేకపోతే ఈ నా ఇల్లు శూన్యమే. **పుత్రులు, మనుమలు, కోడళ్ళు, సేవకులు అంతటా నిండి ఉన్నా కూడా భార్య లేకపోతే ఆ గృహస్థుని ఇల్లు శూన్యమే. ఇల్లంటే ఇల్లు కాదు. గృహిణియే ఇల్లు. ఇల్లాలు లేని ఇల్లు అరణ్యంతో సమానమనియే లెక్క.** ఎర్రటికనుకొనలు, రంగుల రెక్కలు, మధురమైన కంఠస్వరమూ గల ఆ నా భార్య ఈ రోజు రాకపోతే నేను బ్రతికి ఏం లాభం ? అది సువ్రత. నేను తినకపోతే తినదు. నేను స్నానం చేయకపోతే స్నానం చేయదు. నేను కూర్చోకపోతే కూర్చోదు. నేను పడుకొన్నప్పుడే పడుకొంటుంది. నా ఆనందమే తన ఆనందం. నా దుఃఖం దాని దుఃఖం. నేను దూరప్రాంతానికి వెళుతుంటే దాని ముఖం దీన మవుతుంది. నేను కోపిస్తే ప్రియంగా మాటాడుతుంది. పతిగతియై, పతిప్రియహితాల యందు ఆసక్తి గలది పతివ్రత. అటువంటి భార్యను పొందిన మగవాడు ధన్యుడు. నేను అలసిపోయినా, ఆకలితో ఉన్నా అర్థం చేసికొనగలదు. ఆ తపస్విని నాపై అనురాగం, స్థిరభావం, భక్తి, స్నేహం ప్రకటించే యశస్విని. చెట్టు క్రింద అయినా సరే భార్యతో కలిసి ఉంటే అదే ఇల్లు. పెద్ద మేడయినా భార్య లేకపోతే అడవితో సమానం. తిరుగులేని భావమిది. ధర్మార్థకామాలను పాటించే వేళలో భార్య పురుషునకు సహాయిని. విదేశాలకు వెళ్ళినపుడు కూడా భార్యయే నమ్మదగిన నెచ్చెలి. పురుషునకు భార్యయే పరమార్థ మని చెప్తుంటారు. లోకంలో ఒంటరి అయిన మగవానికి లోకయాత్రలో సహకరించేది భార్యయే. మగవాడు రోగాలతో బాధపడుతున్నా, కష్టాలలో చిక్కుకొన్నా అటువంటి ఆర్తునకు భార్యవంటి ఔషధం మరొకటి లేదు. **భార్యవంటి బంధువు లేడు. భార్యవంటి మార్గం లేదు. లోకంలో ధర్మసంగ్రహంలో భార్యవంటి సహాయకుడూ లేడు.*** సాధ్వి, ప్రియభాషిణి అయిన భార్య ఇంటిలో లేకపోతే ఆ మగవాడు అరణ్యాలకు వెళ్ళాలి. ఎందుకంటే అటువంటి స్థితిలో ఇల్లయినా, అడవి అయినా ఒకటే.'

---

* నాస్తి భార్యాసమో బంధుః నాస్తి భార్యాసమా గతిః ।
నాస్తి భార్యాసమో లోకే సహాయో ధర్మసంగ్రహే ॥ 16

145. కపోత వాక్యము.

భీష్ముడిలా చెప్తున్నాడు. "ఈ రీతిగా దీనంగా విలపిస్తున్న కపోత వచనాన్ని విని బోయవానికి చిక్కి ఉన్న కపోతి ఇలా అన్నది. 'ఆహా ! నేనెంత సౌభాగ్యవతిని ! నా ప్రియ భర్త నాలో ఉన్నవో, లేవో కానీ నా గుణాలను ఈ రీతిగా కీర్తిస్తున్నాడు. తనయందు భర్త ఆనందించలేకపోతే ఆమె స్త్రీయే కాదు. స్త్రీ విషయంలో భర్త ఆనందిస్తే సర్వదేవతలూ ఆనందించినట్లే. భార్యకు భర్త అగ్నిసాక్షికంగా ఏర్పడిన దైవం. భర్త ఆనందించక పోతే ఆ స్త్రీ పుష్పగుచ్ఛాలతో పాటు దావాగ్నిలో పూర్తిగా తగులబడిన లత వలె భస్మమై పోతుంది.' దుఃఖార్తయై అలా చింతించి, బోయవానికి చిక్కి ఉన్న ఆ కపోతి దుఃఖిస్తున్న భర్తతో ఇలా అన్నది. 'ప్రియా ! నీకు శ్రేయస్కరమయిన మాట చెప్తున్నాను. విని ఆ విధంగా చేయి. ప్రత్యేకించి శరణాగత రక్షకుడవు కమ్ము. నీ నివాసం దగ్గరకు వచ్చి ఈ బోయవాడు పడిఉన్నాడు. చలితో, ఆకలితో బాధపడుతున్నాడు. అతనిని సమర్చించు. బ్రాహ్మణుని చంపినా, లోకమాత అయిన గోవును చంపినా, శరణాగతుని చంపినా ముగ్గురికీ పాపం సమానమే. జాతి ధర్మాన్ని బట్టి మనకు కాపోతీవృత్తి విధింపబడింది. నీవంటి అభిమానవంతుడు ఆ వృత్తినెప్పుడూ పాటించాలి. యథాశక్తి తన ధర్మాన్ని పాటించిన గృహస్థుడు మరణానంతరం అక్షయ లోకాలకు వెళతాడని వింటున్నాం. ద్విజా ! నీవిప్పుడు సంతానవంతుడవూ, పుత్ర వంతుడవు కూడా. కాబట్టి నీ దేహంపై జాలిని వీడి, ధర్మార్థాలను పరిగ్రహించి ఈ బోయవాని మనస్సు తృప్తి పడేటట్లు ఇతనిని సమర్చించు. పక్షీ ! నా కోసం బాధపడవద్దు. శరీరయాత్రకై మరొక భార్యను పొందవచ్చు.' అని పంజరంలో నున్న ఆ తపస్విని కపోతి ఎంతో దుఃఖంతో చెప్పి భర్తవైపు చూసింది."

146. కపోతలుబ్ధక సంవాదము.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'ఆ కపోతం ధర్మయుక్తిసమన్వితమయిన భార్య మాటను విని పరమానందాన్ని పొందింది. కంటతడి పెట్టింది. ఆ కపోతం పక్షులను పట్టి జీవించే ఆ బోయవానిని చూసి శాస్త్రోక్తకర్మతో ప్రయత్నపూర్వకంగా పూజించింది. అతనితో ఇలా అన్నది. "నీకు స్వాగతం. ఇప్పుడు నీకోసం ఏం చేయగలను ? చెప్పు. బాధపడవలసిన అవసరంలేదు. నీవు నీ ఇంటనే ఉన్నావు ? కాబట్టి వెంటనే చెప్పు. ఏం చేయమంటావు ? నీకేం కావాలి ? ప్రీతితో మాటాడుతున్నాను. నీవు మా ఇంటికి వచ్చినవాడవు.

శత్రువయినా సరే ఇంటికి వస్తే అతిథ్యమివ్వాలి. నరకటానికి వచ్చినవానికి కూడా చెట్టు నీడనిస్తుందే కానీ ముడుచుకోదు.* ఇంటికి వచ్చిన వానికి ప్రయత్నపూర్వకంగా ఆతిథ్యమివ్వాలి. పంచయజ్ఞాలకు అధికారి అయిన గృహస్థునకు అది విశేషవిధి. గృహస్థాశ్రమంలో నున్నవాడు మోహంతో పంచయజ్ఞాలను పాటించకపోతే అతనికి ధర్మానుసారంగా ఇహపరలోకాలు కలుగవు. కాబట్టి నమ్మకంతో చెప్పు. నీవు మాటమాత్రంగా చెప్పినదంతా నేను చేయగలను. మనస్సును శోకంవైపు మరల్చకు." ఆ పక్షి పలికిన ఆ మాటలు విని, బోయవాడు "చలి నన్ను బాధిస్తోంది. రక్షించే ఉపాయం చూడు" అని దానితో అన్నాడు. అతడలా అనగానే కపోతం నేలపై ఆకులను ప్రోగుచేసి, అగ్నిని తెచ్చేందుకు తన రెక్కల శక్తినంతా ఉపయోగించి వేగంగా ఎగిరింది. అది కమ్మరి ఇంటికిపోయి, నిప్పుతీసికొని, వెంటనే వచ్చింది. ఆపై ఎండుటాకులపై నిప్పునుంచి మండించింది. మంట పెద్దది చేసి శరణాగతుడైన బోయవానితో ఇలా అన్నది. "నీకు భయమేమీ లేదు. నిస్సంకోచంగా శరీరావయవాలను వెచ్చజేసుకో" పక్షి మాటలు విని, అలాగే అని, బోయవాడు శరీరావయవాలను వెచ్చజేసికొన్నాడు. వెచ్చదనం వలన అతనికి ప్రాణం లేచి వచ్చింది. అప్పుడు పక్షితో ఇలా అన్నాడు.

శాస్త్రోక్తకర్మతో సత్కారాన్ని పొందిన ఆ బోయవాడు పరమానందపడి, కంట తడిపెట్టి, ఆ పక్షిని చూసి ఇలా అన్నాడు. 'నన్ను ఆకలి పీడిస్తోంది. నీవిచ్చే ఆహారాన్ని తినగోరుతున్నాను.' అతని మాటను విని పక్షి ఇలా సమాధాన మిచ్చింది. "నా దగ్గర సంపద లేదు. ఉంటే నీ ఆకలి తీర్చేదానిని. మేము వనవాసులం. ఏ రోజు కారోజు దొరికిన దానితో జీవించే వాళ్ళం. మహర్షుల దగ్గరవలె భోజనానికై కూడ బెట్టిన దేదీ మాకు లేదు". ఆ మాట చెప్పి వెంటనే వివర్ణవదను డయ్యాడు. భరత శ్రేష్ఠా ! 'ఇప్పుడేమి చేయాలి' అని ఆలోచిస్తూ తన వృత్తిని తాను నిందించుకొన్నాడు. క్షణకాలంలో ఏదో స్ఫురించి ఆ పక్షి బోయవానితో "క్షణమాగు ! నిన్ను తృప్తి పరుస్తాను" అని బోయవానితో అన్నది. అలా అని ఎండుటాకులతో మంటను బాగా పెంచి, పరమానందంతో పక్షి ఇలా అన్నది. 'ఋషులద్వారా, దేవతలద్వారా, పితరుల ద్వారా, ఎందరో మహాత్ముల ద్వారా అతిథి పూజనమే గొప్ప ధర్మమని నేను వినియున్నాను గతంలో. సౌమ్యుడా ! అనుగ్రహించు. నేను సత్యం చెప్తున్నాను. అతిథిపూజనంలో నాది తిరుగులేని బుద్ధి.' ఆ రీతిగా ప్రతిజ్ఞచేసి,

---

* అరావప్యుచితం కార్యమ్ అతిథ్యం గృహమాగతే ।
ఛేత్తుమప్యాగతే ఛాయాం నోపసంహరతే ద్రుమః ॥ 5

ఆ పక్షి నవ్వుతూ ఆ అగ్నికి ముమ్మారు ప్రదక్షిణం చేసి, మహామతియై, అగ్నిలో ప్రవేశించింది. అగ్ని మధ్యలోనికి ప్రవేశించిన ఆ పక్షిని చూసి ఆ బోయవాడు 'నేనెంత పని చేశాను' అని మనసా ఆలోచించ సాగాడు. 'ఛీ ! నా కర్మవలననే నిందింపబడే క్రూరమైన జీవితంలో ఇంతకన్న ఘోరమయిన అధర్మం లేదు. ఎంత పాపానికి ఒడిగట్టాను. అనుమానమే లేదు.' అంటూ ఆ స్థితిలో ఉన్న పక్షిని చూసి, తన కర్మలను నిందించుకొంటూ అనేక రీతులుగా పెద్దగా విలపించాడు ఆ బోయవాడు.'

147. లుబ్ధక వైరాగ్యము.

భీష్మ డిలా చెప్తున్నాడు. "అప్పుడు ఆకలికి అలమటిస్తూ కూడా ఆ బోయవాడు నిప్పులో పడిన కపోతాన్ని చూసి, మరల ఇలా అన్నాడు. 'అయ్యో ! క్రూరుణ్ణి, బుద్ధిహీనుణ్ణి అయిన నేనెంత పాపం చేశాను ! నా బ్రతుకంతా ఇటువంటిదే. నేనెపుడూ పాపం చేస్తూనే ఉంటాను.' అతడు పదేపదే తనను నిందించుకొంటూ మరలా ఇలా అన్నాడు. నేను దుర్బుద్ధిని. నమ్మదగనివాడిని. నిత్యమూ క్రౌర్యాన్నే జీవన విధానంగా చేసికొన్నవాణ్ణి. అందువలననే, నేను శుభకర్మలను వీడి పక్షులను పట్టి, చంపి, జీవిస్తున్నాను. గొప్పమనస్సుగల ఈ పావురం తాను తగులబడుతూ తన మాంసాన్ని అర్పించి, నా క్రౌర్యానికి తగిన ప్రతీకారం చేసింది. నిస్సంశయంగా ధర్మమార్గాన్ని బోధించింది. కాబట్టి నేను భార్యనూ, బిడ్డలనూ, ప్రియమయిన ప్రాణాలనూ కూడా పరిత్యజిస్తాను. గొప్పమనస్సుగల ఈ కపోతం నాకు ధర్మోపదేశం చేసింది. నేటి నుండి భోగాలనన్నింటినీ విడనాడి వేసవిలో చిన్న సరస్సు ఎండిపోయినట్లు నా శరీరాన్ని శుష్కింపజేస్తాను. ఆకలిని, దప్పికను, ఎండను భరిస్తూ నరాలు కూడా పైకి కనిపించేటంతగా శరీరాన్ని కృశింపజేసి, రకరకాల ఉపవాసాలతో పరలోకహితకరమైన పనులు ఆచరిస్తాను. **ఈ కపోతం తన శరీరాన్ని అర్పించి అతిథి పూజ ఎలా చేయాలో చూపించింది. కాబట్టి నేను కూడా ధర్మాన్నే ఆచరిస్తాను. ధర్మమే ఉత్తమగతి. ధర్మనిష్ఠమయిన ఈ ఉత్తమవిహగం ప్రదర్శించిన ధర్మమే నాకు కూడా అభీష్టం.'** అలా పలికి, ధర్మాచరణను నిశ్చయించుకొని క్రూరకర్ముడయిన ఆ బోయవాడు కఠోరవ్రత్రాన్ని ఆశ్రయించి మహాప్రస్థానం వైపు పయనించాడు. అప్పుడే తన కర్రను, శలాకను, వలను, పంజరాన్ని, పంజరంలో బంధించిన కపోతిని కూడా విడిచిపెట్టాడు.

148. కపోత స్వర్గగమనము.

భీష్ముడిలా చెప్తున్నాడు. "బోయవాడు వెళ్ళిపోగానే కపోతి తన భర్తను తలచుకొని శోకంతో చెదరిపోతూ, దుఃఖంతో విలపిస్తూ ఇలా అన్నది. 'కాంతా ! నేను నీకెప్పుడూ అప్రియంగా ప్రవర్తించినట్లు గుర్తులేదు. స్త్రీకి ఎంతమంది బిడ్డలున్నా వైధవ్యం కలిగితే శోకంలో మునుగుతుంది. భర్తలేకపోతే ఆ తపస్విని బంధువులకు కూడా శోచనీయగా కనిపిస్తుంది. నీవు నన్ను ఎప్పుడూ లాలించేవాడవు. గౌరవించేవాడవు, ఆదరించే వాడవు. స్నేహపూర్వక మధుర మనోహరవచనాలతో నన్ను మురిపించావు. కొండదరులలో, నదీతీరాల్లో, సెలయేళ్ళ సమీపంలో, అందమైన చెట్ల కొమ్మలపై, నన్ను సుఖపెట్టావు. ఆకాశంలో ఎగిరేటప్పుడు కూడా నీతో కలిసి సుఖాన్ని ఆస్వాదించాను. **కాంతా ! గతంలో నీతో కలిసి పొందిన సుఖంలో ఏ కొంచెమూ ఇప్పుడు లేదు. తండ్రి, సోదరుడు, కొడుకు - వీరంతా మితంగానే సుఖపెట్టగలరు. కానీ భర్త అవధిలేని సుఖాన్ని అందించగలవాడు. అటువంటి భర్తను ఏ స్త్రీ పూజించదు ?* స్త్రీకి భర్తను మించిన రక్షణ ఏదీ లేదు. భర్తతో సమానమైన సుఖమేదీ లేదు. ధనాన్ని అంతా పరిత్యజించి అయినా స్త్రీకి భర్తయే శరణం.** నాధా ! నీవు లేకుండా నేను జీవించవలసిన అవసరమేముంది? ఏ పతివ్రత భర్తలేకుండా జీవించటానికి ఉత్సాహ పడుతుంది ?' ఈ రీతిగా దీనంగా బహువిధాలుగా విలపించి తీవ్రవేదనకు లోనైన ఆ పతివ్రత - కపోతి మండుతున్న అగ్నిలో దూకింది. అప్పుడు ఆమె భర్తను చూసింది. ఆ కపోతం రంగురంగుల అంగదాలను ధరించి విమానంలో కూర్చొని ఉన్నది. పుణ్యాత్ములయిన మహాత్ముల పూజల నందుకొంటోంది. చిత్రచిత్రాలయిన ఆభరణాలను, వస్త్రాలనూ ధరించి సర్వాభరణాలనూ అలంకరించికొనిఉన్నది. పుణ్య కర్మలు చేసిన పురుషులతో కూడిన విమానాలు శతకోటి దానిని చుట్టి ఉన్నాయి. ఆపై ఆ కపోతం శ్రేష్ఠ విమానాన్ని ఎక్కి, కపోతితో సహా స్వర్గలోకానికి వెళ్ళింది. అక్కడ తన పుణ్యకర్మల ఫలితంగా పూజనందుకొంటూ ఆనందంగా నివసించింది.'

149. లుబ్ధకుడు స్వర్గమున కేగుట.

భీష్మ డిలా చెప్తున్నాడు. "రాజా ! ఆ బోయవాడు విమానంలోనున్న కపోత దంపతులను చూశాడు. చూసి వారి సద్గతిని గురించి ఆలోచించాడు. 'నేను కూడా

---

* **మితం దదాతి హి పితా మితం భ్రాతా మితం సుతః ॥ 6**
అమితస్య హి దాతారం భర్తారం కా న పూజయేత్ ।

ఇటువంటి తపస్సునే ఆచరించి ఉత్తమగతిని పొందుతాను.' అని మనస్సులో నిశ్చయించుకొని పక్షిజీవనుడైన ఆ బోయవాడు మహాప్రస్థానమార్గాన్ని ఆశ్రయించి, బయలుదేరాడు. ప్రస్తుత మతడు చేష్టలను వదిలాడు. గాలినే ఆహారంగా స్వీకరిస్తున్నాడు. స్వర్గకాంక్షతో అన్యమమకారాలు విడనాడాడు. అంతలో ఒక విశాలమయిన సరస్సును చూశాడు. అది పద్మాలతో ప్రకాశిస్తోంది. మనోహరంగా ఉన్నది. అనేక పక్షిసమూహాలు దానిపై నున్నాయి. సుఖ ప్రదమైన చల్లనినీరు ఆ సరస్సులో ఉన్నది. రాజా ! దప్పిక గొన్నవాడు దానిని చూస్తేనే చాలు దాహం తీరుతుంది అనటంలో సంశయం లేదు. ఉపవాసం చేత బాగా కృశించియున్న ఆ బోయవాడు దానిని చూడకుండానే ఆనందంగా క్రూరజంతువులకు నివాసస్థానమైన అరణ్యంలో ప్రవేశించాడు. గట్టి నిర్ణయంతో బోయవాడు అక్కడ ప్రవేశించాడు. ప్రవేశించగానే ముళ్ళలో చిక్కుకొన్నాడు. ముళ్ళు అతని శరీరాన్ని చీరాయి. శరీరం నెత్తుటితో ఎర్రగా, తడిగా అయింది. నానామృగసమాకుల మయిన ఆ నిర్జనారణ్యంలో తిరుగసాగాడు. అంతలో పెనుగాలికి చెట్లు ఒరుసుకొన్నాయి. అరణ్యంలో దావాగ్ని చెలరేగింది. ప్రళయ కాలాగ్నివలె మండుతున్న దావాగ్ని మహావృక్షాలతో, కొమ్మలతో, లతలతో నిండిన ఆ వనాన్ని పూర్తిగా దహించింది. దావాగ్ని గాలికెగిరిన నిప్పురవ్వలతో, జ్వాలలతో అంతటా వ్యాపించి మృగాలతో, పక్షులతో నిండిన ఆ భీకరారణ్యాన్ని దహించింది. అప్పుడు ఆ బోయవాడు పరమానందపడిన మనస్సుతో శరీరమోక్షం కోసం ఎగిసిపడుతున్న అగ్నివైపు పరువెత్తాడు. అప్పుడు ఆ బోయవాడు అగ్నిదగ్ధుడై పునీతు డయ్యాడు. దానితో ఉత్తమసిద్ధిని పొందాడు. అంతలోనే ఆనందంతో స్వర్గలోకంలో ప్రకాశిస్తున్న తనను తాను చూడగలిగాడు. యక్షగంధర్వసిద్ధుల మధ్యలో ఇంద్రునివలె అప్పు డతడు వెలిగిపోతున్నాడు. ఈ రీతిగా కపోతం, పతివ్రత అయిన కపోతి, బోయవాడు పుణ్యకర్మ ద్వారా స్వర్గానికి చేరారు. **ఈ రీతిగా ఏ కాంత అయినా భర్తను అనుసరిస్తే ఆమె కపోతి వలె వెంటనే స్వర్గం చేరి విరాజిల్లుతుంది.** ఇది ప్రాచీన వృత్తాంతం. మహాత్ముడైన లుబ్ధకుడు, కపోతమూ పుణ్య కర్మద్వారా పొందిన ధార్మికగతికి సంబంధించినది. నిత్యమూ ఈ కథను విన్నవానికీ, కీర్తించిన వానికీ మనసా కానీ, పొరపాటువలన కానీ కూడా ఎటువంటి అశుభమూ జరుగదు. **యుధిష్ఠిరా ! ధార్మికశ్రేష్ఠా ! ఇది గొప్ప ధర్మం. ఈ ధర్మం వలన గోహత్యవలన కలిగిన పాపానికి కూడా నిష్కృతి లభిస్తుంది.** కానీ శరణాగతుని చంపినవానికి నిష్కృతియే ఉండదు. పుణ్యమూ, పాపవినాశకమూ అయిన ఈ కథను విన్నవాడు దుర్గతిని పొందడు. స్వర్గలోకాన్ని పొందగలడు కూడా.'

150. ఇంద్రోత పారిక్షితీయ సంవాదము - 1.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'భరత వంశీయా ! ఎవరైనా తెలియక ఏదైనా పాపం చేస్తే దాని నుంచి ఎలా విముక్తుడు అవుతాడు ? ఈ విషయం నాకు వివరించవలసినది.' భీష్ముడు చెప్పాడు. 'యుధిష్ఠిరా ! ఈ విషయంలో ఋషులు మెచ్చుకొన్న ఒక ప్రాచీన వృత్తాంతాన్ని చెపుతాను. శునకవంశీయుడైన ముని ఇంద్రోతుడు జనమేజయునకు దీన్ని చెప్పాడు. పూర్వకాలంలో పరిక్షిత్తు పుత్రుడైన జనమేజయుడు మహా పరాక్రమవంతుడు. బుద్ధి పూర్వకంగా చేయని ఒక బ్రహ్మ హత్యాపాతకం ఆయనకు వచ్చింది. పురోహితునితో కూడా బ్రాహ్మణులందరూ ఆ రాజుకు దూరమయ్యారు. ఆ పరిస్థితికి రోయింబవళ్ళు దిగులు పడుతూ రాజు అరణ్యానికి వెళ్ళాడు. ప్రజలు కూడా పరిత్యజించటం వల్ల ఆయన అరణ్యంలో ఉండి, మహత్తర పుణ్యకార్యం చేయసాగాడు. దుఃఖ దగ్ధుడై చాలాకాలం తపోమగ్ను డయినాడు. ఆ రాజు సమస్త భూమండలం మీద సంచరిస్తూ, తన బ్రహ్మహత్యా పాతకం పోవటానికి తగిన ప్రాయశ్చిత్తాన్ని చెప్పమని అనేక బ్రాహ్మణులను అడిగాడు. రాజా ! ఇప్పుడు నీకు ధర్మవ్యాధి చేసే ఒక ఇతిహాసం చెపుతాను. జనమేజయ మహారాజు తాను చేసిన పాపకర్మచే దగ్ధుడవుతూ, ఇంద్రోతుడు అనే శునక వంశీయు డయిన నియమనిష్ఠలు గల ముని వద్దకు వెళ్ళాడు. ఆ మునిని సమీపించి ఆయన పాదాలు పట్టుకొన్నాడు. ఋషి ఆయనను చాల తీవ్రంగా నిందించాడు. వెళ్ళు, వెళ్ళు. నీకు నేను చేసేది ఏమీ లేదు. నన్ను ముట్టుకోవద్దు. నీకు ఇక్కడ స్థానం లేదు. నీ ఉనికి నాకు అసంతృప్తికరం. నీ నుంచి రక్తపువాసన వస్తున్నది. నిన్ను చూడటం శవదర్శన సమానం. చూడటానికి నీవు పవిత్రంగా కన్పిస్తున్నావు. కాని అపవిత్రుడివి. మృతతుల్యుడివై బ్రతికి, తిరుగుతున్నావు. బ్రాహ్మణ మృతికి నీవే కారణం. నీ మనస్సు ఏమాత్రం శుద్ధం కాదు. నీవు మేలుకొన్నపుడు, నిద్రించేటప్పుడు పాపాలోచనలే చేస్తున్నావు. ఇదే పరమసుఖం అనుకొంటున్నావు. రాజా ! నీ జీవితం వ్యర్థం. బహుక్లేశమయం. పాపంచేయటానికే పుట్టావు. నీచ కార్యం చేయటానికే నీ పుట్టుక. తపస్సు, పూజలు, నమస్కారాలు, ఓర్పు మొదలయినవి అనుష్ఠించి తల్లిదండ్రులు సంతానం కలుగవలెనని కోరుకొంటారు. నీ వల్ల నీ పితృదేవతలు నరకంలో పడ్డారు. నీ మీద వారు పెట్టుకొన్న ఆశలు అన్నీ నిరర్థకాలు అయినవి. ప్రజలు బ్రాహ్మణులను పూజించి స్వర్గాన్ని, ఆయువును, కీర్తిని, సంతతిని పొందుతారు. నీవు నిష్కారణంగానే వారిని ఎల్లవేళలా ద్వేషిస్తుంటావు. ఈ లోకాన్ని వదలిన తరువాత నీవు నీ పాపఫలంగా బహుకాలం తలక్రిందులుగా నరకంలో పడి ఉంటావు. ఆ నరకాలలో ఇనుప ముక్కులు గల గ్రద్దలు నెమళ్ళు పొడిచి పొడిచి

బాధిస్తాయి. అక్కడి నుంచి బయటపడి మళ్ళీ పాపజన్మ ఎత్తుతావు. రాజా ! ఈ లోకంలోనే పాపఫలం కలగటం లేదు. ఇంక పరలోకం ఎక్కడ ఉన్నది ? అనే నీ నమ్మకానికి వ్యతిరేకంగా యమలోకానికి వెళ్ళిన తరువాత యమదూతలు వీటిని అన్నింటినీ గుర్తుచేస్తారు.'

151. ఇంద్రోత పారిక్షితీయ సంవాదము - 2.

భీష్ముడు చెప్పాడు. "ఇలా అన్న మునితో జనమేజయుడు అన్నాడు. 'ఛీకొట్టదగిన నన్ను మీరు ఛీ కొడుతున్నారు. నిందించదగిన వాడను కాబట్టి నిందిస్తున్నారు. అసహ్యించు కొనదగిన నన్ను అసహ్యించుకొంటున్నారు. కాబట్టి మిమ్ములను దయ చూపవలసిందిగా కోరుతున్నాను. ఈ పాపం అంతా నాలో ఉంది. నిప్పుల్లో పడవేసినట్లు చింతతో దగ్ధం అవుతున్నాను. నేను చేసిన పాపకర్మలను గుర్తుచేసుకొని నా మనస్సు ప్రసన్నం కావటం లేదు. యమధర్మరాజు వల్ల కూడా నాకు తీవ్రమయిన భయం కలుగుతుంది. ఇది నా మనస్సులో ముల్లువలె గ్రుచ్చుకొంటున్నది. ఇది నా మనస్సులో నుంచి తొలగకపోతే నేను ఎలా జీవించగలను ? కాబట్టి శౌనకా ! తాము కోపం వీడి, నా ఉద్ధరణకు తగిన ఉపాయం చెప్పండి. నేను బ్రాహ్మణ భక్తుడనే. నా వంశం తప్పక ఈ భూమి మీద మిగలాలి. నా వంశానికి అంతకు కళంకం ఏర్పడరాదు. బ్రాహ్మణ శాపం వల్ల మావంశం నిశ్శేషం అవుతుంది. మా పాపం వల్ల లోకంలో గౌరవం పొందలేము. బంధువులతో ఐక్యం లేదు. కాబట్టి చాలా ఖిన్నులమూ, విరక్తులమూ అయి మేము వేదాలలో నిశ్చిత విషయం తెలిసిన మీ వంటి వారిని ప్రార్థిస్తున్నాం. నిర్జన ప్రదేశంలో ఉండే మహా యోగులు పాపులను రక్షించినట్లు మీరు దయతో మా వంటి దుఃఖితులను రక్షించండి. యజ్ఞం చేసే అధికారాన్ని కోల్పోయిన క్షత్రియులు పులింద శబరులవలె నరకాలలోనే పడి ఉంటారు. పరలోకంలో ఉత్తమ గతిని పొందలేరు. శౌనకా ! మీరు విద్వాంసులు, నేను మూర్ఖుడను. నా తెలివి తక్కువను పరిగణించక తండ్రి కుమారునియందు వలె నాయందు వాత్సల్యం చూపండి.'

శౌనకుడు అన్నాడు. 'అజ్ఞాని తప్పుచేసినా అందులో ఆశ్చర్యం లేదు. తెలిసిన పండితుడు ప్రాణుల మీద కోపించరాదు. నిర్మలబుద్ధి అనే భవనం ఎక్కి, శోకరహితుడై దుఃఖితులను చూసి, బాధపడేవాడు తన జ్ఞానబలంతో, పర్వతం పైన మున్న వ్యక్తి ఆ పర్వతం క్రింద ఉన్న వారిని చూసినట్లు తెలుసుకొంటాడు. ప్రాచీనులయిన ఉత్తమ వ్యక్తులంటే విరక్తుడు, వారికి దూరంగా ఉండేవాడు, వారి నిందలకు

గురి అయ్యేవాడు జ్ఞానం పొందలేడు. ఇలాంటి వానిని చూసి, ఇతరులు ఆశ్చర్యపడరు. నీకు బ్రాహ్మణ శక్తి తెలుసు. వారి మహిమను చెప్పే వేద శాస్త్ర జ్ఞానం నీకున్నది. కాబట్టి బ్రాహ్మణజాతి శరణు ఇచ్చేరీతిగా శాంతి పూర్వక యత్నం చెయ్యి. వత్సా ! క్రోధరహితులయిన బ్రాహ్మణులకు చేసే సేవాదులు పరలోక ప్రయోజన హేతువులు అవుతాయి. చేసిన పాపానికి పశ్చాత్తాపం కలిగితే నిరంతరం ధర్మంమీద చూపు నిలుపు.' జనమేజయుడు అన్నాడు. 'శౌనకా ! పాపానికి పశ్చాత్తాపపడుతున్నాను. ఇంకెప్పుడూ ధర్మలోపం చేయను. నాకు మేలు పొందాలని ఉంది. కాబట్టి ఈ భక్తునిమీద దయచూపండి. శౌనకుడు అన్నాడు. 'రాజా ! నీ దంభాన్ని, అభిమానాన్ని పోగొట్టి నీకు తృప్తి కలిగిస్తాను. నిరంతరం ధర్మాన్ని స్మరిస్తూ, సమస్త ప్రాణులకు హితం చేయాలి.' భయంతోగాని, దైన్యంతో గాని, ధనాదిలోభంతో గాని నిన్ను నావద్దకు పిలవటంలేదు. నీవు ఈ బ్రాహ్మణులతో కూడ దైవవాక్కు వంటి నా సత్యవాణిని చెవిపెట్టి విను. నాకు నీవు ఏమీ ఇవ్వవలెనని కాదు. సర్వప్రాణులు నన్ను నిందించినా, హాహా కారాలుచేసినా, ధిక్కరించినా కేవలం ధర్మ దృష్టితో మాత్రమే నిన్ను దగ్గరకు పిలుస్తున్నాను. లోకం నన్ను ధర్మం తెలియనివాడని అననియ్యి. నా మిత్రులు నన్ను వదిలివేయనియ్యి. నీకు ధర్మోపదేశం చేస్తున్నానని విని, నా మిత్రులు కోపిస్తే కోపించనియ్యి. నాయనా ! మహాజ్ఞానులయిన పురుషులే నా అభిప్రాయాన్ని గుర్తిస్తారు. బ్రాహ్మణులకు మేలు చేయవలె ననే ఈ నా ప్రయత్నం అని నీవు తెలుసుకో. రాజా ! నా ప్రయత్నం వల్ల బ్రాహ్మణులు క్షేమంగా ఉండేటట్లు చేయవలసింది. 'బ్రాహ్మణ ద్రోహం చేయను' అని నా ఎదుట ప్రమాణం చెయ్యి.' జనమేజయుడు అన్నాడు. 'విప్రవరా ! 'మాటలతో, మనస్సుతో, చేతలతో బ్రాహ్మణులకు ఎప్పుడూ ద్రోహం చేయను' అని మీ పాదాలంటి ప్రమాణం చేస్తున్నాను.'

152. ఇంద్రోత పారిక్షితీయ సంవాదము - 3.

శౌనకు డన్నాడు. 'రాజా ! నీవు ప్రతిజ్ఞ చేశావు. కాబట్టి నీ మనస్సు పాప కార్య విముఖ మయిన దని తెలుస్తున్నది. సంపన్నుడవు, బలవంతుడవు, సంతుష్ట చిత్తుడవు, స్వయంగానే ధర్మదృష్టి కలవాడవు. మొదట కఠినంగా ఉండి, తరువాత మృదువ్యవహారంతో సమస్త ప్రాణులను దయగా చూసే రాజు స్వభావం ఆశ్చర్యకరం. చాలాకాలం తీక్ష్ణ స్వభావంతో ఉండినవాడు, తరువాత దానిని బూడిద చేస్తాడని లోక వ్యవహారం ఉంది. కాని నీవు అలాంటి వాడవు అయినా ధర్మం మీదనే దృష్టి పెట్టడం ఆశ్చర్యకరమే. చాలాకాలం నుంచి చక్కని రుచికరమైన భక్ష్య భోజ్యాలను వదలి, తపస్సు

చేస్తూ ఉండటం అనేది పాప పరాధీను లయిన వారికి ఆశ్చర్యకరమే. ధనవంతుడు దాతకావటం, దరిద్రుడు, కృపణుడు తపోధనుడు కావటం ఆశ్చర్యం కాదు. ఇలాంటి వారు దానం చేయటం, తపస్సు చేయటమూ పెద్దకష్ట మేమీకాదు. అన్ని విషయాలూ ముందు వెనుకలు చూడకుండా ఏదయినా పని ప్రారంభించటం అనాలోచిత దోషం అవుతుంది. దేనినైనా బాగా ఆలోచించి చేయటం మేలు. **నరేంద్రా ! యజ్ఞం, దానం, దయ, వేదాలు, సత్యం చక్కగాచేసిన తపస్సు అనేవి చాలా పవిత్రమైనవి.** జనమేజయా ! ఈ ఆరు విషయాలూ రాజులకు పరమ పవిత్ర మైనవి. వీటిని ఆచరణలో పెట్టుకొంటే నీవు శ్రేష్ఠ తమ ధర్మాన్ని పొందగలవు.

పుణ్య తీర్థాలను సేవించటం కూడా పరమపవిత్రం అంటారు. విద్వాంసులు ఈ విషయంలో యయాతి గానం చేసిన ఈ గాథను ఉదాహరిస్తారు. **బహుకాలం జీవించదలచిన వాడు ప్రయత్న పూర్వకంగా యజ్ఞాలను చేసి, తరువాత అది మానుకొని తపస్సులో మగ్నుడు కావాలి. కురుక్షేత్రాన్ని పుణ్య తీర్థం అన్నారు. దానికంటే సరస్వతీనది, దాని కంటె దాని భిన్న భిన్న తీర్థాలు అధిక పవిత్రాలు. వాటిల్లోను పృథూదక తీర్థం శ్రేష్ఠం అని చెప్పారు.** ఆ తీర్థంలో స్నానం, జలపానం వల్ల మానవునికి రేపే కలుగబోయే మరణం కలుగదు. అంటే స్నాత కృతకృత్యుడు అవుతాడు. ఇందువల్ల మరణ భీతిఉండదు. మహా సరస్సు పుష్కరం, ప్రభాసం, ఉత్తర మానసం, కాలోదకం, దృషద్వతీ సరస్వతీ సంగమం, మానససరోవరం మొదలయిన తీర్థాలకు వెళ్ళి, స్నానం చేస్తే జీవితంలో దీర్ఘాయువు కలుగుతుంది. **అన్ని తీర్థాలలోను వేదాధ్యయన తత్పరుడై స్నానం చేయాలి. సర్వత్యాగ రూపమయిన సన్న్యాసం సర్వధర్మ శ్రేష్ఠం అని మనువు చెప్పాడు.** ఈ విషయంలోనూ సత్యవంతుడు చెప్పిన ఈ గాథలను ఉదాహరిస్తారు. రాగ ద్వేషాలు లేక పోవటంవల్ల బాలుడు సత్య పరాయణుడే అవుతాడు. అతడు పాపం చేయడు, పుణ్యం చేయడు. ప్రతి శ్రేష్ఠ వ్యక్తీ ఇలాగే ఉండాలి. ఈ లోకంలో సర్వప్రాణులలో దుఃఖమే లేనప్పుడు సుఖం ఎక్కడ ఉంటుంది ? అన్ని విధాలయిన సంసర్గ దోషాలను గ్రహించి, వాటిననుసరించి ప్రవర్తించే ప్రకృతిస్థ ప్రాణులకే సుఖ దుఃఖాలు ధర్మం అవుతాయి. అహంకారమమకారాలతో పాటు సర్వస్వం త్యజించినవారికి, పుణ్యపాపాలు తొలగిన వారికి జీవితం మంగళమయం అవుతుంది.

రాజేంద్రా ! ఇప్పుడు రాజకార్యాలలో శ్రేష్ఠమైన దానిని వివరిస్తాను. నీవు ధైర్యం గల బలంతో, దానంతో స్వర్గాన్ని జయించు. బలపరాక్రమాలు గల మనుష్యుడే ధర్మాచరణంలో సమర్థుడు అవుతాడు. రాజా ! నీవు బ్రాహ్మణులకు సుఖాన్ని కలిగించటానికే

భూమండలాన్ని పాలించు. పూర్వం నీవు బ్రాహ్మణులను ఆక్షేపించిన రీతిగానే ఇప్పుడు వారినందరినీ నీ సత్ప్రవర్తనతో ప్రసన్నులను చేసుకో. వారు పలుమారులు నిందించినా, ఛీకొట్టినా వారి యందు ఆత్మ దృష్టిని ఉంచి 'ఇంక నేను బ్రాహ్మణులను సంహరించను' అని నిశ్చయించుకో. నీ కర్తవ్యాలలో పూర్తిగా నిమగ్నుడవై సమధికమయిన మంగళాలను సాధించుకో. ఒక రాజు మంచువలె చల్లగా ఉంటాడు. అగ్ని వలె తీవ్రంగా ఇంకొకడు ఉంటాడు. ఇంకొకడు యమునివలె గుణదోష విచారణ చేస్తాడు. నాగలివలె దుష్టులను వ్రేళ్ళతో పెకలించేవాడు ఇంకొకడు కాగా, వేరొకడు పిడుగు వలె హఠాత్తుగా దుష్టుల మీద పడతాడు. నాకు ఎప్పుడూ కీడు కలుగరాదు అని భావించే రాజు దుష్టసాంగత్యం చేయరాదు. వారిలో ఒక ప్రత్యేకగుణం ఉందని ఆకర్షితుడు కారాదు. వారితో ఎడతెగని సంబంధం పెట్టుకోరాదు. వారి యందు ఎక్కువ ఆసక్తిని చూపరాదు. శాస్త్రవిరుద్ధమయిన పని చేస్తే అందుకు పశ్చాత్తాప పడినవాడు పాపవిముక్తుడు అవుతాడు. రెండవసారి పాపం జరిగితే 'ఇక పైన మళ్ళీ ఇలాంటి పనిని చేయను' అని ప్రతిజ్ఞ చేస్తే పాపం నుంచి ముక్తుడవుతాడు. 'నేటి నుంచి ఇంక ధర్మకార్యాలే చేస్తాను, అనే నియమంపెట్టుకొంటే మూడవసారి పాప ముక్తు డవుతాడు. పవిత్ర తీర్థాలలో సంచరించే వాడు పలుమారులు చేసిన లెక్క లేనన్ని పాపాలనుంచి ముక్తు డవుతాడు. **సుఖాన్ని కోరేవ్యక్తి మంగళ కార్యాలనే చేయాలి. సువాసన గల పదార్థాలను స్వీకరించేవాని శరీరం నుంచి సువాసనలు వెలువడుతాయి. దుర్వాసన గల వానిని గ్రహించేవాని నుండి దుర్వాసనలే వస్తాయి. తపస్సు నందు తత్పరు డయినవాడు వెంటనే పాపవిముక్తుడు అవుతాడు.** ఒక సంవత్సరం పాటు అగ్నిహోత్రం చేయటం వల్ల అపవాదం పాలైన వ్యక్తి దానినుంచి విముక్తు డవుతాడు. భ్రూణ హత్య చేసిన (గర్భం పోగొట్టిన) వాడు మూడు సంవత్సరాలు అగ్నిని ఉపాసించి, ఆ పాపం పోగొట్టుకొంటాడు. పుష్కరం అనే మహా సరస్సుకు, ప్రభాస తీర్థానికి, ఉత్తర మానస సరస్సుకు నూరు యోజనాలు పాదయాత్ర చేస్తే భ్రూణహత్య చేసిన పాపం పోతుంది. ప్రాణులను చంపేవాడు ఎన్ని ప్రాణులను చంపుతాడో ఆ జాతిలోని అన్ని ప్రాణులను మరణాన్నించి తప్పించి, రక్షిస్తే ఆ పాపం పోతుంది.

మానవుడు అఘమర్షణ మంత్రాలను జపిస్తూ నీటిలో మునకలు వేస్తే వానికి అశ్వమేధయాగం చేస్తే కలిగినంత పుణ్యం లభిస్తుంది. ఆ అఘమర్షణ మంత్ర జపం చేసేవాడు త్వరగా తాను చేసిన పాపాలు పోగొట్టుకొంటాడు. ఆయనకు అంతటా గౌరవం కలుగుతుంది. సర్వప్రాణులు జడాలవలె, మూగవానివలె ఆయనవిషయంలో ప్రసన్నంగా ఉంటాయి. రాజా ! ఒకప్పుడు దేవతలు, రాక్షసులు దేవగురువయిన బృహస్పతిని

సమీపించి గౌరవంతో 'మహర్షీ ! మీకు ధర్మఫలం తెలుసు. అలాగే పాపఫలంగా కలిగే నరకలోకంలో పాపులు పడేకష్టాలు కూడా మీకు తెలియనివి కావు. కాని సుఖ దుఃఖాలు సమానమయిన యోగి ఆ రెండింటికి కారణమయిన పుణ్యపాపాలను జయించగలడా ? లేదా ? మహర్షీ ! మాకు పుణ్యఫలాన్ని వివరించండి. దానితో పాటు ధర్మాత్ములు తమ పాపాన్ని ఎలా పోగొట్టుకొంట్టారో అది కూడా చెప్పండి.' **బృహస్పతి చెప్పాడు. 'ఒకవ్యక్తి తెలియక పాపంచేసి తరువాత బుద్ధి పూర్వకంగా పుణ్య కార్యాలుచేస్తే మురికి అయిన వస్త్రాన్ని సోడా, సబ్బు వంటి క్షారగుణం గల వస్తువులు శుభ్రం చేసినట్లు పవిత్రుడు అవుతాడు.** పాపం చేసిన మానవుడు అహంకరించరాదు. తాను గొప్పపని చేసినట్లు భావించరాదు. కాని శ్రద్ధతో దోష దృష్టిని వదలి పవిత్ర మయిన శుభకర మయిన ధర్మానుష్ఠానం చేయగోరాలి. ఉత్తమ పురుషుల బహిర్గత దోషాలను దాచి పెట్టడానికి ప్రయత్నించేవాడు, పాపం చేసి, ఆ పనిని వదలి మంచి త్రోవన వెళ్ళేవాడు పాపరహితులు అవుతారు. ప్రొద్దున ఉదయించిన సూర్యుడు చీకటిని పోగొట్టినట్లు మంచిపనులు చేసేవాడు సర్వపాపాలను పోగొట్టుకొంటాడు.' భీష్ముడన్నాడు. 'ఈ రీతిగా శౌనకుడయిన ఇంద్రోతముని జనమేజయరాజుకు చెప్పి, ఆయన చేత యథావిధిగా అశ్వమేధ యాగం చేయించాడు. దీని వల్ల జనమేజయుడు పాపం తొలగి, జ్వలించే అగ్నివలె ప్రకాశించాడు. సర్వవిధాల శ్రేయస్సు పొందాడు. పూర్ణ చంద్రుడు ఆకాశంలో ప్రవేశించినట్లు శత్రునాశకు డయిన జనమేజయుడు తన రాజ్యంలో ప్రవేశించాడు.'

153. గృధ్రగోమాయు సంవాదము.

యుధిష్ఠిరుడడిగాడు. 'తాతా ! ఏ వ్యక్తి అయినా మరణించి, మళ్ళీ జీవించినట్లు నీవు ఎక్కడయినా విన్నావా ? లేక చూచావా ?' భీష్ముడు చెప్పాడు. 'కుంతీ కుమారా ! పూర్వకాలంలో నైమిశారణ్య క్షేత్రంలో గ్రద్ద, నక్కల మధ్య జరిగిన సంవాదం విను. ఇది పూర్వం జరిగిన యథార్థ వృత్తాంతం. ఒకొనొక బ్రాహ్మణునికి ఒకే ఒక కుమారుడు చాలా కాలానికి కలిగాడు. విశాలమయిన కన్నులు గల అంద మయిన ఆ బాలుడు బాలగ్రహ బాధితుడయి మరణించాడు. ఇంకా యౌవనంలో అడుగుపెట్టని వాడు, వంశానికే సర్వస్వ మయిన ఆ బాలుని శోకపరవశులై బంధువులు తీసుకొని శ్మశానం వైపు వెళ్ళారు. అక్కడ బాధతో దుఃఖించసాగారు. ఆ పిల్లవాడు బ్రతికి ఉన్నప్పుడు పలికిన మాటలను మాటి మాటికి గుర్తు చేసుకొంటూ, దుఃఖిస్తూ, ఆ మృతుని పడవేసి వెళ్ళటానికి కాళ్ళురాక అక్కడే ఉన్నారు.

వారి ఏడుపులు విని ఒక గ్రద్దవచ్చి ఇలా అన్నది. 'మానవులారా ! ఒకే ఒక పుత్రు డయిన ఈ మృతబాలుని ఇక్కడ వదలి వెళ్ళండి. ఆలస్యం చేయవద్దు. ఇంతకుముందు మరణించినవేలమంది స్త్రీ పురుషులను బంధువులు తీసుకొనినచ్చి ఇక్కడ వదలివెళ్ళారు. చక్కగా తెలుసుకోండి. ఈ జగత్తు అంతా సుఖదుఃఖాలతో నిండి ఉన్నది. ప్రాణుల సంయోగవియోగాలు ఒక దానివెంట ఇంకొకటి జరుగుతుంటాయి. మరణించిన వారి శవాలను తీసుకొని శ్మశానానికి వెళ్ళేవారు, వెళ్ళనివారు అందరూ తమ ఆయువు పూర్తికాగానే ఈ లోకంనుంచి వెళ్ళిపోతారు. గ్రద్దలు, నక్కలతో నిండినది, అనేక మానవాస్థిపంజరాలతో, భయంకరమయిన ఈ శ్మశానంలో మీరు ఎంతసేపు ఉన్నా ఏం ప్రయోజనం ? మరణించినవాడు ఎవ్వడూ మనకు ఇష్టుడయినా, ద్వేషించదగినవాడు అయినా మళ్ళీ జీవించలేదు. ప్రాణుల గతియే ఇటువంటిది. ఈ మర్త్యలోకంలో జన్మించిన ప్రతి ప్రాణీ ఎప్పుడో ఒకప్పుడు మరణించవలసిందే. కాలం నిర్మించిన ఈ మార్గంలో మరణించిన ప్రాణిని మళ్ళీ ఎవరు జీవింపజేయగలరు ? జనులందరూ తమ పగటి పనులు మానుకొంటున్నారు. ఇప్పుడు సూర్యుడు అస్తమిస్తున్నాడు. కాబట్టి పిల్లవాని మీద మమకారం వదలి మీరు మీ నివాసాలకు వెళ్ళండి.' గ్రద్ద మాటలు విన్న ఆ బంధువులు అందరూ పిల్లవాని శవం నేల మీద వదలి ఇండ్లకు వెళ్ళటానికి సిద్ధమయినారు. వారు ఏడ్చి ఏడ్చి 'ఈ పిల్లవాడు మరణించాడు. ఇక ముందు వీడు కంటికి కన్పించడు' అని నిరాశచేసుకొని వారు అక్కడి నుండి వెళ్ళబోతున్నారు. 'ఇక వీడు బ్రతికిరాడు' అని వారు అందరూ వాని జీవితం మీద ఆశవదలి, వచ్చిన త్రోవనే బయలుదేరారు.

ఇంతలోనే కాకి రెక్కల రంగు గల ఒక నక్క తన నివాసంలో నుంచి బయటకు వచ్చి, వెళ్ళుతున్న వారినిచూచి ఇలా అంది. 'ఆహా ! ఈ మనుష్యులు ఎంత దయావిహీనులు ?' అనుకొంది. 'మూడులారా ! ఇంకా ప్రొద్దు అస్తమించలేదు. భయపడకండి. పిల్లవాని మీద ప్రేమ వీడకండి. అనేక విధాలయిన ముహూర్తాలు వస్తూ ఉంటాయి. మళ్ళీ ఈ పిల్లవాడు ఏదో ఒక సుముహూర్తంలో బ్రతకవచ్చు. ఈ మృత బాలకుని మీద ఏమాత్రం మమకారం లేక ఈ శ్మశానంలో నేల మీదపడవేసి ఎందుకు వెళ్ళిపోతారు? ఇంతకుముందు ఈ పిల్లవాడు మాటలు మాట్లాడితేనే పరమానందపడేవారు గదా ! అలా తీయగా మాటాడే ఈ పిల్లవాని మీద మీకు కొంచెమైనా మమకారం లేదా ? పశుపక్షులకు కూడా తమసంతానం మీద ఎంత ప్రేమ ఉన్నదో చూడండి. అంత మమకారం గల పశుపక్షులకు వాటి పిల్లలను పెంచి పోషించటంవల్ల యజ్ఞాలు చేస్తే మునులకు వచ్చినట్లు పరలోకం రాదుగదా ! సంతానం మీద ప్రేమ చూపే వాటికి ఈ

లోకంలో గాని, పరలోకంలో గాని ఎలాంటి ప్రయోజనం లేకపోయినా ఆ పిల్లలను ప్రాణపదంగా పెంచుకొంటాయి. వాటి పిల్లలు పెరిగి పెద్దవై తమ తల్లిదండ్రులను అవి పోషించనప్పటికి తమ పిల్లలు కన్పించకపోతే దుఃఖం కట్టలు త్రెంచుకొంటుంది. ఇక మానవులలో ఇంత ప్రేమ ఎక్కడ ఉన్నది ? అలాంటప్పుడు వారు పిల్లలకోసం ఎందుకు ఏడుస్తారు ? వంశోద్ధారకు డయిన ఈ పిల్లవానిని వదలి ఎక్కడికి వెళ్తారు? ఈ పసివాని కోసం చాలాసేపు కన్నీరు కార్చండి. ఎక్కువ సేపు ప్రేమతో చూడండి. ఇంత ప్రియమైన సంతతిని విడిచి వెళ్ళటం చాలా కష్టం గదా ! శారీరకంగా క్షీణించిన వానికి, ఆర్థికమయిన వ్యాజ్యాలలో చిక్కిన వానికి, శ్మశానికి వెళ్ళేవానికి ఆతని సోదరులు, బంధువులే తోడుగా ఉంటారు. ఇంకెవరూ తోడురారు. అందరికీ తమ ప్రాణాలంటే చాలా తీపి. అందరూ ఇతరుల స్నేహాన్ని పొందుతారు. పశుపక్ష్యాదులలో కూడా ఎంతమైత్రి ఉన్నదో చూడండి. కమలాలవలె విశాలమయిన కన్నులు ఈ బాలుని ముఖానికి ఎంత అందం కలిగించాయి ! స్నానం చేయించి పూలమాలలతో అలంకృత మయిన ఈ బాలుని దేహం పెళ్ళికుమారుని శరీరం వలె ఉన్నది. ఇలాంటి వానిని వదలి ఎలా వెళ్ళగలరు ?"

నక్కమాటలు విన్న ఆ నరులు దయనీయంగా ఏడుస్తూ శవం దగ్గరకు తిరిగివచ్చారు. అపుడు గృధ్రం ఇలా చెప్పింది. 'ఆహా ! క్రూరమై, తెలివి తక్కువదై, నీచమైన ఈ నక్క మాటలు విని ధైర్యం కోల్పోయి మానవులారా ! వెనక్కు వచ్చారా ? పంచేంద్రియ శూన్యుడు, ఎండిపోయిన కట్టెలాగా అయినవాడు అయిన వీడికోసం ఏడుస్తారేమిటి ? బ్రతికి ఉన్న మిమ్ములను గురించి ఆలోచించుకోండి. తీవ్రమయిన తపస్సు చేయండి. దానివలన పాపవిముక్తులు కండి. తపస్సు చేత సమస్తమూ లభిస్తుంది. ఏడుపువల్ల ఏం సాధిస్తారు ? శరీరంతో పాటే అదృష్టమూ, దురదృష్టమూ కలుగుతాయి. అందువలననే ఈ బాలుడు మీకు అనంతమయిన శోకాన్ని ఇచ్చి వెళ్ళాడు. ధనం, గోవులు, బంగారం, మణులు, రత్నాలు, పుత్రుడు అనే వాటికి మూలకారణం తపస్సు. తపో యోగం వల్లనే ఇవి లభిస్తాయి. జీవుడు పూర్వ జన్మ కర్మానుసారమే సుఖదుఃఖాలను తెచ్చుకొంటాడు. కర్మానుసారమే ప్రాణులకు సుఖ దుఃఖానుభవం ప్రాప్తిస్తుంది. తండ్రి కర్మతో కొడుకుకు గాని, పుత్రునికర్మతో తండ్రికి కాని ఏమీ సంబంధంలేదు. తమ తమ పాపపుణ్యబద్ధ లయిన జీవులు కర్మానుసారం విభిన్నమార్గాలలో పయనిస్తారు. ప్రయత్న పూర్వకంగా ధర్మాన్ని అనుసరించండి. అధర్మం మీద మనస్సు పెట్టవద్దు. దేవతా బ్రాహ్మణపేతులో తగిన సమయంలో తత్పరులు కావలసింది. శోకాన్ని, దైన్యాన్ని వదలండి. పుత్రునియందు మమకారాన్ని వీడండి. ఈ పిల్లవానిని ఈ నిర్జన ప్రదేశంలో

వదలండి. త్వరగా వెళ్ళండి. ప్రాణి తాను చేసిన మంచిపని, చెడ్డపనుల ఫలితాన్ని తానే అనుభవిస్తాడు. ఈ విషయంలో బాంధవులకు ఏమీ సంబంధం లేదు. బంధువులు తమ ప్రియబంధువును ఇక్కడ వదలి పెట్టిన, తరువాత నిలువరు. పోయిన వానిమీద ప్రేమను వీడి, కన్నీరు నిండిన కన్నులతో వెళ్ళిపోతారు. పండితు డయినా, పామరు డయినా, ధనవంతు డయినా, దరిద్రు డయినా ప్రతీవాడు మంచి చెడులతో గూడి కాలవశుడై వెళ్ళిపోతాడు. ఏడిచి మీరు చేయగలిగింది ఏమిటి ? ఇతనిని బ్రతికించగలరా ? పోయినవానికోసం ఏడవటం ఎందుకు ? సమస్త ప్రాణులకు ప్రభువు కాలుడే కదా ! ఆయన అందరి యెడల సమదర్శనుడు. బాలురను, యువకులను, ముసలి వారిని, మాతృ గర్భంలో ఉన్న వానిని అందరినీ ఆవేశించి ఉంటుంది మృత్యువు. ఈ సంసార స్థితి ఇంతే.'

నక్క ఇలా అన్నది. 'అల్పబుద్ధి అయిన ఈ గ్రద్ద ఈ పిల్లవాడి మీద మీకు ఉన్న మమకారాన్ని తగ్గించివేస్తున్నది. మీరు పుత్రప్రేమకు లొంగిపోయి సమధికంగా దుఃఖిస్తున్నారు. ఆహా ! న్యాయమయినవి, విశ్వాసాన్ని కల్గించేవి లాగా అన్పించే ఈ గ్రద్ద మాటలతో మీరు అందరు ప్రభావితు లయి వదలలేని మమకారాన్ని వదలి వెళ్ళుతున్నారుగదా! ఇది ఎంత ఆశ్చర్యకరం ! ఆహా ! పుత్రవియోగ పీడితులయి ఈ శ్మశానానికి వచ్చి, సమధిక దుఃఖంతో ఏడ్చే ఈ భూలోకవాసు లయిన మానవుల మనస్సులలో దూడలు దూరమయిన ఆవులకు ఉండేటంత బాధ ఉంటుంది గదా ! మీ దుఃఖం చూస్తుంటే నాకు కన్నీళ్ళు వస్తున్నాయి. **తమ ఇష్టసిద్ధికి నిరంతరం ప్రయత్నం చేయవలసిందే గదా ! అప్పుడు దైవానుగ్రహంవల్ల అది ఫలిస్తుంది. దైవాను గ్రహం, మానవ ప్రయత్నం కాలం వల్లనే సిద్ధిస్తాయి.** ఎలాంటి సమయంలోనయినా బాధపడకుండటం మంచిది. బాధపడినందువల్ల ప్రయోజనం ఏముంటుంది. ప్రయత్నం వల్ల కావలసింది పొందవచ్చు. అందువల్ల దయలేకుండా మీరు వెళ్ళటం ఎందుకు ? ఈ బాలుడు మీ రక్త మాంసాలవల్ల ఏర్పడ్డవాడు. మీ శరీరంలో సగభాగంతో సమానుడు. పితరుల వంశాభివృద్ధికి కర్త. ఇలాంటి వీనిని వదలి మీరు ఎక్కడికి వెళ్తారు ? సూర్యుడు అస్తమించే దాక, సంధ్యా సమయం వచ్చేవరకు ఇక్కడ ఉండండి. ఆ తరువాత ఈ పిల్లవానిని తీసుకొని పోవటమో, ఇక్కడ ఉండటమో చేయవచ్చు.'

గ్రద్ద చెప్పినది. 'మానవులారా ! ఇప్పటికి నేను పుట్టి వెయ్యి సంవత్సరాలు అయింది. మరణించిన స్త్రీ గాని, పురుషుడు గాని, నపుంసకుడు గాని మళ్ళీ బ్రతకటం ఇంత వరకూ చూడలేదు. కొందరు తల్లి కడుపులోనే చచ్చి పుడతారు. ఇంక కొందరు

పుట్టిన వెంటనే మరణిస్తారు. మరి కొందరు నడకనేర్చిన వయస్సులో చచ్చిపోతారు. వేరే కొందరు నిండు యౌవనంలో మృతిచెందుతారు. ఈ లోకంలో పశువులకు, పక్షులకు గూడ అదృష్టఫలం అనిత్యం. స్థావర జంగమ జీవుల బ్రతుకులో గూడ ఆయువే ప్రధానం. ప్రియభార్యా వియోగం చెందినవారు, పుత్రశోకం గలవారు దుఃఖదగ్ధులు అవుతూ రోజూ ఇక్కడికి వచ్చిపోతుంటారు. అనేక బంధువులు మిక్కిలి శోకంతో వేలకొలది ఇష్టులు కాని వారిని, లెక్క లేనంతమంది ఆత్మీయులను వదలి వెళ్తుంటారు. తేజోహీనుడు, ప్రాణరహితుడై ఎండుకట్టెవలె ఉన్న ఈ బాలుని వదలి వెళ్ళండి. ఇంతకు ముందు ఈ శరీరంలో ఉన్న జీవుడు ఇంకో శరీరం మీద ఆసక్తు డయినాడు. అందువల్ల ఈ శరీరం కట్టెవలె అయింది. ప్రాణం లేని ఈ శరీరాన్ని వదలి ఇంకా వెళ్ళరేమిటి ? మీ ప్రేమ, మీ శ్రమ నిష్ప్రయోజనాలు గదా ! ఈ శవం కన్నులతో చూడలేదు. చెవులతో వినలేదు. అలాంటప్పుడు దీన్ని వదలి త్వరగా మీ ఇండ్లకు వెళ్ళ రెందుకు ? 'నా మాటలు చాల కఠినంగా ఉంటాయి. కాని ఇవి హేతు బద్ధాలు, మోక్ష ధర్మాశ్రితాలు. కాబట్టి నా మాట విని త్వరగా మీ ఇండ్లకు వెళ్ళండి. మానవులారా ! వివేకం, విజ్ఞానం గల నేను ఇతరులకు కూడ జ్ఞానదాతను. మీకు వివేకం కలిగే అనేకవాక్యాలు చెప్పాను. ఇక మీరు వెళ్ళండి. మరణించిన ఈ పిల్లవాని శవాన్ని చూసినా, అతని చేష్టలను గుర్తుకు తెచ్చుకొన్నా దుఃఖం రెట్టింపు అవుతుంది.' గ్రద్దమాటలు విని ఆ మనుష్యులు ఇంటి త్రోవ పట్టారు. అప్పుడు నక్క త్వరగా అక్కడికివచ్చి నిద్రిస్తున్న వానివలె నున్న ఆ బాలుని చూచింది.

నక్క అన్నది. 'ఇతడు బంగారుమేనిచాయ గలవాడు, బంగరు నగలను అలంరించుకొన్నవాడు, పితరులకు పిండ ప్రదానం చేయవలసిన ఈ కుమారుని వదలి ఎలా వెళ్ళగలుగుతున్నారు ? ఈ పిల్లవానిని వదలి వెళ్ళినంతమాత్రాన మీ ప్రేమ తరగదు, మీ దుఃఖం ఆగదు. మరణించిన వీనిని వదలి వెళ్ళితే మీకు సంతాపం కలగటం మాత్రం నిశ్చయం. సత్యపరాక్రము డయిన రాముడు శంబూకుడనే శూద్రుని చంపటంవల్ల కలిగిన ధర్మ ప్రభావంతో అంతకుముందు మరణించిన బాలకుడు బ్రతికినట్లు వింటుంటాం. ఇలాగే శ్వేతుడనే రాజుయొక్క పుత్రుడు మరణించగా ధర్మాత్ముడయిన ఆ శ్వేతుడు బ్రతికించుకొన్నాడు. అనేది కూడా ఇక్కడ చెప్పవచ్చు. ఇలాగే ఎవరో ఒక సిద్ధుడయినా, ముని అయినా, దేవత అయినా ఇక్కడికి వచ్చి, మీ కరుణావిలాపం విని, దుఃఖిస్తున్న మీ మీద దయచూపవచ్చు.' అని చెప్పగా పుత్రవాత్సల్యం గలవారు, శోకార్తులు అయిన ఆ బంధువులు వెనుకకు తిరిగివచ్చి మృతబాలకుని శిరస్సును తొడమీద పెట్టుకొని, పెద్దగా ఏడువసాగారు. వారి దుఃఖధ్వని విని, గ్రద్దవచ్చి ఇలా పలికింది.

గ్రద్ద అన్నది. 'మీ కన్నీటివల్ల ఈ బాలుని శరీరం తడిసిపోయింది. మీ చేతులతో మాటి మాటికి కొట్టడం వల్ల, యమధర్మరాజు ఆజ్ఞవల్ల ఇతడు దీర్ఘనిద్రావశు డయినాడు. మహత్తర తపస్సు చేసిన వారు, మహాధనవంతులు, మహామేధావులు - వీరు అందరు మృత్యువశులై ప్రేత నగరానికి వెళ్తారు. బాలురను, వృద్ధులను వేలకొలదిగా ఇక్కడ వదలి వెళ్ళి బంధువులు రేయింబవళ్ళు దుఃఖపరవశు లయి భూమి మీద ఉంటారు. మొండి పట్టుదలతో మాటిమాటికి వెనుకకు వచ్చి శోకభావాన్ని వహించటం వల్ల ఏం ప్రయోజనం ? ఇప్పుడు ఇతడు జీవిస్తాడు అని ఏమీ నమ్మకం లేదు. మరణించి దేహంవదలిన వాడు మళ్ళీ ఈ శరీరం లోకి రావటం అసంభవం. వేలకొలది నక్కలు తమ శరీరం వదలినా ఈ బాలుని వేలసంవత్సరాలకైనా జీవింపజేయలేవు. శంకరుడు, కుమారస్వామి, బ్రహ్మ విష్ణువు - వీరిలో ఏ ఒకరైనా వరమిస్తే ఈ శిశువు జీవించవచ్చు. ఎంత కన్నీరు కార్చినా, ఎన్ని నిట్టూర్పులు వదలినా, ఎంత ఎక్కువగా ఏడ్చినా ఈ శిశువు మళ్ళీ జీవించలేడు. నేనుగాని, ఈ నక్కగాని, వీని బంధువులయిన వీరు గాని మనం అందరమూ ధర్మాధర్మాలను అనుసరించి ఈ లోకంలో మన త్రోవలో పయనిస్తున్నాం. వివేకం గలవాడు అనిష్టకార్యాలు చేయటం, పరుషంగా మాటాడటం, పరులకు ద్రోహం చేయటం, అధర్మాన్ని, అబద్ధం ఆడటాన్ని దూరంగా వదలివేయాలి. ధర్మాన్ని, సత్యాన్ని, శాస్త్ర జ్ఞానాన్ని, న్యాయాన్ని, అన్నిటి కంటే గొప్పదయిన ప్రాణుల మీద దయను, కుటిలత, వంచన చేయక పోవటం అనే సద్గుణాలను ప్రయత్న పూర్వకంగా అనుసరించాలి. బ్రతికి ఉన్న తల్లిదండ్రులను, బంధువులను, మిత్రులను సరిగా చూడనివారికి ధర్మలోపం జరుగుతుంది. కంటితో చూడలేని వాడు, ఎలాంటి చలనం లేనివాడు ఇతడు మరణించిన తరువాత ఏడుస్తూ మీరు చేయగలిగింది ఏమున్నది ?' అని చెప్పగా దుఃఖ పరవశులయిన ఆ బంధువులు ఆ బాలుని నేలమీద వదలి పుత్ర మోహంతో దగ్గులవుతూ బయలు దేరారు.

నక్క అన్నది. 'ఈ మానవలోకం మిక్కిలి దుఃఖదాయకం. ఇక్కడి సమస్త ప్రాణులు నశిస్తాయి. ఇష్టులయిన బంధువుల వియోగం కలుగుతుంది. వీరి బ్రతుకు కూడా చాలా స్వల్పం. ఈ సంసారం అంతా అసత్యమయం. అసంతృప్తి కరం, అతిగా వాగేది, అనిష్టవాక్యాలు పలుకుతుంది. ప్రియ వచనాలు పలికేది. ఇక్కడి ఉనికి దుఃఖాన్ని బాధను పెంపొందించేది. దీన్ని చూస్తుంటే ఈ మానవలోకం ఒక్క క్షణం కూడా నాకు నచ్చదు. ఆహా ! ఈ నక్క మాటలు విని మీరు తెలివితక్కువవారయి ఏమాత్రం ప్రేమ లేక పిల్లవాని మీద మమకారం వదలి ఎలా వెళ్ళగలుగుతున్నారు ? మానవులారా !

పాపి, అపవిత్ర హృదయం గల ఈ గ్రద్ద మాటలు విని పుత్రశోకంతో దగ్ధులు అవుతున్నా మీరు ఎందుకు వెనుదిరిగిపోతారు ? **సుఖం తరువాత దుఃఖం, దుఃఖం తరువాత సుఖం కలుగుతుంటాయి. సుఖ దుఃఖాలు చుట్టు ముట్టిన ఈ లోకంలో నిరంతరం సుఖం గాని దుఃఖం గాని నిలుకడగా ఉండవు.** మూఢులారా ! అందంగా ఉన్న వాడు, వంశానికే వన్నె తెచ్చేవాడు, పసివాడు, రూపం, యౌవనం కలవాడు, తేజస్సుతో వెలిగేవాడు అయిన ఈ పుత్రుని వదలి ఎక్కడికి వెళ్తారు ? మానవులారా ! నా మనస్సుతో చూస్తే ఈ పిల్లవాడు సజీవంగానే ఉన్నాడు. దీనిలో సందేహం లేదు. వీనికి నాశం ఉండదు. మీరు తప్పక సుఖపడతారు. పుత్ర శోకంతో సంతాపం జెందిన మీరు కూడా మృతుల వలెనే ఉన్నారు. ఈ రీతిగా మీరు తిరిగి వెళ్లిపోవటం మీకు తగదు. 'ఈ బాలుని వల్ల, మేము సుఖిస్తాం.' అనే భావంతో, సుఖం పొందాలనే దృఢ మయిన ఆశతో, మీరు అందరూ అల్పబుద్ధులవలె వీనిని వదలి ఎక్కడికి వెళ్తారు?

భీష్ముడన్నాడు. రాజా ! ఆ నక్క ఎల్లప్పుడూ శ్మశానంలోనే ఉంటుంది. తన పని నెరవేరటం కోసం చీకటి పడాలని తలుస్తుంది. కాబట్టి అది ధర్మ దూర మయినది. తీయని అబద్ధాలు చెప్పి ఆ పిల్లవాని బంధువులను మధ్యలోనే ఆపేసింది. వారు అక్కడ ఉండలేక, వెళ్ళలేక చివరకు నిలిచిపోయారు. గ్రద్ద ఇలా అన్నది. ఈ శ్మశానం ప్రేతాలతో నిండిఉన్నది. యక్షరాక్షసులు నివసిస్తుంటారు. గుడ్లగూబలు కూస్తున్నవి. కాబట్టి ఇది చాలా భయంకరం. ఇది ఘోరం, భీతిప్రదం. నల్లని మేఘాలవంటి కటిక చీకటితో నిండి ఉంది. ఈ శవాన్ని ఇక్కడే వదలి మీరు ప్రేత కార్యాలు చేయండి. సూర్యుడు అస్తమించేలోపల, దిక్కులు నిర్మలంగా ఉన్నప్పుడే ఈ బాలుని ఇక్కడ వదలి ప్రేత కర్మలు చేయండి. ఈ వనంలో డేగలు చాలా పరుషంగా అరుస్తున్నాయి. నక్కలు దారుణంగా ఊళలువేస్తున్నాయి. సింహాలు గర్జిస్తున్నాయి. సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఇక్కడ చితులలోనుంచి లేచే నల్లని పొగతో చెట్లు అన్నీ నల్లబడుతున్నాయి. ఈ ప్రేత భూమిలో భూత పిశాచాదులు ఆహారంలేక గర్జిస్తున్నాయి. ఈ భయంకరప్రదేశంలో ఉండే ప్రాణులు అన్నీ వికృత దేహాలతో ఉంటాయి. వికార స్వరూపాలతో మాంసాహారు లయిన అవి మిమ్ములను భయపెట్టుతాయి. ఈ భయంకరమైన ప్రదేశంలో ఉండే ప్రాణులన్నీ వికట శరీరాలతో ఉంటాయి. ఇవి అన్నీ మీకిక్కడ నేడు భయం కలిగిస్తాయి. కొయ్యబారిన ఈ బాలుని శరీరాన్ని ఇక్కడ వదలి వేయండి. ఈనక్క మాటలు వినకండి. నిష్ప్రయోజనాలు, అసత్య మయిన ఈ నక్కమాటలు మతిలేని వారివలె వింటే మీరు అందరూ నాశనం అవుతారు. నక్క ఇలా అన్నది. మీరు ఇక్కడే ఉండండి. భయపడకండి. సూర్యుడు

వెలుగులు వెదజల్లుతున్నంత వరకు నిర్భయంగా ఉండండి. అంతవరకు ఈ పిల్లవాని మీదగల ప్రేమతో కన్నుల కరవుదీరా చూచుకొంటూ ఉండండి. భీకరమైనా ఈ పితృవనంలో మీకు ఎలాంటి భయమూ కలగదు. పితరులకు నివాసస్థానం కాబట్టి ఇది శ్మశానం అయినా ప్రశాంత మయినదే. సూర్యదర్శనం అవుతున్నంతసేపు ఇక్కడే ఉండండి. మాంసం తినే ఈ గ్రద్ద మాటలు చెప్పినంత మాత్రాన ఏమీకాదు. తెలితక్కువగా ఈ గ్రద్దచెప్పే ఘోర మయిన. భయంకరమైన మాటలు వింటే ఈ బాలకుని చేజేతుల పోగొట్టుకొంటారు.

గ్రద్ద సూర్యుడు అస్తమించాడు అన్నది. ఇంకా ప్రొద్దుక్రుంకలేదు అని నక్క అన్నది. ఆకలిగొన్న ఆ రెండూ మరణించినవాని ఆప్తులతో ఇలా పలికినవి. రాజా ! ఆ గ్రద్ద, నక్క తమకోరిక సిద్ధించాలనే ఉద్దేశంతో ఆకలి దప్పులతో అలసిపోయి శాస్త్రాలను ఆధారం చేసుకొని పలికాయి. ఆ పశుపక్షులు జ్ఞానుల మాటలు తెలిసినవి. అమృత సమానమయిన వాటి మాటలు వింటూ వారు కొంతసేపు నిలుస్తున్నారు. వెళ్ళబోతున్నారు. శోక దైన్యావిష్టలయిన వారు ఏడుస్తూ అక్కడే నిలిచిపోయారు. తమపని చక్కబెట్టుకోటంలో నేర్పుగల అవి వారిని తికమకకు గురిచేశాయి. జ్ఞాన విజ్ఞాన విషయాలు చక్కగా తెలిసిన ఆ రెండిటి మధ్య ఇలా వివాదం జరుగుతుండగా, మృతుని బంధువులు నిలచి ఉండగా పార్వతిదేవి ప్రేరణతో పరమేశ్వరుడు వారియెదుట ప్రత్యక్షమయినాడు. దయార్ద్ర వీక్షణాలతో వారిని చూస్తూ ఆ మనుజులను 'మీకు కావలసిన వరం కోరుకొనండి' అన్నాడు. శోకాన్వితులయిన వారు పరమేశ్వరునకు నమస్కరించి, నిలచి 'స్వామీ ! ఈ ఏకైక పుత్రుడు పోవటం వలన మేము మృతతుల్యులమయినాం. మా ఈ పుత్రుని బ్రతికించి జీవితార్థులయిన మాకు జీవన దానం చేయండి !' అని అడిగారు. వారు కన్నీరు నిండిన కన్నులతో ఇలా ప్రార్థించగా శంకరుడు ఆ పిల్లవానికి నూరు సంవత్సరాల ఆయువును ఇచ్చాడు. అలాగే సర్వభూత హితాన్ని కోరే పరమేశ్వరుడు ఆ నక్క గ్రద్దలకు ఆకలి పోయే రీతిగా వరం ఇచ్చాడు. తరువాత వారు అందరు పరమేశ్వరునికి నమస్కరించి ఆనంద పూర్ణులు, కృతకృత్యులు, సంతృప్తులై సుఖంగా వెళ్ళారు. **మానవుడు క్షోభపడకుండా ప్రబల మయిన దృఢనిశ్చయంతో భగవంతుని అనుగ్రహంవలన త్వరగానే సత్ఫలం పొందుతాడు.** అదృష్టం కలిసిరావటం వలన, ఆ మృతుని బంధువుల దృఢనిశ్చయం, దైన్యంతో శోకపూర్ణ లయిన వారి కన్నీరు భగవంతుడు తుడిచాడు. నిశ్చయ పూర్వకంగా చేయటంవలన వారి ప్రయత్నం ఫలించింది. పరమేశ్వరానుగ్రహంవలన ఆ మనుజులు దుఃఖం పోయి సుఖపడ్డారు. మరణించిన పిల్లవాడు పునర్జీవితుడు కావటంవలన వారికి ఆశ్చర్యమూ, సంతోషమూ కలిగాయి. భరతశ్రేష్ఠ ! శివానుగ్రహం వలన వారు త్వరగానే

శిశుమరణం వల్ల కలిగిన దుఃఖం తొలగించుకొని ఆ పిల్లవానిని తీసుకొని సంతోషంతో పట్టణంలోకి వెళ్ళారు. నాలుగు వర్ణాలలో జనించిన వారు అందరికీ ఈ వివేకం ప్రదర్శితం అయింది. ధర్మార్థమోక్షాలతో గూడిన ఈ ఇతిహాసాన్ని విన్నమనుజుడు ఈ లోకంలో, పరలోకంలో సంతోషంగా ఉంటాడు.'

154. పవన శాల్మలీ సంవాదము - 1.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'పితామహా ! బలవంతుడు, ఎల్లప్పుడు సమీపంలో ఉండేవాడు, ఉపకారంగాని అపకారంగాని చేయగలవాడు, నిరంతరం ప్రయత్న శీలుడు అయిన శత్రువుతో అల్పబలుడు అసమర్థుడు, అజ్ఞానంవలన పొంతనలేని మాటలు పలికేవాడు, వ్యర్థవాక్కులతో వైరం పెంచుకునే వాడు అయినప్పుడు; ఆ బలిష్ఠుడయిన శత్రువు ఆ బలహీనవ్యక్తిని తీసి విసరివేయటానికి వస్తే ఆతనిని ఎదుర్కొనే అల్పుడు తనబలంమీదనే నమ్మకం పెట్టుకొని, ఆ మీదికి వచ్చిన వానితో ఎలా వ్యవహరించాలి ?

భీష్ముడు చెప్పాడు. 'భరతశ్రేష్ఠా ! ఈ విషయంలో విజ్ఞులయిన వారు వాయువు బూరుగు చెట్ల సంవాదరూప మయిన ప్రాచీనమైన ఇతిహాసాన్ని ఉదాహరిస్తారు. హిమవత్పర్వతం మీద ఒక పెద్ద వనస్పతి ఉన్నది. అది చాలా సంవత్సరాలనుండి పెరిగి పెద్దదయి బోదె, కొమ్మలు, ఆకులతో నిండి దట్టంగా ఉన్నది. దాని క్రింద వేడికి తట్టుకో లేక, అలసిపోయిన మదపుటేనుగులు, ఇతర మృగజాతులు విశ్రమిస్తుండేవి. దాని పొడవు నాలుగువందల బారలు ఉండేది. దాని నీడ చాలా దట్టంగా ఉండేది. దాని మీద చిలుకలు గోరువంకలు నివసించేవి. దానికి సమృద్ధిగా పూలు, పండ్లు ఉండేవి. చాలా మనోహరమయిన ఆ బూరుగు చెట్టు క్రింద బాటసారులు, గుంపులుగా వెళ్ళే వ్యాపారస్థులు, అరణ్య వాసులయిన తపస్సులు విశ్రాంతి తీసుకొనేవారు. ఆ చెట్టుకు ఉన్న పెద్ద పెద్ద కొమ్మలను, బాగాలావుగా ఉన్న బోదెను చూసి, నారదుడు దాని సమీపానికి వచ్చి, ఇలా అన్నాడు. శాల్మలీ ! ఆహా ! నీవు ఎంత అందంగా, మనోహరంగా ఉన్నావు ? నిన్ను చూస్తే నాకు ఎల్లప్పుడూ చాల సంతోషంగా ఉంటుంది. ఎల్లవేళలా నిన్ను ఆశ్రయించి అనేక పక్షులు మృగాలు, ఏనుగులు సంతోషంగా ఉంటాయి. నీ విశాలమయిన పెద్ద కొమ్మలను గాని, చిన్న కొమ్మలను గాని, స్కంధాలను గాని వాయుదేవుడు విరగగొట్ట లేకపోయాడు. నాయనా ! నీయందు వాయుదేవునకు మమకారం ఉన్నదా ? నీకు మిత్రుడా ? నిన్ను శాశ్వతంగా ఈ వనంలో చక్కగా రక్షిస్తున్నాడే ! ఇందుకు కారణం ఏమిటి ? వాయు దేవుడు పెద్ద చెట్లను, చిన్న చెట్లను, పర్వతశిఖరాలను తీవ్రంగా ఊపివేస్తాడు గదా ! వాయువు చాలా

పవిత్రుడు. ఆయన పాతాళాన్ని సరస్సులను, నదులను, సముద్రాలను కూడా ఎండగట్టును గదా ! నీయందలి మైత్రివలననే వాయుదేవుడు రక్షిస్తున్నా డనటంలో సందేహంలేదు. అందువల్లనే నీవు ఇలా అనేకమయిన కొమ్మలు, ఆకులు, పూలతో సమృద్ధిగా ఉన్నారు. ఇన్ని పక్షులు ఈ రీతిగా నీమీద ఉంటూ ఆనందించటం చాలా రమణీయంగా నాకు అనిపిస్తున్నది. వసంతకాలంలో చాలా మనోహరంగా కూసే ఈ పక్షుల రకరకాల కూతలు ఒకే మారు చాలా ఇంపుగా వినపడుతున్నాయి. అలాగే వేసవి వేడిమికి బాధ చెందే ఈ ఏనుగులు తమ గుంపులతో కలిసి నీక్రిందికి వచ్చి సుఖపడుతున్నాయి. అదేరీతిగా నానాజాతుల మృగాలు కూడా నీ శోభను పెంపొందిస్తున్నవి. అందరికి నివాసం కావటంవలన నీవు మేరు పర్వతం వలె విరాజిల్లుతున్నావు. తపశ్శుద్ధులయిన తపస్వులతో, బ్రాహ్మణులతో, సన్న్యాసులతో నీ నివాసం స్వర్గసమాన మని నేను భావిస్తాను.'

155. పవన శాల్మలీ సంవాదము - 2.

నారదుడు అన్నాడు. 'శాల్మలీ ! తన బంధువో, లేక మిత్రుడో అనే భావంతోనే నిన్ను వాయుదేవుడు రక్షిస్తున్నాడు అనటంలో సందేహంలేదు. ఆయన భయంకరుడు, ఎక్కడి కయినా నిరాటంకంగా వెళ్ళగలవాడు. నీవు వాయుదేవుని ఎదుట చాలా ఎక్కువ వినయంతో 'నేను నీవాడను' అని అంటూ ఉంటావు. అందువల్లనే ఆయన నిన్ను ఎల్లప్పుడూ రక్షిస్తుంటాడు. వాయుదేవుని బలంతో చెడిపోని, భగ్నం కాని వృక్షంకాని, పర్వతం గాని భూమండలం మీద నీ నివాసంలాగా ఇంత సురక్షితంగా నేను చూచింది ఏదీ లేదు. అందువల్లనే ఇలా అనుకొంటున్నాను. శాల్మలీ ! ఇటువంటి కారణాలు వేటివల్లనో ప్రేరితుడు కాకపోతే వాయుదేవుడు సపరివారంగా ఉన్న నిన్ను రక్షిస్తుంటాడా ? అని నా సందేహం.'

బూరుగు చెట్టు చెప్పింది. 'బ్రహ్మర్షీ ! నన్ను రక్షించటానికి వాయువు నాకు మిత్రుడు గాడు, బంధువు కాడు. బ్రహ్మ నాకు ఆప్తుడు కాడు. నారదా ! నా తేజస్సు, బలం వాయువుకంటే భయంకరమయినవి. వాయువు తన ప్రాణశక్తితో నా పదునెనిమిదవ అంశను గూడా పొందలేడు. వాయుదేవుడు వృక్షాలను, పర్వతాలను, ఇతర వస్తువులను ముక్కలు ముక్కలుచేస్తూ నా దగ్గరకు వచ్చినపుడు నా బలంతో ఆయన వేగాన్ని అడ్డుకొంటాను. దేవర్షీ ! ఈ రీతిగా అన్నిటినీ ధ్వంసం చేసే వాయువేగాన్ని నేను పలుమారులు అడ్డుకొన్నాను. కాబట్టి ఆయనకు ఎంతకోపం వచ్చినా నేను భయపడను.'

నారదుడన్నాడు. 'బూరుగచెట్టూ ! ఈ విషయంలో నీ దృష్టి విపరీతంగా

ఉన్నది. సందేహం లేదు. వాయువు బలంతో సమానమయిన బలం గల ప్రాణి జగత్తులో ఎక్కడా ఒక్కటి కూడా లేదు. ఇంద్రుడు, యముడు, కుబేరుడు, జలాధిపతి వరుణుడు కూడా వాయుదేవునితో సమానులు కారు. అలాంటప్పుడు నీవంటి సాధారణ వృక్షం సంగతి ఏమిటి ? బూరుగ చెట్టూ ! ఈ భూమి మీద ప్రాణి ఏ పని చేసినా అందు శక్తిని, జీవనాన్ని ఇచ్చేవాడు సర్వ సమర్థుడైన వాయుదేవుడే సుమా ! ఈయన శరీరంలో సరియైన రీతిగా ప్రాణాదిరూపంలో విస్తరించినప్పుడు సమస్త ప్రాణులను చేష్టావంతులను చేస్తాడు. ఆయన సరిగా పని చేయకపోతే ప్రాణుల శరీరాలలో వికృతమయిన మార్పులు వస్తాయి. సర్వప్రాణులను వహించటంలో శ్రేష్ఠుడు, పూజ్యుడు అయిన వాయుదేవునే గౌరవించటం లేదు. ఇంత కంటె వేరే బుద్ధి లాఘవం ఏముంటుంది ? శాల్మలీ ! నీవు సహజంగా నిస్సారమైన దానవు. దుర్బుద్ధివి. వాగుడుకాయవు. క్రోధాది దుర్గుణాల ప్రేరణతో అబద్దాలు చెపుతున్నావు. నీవు ఇలా అవాకులు - చవాకులు పలుకుతుంటే నాకు కోపం వస్తున్నది. నీ అపలాపాలు నేను స్వయంగా వాయు దేవునకు చెపుతాను. మంచిగంధపు చెట్లు, తమిశ వృక్షాలు, మద్దిచెట్లు, దేవదారువులు, నీటి ప్రబ్బలి, వెదురుచెట్లు, ఇంకా బలిష్ఠమైన ఇతర వృక్షాలు నీ వలె వాయుదేవుని ఆక్షేపించలేదు. వాటికి బలంలో తమకు, వాయు దేవునకు గల అంతరం బాగా తెలుసు. దుర్బుద్ధీ ! అందువల్ల అవి అన్నీ వాయువు ఎదుట తలవంచి ఉంటాయి. మూర్ఖతవల్ల నీవు మాత్రం వాయు దేవునకు గల అనంతబలాన్ని తెలుసుకోవటంలేదు. కాబట్టి నేను ఇక్కడి నుంచి సరాసరి వాయుదేవుని వద్దకు వెళ్ళుతున్నాను.'

156. పవన శాల్మలీ సంవాదము - 3.

భీష్ముడు చెప్పాడు. 'బూరుగ చెట్టుతో ఇలా చెప్పి నారదుడు వాయుదేవుని వద్దకు వెళ్ళి, శాల్మలి మాటలు చెప్పాడు.' హిమవత్పర్వతం పైన ఒక బూరుగు చెట్టు ఉన్నది. దానికి చాలా పరివారం ఉన్నది. దాని మొదలు చాలా పెద్దది. దాని నీడ చాలా దట్టమైనది, విశాలమయినది. దాని వేళ్ళు చాలా వరకు వ్యాపించి ఉన్నవి. అది నిన్ను అవమానించి మాట్లాడింది. అది నిన్ను ఆక్షేపిస్తూ చాలా మాటలు నా యెదుట పలికింది. వాయుదేవా ! వాటిని నీ ఎదుట చెప్పటం అంత బాగుండదు. వాయుదేవా ! సర్వప్రాణులను ధరించటంలో నీవు శ్రేష్ఠుడ వని, గొప్పవాడ వని, కోపంలో యమునివంటి వాడ వని నాకు తెలుసు.' భీష్ముడు అన్నాడు. 'నారదుడు చెప్పిన మాటలు విని, వాయుదేవుడు ఆ బూరుగ చెట్టు దగ్గరకు వచ్చి, కోపంతో ఇలా అన్నాడు. శాల్మలీ ! నీవన్న నా నిందా

వాక్యాలను నారదుడు అటుపోతూ నాకు చెప్పాడు. నేనే వాయువును. నా ప్రభావాన్ని, నాబలాన్ని నీకు చూపుతాను. వృక్షమా ! నీవు నాకు బాగా తెలుసు. నీ విషయం అంతా తెలిసింది. పూర్వం బ్రహ్మదేవుడు సృష్టి సమయంలో నీ నీడలో విశ్రాంతి తీసుకొన్నాడు. ఆయన నీ నీడలో విశ్రమించటం వల్ల నీ మీద దయచూపించాను. కాబట్టే నీకు రక్షణ కలిగింది. వృక్షాధమా ! అంతే కాని నీ బలం వల్లకాదు. నీవు ఒక మామూలు వాని లాగా నన్ను అవమానించావు. ఇకముందు నీవు నన్ను అవమానించకుండే విధంగా నా బలం చూపిస్తాను.

వాయుదేవుని మాటలు విని శాల్మలి వెక్కిరిస్తూ 'వాయుదేవా ! నా మీద నీకు కోపం వచ్చింది గదా ! ఇక నీ బలం నా మీద చూపించు. నా మీద నీ కోపం చూపించు. నీకు కోపంవస్తే నన్ను ఏం చేస్తావు ? గాలీ ! నీవు మహాబలసంపన్నుడివి అయినా నిన్ను చూచి నేను ఏమీ భయపడను. నీకంటే నేను బలవంతుడిని. నాకు నీ వంటే భయం ఎందుకు ? బుద్ధిబలం కలవారే బలవంతులు. శరీర బలం మాత్రమే కలవారు బలవంతులు అని పెద్దలు తలంచరు.' అన్నది. బూరుగు చెట్టు ఇలా అన్న తరువాత వాయుదేవుడు "సరే అలాగయితే రేపు నా పరాక్రమం చూపిస్తాను" అని చెప్పాడు. ఇంతలోకే రాత్రి అయింది. అప్పుడు వాయుదేవుడు మర్నాడు ఏమి చేయదలుచుకొన్నాడో శాల్మలి మనస్సులో ఊహించుకొన్నది. తాను వాయుదేవునితో సమానం కాదు అని అనుకొన్నది. నారదునికి నేను అన్నీ అబద్దాలు చెప్పాను. వాయుదేవునికంటే నేను బలహీనుడిని, అసమర్థుడిని. ఆయన చాలా బలవంతుడు గదా ! నారదుడు చెప్పినట్లు వాయుదేవుడు నిత్య బలవంతుడు. ఇతరవృక్షాల కన్నా నేను చాలా బలహీనుడను. కాని బుద్ధిబలంలో మాత్రం నాతో ఏ చెట్టూ సమానంకాదు. నా తెలివితేటల ననుసరించి వాయుదేవుని వలన ఎలాంటి భయం లేకుండా చేసుకొంటాను. ఈ వనంలో ఉండేచెట్లు అన్నీ నా తెలివి తేటలనే అనుసరిస్తే నిఃసందేహంగా వాయుదేవుని వలన ఏ ముప్పూలేకుండా ఉంటాయి. కుపితు డయిన వాయుదేవుడు ఎంతటి ఆపద కలిగిస్తాడో నాకు తెలిసినంతగా ఆ తెలివి తక్కువ చెట్లకు తెలియదు.

157. పవన శాల్మలీ సంవాదము - 4.

భీష్ముడు చెప్పాడు. 'బూరుగు చెట్టు ఇలా నిశ్చయించుకొని క్షోభపడి, పెద్ద కొమ్మలను, చిన్నకొమ్మలను, స్కంధాలను స్వయంగానే నేలరాల్చుకొని ప్రొద్దుననే తన వైపు వస్తున్న వాయుదేవుని చూసింది. అప్పుడు కోపించిన వాయువు పెద్ద పెద్ద చెట్లను

నేలకూలుస్తూ, ఆ బూరుగు చెట్టు దగ్గరకు వచ్చాడు. పూర్వం పెద్ద పెద్ద కొమ్మలతో ఉండి ఇప్పుడు ఆ కొమ్మలు, చిరుకొమ్మలు, పూలు నేల రాలి ఉన్న శాల్మలిని చూసి, ఆశ్చర్యపడి వాయుదేవుడు సంతోషంతో ఇలా అన్నాడు. 'శాల్మలీ ! కోపంతో నేను కూడా ఇలాగే చేయాలి అనుకొన్నాను. ఇప్పుడు నీవే నీ కొమ్మలను నేల గూల్చుకొన్నావు. ఇప్పుడు నీకు పెద్ద కొమ్మలు, చిరుకొమ్మలు, ఆకులు, పూలు, మొగ్గలు ఏమీ లేవు. నీ మూర్ఖతతో నీవే ఈ ఆపదను కొని తెచ్చుకొన్నావు. నీవు నా బల పరాక్రమాలకు బలి అయినావు. వాయుదేవుని మాటలు విని బూరుగు చెట్టు సిగ్గుపడి, ఆనాడు నారదుడు చెప్పిన మాటలు గుర్తు తెచ్చుకొని పశ్చాత్తాపపడింది. రాజేంద్రా ! ఈ బూరుగు చెట్టు వలెనే మూర్ఖత్వంతో బలహీనుడు బలవంతునితో శత్రుత్వం వహిస్తే ఇలాగే జరుగుతుంది. **కాబట్టి దుర్బలుడు బలవంతునితో శత్రుత్వం పెట్టుకోగూడదు. వైరం పెట్టుకొంటే శాల్మలివలెనే పశ్చాత్తాప పడవలసి వస్తుంది.** మహాత్ములయిన వారు అపకారం చేసిన వారి మీద గల శత్రుత్వాన్ని బయటపెట్టక మెల్ల మెల్లగా తమ బలాన్ని చూపిస్తారు. **దుర్బుద్ధి బుద్ధిజీవులతో వైరం పెట్టుకోరాదు. బుద్ధిమంతుని తెలివి గడ్డిపోచల మీదికి అగ్ని వ్యాపించినట్లు వేగంగా పోతుంది. రాజా ! మానవునిలో బుద్ధితో సమానమైనది ఇంకొకటి లేదు. బుద్ధిబలం గలవానితో సమానమైనవాడు ఈ లోకంలో ఎవడూ లేడు.*** అందువల్ల పిల్లలు, జడులు, గ్రుడ్డివారు, చెవిటి వారు, తన కన్నబలవంతులు చేసే ప్రతికూల చర్యలను క్షమించాలి. అలాంటి క్షమాగుణం నీలో ఉన్నది. మహాతేజస్వీ ! పదునెనిమిది అక్షౌహిణుల సేనలు కూడా అర్జునునితో సమానబలం కలవి కావు. కీర్తిమంతు డయిన అర్జునుడు తన బలం మీది నమ్మకంతో యుద్ధరంగంలో సంచరిస్తూ ఆ సమస్త సైన్యాలను చావగొట్టి పారద్రోలాడు. భరతవంశీయా ! నీకు రాజ ధర్మాలను, ఆపద్ధర్మాలను విస్తారంగా చెప్పాను. ఇంకమళ్ళీ ఏది వినాలనుకొంటున్నావు ?'

158. లోభము వలన గలుగు అనర్థములు, మహాపురుష లక్షణములు.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'భరత వంశశ్రేష్ఠా ! పాపానికి అధిష్ఠానం ఏమిటి ? దేనివల్ల మానవుడు పాపంతో ప్రవర్తిస్తాడు. దీనిని యథార్థంగా విన గోరుతున్నాను. భీష్ముడు చెప్పాడు. 'రాజేంద్రా ! పాపానికి అధిష్ఠానమైన దానిని గురించి చెపుతాను. విను. లోభం ఒక్కటే పాపానికి అధిష్ఠానం. **లోభం వల్లనే పాపం, అధర్మం, దుఃఖం**

---

* న హి బుద్ధ్యా సమం కించిత్ విద్యతే పురుషే నృప ।
తథా బలేన రాజేంద్ర న సమోఽస్తీహ కశ్చన ॥ 12

ఏర్పడుతాయి. కపటానికి, మోసానికి మూలకారణం లోభం. దీని వల్లనే మనుష్యుడు పాపాలు చేస్తుంటాడు. లోభంవల్ల కోపం కలుగుతుంది. లోభం వలననే కామం ఏర్పడుతుంది. మోహం, మాయ, అభిమానం, తీవ్రత, పరాధీనత మొదలయిన దోషాలు సంభవిస్తాయి. ఓర్పులేక పోవటం, సిగ్గువదలటం, సంపన్నాశం, ధర్మక్షయం చింత, అపకీర్తి అనేవి అన్నీ లోభం వల్లనే కలుగుతాయి. లోభంవల్లనే పీనాసితనం, అధికమయిన ఆశ, శాస్త్ర విరుద్ధమయిన పనులు చేయటం, కులాభిమానం, విద్యామదం, సౌందర్యం సంపదలవల్ల కలిగే మదం, ప్రాణులకు అపకారం చేయటం, తిరస్కరించటం, ఎవ్వరిని నమ్మక పోవటం, సర్వప్రాణులయందు ఋజువర్తనం లేకపోవటం కలుగుతాయి. పరద్రవ్యాన్ని అపహరించటం, పరస్త్రీ గమనం, మాట తొందర, మనస్సులో ఆవేశం, నిందించటం, అధిక స్త్రీ సంయోగాసక్తి, ఎక్కువ ఆకలి ? ఆత్మహత్యా యత్నం, ఈర్ష్య, అజ్ఞానవేగం, జిహ్వాచాపల్యం, ప్రతీదీ విన వలెననే ఆసక్తి, అసహ్యం, తనగొప్పలు చెప్పుకోవటం, మాత్సర్యం, పాపం, అతికష్టమయిన పనులు చేయబోవటం, చేయగూడని పనులు చేయటం - వీటి అన్నింటికి లోభమే కారణం. పుట్టినపుడు, బాల్యంలో, కౌమార వయస్సులో, యౌవనంలో మానవులు లోభం వల్లనే చెడుపనులను విడువలేరు. ముసలితనం వల్ల చిక్కి పోయినా లోభం మాత్రం తగ్గదు. నిరంతరం బాగాలోతుగా ప్రవహించే ఎన్నినదులు వచ్చి చేరినా సముద్రం నిండనట్లుగా ఎన్ని పదార్థాలు కావలసినవి చేకూరినా లోభం కడుపు నిండదు. లోభి ఎన్ని భోగాలు అనుభవించినా తృప్తి చెందడు. దేవతలు, గంధర్వులు కూడా యథార్థంగా లోభతత్వాన్ని తెలుసుకోలేరు. ఇంద్రియాలను స్వవశంలో ఉంచుకొన్నవాడు లోభంతో కూడా మోహాన్ని జయించాలి. ఇంద్రియ జయంలేని లోభులకు ఆడంబరం, ద్రోహం, నిందించటం, పీనాసితనం, మాత్సర్యం అనేవి కలుగుతాయి. విద్వాంసులు అనేకమయిన శాస్త్రాలను కంఠస్థం చేస్తారు. ఇతరుల సందేహాలు తీరుస్తారు. కాని ఈ లోభానికి బానిసలయి నిరంతరం అనేక కష్టాలను కొని తెచ్చు కొంటారు. వారు ద్వేషక్రోధాలలో మునిగి శిష్టాచారాలకు దూరం అవుతారు. పైకి తీయని మాటలు చెపుతారు. మనస్సులో మహాక్రూరులుగా ఉంటారు. గడ్డి కప్పివేసిన వేలబావులవలె ఉంటారు. ధర్మం పేరుతో లోకాన్ని మోసం చేస్తుంటారు. క్షుద్రులయిన ఆ వ్యక్తులు ధర్మాత్ములవేషంలో ఉండి జనులను దోచుకుతింటారు. తర్కబలంతో అనేకమయిన చెడు రీతులను నిలుపుతారు. లోభంతో, అజ్ఞానంతో ఉండి సజ్జనులు స్థాపించిన ధర్మమార్గాలను

నాశనం చేస్తుంటారు. లోభగ్రస్తులైన దురాత్ములు వికృతం చేయటం వల్ల చెడిపోయిన, మారిపోయిన ఆ యా ధర్మస్థితులు అలాగే ఆ రూపాల్లోనే ప్రజ్వరిల్లుతుంటాయి. కురువంశీయా ! లోభ పూర్ణమనస్సు గల వారిలో గర్వం కోపం, మదం, దుఃస్వప్నం, సంతోషంతో, శోకం, మహాభిమానం అనే దోషాలు కన్పిస్తుంటాయి.

లోభంలో మునిగి ఉండే ఇటువంటి వారిని శిష్టులు కారు అని తెలుసుకో. నీవు అడిగిన పవిత్ర నియమాలు గలిగిన శిష్టుల లక్షణాలను చెపుతాను. మళ్ళీ జన్మిస్తాం అనే భయం లేనివారు, పరలోక భీతిలేనివారు, భోగాసక్తి లేనివారు, తనవారి మీద, పరుల మీద రాగద్వేషాలు లేనివారు శిష్టులు. శిష్టాచారం అంటే ఇష్టమున్న వారు, ఇంద్రియ నిగ్రహం స్థిరంగా ఉన్నవారు, సుఖ దుఃఖాలు సమానమయినవారు, సత్యమనే ఉత్తమ మార్గస్థులు శిష్టులు. ఇచ్చేవారు, ఏమీ తీసుకోనివారు, దయగలవారు, పితరులను, దేవతలను అతిథులను సేవించేవారు, మంచి పనులు చేయటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారు. అందరికీ ఉపకారం చేసేవారు ఈ వీరులు. సర్వధర్మాలను రక్షించేవారు, సమస్త ప్రాణుల హితంకోరేవారు, ఇతరుల మేలు కోసం సర్వస్వం త్యాగం చేసేవారు అవుతారు. వారిని మంచిపనుల నుంచి ఎవరూ కదిలించలేరు. వారు కేవలం ధర్మానుష్ఠాన తత్పరులుగానే ఉంటారు. తమపూర్వులు పాటించిన సదాచారాలే తామునూడా ఆచరిస్తుంటారు. వారి ఉత్తమ ప్రవర్తన ఎప్పుడూ నశించదు. వారు ఎవరినీ భయపెట్టరు. చంచల చిత్తులుకారు. వారి స్వభావం ఎవరికీ భయంకరం కాదు. నిరంతరం సన్మార్గంలోనే ఉంటారు. హింసవారిలో స్థిరంగా ఉంటుంది. ఇలాంటి సత్పురుషులనే ఎల్లప్పుడు సేవించాలి. కామక్రోధాలకు దూరులు, మమకారరహితులు, అహంకార శూన్యులు, మంచి నియమాలు గలవారు ధర్మమార్గ స్థిరులు అయిన మహాత్ముల సాంగత్యంలో ఉండి, నీ సందేహాలు వారినడిగి తీర్చుకో. యుధిష్ఠిరా ! వారికి ధర్మాచరణం డబ్బుకోసం గాని, కీర్తికోసంగాని కాదు. వారు ధర్మాన్ని, శారీరిక క్రియలను విధిగా చేయవలసినవి అని మాత్రమే చేస్తుంటారు. భయంగాని, కోపంగాని, చాంచల్యంగాని, దుఃఖంగాని వారిలో ఉండదు. పాషండులు, ధర్మ వేషంవేసేవారు కారు. వారికి ఎలాంటి దాపరికాలు ఉండవు. కుంతీపుత్రా ! లోభం, మోహం లేనివారు, సత్యం, ఋజుమార్గాలలో ఉన్నవారు, ఏవేళా సదాచార భ్రష్టులు కానివారు - వారి మీదనే ప్రేమ పెంచుకో. లాభం గలిగినప్పుడు సంతోషించక, నష్టం కలిగినప్పుడు బాధపడక, మమకారం, అహంకారం లేకుండా, నిరంతరం సత్త్వగుణంలో

ఉండేవారు, సమదర్శనులు, లాభాలాభాలు, సుఖ దుఃఖాలు, ప్రియా ప్రియాలు, జీవన మరణాలు సమానమయిన వారు, దృఢపరాక్రమవంతులు, ఆధ్యాత్మికమయిన ఉన్నతిని కోరేవారు, సత్యమయ మార్గంలో ఉన్న వారు, ధర్మాభిమానులు అయిన మహాత్ములను శ్రద్ధగా, జితేంద్రియుడవయి సేవించు, గౌరవించు. మహాపురుషులు అందరూ సహజంగానే సద్గుణ పూర్ణ లయి ఉంటారు. మంచి చెడు విషయాలలో వారి మాట యథార్థం అవుతుంది. ఇతరులు కేవలం మాటకారులు మాత్రమే అవుతారు.'

159. అజ్ఞాన మాహాత్మ్యము.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'పితామహా ! లోభం అనర్థాలకు అన్నింటికీ మూలం అని చెప్పావు. తాతా ! ఇక అజ్ఞానానికున్న యథార్థస్థితిని వివరించు. దాని పరిణామాన్ని కూడా వినగోరుతున్నాను.' భీష్ముడు చెప్పాడు. 'అజ్ఞానం వల్ల పాపం చేస్తే ఆత్మనాశం అవుతుంది అని తెలియనివాడు, మంచివారి నడవడిని ద్వేషించేవాడు లోకనింద్యుడు అవుతాడు. అజ్ఞానం వల్ల నరకానికి వెళ్తాడు. అజ్ఞానం వల్ల దుర్గతి కలుగుతుంది. అజ్ఞానంవల్ల కష్టాల పాలు అవుతాడు. ఆపదలలో మునుగుతాడు.' యుధిష్ఠిరుడు అడిగాడు. 'అజ్ఞానపుపుట్టుక, ఉనికి, వృద్ధి, క్షయం, వ్యక్తం కావటం, మూలం, యోగం, గతికాలం, కారణం, హేతువులు ఏవి? రాజా ! నేను ఈ విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా తత్త్వవివేచనతో వినగోరుతున్నాను.' భీష్ముడు చెప్పాడు. 'రాగం, ద్వేషం, మోహం, సంతోషం, శోకం, అభిమానం, కామం, క్రోధం, పాగరు, కునికిపాటు, సోమరితనం, కోరిక, ద్వేషం, సంతాపం, ఇతరుల అభివృద్ధిని చూచి సంతాపం చెందటం, పాపకార్యాలు - ఇవి అన్నీ అజ్ఞాన కార్యాలు కావటం వల్ల అజ్ఞానం అని చెపుతారు. దీని ప్రవృత్తిని, అభివృద్ధి విశేషాలను విస్తారంగా చెపుతాను. విను. రాజా ! అజ్ఞానమూ, అతిలోభమూ ఒకటే తెలుసుకో. ఈ రెండూ సమాన ఫలితాల నిచ్చేవి, లోభం వల్ల అజ్ఞానం పెంపొందుతుంది. లోభం ఉన్నంతవరకు అజ్ఞానం ఉంటుంది. లోభం క్షీణిస్తే అజ్ఞానం క్షీణిస్తుంది. అజ్ఞాన లోభాలవల్ల జీవుడు నానావిధ జన్మలు ఎత్తుతాడు. మోహమే లోభానికి మూలకారణం. కాలస్వరూప మయిన మోహాత్మకాజ్ఞానమే మానవుని దుర్గతికి కారణం అవుతుంది. లోభం భిన్నం కావటానికి కూడా కాలమే కారణమవుతుంది. మూఢు డయిన మనుష్యునికి అజ్ఞానం వల్లలోభం, లోభంవల్ల అజ్ఞానమూ కలుగుతాయి. లోభంవల్లనే సర్వదోషాలు పుడతాయి. కాబట్టి లోభాన్ని వదిలేయాలి. జనకుడు, యువనాశ్వుడు,

వృషాదర్భి, ప్రసేనజిత్తు, అలాగే ఇతర రాజులు లోభనాశం వల్లనే స్వర్గానికి వెళ్ళారు. కురుశ్రేష్ఠా ! నీవు ప్రయత్నపూర్వకంగా ప్రత్యక్షంగా కన్పించే ఈ లోభాన్ని వదలిపెట్టు. లోభాన్ని వీడి ఇహలోకసుఖాన్ని, మరణానంతరం పరలోకంలో ఆనందాన్ని పొంది సుఖంగా ఉంటావు.

160. దమ మాహాత్మ్యము.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'ధర్మాత్మా ! పితామహా ! స్వాధ్యాయానికి యత్నిస్తూ, ధర్మకార్యం చేయదలచిన వానికి ఈ లోకంలో శ్రేయస్కరం ఏమి ? జగత్తులో శ్రేయస్సును కలిగించే అనేక దర్శనాలు (మతాలు) ఉన్నాయి. నీవు శ్రేయస్కరం అనుకునేది, ఇహలోకపరలోకాలలో మేలు కలిగించేదీ ఏమిటో నాకు చెప్పవలసింది. ఈ ధర్మమార్గం చాల గొప్పది. దీని నుండి అనేక శాఖలు ఏర్పడ్డాయి. ఈ ధర్మాలలో సర్వోత్తమమై, ఆచరించదగిన ధర్మాన్ని సంపూర్ణంగా చెప్పగోరుతాను. రాజా ! అనేక శాఖలుగల మహత్తర మయిన ధర్మానికి పరమమూల మైనది సంపూర్ణంగా తెలుపవలసింది.' భీష్ముడు చెప్పాడు. 'వత్సా ! నీకు మేలు కలిగించే దాన్ని చెపుతాను. అమృతం త్రాగితే కలిగేటంత తృప్తి కరమయిన దానిని విని, ఈ జ్ఞానామృతంతో తృప్తి పొందుతావు. **మహర్షులు చెప్పిన ధర్మవిధులు అనేకం ఉన్నవి. అవి అన్నీ వారి వారి విజ్ఞానాన్ని ఆశ్రయించి చెప్పినవి. కాని వాటి అన్నింటికీ ఆధారం దమం (మనస్సు, ఇంద్రియాల సంయమనం) అనేదే.** ధర్మసిద్ధాంతం తెలిసిన పెద్దలు దమాన్ని గొప్పమేలు కలిగించటానికి సాధనంగా చెప్పారు. విశేషంగా బ్రాహ్మణునికి సనాతన ధర్మం దమమే సుమా ! దమం వల్లనే వానికి తాను చేసే ఉత్తమకార్యసిద్ధి యథావిధిగా కలుగుతుంది. దమం, దానం కంటె, యజ్ఞాల కంటె, స్వాధ్యాయాని కంటె గొప్పది. **దమం తేజస్సును పెంపొందిస్తుంది. దమం పరమ పవిత్ర సాధనం. దమంతో పాపరహితుడయి తేజస్వియైనవాడు పరమ పదాన్ని పొందుతాడు. లోకాలు అన్నింటిలోనూ దమంతో సమాన మయిన ధర్మం వేరొకటి లే దని వింటూ ఉంటాం. జగత్తులోని సర్వధర్మావలంబకులకు దమమే పరమధర్మం గదా ! అందరూ దాన్ని బాగా ప్రశంసించారు.** దమం కల వ్యక్తికి పరమ సుఖం కలుగుతుంది. ఆ వ్యక్తి ఇహలోక పరలోకాలలో పరమసుఖాన్ని పొందుతాడు. **దమం గలవాడు, సుఖంగా నిద్రిస్తాడు. సుఖంగా మేలుకొంటాడు. సుఖంగా లోకాలలో సంచరిస్తాడు. ఆతని మనస్సు ఎల్లప్పుడు ప్రసన్నంగా ఉంటుంది.** దమం లేని మనుజుడు నిరంతరం కష్టాలు పడతాడు. తన దోషాలవలననే అతడు

ఇతర మయిన అనేక అనర్థాలను సృష్టిస్తాడు. బ్రహ్మచర్యాదులయిన నాలుగు ఆశ్రమాలలోను దమమే ఉత్తమ వ్రతంగా చెప్పారు. ఇంద్రియ మనోనిగ్రహాల వల్ల కలిగే లక్షణాలను చెపుతాను. అవి కలగటమే దమం. క్షమ, ధీరత, అహింస, సమత్వం, నిజం చెప్పటం, చక్కని ప్రవర్తన, ఇంద్రియ జయం, సమర్థత, మార్దవం, సిగ్గు, స్థిరత్వం, ఔదార్యం, కోపం లేకుండటం, సంతోషం, చక్కని మాటలు చెప్పే అలవాటు, ఏ ప్రాణికీ కష్టం కలిగించకపోవటం, ఇతరుల తప్పులను వెతక్కపోవటం అనే సద్గుణాలు కలగటమే దమం అంటారు. ఈ దమం గల వారిలో పెద్దలమీద గౌరవం, సర్వప్రాణుల మీద దయ, నిందారోపణం లేకపోవటం కన్పిస్తాయి. లోకాపవాదం, అబద్ధం చెప్పటం, నిందాస్తుతులు చేయటం, కామం, క్రోధం, లోభం, దర్పం, మందకొడితనం, గొప్పలు చెప్పుకోవటం, రోషం, ఈర్ష్య, పరావమానం అనే దుర్గుణాలకు ఆతడు అలవాటుపడడు. దమం కలవాడు లోకనిందల పాలుగాడు. అతనికి ఏకోరికా ఉండదు. చిన్న చిన్న వస్తువుల కోసం ఎవరి ముందూ చేయిచాచడు. తుచ్ఛమయిన ఇంద్రియ సుఖాలు కోరడు. ఇతరుల తప్పులు వెదుకడు. సముద్రంవలె గంభీరంగా ఉంటాడు. ఎంత నీరు వచ్చినా సముద్రం నిండనట్లు ఎన్ని ధర్మకార్యాలు చేసినా తృప్తుడు కాడు. నాకు 'నీతో చెలిమి ఉంది. నీకు నాతో మైత్రి ఉంది. వారికి నేనంటే ప్రేమ, నాకు వారంటే మమకారం' అనే విషయాలను జితేంద్రియుడు ఆలోచించడు. పల్లెలోనివారికి, అరణ్య వాసులకు ఉండే ప్రవృత్తులు అనుసరించనివాడు, ఇతరుల స్తుతినిందలను ఆశ్రయించనివాడు ముక్తు డవుతాడు. అందరి యందు స్నేహం గలవాడు, శీల సంపన్నుడు, ప్రసన్నమయిన మనస్సుగలవాడు, ఎలాంటి ఆసక్తులు లేనివాడు జ్ఞాని; అట్టివానికి మరణానంతరం మోక్షం అనే మహాఫలం కలుగుతుంది. మంచినడవడిగలవాడు, శీల సంపన్నుడు, ప్రసన్నచిత్తుడు, ఆత్మజ్ఞాని అయిన విద్వాంసుడు ఈ లోకంలో గౌరవం పొంది ఉత్తమ గతిని పొందుతాడు. ఈ లోకంలో కేవలం శుభకర మయిన పని, సత్పురుషులు ఆచరించినదియే జ్ఞాని అయిన మునికి మార్గం అవుతుంది. అతడు సహజంగానే దాన్ని ఆచరిస్తాడు. దాని నుండి ఎప్పుడూ పతితుడు కాడు. జ్ఞాన సంపన్నుడైన, జితేంద్రియుడు అరణ్యానికి వెళ్ళి మృత్యుకాలానికై ఎదురుచూస్తూ ద్వంద్వాతీతవిచారణ కలిగి చరిస్తాడు. ఇలా ఉన్నందువల్ల ఆతడు బ్రహ్మ భావం పొందటానికి అర్హుడు అవుతాడు. ఇతర ప్రాణుల వల్ల భయం లేనివాడై, ఇతర ప్రాణులను భయపెట్టనివాడు దేహత్యాగానంతరం కూడా ఎక్కడా ఎలాంటి భయమూ పొందడు. అతడు అనుభవించి ప్రారబ్ధకర్మలను క్షీణింపజేస్తాడు. కర్తృత్వాభిమానం, ఫలాపేక్ష

లేకపోవటం వలన నూతన కర్మ సంచయం ఉండదు. సర్వప్రాణులయందు సమభావం కలిగి అందరికి మిత్రు డయి, అభయం ఇస్తూ సంచరిస్తాడు. ఆకాశంలో పక్షుల, నీళ్ళలో జలచరాల పదచిహ్నాలు కన్పించని రీతిగా జ్ఞాని గతి తెలియదు. ఇందులో సంశయం లేదు. ఇల్లు, వాకిలి వదలి మోక్షమార్గాన్నే ఆశ్రయించేవానికి అనంత సంవత్సరాల కాలం దివ్యతేజోమయలోకాలు సంప్రాప్తిస్తాయి. శుద్ధమయిన ఆచారం కలిగి, నిర్మలమయిన అంతఃకరణం ఉండి, మంచికోరికలు కలిగి భోగపరాఙ్ముఖుడై ఆత్మజ్ఞానం గలవాడు నానావిద్యలను, తపస్సును, సర్వకర్మలను యథావిధిగా సంన్యసించి (త్యజించి), సంన్యాసి అయితే ఇహలోకంలో సంమానితుడై అక్షయ స్వర్గాన్ని పొందుతాడు. **బ్రహ్మరాశినుండి జనించిన బ్రహ్మదేవుని నివాసం హృదయగుహలో దాచి పెట్టబడి ఉన్నది. దమం వలననే నిత్యమూ అది ప్రాప్తిస్తుంది.** ఏ ప్రాణితో విరోధం లేనివాడై, జ్ఞాన స్వరూపుడై ఆత్మారాము డయిన జ్ఞానికి ఈ లోకంలో పునర్జన్మ భయం లేదు. అలాంటి వానికి పరలోకభయం ఎందుకు ఉంటుంది ? **ఇంద్రియమన స్సంయమంలో ఒకే దోషం ఉన్నది గాని మరొకటి లేదు. క్షమాగుణం గలవానిని జనులు అశక్తుడు అని భావిస్తారు.** మహాప్రాజ్ఞా ! వానికి ఉండే ఈ ఒక్క దోషమే మహాగుణం అవుతుంది. క్షమాగుణం కలిగి ఉండటం వలన ఆ వ్యక్తికి అనేక పుణ్యలోకాలు సులభం అవుతాయి. క్షమతో సహనం కూడా ప్రాప్తిస్తుంది. **యుధిష్ఠిరా ! సంయమం గలవానికి అరణ్యానికి వెళ్ళవలసిన అవసరం ఏముంది ? అలాగే అది లేని వానికీ అరణ్యవాసం అవసరం లేదు. దాంతుడు ఉన్న చోటే అరణ్యం, అదే ఆశ్రమం.'** వైశంపాయనుడు చెప్పాడు. 'జనమేజయా ! భీష్ముడు చెప్పిన దీనిని విన్న యుధిష్ఠిరునకు అమృతపానం చేసినంత తృప్తి కలిగింది. మళ్ళీ ఆయన ధర్మాత్ములలో శ్రేష్ఠ డయిన భీష్ముని తపస్సు విషయమై ప్రశ్నించాడు. ఆయన ఆ విషయం ధర్మరాజుకు వివరిస్తున్నాడు.

161. తపోమహిమ.

భీష్ముడు చెపుతున్నాడు. **'రాజా ! ఈ సమస్త జగత్తు తపోమూలం అని విద్వాంసులు చెపుతారు. తపస్సు చేయని మూఢుడు తాను చేసిన మంచి పనుల ఫలాన్ని పొందలేడు.** భగవాను డయిన ప్రజాపతి ఈ జగత్తును అంతను తపస్సుతోనే సృజించాడు. అలాగే మహర్షులు వేదాలను తపస్సుతోనే పొందారు. ఫలాలు, దుంపలు, అన్నం అనే వానిని బ్రహ్మదేవుడు తపస్సుతోనే సృష్టించాడు. తపస్సిద్ధులే ఏకాగ్ర మనస్సుతో ముల్లోకాలను చూడగలరు. ఔషధాలు, ఆరోగ్యాదుల ప్రాప్తి,

నానావిధకార్యాలు తపస్సు వలననే సిద్ధిస్తాయి. సర్వ సాధనలకు తపస్సే మూలం. ప్రపంచంలో దుర్లభ మయిన వస్తువు ఏదయినా తపస్సువలననే సులభం అవుతుంది. మహర్షులు తపస్సుతోనే అణిమాది లయిన అష్టవిధాలయిన ఐశ్వర్యాలను పొందారు. త్రాగుబోతు, దొంగ, గర్భపాతం చేసేవాడు, గురుపత్నీ గమనం చేసేవాడు కూడా తపస్సు వలననే పాప విముక్తుడు అవుతాడు. **అనేకవిధాలుగా తపస్సు ఉంటుంది. నానా విధాలయిన సాధనాలతో మానవుడు తపస్సులో ఆసక్తు డవుతాడు. కాని నివృత్తి మార్గంలో పయనించేవానికి ఉపవాసాన్ని మించిన సాధనం లేదు. మహారాజా ! అహింస, నిజం చెప్పటం, దానం, ఇంద్రియనిగ్రహం గలిగిఉండటం అనే వాటి కంటే మించిన తపస్సు, ఉపవాసం లేవు. దానానికంటే మించిన దుష్కరమయిన ధర్మం లేదు. మాతృసేవను మించిన ఆశ్రయం వేరేలేదు. వేదత్రయం అధ్యయనం చేసిన విద్వాంసులను మించిన విద్వాంసుడు లేడు. సంన్యాసమే సర్వోత్తమ తపస్సు.** ఈ లోకంలో ధార్మికులు స్వర్గానికి సాధన మయిన ధర్మాన్ని రక్షించటానికి ఇంద్రియాలను సురక్షితాలను (నిగ్రహవంతాలను) చేస్తారు. కాని అర్థ ధర్మాలు సిద్ధించటానికి తపస్సే ఉపవాసాన్ని మించిన సాధనం. ఋషులు, పితరులు, దేవతలు, మానవులు, పశుపక్షులు ఇంకా ఇతరప్రాణులు సమస్తమూ తపస్తత్పరతతో ఉంటాయి. ఇలాగే దేవతలుకూడా తపస్సు వలననే మహత్త్వాన్ని పొందారు. అనేక ఫలాలు కూడా తపస్సుతోనే ఎప్పుడయినా సిద్ధిస్తాయి. తపస్సుతో దేవత్వం కూడా ప్రాప్తిస్తుంది. ఇది నిశ్చయం.'

162. సత్యమహిమ.

యుధిష్ఠిరుడు అడిగాడు. పితామహా ! విప్రులు, ఋషులు, పితరులు, దేవతలు అందరూ సత్యం చెప్పటం అనే ధర్మాన్ని ప్రశంసిస్తారు. కాబట్టి నేను సత్యలక్షణం ఇప్పుడు వినగోరుతున్నాను. అది చెప్పవలసింది. సత్య లక్షణం ఏమిటి ? దాన్ని పొందటం ఎలా ? సత్యాన్ని చెప్పటం వల్ల లాభం ఏమిటి ? అది చెప్పవలసింది.' భీష్ముడు చెప్పాడు. 'భరతనందనా ! బ్రాహ్మణాది చతుర్వర్ణాల ధర్మాలు పరస్పరం కలిసిపోవటం మేలు కాదు అంటారు. నిర్వికార మయిన సత్యం అన్ని వర్ణాలలోను ప్రతిష్ఠిత మయి ఉన్నది. **సత్పురుషులు ఎల్లప్పుడు సత్యం అనే ధర్మాన్ని అనుష్ఠించారు. సత్యమే సనాతన మయిన ధర్మం. సత్యానికే ఎప్పుడూ నమస్కరించాలి. సత్యమే ఉత్తమ మయిన గతి. సత్యమే ధర్మం, తపస్సు, యోగం. సత్యమే సనాతన మయిన**

బ్రహ్మ. సత్యమే గొప్పయజ్ఞం అని చెప్పారు. సమస్తమూ సత్యంలోనే ఉన్నది. సత్యాచారాలను, లక్షణాలను ఇప్పుడు క్రమంగా చెపుతాను విను. సత్యాన్ని ఎలా పొందవచ్చునో దాన్ని కూడా నీవు ఇప్పుడు వినవచ్చు. భారతా ! సర్వలోకాలలోను సత్యం పదమూడు విధాలు. సత్యం, సమత, దమం, మాత్సర్యం లేకుండటం, క్షమ, లజ్జ, సహనం, అసూయ లేకపోవటం, త్యాగం, ధ్యానం, శ్రేష్ఠమయిన ఆచరణం, నిరంతరం స్థిరంగా ఉండే ధైర్యం, అహింస అనే ఈ పదమూడూ సత్యస్వరూపాలే. ఇందులో సందేహం లేదు. సత్యం ఎలాంటి మార్పులేనిది. వినాశ రహితం, వికారరహితం. సమస్త ధర్మాలకు అనుకూలమయిన కర్తవ్య పాలనం అనే యోగం ద్వారా ఈ సత్యప్రాప్తి కలుగుతుంది. తనకు ఇష్టడయిన మిత్రుని యందు, ఇష్టడు కాని శత్రువునందు సమాన భావంతో ఉండటం సమత. రాగద్వేషాలను, కామక్రోధాలను క్షీణింపజేయటమే సమానత్వప్రాప్తికి ఉపాయం. ఇతరుల వస్తువులను తీసుకోవలెననే కాంక్ష లేక పోవటం, ఎల్లవేళలా గంభీరంగా, స్థిరంగా, ధైర్యంగా ఉండటం; భయం వదలటం, రోగాలను శాంతింపజేసుకోవటం దమలక్షణం. ఇది జ్ఞానం వల్ల కలుగుతుంది.

దాన ధర్మాలు చేసే సమయంలో మనస్సుని గ్రహించు కోవటం- అంటే ఈ విషయంలో ఇతరులను చూసి, ఈర్ష్య పడకపోవటాన్ని అమాత్సర్యం అంటారు. సత్యానుష్ఠానం వలననే మానవుడు మాత్సర్యరహితుడు అవుతాడు. సహింపదగినవి, సహింపదగనివి, ఇష్టమయినవి, ఇష్టంకానివి అయిన మాటలను సమానంగా సహించేవాడే సర్వ సమ్మతుడు, క్షమాశీలుడయిన శ్రేష్ఠ వ్యక్తి అవుతాడు. సత్యం చెప్పే వ్యక్తికే ఉత్తమరీతిగా క్షమాగుణం ఏర్పడుతుంది. వివేకవంతుడు ఇతరులకు బాగా మేలు చేస్తాడు. మనస్సులో ఎప్పుడూ బాధపడడు. మనస్సు, మాట ఎల్లప్పుడు శాంతంగా ఉండేవాడు లజ్జకలవాడు. ధర్మాచరణంవల్ల ఈ లజ్జాగుణం ప్రాప్తిస్తుంది. ధర్మార్థాల సాధనకు కష్టాలను సహించటాన్ని తితిక్ష అంటారు. లోకానికి ఆదర్శంగా ఉండటానికి దాన్ని తప్పక పాటించాలి. ధైర్యం వల్ల తితిక్ష కలుగుతుంది. (ఇతరుల దోషాలు గమనించకపోవటం అసూయ). విషయాసక్తిని వదలటమే అసలైన త్యాగం. రాగద్వేషాలు వీడిన తరువాతనే త్యాగం సిద్ధిస్తుంది గాని వేరు రీతిగా కాదు. తానెవరో తెలియజేయకుండా ప్రయత్న పూర్వకంగా ప్రాణులకు మేలు కలిగించే పని చేసేవాని మంచిమనస్సు, ప్రవర్తనలనే ఆర్యత అంటారు. ఆసక్తిని వదలితే ఇది లభిస్తుంది. సుఖం గాని, దుఃఖం గాని కలిగినప్పుడు ఎలాంటి మార్పును పొందకపోవటమే ధృతి అవుతుంది. తన ఉన్నతిని కోరుకొనే వివేకవంతుడు నిరంతరం ధృతిని పాటించాలి. మానవుడు

ఎల్లప్పుడు సహనం కలిగి ఉండటం, సత్యతత్పరుడు కావటం ముఖ్యం. సంతోషం, భయం, కోపం అనే మూడింటిని వదలిన విద్వాంసునికే ధైర్యం లభిస్తుంది. మనోవాక్కియలతో సమస్త ప్రాణులకు ఎప్పుడూ ద్రోహం చేయకపోవటం, దయ, దానం కలిగి ఉండటం ఉత్తమ వ్యక్తికి ఉండవలసిన సనాతన ధర్మం. విడివిడిగా చెప్పిన ఈ పదమూడు ధర్మాలు సత్యాన్ని ఒక్కదానిని ఉద్దేశించి చెప్పినవే. ఇవి సత్యాన్నే ఆశ్రయించి, దాన్ని పరిపుష్టం చేస్తాయి. భూపాలకా ! సత్య గుణాలు ఇన్ని అని చెప్పటానికి అంతులేదు. అందువల్లనే పితృదేవతలతో కూడా విప్రులు సత్యాన్ని ప్రశంసిస్తారు. **సత్యం చెప్పటాని కంటే ఉత్తమ ధర్మం లేదు. అబద్ధం చెప్పటానికంటే మించిన పాపం లేదు. ధర్మం యొక్క ఉనికిని కాపాడేది సత్యమే. కాబట్టి సత్యాన్ని లోపింపజేయరాదు.** దానం, దక్షిణతో గూడిన యజ్ఞం, త్రివిధాగ్నులలో (దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్ని) హోమం చేయటం, వేదాధ్యయనం చేయటం, ఇతరమైన ధర్మాలను నిర్ణయం చేయటం గల శాస్త్రాలను అధ్యయనం చేస్తే కలిగే ఫలం మానవుడు సత్యం చెప్పటం వల్ల పొందుతాడు. **వేయి అశ్వమేధ యజ్ఞాల (ఫలాల)ను, త్రాసులో ఒక వైపు, సత్యవచన ఫలాన్ని ఇంకొక వైపు ఉంచి తూచితే వేయి అశ్వమేధ యజ్ఞాల ఫలానికంటే ఒక్క సత్య వచనఫలమే ఎక్కువగా తూగుతుంది.'**

163. కామక్రోధాదులైన పదమూడు దోషములు - వాని నాశనోపాయములు.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'భరతశ్రేష్ఠా ! మహాప్రాజ్ఞా ! క్రోధం, కామం, శోకం, మోహం, శాస్త్రవిరుద్ధ కార్యం చేయవలెననే కోరిక, ఇతరులను చంపవలెననే కోరిక, మదం, లోభం, మాత్సర్యం, ఈర్ష్య, నింద, దోషదృష్టి, అసూయ, పీనాసితనం (దైన్యం) - అనే దోషాలు ఎందువల్ల కలుగుతాయో యథావిధిగా వివరించి చెప్పవలసింది.' భీష్ముడు చెపుతున్నాడు. 'మహారాజా ! ఈ పదమూడు ప్రాణులకు బలవత్తర శత్రువులు అని చెపుతారు. ఈ లోకంలో మానవుని అన్ని వైపుల నుంచి చుట్టుముట్టి ఉంటాయి. ఇవి నిరంతరం జాగరూకాలై పరాకుగా ఉండే వ్యక్తిని అధికంగా బాధిస్తాయి. మానవుని చూసినంతనే నక్కల వలె ఇవి బలంగా మానవుని మీదికి దూకుతాయి. 'వీటివల్లనే దుఃఖం కలుగుతుంది. వీటి వల్లనే పాపం కలుగుతుంది.' అని మానవుడు ఎల్లవేళల తెలుసుకొని ఉండాలి. భూపాలా ! వీటి పుట్టుక, ఉనికి, నాశం నీకు చెపుతాను. మొదట క్రోధం కలిగే రీతిని ఉన్నది ఉన్నట్లు చెపుతాను, ఏకాగ్ర మనస్సుతో వినుము. **లోభంవల్ల**

క్రోధం కలుగుతుంది. ఇతరుల దోషాలను గమనించటం వల్ల పెరుగుతుంది. క్షమించటం వల్ల అణగుతుంది. క్షమాగుణం వల్లనే నశిస్తుంది. కామం సంకల్పం వల్ల కలుగుతుంది. దాన్ని సేవిస్తుంటే పెరుగుతుంది. వివేకవంతుడు విరక్తుడు అయినప్పుడు ఆ కామం నశిస్తుంది. క్రోధలోభాలవల్ల, అభ్యాసం వల్ల పరాసుత (హింసించటం, చంపటం) వ్యక్తం అవుతుంది. సర్వప్రాణులయందు దయచూపటం, వైరాగ్యం అనేవాటి వల్ల అది వెనుదిరుగుతుంది. ఇతరుల దోషాలు చూడటంవల్ల అది కలుగుతుంది. వివేకవంతులకు తత్త్వజ్ఞానం వలన నశిస్తుంది. అజ్ఞానం వల్ల మోహం కలుగుతుంది. పాపాలను చేయటం వల్ల పెంపొందుతుంది. విజ్ఞానవంతులయందు గౌరవాదులు కలగటం వల్ల ఆ మోహం నశిస్తుంది. ధర్మవిరుద్ధాలయిన శాస్త్రాలను చదవటం వలన మానవుల మనస్సులలో తగని పనులు చేయవలెననే కోరిక కలుగుతుంది. ఇది తత్త్వజ్ఞానం వల్ల నివర్తిస్తుంది. తనకు ప్రేమ పాత్రమయిన ప్రాణితో వియోగం కలిగినప్పుడు శోకం కలుగుతుంది. కాని మానవుడు శోకించటం వ్యర్థం అని భావించినపుడు వెంటనే శోకం నశిస్తుంది. క్రోధ, లోభ, అభ్యాసాలవల్ల పరాసుత (పరహింసా ప్రవృత్తి) కలుగుతుంది. సర్వప్రాణులయందు దయ చూపటం వలన, వైరాగ్యం వలన అదిపోతుంది. సత్యాన్ని వదలటం, దుష్టులతో పొత్తుపెట్టుకోవటం వల్ల మాత్సర్యం కలుగుతుంది. ఉత్తమ పురుష సాంగత్య, సేవలవల్ల అది నశిస్తుంది. తనది ఉన్నతకుల మని, తనకు గొప్పజ్ఞానం ఉన్న దని, ఐశ్వర్యం ఉన్న దని దేహాభిమానం గల మానవునకు మదం కలుగుతుంది. కాని వాని యథార్థస్వరూపం తెలిసిన వెంటనే ఆ మదం నశిస్తుంది. మనస్సులో కోరిక కలగటం వల్ల, ఇతరులు సుఖపడడం చూసినందువలన ఈర్ష్య కలుగుతుంది. కాని వివేకశీలమయిన బుద్ధి వల్ల అది నశిస్తుంది. సమాజ బహిష్కృతు లయిన నీచవ్యక్తుల ద్వేష పూర్ణ మయిన మాటలు విని, భ్రమపడడం వల్ల నిందించటం అనే అలవాటు కలుగుతుంది. కాని మహాత్ముల దర్శనం వలన అది తొలగుతుంది. తమకు కీడుచేసే బలవంతులైన వారికి ప్రతీకారం చేయలేనప్పుడు ఆ వ్యక్తి మనస్సులో తీవ్రమయిన అసూయ కలుగుతుంది. కాని దయాగుణం జాగృతమయితే అది తొలగుతుంది. దయా హీనులను, పీనాసివారిని చూడటం వల్ల తనలో పీనాసితనం కలుగుతుంది. ధర్మాత్ములను ఉదాత్త భావంతో తెలుసుకొంటే ఆ పిసినిగొట్టుతనం నశిస్తుంది. అజ్ఞానం వల్ల ప్రాణులలో లోభం ఎప్పుడూ కలుగుతుంది. భోగాలు అశాశ్వతాలు అని తెలుసుకొంటే ఆ భావం

నివృత్తం అవుతుంది. ఈ పదమూడు దోషాలను శాంతిని అవలంబించటం వలన జయించవచ్చు అని చెపుతారు. ధృతరాష్ట్ర పుత్రులలో ఈ పదమూడు దోషాలు ఉన్నాయి. నీవు సత్యాన్ని గ్రహించి ఉత్తముల సేవ చేయటం వలన వీటిని జయించావు.'

164. నీచ పురుష లక్షణములు.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'భరతనందనా ! ఎల్లప్పుడు మహాత్ముల దర్శన సేవలవలన మృదువుగా ఎలా వ్యవహరించాలో తెలుసుకొన్నాను. కాని క్రూరులను, వారి పనులను నేను సరిగా తెలుసుకోలేదు. మానవులు త్రోవలో కనపడిన ముండ్లను, బావులను, అగ్నిని వదలినట్లు క్రూరకర్మలు చేసేవానిని నరులు వదలివేస్తారు. నృశంసుడు బ్రతికి ఉన్నా, మరణించినా ఎల్లప్పుడు ఇహలోకపరలోకాలలో శోకాగ్నితో దగ్ధ డవుతుంటాడు. కాబట్టి క్రూరులను, వారి ధర్మ కర్మలను వివరంగా చెప్పవలసింది.' భీష్ముడు చెపుతున్నాడు. 'మనుష్యులో నింద్య మయిన కోరికలు ఉండటం హింసాప్రధానమయిన నింద్య కర్మలను చేయటం, ఇతరులను నిందించటం, ఇతరులచే నిందితుడు కావటం, విధి తనను మోసగించినదని అనుకోవటం, పాపప్రవృత్తుడు కావటం, తాను చేసిన దానాలను మాటి మాటికి చెప్పుకోవటం, విషమభావ పూర్ణత, నీచ కార్యాలు చేయటం, ఇతరుల బ్రతుకు తెరువులను భగ్నం చేయటం, భోగ్యవస్తువులను ఇతరులకు ఇవ్వకుండా తానే అనుభవించటం, అభిమాన పూర్ణత, విషయాసక్తత, తనను పొగడు కోవటానికి అర్థంలేని వాగుడు వాగటం, అందరిని సందేహించటం, కాకివలె వంచనాశీలం కలిగిఉండటం, కృపణత్వంతో నిండిఉండటం, స్వవర్గీయులను మాత్రమే ప్రశంసించటం, బ్రహ్మచర్యాది ఆశ్రమద్వేషం, వర్ణసాంకర్యాన్ని వ్యాపింపజేయటం, కేవలం హింసచేయటానికే తిరగటం, గుణాలను కూడా అవగుణాలుగా భావించటం, అధికంగా అబద్ధాలు చెప్పటం, ఔదార్య శూన్యత, మహత్తర లోభము - ఇవి కల వ్యక్తియే క్రూరకర్మలు చేసేవాడు అని చెపుతారు. ఈ నృశంసుడు ధర్మాత్ములు, గుణవంతులను పాపాత్ము లనుకొంటాడు. తన స్వభావాన్నే ఆదర్శం అనుకొని, ఎవరినీ విశ్వసించడు. ఇతరులకు అపకీర్తి వచ్చేచోట అక్కడ అతడు వారి రహస్యమయిన దోషాలను కూడా ప్రచారం చేస్తాడు. తనతప్పులు, ఇతరుల తప్పులు సమాన మయినా తన బ్రతుకు తెరువుకోసం ఇతరులనే సర్వనాశనం చేస్తాడు. తనకు ఉపకారం చేసిన వాడిని తనవలలో పడినట్లు భావిస్తాడు. ఉపకారికి అవసరమయి నప్పుడు డబ్బు ఇచ్చి కూడా ఎందుకు ఇచ్చానా ?

అని సంతాపం చెందుతాడు. ఇతరులు చూస్తుండగా ఉత్తమమయిన భక్ష్య, పేయ లేహ్యాదులను, ఇంకా ఇతరమయిన భోజ్య పదార్థాలను తాను ఒక్కడే తింటుంటే వానిని వృశంసుడు అనవచ్చు. మొదట ఉత్తమ భక్ష్యాదులను బ్రాహ్మణులకి ఇచ్చి, తరువాత మిత్రులతో కూడా కలిసి, స్వీకరించేవాడు ఈ లోకంలో అనేకసుఖాలను అనుభవించి, మరణానంతరం స్వర్గానికి వెళ్తాడు. భరతశ్రేష్ఠా నృశంసుని ప్రవర్తనాదులను వివరించి చెప్పాను. తెలిసిన వ్యక్తి ఇలాటి వారిని ఎల్లప్పుడు దూరంగా ఉంచాలి.'

165. నానావిధ పాపములు - ప్రాయశ్చిత్తములు.

భీష్ముడు చెపుతున్నాడు. 'సర్వవేదాలను ఉపనిషత్తులను అధ్యయనం చేసిన విద్వాంసుడయిన బ్రాహ్మణుడు యజ్ఞం చేయదలచుకొన్న ప్పుడు, ఆయన ధనం అపహృతం అయితే రాజు ఆ ఆచార్యునికి దక్షిణ ఇవ్వటానికి, పితృశ్రాద్ధానికి, వేదశాస్త్రాధ్యయనం చేయటానికి ధనం ఇవ్వాలి. ఉత్తమ బ్రాహ్మణులు సామాన్యంగా ధర్మానికే ధనభిక్షను అడుగుతారు. వీరికి దానాన్ని, విద్యాధ్యయనానికి ధనాన్ని ఇవ్వాలి. ఇది కాక భిన్న మయిన పరిస్థితిలో బ్రాహ్మణునికి దక్షిణ ఇవ్వాలి. బ్రాహ్మణేతరులకును యజ్ఞ వేదికి ఆవల అపక్వాహారం ఇచ్చే విధానం ఉన్నది. రాజు బ్రాహ్మణులకు వారి యోగ్యతానుసారం సర్వవిధాల రత్నాలను ఇవ్వాలి. బ్రాహ్మణులే బహుదక్షిణలు గల యజ్ఞ స్వరూపులు. తమ సంపద ననుసరించి సమస్త కార్యాలు నెరవేర్చు కోవటానికి ఎల్లప్పుడు పరస్పరం కలిసి ఉత్తమ యజ్ఞాన్ని అనుష్ఠిస్తారు. తాను పోషించవలసిన కుటుంబంలోని వారిని పోషించటానికి మూడు సంవత్సరాల వరకు కావలసిన ధనం ఉన్నా, ఇంకా ఇంతకన్నా అధికధనం ఉన్నా అలాంటి బ్రాహ్మణుడే సోమయాగం చేయాలి. ధార్మికు డయిన రాజు ఉండగా ఎవరి యజ్ఞమైనా ప్రత్యేకించి బ్రాహ్మణునియజ్ఞం ధనంలేక పోవటం వలన నిలిచిపోతే, ఆ యజ్ఞంలో స్వల్పభాగం మిగిలి ఉంటే ఆ రాజు తనరాజ్యంలో పశుసమృద్ధి, వైభవ సంపన్ను డయిన వైశ్యుడు యజ్ఞం గాని, సోమయాగం గాని చేయకుండా ఉంటే, ఆతనికి కుటుంబం నుంచి ఆ యజ్ఞానికి ధనం తీసుకొనవచ్చు. కాని రాజు తన ఇష్టం వచ్చినట్లు శూద్రుని ధనం నుంచి కొంచెంకూడా తీసుకోరాదు. శూద్రునికి యజ్ఞంలో ఏ మాత్రం అధికారం లేదు. నూరు ఆవులు ఉన్న వైశ్యుడు అగ్నికార్యం చేయకపోతే, వేయిగోవులు ఉండికూడా యజ్ఞం చేయకపోతే అలాంటి వైశ్యుల కుటుంబాలనుంచి రాజు ధనం తీసుకోవచ్చు. ధనం ఉండి కూడా దాన్ని దానం చేయకపోతే వారి ఆ

దోషాన్ని బట్టబయలు చేసి సర్వదా ధర్మంకోసం ధనం తీసుకోవాలి. ఇలా చేసే రాజుకు సంపూర్ణ ధర్మం సిద్ధిస్తుంది.

యుధిష్ఠిరా ! ఇలాగే అన్నం విషయంలో చెప్పేది విను. ఎవరయినా ఒక బ్రాహ్మణుడు ఆహారం లభించక మూడు రోజులు ఉపవాసం చేస్తే, అలాంటి స్థితిలో నికృష్టకార్యం చేసే ఏ వ్యక్తి ఇంటి నుంచి అయినా తనకు ఒక రోజు భోజనానికి సరిపోయే ఆహారం తీసుకోవచ్చు. అది రెండవ రోజుకు మిగలనంతమాత్రమే అయిఉండాలి. **కళ్ళంలో నుంచి గాని, పాలం నుంచి గాని, తోటనుంచి గాని, ఎక్కడయినా ఆహారం దొరికితే దాన్ని అక్కడి నుంచి తెచ్చుకోవాలి. తరువాత రాజు అడిగినా, అడగకపోయినా ఆయన వద్దకు వెళ్ళి తానుచేసిన పని చెప్పాలి.** ఆ సమయంలో ధర్మజ్ఞుడయిన రాజు ధర్మానుసారం ఆయనను దండించగూడదు. రాజు తెలివితక్కువతన వల్లనే బ్రాహ్మణుడు ఆకలిబాధపడవలసి వచ్చిందిగదా ! రాజు ఆ బ్రాహ్మణుని శాస్త్రజ్ఞానం, స్వభావం తెలుసుకొని ఆయనకు తగిన బ్రతుకుతెరువును చూపించాలి. తండ్రి తన ఔరసపుత్రుని రక్షించినట్లు రాజు ఆ బ్రాహ్మణుని రక్షించాలి. ప్రతి సంవత్సరం చేయవలసిన అగ్రాయణాదు లయిన యజ్ఞాలను చేయలేకపోతే వానికి బదులుగా ప్రతిదినం వైశ్వానరీ ఇష్టిని సమర్పించాలి. ముఖ్య కర్మ చేయవలసినచోట గౌణ (అప్రధాన) కర్మ చేయటాన్ని అనుకల్పం అంటారు. అనుకల్పం కూడా పరమధర్మమే అని ధర్మజ్ఞులు అంటారు. విశ్వేదేవులు, సాధ్యులు, బ్రాహ్మణులు, మహర్షులు – వీరు అందరూ మృత్యువుకు భయపడి, ఆపత్కాలంలో ప్రత్యేక విధులను ప్రతినిధులుగా చేశారు. ముఖ్య కార్యం చేయటంలో సమర్థుడు అయిఉండి కూడా గౌణవిధి ననుసరించి పనిచేసే దుర్బుద్ధికి పరలోకంలో రావలసిన ఫలం ప్రాప్తించదు. వేదవేత్త అయిన బ్రాహ్మణుడు తన అవసరాలను గురించి రాజుకు మనవి చేసుకొనరాదు. తన శక్తిని, రాజశక్తిని పోలిస్తే తనకున్న శక్తియే బలవత్తర మయినది. కాబట్టి బ్రహ్మవేత్తల తేజస్సు రాజుకు సహించవీలుగానిది. బ్రాహ్మణుడు ఈ జగత్తుకు కర్త, శాసకుడు, ధరించేవాడు, పోషించేవాడు అవుతున్నాడు. కాబట్టి ఆయననుగూర్చి అశ్లీలమయిన మాటలు పలుకరాదు. వ్యర్థవాక్యాలు అనగూడదు. క్షత్రియుడు తనకు కలిగిన ఆపదనుంచి బాహుబలంతో బయటపడాలి. ధనంతో వైశ్యశూద్రులు; మంత్రాలు, హోమాలతో బ్రాహ్మణుడు కలిగే ఆపదల నుంచి ముక్తులు కావాలి. కన్య గాని, యువతి గాని, మంత్రం తెలియనివాడు గాని, మూర్ఖుడుగాని, సంస్కారహీనుడు గాని అగ్నిలో హోమం చేయటానికి అధికారి కాడు. అర్హతలేనివారు హోమంచేస్తే నరకంలో పడతారు. యజ్ఞకర్త గూడా నరకగామి అవుతాడు. కాబట్టి యజ్ఞం చేయటానికి యజ్ఞకర్మలో

నిపుణుడు, వేదపారంగతు డయిన విద్వాంసుడు మాత్రమే హోమం చేయదగినవాడు అవుతాడు. అగ్నిహోత్రాన్ని ప్రారంభించి, ప్రజాపతి దేవతకు అశ్వాన్ని దక్షిణగా ఇవ్వనివానిని ధర్మవేత్తలు అనాహితాగ్ని అని వ్యవహరిస్తారు. మానవుడు ఏ పుణ్య కర్మనైనా శ్రద్ధతో, ఇంద్రియజయంతో చేయాలి. తగినంత దక్షిణకోసం ద్రవ్యం లేకుండా ఎలాంటి యజ్ఞాన్ని చేయరాదు. దక్షిణలేని యజ్ఞం, ప్రజలకు, పశువులకు, స్వర్గప్రాప్తిలో విఘ్నకరం అవుతుంది. అంతేకాక ఇంద్రియాలను యశస్సును, కీర్తిని, ఆయువును క్షీణింపజేస్తుంది. ముట్టు అయిన స్త్రీతో సమాగమం చేసేవారు, ఇంటిలో అగ్నిస్థాపన చేయనివారు, అవైదికమైన రీతిలో హోమం చేసేవారు పాపాచారులు అవుతారు. ఒక గ్రామంలో ఒకే బావినీరు ఊరిలోనివారు అందరూ త్రాగేవారయితే ఆగ్రామంలో పన్నెండేళ్ళ ఉన్నా, శూద్రస్త్రీని వివాహమాడినా బ్రాహ్మణుడు శూద్రుడు అవుతాడు. బ్రాహ్మణుడు తన భార్యను కాక ఇతర స్త్రీని తన ప్రక్కమీద కూర్చుండబెట్టినా, వృద్ధుడయిన శూద్రుని, బ్రాహ్మణేతరుడైన క్షత్రియుని, వైశ్యుని గౌరవించి ఉన్నతాసనం మీద కూర్చోబెట్టి తాను క్రింద చాప మీద కూర్చున్నా ఆ బ్రాహ్మణుడు బ్రాహ్మణత్వం కోల్పోతాడు. ఆ బ్రాహ్మణుడు పవిత్రుడు ఎలా అవుతాడో విను. బ్రాహ్మణుడు ఒక రాత్రిఅయినా నీచవర్ణుని సేవించినా, వానితోపాటు ఒకే చోట ఉన్నా దానివల్ల కలిగే పాపాన్ని మూడు సంవత్సరాలు వ్రతాన్ని పాటిస్తూ భూమిపయి సంచరిస్తూ పోగొట్టుకోవాలి. **రాజా ! పరిహాసంలో, స్త్రీ వద్ద, వివాహ సందర్భంలో గురువుల హితం కోసం, తన ప్రాణాలను కాపాడుకోవటానికి చెప్పే అబద్ధం హానికరం కాదు. ఈ అయిదు అవసరాలలో చెప్పే అసత్యం పాపంకాదు** అని పెద్దలు చెప్పారు. నీచవర్ణ డయిన వ్యక్తి వద్ద ఉత్తమవిద్య ఉంటే దాన్ని శ్రద్ధాపూర్వకంగా గ్రహించవచ్చు. అపవిత్ర ప్రదేశంలో పడిపోయినా బంగారాన్ని సందేహించకుండా తీసుకోవచ్చు. నీచకులం నుంచి అయినా ఉత్తమ స్త్రీని గ్రహించవచ్చు. విషస్థానంలో నుంచి అమృతం లభిస్తే త్రాగవచ్చు. స్త్రీలు, రత్నాలు, నీరు నింద్యాలు కావు. గోవులకు, బ్రాహ్మణులకు మేలు కలగటానికి; వర్ణసాంకర్యం నివారించటానికి, ఆత్మరక్షణకు వైశ్యుడు శస్త్రం చేతపట్టవలెను. **మద్యపానం, బ్రహ్మహత్య, గురుస్త్రీ గమనం అనే మహాపాప విముక్తికోసం ఎలాంటి ప్రాయశ్చిత్తం చెప్పబడలేదు. ఏ రీతిగానయినా తాను మరణించటమే వాటికి ప్రాయశ్చిత్తం అవుతుంది** అని విద్వాంసులు నిశ్చయించారు. **మహారాజా ! బంగారం దొంగిలించటం, ఇతర వస్తువులను అపహరించటం, బ్రాహ్మణధనాపహరణం, అనేవి మహా పాపాలు. మద్యపానం, పొందరాని స్త్రీని పొందటం, పతితునితో సంబంధం పెట్టుకోవటం, బ్రాహ్మణేతరుడయి ఉండి**

బ్రాహ్మణ స్త్రీతో సంగమించటం వలన స్వేచ్ఛాచారి అయిన పురుషుడు శీఘ్రంగా పతితుడు అవుతాడు. పతితునితో కలిసి ఉంటే, వానిచేత యజ్ఞం చేయిస్తే, వానికి చదువు చెపితే, మానవుడు ఒక సంవత్సరంలో పతితుడు అవుతాడు. కాని వాని సంతతితో తన సంతతికి వివాహం చేసినా, ఒకే వాహనంలోగాని, ఒకే ఆసనం మీద గాని కూర్చుంటే, ఆతనితో కలిసి భోజనం చేస్తే ఒక సంవత్సరం కాదు- వెంటనే పతితుడు అవుతాడు ! భరతనందనా ! పయిన చెప్పిన పాపాలు అనిర్దేశ్యాలు (ప్రాయశ్చిత్తం లేనివి) అని చెప్పారు. ఇవికాక ఇతర పాపాలు అన్నీ నిర్దేశ్యాలు. శాస్త్రాలు వాటికి ప్రాయశ్చిత్తాలను చెప్పినవి. వాటిని అనుసరించి ప్రాయశ్చిత్తం చేసుకొని, పాపవ్యసనం వదలి పెట్టవలెను. పైన చెప్పిన (మద్య పానం చేసేవారు, బ్రహ్మహత్య చేసినవారు, గురుపత్నీ గమనం చేసినవారు) మూడు రకాల పాపులను మరణించిన తరువాత వారిశవాలను దహనాదులు చేయకుండానే వారి కుటుంబంవారు ఆ మృతుల ధనధాన్యాదులను నిస్సందేహంగా తీసుకోవచ్చు. ఇంకొక ఆలోచన అక్కరలేదు. ధర్మాత్ముడయిన రాజు తనమంత్రు లయినా గురువు లయినా పతితులు అయితే వారిని వదలి వేయాలి. తమ పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోనంతకాలం వారితో మాటాడరాదు.

పాపం చేసిన వ్యక్తి ధర్మాచరణం, తపస్సు చేసి తన పాపం పోగొట్టుకొంటాడు. దొంగను 'వీడు దొంగ' అని అంటేనే చోరుని వలె పాపి అవుతాడు. **దొంగకాని వానిని దొంగ అంటే రెండు రెట్లు పాపం కలుగుతుంది. కన్య కావాలని శీలం పోగొట్టుకొంటే ఆమెకు బ్రహ్మ హత్యలోని మూడు పాళ్ళు పాపం.** ఆ కన్య శీలం పోగొట్టినవాడు (బ్రహ్మ హత్యా పాతకంలో) మిగిలిన నాల్గవవంతు పొందుతాడు. ఈ లోకంలో బ్రాహ్మణులను నిందించి, లేక వారిని పట్టుకొని నెట్టి వేసే వానికి మహత్తర పాపం కలుగుతుంది. నూరు సంవత్సరాలు అతడు పిశాచంవలె తిరుగుతాడు. ఉండటానికి చోటు దొరకదు. వేయి సంవత్సరాలు ఆతడు నరకంలో ఉండవలసి వస్తుంది. కాబట్టి బ్రాహ్మణనింద చేయరాదు. వారిని ఎప్పుడూ క్రింద పడేటట్టు చేయరాదు. బ్రాహ్మణుని శరీరానికి గాయం అయి అందులో నుంచి వచ్చిన రక్తం ఎన్ని ధూళికణాలను తడుపుతుందో ఆయనకు గాయం కలిగించినవాడు అన్ని సంవత్సరాలు నరకంలో పడతాడు. గర్భగత శిశువును చంపినవాడు యుద్ధంలో ఆయుధపు దెబ్బతో మరణిస్తే అతనికి శుద్ధి కలుగుతుంది. లేక బాగా మండే అగ్నిలో దూకి దగ్ధుడై, పాపవిముక్తుడు అవుతాడు. మద్యపానం చేసేవాడు, ఆ మద్యాన్ని బాగా కాచి వేడి మద్యం త్రాగితే ఆపాపం నుండి విముక్తుడవుతాడు. దానితో శరీరం కాలి మరణిస్తే అతడు శుద్ధుడు అవుతాడు. ఇలా శుద్ధుడు అయితేనే ఆ

బ్రాహ్మణుడు ఉత్తమలోకాలకు పోతాడు. వేరే మార్గం లేదు. పాపాలోచనలు గల దుర్మార్గుడు గురపత్నీ సంగమపాపం చేస్తే బాగా కాలిన స్త్రీ ఇనుప ప్రతిమను ఆలింగనం చేసుకొని, ప్రాణాలు తీసుకొంటేనే ఆ పాపశుద్ధి కలుగుతుంది. లేక తన శిశ్నాన్ని, వృషణాలను స్వయంగా ఖండించికొని, చేతులతో పట్టుకొని, నైఋతిదిక్కువైపు పోతూ నేలగూలినా లేక బ్రాహ్మణ రక్షణలో ప్రాణాలు అర్పించినా శుద్ధుడు అవుతాడు. అశ్వమేధం, గోసవం, అగ్నిష్టోమం యజ్ఞాలను యథావిధిగా చేసి, అతడు ఇహలోక పరలోకాలలో పవిత్రు డవుతాడు. బ్రహ్మ హత్యచేసిన వాడు మరణించిన ఆ బ్రాహ్మణుని పుట్టెను తీసుకొని తానుచేసిన పాపకర్మను జనులకు చెపుతూ, బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం స్నానంచేస్తూ తపోమగ్ను డయితే శుద్ధుడు అవుతాడు.

ఇలాగే గర్భవతి అయిన స్త్రీని హత్య చేసినవాడు ఆ దోషంవల్ల రెండు బ్రహ్మహత్యలు చేసినంత పాపం పొందుతాడు. మద్యపానం చేసినవాడు మితాహారి, బ్రహ్మచారి అయి నేల మీద పండుకొనవలెను. ఇలా మూడు సంవత్సరాలు ఉన్న తరువాత అగ్నిష్టోమం అనే యజ్ఞం చేయాలి. తరువాత వేయి ఎద్దులను, లేక అదే సంఖ్యతో గోవులను బ్రాహ్మణులకు ఇచ్చి శుద్ధు డవుతాడు. వైశ్యుని సంహరిస్తే వెనుకటి రీతిగా ఉన్న తరువాత నూరు ఎద్దులను, నూరు గోవులను దానంచేయాలి. శూద్రుని హత్యచేస్తే హంతకుడు ఒక సంవత్సరం పైన చెప్పిన వ్రతం చేసి, ఒక ఎద్దును, నూరు గోవులను దానం చేయాలి. కుక్కను గాని, పందిని గాని, గాడిదను గాని చంపితే శూద్రహత్యకు చెప్పిన వ్రతనియమాలను పాటించాలి. పిల్లి, నెమలి, కప్ప, కాకి, పాము, ఎలుక మొదలయిన ప్రాణులను చంపితే పైన చెప్పిన పశువధతో సమాన పాపమే కలుగుతుంది. ఇప్పుడు ఇతర ప్రాయశ్చిత్తాలను గురించి చెపుతాను. తెలియక పురుగులను చంపటంలాంటి చిన్న చిన్న పాపాలు చేస్తే వాటికి పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తం. దీని వల్లనే శుద్ధి కలుగుతుంది. గోవధ కాక ఇతర మయిన ఉపపాతకాలలో ప్రతి ఒక్క దానికి ఒక్కొక్క సంవత్సరం చొప్పున వ్రతాచరణం చేయాలి. శ్రోత్రియపత్నితో వ్యభిచరిస్తే మూడు సంవత్సరాలు, ఇతర పరస్త్రీ సమాగమానికి రెండు సంవత్సరాలు బ్రహ్మచర్య వ్రత పాలనం చేస్తూ పగలు నాలుగోజాములో ఒక్కమారు భోజనం చేయాలి. తనకోసం ప్రత్యేకమయిన చోటును ఏర్పరుచుకొని సంచరించాలి. రోజుకు మూడుసార్లు స్నానంచేయాలి. ఇలాచేస్తేనే ఆ పాపాలు తొలగుతాయి. అగ్ని హోత్రాలను ధ్వంసంచేసినవానికి ఇదే ప్రాయశ్చిత్తం. నిష్కారణంగా తల్లిదండ్రులను, గురువును పరిత్యజించిన వాడు పతితు డవుతాడు. వానికి కేవలం అన్న వస్త్రాలు ఇవ్వాలి. పైత్రక సంపద నీయరాదు. అతడు

బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ బ్రాహ్మణులకు దానాలు ఇవ్వాలి. (తల్లి దండ్రులను, గురువును వెనుకటివలె ఆదరించాలి). ఇలా చేస్తే పాపం నుండి విముక్తుడవుతాడు. ఇది ధర్మశాస్త్ర నిర్ణయం.

భార్య వ్యభిచరిస్తే, ప్రత్యేకంగా వ్యభిచరించేటప్పుడు పట్టుబడితే, పరస్త్రీతో వ్యభిచారం చేసిన పురుషునికి విధించిన ప్రాయశ్చిత్త రూపవ్రతాన్నే ఆమె చేత చేయించాలి. ఉత్తము డయిన తన భర్తను వదలి పాపాత్ము డయిన ఇతరుని ప్రక్కన చేరిన కులట అయిన స్త్రీని పెద్ద మైదానంలో వదలి రాజు కుక్కలతో ఆమెను బాధించాలి. ఇలాగే వ్యభిచారి అయిన పురుషుని వివేకి అయిన రాజు బాగా వేడెక్కిన ఇనుపమంచం మీద పడుకోబెట్టి పైన కట్టెలు పెట్టి తగలబెట్టాలి. దాంతో ఆ పాపాత్ముడు తగలబడి బూడిద అవుతాడు. భర్తను అపహసించి పరపురుషునితో వ్యభిచారం చేసే స్త్రీలకూ ఇదే దండన. పైన చెప్పిన దుష్టుల ప్రాయశ్చిత్తాలకు ఇంకొక విధానం కూడా ఉంది. ఒక సంవత్సరం లోపల ప్రాయశ్చిత్తం చేసుకొనని దుష్టపురుషునికి ఆ ప్రాయశ్చిత్తం రెండురెట్లు ఉంటుంది. ఆ పతితులతో రెండు, మూడు, నాలుగు, ఐదు సంవత్సరాలు కలిసి ఉండేవ్యక్తి మునులకు తగిన వ్రతాన్ని పాటించి, అన్ని సంవత్సరాలు భూమి మీద సంచరిస్తూ, భిక్షాటనతో బ్రతుకు వెళ్ళబుచ్చాలి. జ్యేష్ఠ సోదరునికి వివాహం కాక పూర్వమే అధర్మంగా తమ్ముడు వివాహం చేసుకొంటే పెద్దవాడిని 'పరివిత్తి' అని అంటారు. తమ్ముని 'పరివేత్త' అంటారు. ఆతడు పెండ్లాడిన స్త్రీని పరివేదనీయ అంటారు. వీరు అందరూ పతితులే అని పెద్దలు అంటారు. ఈ ముగ్గురూ తమ పవిత్రతకోసం, యజ్ఞం చేయని బ్రాహ్మణునకు చెప్పిన వ్రతం గాని, ఒక మాసం వరకు చాంద్రాయణం గాని, కృచ్ఛచాంద్రాయణవ్రతం గాని చేయాలి. పరివేత్త అయినవాడు ఆ నవవధువును కోడలుగా అన్నకు ఇవ్వాలి. పెద్దన్న అనుమతి లభించిన తరువాత చిన్నతమ్ముడు పత్నిగా గ్రహించాలి. ఇలా చేస్తే ఆ ముగ్గురు పాప విముక్తులు అవుతారు. పశుజాతిలో ఆవును తప్ప ఇతర జాతుల పశువులను తెలియక హింసించి నట్లయితే అది పాప సంపాదకం కాదు. మానవుడు పశువులకు అధిష్ఠాత లేక పాలకుడు అని పెద్దలు చెప్పారు. గోవధచేసిన పాపాత్ముడు ఆ గోవుతోకపైకి కనపడేటట్లు ధరించి, మట్టి మూకుడు చేత్తో పట్టుకొని ప్రతిరోజూ ఏడు ఇండ్లలో తన పాపం చెప్పుకొంటూ భిక్షాటనం చేయాలి. ఆ దొరికిందే తినాలి. ఇలా చేస్తే పన్నెండు రోజులకు ఆతడు శుద్ధుడు అవుతాడు. పాపం అధికం అయితే ఒక సంవత్సరం ఆ వ్రతం అనుష్ఠించాలి. అందువల్ల పాపవిముక్తి కలుగుతుంది. ఈ రీతిగా మానవులకు ఉత్తమ ప్రాయశ్చిత్త విధానం ఉన్నది. దానం చేసే స్తోమత

ఉన్నవారికి దాన విధానం ఉన్నది. ఈ ప్రాయశ్చిత్తాలన్నీ సరిగా తెలుసుకొని చేయాలి. నాస్తికులు కాని వారికి గోదానం మాత్రమే ప్రాయశ్చిత్తంగా చెప్పారు. కుక్క, పంది, మనుష్యుడు, కోడి, గాడిదల మాంసంగాని, మలమూత్రాలుగాని స్వీకరిస్తే (తింటే) బ్రాహ్మణునికి మళ్ళీ ఉపనయనాది సంస్కారాలు చేయాలి. సోమపానం చేసిన బ్రాహ్మణుడు మద్యపానం చేసిన వాని వాసన చూసినా మూడురోజులు వేడినీరు మాత్రమే త్రాగిఉండాలి. తరువాత వేడిపాలను మూడురోజులు త్రాగాలి. ఆ తరువాత వేడి గాలిని పీలుస్తూఉండాలి. దీనివల్ల అతడు శుద్ధుడు అవుతాడు. ఈ రీతిగా ఈ సనాతన ప్రాయశ్చిత్తాన్ని అందరికీ చెప్పారు. బ్రాహ్మణునికి ఇది విశేషరూపమైన విధానంగా ఉన్నది. తెలియకచేసిన పాపానికే ఈ ప్రాయశ్చిత్త విధానం చెప్పారు.'

166. ఖడ్గోత్పత్తి, మాహాత్మ్యము.

వైశంపాయనుడు చెప్పాడు. 'జనమేజయా ! చెప్పే కథ అయిన తరువాత అవకాశం చూసి ఖడ్గయుద్ధ విశారదుడయిన నకులుడు అంపశయ్యమీద ఉన్న భీష్మపితామహుని ఇలా అడిగాడు.' నకులుడు అన్నాడు. 'ధర్మజ్ఞా ! పితామహా ! ఈ లోకంలో ధనుస్సు శ్రేష్ఠమయిన ఆయుధం అని అనుకొంటారు. కాని నా ఉద్దేశ్యంలో పట్టునయిన ఖడ్గమే శ్రేష్ఠ మయినది. ధనుస్సు విరిగిపోతే, గుఱ్ఱాలు నేలగూలితే అలాంటి సమయంలో కూడా యుద్ధంలో ఆత్మరక్షణం ఖడ్గంతో చేసుకోవచ్చు గదా ! ధనుర్ధరులను, గద, శక్తి అనే ఆయుధాలు దాల్చిన వారిని ఖడ్గధారి అయిన వీరుడు బాధింప సమర్థుడవుతాడు. రాజా ! అన్నియుద్ధాలలో ఏ ఆయుధం శ్రేష్ఠమయినది ? అని నాకు సందేహం, కుతూహలం అధికంగా ఉన్నది. తాతా ! ఖడ్గాన్ని దేనికోసం, ఎవరు, ఏ రీతిగా ఉత్పన్నం చేశారు ? ఖడ్గయుద్ధానికి ప్రసిద్ధమాచార్యుడు ఎవరు ? ఈ ప్రశ్నలకు అన్నిటికి సమాధానం చెప్పగోరుతాను.'

భీష్ముడు అన్నాడు. 'మాద్రీపుత్రా ! నీవు అడిగిన ప్రశ్నతత్త్వాన్ని విను. రక్త సిక్తమయిన ఈ శరంతో గైరికధాతువుతో ఎఱ్ఱబడిన పర్వతంలాగా పడి ఉన్న నన్ను ఈ ప్రశ్నతో జాగృతుని చేశావు. నాయనా ! ఈ జగత్తు అంతా పూర్వం కదలిక లేనిది, ఆకాశరహితం, చూపించటానికి కూడా భూమి కనపడని రీతిగా నీటితో ఏకార్ణవం అయింది. అంతటా చీకటి క్రమ్ముకొన్నది. శబ్ద స్పర్శలు కూడా లేకుండా ఉన్న ఈ ఏకార్ణవం అతిగంభీరంగా కన్పించింది. నిఃశబ్దంగా గట్టులేకుండా ఉన్నది. ఆ మహాసాగరంలో లోకపితామహుడయిన బ్రహ్మ ఆవిర్భవించాడు. శక్తిశాలి అయిన ఆయన వాయువును,

అగ్నిని, సూర్యుని సృష్టించాడు. పైన ఆకాశాన్ని, క్రింద భూమిని, రాక్షస సముదాయాన్ని సృజించాడు. చంద్రుడు, తారకలు, నక్షత్రాలు, గ్రహాలతో గూడిన ఆకాశాన్ని, సంవత్సరాలను, ఋతువులను, మాసాలను, పక్షాలను, లవాలను, క్షణాలను సృష్టించాడు. తరువాత బ్రహ్మ లౌకికమయిన శరీరం ధరించి మరీచి, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు, అంగిరసుడు, రుద్రుడు అనే వారిని పుట్టించాడు. వీరు అందరూ మహాతేజస్సంపన్నులు. ప్రచేతసుల పుత్రుడయిన దక్షుడు అరువది మంది కన్యలను జనింపజేశాడు. వారిని అందరిని సంతానోత్పత్తి కోసం బ్రహ్మర్షులు భార్యలుగా స్వీకరించారు. ఆ కన్యలనుండి సమస్త ప్రాణులు, దేవతలు, పితరులు, గంధర్వులు, అప్సరసలు, నానావిధ రాక్షసులు, పక్షులు, మృగాలు, చేపలు, కోతులు, మహాసర్పాలు, నీటిలో భూమి మీద సంచరించే పక్షుల సమూహాలు, తరుగుల్మాదులయిన ఉద్భిజాలు, చెమటవల్ల కలిగే పేలు, క్రిములు, గ్రుడ్డు వల్ల గలిగే కోడి మొదలయినవి, మావి వల్లగలిగే ప్రాణులు కల జగత్తు అంతా ఆవిర్భవించింది.

లోకపితామహు డయిన బ్రహ్మ ఇలా భూత సృష్టి చేసి, వారి మీద వేదోక్తమయిన సనాతనధర్మ రక్షణభారాన్ని మోపాడు. ఆచార్యులు, పురోహితగణాలతో గూడిన దేవతలు, ఆదిత్యులు, వసువులు, రుద్రులు, సాధ్యులు, మరుత్తులు, అశ్వినులు – వీరు అందరూ ఆ సనాతన ధర్మంలో ప్రతిష్ఠితులు. భృగువు, అత్రి, అంగిరసుడు అనే సిద్ధమునులు, తపోధనులయిన కాశ్యపగణం, వసిష్ఠగౌతమ, అగస్త్యాదులు, నారద పర్వతులు, వాలఖిల్యాది ఋషులు, ప్రభాసులు, సికతులు, ఘృతపులు (నేయి త్రాగి ఉండేవారు), సోమపులు (సోమపానం చేస్తుండేవారు), మరీచిపులు (సూర్యకిరణాలను త్రాగేవారు), వైశ్వానరులు, అకృష్టులు (దున్నకుండా, వేయకుండా కలిగే ఆహారంతో జీవించేవారు), హంస మునులు (సంన్యాసులు), అగ్ని నుంచి జనించిన ఋషులు, వానప్రస్థులు, పృశ్నులు – ఈ మహాత్ములు అందరూ బ్రహ్మదేవుని ఆజ్ఞాధీను లయి సనాతన ధర్మాన్ని రక్షించసాగారు.

దానవ శ్రేష్ఠులు క్రోధలోభాలతో గూడి, ఆ పితామహుని శాసనాన్ని అతిక్రమించి, ధర్మానికి హానిచేయసాగారు. హిరణ్య కశిపుడు, హిరణ్యాక్షుడు, విరోచనుడు, శంబరుడు, విప్రచిత్తి, విరాధుడు, నముచి, బలి అనేవారేకాక ఇంకా అనేక దైత్య దానవగణాలు ధర్మసేతువును అతిక్రమించి, అధర్మాలు చేయవలెననే దృఢ నిశ్చయంతో, ధర్మానికి హాని కలిగించసాగారు. 'మేమూ దేవతలు ఒకే జాతి వారం. కాబట్టి దేవతల వంటి వారమే మేము !' అని ఈ రీతిగా ఏకజాతి ధర్మాన్ని ఆశ్రయించి దైత్యులు దేవతలతో, ఋషులతో పోటీ పడసాగారు. భరతనందనా ! వారు ప్రాణులకు మేలు చేయరు.

దయచూపరు. వారు సామదాన భేదాలనే మూడు ఉపాయాలను ఉల్లంఘించి, కేవలం దండోపాయంతోనే సమస్త ప్రజలను పీడించసాగారు. ఆ అసురశ్రేష్ఠులు గర్వించి, ఆ ప్రజలతో మాటలాడటం కూడా మానేశారు. అప్పుడు బ్రహ్మర్షులతో కూడ బ్రహ్మదేవుడు హిమవత్పర్వత శిఖరం మీద ఉన్నాడు. ఆకాశంలో ఉండే నక్షత్రాలు ఆ శిఖరం మీద వికసించిన పద్మాల లాగా ఉన్నవి. దాని వైశాల్యం నూరుయోజనాలు ఉంది. అది మణిరత్నాలతో వ్యాపించి ఉన్నది. వత్సా ! వృక్షాలు, వనాలు పూలతో నిండిఉన్న ఉత్తమ మయిన ఆ శిఖరం మీద దేవశ్రేష్ఠ డయిన బ్రహ్మ జగత్కార్యసిద్ధికోసం నివసిస్తున్నాడు.

తరువాత చాలా వేల సంవత్సరాలు దాటిపోయిన తరువాత బ్రహ్మదేవుడు శాస్త్రవిధి ననుసరించి అక్కడ ఒక యజ్ఞం ప్రారంభించాడు. మహర్షులు, ఇతర కార్యకర్తలు యథావిధిగా ఆ యజ్ఞకార్యాలు నిర్వహిస్తున్నారు. అక్కడ యజ్ఞవేదిక మీద సమిధలు నిండి ఉన్నాయి. అంతటా అగ్ని ప్రజ్వరిల్లుతున్నది. బంగరు యజ్ఞ పాత్రలు యజ్ఞమండపశోభను ఇనుమడింపజేస్తున్నాయి. ఆ యజ్ఞ మండపం శ్రేష్ఠదేవ గణాలతో, బ్రహ్మర్షులతో, సదస్యులతో ప్రకాశిస్తున్నది. అక్కడ చాల ఘోరమయిన సంఘటన జరగటం గురించి మహర్షులు చెప్పగా విన్నాను. నక్షత్రాలు ఉదయించిన తరువాత నిర్మలమయిన ఆకాశంలో చంద్రుడు ఉదయించినట్లు ఆ యజ్ఞమండపంలోని అగ్నిని చెల్లాచెదరుచేస్తూ ఒక భయంకర ప్రాణి ఉదయించినట్లు తెలుస్తోంది. అది నల్లకలువల కాంతి వంటి కాంతికలది, పదునయిన కోరలు గలది, సన్నని నడుము కలది, చాల పొడవయినది, సమీపించ వీలుగానిది, మహాతేజోవంతమై ఉంది. అది ఉత్పన్నం కాగానే భూకంపం కలిగింది. పెద్ద తరంగాలు, సుడులతో మహాసముద్రం అల్లకల్లోలం అయింది. ఆకాశం నుంచి ఉల్కలు పడ్డాయి. మహోత్పాతాలు కలిగాయి. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దిక్కులు క్షోభించాయి. అమంగళకరంగా గాలి వీచింది. సమస్త ప్రాణులు మహాభయంతో వ్యధచెందాయి. ఆ భయంకరభూతం రావటంచూసి, బ్రహ్మ మహర్షులతో, దేవతలతో, గంధర్వులతో ఇలా అన్నాడు. నేనే ఈ భూతాన్ని ధ్యానించాను. ఇది అసి అనేపేరుగల ప్రబలమయిన ఆయుధం. నేను దీన్ని లోక రక్షణకు, రాక్షస సంహారానికి ఆవిష్కరించాను. తరువాత ఆ భూతం ఆ రూపాన్ని వదలి ముప్పది అంగుళాలకు కొద్దిగా ఎక్కువయిన ఖడ్గరూపంలో ప్రకాశించింది. దాని అంచు చాల పదునైనది. మిలమిలలాడుతున్న ఆ ఖడ్గం కాలుడు, అంతకునివలె సన్నద్ధ మయినట్లు కన్పించింది. బ్రహ్మ అధర్మనివారణంలో సమర్థ మయిన ఆ పదునయిన కత్తిని నీలలోహితుడు, నీలకంఠుడు అయిన రుద్రునకు ఇచ్చాడు. రుద్రదేవుడు అప్రమేయ స్వరూపుడయి ఆ ఖడ్గాన్ని గ్రహించి చతుర్భుజ రూపాన్ని

ధరించాడు. ఆ రూపం భూమి మీద ఉన్నా తన శిరస్సుతో ఆకాశంలో ఉన్న సూర్యుని స్పృశిస్తున్నది. ఆ ఆకారదృష్టి పైకి ఉన్నది. అది మహత్తర చిహ్నాన్ని ధరించి ఉన్నది. ముఖంనుంచి అగ్నిజ్వాలలను గ్రక్కుతున్నది. తన అవయవాల నుండి నీల, శ్వేత, రక్తాదులయిన నానావిధ వర్ణాలను ఆవిష్కరిస్తున్నది. ఆది కృష్ణాజినాన్ని వస్త్రంగా ధరించి ఉంది. బంగారు తారకలు. మచ్చలా దాని మీద ఉన్నాయి. ఆది తన నుదుటిపై సూర్యుని, వంటి తేజస్వంతమయిన ఒక నేత్రం దాల్చి ఉంది. అదే కాక నల్లని, పచ్చని పింగళవర్ణం గల రెండు కన్నులు శోభిస్తున్నాయి.

ఆ రూపం గల మహాదేవుడు కాలాగ్నితో సమానంగా వెలుగుతున్న ఖడ్గాన్ని తీసుకుని, మెరుపులతో గూడిన మేఘంవలె మూడు బొడిపెలు గల డోలు తీసుకుని, వివిధమార్గాలలో తిరుగసాగాడు. యుద్ధకాంక్షతో ఆ ఖడ్గాన్ని ఆకాశంలో గిరగిరా త్రిప్పసాగాడు. భయంకరరూపం దాల్చి, రౌద్రకార్యం చేయదలచిన రుద్రునిగురించి విన్న దానవులు సంతోషంతో, ఉత్సాహంతో ఆయన మీదికి వచ్చారు. అసురులలో కొంతమంది రాళ్ళవాన కురిపించారు. కొంతమంది మండుతున్న కొరవులను విసిరారు. మరికొందరు శస్త్రాస్త్రాలు ప్రయోగించారు. ఇంకాకొందరు ఉక్కుతో చేసిన చురకత్తులతో ఆయనకు గాయాలు చేయసాగారు. తరువాత దేవతల సేనాపతి కార్యం చేస్తున్న రుద్రదేవుడు యుద్ధంలో వెనకడుగు వేయకపోవటంతో దానవులు మోహితులై చలించిపోయారు. రుద్రదేవుని ఆ అసురులు అందరూ వేయిమందితో సమానంగా భావించారు. రుద్రదేవుడు శత్రు సమూహంలోని రాక్షసులను చంపుతూ, ఖండిస్తూ, చీలుస్తూ, గాయపరుస్తూ, ముక్కలు చేస్తూ, రెండు ఖండాలుచేస్తూ సంచరించసాగాడు. మహాబలులు అయిన ఆ అసురులు రుద్రదేవుని ఖడ్గవేగం వల్ల చేతులు, తొడలు, వక్షఃస్థలాలు ఛిన్నం కాగా పేగులు, శరీరాలు చెల్లాచెదరు అయి నేలగూలారు. ఇతర దానవులు కత్తిదెబ్బలతో బాధితులై ఒకరినొకరు హెచ్చరించుకొంటూ తలకొక దిక్కుకు పారిపోయారు. కొందరు భూమిలోకి చొచ్చుకుపోయారు. ఇంక కొందరు కొండలెక్కారు. మరికొందరు ఆకాశంలోకి పారిపోయారు. వేరేకొందరు నీళ్ళలో మునిగి పోయారు. మహత్తర యుద్ధం జరగటం వల్ల రాక్షసుల రక్తమాంసాల బురదతో భూమి నిండి భయంకరంగా కన్పించింది.

దానవులను వధించి, జగత్తులో ధర్మస్థాపనం చేసిన తరువాత రుద్రుడు ఆ రౌద్రరూపాన్ని ఉపసంహరించి, మంగళకరమయిన శివరూపాన్ని దాల్చాడు. అప్పుడు సర్వమహర్షులు, దేవగణాలు ఆ అద్భుత మయిన విజయానికి ఆనందించి, దేవాధిదేవు డయిన పరమేశ్వరుని అర్చించాయి. ఆ రుద్రదేవుడు దానవ రక్తంతో తడిసి, ధర్మరక్షక

మయిన ఆ ఖడ్గాన్ని చాలా ఆదరంతో విష్ణుదేవునకు ఇచ్చాడు. విష్ణువు మరీచికి ఇచ్చాడు. మరీచి మహర్షులకు ఇచ్చాడు. వారు ఆ ఖడ్గాన్ని ఇంద్రునికి ఇచ్చారు. మహేంద్రుడు దిక్పాలురకు, లోకపాలకులు సూర్యపుత్రు డయిన మనువుకు ఆ విశాలమయిన ఖడ్గాన్ని ఇచ్చారు. వారు ఆ మనువుతో నీవు మానవులకు ప్రభువువు. కాబట్టి ధర్మగర్భిత మయిన ఈ ఖడ్గంతో ప్రజలను పాలించు. అని చెప్పారు. 'స్థూల శరీరంతో, సూక్ష్మ శరీరంతో సుఖం పొందాలని ధర్మమర్యాదను అతిక్రమించే వారికి న్యాయ పూర్వకంగా ప్రత్యేక మయిన శిక్షవేయాలి. ధర్మంగా ప్రజలను రక్షించు. ఎవ్వరినీ స్వేచ్ఛాచారులను కానీయకు. పరుష వాక్కులతో దోషిని అణచటం వాగ్దండం అంటారు. దోషినుంచి ఎక్కువ బంగారం వసూలు చేస్తే దాన్ని అర్థదండం అంటారు. శరీరంలోని ఒక అంగాన్ని ఛేదించటం కాయదండం అవుతుంది. మహాపరాధిని వధించటం ప్రాణదండం అవుతుంది. ఈ నాలుగు శిక్షలు ఖడ్గంతో చేసేవి అని ప్రజలకు చెప్పాలి.

ప్రజలు ధర్మోల్లంఘనం చేస్తే ఖడ్గంతో సాధించే ఈ శిక్షలను తగిన రీతిగా ప్రయోగించి ధర్మాన్ని రక్షించాలి' అని చెప్పి లోకపాలకులు తమ పుత్రుడు, ప్రజాపాలకు డయిన మనువుకు సెలవిచ్చారు. మనువు ప్రజారక్షణకై క్షుపునకు ఆ ఖడ్గాన్ని ఇచ్చాడు. క్షుపుని నుండి ఇక్ష్వాకువు, ఇక్ష్వాకువునుండి పురూరవుడు ఆ ఖడ్గాన్ని పొందారు. ఆయన నుండి ఆయువు, నహుషుడు, యయాతి, పూరుడు ఆ ఖడ్గాన్ని పొందారు. అమూర్తరయుడు, భూమిశయను డనేరాజు, భరతుడు వరుసగా ఆ ఖడ్గాన్ని పొందారు. ఆయన నుండి ధర్మజ్ఞుడయిన ఐలబిలుడు, ఆ ఐలబిలుని నుండి ధుంధుమారు డనే రాజు కాంబోజుడు, ముచుకుందుడు మరుత్తు, రైవతుడు, యువనాశ్వుడు, రఘువు అనే ఇక్ష్వాకువంశీయరాజు, హరిణాశ్వుడు, శునకుడు ధర్మాత్ము డయిన ఉశీనరుడు, యదువంశీయు డయిన భోజుడు శిబి, ప్రతర్దనుడు, అష్టకుడు, పృషదశ్వుడు వరుసగా ఆ ఖడ్గాన్ని పొందారు. పృషదశ్వుని నుండి భరద్వాజుడు, భరద్వాజుని నుండి ద్రోణుడు, ఆయన నుండి కృపుడు, ఆయన నుండి సోదరులతో గూడ నీవు ఆ ఉత్తమఖడ్గాన్ని పొందావు. ఆ అసికి కృత్తిక నక్షత్రం. అగ్ని దేవత, గోత్రం రోహిణి, ఉత్తమ గురువు రుద్రుడు. అసికి రహస్యమయిన పేర్లు ఎనిమిది ఉన్నాయి. అవి చెపుతాను తెలుసుకో. వాటిని కీర్తిస్తే జయం లభిస్తుంది. 1. అసి, 2. విశసనం, 3. ఖడ్గం, 4. తీక్ష్ణధారం, 5. దురాసదం, 6. శ్రీ గర్భం, 7. విజయం, 8. ధర్మపాలం. ఇవియే ఆ అష్టనామాలు. మాద్రీపుత్రా ! ఖడ్గం అన్ని ఆయుధాలలోకి శ్రేష్ఠమయినది. మొట్టమొదటి దీనిని రుద్రుడు ఉపయోగించాడు. పురాణాలు దీని శ్రేష్ఠతను చెప్పినవి. పైన చెప్పిన నామాలు అన్నీ పురాణాలు నిశ్చయించినవే. శత్రునాశకు

డయిన పృథువు మొట్టమొదటి ధనుస్సును సృష్టించాడు. ఆయనయే ఈ పృథివి నుండి నానా విధాలయిన సస్యాలను (బీజాలను) పిదికాడు. వేనుని కుమారుడయిన పృథువు మొదటి నుండి ధర్మపూర్వకంగా ఈ భూమిని రక్షించాడు. మాద్రీ పుత్రా ! ఇది మహర్షుల ఉద్దేశ్యం దీన్ని ప్రమాణంగా గ్రహించి, విశ్వసించు. యుద్ధ విశారదులయిన వారు ఎల్లప్పుడు ఖడ్గాన్ని పూజించాలి. భరతవంశశ్రేష్ఠా ! ఈ ఖడ్గోత్పత్తి వృత్తాంతాన్ని విస్తారంగా ఉన్నది ఉన్నట్లు చెప్పాను. దీనివల్ల ఆయుధాలలో మొట్టమొదట ఖడ్గమే ఉత్పన్నమయింది అనే విషయం స్పష్ట మయింది. ఖడ్గ ప్రాప్తికి సంబంధించిన ఈ ఉత్తమ విషయాన్ని విన్న పురుషుడు ఈ లోకంలో కీర్తి పొందుతాడు. దేహ త్యాగానంతరం అక్షయ సుఖం పొందుతాడు.

167. ధర్మార్థ కామ విషయమున విదుర పాండవుల అభిప్రాయములు - షడ్జగీత.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "జనమేజయా ! పై విషయం చెప్పి భీష్ముడు మౌనం వహించాడు. యుధిష్ఠిరుడు తన నివాసానికి వెళ్లి, తన నలుగురు సోదరులు, విదురుడు ఉండగా ఇలా ప్రశ్నించాడు.* లోకప్రవృత్తి తరచుగా ధర్మ, అర్థ కామాభిముఖంగా ఉంటుంది. ఈ మూడింటిలో ఏది శ్రేష్ఠం, ఏది మధ్యమం, ఏది అల్పం ? ఈ మూడింటిని జయించాలంటే ప్రత్యేకించి మనస్సును దేని మీద నిలపాలి ? మీరు అందరూ, ఉత్సాహంతో, సంతోషంగా ఈ ప్రశ్నకు తగినరీతిగా సమాధానం ఇవ్వండి. మీకు పూర్తిగా ఆసక్తి, శ్రద్ధఉన్న దాన్ని గురించి మాత్రమే చెప్పండి. అప్పుడు అర్థం అనే పురుషార్థపు రీతిని చాలా చక్కగా తెలుసుకున్న ప్రతిభావంతు డయిన విదురుడు ధర్మశాస్త్రాన్ని స్మరించి, మొట్టమొదట ఇలా చెప్పసాగాడు.' **రాజా ! అనేక శాస్త్రాల పరిశీలనం, తపస్సు, త్యాగం, శ్రద్ధ, యజ్ఞం, క్షమ, మనశ్శుద్ధి, దయ, సత్యం, ఇంద్రియ నిగ్రహం అనేవి ఆత్మసంపదలు.** వీటి మీది నుంచి నీమనస్సు మరలరాదు. ధర్మానికి, అర్థానికి ఇవే మూలం. నా ఉద్దేశ్యంలో ఇదే పరమపదం. **ధర్మంతోనే ఋషులు సంసార సముద్రాన్ని దాటారు. లోకాలు అన్నీ ధర్మంలోనే ప్రతిష్ఠితాలయి ఉన్నాయి. ధర్మంతో దేవతలు అభివృద్ధి పొందారు. ధర్మం మీదనే అర్థం నిలుస్తుంది.** రాజా ! ధర్మమే ఉత్తమ గుణం. అర్థం మధ్యమం అంటారు. కామం అన్నిటికంటె తక్కువది అని విద్వాంసులు

* వి॥ ఈ గీత ఆరుగురి వలన కలిగినది కావున షడ్జగీత. (నీల)

చెపుతారు. కాబట్టి ధర్మాన్ని వశంచేసుకుని ధర్మాన్ని తన ప్రధాన లక్ష్యంగా చేసుకోవాలి. మనం మన కోసం ఎలా ప్రవర్తిస్తామో అలాగే సర్వప్రాణుల విషయంలో ప్రవర్తించాలి.' విదురుని వచనం పూర్తికాగానే ధర్మార్థ తత్త్వం బాగా తెలిసిన అర్జునుడు ధర్మరాజు ప్రోత్సాహంతో ఇలా అన్నాడు.

'రాజా ! ఇది కర్మభూమి. ఇక్కడ బ్రతుకుతెరువుకు సాధనాలయిన కర్మల ప్రశంస ఉంటుంది. వ్యవసాయం, వ్యాపారం, గో రక్షణ, వివిధాలయిన శిల్పాలు - ఇవి అన్నీ అర్థప్రాప్తికి సాధనాలు. సర్వ కర్మలను అతిక్రమించకుండా అనుష్ఠించటంలో అర్థమే సహాయకారి అవుతుంది. అర్థం (ధనం) లేకుండా ధర్మకామాలు సిద్ధించవు అని శ్రుతి చెపుతున్నది. ధనంతో ధర్మానుష్ఠానం చేస్తూ, ఇంద్రియ జయం లేనివారికి దుర్లభాలయిన కోరికలను తీర్చుకోగలడు ధనికుడు. ధర్మకామాలు అర్థానికి రెండు అవయవాలు అని వేదం చెపుతున్నది. ధనప్రాప్తితోనే ఆ రెండూ సిద్ధిస్తాయి. సర్వప్రాణులు ఎల్లప్పుడు బ్రహ్మదేవుని ఉపాసించినట్లు ఉత్తమ జాతీయులయిన వ్యక్తులు కూడా నిరంతరం ధనవంతునే సేవిస్తుంటారు. తలలు జడలుకట్టించుకొని, ఇంద్రియాలను జయించి, మనస్సు వశం చేసుకొన్నవారు, శరీరం అంతా బూదర పూసుకుని, గుండుచేయించుకొన్న నైష్ఠిక బ్రహ్మచారులు కూడా ధనకాంక్షతో ప్రత్యేకంగా ఉంటారు. ఎలాంటి వస్తువులను కూడబెట్టుకొననివారు, దేనినీ కోరటానికి సంకోచించేవారు, శాంతులు, కాషాయ వస్త్రధారులు, గడ్డాలు మీసాలు పెంచినవారు, విద్వాంసులు అయిన వారు కూడా ధనకాంక్షులై కన్పిస్తారు. ఇంకొక విధం వ్యక్తులు ఉన్నారు. వారు స్వర్గకాంక్షులు. వంశపరంపరగా వచ్చిన నియమనిష్ఠలను పాటిస్తూ తమతమ వర్ణాశ్రమ ధర్మాలను అనుష్ఠిస్తూ ఉంటారు. అలాంటి వారు కూడా ధనకాంక్షతో ఉంటారు. ఇంకా కొంతమంది ఆస్తికులు, నాస్తికులు అనేక విధాలయిన నిగ్రహం, నియమాలు కలవారు అయినా ధనకాంక్షతో ఉంటారు. అర్థప్రాధాన్యం తెలియకపోవటం తమోమయ మయిన అజ్ఞానం. అర్థ ప్రాముఖ్యం తెలియటం తేజోమయ మయిన జ్ఞానం అవుతుంది. తన సేవకులకు ఉత్తమ భోగాలను కల్పిస్తూ, శత్రువులను దండించి, వారిని వశంచేసుకొనే వాడే అసలైన ధనికుడు. ఇది నా అభిప్రాయం. ఈ అనుజులు ఇద్దరు ఏదో చెప్పబోతున్నారు.'

వెంటనే నకుల సహదేవులు ఇలా చెప్పారు. మహారాజా ! మానవుడు కూర్చున్నా, పడుకున్నా, తిరుగుతున్నా, నిలచినా ఉపాయాలతో ధనాదాయాన్ని పటిష్ఠం చేసుకోవాలి. దుర్లభమూ, అత్యంత ప్రియమూ అయిన అర్థసిద్ధి కలిగిన మానవుడు లోకంలో తన కోరికలను అన్నింటినీ తీర్చుకొంటాడు. ఇది లోకానుభవం. ఇందులో సందేహం లేదు. ధర్మయుక్త మయిన ధనమూ, ధనంతో గూడిన ధర్మమూ నిజంగా మీకు అమృతతుల్యం

అవుతుంది. ఇది మా ఇద్దరి ఉద్దేశ్యం. నిర్ధనుడి కోరికలు నెరవేరవు. ధర్మహీనునికి ధనం ఎలా లభిస్తుంది ? అధర్మయుక్త మయిన అర్థం కల వానిని చూసి లోకం భయపడుతుంది. కాబట్టి మానవుడు మనస్సును నిగ్రహించుకొని జీవితంలో ధర్మానికి ప్రాధాన్యం ఇస్తూ, మొదట ధర్మాన్ని ఆచరించి, తరువాత ధనం సంపాదించాలి. ధర్మ పరాయణుని మీదనే సమస్త ప్రాణులకు విశ్వాసం ఉంటుంది. అందరూ విశ్వసించినప్పుడే మానవునికి సమస్తకార్యాలు స్వయంగా సిద్ధిస్తాయి. **మొదట స్వధర్మాన్ని ఆచరించాలి. తరువాత ధర్మ యుక్త మయిన అర్థాన్ని సంపాదించాలి. తరువాత రెండింటికి అనుకూల్యం సంపాదించుకొని, కామభోగాలు అనుభవించాలి. అప్పుడు అతడు త్రివర్గ సంగ్రహంతో సఫలు డవుతాడు.** నకులసహదేవులు ఇలా చెప్పి విరమించుకొన్నారు. తరువాత భీమసేనుడు ఇలా చెప్ప నారంభించాడు.

కోరిక లేనివాడు ధనం కావాలి అని అనుకోడు. కోరిక లేనివాడు ధర్మం కోరడు. కోరిక లేనివాడు భోగాలనుగూడ కాంక్షించడు. కాబట్టి ధర్మార్థ కామాలలో కామమే శ్రేష్ఠం. ఏదో ఒక కోరికతోనే ఋషులు తపస్సులో తత్పరు లవుతారు. పండ్లు, దుంపలు, ఆకులు తిని ఉంటారు. గాలి ఆహారం చేసుకొని, ఇంద్రియాలను నియమిస్తారు. మరికొంతమంది కోరికతోనే వేదాలను, ఉపవేదాలను అధ్యయనం చేసి వాటిల్లో పారంగతు లయిన విద్వాంసులు అవుతారు. కోరికతోనే శ్రాద్ధ కర్మలు, యజ్ఞాలు, దానాలు, దానాలు తీసుకోవటంలోను ప్రవృత్తులు అవుతారు. వ్యాపారాలు, వ్యవసాయదారులు, గోపాలకులు, వడ్రంగులు, శిల్పులు, దైవకార్యకర్తలు, కోరికతోటే తమ తమ పనులలో మగ్నులవుతారు. కోరికగలవారే సముద్రంలో దూకుతారు. కామనకు వివిధ రూపాలు ఉన్నవి. అన్ని పనులు కామంతోనే నిండి ఉన్నాయి. సర్వప్రాణులు కామాధీనాలే. వారికంటె భిన్న మయిన కామనలేని ప్రాణి ఎక్కడా లేదు, ఇప్పుడు లేదు. ఇకముందు ఉండబోదు. ధర్మార్థాలు రెండూ దీనిలోనే ఉన్నాయి. పెరుగులోని సారం వెన్న అయినట్లు ధర్మార్థసారం కామం. నూవుల పిండికంటె నువ్వులనూనె, మజ్జిగకంటె నెయ్యి, చెట్టుకంటె దాని పండ్లు, పూలు శ్రేష్ఠాలు అయినట్లు ధర్మార్థాలకంటె శ్రేష్ఠమయినది కామం. పూలకంటె వానిలో ఉండే తేనెవంటి రసం శ్రేష్ఠ మయినట్లు ధర్మార్థాలకంటె కామం శ్రేష్ఠం అంటారు. కామం ధర్మార్థాలకు కారణం కాబట్టి అది ధర్మార్థరూపం అవుతుంది. ఏదో ఒక కోరిక లేకుండ బ్రాహ్మణులు ఉత్తమ మయిన అన్నం కూడా భుజించరు. ఏ కోరిక లేకుండ ఎవరూ బ్రాహ్మణులకు ధనం దానంగా ఇవ్వరు. లోకంలో ప్రాణుల కృత్యాలు, చేష్టలు అన్నీ వాటిలో ఏ కోరిక లేకుండా జరగవు. కాబట్టి త్రివర్గంలో కామానికే ప్రధానస్థానం లోకంలో

కన్పిస్తుంది. కాబట్టి రాజా ! నీవు కామాన్ని ఆశ్రయించి, అందమయిన ఆహార్యం, అలంకారాలు గల స్త్రీలతో రమించు. మనం ఈ జగత్తులో కామాన్నే శ్రేష్ఠం అని భావించాలి. ధర్మపుత్రా ! నేను బాగాలోతుగా ఆలోచించి ఇలా నిశ్చయించాను. నేను చెప్పిన దానిని వేరు విధంగా మీరు భావించవద్దు. నా ఈ మాటలు ఉత్తమాలు, మృదువైనవి. శ్రేష్ఠాలు, అనల్పాలు, సారవంతాలు. కాబట్టి గొప్పవారుకూడా వాటిని స్వీకరిస్తారు. ధర్మార్థకామాలను సమానంగానే సేవించాలి. వాటిల్లో ఒకదానియందే శ్రద్ధగలవాడు అధమవ్యక్తి. వాటిల్లో రెండింటిని సేవించే వాడు మధ్యముడు. త్రివర్గంలో సమానంగా ఆసక్తి గలవాడు ఉత్తముడు అని నా అభిప్రాయం.' మేధావి, మంచి మనస్సు గలవాడు, మంచిగంధం అలదిన శరీరం గలవాడు, విచిత్రమయిన పూల మాలికలు, ఆభరణాలు దాల్చిన భీమసేనుడు ఆ వీరులయిన బంధువులకు సంగ్రహంగా, విస్తారంగా పై మాటలు చెప్పి విరమించాడు. మహాత్ముల నుండి నానాధర్మాలు విన్నవాడు, ధర్మాత్ములలో శ్రేష్ఠుడు, ధర్మరా జయిన యుధిష్ఠిరుడు క్షణ కాలం వెనుక చెప్పిన వారి మాటలను చక్కగా పరిశీలించి, చిరునవ్వుతో ఇలా చెప్పాడు. 'ఆప్తులారా ! మీరు ధర్మశాస్త్ర సిద్ధాంతాలను బాగా ఆలోచించి, ఒక నిశ్చయానికి వచ్చారు అనటంలో సందేహం లేదు. మీకు శాస్త్ర ప్రమాణ వచనాలు కూడా తెలుసు. మీ అందరి అభిప్రాయాలు తెలుసుకోగోరి, అడిగితే, మీరు మీ మీ సిద్ధాంతాలను చెప్పారు. అవి అన్నీ నేను జాగ్రత్తగా విన్నాను. ఇప్పుడు నా మాటలు కూడా ఏకాగ్రమనస్కులై వినండి. పాప పుణ్యాలలో నిమగ్నుడు కానివాడు, ధనసంపాదనలో, ధర్మంలో, కామంలో తత్పరుడు కానివాడు, సర్వదోష రహితుడయిన మనుష్యుడు దుఃఖాన్ని, సుఖాన్ని ఇచ్చే సిద్ధుల నుండి ముక్తుడు అయితే అప్పుడు మట్టి బంగారాల మీద సమాన భావం గలవాడు అవుతాడు. పూర్వజన్మలో జరిగిన దానిని గుర్తు తెచ్చుకొనేవారు, ముసలితనంలో ఉన్నవారు, నానావిధాలయిన సాంసారిక దుఃఖానుభవంలో మునిగితేలిన మానవులు ముక్తిని మాత్రమే ప్రశంసిస్తారు. కాని మనకు ఆ మోక్షవిషయం బొత్తిగా తెలియదు. **ఆసక్తి కలవానికి ఎప్పటికీ ముక్తి కలుగదని స్వయంభువు అయిన బ్రహ్మదేవుడు చెప్పాడు. ఆసక్తి లేని జ్ఞాని మోక్షం పొందుతాడు. కాబట్టి ముముక్షువులు దేన్నీ ఇష్టమయినదని, ఇష్టంకాని దని భావించరాదు.** ఇలా ఆలోచించడమే మోక్షానికి ప్రధాన మయిన ఉపాయం గాని స్వేచ్ఛాచారం కాదు. విధి నన్ను నియోగించిన పనినే నేను చేస్తాను. విధాత సర్వప్రాణులను విభిన్న కార్యాలు చేయటానికి ప్రేరేపిస్తాడు. కాబట్టి విధియే బలవత్తర మయినది అని మీరు అందరూ తెలుసుకోండి. మానవుడు కర్మ ద్వారా పొందరాని అర్థాన్ని పొందలేడు. కావలసినది ఏదో అది తప్పక అవుతుంది అని మీరు

అందరు తెలుసుకోండి. త్రివర్గరహితు డయినా మానవుడు తాను పొందవలసింది తప్పక పొందుతాడు. కాబట్టి మోక్షానికి గూఢమయిన ఉపాయం (జ్ఞానం) మాత్రమే జగత్తుకు నిజ మయిన మేలు కలిగిస్తుంది.' వైశంపాయనుడు చెపుతున్నాడు. 'జనమేజయా ! యుధిష్ఠిరుడు చెప్పింది చాల ఉత్తమమూ, యుక్తియుక్తము, మనస్సులో నిలిచిపోయేది. దాన్ని చక్కగా తెలుసుకొని సోదరులు అందరూ హర్షధ్వానాలు చేశారు. వారందరూ కురుకులశ్రేష్ఠ డయిన యుధిష్ఠిరునకు చేతులు జోడించి నమస్కరించారు. జనమేజయ మహారాజా ! యుధిష్ఠిరుడు చెప్పిన మాటలలో ఎలాంటి దోషంలేదు. అది చక్కని స్వరవ్యంజన సన్నివేశంతో అలంకృతం, మనస్సుకు తగినది కావటం వల్ల దాన్ని విన్న రాజులు అందరూ యుధిష్ఠిరుని ప్రశంసించారు. మహాపరాక్రమవంతు డయిన యుధిష్ఠిరుడు విశ్వాసపాత్రు లయిన రాజులను, బంధువులను ప్రశంసించాడు. తరువాత మళ్ళీ ఉదార మనస్సుగల గంగానందను డయిన భీష్ముని సమీపించి, ఉత్తమ ధర్మాలను గూర్చి ప్రశ్నించాడు.'

168. కృతఘ్నోపాఖ్యానము - 1.

యుధిష్ఠిరుడు అడిగాడు. పితామహా ! ఒక ప్రశ్న వేస్తాను. దానిని వివరించి చెప్పవలసింది. మానవులు ఎలాంటి వారు సౌమ్యులు ? ఎవరిని ప్రేమించటం మేలు ? ఇప్పుడు, ఇకముందు కూడా ఉపకరించటంలో ఎవరు సమర్థులవుతారు ? ఇవి అన్నీ నాకు స్పష్టంగా చెప్పవలసింది. మిత్రులున్నచోట ధనసమృద్ధి గాని, సమీప బంధువులు గాని అంతగా ఉపయోగపడరు అని నా నమ్మకం. హితాన్ని వినే మంచి మనస్సు గలమిత్రుడు, మేలు చేసే హితుడు దుర్లభుడు. ధర్మాత్ములలో శ్రేష్ఠా ! ఈ నా ప్రశ్నల కన్నింటికి సవివర మయిన సమాధానం ఇవ్వవలసింది.'

భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! యుధిష్ఠిరా ! మైత్రి చేయదగిన మానవులను, స్నేహం చేయదగని వారిని గూర్చి చక్కగా చెపుతాను. ఏకాగ్ర మనస్సుతో విను. పీనాసివాడు, క్రూరుడు, స్వధర్మం వదలినవాడు, మోసగాడు, నీచుడు, పాపపు పనులు చేసేవాడు, అందరినీ సందేహించేవాడు, సోమరి, ఆలస్యం చేసేవాడు, కుటిలుడు, నిందకుడు, గురుపత్ని సాంగత్యం చేసేవాడు, ఆపద కలిగినప్పుడు వదలి వెళ్ళేవాడు, దుర్మార్గుడు, సిగ్గులేనివాడు, అన్ని వైపులా చెడుచూపు పెట్టేవాడు, నాస్తికుడు, వేదాలను నిందించేవాడు, ఇంద్రియాలను ఇష్టమైనట్లు వదలి లోకంలో తన ఇష్టం వచ్చినట్లు తిరిగేవాడు, అబద్ధాలు చెప్పేవాడు, అందరికి ద్వేషించదగినవాడు, మాట నిలుపుకోనివాడు, అసూయాపరుడు, అపవిత్ర బుద్ధిగలవాడు, ఈర్ష్యపడేవాడు, చెడు ఆలోచనలు

చేసేవాడు, దుష్టస్వభావుడు, మనో నిగ్రహంలేనివాడు, వృశంసుడు, ధూర్తుడు, మిత్రులకు కీడుచేసేవాడు, ఎల్లప్పుడు ఇతరుల సొత్తు అపహరించేవాడు, తన శక్తి నమసరించి ఇచ్చే వారిమీదా సంతృప్తి చూపని వాడు, మందబుద్ధి, మిత్రుల ధైర్యాన్ని కూడా క్రుంగదీసేవాడు, జాగ్రత్త లేనివాడు, సమయం కానప్పుడు కూడా కోపించేవాడు, హఠాత్తుగా శత్రు వయి మంచి మిత్రులను కూడా త్వరగా వదిలేసే వాడు, తెలియక చిన్నతప్పు జరిగినా మిత్రునికి అపకారం చేసేవాడు, పాపాత్ముడు, తనపని కావటానికి మాత్రమే మిత్రులతో కలిసేవాడు, సహజంగా మిత్రులను ద్వేషించేవాడు, పైకి మైత్రితో మాటలు చెప్పి లోపల శత్రుత్వం పెంచుకొనేవాడు, కుటిలదృష్టితో చూసేవాడు, విపరీత దర్శనుడు, మంచికి వెనకడుగువేయని మిత్రుని కూడా వదిలేసేవాడు, త్రాగుబోతు, ద్వేషించేవాడు, కోపి, దయలేనివాడు, క్రూరుడు, ఇతరులను బాధించేవాడు, మిత్రద్రోహి, ప్రాణిహింసాతత్పరుడు, కృతఘ్నుడు, అధముడు అయిన మనుష్యునితో ఎప్పుడూ సంధి చేసుకోకూడదు. ఇతరుల దోషాలను వెదికేవాడు కూడా సంధింపదగడు. ఇప్పుడు సంధి చేసుకో దగిన వారిని గురించి చెపుతాను, విను. ఉత్తమ వంశంలో పుట్టినవారు, మాటకారులు, జ్ఞాన విజ్ఞాన సంపన్నులు, అందమైన వారు, గుణవంతులు, లోభరహితులు, పనిచేయటంలో శ్రమను లెక్కపెట్టనివారు, మంచి మిత్రులు గలవారు, కృతజ్ఞులు, అన్నీ తెలిసినవారు, మధుర స్వభావులు, ఆడి తప్పనివారు, జితేంద్రియులు, ఎప్పుడూ శ్రమించేవారు, ఉత్తమ వంశ జాతులు తమ కుల భారాన్ని వహించగలవారు, దోషశూన్యులు, లోకఖ్యాతులు అయిన వారిని రాజు తన మిత్రులనుగా చేసుకోవాలి. తమశక్తి ననుసరించి సరిగా తమ కర్తవ్యాన్ని నిర్వహిస్తూ సంతృప్తిగా ఉండేవారు, సమయం కానప్పుడు కోపించనివారు, హఠాత్తుగా మైత్రిని విడవని వారు, ఉదాసీనులయినా మనస్సులో కూడా కీడుజరగరాదని కోరేవారు, అర్థతత్త్వం బాగా తెలిసినవారు, తాము కష్టాల్లో చిక్కుకొని కూడా హితం కోరే వారి పనులు సిద్ధింపజేసేవారు, రంగు వేసిన ఉన్ని గుడ్డ తన రంగును వీడనట్లు మిత్రుల మీద విరక్తికలుగని వారు, కోపం వచ్చినా మిత్రునికి కీడు చేయనివారు, లోభమోహపరవశు లయి మిత్రుల భార్యలమీద ఆసక్తి చూపనివారు, మిత్రులకు నమ్మదగినవారు, ధర్మానురక్తులు, మట్టిముద్ద, బంగారాలను సమంగా చూచేవారు, మిత్రులవిషయంలో ఎల్లప్పుడు ప్రారబ్ధానుసారం లభించిన ధనంతో సంతోషించేవారు, కుటుంబానికి సంపాదించుకొంటూనే ఎల్లప్పుడు తమ మిత్రుల, యజమాని పనులను చక్కబెట్టేవారు అయిన ఉత్తములతో సంధిచేసుకొనే రాజురాజ్యం వెన్నెల వలె విరిసి

ఉంటుంది. ప్రతిరోజూ శాస్త్రాలను అధ్యయనం చేసేవారు, కోపాన్ని జయించినవారు, యుద్ధంలో ప్రబలులు, ఉత్తమకుల సంజాతులు, సచ్ఛీలురు, ఉత్తమ గుణ సంపన్నులు అయిన శ్రేష్ఠవ్యక్తులే మిత్రులుగా చేసుకోదగినవారు. **అవధూ ! నేను చెప్పిన దోషాలు గల అందరిలోనూ కృతఘ్నుడు మిక్కిలినీచుడు. అలాంటివారు మిత్రులమ చంపుతారు కూడా ! ఇలాంటి దురాచారులయిన అధములను పూర్తిగా వదలివేయాలి. ఇది పెద్దలందరి నిశ్చయం.**

నీకు ఒక ప్రాచీనమయిన ఇతిహాసం చెపుతాను. ఉత్తర దిక్కులో ఉన్న మ్లేచ్ఛదేశంలో అది జరిగింది. మధ్య దేశీయుడయిన ఒక బ్రాహ్మణుడు– వేదాధ్యయనం ఏమీ చేయనివాడు – సర్వసమృద్ధ మయిన ఒక గ్రామం చూచి భిక్షాటనం కోసం వెళ్ళాడు. ఆ గ్రామంలో ధనవంతు డయిన ఒక బందిపోటు దొంగ ఉన్నాడు. ఆయన సమస్త వర్ణాల విశేషాలు తెలిసినవాడు, బ్రాహ్మణ భక్తుడు, ఆడి తప్పనివాడు, దాత. ఆయన ఇంటికి వెళ్ళి భిక్ష అడిగాడు. ఆ దస్యుడు బ్రాహ్మణుడు ఉండటానికి ఇల్లు, సంవత్సరానికి కావలసిన ఆహార సామగ్రి, క్రొత్త పంచెల జత ఇచ్చాడు. ఆ ద్విజునికి సేవ చేయటానికి భర్తలేని ఒక యువతిని సమకూర్చాడు. రాజా ! దస్యువు వలన ఈ వసతులు అన్నీ సమకూడినందుకు ఆ బ్రాహ్మణుడు సంతోషించాడు. ఆ సుందరగృహంలో దాసీతో ఆనందంగా ఉంటున్నాడు గౌతముడు. ఆ దాసీ కుటుంబానికి ఆయన కొంత సహాయం చేశాడు. బ్రాహ్మణుడు ఆ వ్యాధుని సంపన్నగృహంలో చాలా సంవత్సరాలు నివసించాడు. గౌతముడు అనే పేరుగల ఆ ద్విజుడు చాలా కష్టపడి, గురిచూసి, బాణం వేయటం నేర్చుకొన్నాడు. గౌతముడు కూడా ఆ ఆటవికులవలెనే ప్రతిరోజు బాగా తిరిగి హంసలను వేటాడసాగాడు. జంతుహింసలో ఆతడు చాలా నేర్పు సాధించాడు. దయారహితు డయి ఆతడు ఎల్లప్పుడూ ప్రాణిహింసాసక్తుడు అయినాడు. గౌతముడు దోపిడీ దొంగల సాంగత్యం వల్ల వారివంటి వాడే అయినాడు. దస్యుగ్రామంలో సుఖంగా ఉన్న అతడు ఎన్నో పక్షులను చంపుతూ అనేక మాసాలు నివసించాడు. తరువాత ఒకనాడు ఇంకొక బ్రాహ్మణుడు ఆ ఊరికి వచ్చాడు. ఆయన జటలను, మృగచర్మాన్ని, నారబట్టలను ధరించి ఉన్నాడు. స్వాధ్యాయపరుడు, పవిత్రుడు, వినయవంతుడు, నియమానుసారం భుజించేవాడు, బ్రాహ్మణ భక్తుడు, వేద పారంగతుడయిన విద్వాంసుడు అతడు. ఆ వచ్చిన బ్రాహ్మణుడు బ్రహ్మచారి, గౌతముని గ్రామనివాసి, గౌతమునికి పరమమిత్రుడు. దేశ సంచారం చేస్తూ ఆయన గౌతముడు ఉన్న ఆ దస్యుగ్రామానికి వచ్చాడు. శూద్రాన్నాన్ని భుజించని ఆయన దస్యులతో నిండిన ఆ గ్రామంలో బ్రాహ్మణ గృహాన్ని వెదుకుతూ, అన్ని దిక్కులా సంచరించాడు. చివరకు

ఆ బ్రాహ్మణోత్తముడు గౌతముని ఇంటికి వచ్చాడు. ఇంతలో వేట ముగించుకొని గౌతముడు కూడా ఇంటికి వచ్చాడు. అక్కడ వారిద్దరి కలయిక జరిగింది. చంపిన హంసల బరువు భుజాన ధరించి, చేత ధనుస్సు పట్టుకొని, ఇంకొకచేత ఆయుధం దాల్చి, రక్త సిక్తాంగుడై రాక్షసుడులాగా ఇంటికి వచ్చిన ఆ గౌతముని చూసి, ఆ బ్రాహ్మణుడు గుర్తించి, సిగ్గుపడుతూ ఇలా అన్నాడు. 'గౌతమా ! ఏమిటి ఇది ? మధ్యదేశంలో ప్రసిద్ధుడివి, ఉత్తమవంశవర్ధకుడివి, బ్రాహ్మణుడివి అయిన నీవు ఇలా వేటగాడిగా ఎందుకు అయినావు ? బ్రాహ్మణా ! నీ పూర్వులను ఒక్కమారు గుర్తు తెచ్చుకో. వారికి సద్బ్రాహ్మణులని ఎంత ప్రసిద్ధి ఉన్నది ! వారు ఎంతటి వేదపారంగతులయిన విద్వాంసులు ! అలాంటి వంశంలో జన్మించిన నీవు ఇలా వంశనాశకుడివి అయినా వేమిటి ? ఇప్పుడయినా నిన్ను నీవు గుర్తుచేసుకో. బ్రాహ్మణునికి తగిన సత్యాన్ని, శీలాన్ని, శాస్త్రజ్ఞానాన్ని, ఇంద్రియ నిగ్రహాన్ని, దయను గుర్తు తెచ్చుకొని నీ ఈ నివాసాన్ని వదలిపెట్టు. తన హితం కోరిన ఆ మిత్రుడు ఇలా చెప్పగా గౌతముడు మనస్సులోనే ఒక నిశ్చయానికి వచ్చి ఆర్తు డైనట్లు ఇలా అన్నాడు. 'ద్విజోత్తమా ! నేను దరిద్రుడను, వేదవేత్తను గాను, ఇక్కడికి నేను ధనం కోసంవచ్చాను అని తెలుసుకో. బ్రాహ్మణ శ్రేష్ఠా ! నీ దర్శనంవల్ల నేడు కృతార్థుడను అయినాను. ఇవ్వేళరాత్రికి ఇక్కడ ఉండు. రేపు ప్రొద్దున మనం ఇద్దరం కలిసి వెళదాం.' ఆ మాటలు విని, ఆ బ్రాహ్మణుడు అక్కడ ఏమీ తగలకుండా ఉండి, ఆకలి బాధిస్తున్నా ఆతడు పెట్టే భోజనాన్ని తినకుండానే దయకలవాడు కాబట్టి ఆ రాత్రి అక్కడ ఉన్నాడు.

169. కృతఘ్నోపాఖ్యానము - 2.

భీష్ముడు చెపుతున్నాడు. 'భారతా ! ఆ రాత్రి గడవగా ఆ బ్రాహ్మణుడు వెళ్ళాడు. గౌతముడు ఇంటిలో నుండి బయటకు వచ్చి, సముద్రం దగ్గరకు వెళ్ళాడు. సముద్రతీరవాసు లయిన కొంతమంది వ్యాపారులు త్రోవలో ఉండటం గౌతముడు చూచాడు. ఆ సమూహంతో అతడు కలిసి సముద్రం దగ్గరకు వెళ్ళాడు. రాజా ! ఆ వ్యాపారుల మహాసమూహం ఒక కొండ గుహలో విశ్రాంతి కోసం నిలిచింది. ఇంతలోనే ఒక మత్తగజం వారి మీదికి వచ్చింది. ఆ వ్యాపారసమూహంలోని చాలా మందిని అది చంపివేసింది. అతికష్టం మీద ఆ ఆపదనుండి తప్పించుకున్న గౌతముడు దిక్కు తెలియక భయంతో ప్రాణరక్షణకై ఉత్తర దిక్కుకు పరిగెత్తాడు. ఆ వ్యాపారుల సమూహానికి దూరమైన ఆతడు ఆ దేశంనుంచి కూడ తప్పించుకొని, ఒక కింపురుషునివలె అడవిలో తిరుగులాడాడు. మళ్ళీ సముద్రం వైపు వెళ్ళేత్రోవలోకి వచ్చాడు. అలా వెళ్ళి; పుష్పించిన

వృక్షాలు గల అందమయిన ఒక దివ్యవనంలోకి చేరాడు. అన్ని ఋతువులలో పూచి ఫలించే మామిడిచెట్ల గుంపు ఆ వనాన్ని సుందరం చేసింది. యక్షకిన్నరులకు నివాస మయిన ఆ ప్రదేశం నందన వనం వలె మనోహరంగా ఉంది. మద్దిచెట్లు, తాటిచెట్లు, కాలాగురు వృక్ష సమూహం, మంచిగంధపు చెట్లు, ఆ వనశోభను ఇనుమడింపజేస్తున్నాయి. అక్కడ ఉన్న సుందర మయిన సువాసను వెదజల్లే పర్వతపు సమతల ప్రదేశాలలో నలువైపులా గొప్ప పక్షులు మధురంగా కూస్తున్నాయి. కొన్ని చోట్ల మానవుల ముఖాల వంటి ముఖాలు గల భారుండ పక్షులు అరుస్తున్నాయి. సముద్రతీరంలోనూ, పర్వతాల మీద ఉండే భూలింగ పక్షులు, ఇంకా ఇతరమయిన అనేక పక్షులు కిలకిలారావాలు చేస్తున్నాయి. ఆ గౌతముడు చాలా మనోహరాలై, చెవికి ఇంపయిన పక్షుల ధ్వనులను వింటూ వెళ్ళాడు.

రాజా ! తరువాత ఆ రమణీయ ప్రదేశాలలో ఒకచోట సువర్ణమయ మయిన ఇసుక గలది, సమతలమూ, సుఖప్రదమూ, విచిత్రమూ, స్వర్గంవలె మనోహరమూ అయిన ఒక చోట గౌతముడు పెద్దమట్టిచెట్టును చూచాడు. అది నాల్గుదిక్కులా మండలాకారంతో గొడుగులాగా ఉన్నది. దాని మూలంలో మంచి గంధపునీరు చల్లారు. సర్వోత్తమమూ, మనస్సుకు ఇంపయినదీ, దివ్యపుష్పసమన్వితమూ అయిన ఆ ప్రదేశం బ్రహ్మ సభవలె ఉన్నది. అంత అంద మయిన దాన్ని చూసి గౌతముడు సంతోషించాడు. పవిత్రమై, దేవాలయం వలె సుందరమై, పుష్పించిన వృక్షాలుగల అక్కడికి వచ్చి, అతడు ఆనందంగా ఆ చెట్టు క్రింద కూర్చున్నాడు. గౌతముడు అక్కడ కూర్చున్నంతనే పూలవాసనలతో సుందరమై సుఖకర మయిన గాలి వీచింది. అది మంగళకరంగా ఉంది. అది అతని అన్ని అవయవాలకు ఆహ్లాదకర మయింది. ఆ పవిత్రమయిన చల్లని గాలి వీస్తుంటే ఆ బ్రాహ్మణుడు ప్రశాంతంగా, సుఖంగా అక్కడ నిద్రించాడు. ఇంతలో సూర్యుడు అస్తమించాడు. సూర్యాస్తమయం కాగా, సంధ్యాసమయం అయింది. అప్పుడు ఒక శ్రేష్ఠ పక్షి బ్రహ్మలోకాన్నుంచి తన నివాసానికి వచ్చింది. ఆ పక్షిపేరు నాడీజంఘుడు. ఆ బకశ్రేష్ఠం బ్రహ్మదేవునికి ఆప్తమిత్రుడు, కశ్యపుని కుమారుడు, మహామేధావి. అసమాన మయిన ఆ పక్షి ఈ భూమండలం మీద రాజధర్ముడు అనే పేరుతో ప్రఖ్యాతుడు. దేవకన్యాపుత్రుడు కావటంవల్ల ఆతని శరీర కాంతి దేవసమంగా ఉన్నది. ఆతడు మహావిద్వాంసుడు, దివ్య తేజః సంపన్నుడుగా కన్పిస్తున్నాడు. ఆతని శరీరం మీద సూర్యకాంతివలె వెలిగిపోతున్న అలంకారాలు ఉన్నాయి. వాటి నలంకరించుకొని ఆతడు దివ్య దీప్తితో దేదీప్యమానంగా ఉన్నాడు. అలా వచ్చిన ఆ పక్షిని చూసి, గౌతముడు పరమాశ్చర్యం చెందాడు. అప్పటికే ఆకలి దప్పులతో

సతమత మవుతున్న అతడు రాజధర్ముని చంపి తినాలనే రీతిగా చూచాడు. రాజధర్ముడు అన్నాడు. 'బ్రాహ్మణా ! నీకు స్వాగతం. నా అదృష్టం వల్ల ఈనాడు నాయింటికి వచ్చావు. సూర్యుడు అస్తమించాడు. ఇదిగో ఇప్పుడు సంధ్యాసమయం అయింది. నీవు నాయింటికి వచ్చిన ప్రియ మయిన ఉత్తమాతిథివి. యథావిధిగా నా పూజను ఈ పూట స్వీకరించి రేపు ప్రొద్దున నీత్రోవన నీవు వెళ్ళవచ్చు.'

170. కృతఘ్నోపాఖ్యానము - 3.

మధుర మయిన ఆ మాటలను విని, గౌతముడు ఆశ్చర్యపడి, కుతూహలంతో రాజధర్ముని చూచాడు. రాజధర్ముడు అన్నాడు. 'ద్విజోత్తమా ! నేను కశ్యపుని పుత్రుడను. మా తల్లి దక్షప్రజాపతి పుత్రిక. నీవు గుణవంతుడ వయిన అతిథివి. నీకు స్వాగతం.' ఆ గౌతమునికి శాస్త్రం చెప్పిన కార్యకలాపంతో అతిథిసత్కారాన్ని చేసి, ఆ రాజధర్ముడు సాల పుష్పమయ మయిన ఆసనాన్ని నిర్మించి, ఆతడు కూర్చుండటానికి ఇచ్చాడు. భగీరథుని రథం ఆక్రమించిన ప్రదేశాలలో ప్రవహించే గంగాజలంలో సంచరించే పెద్ద చేపలను తెచ్చి, ఆ పక్షి అతనికి భోజనం పెట్టింది. ఆ కశ్యపపుత్రుడు అగ్నిని ప్రజ్వలింపజేసి, బాగా బలిసిన చేపలను ఆ అతిథియైన గౌతమునికి సమర్పించాడు. వాటిని తిని, చాల సంతోషించిన ఆ విప్రునికి మహాతపస్వి అయిన నాడీజంఘుడు శ్రమను పోగొట్టటానికి తన రెక్కలతో విసిరాడు. తరువాత విశ్రాంతంగా కూర్చున్న ఆతనిని గోత్రనామాదులను అడిగాడు. ఆతడు 'బ్రాహ్మణుడను, గౌతముడని నాపేరు' అని చెప్పాడు తప్ప ఇంకేమీ చెప్పలేదు. ఆ పక్షీంద్రుడు అతనికి ఆకులతో సమకూర్చినది, దివ్యపుష్పాలను పరచినది, సుగంధ పూరితం, దివ్యం అయిన పక్కను సిద్ధంచేశాడు. ఆతడు దాని మీద సుఖంగా పడుకొన్నాడు. ధర్మరాజా ! ఆ పక్కమీద కూర్చున్న గౌతముని మాట నేర్పుగల కశ్యప పుత్రుడు 'ఇటు రావటానికి కారణ మేమిటి ?' అని ప్రశ్నించాడు. 'మహామతీ ! నేను దరిద్రుడను. ద్రవ్య సంపాదనకు సముద్రతీరానికి వెళ్ళవలెనని ఇంటినుంచి బయలు దేరాను' అని గౌతముడు ఆయనకు చెప్పాడు. అది విని సంతోషించిన కాశ్యపుడు ఇలా అన్నాడు. 'నీవు అంతదూరం వెళ్ళాలి అనే ఉత్కంఠను వదలు. నీవు వచ్చిన పని అయినట్లే. ద్విజశ్రేష్ఠ ! నీవు ధనంతోనే నీ యింటికి వెళ్తావు. బృహస్పతి చెప్పిన ప్రకారం అర్థసిద్ధి నాలుగు రకాలుగా ఉంటుంది. 1. వంశపరంపరగా వచ్చినది, 2. ప్రారబ్ధానుసారం లభించినది, 3. ధనార్థం సకామంగా చేసే కర్మవల్ల వచ్చేది, 4. మిత్రుని సహాయంతో ప్రాప్తం అయ్యేది. నీకు మిత్రుడను అయినాను. నీయందు మైత్రి నాకు కలిగింది. కాబట్టి

నీవు ధనవంతుడివి కావటానికి నేను ప్రయత్నిస్తాను.'

తెల్లవారగానే రాజధర్ముడు బ్రాహ్మణునికి సుఖం కలిగే ఉపాయం ఆలోచించి ఇలా అన్నాడు. 'సౌమ్యా ! ఈ త్రోవన వెళ్లు. ధనం ప్రాప్తిస్తుంది. ఇక్కడినుంచి మూడు యోజనాల దూరం వెళ్ళితే ఒక నగరం వస్తుంది. అక్కడ బలవంతుడయిన రాక్షసరాజా విరూపాక్షుడు ఉంటాడు. ఆయన నాకు ఆప్తమిత్రుడు. ద్విజశ్రేష్ఠా ! నీవు ఆయనవద్దకు వెళ్ళు. నా మాట ప్రకారం ఆయన నీకు కావలసిన ద్రవ్యం ఇచ్చి, నీ కోరికలు తీరుస్తాడు. ఈ విషయంలో నీవు సందేహించ నక్కర లేదు.' అని చెప్పగా గౌతముడు శ్రమ అంతా తొలగి బయలుదేరాడు. త్రోవలో అమృతం లాంటి పండ్లను యథేచ్ఛగా తింటూ, చందనం, అగురు మొదలయిన వృక్షాలుగల లవంగపుచెట్ల వనాల సువాసనలను పీలుస్తూ చాలా వేగంగా వెళ్ళాడు. అలా వెళ్ళి పర్వతాలే తోరణాలుగా, ప్రాకారంగా గలదై, రక్షణగా శైలయంత్రాలుగల మేరువ్రజం అనే నగరానికి చేరాడు. మహామేధావి అయిన ఆ రాక్షసరాజుకు ఈ వచ్చిన వాడు తన ప్రియమిత్రు డయిన నాడీజంఘుడు పంపిన వాడు అని చారులు చెప్పగా తెలిసింది. యుధిష్ఠిరా ! అప్పుడు ఆ రాక్షసేంద్రుడు 'నగరద్వారం వద్దనున్న గౌతముని త్వరగా లోపలికి తీసుకొని రండి' అని తన సేవకులను ఆదేశించాడు. రాజాజ్ఞానుసారం సేవకులు రెక్కలు గట్టుకొని వచ్చినంత వేగంగా ఆపట్టణంలోనుంచి ముఖద్వారం దగ్గరకు 'ఇక్కడ గౌతముడు ఎవరు ?' అని అడుగుతూ వచ్చారు. మహారాజా ! ఆ సమయంలో గౌతమునితో వారు 'బ్రాహ్మణా త్వరపడు. వేగంగా రా. మారాజుగారు నీ కోసం ఎదురు చూస్తున్నారు. మహావీరుడు, రాక్షసరాజు, విరూపాక్షు డని ప్రసిద్ధు డయిన మారాజు నిన్ను చూడవలెనని తొందరపడుతున్నాడు. కాబట్టి త్వరగా బయలుదేరు' అన్నారు. రాజాహ్వానం అందినవెంటనే గౌతమునికి అలసట పోయింది. రాక్షసరాజ మహాసమృద్ధిని చూసి, పరమాశ్చర్య పడుతూ వేగంగా రాజప్రాసాదం వద్దకు వచ్చాడు. రాక్షస రాజదర్శనం గోరి, ఆతడు ఆ సేవకులతో పాటు రాజభవనంలో ప్రవేశించాడు.

171. కృతఘ్నోపాఖ్యానము - 4.

'తరువాత రాజుకు అతనిరాక తెలిసింది. ఉత్తమ మయిన గృహంలో ప్రవేశించి, గౌతముడు రాక్షస రాజు చేసిన అతిథి సత్కారాలు పొంది, ఉత్తమాసనం మీద కూర్చున్నాడు. విరూపాక్షుడు ఆతనిగోత్రాన్ని, శాఖను, బ్రహ్మచర్య సమయంలో చేయవలసిన వేదాధ్యయనాన్ని గురించి అడిగాడు. ఆ బ్రాహ్మణుడు అప్పుడు అతడు తన జాతిని గురించి తప్ప ఇంక ఏమీ చెప్పలేదు. బ్రహ్మవర్చస్సు లేనివాడు, వేదాధ్యయనం లేనివాడు, జాతిమాత్రమే

తెలిసినవాడు అయిన అతనిని నివాసం గూర్చి ఇలా అడిగాడు రాజు. ఉత్తమా ! నీ నివాసం ఏ ఊరు ? నీ భార్య ఏ వంశకన్య? నీ విషయం అంతా సరిగా చెప్పు. భయపడకు. నన్ను నమ్ము. సుఖంగా ఉండు. గౌతముడు చెప్పాడు. 'రాజా ! నేను మధ్యదేశంలో పుట్టాను. నా నివాసం శబరుల నగరం. నా భార్య శూద్రజాతీయ. ఆమె మొదట ఇంకొకనిభార్య. ఇప్పుడు నా భార్య. నీకు నిజం చెపుతున్నాను.' 'ఇది విన్న రాక్షసరాజు తనమనస్సులో ఇలా ఆలోచించాడు. ఇప్పుడు చేయవలసింది ఏమిటి ? నాకు పుణ్యం కలిగేది ఎలా ? ఇతడు కేవలం జన్మతో మాత్రమే బ్రాహ్మణుడు. ఆ మహాత్మునికి మిత్రుడు. కశ్యప పుత్రుడు నా వద్దకు పంపించాడు. ఆయనకు ఇష్టమైనది చేస్తాను. ఆయనకు నా మీద అపార విశ్వాసం. నాకు సోదరుడు, బంధువు, హార్దికమిత్రుడు. ఇవ్వేళ కార్తిక పూర్ణిమ. నేడు వేయిమంది బ్రాహ్మణ శ్రేష్ఠులు నాయింట భోజనం చేస్తారు. వారితో పాటు ఇతడు అతిధిగా భుజిస్తాడు. ఇతనికి ధనం ఇవ్వవచ్చు. ఈ రోజు పుణ్య దినం. నేను దానం చేయసంకల్పించాను. ఇంక ఆలోచించవలసింది ఏమున్నది ?'

ఆ తరువాత భోజన సమయానికి వేయిమంది విద్వాంసులయిన బ్రాహ్మణులు స్నానంచేసి పట్టు పంచెలు ధరించి అక్కడికి వచ్చారు. అలా వచ్చిన ఆ విప్రులను విరూపాక్షుడు యధావిధిగా ఆహ్వానించాడు. రాక్షసరాజు ఆజ్ఞతో సేవకులు నేలమీద మంచి దర్భాసనాలను ఏర్పరిచారు. వాటి మీద కూర్చున్న ఆ బ్రాహ్మణశ్రేష్ఠులను రాజు దర్భలు, తిలలు, నీటితో శాస్త్రానుసారం పూజించాడు. వారిలో విశ్వేదేవులను, పితరులను, అగ్ని దేవుని భావనచేసి, వారికి అందరికి మంచిగంధం పూసి, పూలమాలలు వేసి చక్కగా పూజాదులు అర్పించాడు. ఆ ఆసనాల మీద కూర్చున్న ఆ బ్రాహ్మణులు చంద్రులవలె శోభించారు. తరువాత ఆ రాజు వజ్రాలను కూర్చిన, బంగారపు స్వచ్ఛసుందర పాత్రలను, నేతితో చేసిన తీయని భోజనాలను ఆ బ్రాహ్మణులకు సమర్పించాడు. ఆ రాజనివాసంలో ఆషాఢ, మాఘ పూర్ణిమలందు ఎల్లప్పుడూ లెక్కలేనంత మంది బ్రాహ్మణులు గౌరవ పూర్వకంగా వారికి కావలసినంత ఉత్తమ భోజనం స్వీకరిస్తారు. విశేషంగా శరదృతువు చివర కార్తిక పూర్ణిమనాడు ఆయన బ్రాహ్మణులకు రత్నాలను దానం చేస్తాడు అని వింటాం. భరతవంశీయా ! భోజనానంతరం బ్రాహ్మణుల ఎదుట చాలా బంగారం, వెండి, మణులు, ముత్యాలు, విలువయిన వజ్రాలు, వైడూర్యాలు, జింకచర్మాలు, రత్నాలను పెద్ద పెద్ద రాసులుగా పోసి, విరూపాక్షుడు 'బ్రాహ్మణ శ్రేష్ఠులారా ! మీ ఇచ్ఛానుసారం ఉత్సాహాన్ని అనుసరించి ఈ రత్నాదులను, మీరు భుజించిన బంగరు కంచాలను, దక్షిణలుగా తీసుకొని వెళ్ళండి.' అని విన్నవించాడు.

ఇలా రాక్షసరాజు చెప్పగా ఆ ద్విజశ్రేష్ఠులు రత్నాదులను తమ ఇష్టం వచ్చి నన్నింటిని తీసుకొన్నారు. అప్పుడు అందమయిన, చాలా విలువయిన రత్నాలతో పూజితులై ప్రకాశవంత మయిన వస్త్రాలను ధరించిన ఆ బ్రాహ్మణులు బాగా సంతోషించారు. రాజా ! దీనితరువాత రాక్షసరాజు విరూపాక్షుడు నానా దేశాలనుంచి వచ్చిన రాక్షసులను హింసా కార్యాలను మానమని చెప్పి 'ఈ ఒక్క రోజు మాత్రం మీకు రాక్షసుల వల్ల ఎలాంటి భయం ఉండదు. కాబట్టి ఆనందించండి. త్వరగా మీ ఇష్టమయిన చోటికి వెళ్ళండి. ఆలస్యం చేయవద్దు' అన్నాడు. అప్పుడు బ్రాహ్మణుల సమూహాలు నాలుగు దిక్కులకు త్వరగా వెళ్ళిపోయారు. గౌతముడు కూడా బంగారాన్ని మోసుకుంటూ త్వరగా వెళ్ళాడు. ఆ భారాన్ని చాలా కష్టంగా మోస్తూ, మళ్ళీ మట్టిచెట్టు దగ్గరకు వచ్చాడు. అతడు చాలా అలసిపోయి శ్రమమోద అక్కడకు చేరుకొన్నాడు. ఆకలి బాధతో ఉన్నాడు. అప్పుడు అతని దగ్గరకు మిత్రవత్సలుడు, రాజధర్ముడు వచ్చి స్వాగత వాక్యాలతో అభినందించాడు. ఆ పక్షిరాజు అతనికి రెక్కలతో విసరి మార్గాయాసం పోగొట్టాడు. వివేకి కాబట్టి అతనిని పూజించి, భోజనం కూడా పెట్టాడు. భోజనం చేసి విశ్రాంతి తీసుకొంటూ అతను 'ఆహా ! నేను లోభ మోహాల ప్రేరణతో ఈ బంగారం చాలా ఎక్కువబరువును తీసుకొన్నాను. ఇంకా నేను చాలా దూరం వెళ్ళాలి. త్రోవలో తినటానికి ఏమీలేదు. అది ఉంటేగాని నా ప్రాణం నిలవదు. ఏం చేసి ఈ ప్రాణాలు నిలబెట్టుకోవాలి ?' అని ఆలోచించాడు. మార్గమధ్యంలో తినటానికి ఏమీ ఉన్నట్లు ఆతనికి తోచలేదు. పురుషశ్రేష్ఠ ! కృతఘ్ను డయిన ఆతడు తన మనస్సులో ఇలా దురాలోచన చేశాడు. 'ఈ ఖగరాజు రాజధర్ముడు నా ప్రక్కనే పడుకొన్నాడు. ఇతడొక పెద్ద మాంసపు ముద్దలాగా ఉన్నాడు. కాబట్టి ఈతనిని చంపి తీసుకొని త్వరగా ఇక్కడి నుండి వెళ్ళిపోతాను'.

172. కృతఘ్నోపాఖ్యానము - 5.

భీష్ముడు చెప్పాడు. 'రాజా ! పక్షిరాజయిన రాజధర్ముడు తన మిత్రుడు గౌతముని రక్షణకోసం కొద్ది దూరంలో అగ్నిని ప్రజ్వలింపజేశాడు. ఆ నిప్పు గాలి వీచటంవల్ల పెద్ద మంటలు చెలరేగుతున్నవి. మిత్రుని మీది విశ్వాసంతో బక శ్రేష్ఠుడు ఆతని ప్రక్కనే విశ్రమించాడు. దుష్టాత్ము డయిన గౌతముడు కృతఘ్నుడై, బాగా మండుతున్న పెద్ద కొరవితో నమ్మిన రాజధర్ముని కొట్టిచంపాడు. అలా చంపి, సంతోషిస్తూ, అతడు అది ఎంత ఘోరపాపమో ఆలోచించలేదు. వాడు ఆపక్షి రెక్కలు, ఈకలు, తీసివేసి అగ్నిలో కాల్చి ఆ మాంసం తీసుకొని సువర్ణభారం మోసుకొంటూ చాలా త్వరగా వెళ్ళాడు.

భారతా ! ఆ రోజు దక్షకన్యా పుత్రు డయిన రాజధర్ముడు విరూపాక్షుని నివాసానికి రాలేకపోయాడు. ఇందువల్ల రాక్షసరాజు కలతచెంది, ఆతనికోసం ఆలోచించసాగాడు.

మర్నాడుకూడా దాటిపోగా విరూపాక్షుడు తన పుత్రునితో 'నాయనా ! ఇవ్వాళ కూడా పక్షీంద్రుడు రాజధర్ముడు నావద్దకు వచ్చి కన్పించలేదు. ప్రతిరోజూ ప్రొద్దుననే బ్రహ్మదేవునికి నమస్కరించటానికి వెళ్ళుతుంటాడు. అక్కడి నుంచి తిరిగి వచ్చేటప్పుడు నన్ను కలియకుండా ఎప్పుడూ తన నివాసానికి వెళ్ళడు. ఇప్పటికి రెండు రాత్రి సంధ్యా సమయాలు దాటిపోయాయి. రాజధర్ముడు నా దగ్గరకు రాలేదు. అందువల్ల నాకు సందేహం కలుగుతున్నది. కాబట్టి నామిత్రుని సంగతి తెలుసుకో. ఆ బ్రాహ్మణాధముడు గౌతముడు వేదాధ్యయనం చేసినవాడు గాదు. బ్రహ్మవర్చస్సు లేదు. అతడు హింసచేసేవాడని అనిపిస్తున్నది. అతడే నామిత్రుని చంపేశాడేమో అని నాకు సందేహం కలుగుతున్నది. ఆతని వాలకం చూసే నేను ఆతడు దుర్బుద్ధి దురాచారుడు, దయాహీనుడు అనిగుర్తించాను. అతని ఆకారమే భయంకరం. దుష్టుడయిన దస్యునివలె అధముడు అని అనిపిస్తున్నది. గౌతముడు అక్కడికి వెళ్ళాడు. అందువల్ల నామనస్సు కలత చెందుతున్నది. నీవు ఇక్కడినుండి త్వరగా రాజధర్ముని నివాసానికి వెళ్ళి జరిగింది ఏమిటో, పవిత్రహృదయు డయిన ఆతడు జీవించి ఉన్నాడో లేదో ? తెలుసుకొనిరా. ఆలస్యం చేయవద్దు.' అన్నాడు.

తండ్రి మాటలు విని, అతడు త్వరగా రాక్షసులతో కూడా ఆమట్టిచెట్టు దగ్గరకు వెళ్ళాడు. రాజధర్ముని అస్థిపంజరాన్ని చూచాడు. బుద్ధిమంతు డయిన రాక్షస రాజ పుత్రుడు రాజధర్ముని ఈ దుఃస్థితిని చూసి, పెద్దగా ఏడుస్తూ, తనశక్తి అంతా ఉపయోగించి, గౌతముని త్వరగా పట్టుకోటానికి బయలుదేరాడు. తరువాత కొద్ది దూరం లోనే రాక్షసులు గౌతముని పట్టుకొన్నారు. ఆతనితోపాటు వారికి రాజధర్ముని రెక్కలు, ఈకలు లేని శవమూ దొరికాయి. గౌతముని తీసుకొని ఆ రాక్షసులు చాలా త్వరగా మేరు వ్రజనగరానికి వెళ్ళారు. రాజుకు రాజధర్ముని శరీరాన్ని, కృతఘ్నుడు, కఠినుడు, పాపకారి అయిన గౌతముని చూపించారు. రాజధర్ముని శరీరం చూసి, అమాత్య పురోహితులతో కూడా రాక్షసరాజు పెద్ద పెట్టున ఏడ్చాడు. ఆ రాజగృహంలో ఆర్తనాదాలు విన్పించాయి. స్త్రీ పురుషులతో, బాలురతో గూడిన ఆ పట్టణం అంతా శోక సాగరంలో మునిగిపోయింది. ఎవరిమనసూ స్వస్థంగాలేదు. అప్పుడు రాజు తనపుత్రుని ఇలా ఆజ్ఞాపించాడు. 'ఈ పాపాత్ముని వధించు. ఈ రాక్షసులు అందరూ తమ ఇష్టం వచ్చినట్లు వీని మాంసం ఉపయోగించండి. రాక్షసులారా ! ఇతడు పాపాచారుడు, పాపకర్ముడు, పాపాత్ముడు,

ఈతని సాధనాలు అన్నీ పాపమయాలు. కాబట్టి ఈతనిని మీరు చంపివేయాలి. అని నా అభిప్రాయం !' రాక్షసరాజు ఇలా ఆదేశించినా భయంకర పరాక్రమవంతు లయిన రాక్షసులు ఆ గౌతముడు పాపకర్ముడు అని అతని మాంసం తినటానికి ఇష్టపడలేదు. 'మహారాజా ! ఈ నరాధముని దస్యులకు (అన్నివిధాలా చెడిపోయి దొంగతనం చేసే దుష్టజాతివారు) ఇవ్వవలసింది. ఈ పాపాత్ముని మాకు తినటానికి ఇవ్వవద్దు. అని మనవి.' అని సమస్త రాక్షసులు తమ రాజు కాళ్ళమీద పడి ప్రార్థించారు. రాక్షసరాజు అలాగే నని 'రాక్షసులారా ! ఈ కృతఘ్నుని ఈ రోజే దస్యులకు ఇవ్వండి.' అని ఆజ్ఞాపించాడు. రాజాజ్ఞను తలదాల్చి వారు శూలాలు పట్టిసాలు ధరించి ఆ పాపాత్ముని ముక్కలు ముక్కలు చేసి దస్యులకు ఇచ్చారు. **రాజేంద్రా ! ఆదస్యులు కూడా పాపకార్యాలు చేసే వానిని తినుటకు ఇష్టపడలేదు. మాంసాన్ని తినే జంతువులు కూడా కృతఘ్నుని మాంసాన్ని ముట్టవు. రాజా ! బ్రహ్మహత్య చేసివ వానికి, మద్యపానం చేసే వానికి, దొంగకు, వ్రతభంగం చేసేవానికి శాస్త్రంలో ప్రాయశ్చిత్త విధానం ఉన్నది. కాని కృతఘ్నుని ఉద్ధరించటానికి ఏ ఉపాయాన్నీ శాస్త్రం చెప్పలేదు. మిత్రునికి ద్రోహం చేసేవాడు, క్రూరుడు, కృతఘ్నుడు, నరాధముడు అయిన మానవుని మాంసాన్ని మాంసం తినే జంతువులు, పురుగులు కూడా తినవు.'**

173. కృతఘ్నోపాఖ్యానము - 6.

భీష్ముడు చెప్పాడు. 'తరువాత రాక్షసరాజు విరూపాక్షుడు బకశ్రేష్ఠునికి ఒక చితిని సిద్ధం చేయించాడు. దాన్ని అనేక రత్నాలతో, చందనంతో, వస్త్రాలతో అలంకరింపజేశాడు. తరువాత రాక్షసరాజు చితిపైన బక శ్రేష్ఠుని ఉంచి దగ్ధం చేశాడు. యథావిధిగా ప్రేతకార్యాలు చేశాడు. అదే సమయంలో దక్షకన్య అయిన సురభిదేవి అక్కడికి వచ్చి ఆకాశంలో చితికి సరిగా పైన నిలుచున్నది. దాని నోటి నుంచి పాలతో గూడిన నురుగు జారి రాజధర్ముని చితిమీద పడింది. దాని వలన ఆ బకశ్రేష్ఠం బ్రతికి, ఎగిరి, విరూపాక్షుని వద్దకు వచ్చింది. ఆ సమయంలోనే దేవరాజు ఇంద్రుడు విరూపాక్షుని పట్టణానికి వచ్చాడు. విరూపాక్షునితో ఇలా అన్నాడు. 'నీవల్ల ఈ రాజధర్ముడు జీవితుడు కావటం చాలా అదృష్టం.' పూర్వం బ్రహ్మదేవుడు రాజధర్మునికి శాపం ఇచ్చిన విషయాన్ని ఇలా తెలిపాడు. "రాజా ! పూర్వం ఒకప్పుడు ఈ బకశ్రేష్ఠుడు బ్రహ్మ దేవుని సభకు రాలేకపోయాడు. దాంతో కోపం వచ్చిన బ్రహ్మదేవుడు ఖగేంద్రుని ఉద్దేశించి ఇలా శపించాడు. 'మూఢుడు, దుష్టాత్ముడు

అయిన ఈ బకాధముడు నాసభకు రాలేదు కాబట్టి త్వరలోనే వధించబడతాడు.' బ్రహ్మదేవుని ఆశాపంవల్ల ఇతనిని గౌతముడు వధించాడు. ఆ బ్రహ్మదేవుడే అమృతాన్ని కురిపించి ఇతనిని మళ్ళీ బ్రతికించాడు. అప్పుడు రాజధర్ముడు మహేంద్రునికి నమస్కరించి 'దేవాధిపా ! నా మీద మీకు దయ ఉంటే నాకు చాలా ఇష్టుడు, మిత్రుడు అయిన ఈ గౌతముని బ్రతికించగోరుతున్నాను.' పురుషశ్రేష్ఠా ! ఇంద్రుడు రాజధర్ముని కోరికను అనుసరించి, అమృతం చిలికి, బ్రాహ్మణు డయిన ఆ గౌతముని మళ్ళీ బ్రతికించాడు. సువర్ణంగల పాత్ర మున్నగు సామగ్రితో ఉన్న తన మిత్రుని రాజధర్ముడు గాఢాలింగనం చేసుకొని సంతోషించాడు. తరువాత బకాధిపుడు రాజధర్ముడు ధనంతో కూడా ఆ పాపకర్ముని పంపించి, తన నివాసం చేరుకొన్నాడు.

తరువాత ఆ బకశ్రేష్ఠుడు వెనుకటి వలెనే తగిన రీతిగా బ్రహ్మదేవుని సభకు వెళ్ళాడు. బ్రహ్మకూడా ఆ మహాత్మునికి ఆతిథ్యం ఇచ్చి, ఆదరించాడు. గౌతముడు కూడా మళ్ళీ ఆ ఆటవిక నివాసానికి వచ్చి, భార్యఅయిన శూద్రస్త్రీయందు పాపకర్ములయిన పుత్రులను కన్నాడు. ఆ సమయంలో దేవతా గణాలు ఆ గౌతమునికి ఇలా శాపం ఇచ్చాయి. 'ఈ పాపాత్ముడు కృతఘ్నుడు. తనను రెండవ భర్తగా స్వీకరించిన శూద్రస్త్రీ నుండి చాలాకాలం సంతానం పొందుతాడు. ఈ పాపంకారణంగా ఇతడు ఘోరనరకంలో పడతాడు.'

యుధిష్ఠిరా ! ఈ వృత్తాంతం అంతా పూర్వం నాకు నారదుడు చెప్పాడు. భరతశ్రేష్ఠా ! ఈ సుదీర్ఘ వృత్తాంతాన్ని గుర్తుచేసుకొని అంతా నీకు యథార్థంగా చెప్పాను. కృతఘ్నునికి కీర్తి ఎలా కలుగుతుంది ? వానికి ఎలాంటి స్థానం, సుఖం కలుగుతుంది ? కృతఘ్నుని విశ్వసించరాదు. కృతఘ్నుని పాపానికి పరిహారం లేదు. **మానవుడు మిత్రద్రోహం చేయకుండా ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలి. మిత్రద్రోహం చేసినవాడు భయంకరమూ, అనంతమూ అయిన నరకానికి పోతాడు. మిత్రులను కోరుకొనేవాడు ఎల్లప్పుడు కృతజ్ఞుడుగా ఉండాలి. మిత్రునివల్ల సమస్తమూ పొందుతాడు. మిత్రుని సహాయం వల్ల లోకంలో గౌరవం పొందుతాడు.** మిత్రుని సహాయంవలన భోగాలు అనుభవిస్తాడు. మిత్రునివలన ఆపదల నుండి ముక్తుడు అవుతాడు. వివేకం, విచక్షణ గలవాడు ఉత్తమ మయిన సత్కారాలతో మిత్రుని పూజించాలి. **పాపాత్ముడు, కృతఘ్నుడు, సిగ్గులేనివాడు, మిత్ర ద్రోహి, వంశనాశకుడు, పాపపుపనులు చేసేవాడు అయిన అధమమానవుని పండితులు దూరం చేసుకోవాలి.** ధర్మాత్ములలో శ్రేష్ఠా !

ఈ రీతిగా నీకు పాపాత్ముడు మిత్రద్రోహి, కృతఘ్నుడు అయిన మానవుని వృత్తాంతం చెప్పాను. ఇప్పుడు ఇంకా ఏమి వినాలని అనుకొంటున్నావు ?' వైశంపాయనుడు చెపుతున్నాడు. 'జనమేజయా ! మహాత్ము డయిన భీష్ముడు చెప్పినది శ్రద్దగా విని యుధిష్ఠిరుడు చాలా సంతోషించాడు.'

174. బ్రాహ్మణ సేనజిత్తుల సంవాదము.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. పితామహా ! ఇంతవరకు రాజధర్మానికి సంబంధించిన ఉత్తమధర్మాలను వివరించారు. రాజా ! ఇక వేర్వేరు ఆశ్రమవాసులకు సంబంధించిన శ్రేష్ఠధర్మాలను చెప్పవలసినది.' భీష్ముడిలా చెపుతున్నాడు. 'స్వర్గసాధకమై సత్యఫలహేతు వయిన తపస్సే అంతటా విధించబడిన ధర్మం. ధర్మానికి ద్వారాలు ఎన్నో ఉంటాయి. లోకంలో ఫలహీనమయిన పని ఏదీ లేదు. భరతశ్రేష్ఠ ! ఏ విషయంలో ఎవనికి పూర్ణ నిశ్చయం (విశ్వాసం) కలుగుతుందో దానినే ఆ వ్యక్తి కర్తవ్యంగా భావిస్తాడు. మరే విషయాన్నీ గ్రహించడు. మనిషికి ఏ రీతిలో సాంసారిక విషయాలపై సారహీనాలనే భావన కలుగుతుందో ఆ క్రమంలోనే వాటిపై వైరాగ్యం కూడా కలుగుతుంది. ఇది నిస్సంశయం. యుధిష్ఠిరా ! ఈ విధంగా బహుదోషభూయిష్ఠ మయిన ఈ లోకాన్ని అవగతం చేసికొని బుద్ధిమంతుడైన నరుడు తాను ముక్తిని పొందటానికై ప్రయత్నించాలి.' యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'పితామహా ! ధనాన్ని కోల్పోయినప్పుడో భార్య కానీ, కొడుకు కానీ, తండ్రి కానీ మరణించినప్పుడో ఏ ఆలోచనతో మనిషి శోకాన్ని దూరంచేసికోవాలి ? అది నాకు చెప్పు.' భీష్ముడిలా అన్నాడు. 'ధనాన్ని కోల్పోయినప్పుడు, భార్య కానీ కొడుకు కానీ తండ్రి కానీ మరణించినప్పుడు "ఈ సంసార మెంత దుఃఖమయమో' అని తలచుకొంటూ శోకాన్ని దూరం చేయగల మార్గాన్ని (శమదమాదులను) మనిషి పాటించాలి.

ఈ విషయంలో మంచిమనస్సుగల ఒక బ్రాహ్మణుడు సేనజిత్తు దగ్గరకు వచ్చి, ఉపదేశించిన ప్రాచీనేతిహాసాన్ని ప్రస్తావిస్తుంటారు. సేనజిత్తుకొడుకు మరణించినపుడు ఆ రాజు పుత్ర శోకంతో కలతపడి, విషాదమనస్కుడై ఉన్నపుడు ఒక బ్రాహ్మణుడు ఆయనతో ఇలా అన్నాడు. 'నీవు మూఢుడవై మోహంలో పడతా వెందుకు ? నీవే శోకింపదగినవాడవు. ఇతరుల కోసం శోకించట మెందుకు ? ఇతరులు నీ గురించి కూడా దుఃఖిస్తూ నీలాగే పరితపించే రోజు వస్తుంది. **రాజా ! నీవైనా, నేనైనా, నీ దగ్గరలో నున్న వీరెవరైనా అందరూ ఎక్కడనుండి వచ్చామో అక్కడకు వెళ్ళవలసిన వారమే.'**

సేనజిత్తు ఇలా అన్నాడు. 'బ్రాహ్మణా ? తపోధనా ! నీవు ఏవిధమైన విషాదాన్ని పొందకుండా ఉండటానికి కారణమైన బుద్ధి ఏది ? తపస్సు ఏది ? సమాధి ఏది ? జ్ఞాన మెటువంటిది ? శాస్త్ర మే పాటిది ?

సుఖదుఃఖాలు చక్రంవలె తిరుగుతుంటాయి. నేను సుఖంలో ఆనందిస్తున్నాను. దుఃఖంలో పరితపిస్తున్నాను. ఈ స్థితిలోనున్న నాగురించి నాకు నిరంతరమూ శోకమే. ఆది నా మనస్సులో స్థిరంగా నిలిచి పోయింది.'

బ్రాహ్మణు డిలా అన్నాడు. 'చూడు, ఈ లోకంలో ఉత్తములైనా, మధ్యములైనా, అధములైనా ప్రాణులు ఆయా కర్మలలో చిక్కుకొని దుఃఖగ్రస్తు లవుతూనే ఉన్నారు.

నేను ఒంటరినే. నాకెవ్వరూ లేరు. నేను ఎవ్వరికీ చెందను. నేనెవరికి చెందిన వాడనో వానిని నేను చూడలేక పోతున్నాను. నా వాడెవడో వానిని కూడా చూడలేకపోతున్నాను.

ఈ శరీరమూ నాది కాదు. ఈ భూమి అంతాకూడా నాది కాదు. ఇవన్నీ నావైనట్లే ఇతరులవీను. ఈ రకంగా ఆలోచిస్తాను. కాబట్టి నాకు వ్యథలేదు. ఈ నిర్ణయంవలన నాకు ఆనందమూ లేదు, దుఃఖమూ లేదు. మహాసముద్రంలో తేలియాడే రెండు కట్టెలు అప్పుడప్పుడు కలుస్తుంటాయి. మరల విడిపోతుంటాయి. ప్రాణుల కలయిక కూడా అటువంటిదే.* పుత్రులు, పౌత్రులు, దాయాదులు, బంధువులు అంతా ఇలాగే కలుస్తుంటారు, విడిపోతుంటారు. వారితో స్నేహాన్ని పెంచుకోకూడదు. వారితో వియోగం తప్పదు గదా! అజ్ఞాతంలో నుండి వచ్చాడు. మళ్లీ నీ కొడుకు అజ్ఞాతంలోకే వెళ్ళిపోయాడు. అతడు నిన్నెరుగడు. నీవు అతని నెరుగవు. అతడికి ఏమవుతావని నీవు దుఃఖపడుతున్నావు ? సంసారతృష్ణల వలన దుఃఖం కలుగుతోంది. దుఃఖ వినాశమే సుఖం, సుఖాలలో నుండి మరల దుఃఖం కలుగుతుంది. ఈ రీతిగా మాటిమాటికి దుఃఖం కలుగుతూనే ఉంటుంది. సుఖం తర్వాత దుఃఖం, దుఃఖం తర్వాత సుఖం. మనుష్యులలో సుఖదుఃఖాలు చక్రంవలె తిరుగు తుంటాయి.**** నీవు సుఖంలో నుండి దుఃఖానికి వచ్చావు. మరల సుఖం పొందుతావు. నిత్యమూ సుఖమూ కలగదు - నిత్యమూ దుఃఖమూ కలగదు. సుఖానికి నిలయం శరీరమే. దుఃఖానికీ నిలయం శరీరమే. శరీరంతో చేసిన పను లన్నింటి ఫలితాన్నీ శరీరంతోనే

---

* యథా కాష్ఠం చ కాష్ఠం చ సమేయాతాం మహోదధౌ ।
సమేత్య చ వ్యపేయాతాం తద్వద్భూతసమాగమః ॥ 15

** సుఖస్యానంతరం దుఃఖం దుఃఖస్యానంతరం సుఖమ్ ।
సుఖదుఃఖే మనుష్యాణాం చక్రవత్పరివర్తతః ॥ 19

దేహి అనుభవిస్తాడు. శరీరంతో పాటే జీవనం కూడా ఏర్పడుతుంది. శరీరమూ, జీవితమూ కలిసే తిరుగుతుంటాయి. కలిసియే నశిస్తాయి.

అనేక విధాలయిన స్నేహపాశాలతో బంధింపబడిన ప్రజలు విషయాసక్తులై ఉంటారు. వారి కోరికలు ఇసుకతో కట్టిన వంతెనలవంటివి. నీటి ప్రవాహంలో కొట్టుకొని పోతుంటాయి. దానితో వారు విఫలులై దుఃఖిస్తుంటారు. గానుగవాడు నూనె కోసం నువ్వులను గానుగలో వేస్తాడు. అదేరీతిగా అందరూ అజ్ఞానంవలన పుట్టిన కష్టాల కారణంగా నువ్వులవలె సృష్టిచక్రంలో తిరుగుతూ, పీడనకు గురిఅవుతారు. నరుడు భార్యమీది అపేక్షతో అశుభకర్మలను కూడా ప్రోగుచేస్తుంటాడు. అయితే ఇహపరలోకాలు రెండింటా మనిషి ఒంటరిగా మాత్రమే వాటి ఫలితాల ననుభవిస్తాడు. పిల్లలు, భార్య, కుటుంబం - వీటిలో చిక్కుకొనిన మానవులందరూ శోకసముద్రంలో మునిగిపోతారు. అది ముసలి ఏనుగులు బురదలో చిక్కుకొనటం వంటిది. రాజా ! పుత్రమరణం వలన, ధననాశనం వలన, జ్ఞాతులు, బంధువులు నశించటంవలన దావాగ్ని వంటి తీవ్రదుఃఖం కలుగుతుంది. కానీ ఈ సుఖదుఃఖాలను, జనన మరణాలను ప్రారబ్ధీనంగానే భావించాలి. నరుడు హితైషు లున్నా లేకపోయినా, శత్రుసహితు డైనా, మిత్ర సహితు డైనా, బుద్ధిమంతు డయినా, బుద్ధిహీను డయినా దైవానుకూలత ఉంటే సుఖాన్నే పొందుతాడు. దైవానుకూలత **లేకపోతే మిత్రులు సుఖాన్ని కల్గించలేరు. శత్రువులు దుఃఖాన్ని కల్గించలేరు. బుద్ధి ధనాన్ని సంపాదించనూ లేదు. ధనం సుఖాన్ని అందించనూ లేదు. బుద్ధి ధనాన్ని సంపాదించనూ లేదు. మందమతి దారిద్ర్యానికి కారణమూ కాలేదు. ఈ సంసారచక్ర భ్రమణాన్ని జ్ఞానియే గ్రహించగలడు కానీ ఇతరులు గ్రహించలేరు. మనిషి బుద్ధిమంతు డయినా, శూరు డయినా, మూఢు డయినా, పిరికివా డయినా, జడు డయినా, పండితు డయినా, దుర్బలు డయినా, బలవంతు డయినా అదృష్టముంటే సుఖాన్ని పొందుతాడు. ఒక ఆవు ఉన్నది. అది దూడదా ? గోపాలునిదా ? దాని యజమానిదా ? దానిని దొంగిలించిన చోరునిదా ? వాస్తవానికి దానిపాలను ఎవరు త్రాగగలిగితే వారిదే ఆ గోవు అన్నదే నిర్ణయం. లోకంలో మరీ మూర్ఖులు, మహాప్రాజ్ఞులూ మాత్రమే సుఖాన్ని పొందగలరు. మధ్యస్థాయిలోని వారు బాధపడుతూనే ఉంటారు.** ధీరులు అంతిమస్థితిలో నిలిచి ఆనందిస్తారు. వారు మధ్యంతర స్థితిలో నిలువరు. అంతిమ స్థితిని పొందటం సుఖహేతువే. ఆద్యంతాల మధ్యస్థితియే దుఃఖకారణం.

దుర్బుద్ధి తాను చేస్తున్న శుభాశుభకర్మల ఫలితాన్ని గూర్చి ఆలోచించకుండా సుఖంగా

నిద్రిస్తాడు. అతడు కంబలి కప్పుకొన్న మనుష్యునివలె అజ్ఞానంతో కప్పబడి ఉంటాడు.

మాత్సర్యహీనులై, ద్వంద్వాలకు అతీతులై, జ్ఞానజనితమైన సుఖాన్ని పొందగలవారిని అర్థాలు కానీ, అనర్థాలు కానీ ఎప్పుడూ బాధించలేవు. అయితే మూఢత్వాన్ని అతిక్రమించికూడా జ్ఞానాన్ని పొందని వారు సుఖాలలో పరమానందపడతారు, దుఃఖాలలో విపరీతంగా పరితపిస్తారు. మూర్ఖులు దేవలోకంలోని దేవతలవలె ఎప్పుడూ ఆనందంగా ఉంటారు. వారి మనస్సులు విషయాసక్తిలో కూరుకొని పోవటం వలన వ్యామోహితులై ఉంటారు. **అలసత్వం మొదట సుఖంగా కనిపించినా కడకు దుఃఖాన్నే కలిగిస్తుంది. సామర్థ్యప్రదర్శనం కష్టంగా కనిపించినా కడకు సుఖాన్నే కలిగిస్తుంది. ఐశ్వర్యలక్ష్మి సమర్థునిలో నివసిస్తుంది కానీ అలసునిలో నిలువదు. సుఖమయినా దుఃఖ మయినా, ప్రియ మయినా అప్రియ మయినా ప్రాప్తించిన దానిని మనసా పరిగ్రహించాలి. ఓటమిగా భావించరాదు. ప్రతిదినమూ దుఃఖంచవలసిన సన్నివేశాలు వేనవేలుగా కనిపిస్తుంటాయి. వందల కొలది సన్నివేశాలు భయకారణమవు తుంటాయి. కానీ ఇదంతా మూఢునకే కానీ పండితునకు కాదు.* బుద్ధిమంతుడై, కృతప్రజ్ఞుడై, సద్విషయాలను వినగోరుతూ, అసూయను వీడి మనస్సును ఇంద్రియాలను నియంత్రించిన వానిని శోకం అంటదు.** ఇటువంటి బుద్ధితో పండితుడు మనస్సును అంతశ్శత్రువులనుండి, కాపాడుకొంటూ, చావు పుట్టుకల తత్త్వమెరిగితే వానిని శోకం స్పృశించలేదు. శోకానికి కానీ, తాపానికి కానీ, దుఃఖానికి కానీ, శ్రమకు కానీ కారణమైనది తన శరీరంలోని ప్రధాన భాగమైనాసరే దానిని పరిత్యజించాలి.

మనిషి ఏ పదార్థం మీద నయినా మమత్వ భావనను కల్పించుకొంటే అదంతా పరితాపకారణంగానే నిలుస్తుంది. మనిషి ఒక్కొక్కకోరికనూ పరిత్యజిస్తుంటే అదే సుఖాన్ని కలిగిస్తుంది. కామనల ననుసరించిన వాడు ఆ కామనల వలననే నశిస్తాడు. లోకంలోని కామ సుఖమూ, దివ్యమయిన మహాసుఖమూ కలిసినా కోరికలను విడవటం వలన కలిగే సుఖంలో పదహారవవంతుకు కూడా తగదు.** మనిషి పండితుడైనా, మూర్ఖుడైనా, శూరుడైనా పూర్వజన్మలో చేసిన శుభాశుభకర్మలను అదే రీతిగా అనుభవించవలసివస్తుంది. ఈ రీతిగా ప్రియ మయినా, అప్రియ మయినా

---

* శోకస్థానసహస్రాణి భయస్థానశతాని చ ।
దివసే దివసే మూఢమ్ ఆవిశంతి న పండితమ్ ॥ 40

** యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్ ।
తృష్ణాక్షయసుఖస్యైతే నార్హతః షోడశీం కలామ్ ॥ 46

దుఃఖ మయినా, సుఖ మయినా క్రమంగా మాటిమాటికీ కలుగుతూనే ఉంటాయి. ఈ అవగాహన కలిగి గుణవంతుడైనవాడు సుఖంగా జీవించగలుగుతాడు. కోరికలనన్నింటిని అసహ్యించుకొంటాడు. కోరికలను వెనుకకు నెట్టివేయగలుగుతాడు. మనస్సులో పుట్టిన ఈ కామన మనస్సులోనే పెరుగుతుంది. ఇదియే మృత్యురూపాన్ని ధరిస్తుంది. తీరని కోరికయే ప్రాణుల శరీరంలో క్రోధంగా నిలిచి ఉంటుందని పండితు లంటారు. **తాబేలు శరీరావయవాలను ముడుచుకొన్నట్లు మనిషి కోరికలను సంకోచింపజేయగలిగినప్పుడు తనలోనే స్వయం ప్రకాశరూపుడైన పరమాత్మను సాక్షాత్కరింపజేసి కొనగలడు. అప్పుడు తనకు భయ ముండదు. తనవలన ఎవరికీ భయ ముండదు. రాగద్వేషా లుండవు. అప్పుడే పరబ్రహ్మను పొందగలుగుతాడు.*** **సత్యాసత్యాలను, సుఖదుఃఖాలను, భయాభయాలను, ప్రియాప్రియాలను (ఇలా ద్వంద్వాలను) విడచి ప్రశాంత చిత్తుడు అవుతాడు. ధీరుడై సర్వప్రాణులయందు మనసా, వాచా, కర్మణా కూడా పాపకృత్యాల నాచరించనివాడు పరబ్రహ్మను పొందగలుగుతాడు. తృష్ణ దుర్మతులకు త్యజింపరానిది. మనిషి నశించినా తాను నశించనిది. అది ప్రాణాంతక మయిన రోగం, అందుకే దానిని విడచిపెట్టినవానికే సుఖం.** రాజా ! ఈ విషయంలో పింగళ చెప్పిన గీత ఒకటి వినిపిస్తోంది. ఆమె కష్టకాలంలో కూడా సనాతన ధర్మాన్నే పాలించింది. ఒకనాడు వేశ్యఅయిన పింగళ సంకేతస్థలంలో ప్రియునికోసం ఎదురుచూస్తోంది. కానీ అతడు రాలేదు. ఆ క్లిష్టకాలంలో కూడా ఆమె ప్రశాంతతతో ఇలా ఆలోచించసాగింది.

పింగళ ఇలా అనుకొన్నది. 'నా ప్రియుడు చిరకాలంనుండి నా దగ్గరనే ఉన్నాడు. నేను తనకు దగ్గరగానే ఉన్నాను. అయినా ఆయ నెప్పుడూ ఉన్మాది కాలేదు. నేను ఉన్మాదంతో ఇంతవరకు ఆయనను గుర్తించనే లేదు. ఒకే స్తంభం, నవద్వారాలుగల ఈ శరీరగృహాన్ని నేను నేటినుండి మూసివేస్తాను. ఇక్కడకు వస్తున్న ఆ ప్రియుని గురించి తెలిసిన తరువాత కూడా ఇతరుని ప్రియునిగా ఏ స్త్రీ భావించ గలదు ? నేనిప్పుడు మేల్కొన్నాను. జాగరూకత వహించిఉన్నాను. కోరికలను విడనాడినాను. కాబట్టి ఇప్పుడు నరకరూపు లయిన ధూర్తులెవ్వరూ కామంపేరుతో నన్ను మోసగించలేరు. దైవికంగానో, పూర్వజన్మపుణ్యం వలననో అనర్థంకూడా సార్థక మవుతుంది. ఇప్పుడు నేను నిరాశలో నుండి మేల్కొన్నాను. ఇంద్రియాలను జయించగలిగాను. ఆశలేనివాడు సుఖంగా నిద్రిస్తాడు.

---

* **న బిభేతి యదా చాయం యదా చాస్మాన్నబిభ్యతి ।**
యదా నేచ్ఛతి న ద్వేష్టి బ్రహ్మ సంపద్యతే తదా ॥ 52

నైరాశ్యమే పరమ సుఖం. ఆశను వీడి పింగళ సుఖంగా నిద్రిస్తోంది.' భీష్ముడిలా అన్నాడు. 'బ్రాహ్మణుడు హేతుబద్ధంగా ఈ మాటలను, మరెన్నో సుభాషితాలను చెప్పి రాజును కుదుట పరచాడు. సేనజిత్తు సుఖాన్ని పొంది ఆనందించాడు.'

175. పితాపుత్ర సంవాదము.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'పితామహా ! సర్వప్రాణులను నశింపజేయగల కాలం గడచిపోతూనే ఉంది. ఈ స్థితిలో మనిషి దేనితో శ్రేయస్సును పొందగలడు ?' భీష్ముడిలా అంటున్నాడు. 'యుధిష్ఠిరా ! ఈ విషయంలో కూడా పితాపుత్ర సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. చెపుతాను. జాగరూకతతో విను. పార్థా ! స్వాధ్యాయ నిరతుడైన ఒక బ్రాహ్మణునకు మేధావి అయిన ఒక కొడుకు ఉండేవాడు. ఆ కుమారుని పేరుకూడా మేధావియే. మోక్ష, ధర్మ, అర్థవిషయాలలో కుశలుడూ, లోకతత్త్వ వేత్త అయిన ఆ కుమారుడు స్వాధ్యాయతత్పరుడైన తండ్రితో ఇలా అన్నాడు. 'తండ్రీ ! మానవుల ఆయుస్సు వేగంగా తరిగిపోతున్నది. అది తెలిసిన జ్ఞానులు ఏం చేయాలి ? నాకు ఆ యధార్థ విషయాన్ని యథాక్రమంగా ఉపదేశించండి. దాని ననుసరించి నేను ధర్మాన్ని పాటిస్తాను.' తండ్రి ఇలా అన్నాడు. 'కుమారా ! బ్రహ్మచర్యాన్ని పాటిస్తూ వేదాధ్యయనం చేయాలి. గృహస్థుడై పితరుల సద్గతికై పుత్రులను కనాలి. త్రేతాగ్నులను స్థాపించి యాగాలు నిర్వహించాలి. వానప్రస్థుడై మునియై సంన్యసించాలి.' పుత్రుడిలా అన్నాడు. 'లోకం ఈ ప్రకారంగా నశించి పోతుంటే, జరావస్థాదులు చుట్టుముడుతుంటే, రేబవళ్ళు ఆయుస్సును మ్రింగి గడచిపోతుంటే ధీరునివలె మాటాడుతావేమిటి ?' తండ్రి ఇలా అన్నాడు. 'లోక మెలా నశిస్తోంది ? దీనిని ఏది చుట్టుముట్టుతోంది? అమోఘాలై పతన మవుతున్న వేవి ? నన్ను భయపెట్టు తున్నట్లున్నావే !' పుత్రుడిలా అన్నాడు. 'మృత్యువు లోకాన్ని నశింపజేస్తోంది. వార్ధక్యం చుట్టుముడుతోంది. అహోరాత్రాలు వచ్చి పడుతున్నాయి ? నీవు ఎందుకు గ్రహించటంలేదు ? అమోఘాలయిన ఈ రాత్రులు రోజూ వస్తూపోతూ ఉంటాయి. కానీ మృత్యువు క్షణకాలం కూడా ఆగదు. ఆ విషయం తెలిసీ ఆ వలలో చిక్కుకొని కూడా క్షణకాలమయినా నేను నిరీక్షిస్తూ ఎలా ఉండగలను ?

ఒక్కొక్క రాత్రి గడచిపోయే కొద్దీ ఆయువు తరిగిపోతుంటుంది. అది గ్రహించిన పిదపకూడా లోతులేని నీటిలో చేపలాగా ఎవడు సుఖాన్ని పొందగలడు ?

ఒక రాత్రి గడచిపోయేలోగా కొంచెమయినా మంచివని చేయకపోతే

పండితుడు ఆ రోజు వ్యర్థమయినట్లుగా భావించాలి. కోరికలు

తీరకపోయినా మృత్యువు మానవుని సమీపిస్తుంది. ఏకాగ్ర మనస్సుతో గడ్డిపరకలు వెదకి తింటున్న గొర్రెపోతును సమీపించి, తోడేలు లాగుకొని పోయినట్లు మృత్యువు / ప్రాణిని సమీపించి తీసికొని పోతుంది. కాబట్టి మంచిపనులను నేడే పూర్తిచేయి. సమయం నీ చేయిదాటి పోరాదు. పనులు ముగియకముందే మృత్యువు నిన్ను లాగికొనిపోవచ్చు. రేపటి పనిని నేడే చేయాలి. మధ్యాహ్నపు పనిని ఉదయమే చేయాలి. ప్రాణి చేయదలచిన పని ముగిసిందా లేదా అని మృత్యువు ఆగదు.* నేడెవరికి మృత్యుకాల మవుతుందో ఎవరికి తెలుస్తుంది ?

జగత్ప్రభువు అయిన మృత్యువు తాను అపహరించుకొనదలచిన వానికి ముందుగా కబురు చేయడు, మత్స్యకారుడు చేపను పట్టినట్టు మృత్యువు కూడా తెలియకుండానే కబళించివేస్తుంది.

యౌవనంలోనే ధర్మశీలుడు కావాలి. జీవితం అనిత్యం. ధర్మాన్ని పాటిస్తే ఇహపరలోకాలలో కీర్తి దక్కుతుంది. మోహంలో పడి భార్యకోసం, పిల్లలకోసం పని చేస్తూ తగిన పనులను, తగని పనులను కూడా ఆచరిస్తూ వారిని పెంచి పోషిస్తుంటాడు. పశుపుత్ర సంపన్నుడై వాటిపై మనస్సు తగిలియున్న మనుష్యుని విదురించే మృగాన్ని పులి కబళించినట్లు మృత్యువు కబళించికొనిపోతుంది. తృప్తి లేకుండా మనుష్యుడు కోరికలను ప్రోగుచేసికొనే వేళలోనే పులి పశువును కబళించినట్లు మృత్యువు కబళించుకొనిపోతుంది. "ఈ పని అయినది ఈ పని కాలేదు. ఇది అవుతూ ఉన్నట్లుంది" అనుకొంటూ కామసుఖాసక్తుడైన వానిని మృత్యువు వశపరచుకొంటుంది. పొలం, దుకాణం, ఇల్లు - వీటిపై ఆసక్తి కలిగి, అప్పటి వరకు చేసిన పనుల ఫలితాన్ని పొందకముందే కర్మాసక్తుడైన ఆ మనిషిని మృత్యువు కబళించి కొనిపోతుంది. దుర్బలుడైనా, బలవంతుడైనా, శూరుడైనా, పిరికివాడైనా, మూర్ఖుడైనా, పండితుడైనా సరే తాను చేసిన పనులు సిద్ధించకముందే మృత్యువు కబళించి కొనిపోతుంది.

మృత్యువు, వార్ధక్యం, వ్యాధి, వివిధకారణాల వలన కలిగిన దుఃఖం ఈ శరీరాన్ని ఆక్రమించి ఉంటాయి. కాబట్టి నీవు కుదురుగా ఎలా ఉండగలవు ? పుట్టుకతోడనే అంతరింపజేయటానికి మృత్యువు, వార్ధక్యం మనిషి వెంటబడతాయి. స్థావరజంగమాత్మకా లయిన ప్రాణులన్నీ ఈ రెండులక్షణాలతో తగుల్కొన్నవే. గ్రామంలో నివసిస్తూ సంసారంపై పెంచుకొనే ఆసక్తి మృత్యుద్వారమే. వానప్రస్థంలో

---

* శ్వः కార్యమద్య కుర్వీత పూర్వాహ్ణే చాపరాహ్ణికమ్ ।
న హి ప్రతీక్షతే మృత్యుः కృతమస్య న వా కృతమ్ ॥ 15

జీవించే వనం ఇంద్రియా లనే గోవులను బంధించే గోశాలయే. ఇది శ్రుతివచనం. గ్రామంలో నివసిస్తూ సంసారంపై పెంచుకొనే ఆసక్తి పాశబంధమే. సుకృతులు (పుణ్యాత్ములు) దానిని త్రెంపుకొనగలరు. దుష్కృతులు త్రెంపుకొనలేరు. మనసా, వాచా, కర్మణా ప్రాణిహింస చేయనివానిని జీవితాన్ని, అర్థాన్ని అపహరించే ప్రాణులు కూడా హింసించవు. మీదపడే మృత్యుసేనను ఎవ్వడూ బాధించలేడు. సత్య మొక్కటే ఆ పని చేయగలదు. కాబట్టి అసత్యాన్ని విడనాడాలి. అమృతత్వం సత్యాన్నే ఆశ్రయించి ఉంటుంది. **కాబట్టి సత్యవ్రతాచారుడై, సత్యయోగపరాయణుడై, శాస్త్రాలను సత్యంగా భావించి జితేంద్రియుడైనవాడు సత్యంతోనే మృత్యువును జయించవచ్చు. శరీరంలో అమృతమూ, మృత్యువూ రెండూ ఉంటాయి. మోహంవలన మృత్యువును, సత్యం వలన అమృతాన్నీ పొందుతారు.**

కాబట్టి నేను హింసను దూరంచేసి, సత్యాన్ని ఆశ్రయించి, కామక్రోధాలను లోనికి చొరనీయక, సుఖదుఃఖాలను సమంగా భావిస్తూ క్షేమంగా నిలిచి, దేవతలవలె మృత్యువును పరిహసిస్తాను. నేను శాంతియజ్ఞతత్పరుడనై, జితేంద్రియుడనై, బ్రహ్మయజ్ఞమందు నిలిచి మునివృత్తిని స్వీకరిస్తాను. ఉత్తరాయణ మార్గాన పోదలచి వాగ్యజ్ఞాన్ని, మనోయజ్ఞాన్ని, కర్మ యజ్ఞాన్ని పాటిస్తాను. నా వంటి ప్రాజ్ఞుడు నశ్వరఫలదాయకాలై, హింసా స్వరూపాలయిన పశుయజ్ఞాలను, పిశాచా లాచరించే క్షేత్రయజ్ఞాలను ఎలా ఆచరించగలడు ? **వాక్కును, మనస్సును ఎప్పుడూ చక్కగా ఏకాగ్రంగా నిలిపికొని తపస్సును, త్యాగాన్ని, సత్యాన్ని ఆశ్రయించినవాడు అన్నింటినీ పొందగలుగుతాడు. విద్యతో సమానమయిన కన్ను లేదు. సత్యంతో సమానమైన తపస్సు లేదు. రాగంతో సమానమయిన దుఃఖం లేదు. త్యాగంతో సమానమయిన సుఖం లేదు.*** నేను పరమాత్మ ద్వారా పరమాత్మయందే జనించినవాడను. పరమాత్మయందున్నవాడను. భవిష్యత్తులోనూ పరమాత్మయందే ఉంటాను. నేను సంతాన రహితుడనే, సంతానం నన్ను తరింపజేయనవసరం లేదు. ఏకాగ్రత, సమత, సత్యత, శీలం, నిష్ఠ, అహింస, ఋజుత్వం, సకామకర్మ పరిత్యాగం – వీటిని మించిన సంపద బ్రాహ్మణునకు లేదు. **బ్రాహ్మణా ! ఏదో ఒక రోజు చావు తప్పని నీకు ధనమెందుకు ? బాంధవు లెందుకు ? భార్య యెందుకు ? హృదయగుహలో**

---

* యస్య వాఙ్మనసీ స్యాతాం సమ్యక్ప్రణిహితే సదా ।
తపస్త్యాగశ్చ సత్యం చ స వై సర్వమవాప్నుయాత్ ॥ 34
నాస్తి విద్యాసమం చక్షుః నాస్తి సత్యసమం తపః ।
నాస్తి రాగసమం దుఃఖం నాస్తి త్యాగసమం సుఖమ్ ॥ 35

నున్న పరమాత్మను అన్వేషించు. నీ పితామహులు, నీతండ్రి ఎక్కడకు వెళ్ళారో ఆలోచించు.' భీష్ముడిలా అన్నాడు. 'రాజా ! ఆ కుమారుని మాట విని, ఆ తండ్రి ఎలా ధర్మాన్ని అనుష్ఠించాడో అలాగే నీవు కూడా సత్యధర్మ పరాయణుడవై ప్రవర్తించు.'

176. శంపాకగీత.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. పితామహా ! ధనికులు, నిర్ధనులు కూడా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారు. అయితే వారికి సుఖదుఃఖాలు ఏ రూపంలో, ఎలా సంక్రమిస్తాయి ?' భీష్ముడిలా అన్నాడు. 'ఈ విషయంలో కూడా పరమశాంతుడై, జీవన్ముక్తు డయిన శంపాకుడు చెప్పిన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. ఒకప్పుడు ఒక బ్రాహ్మణుడు తన చింపిగుడ్డలతో, దుష్టభార్యతో, ఆకలితో అలమటిస్తూ, త్యాగాన్ని ఆశ్రయించి, నాతో ఇలా అన్నాడు. 'ఈలోకంలో మనిషి పుట్టినది మొదలు వివిధ కారణాల ద్వారా దుఃఖాలు, సుఖాలు ప్రాప్తిస్తుంటాయి. విధాత సుఖదుఃఖమార్గాలలో ఏదో ఒకదానిలోనే మనిషిని నడిపిస్తుంటే సుఖం కలిగినపుడు ఆనందం కానీ, దుఃఖం కలిగినపుడు బాధ కానీ పొందడు. నీకు కోరికలు లేకపోయినా నీవు శ్రేయస్సాధనకై ప్రయత్నించలేకపోవటానికీ, నిన్ను నీవు నియంత్రించుకొనలేక పోవటానికీ కారణం సదా రాజ్యభారాన్ని నీపై నిలుపుకోవటమే. నీవు ఏమీ లేనివాడవయితే అంతటా సంచరిస్తూ కూడా సుఖాన్నే ఆస్వాదించగలవు. ఏమీ లేనివాడే సుఖంగా నిద్రించగలడు, సుఖంగా మేల్కొనగలడు.

ఏమీ లేకపోవటమే లోకంలో సుఖకరం, హితకరం, శుభకరం, క్షేమకరం కూడా. ఈ మార్గంలో శత్రువులు కూడా ఉండరు. ఇది ఎంత దుర్లభమో అంత సులభం కూడా. మూడులోకాలలో వెదకినా అకించనుడు, పవిత్రుడు, సర్వవిధాలా వైరాగ్య సంపన్నుడూ అయిన వానితో సమానమైన వానిని చూడలేము. దారిద్ర్యాన్నీ, రాజ్యాన్నీ, త్రాసులో వేసి తూచాను. అయితే గుణాధిక్యంవలన రాజ్యం కన్న దారిద్ర్యమే మిన్నగా కనిపించింది. **దారిద్ర్యానికి, రాజ్యానికీ మధ్య ఒక పెద్దతేడా కూడా ఉంది. ధనికుడైన రాజు ఎప్పుడూ ఉద్విగ్నుడై ఉంటాడు. మృత్యుముఖంలోనే పడిఉంటాడు. ధనాన్ని వీడి, ధనాశనుండి విముక్తిని పొంది, కోరికలను పరిత్యజించిన వానిని అగ్ని కానీ, అరిష్టాలు కానీ, మృత్యువు కానీ, దొంగలు కానీ ఏమీ చేయలేరు.** నిత్యమూ దైవేచ్ఛ ననుసరించి నడుచుకొంటూ, పక్క లేకుండా చేతులనే తలగడగా చేసికొని శయనిస్తూ, ప్రశాంతుడై ఉన్నవానిని దేవతలు ప్రశంసిస్తారు.

ధనవంతుడు క్రోధలోభాలకు లోనయి బుద్ధిహీనుడై వక్రదృష్టియై, శుష్కముఖుడై,

కనుబొమలు ముడివేస్తూ పాప కృత్యాలపై మనస్సు లగ్నం చేస్తాడు. కోపంతో పెదవులు కొరుకుతూ దారుణంగా మాటాడుతుంటాడు. అటువంటి వాడు భూమినంతా ధారపోస్తానన్నా అతనివైపు చూడటానికి ఎవ్వడూ ఇష్టపడడు. ఎప్పుడూ డబ్బుతోనే సహవాసం చేస్తూ, విచక్షణను కోల్పోయిన వాడు మోహంలో పడతాడు. గాలి శరత్కాల మేఘాలను అపహరించినట్లు సంపద అతని మనస్సును హరిస్తుంది. అంతేకాక అతనిని రూపాహంకారం, ధనాహంకారం కూడా ఆక్రమిస్తాయి. "నేను కులీనుడను. అంతా సిద్ధించిన వాడను. మామూలు మనిషిని కాను" అన్న భావాలు అతనిలో కలుగుతాయి. **రూపం, ధనం, కులం - అనే ఈ మూడింటిపై అభిమానం కారణంగా అతని మనస్సు ఏకాగ్రతను కోల్పోతుంది. భోగాసక్తుడై, పిత్రార్జిత సంపదలను పోగొట్టుకొని దరిద్రుడై, పరులధనాన్ని కొల్లగొట్టడాన్నే సత్కార్యంగా భావిస్తాడు.** ఈ రీతిగా హద్దుల నతిక్రమించి అటునుండి, ఇటు నుండి ధనాన్ని ప్రోగుచేస్తున్న వానిని మృగాన్ని వ్యాధులు బాణాలతో కొట్టినట్లు రాజులు దండిస్తారు. ఈ విధంగా మనస్సును పరితపింపజేసే దుఃఖాలు, శరీర స్పర్శవలన ఏర్పడే దుఃఖాలు నానావిధాలుగా మనిషికి సంక్రమిస్తాయి. అనిత్యమయిన శరీరాన్ని, నిత్యంగా నిలిచే పుత్రైషణను లోకధర్మాలను తిరస్కరించి, ఆ పరమ దుఃఖాలకు చికిత్స చేయాలి. దానికి బుద్ధి సహకరిస్తుంది. **త్యాగం లేకపోతే సుఖం లేదు. త్యాగం లేకపోతే పరలోకం లేదు. త్యాగం లేకపోతే నిర్భయంగా నిద్రించలేడు. అన్నింటినీ విడనాడి సుఖంగా ఉండు.'*** 'ఈ విధంగా హస్తినపురంలో గతంలో శంపాకుడనే బ్రాహ్మణుడు నాకు చెప్పాడు. కాబట్టి త్యాగమే అన్నింటి కన్న గొప్పది.'

177. మంకిగీత.

యుధిష్ఠిరుడిలా అన్నాడు. 'ధనాన్ని కోరి, ఎంత ప్రయత్నించినా ధనాన్ని పొందలేకపోతే ధనాశతో దెబ్బతిన్న ఆ మనిషి ఏంచేస్తే సుఖాన్ని పొందగలడు ?' **భీష్ముడిలా అన్నాడు. 'భారతా ! సర్వసమభావన, నిరర్థకశ్రమ లేకుండుట, సత్యవాక్యం, నిర్వేదం, కర్మలపై అనాసక్తి గల నరుడు సుఖిస్తాడు. పెద్దవారు ఈ అయిదు పదాలనే ప్రశాంతికి కారణాలుగా చెప్పారు. ఈ మార్గమే స్వర్గం, ఇదే ధర్మం. ఇదే పరమసుఖం అని భావింపబడుతుంది.** యుధిష్ఠిరా ! ఈ విషయంలో కూడా ఒక ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. నిర్వేదంతో మంకి పలికిన గీతమది. దానిని

---

* నాత్యక్త్వా సుఖమాప్నోతి నాత్యక్త్వా విందతే పరమ్ ।
నాత్యక్త్వా చాభయః శేతే త్యక్త్వా సర్వం సుఖీ భవ ॥ 22

విను. మంకి ధనాన్ని సంపాదించాలని ప్రయత్నించాడు. కానీ చాలాసార్లు భంగపడ్డాడు. చివరకు మిగిలిన కొద్దిధనంతో రెండు కోడెదూడలను కొన్నాడు. ఒకనాడు ఆ రెండింటిని కలిపి కట్టి, నాగలి దున్నటాన్ని అలవాటు చేయబోయాడు. అవి గ్రామం నుండి బయటకు వచ్చాయి. ఒక ఒంటె పడుకొని ఉంటే దాని రెండు ప్రక్కల నుండి అవి పరుగెత్తాయి. ఆ కోడెలు ఒంటె మూపురం మీదకు రాగానే ఆ ఒంటె కోపంతో లేచి, ఆ కోడెలను పైకి లేపి, మహావేగంతో పరుగెత్తసాగింది. ఆ ఒంటె కోడెలను లాగుకొనిపోయి చంపటాన్ని, చనిపోతున్న కోడెలను చూసి, మంకి ఇలా అన్నాడు. **'మనుష్యుడు ఎంత వేర్పరి అయినా అదృష్టం లేకపోతే ఎంత శ్రద్ధతో ప్రయత్నం చేసినా ధనాన్ని పొందలేడు.** ఇంతకుముందు చేసిన పనులలో ఎన్నో అనర్థాలు సంభవించాయి. అయినా నేను ధనసంపాదనకై ప్రయత్నించాను. చూడండి. ఈ రోజు ఈ కోడెల సాంగత్యంతో అనుకోకుండా ఎంత ఉపద్రవం కలిగిందో ! నా కోడెలను ఎత్తిపట్టుకొని ఈ ఒంటె విషమమార్గంలోనే నడుస్తోంది. నాకోడెలను కాకతాళీయంగానే మూపురంమీదికి ఎత్తికొని అపమార్గంలో నడుస్తోంది. నా కిష్టమైన నా కోడెలు ఆ ఒంటెకు రెండు వైపులా మణులవలె చిక్కుకొన్నాయి. ఇదంతా దైవికమే. మొండిగా ప్రయత్నించినా పౌరుషం పనికిరాదు. **ఎక్కడైనా ఎప్పుడైనా ఏదైనా పౌరుషం ఫలించినట్లు కనిపించినా బాగా పరిశీలిస్తే అదికూడా దైవికంగానే నిలుస్తుంది. కాబట్టి సుఖాన్ని కోరుకొంటే నిర్వేదమొక్కటే ఆశ్రయింపదగినది. నిర్వేదంతో అర్థసాధనపై ఆశ లేనివాడే సుఖంగా నిద్రిస్తాడు.** శుకుడు జనకుని మందిరం నుండి అరణ్యంలోనికి ప్రవేశిస్తూ, సర్వవిధాలా విముక్తుడై, చక్కగా ఇలా చెప్పాడు. **ఒకడు సర్వకామనలను పొందగలుగుతాడు. ఒకడు అన్నింటినీ విడిచిపెడతాడు. సర్వకామాలను పొందంటం కంటె పరిత్యజించటమే విశేషం.**

ధనాది సంపాదనకై ప్రయత్నించిన వాడెవడూ గతంలో ఎప్పుడూ పూర్తిగా పొందిన స్థితిలేదు. బుద్ధిహీనునకే శరీరం మీదా, జీవితం మీదా తృష్ణ పెరుగుతుంది. కాముకా ! సర్వప్రవృత్తుల నుండి వెనుకకు మరలు. వైరాగ్యంతో శాంతిగా నిలు. ప్రవృత్తి మార్గంలో ఎన్నోసార్లు ప్రయత్నించి విఫలుడ వయ్యావు. అయినా వాటిపై విరక్తి కలగటం లేదు. ధనకాముకా ! నీవు నన్ను నాశనం చేయదలచకపోతే, నాతో కలిసి ఆనందంగా ఉండదలిస్తే నన్ను వృథాగా లోభాసక్తుని చేయకు. ధనకాముకా ! నీవు కూడబెట్టిన ద్రవ్యమంతా మరలా నశిస్తూనే ఉంది. మూర్ఖుడా ! ఈ ధనకాంక్షను ఎప్పటికైనా విడిచిపెడతావా ! ఆహా ! నేనెంత అవివేకిని. నీకు ఆటవస్తువు నైనాను. లేకపోతే ఎప్పుడైనా, ఎవడయినా ఇతరులకు దాసుడుగా ఉండటానికి అంగీకరిస్తాడా ? **ఇంతకు ముందు**

కానీ ఇక మీదట కానీ ఎవ్వరూ కోరికల అంతు చూడలేదు, చూడలేరు. కాబట్టి సర్వవిధకర్మలను వీడి సావధానుడ నయ్యాను, మేల్కొన్నాను. కామమా ! నీ మనస్సు నిశ్చయంగా వజ్రంవలె దృఢ మయినది. అందుకే వందలకొలదిగా అనర్థాలు సంభవించినా ముక్కలు (నూరు) ముక్కలు కాకుండా నిలుస్తోంది. కామమా ! నీగురించీ, నీ కిష్టమయినదానిని గురించీ నాకు బాగా తెలుసు. నీ ప్రియంకోసమే నేను ప్రయత్నిస్తూ, మనసా సుఖాన్ని పొందలేకపోతున్నాను. కామమా ! నీ మూలం నాకు తెలుసు. సంకల్పం నుండియే కదా నీవు పుట్టేది. నేను నిన్నసలు సంకల్పించను. అప్పుడు సమూలంగా నశిస్తావు. ధనేచ్ఛ సుఖకరం కాదు. ధనాన్ని పొందినా ఎంతో చింత కలుగుతుంది. లభించినది నశిస్తే అది మృత్యువువలె భీకరమైన స్థితి. ప్రయత్నించినా కూడా ధనం లభిస్తుందో లేదో నిశ్చయంగా తెలియదు. శరీరాన్ని పరిత్యజించటానికి సిద్ధపడినా ధనప్రాప్తి లేకపోతే అంతకన్న బాధాకరమయిన దేముంది ? దొరికిన దానితో తృప్తి కలుగదు. మరల వెదుకుతూనే ఉంటాడు. రుచికరమైన గంగాజలంవలె ధనం తృష్ణను పెంచుతూనే ఉంటుంది. ఈ తృష్ణావృద్ధి నన్నే నశింపజేస్తుంది. ఇపుడు గ్రహించగలిగాను. కాబట్టి నన్ను వదలిపెట్టు.

ఈ నా శరీరాన్ని ఆశ్రయించుకొని ఉన్న పంచభూతాలు స్వేచ్ఛగా నన్ను వదలి వెళ్ళనీ, లేదా సుఖంగా ఈ శరీరంలోనే నిలువనీ, నాకేం సంబంధం లేదు. పంచభూతాల్లారా ! కామం వెంటబడే మీమీద నాకు ప్రీతిలేదు. కాబట్టి కోరికలను వీడి, నేను సత్త్వగుణాన్నే ఆశ్రయిస్తాను. నేను సర్వభూతాలను నా శరీరంలో, మనస్సులో చూస్తూ బుద్ధిని యోగంమీదా, సత్యాన్ని వేదమార్గంమీదా, మనస్సు పరమాత్మమీదా లగ్నంచేసి నిరామయుడనై, అనాసక్తుడనై సుఖంగా లోకాలంతటా సంచరిస్తాను. నీవు మరలా ఈ రీతిగా నన్ను దుఃఖంలో ముంచలేవు. కామమా ! నీవెప్పుడూ ఆశకూ, శోకానికీ, పరిశ్రమకూ ఉత్పత్తి స్థానానివి. నీవు రెచ్చగొట్టినంతకాలం నాకు మరో గతి ఉండదు. ధనం నశించినా అది అన్నింటికన్న పెద్దబాధ. ధనాన్ని కోల్పోయిన వానిని జ్ఞాతులు, మిత్రులు కూడా అగౌరవంగా చూస్తారు. ధనహీనతలో వేలకొలదిగ పరాభవాలు ఏర్పడుతాయి. కాబట్టి అది చాలా కష్టాలను కలిగించే దోషం. ధన ప్రాప్తిలో ఏ కొంచెమైనా సుఖం కనిపించినా అది కూడా కష్టాల తరువాతనే లభిస్తుంది. ఎవరిదగ్గరయినా ధనమున్నట్లు పసిగడితే దొంగలు వారిని ముందు చంపివేస్తారు. లేదా రకరకాలుగా ఇబ్బందులు పెట్టి, ఆందోళనకు గురి చేస్తారు. కామమా ! అర్థాసక్తి దుఃఖకారణ మని నేను చాలాకాలం తర్వాత గ్రహించాను. నీవు ఆశ్రయించిన వారినే ఆపదల పాలు చేస్తావు. నీవు తత్త్వజ్ఞాన

రహితుడవు. బాలునివలె మూఢుడవు. తృప్తిలేనివాడవు. అగ్నివంటి నీ కడుపు నింపటం అసాధ్యం. ఏది సులభమో, ఏది దుర్లభమో కూడా నీవెరుగవు. కామమా ! పాతాళంవలె నిన్ను నింపటం కష్టం. నీవు నన్ను దుఃఖపెట్టా లనుకొంటున్నావు. కానీ మరలా ఇప్పుడు నీవు నాలో చొరబడలేవు.

అనుకోకుండా ధనం నశించటంవలన నేను వైరాగ్యాన్ని పొంది, పరమానందాన్ని అనుభవిస్తున్నాను. ఇప్పుడు భోగాలను గూర్చి ఆలోచించను. ఎన్నో కష్టాలను అనుభవించాను. అయినా బుద్ధిహీనుడనై ధనాశయే కష్టాలకు కారణమని గ్రహించలేకపోయాను కానీ ధననాశం వలన వంచింపబడి, నేను ఇప్పుడు సర్వాంగ విషయంలోనూ నిశ్చింతగా నిదురిస్తున్నాను. కామమా ! కోరికలనన్నింటినీ విడిచి నిన్ను పరిత్యజిస్తున్నాను. ఇకెప్పుడూ నీవు నాతో కలిసి ఉండలేవు. నాతో ఆడుకొనలేవు కూడా. నన్నెవరయినా ప్రేరేపించినా వాటిని మౌనంగా సహిస్తాను. నన్నెవరయినా హింసించినా తిరిగి వారిని హింసించను. నన్ను ద్వేషించేవారు కలిసినా వారి అప్రియచేష్టలను పరిగణింపక వారితో ప్రియంగానే మాటాడుతాను. నిత్యమూ లభించిన దానితో తృప్తిపడుతూ, ఇంద్రియాలను కుదుట పరచుకొని జీవిస్తాను. నాకు శత్రు వయిన నిన్ను మాత్రం ఎన్నడూ సఫలుని చేయను. నేను నిర్వేదాన్ని, ఆనందాన్ని, తృప్తిని, శాంతిని, సత్యాన్ని, దమాన్ని, క్షమను, సర్వభూతదయను పొందాను. ఈ విషయాన్ని నీవు గ్రహించు. కాబట్టి కామమూ, లోభమూ, తృష్ణ, కృపణత్వం నన్ను విడిచి వెళ్ళాలి. నేను మోక్షార్థిని. ఇప్పుడు నేను సత్త్వగుణంలో నిలిచినవాడను. కామలోభాలను పరిత్యజించి, ఇప్పుడు సుఖాన్ని పొందాను. పరవశుడైన వ్యక్తివలె ఇప్పుడు లోభానికి లోనయి దుఃఖాన్ని కొనితెచ్చుకోను. ఏ ఏ కోరికలను విడిచిపెడితే ఆయా కోరికలకు సంబంధించిన సుఖాన్ని పొందవచ్చు. కామానికి లోనయితే మాత్రం నిత్యమూ దుఃఖమే కలుగుతుంది. కామంతో సంబంధంగల ఏ రజోగుణాన్ని అయినా మనిషి దూరం చేసికోవాలి. దుఃఖం, సిగ్గులేనితనం, అసంతృప్తి అనేవి కామక్రోధాలవలననే కలుగుతాయి. వేసవిలో చల్లనిమడుగులో దిగినట్లు నేనిప్పుడు బ్రహ్మనిష్ఠుడ నయ్యాను. కాబట్టి శాంతిస్తాను. నిర్వేదాన్ని పొందుతాను. కేవల సుఖమే నాకిప్పుడు దక్కుతుంది. **ఇహలోకంలోని కామసుఖ మయినా, పరలోకంలోని మహాదివ్య భోగ మయినా కోరికలు నశించినందువలన కలిగే సుఖంలో పదహారవభాగంతో కూడా సమానం కావు.** కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్య మమత లనేవి సప్తశత్రువులు. వాటిలో కామం ప్రబల మయినది. ఆ ఆరింటితో పాటు కామాన్ని నశింపజేసి, అనశ్వర మయిన బ్రహ్మపురంలో నిలిచి రాజులా సుఖంగా ఉంటాను.

ఈ బుద్ధిని పొంది, అన్ని కోరికలను విడిచి, నిర్వేదంపొంది పరమానంద స్వరూప మయిన పరబ్రహ్మను పొందాడు.' **'కోడెలు వశించిన కారణంగానే మంకి అమృతత్వాన్ని పొందగలిగాడు. కామమూలాన్ని ఖండించి, తద్వారా మహాసుఖాన్ని పొందాడు.'**

178. బోధ్యగీత.

భీష్ముడిలా అన్నాడు. 'ఈ విషయంలో శాంత స్వరూపుడయిన విదేహరాజు జనకుడు ప్రవచించిన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. **నా దగ్గర అంతులేని ధన మున్నది. అయినా నాకేమీ లేదు. మిథిల అంతా తగులబడినా నాదంటూ ఏదీ తగులబడదు.*** యుధిష్ఠిరా ! ఈ సందర్భంలో వైరాగ్యాన్ని ఉద్దేశించి బోధ్యుడు పలికిన మాటలను చెపుతాను. విను. నిర్వేదంతో శాంతిని పొంది, శాస్త్రజ్ఞానంతో తృప్తి పడి, ప్రశాంతంగా ఉన్న బోధ్యమహర్షిని నహుషుని కొడుకు ఇలా అడిగాడు. 'మహాప్రాజ్ఞా ! ప్రశాంతిని పొందే మార్గాన్ని ఉపదేశించు. ఎవరైనా ఎటువంటి బుద్ధిని ఆశ్రయిస్తే శాంతినీ, సుఖాన్నీ పొందవచ్చు ?' బోధ్యుడిలా అన్నాడు. 'నేనెవ్వరికీ ఏదీ ఉపదేశించను. ఇతరులనుండి ఉపదేశాన్ని స్వీకరిస్తాను. నేను పొందిన ఉపదేశాల లక్షణాన్ని చెపుతాను. నీవే ఆలోచించుకొని గ్రహించు. పింగళ, కుర్రరం, సర్పం, అరణ్యంలో సారంగాన్వేషణం, బాణాలను తయారు చేసేవారు, కుమారి – ఈ ఆరుగురు నాకు గురువులు.' భీష్ముడిలా అన్నాడు. **'రాజా ! ఆశ బలవత్తరమైనది. నిరాశ పరమసుఖహేతువు. ఆశను నిరాశగా మార్చుకొని పింగళ సుఖంగా నిద్రిస్తుంది.** మాంసపు ముక్కను ముక్కున కరచుకొని పోతున్న క్రౌంచపక్షిని చూసి, మాంసం దొరకని పక్షులు బాధించసాగాయి. అప్పుడది మాంసపు ముక్కను విడిచిపెట్టింది. దానితో సుఖపడింది. **ఇల్లు కట్టడానికి ప్రారంభించటం దుఃఖాన్నే కలిగిస్తుంది. ఎప్పుడూ సుఖ ముండదు. పాము ఇతరులు కల్పించిన ఇంటిలో ప్రవేశించి సుఖంగా ఉంటుంది. ఏ ప్రాణులకూ ద్రోహం చేయకుండా చాతకపక్షి జీవించినట్లు భిక్షను వృత్తిగా స్వీకరించి, మునులు సుఖంగా జీవించగలుగుతున్నారు.** బాణాలు చేసే వాడొకడు ఆ బాణం మీదనే మనస్సును పెట్టి, ప్రక్కనే వెళ్తున్న రాజును గూడా గమనించ లేదు. పదిమంది కలిసి ఉంటే నిత్యమూ

---

* **అనంతమివ మే విత్తం యస్య మే నాస్తి కించన ।**
మిథిలాయాం ప్రదీప్తాయాం న మే దహ్యతి కించన ॥ 2

కలహమే. ఇద్దరున్నా మాటామాటా కలవక తప్పదు. కాబట్టి కుమారి చేతిలో ధరించిన శంఖంలోని రేఖలవలె ఒంటరిగానే తిరుగుతాను.'

179. ఆజగర ప్రహ్లాదసంవాదము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'నడవడి నెరిగినవాడా ! మనిషి ఎటువంటి నడతతో శోకరహితుడై భూమిపై చరించగలడు ? లోకంలో ఎటువంటి పని నాచరిస్తూ ఉత్తమగతిని పొందగలడు ?' భీష్ముడిలా అన్నాడు. 'ఈ విషయంలో కూడా ప్రహ్లాదునకు, ఆజగరమహర్షికి మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. దృఢచిత్తుడు, శోకరహితుడు, బుద్ధిమంతుడు అయిన ఒక బ్రాహ్మణుడు లోకంలో సంచరిస్తుండగా ధీమంతు డయిన ప్రహ్లాదుడు ఇలా అడిగాడు.' 'స్వస్థుడవై, శక్తిమంతుడవై, మృదుస్వభావుడవై జితేంద్రియుడవై, కర్మరహితుడవై, అసూయలేని వాడవై, మాటకారివై, ప్రగల్భుడవై, మేధావివై కూడా బాలునివలె తిరుగుతున్నావేమి ? ఏ లాభాన్నీ కోరటం లేదు. దొరకని దానిని గురించి బాధపడటం లేదు. బ్రాహ్మణా ! నిత్యతృప్తుడవై ఉన్నట్లు ఏ వస్తువును గురించి ఆలోచించటం లేదు. ప్రజలు ప్రవాహంలో కొట్టుకుపోతుంటే ఆ విషయంలో ఉదాసీనంగా ఉన్నావు. ధర్మకామార్థకార్యాలలో తటస్థుడవై కనిపిస్తున్నావు. ధర్మార్థాలను పాటించటంలేదు. కామప్రవృత్తికూడా లేదు. ఇంద్రియార్థాలను ఉపేక్షించి ముక్తుడవై, సాక్షి మాత్రుడవై సంచరిస్తున్నావు. మునీ ! నీ బుద్ధి ఎటువంటిది ? నీ జ్ఞానమెటువంటిది ? నీవృత్తి ఏది ? బ్రాహ్మణా ! నాకు శ్రేయస్సును కల్గించే సాధనంగా నీవు దేనినయినా భావిస్తే వెంటనే నాకు చెప్పు.'

'ప్రహ్లాదు డిలా అడుగగానే లోకధర్మ విధానాల నెరిగిన ఆ మేధావి అపార్థాలకు తావులేని మధుర వాక్కుతో ప్రహ్లాదునితో ఇలా అన్నాడు. "ప్రహ్లాదా ! చూడు. లోకంలో ప్రాణుల ఉత్పత్తి, వృద్ధి, క్షయం, వినాశం అన్నీ పరమాత్మనుండియే కలుగుతున్నాయి. కాబట్టి నాకు ఆనందమూ లేదు, దుఃఖమూ లేదు. ప్రాణులలో నున్న ప్రవృత్తులన్నీ స్వభావంనుండి పుట్టినవే అని గమనించాలి. అందరూ స్వభావతత్పరు లయ్యే ఉంటారు. ఇక దేనివల్లకూడా ఆనందించవలసిన అవసరం లేదు. ప్రహ్లాదా ! కలయికలన్నీ విడిచిపోవటానికే. గమనించు. కూడబెట్టినవన్నీ నశించిపోయేవే. కాబట్టి నాకు దేనిమీదా మనస్సు లేదు. **గుణ సహితాలయిన ఈ ప్రాణులన్నీ నశించేవే అని తెలిసికొని, చావుపుట్టుకల తత్త్వాన్ని గ్రహించిన వానికి ఇక చేయవలసిన పని ఏముంటుంది ?** మహాసాగరజలంలో పుడుతున్న మహా శరీరంగల ప్రాణులు (తిమింగలం మొదలయినవి), స్వల్పశరీరం గల

ప్రాణులూ కూడా క్రమక్రమంగా నశించటం చూస్తున్నాను. రాక్షసరాజా ! నేలపై పుడుతున్న స్థావరజంగమ ప్రాణులన్నీ అంతటా మరణించటం స్పష్టంగా చూస్తూనే ఉన్నాను. రాక్షసోత్తమా ! ఆకాశంలో చరించే బలిష్ఠమయిన పక్షులు కూడా యధాకాలంగా మరణిస్తూనే ఉన్నాయి. ఆకాశంలో సంచరించే చిన్న, పెద్ద నక్షత్రాలు కూడా తగిన సమయంలో పడిపోవటాన్ని కూడా గమనిస్తూనే ఉన్నాను.

ఈ విధంగా మృత్యువుతో తగుల్కొనిన ఈ భూతాల నన్నింటినీ గమనిస్తూ, తత్త్వాన్ని గ్రహిస్తూ సర్వసమాన భావంతో సుఖంగా నిద్రిస్తున్నాను. అనుకోకుండా లభించిన ఆహారం ఎంతయినా భుజిస్తాను. ఎన్నిదినాలయినా ఏమీ తినకుండా కూడా నిదురిస్తాను. ఎందరో వచ్చి, ఎన్నో రుచులుగల ఆహారాన్ని ఎంతగానో నాకు తినిపిస్తుంటారు. ఒక్కొక్కసారి తక్కువ, ఒక్కొక్కసారి మరీ తక్కువ ఆహారం దొరుకుతుంది. ఒక్కొక్క సారి అసలేమీ దొరకదు. ఒక్కొక్కసారి ఒక్కమెతుకే తింటాను. ఒక్కొక్కసారి నువ్వులపిండి తింటాను. ఒక్కొక్కసారి తక్కువ, ఒక్కొక్కసారి మరీ తక్కువ ఆహారం దొరుకుతుంది. ఒక్కొక్క సారి అసలేమీ దొరకదు. ఒక్కొక్కసారి పరువుపై పడుకొంటాను. ఒక సారి నేలమీద కూడా నిదురిస్తాను. ఒక్కొక్కసారి గొప్ప మేడలపై కూడా శయ్య సమకూరుతుంది. ఒక్కొక్కసారి నారచీరలు ధరిస్తాను. ఒక్కొక్కసారి జనుపనార బట్టలు, మృగచర్మాలు ధరిస్తాను. మరొక సారి ఎంతో విలువయిన వస్త్రాలను కూడా ధరిస్తాను. **దైవికంగా ధర్మానుకూలంగా లభించిన భోగ్య పదార్థాన్ని తిరస్కరించను. దుర్లభమయిన విశిష్టభోగం దొరకకపోతే దానికోసం ప్రాకులాడను.**

నేను పవిత్ర భావంతో ఆజగరవ్రతాన్ని ఆచరిస్తాను. ఈ వ్రతం దృఢమైనది. మృత్యువును దూరం చేయగలది. ఇది శుభకరం, శోకరహితం, పవిత్రం, నిరుపమానం, బుధజనసమ్మతం. మూఢులు దీనిని ఇష్టపడరు. సేవింపరు. నిశ్చలమతినై, స్వధర్మాన్ని అతిక్రమింపక, సంసార జీవనాన్ని కుదించుకొని, ఉత్తమాధములను తెలిసికొని, భయ రాగద్వేషలోభమోహాలను వీడి పవిత్రుడనై నేను ఈ ఆజగరవ్రతాన్ని ఆచరిస్తాను. ఈ ఆజగరవ్రతం మనస్సుకు సంతోషాన్నిస్తుంది. ఫలభక్ష్యభోజ్య పేయాల విషయంలో దీనిలో ఏ నియమం లేదు. దేశకాలాలు ప్రారబ్ధఫలాన్ని బట్టి ఉంటాయి. నీచులు దీనిని పాటించలేరు. నేను పవిత్రుడనై ఈ వ్రతాన్ని ఆచరిస్తున్నాను. 'ఇది కావాలి, అది కావాలి' అనుకొంటూ ఆశలకు లోనయి, ధనం లభించనందులకు బాధపడుతూ జీవిస్తున్న వారిస్థితిని చూసి, తాత్త్విక బుద్ధిని పొంది, పవిత్రుడనై నేను ఈ ఆజగరవ్రతాన్ని ఆచరిస్తున్నాను. డబ్బుకోసం దీనులై, నీచుల నాశ్రయిస్తున్న పెద్ద వారిని ఎన్నోమార్లు చూసి, కోరికలను

చంపుకొని, స్వరూప జ్ఞానంతో ప్రశాంతుడనై, పవిత్రుడనై ఈ ఆజగరవ్రతాన్ని ఆచరిస్తున్నాను. **సుఖ మయినా, దుఃఖ మయినా; లాభ మయినా, నష్టమైనా; ఆసక్తి అయినా అనాసక్తి అయినా; జీవిత మయినా మరణ మయినా దైవాధీనమని గ్రహించి, తత్త్వాన్ని గుర్తించి; నేను పవిత్రుడనై ఈ ఆజగర వ్రతాన్ని ఆచరిస్తున్నాను.** భయ, రాగ, మోహ, గణాలను వీడి, ధృతి, మతి, బుద్ధులతో కూడి ప్రశాంతుడనై, దక్కిన దానినే అనుభవించే వారిని గురించి విని, పవిత్రుడనై ఈ ఆజగరవ్రతాన్ని ఆచరిస్తున్నాను. నాకు శయ్యాసనాలకు సంబంధించి ఏ నియమమూలేదు, స్వభావతః నేను దమ, నియమ, వ్రత, సత్య, శౌచాలు గలవాడిని. నా కర్మల సంచయం నశించింది. నేను ఆనందంగా, పవిత్రుడనై ఆజగరవ్రతాన్ని ఆచరిస్తున్నాను. దుఃఖ కారణాలై కోరికలకు విషయమయిన పదార్థాల నుండి విరక్తులయిన ఆత్మనిష్ఠులను చూసి, జ్ఞానాన్ని పొంది; తృష్ణకు ఆలంబనమై, అనియతమయిన మనస్సును నియంత్రించ దలచి, పవిత్రుడనై, నేను ఈ ఆజగరవ్రతాన్ని ఆచరిస్తున్నాను. మనస్సును, మాటను, బుద్ధిని ఉపేక్షించి, వాటి వలన పొందే విషయానందాలను దుర్లభాలుగా అనిత్యాలుగా గుర్తించి, ఆ రెండింటిని గుర్తిస్తున్నట్లు నేను పవిత్రుడనై ఈ ఆజగరవ్రతాన్ని ఆచరిస్తున్నాను.

తమ కీర్తిని విస్తరింపజేయదలచుకొన్న కవులు, పండితులు ఎందరో స్వపరవాదాలతో గహనమయిన తర్కంతో "ఇది ఇలా చేయాలి" అంటూ ఈ ఆజగర వ్రతాన్ని గురించి ఎంతో చెప్పారు. మూఢులయిన మనుష్యులు ఈ ఆజగరవ్రతాన్ని గూర్చి విని, దీనిని పైనుండి క్రిందకు పడటంగా భావిస్తుంటారు. నేను మాత్రం దీనిని అజ్ఞాన నాశకంగా, దోషరహితంగా భావిస్తూ తృష్ణాదోషాలను విడచి మనుష్యులతో సంచరిస్తున్నాను.' భీష్ముడిలా అన్నాడు. 'రాగరహితుడై, ఈ ఆజగర వ్రతాన్ని పాటించిన మహాత్ముడు భయలోభ మోహ క్రోధాలకు దూరమై ఈ లోకంలో సుఖంగా సంచరించగలడు.'

180. శృగాల కాశ్యపసంవాదము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'పితామహా ! బాంధవులు, కర్మ, ధనం, బుద్ధి - వీటిలో మనిషి దేనిమీద ఆధారపడాలి ? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పు.' **భీష్ముడు ఇలా చెపుతున్నాడు. 'ప్రాణులు ప్రధానంగా ఆశ్రయింపదగినది బుద్ధియే. ఆ ప్రజ్ఞయే ఉత్తమలాభం, అదియే శ్రేయస్కరం, సజ్జనుల దృష్టిలో ప్రజ్ఞయే స్వర్గం.** ఐశ్వర్యం నశించినప్పుడు బలిచక్రవర్తి ప్రజ్ఞవలననే మరలా దానిని పొందగలిగాడు. ప్రహ్లాదుడు, నముచి, మంకి కూడా ప్రజ్ఞద్వారానే ప్రయోజన సిద్ధిని పొందారు. దానికన్న మిన్న అయినది

లేదు. యుధిష్ఠిరా ! ఈ విషయంలో కూడా ఇంద్రకాశ్యప సంవాద రూపమయిన పురాతనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. దానిని విను. ఒకానొక వైశ్యుడు ధనమదంతో వ్రతశీలుడు, తపస్వి, బుషికుమారుడు అయిన కాశ్యపుని రథం డీకొట్టి, పడగొట్టాడు. ఆ కాశ్యపుడు ఆర్తుడై పడి, కోపంతో ఆత్మహత్యకు సిద్ధపడి "నేను ప్రాణత్యాగం చేస్తున్నాను. దరిద్రుడు ఈ లోకంలో బ్రతకటం దండగ" అన్నాడు. ఆ విధంగా పలికి, ఆ కాశ్యపుడు మరణింపగోరి మాటా పలుకు లేకుండా నిలిచి, నిశ్చేతనుడై ధనాన్ని గురించియే ఆలోచిస్తున్నాడు. అప్పుడు ఇంద్రుడు నక్కరూపంలో వచ్చి ఇలా అన్నాడు. ప్రాణులన్నీ సర్వవిధాలా మనుష్య జన్మను కోరుతుంటాయి. మనుష్యులలో కూడా బ్రాహ్మణజన్మను అందరూ అభినందిస్తుంటారు. కాశ్యపా ! నీవు మనుష్యుడవూ, బ్రాహ్మణుడవు, పైగా శ్రోత్రియుడవు కూడా ! ఇటువంటి ఉత్తమస్థితిని పొంది కూడా ఏదో దోషాన్ని భావించి, చావును కోరుకొంటున్నావు. సాంసారికలాభాలన్నీ అభిమాన (అహంకార) భూయిష్ఠాలే అన్న శ్రుతివచనం సత్యం. నీరూపం నీవు ఆనందింపదగినది. కానీ లోభంతో దానిని తృణీకరిస్తున్నావు.

ఆహా ! చేతులుగలవారు ఎంత కృతార్థులు ? రెండు చేతులు కలవారిని చూసి, వారిలాగే నేనూ ఉండాలని ఎప్పుడూ కోరుకొంటుంటాను. నీకు ధనకాంక్ష ఉన్నట్లు నాకు చేతులుగలవారి నుండి చేతులు పొందాలని ఆకాంక్ష. చేతులుండటాన్ని మించిన లాభం మరేదీలేదు. బ్రాహ్మణా ! చేతులే లేకపోతే గ్రుచ్చుకొన్న ముల్లును తీయలేము. శరీరాన్ని కుట్టే పెద్ద చిన్న జంతువులను కూడా తోలుకొనలేము. కానీ దేవుడిచ్చిన రెండు చేతులు పదివ్రేళ్ళతోపాటు ఉన్నవారు శరీరాన్ని కుట్టే కీటకాలను తొలగించుకొనగలరు లేదా నశింపజేయగలరు. వాననుండి, మంచునుండి, ఎండనుండి చేతులు రక్షిస్తాయి. చేతులుంటే బట్టలు ధరించవచ్చు. హాయిగా అన్నం తినవచ్చు. పక్క సర్దుకోవచ్చు. ఏకాంతాన్ని అనుభవించవచ్చు. లోకంలో చేతులు గలవారు ఎడ్లబండి నెక్కి దానిని నడిపించవచ్చు. వాటిని అనుశాసించవచ్చు. వివిధోపాయాలతో జనులను లోబరచుకోవచ్చు. చేతులు లేనందువలన దీనతకు, దౌర్బల్యానికి లోనైన మూగజీవులు ఎన్నో బాధలు పడుతున్నాయి. ముని ! నీవు అదృష్టవంతుడవు. నీకా బాధలు లేవు. అదృష్టంకొద్దీ నీవు నక్కవు కావు, కీటకానివి కావు, ఎలుకవు కావు, పాముపుకావు, కప్పపుకావు, పాపిష్ఠజన్మగల మరే ప్రాణివీకావు. కాశ్యపా ! ఈ మాత్రం లాభంతో నయినా నీవు ఆనందించాలి. నీవు బ్రాహ్మణోత్తముడవు. ఇంతకన్న కావలసిన లాభమేముంది ? ఇదిగో, ఈ క్రిములు నన్ను తింటున్నాయి. వాటిని నెట్టివేయటానికి నాకు శక్తి లేదు. చేతులు లేని కారణంగా

నేను పడుతున్న అవస్థను చూడు. తగని పని అని భావించి నేను ఆత్మహత్యకు సిద్ధపడటం లేదు. 'ఇంతకన్న హీనజన్మను పొందవలసి వస్తుందేమో' అని భయం. నేనిప్పుడు నక్కగా పుట్టాను. ఇది పాపిష్ఠ జన్మ. దీనికన్న హీనజన్మలు ఎన్నో ఉన్నాయి. కొందరు జాతినిబట్టి సుఖంగా ఉంటారు. మరికొందరు చాలా దుఃఖపడుతుంటారు. ఎక్కడా, ఎవ్వరికీ కేవలం సుఖమే అన్న పరిస్థితిని చూడలేదు.

మనుష్యులు బలసంపన్నులై, ఆపై రాజ్యాధికారాన్ని కోరుకొంటారు. రాజులై దేవత్వాన్ని కోరుకొంటారు. దేవతలయిన తరువాత ఇంద్రపదవిని కూడా కోరుతుంటారు. నీవు సంపన్నుడవయినా రాజువు కాలేవు. దేవుడవు కాలేవు. ఒకవేళ దేవత్వాన్ని, ఇంద్రత్వాన్ని పొందినా కూడా అప్పుడూ తృప్తి పొందలేవు. **ప్రియమయిన దానిని పొందటంతో తృప్తి కలుగదు. ఆ తృష్ణ నీటితో ఉపశమించదు. సమిధలతో అగ్ని మండినట్టు అది మరల ప్రజ్వలిస్తుంది.** నీలో శోకమూ ఉన్నది, ఆనందమూ ఉన్నది. సుఖమూ ఉన్నది, దుఃఖమూ ఉన్నది. ఇక బాధపడవలసిన అవసర మేమున్నది ? అన్ని కోరికలకూ, కర్మలకూ బుద్ధి, ఇంద్రియాలు కారణం. పంజరంలో పక్షిని బంధించినట్లు బుద్ధిని, ఇంద్రియాలను ముడుచుకొంటే ఏ భయమూ లేదు. లేని రెండవతలను కానీ, మూడవ చేతిని కానీ ఎవ్వడూ ఖండించలేడు. ఇక దానిని గురించి భయమెందుకు ? రసజ్ఞత లేని వానికి ఏ కోరికా ఉండదు. స్పర్శవలన కానీ, దర్శనం వలన కానీ, వినికిడి వలన కానీ కోరిక కలుగుతుంది. నీ వెప్పుడూ మదిరను కానీ, పిచ్చుకల మాంసాన్ని కానీ తలచుకోవు. నీ వెప్పుడూ వాటిని ఆస్వాదించకపోవటమే కారణం. కానీ వాటికన్న గొప్పభక్ష్యం మరేదీ లేదు. అంతేకాదు ఎవరికయినా ప్రాణులలో తినదగినవి మరెన్నో ఉన్నాయి. కానీ వాటి నెప్పుడూ తిననందువలన తలచుకొనే ప్రసక్తియే లేదు. కాబట్టి తినకుండుట, తాకకుండుట, చూడకుండుట– అన్న ఈ నియమమే మనిషికి శ్రేయస్కరం. సందేహం లేదు. చేతులున్నవాడు బలవంతుడు, ధనవంతుడు కూడా. దీనిలో సంశయమే లేదు. మనుష్యులు మనుష్యుల చేతనే బానిసలు చేయబడుతున్నారు. **ఎందరో మనుష్యులు వధ, బంధనం మొదలయిన బాధలను అనుభవిస్తూనే ఉన్నారు. అయినా కూడా వారు ఆడుతూ, ఆనందిస్తూ, నవ్వుతూ జీవిస్తున్నారు.** ఎందరో బాహుబలసంపన్నులు, పండితులు, అభిమానవంతులు కూడా అసహ్యకరమై, దయనీయ మయిన వృత్తిని ఆశ్రయించి బ్రతుకుతున్నారు. అంతేకాదు. వారు మరేదయినా వృత్తిని స్వీకరించటానికి కూడా ఉత్సాహపడుతున్నారు. తమ కర్మ ననుసరించి ఉన్న విధినిబట్టియే భవిష్యత్తుకూడా ఏర్పడుతుంది. పుల్కసు డయినా చండాలు డయినా ఆత్మత్యాగానికి సిద్ధపడడు. తన

జాతిచేతనే సంతృప్తి పడతాడు. అది భగవంతుని మాయ. గమనించు.

కాశ్యపా ! కొందరు మనుష్యులు అవిటివారు. కొందరు పక్షవాతం గలవారు. కొందరూ ఎప్పుడూ రోగగ్రస్తులు. కానీ నీ పుట్టుక లోపరహితం. పరిపూర్ణ మానవ శరీరంతో నీవు లాభపడ్డావు. బ్రాహ్మణా ! నీ శరీరం భయరహితం. రోగరహితం. నీవు సర్వాంగ సంపూర్ణుడవు. లోకులెవ్వరూ నిన్ను నిందించలేరు. బ్రహ్మర్షీ ! నీ జాతిని అపహాస్యంచేసే వాస్తవమైన అపవాదమేదయినా నీ మీద ఆరోపించబడినా నీవు ప్రాణత్యాగం చేయదగదు. లేచి ధర్మపాలన కుపక్రమించు. బ్రహ్మస్వరూపా ! నా మాట విని, దానిపై శ్రద్ధ చూపితే నీవు వేదోక్తమైన ధర్మఫలాన్ని పొందుతావు. అప్రమత్తుడవై స్వాధ్యాయాన్నీ, అగ్ని సంస్కారాన్నీ నిర్వహించు. సత్యాన్నీ, దమాన్నీ, దానాన్నీ పాటించు. ఎవరితోనూ పోటీ పడవద్దు. స్వాధ్యాయసంపన్నులై యజనయాజనాలను పాటించేవారు బాధపడరు. అమంగళకరమయిన ఆలోచన చేయరు. అటువంటి వారు కావాలనుకొంటే యజ్ఞాదులలో విహరిస్తూ మహాసుఖాన్ని పొందగలరు. మంచి నక్షత్రంలో, మంచి తిథిలో, సుముహూర్తంలో జన్మించినవారు యాగాలు, దానాలు చేస్తూ ధర్మబద్ధంగా సంతానాన్ని పొందటానికి ప్రయత్నిస్తుంటారు. మరికొందరు రాక్షసనక్షత్రాలలో, చెడ్డతిథులలో, దుర్ముహూర్తాలలో జన్మించి, యాగసంతాన విహీనులై ఆసురయోనిని పొందుతారు. నేను పండితుడనై, హేతువాదినై, వేదనింద చేస్తూ, ప్రత్యక్షప్రమాణ మాధారంగా అనుమాన ప్రమాణాన్ని ఆశ్రయించే నిరర్థకమైన తర్కవిద్యయం దనురక్తుడనై ఉన్నాను. సభలలో యుక్తివాదంతో, హేతువాదంతో మాటాడేవాడిని. వేదవాక్య విచారణ చేస్తున్న బ్రాహ్మణుల దగ్గరకు పోయి, వారితో ఆక్రోశంతో వాదించే వాడిని. **అన్నింటినీ శంకిస్తూ నాస్తికుడనై, మూర్ఖుడనై, నన్ను నేను పండితునిగా భావించుకొంటూ ఉండేవాడిని. బ్రాహ్మణా ! దాని ఫలితమే ఈ వక్క జన్మ.** నక్కగా ఉన్న నేను మరల ఎప్పుడైనా, ఎన్ని వందలరోజుల కృషి తరువాత నయినా మానుషజన్మను పొందగలనో లేదో ? మనుష్యజన్మతో సంతోషిస్తూ, అప్రమత్తంగా యజ్ఞదాన తపస్సులయందు ఆసక్తి పాటిస్తూ తెలియ దగినదానిని తెలిసికొంటూ, విడువదగిన దానిని విడువగలనో లేదో !' ఆ మాట విని ఆ కాశ్యపుడు లేచి, నక్కతో ఇలా అన్నాడు. "ఆహా ! నీవు నేర్పరివి. బుద్ధిమంతుడవు. నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది." అలా అంటూ ఆ కాశ్యపుడు జ్ఞానచక్షువుతో చూశాడు. ఆ నక్కలో శచీపతి అయిన దేవేంద్రుని చూడగలిగాడు. అప్పుడు కాశ్యపుడు దేవేంద్రుని పూజించి, ఆయన అనుమతితో తన ఇంటికి మరలిపోయాడు.

181. శుభాశుభ కర్మఫలానుభవము.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'పితామహా ! దానాలు, యాగాలు, తపస్సు, గురుశుశ్రూషలు, చేస్తే ఫలిత మేదయినా ఉంటుందా ? నాకు చెప్పు.' భీష్ముడిలా అంటున్నాడు. 'దోషయుక్తమయిన బుద్ధికారణంగా మనస్సు పాపకర్మలతో చిక్కుకొంటుంది. ఈ రీతిగా మనిషి తన పనులద్వారానే పాపాన్ని చేసి, దుఃఖమయలోకాలలో పడతాడు. **పాపకర్మల నాచరించే దరిద్రులు దుర్భిక్షంకన్న దుర్భిక్షాన్ని, కష్టాలకన్న కష్టాలను, భయం కన్న భయాన్ని, పొందుతూ మృతులకన్న మృతుడు అవుతాడు. శ్రద్ధాళువులు, జితేంద్రియులు అయిన ధనికులు శుభకర్మల నాచరిస్తూ ఉత్సవాలకన్న ఉత్సవాన్ని, స్వర్గాన్ని మించిన స్వర్గాన్ని, సుఖాన్ని మించిన సుఖాన్ని పొందుతారు.** నాస్తికులు దేశబహిష్కృతులై చేతిసంకెలలతో సర్పచోరభయావహమై, ఏనుగులు ఉండే దుర్గమమయిన అరణ్యాలలో సంచరించవలసివస్తుంది. అంతకన్న శిక్ష ఏముంది ? దేవతాపూజ, అతిథిపూజలలో ఆసక్తిగలవారై, వదాన్యులై, సజ్జనుల నిష్టపడుతూ ఉన్నవారు తమ కుడిచేయివలె శుభకరమై, జితేంద్రియులు వెళ్లే మార్గాన్ని ఆశ్రయిస్తారు. **ధర్మదృష్టిలేనివారు సమాజంలో ధాన్యాలలో తాలు వంటివారు. పక్షులలో దోమలవంటివారు.** మనుష్యుడు ఎంత వేగంగా పరుగెత్తినా కర్మ అతనిని వెన్నంటియే ఉంటుంది. పడుకొంటే పడుకొంటుంది. నిలిస్తే దగ్గరగా నిలుస్తుంది. నడుస్తుంటే నడుస్తుంది. పనులు చేస్తుంటే పనిచేస్తుంది. నీడవలె అనుసరించియే ఉంటుంది. ఏ మనిషి పూర్వజన్మలలో ఏయే పనులు చేస్తాడో తాను చేసిన ఆయా పనుల ఫలితాన్ని తాను ఎప్పుడూ ఒంటరిగానే అనుభవిస్తాడు. తాము చేసిన కర్మల ఫలితం నిక్షేపం వంటిది. అదృష్టకర్మ ఫలంగా రక్షింపబడుతుంది. తగిన సమయంలో దానిని కాలం ప్రాణులవైపునకు లాగుకొనివస్తుంది.

పూలు తమ ఋతువు నతిక్రమించకుండా పూస్తున్నాయి. పండ్లు తమ ఋతువు నతిక్రమించకుండా ఫలిస్తున్నాయి. వీటికి ఎవ్వరి ప్రేరణా లేదు. పురాకృతకర్మకూడా అలాగే తగినవేళలో ఫలిస్తుంది. సమ్మానం కానీ అవమానం కానీ, లాభం కానీ నష్టం కానీ, వినాశం కానీ అభ్యుదయం కానీ మరల మరల కలుగు తుంటాయి. కర్మపరిసమాప్తిలో మరలి పోతుంటాయి. గత జన్మలోని శరీరంతో తాను చేసిన దుఃఖకర్మలు కానీ, సుఖకర్మలు కానీ గర్భంలో శయనించిన నాటి నుంచీ ఈ జన్మలో అనుభవానికి వస్తాయి. బాలుడుగా, యువకుడుగా, వృద్ధుడుగా తాను చేసిన శుభాశుభకర్మల ఫలితాన్ని ఈ జన్మలో ఆయా అవస్థలలోనే

పొందుతాడు. **వేలకొలదిగ ఆవులమధ్యలో ఉన్ననూ దూడ తల్లిని గుర్తించినట్లు పూర్వం చేసుకొన్న కర్మ కర్తను అనుసరించి వస్తుంది.*** ముందుగానే నీళ్ళలో నానబెట్టబడిన వస్త్రం ఉతకటంతో శుభ్రమయినట్లు, ఉపవాసపూర్వక తపస్సుల నాచరించినప్పుడు అనంతమయిన మహాసుఖం లభిస్తుంది. తపోవనంలో దీర్ఘకాలం తపస్సుచేస్తే, తపోధర్మం వలన పాపాలు తొలగిపోయి మనోరథాలు సిద్ధిస్తాయి. **ఆకాశంలో పక్షుల అడుగుజాడలు, నీటిలో చేపల అడుగు జాడలు కనిపించనట్లు జ్ఞానులగమనంలో అడుగుజాడలు కనిపించవు. ఇతరులను నిందించినా, ఇతరుల ధర్మాతిక్రమణను గూర్చి చర్చించినా ఏ ప్రయోజనమూ లేదు. తనకు అనురూపమై, హితకరమై, సున్నిత మయిన పనినే ఆచరించాలి.'**

182. భృగు భరద్వాజ సంవాదము - 1.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'పితామహా ! స్థావరజంగమాత్మక మయిన ఈ విశ్వం ఎక్కడనుండి పుట్టింది? ప్రలయవేళ ఎక్కడకు వెళ్తుంది? దానిని నాకు చెప్పు. సముద్రాలు, ఆకాశం, కొండలు, మేఘాలు, భూమి, అగ్ని, గాలి - వీటితో కూడిన ఈ లోకాన్ని నిర్మించినదెవరు ? ప్రాణిసృష్టి ఎలా జరిగింది ? వర్ణవిభాగం ఎలా జరిగింది ? ప్రాణుల శౌచాశౌచవ్యవస్థ ఎలా ఏర్పడింది ? ప్రాణులకు ధర్మాధర్మవిధానం ఎలా ఏర్పడింది ? ప్రాణులలో జీవుడు ఎలా ఉంటాడు ? మరణించిన వారు ఎక్కడకు వెళ్తారు ? ఈ లోకంనుండి ఆ లోకానికి ఎలా వెళతారు ? తమరు నాకు అంతా చెప్పాలి.' భీష్ముడిలా చెప్తున్నాడు. 'ఈ విషయంలో కూడా తనను ప్రశ్నించిన భరద్వాజునకు భృగుడు చెప్పిన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. కైలాసశిఖరంపై మహాతేజస్సుతో వెలుగుతూ కూర్చొని ఉన్న భృగుమహర్షిని చూసి, భరద్వాజు డిలా అడిగాడు. 'సముద్రాలు, ఆకాశం, కొండలు, మేఘాలు, భూమి, అగ్ని, గాలి - వీటితో కూడిన ఈ లోకాన్ని నిర్మించినదెవరు ? ప్రాణి సృష్టి ఎలా జరిగింది ? వర్ణవిభాగ మెలా జరిగింది ? ప్రాణుల శౌచాశౌచవ్యవస్థ ఎలా ఏర్పడింది ? ప్రాణులకు ధర్మాధర్మవిధానం ఎలా ఏర్పడింది ? ప్రాణులలో జీవుడు ఎలా ఉంటాడు ? మరణించినవారు ఎక్కడకు వెళ్తారు ? ఈ లోకాన్ని గురించి, పరలోకాన్ని గురించి నాకు పూర్తిగా చెప్పండి.' ఈ రీతిగా భరద్వాజుడు సంశయం వెలిబుచ్చాడు. అపుడు బ్రహ్మ సమానుడు, బ్రహ్మర్షి పూజనీయుడూ అయిన

---

* **యథా ధేనుసహస్రేషు వత్సో విందతి మాతరమ్ ।**
తథా పూర్వకృతం కర్మ కర్తారమనుగచ్ఛతి ॥ 16

భృగువు భరద్వాజునకు వివరంగా చెప్పాడు. భృగువు ఇలా అన్నాడు.

విశ్వమూర్తి, విశ్వాంతరాత్మ, సనాతనుడు, కూటస్థుడు, అక్షరుడు, అవ్యక్తుడు, నిర్లేపుడు, వ్యాపకుడు, ప్రభువు, ప్రకృతికి పరుడు, ఇంద్రియాతీతుడు అయిన నారాయణుడు సృష్టి చేయగోరి, తనలోని సహస్రాంశం నుండి పురుషుని పుట్టించాడు.

మహర్షులు ఆ పురుషుని మానసపురుషుడని అప్పటికే విని ఉన్నారు. అతడు ఆద్యంతరహితుడు, అభేద్యుడు, అజరామరుడు. అతనికే అవ్యక్తు డని ప్రసిద్ధి. అతడు శాశ్వతుడు, అక్షయుడు, అవ్యయుడు. అతని నుండియే ప్రాణులు ఉద్భవించి నశిస్తుంటాయి. ఆ అవ్యక్తదేవుడే ముందు మహత్తత్వాన్ని సృష్టించాడు. మహత్తత్వరూపుడయిన దేవుడు అహంకారాన్ని సృష్టించాడు. సర్వభూతధరుడై, అహంకార స్వరూపుడయిన ఆ ప్రభువు ఆకాశాన్ని సృష్టించాడు. దాని నుండి నీరు, నీటి నుండి నిప్పు, గాలి; నిప్పుగాలుల కలయిక ద్వారా భూమి ఏర్పడ్డాయి. ఆ పురుషుడు తేజోమయమయిన దివ్యపద్మాన్ని సృష్టించాడు. ఆ పద్మం నుండి వేదనిధి అయిన బ్రహ్మ జన్మించాడు. అహంకార పదంతో కూడా ఆ బ్రహ్మకు ప్రసిద్ధి. ఆయన సర్వభూతాత్మ. సర్వభూత సృష్టికర్త. మహతేజస్వి అయిన ఆ బ్రహ్మయే పంచభూతాలుగా ప్రకటమయ్యాడు. కొండలు ఆయన ఎముకలు. భూమి ఆయనకు మేదస్సు, మాంసం. సముద్రాలు ఆయననెత్తురు. ఆకాశం ఆయన ఉదరం. గాలి ఆయన నిశ్వాసం. అగ్ని ఆయన తేజస్సు. నదులు రక్తనాళాలు. అగ్నీ షోములుగా వ్యవహరింపబడే సూర్యచంద్రులు ఆయన కళ్ళు. ఆకాశోపరిభాగం ఆయనతల. నేల ఆయనకు పాదాలు. దిక్కులు భుజాలు. అచింత్యస్వరూపుడైన ఆ బ్రహ్మ సిద్ధపురుషులకు కూడా తెలియరానివాడు. సందేహం లేదు. పూజ్యుడయిన ఈ విష్ణువు అనంతనామంతో ప్రసిద్ధుడు సర్వప్రాణులయందు ఆత్మరూపంతో నున్నవాడు. ఆత్మశుద్ధిలేనివారు ఆయనను తెలియటం కష్టం. సర్వభూతోత్పత్తికై అహంకారాన్ని సృష్టించేది ఈ అనంతుడే. సృష్టి ఎవనినుండి జరుగుతున్నదని నీవడిగావు గదా ! అదంతా నీకు వివరించాను.'

భరద్వాజ డిలా అన్నాడు. 'ఆకాశం, దిక్కులు, భూమి, గాలి వీటి పరిమాణ మెంతెంత ? ఆ వాస్తవాన్ని తెలిపి నా సందేహాన్ని తొలగించు.' భృగు విలా అన్నాడు. 'సిద్ధదైవత సేవితమయిన ఈ ఆకాశం అనంతం. వివిధలోకాలకు ఆశ్రయమైన ఈ ఆకాశం రమణీయం. దీని అంతాన్ని తెలియలేము. పైకి పయనించినా, క్రిందకు ప్రయాణించినా సూర్యచంద్రులు కనిపించనిచోట సూర్యాగ్ని సమాన తేజస్సుగల దేవతలు స్వయంప్రకాశులై ఉంటారు. మానవా ! విస్తృత తేజస్సుగల ఆ నక్షత్రరూప దేవతలు కూడా ఆకాశపు

అంతాన్ని చూడలేరు. అది అంతగా దుర్గమం, అనంతం కూడా. ఈ నామాట గ్రహించు. ఎక్కడో పైన స్వయంప్రకాశులై వెలుగుతున్న దేవతలలో అప్రమేయమయిన ఈ ఆకాశం నిండి ఉన్నది. భూమికి చివర సముద్రాలు, సముద్రాల చివర చీకటి, చీకటి కావల జలం, జలానికావల అగ్ని అని అంటుంటారు. రసాతలం చివర నీరు. నీటి చివర ఆదిశేషుడు. ఆయన కావల మరల ఆకాశం. ఆకాశానికావల మరల జలం. ఈ రీతిగా భగవంతుడు, ఆకాశం, అగ్ని, గాలి, నీరు- వీటి ప్రమాణాన్ని తెలిసికోవటం దేవతలకు కూడా కష్టం. అగ్ని, వాయువు, జలం, భూమి - వీటి రంగులు ఆకాశం నుండియే సంక్రమిస్తాయి. తత్త్వజ్ఞానం లేనివారికి అవి ఆకాశంకన్న వేరుగా కనిపిస్తాయి. మహర్షులు వివిధ శాస్త్రాలలో ముల్లోకాలు, సముద్రం- వీటి ప్రమాణాన్ని ఏదో రకంగా నిర్ణయించి చెప్పారు. కానీ అదృశ్యుడై, ఇంద్రియాతీతుడై ఉన్న పరమాత్మ యొక్క పరిమాణాన్ని ఎవడు చెప్పగలడు ? సిద్ధులు, దేవతలు- వీరి జ్ఞానం కూడా పరిమితమైనది. కాబట్టి మానసదేవుడు తన పేరుకు తగ్గట్టుగానే అనంతుడు. ప్రసిద్ధమయిన ఆ అనంతనామం తన గుణాన్ని బట్టి కలిగినదే. పరమాత్ముని ఆ దివ్యరూపం తగ్గుతుంటుంది, మరల పెరుగుతుంటుంది. అటువంటివాడే మరొకడుంటే ఆయనను గురించి తెలిసికొనవచ్చు. కానీ అటువంటి వాడు మరొక డేడి ? ఆ పై పద్మం నుండి సర్వజ్ఞుడు, మూర్తిమంతుడు, ప్రభావశాలి, ఉత్తముడు, ధర్మమయుడు, ప్రజాపతి, ప్రథముడు అయిన బ్రహ్మ ఉద్భవించాడు.'

భరద్వాజ డిలా అన్నాడు. 'పద్మం నుండి బ్రహ్మ జన్మించితే పద్మమే ముందు పుట్టినట్టు కదా ! కానీ బ్రహ్మను ప్రథముడని తమ రన్నారు. నాకు సందేహంగా ఉన్నది.' భృగుడిలా అన్నాడు. 'మానసదేవుడే బ్రహ్మత్వాన్ని పొందాడు. ఆయన కాసనాన్ని కల్పించేందుకు పృథివి పద్మమయినది. గగనతలంలో మహోన్నతమయిన మేరువు ఆ పద్మానికి కర్ణిక. దాని మధ్యనుండి జగత్ప్రభువు లోకాలను సృష్టిస్తాడు.'

183. భృగు భరద్వాజ సంవాదము - 2.

భరద్వాజ డిలా అన్నాడు. 'బ్రాహ్మణోత్తమా ! మేరు పర్వతమధ్యంలో ఉన్న ప్రభువు బ్రహ్మ వివిధమైన ప్రజాసృష్టిని ఎలా చేస్తాడో నాకు చెప్పు.' భృగు విలా అన్నాడు. 'మానసభవుడయిన బ్రహ్మ మనస్సంకల్పంతోనే నానావిధమయిన ప్రజాసృష్టి చేశాడు. భూత సంరక్షణకై ముందుగా జలాన్ని సృష్టించాడు. సర్వప్రాణులకును జలమే ప్రాణం. జలంతోనే ప్రజావృద్ధి జరుగుతుంది. నీరు లేకపోతే ప్రాణులు నశిస్తాయి. జలమే జగత్తుమొత్తం వ్యాపించి ఉంటుంది. పృథివి, పర్వతాలు, మేఘాలు, ఇతరప్రాణులు అన్నీ జలమయమైనవే.

నీరే వాటిని స్థిరంగా నిలుపుతుంది.' భరద్వాజు డిలా అన్నాడు. 'నీరు ఎలా ఉద్భవించింది ? అగ్ని, గాలి ఎలా పుట్టాయి. పృధివి ఎలా సృష్టింపబడింది ? ఈ విషయంలో నాకు పెద్ద సందేహ మున్నది.' భృగుడిలా చెప్పాడు. 'బ్రాహ్మణా ! గతంలో బ్రహ్మకల్పం జరుగుతున్నపుడు బ్రహ్మర్షుల సమావేశం జరిగింది. ఆ మహాత్ముల సభలో లోకసృష్టిని గూర్చిన సందేహ మేర్పడింది. ఆ బ్రాహ్మణులు ఆహారాన్ని విడిచి, గాలినే త్రాగుతూ వంద దివ్య సంవత్సరాలు ధ్యానాన్ని ఆశ్రయించి, మౌనాన్ని స్వీకరించి నిశ్చలంగా నిలిచారు.

ఆ ధ్యానావస్థలో వారందరికీ బ్రహ్మమయమైన వాక్కు వినిపించింది. ఆకాశం నుండి దివ్యవాణి అక్కడ ఇలా ప్రకట మయింది. ఒకప్పుడు అనంత మయిన ఈ ఆకాశం కొండవలె నిశ్చలంగా ఉండేది. చంద్రుడు, సూర్యుడు, గాలి ఎవ్వరికీ కనిపించేవి కావు. ఆకాశం నిద్రిస్తున్నట్లు అనిపించేది. ఆకాశం నుండి నీరు పుట్టింది. అంధకారంలో మరో అంధకారంలా అది ఉండేది. ఆ సలిలప్రవాహం నుండి గాలి ఎగిసింది. రంధ్రంలేని కుండ నిశ్శబ్దంగా ఉన్నట్లుంటుంది. దానికి రంధ్రం చేసి నీటిని నింపుతుంటే గాలి ఆ కుండలో ధ్వనిని కల్పిస్తుంది. అదే విధంగా ఆకాశమంతా నిరంతరంగా నీటితో నిండిపోతుంది. అప్పుడు ఆ అర్ణవతలాన్ని బ్రద్దలు చేసి, మహాఘోషతో గాలి ఎగిసింది. ఈ రీతిగా అర్ణవజలోత్పీడనంనుండి పుట్టిన గాలి అంతటా తిరుగసాగింది. ఆ ఆకాశంలో ఎక్కడా కూడా శాంతంగా నిలువలేకపోయింది. జల వాయువుల మధ్య జరిగిన ఆ సంఘర్షణలో తేజోమయుడు, మహాబలుడు అయిన అగ్ని ఊర్ధ్వజ్వాలలతో పుట్టాడు. ఆకాశంలోని చీకటిని నశింపజేశాడు. అగ్ని గాలితో కలిసి నీటిని ఆకాశంమీదకు లాగాడు. ఆ నీరు అగ్నివాయువులతో కలిసి ఘనీభవించింది. ఆ నీటిచెమ్మ కూడా ఆకాశంలో పడి, ఘనీభవించి భూమిగా పరిణమించింది. రసాలకూ, సర్వగంధాలకూ, స్నేహాలకూ, ప్రాణులకూ భూమి కారణమైంది. ఆ భూమినుండియే సమస్తం ఉద్భవిస్తుంది.

184. భృగు భరద్వాజ సంవాదము - 3.

భరద్వాజు డిలా అడిగాడు. 'బ్రహ్మ మొదట సృష్టించిన ఈ అయిదు ధాతువులకే మహాభూతా లని వ్యవహారం. ఈ లోకాలన్నీ వీటిచే ఆవరింపబడి ఉంటాయి. మహామతి అయిన బ్రహ్మ వేల కొలదిగ భూతాలను సృష్టించాడు గదా ! ఈ అయిదింటినే భూతాలు అని వ్యవహరించట మెలా కుదురుతుంది ?' భృగువు ఇలా చెప్పాడు. 'హద్దులేని ఈ అయిదు భూతాలకే మహాశబ్ద వ్యవహారం. వాటి నుండి ప్రాణుల ఉత్పత్తి జరుగుతుంది. కాబట్టి వాటినే **మహాభూతాలని** వ్యవహరించటం తగినదే. ప్రాణుల శరీరం పాంచభౌతికం.

వాటి చేష్ట వాయుభాగం. వాటిలోని తొర్ర ఆకాశభాగం. వేడి అగ్నిభాగం. ద్రవపదార్థం జలభాగం. అస్థిమాంసాదులు పృథివీభాగం. ఈ రీతిగా స్థావర జంగమాత్మకమైన జగత్తు పంచ మహాభూతాలతో కూడినదే. చెవి, ముక్కు, నాలుక, చర్మం, నయనం- వీటికి ఇంద్రియాలని పేరు.' భరద్వాజుడు ఇలా అన్నాడు. 'స్థావర జంగమాలన్నీ పాంచభౌతికాలు అంటున్నావు. కానీ స్థావరాల శరీరంలో పంచధాతువులు కనిపించటం లేదు గదా ! వృక్షాల శరీరంలో వేడి లేదు. వాటికి చేష్టలు లేవు. అవి వాస్తవంగా ఘనాలు. వాటి శరీరంలో పంచధాతువులు లేవు గదా ! చెట్లు వినలేవు. చూడలేవు. గంధరసాలను గ్రహించలేవు. వాటికి స్పర్శలేదు. అవి పాంచభౌతికాలు ఎలా అవుతాయి ? వాటిలో ద్రవత్వం లేదు. అగ్నితత్వం లేదు. భూమి వాయువుల అంశలు కూడా లేవు. అప్రమేయమయిన ఆకాశం కూడా లేదు. కాబట్టి వృక్షాలు పాంచభౌతికాలు ఎలా అవుతాయి ?

భృగువిలా చెప్పాడు. 'వృక్షాలు ఘనాలుగా కనిపిస్తున్నా వాటిలో కూడా ఆకాశ మున్నది. అనుమానం లేదు. పుష్పఫలాలు వాటిలో ఎప్పుడూ ఉత్పన్న మవుతుంటాయి. చెట్లలో అగ్ని ఉన్నది. దానివల్లనే ఆకు, బెరడు, పండు, పువ్వు వాడుతుంటాయి. వాడటమే కాదు వాడి రాలిపోతుంటాయి. కాబట్టి వాటికి స్పర్శ కూడా ఉన్నట్లే. గాలి, నిప్పు, పిడుగుల చప్పుళ్ళ వలన పండ్లు, పూలు రాలిపడుతుంటాయి. శబ్దం చెవిద్వారానే గ్రహింపబడుతుంది. కాబట్టి చెట్లుకూడా వింటున్నట్లే. తీవె చెట్టును పెనవేసుకొంటుంది. అన్ని దిక్కులకూ ప్రాకుతుంది. చూడలేని వారికి దారి ఉండదు గదా ! కాబట్టి చెట్లు చూడగలిగినట్లే. **మంచి చెడువాసనల చేత, వివిధ ధూపాల చేత చెట్లు రోగాలనుండి బయటపడి పుష్పిస్తాయి. కాబట్టి చెట్లు వాసనలను గ్రహించగలిగినట్లే. చెట్లు వేళ్ళతో నీటిని త్రాగుతాయి. వేళ్ళకు తెగుళ్ళు వస్తాయి. వచ్చిన తెగుళ్ళకు చికిత్సలు కూడా ఉన్నాయి. కాబట్టి చెట్లలో రస మున్నట్లే.** మనుజులు తామరతూటిని నోటపెట్టుకొని నీటినిపైకి పీల్చినట్లు చెట్లు కూడా గాలి సహకారంతో వేళ్ళతో నీటిని పైకి పీల్చుకొంటాయి. **చెట్లకు సుఖదుఃఖా లుంటాయి. నరికినా మరలా చిగురిస్తాయి. కాబట్టి చెట్లకు కూడా ప్రాణముంది. అవి అచేతనాలు కావు.** చెట్లు వేళ్ళనుండి పీల్చుకొన్న నీటిని చెట్టులోనున్న నిప్పు, గాలి పరిపక్వం చేస్తాయి. ఆహార పరిపాకం వలన చెట్లలో స్నిగ్ధత, వృద్ధి కలుగుతాయి. జంగమ ప్రాణు లన్నింటి శరీరాలు పాంచభౌతికాలే. అయితే పంచభూతాలు అక్కడ స్వరూప భేదంతో కనిపిస్తాయి. వాటన్నింటి సహకారంతో శరీరం కదులుతుంది.

శరీరానికి సంబంధించిన చర్మం, మాంసం, ఎముకలు, మజ్జ, స్నాయువు -

ఈ అయిదు వస్తువుల సముదాయం పృథివీ మయం. తేజస్సు, క్రోధం, నేత్రం, వేడి, జఠరాగ్ని - ఈ అయిదూ ప్రాణుల శరీరంలో అగ్ని సంబంధమైనవి. చెవి, ముక్కు, ముఖం, హృదయం, ఉదరం - శరీరంలోని ఈ అయిదు ఆకాశంవలన ఏర్పడిన ధాతువులు. శ్లేష్మం, పిత్తం, స్వేదం, వస, నెత్తురు - ప్రాణులలోని ఈ అయిదు జలసంబంధమైనవి. ప్రాణి ప్రాణంవలన కదులుతుంది. వ్యానం వలన ఉద్యమిస్తుంది. అపానం వలన క్రిందకు పయనిస్తుంది. సమానం హృదయంలో ఉంటుంది. ఉదానంవలన శ్వసిస్తుంది. స్థాన భేదం వలన శబ్దాలను పలుకుతుంది. ఈ అయిదు వాయువులు ప్రాణుల శరీరాలను ప్రవర్తింపజేస్తాయి. ప్రాణి ముక్కుద్వారా వాసనలను గ్రహిస్తుంది. నాలుక ద్వారా రుచిని, తేజోమయనేత్రం ద్వారా రూపాన్ని, చర్మం ద్వారా స్పర్శను గ్రహిస్తుంది. గంధం, స్పర్శ, రసం, రూపం, శబ్దం - ఇవన్నీ గుణాలు. వీటిలో గంధానికి సంబంధించిన గుణాలను విస్తారంగా చెపుతాను, విను. పార్థివ గంధం తొమ్మిదిరకాలుగా ఉంటుంది. ఇష్టం, అనిష్టం, మధురం, కటువు, నిర్హారి (దూరంనుండీ వచ్చేది), సంహతం, స్నిగ్ధం, రూక్షం, విశదం - ఇవి ఆ రకాలు. కళ్ళతో రూపాన్ని చూస్తాడు. చర్మంతో స్పర్శను అనుభవిస్తాడు. శబ్దం, స్పర్శ, రూపం, రసం - ఇవన్నీ గుణాలు. ఇప్పుడు రసజ్ఞానాన్ని వివరింపబోతున్నాను, విను. విశాల హృదయు లయిన మహర్షులు రసాన్ని అనేక విధాలుగా వివరించారు. మధురం, లవణం, తిక్తం, కషాయం, ఆమ్లం, కటువు - రసాలు. ఆరు రకాలుగా ఉన్న ఈ రసం జలమయం. శబ్ద, స్పర్శ, రూపాలు జ్యోతి (అగ్ని) గుణాలు. జ్యోతిర్మయమైన నేత్రం రూపాన్ని గ్రహిస్తుంది. రూపం బహువిధాలుగా ఉంటుంది. హ్రస్వం, దీర్ఘం, స్థూలం, చతురస్రం, వృత్తం, శుక్లం, కృష్ణం, ఎరుపు, పసుపు, నీలారుణం, కఠినం, నునుపు, అల్పం, పిచ్చిలం (జారుడుతనం), మృదువు, దారుణం - ఈ పదహారు రూప భేదాలు.

వాయువుకు రెండు గుణా లున్నాయి. అవి శబ్దస్పర్శలు. వాయువు ప్రధానగుణం స్పర్శ. స్పర్శ అనేక విధాలుగా ఉంటుంది. వాయుసంబంధమయిన గుణం స్పర్శ. అది పండ్రెండు విధాలు. అవి - ఉష్ణం, శీతం, సుఖం, దుఃఖం, స్నిగ్ధం, విశదం, ఖరం, మృదువు, రూక్షం, లఘువు, గురువు. ఆకాశ సంబధమయిన గుణం శబ్దం. దాని భేదాలను వివరంగా చెపుతాను. అది ఏడు రకాలు. షడ్జం, ఋషభం, గాంధారం, మధ్యమం, ధైవతం, పంచమం, నిషాది - ఇవి శబ్దభేదాలు. శబ్దం సర్వవ్యాపకం. అయినా నగారా వగైరాలలో విశేషంగా వినిపిస్తుంది. మృదంగ, భేరీ, శంఖధ్వని, మేఘ గర్జన, రథఘోష ప్రాణులలో కానీ, అప్రాణులలో కానీ వినిపించే మరేధ్వని అయినా ఈ

ఏడింటిలోనే చేరుతాయి. ఈ రీతిగా ఆకాశం నుండి పుట్టిన శబ్దం చాలారకాలుగా వాయుగుణాలతో కలిసియే ఉంటుందని అంటారు. వాయుసంబద్ధగుణం వ్యతిరేకత లేకుండా శబ్దంతో కలిసి ఉన్నప్పుడే శబ్దాన్ని విని, గ్రహిస్తారు. కాని ఆ గుణం విషయ స్థితిలో ఉంటే శబ్దగ్రహణం కుదరదు. శబ్దాదులకు ఉత్పాదకాలైన ఇంద్రియాలు పంచభూతాల ద్వారానే వర్ధిల్లుతాయి. జలం, అగ్ని, వాయువు - ఈ మూడు ప్రాణుల శరీరాలలో నిత్యమూ మేల్కొని ఉంటాయి. శరీరానికి ఇవే మూలం. ఇవి ప్రాణాలలో వ్యాపించి ఉంటాయి.

185. శరీరములో అగ్నివాయువుల స్థితి.

భరద్వాజుడిలా అడిగాడు. 'ప్రభూ ! శరీరంలోని అగ్ని పార్థివశరీరాన్ని ఎలా ఆశ్రయించి ఉంటుంది ? వాయువు పార్థివధాతువు నాశ్రయించి శరీరాన్ని ఎలా నడుపుతుంది ?' భృగు విలా అన్నాడు. 'బ్రహ్మస్వరూపా ! అనఘా ! నేను నీకు వాయుగతిని గురించి చెపుతున్నాను. బలిష్ఠమయిన వాయువు ప్రాణుల శరీరాలను ప్రవర్తింపజేసే విధానాన్ని చెపుతాను. ఆత్మ కపాలస్థానంలో నిలిచి శరీరాన్ని రక్షిస్తుంది. ప్రాణం కపాలంలోనూ, అగ్నిలోనూ నిలిచి శరీరాన్ని ప్రవర్తింపజేస్తుంది. ప్రాణంతో కూడిఉన్న ఆత్మయే జీవుడు. సర్వభూతాత్మ స్వరూపుడైన సనాతనపురుషు డతడే. అతడే మనస్సు, బుద్ధి, అహంకారం, పంచభూతాలు, ఇంద్రియ విషయాలుగా ఉంటాడు. ఈ రీతిగా ఆ జీవుడు శరీరంలోని సమస్త భాగాలలో ప్రాణంచేత ప్రవర్తింపజేయబడతాడు. ఆ పై సమాన వాయురూపంగా మారిన ప్రాణం తన తన గమనాన్ని ఆశ్రయించి, శరీరాన్ని నడుపుతుంది. అపానవాయువు జరరాగ్నిని, మూత్రాశయాన్ని, మలాశయాన్ని ఆశ్రయించి, మలమూత్రాలను విస్తరింపజేస్తూ పైనుండి క్రిందకు ప్రసరిస్తుంది. ప్రయత్నంలో, పనిలో, బలంలో ప్రవర్తించే ఒకే వాయువును ఆధ్యాత్మికతత్త్వవేత్తలు ఉదానమని వ్యవహరిస్తారు. మనుష్యుల శరీరమంతా, విశేషించి సంధిస్థానాల్లో ఉన్న వాయువును వ్యానమంటారు. శరీర ధాతువులలో వ్యాపించియున్న అగ్నిని సమానవాయువు కదుపుతుంది. అది శరీరంలోని రసాలను, ధాతువులను (ఇంద్రియాలను), దోషాలను ప్రవర్తింపజేస్తూ ఉంటుంది. ప్రాణాపానాల మధ్యలో (నాభిప్రదేశంలో) ఆ రెండింటిని ఆశ్రయించి ఉన్న జరరాగ్ని ఆహారాన్ని జీర్ణింపజేస్తుంది. ముఖంతో ప్రారంభించి గుదం వరకు ప్రాణప్రసార రూపమయిన ఒక ప్రవాహ ముంటుంది. దాని నుండియే సమస్త ప్రాణులలోనూ మిగిలిన ప్రాణగమన మార్గాలు (నాడులు) ఏర్పడతాయి. ఆ నాడులద్వారా సర్వావయవాలలోనూ ప్రాణం ప్రసరిస్తుంది. జరరాగ్నితో

సంబంధ మేర్పడుతుంది. శరీరంలోని ఉష్ణత జఠరాగ్నికి సంబంధించినదే. ఆ అగ్నియే ఆహారాన్ని జీర్ణం చేస్తుంది. అగ్నిని వేగంగా ప్రసరింపజేసే వాయువు గుదం దగ్గర ఆపబడుతుంది. అది మరల వెనుదిరిగి, పైకి ప్రసరిస్తూ అగ్నిని కూడా పైకి లేపుతుంది. నాభికి క్రింద జీర్ణమయిన ఆహారానికి స్థాన ముంటుంది. నాభికి పైన జీర్ణంకాని ఆహారానికి స్థానముంటుంది. నాభిమధ్యలో శరీరంలోని సర్వప్రాణాలు నిలిచి ఉంటాయి. ప్రాణాలు హృదయం నుండి అన్ని దిక్కులకూ, క్రిందకూ, పైకి కూడా ప్రయాణం చేస్తాయి. దశవిధ ప్రాణాల ప్రేరణ వలన కదులుతున్న నాడులు అన్నరస వాహికలుగా ఉంటాయి. ముఖం నుండి గుదం వరకు సాగుతున్న ఈ మహాస్రోతస్సే యోగమార్గం. యోగులు దాని ద్వారానే పరమ పదాన్ని పొందుతారు. వారు క్లేశాలను జయించి, ధీరులై, సర్వసమానులై సుషుమ్నానాడి ద్వారా మస్తకాన్ని చేరి అక్కడే స్థిరపడతారు. ఈ రీతిగా ప్రాణులకు ప్రాణాపానాది సర్వవాయువులలో ప్రతిష్ఠింపబడిన జఠరాగ్ని శరీరంలో నిలిచి అగ్ని కుండంలోని అగ్నివలె నిత్యమూ ప్రజ్వరిల్లుతుంది.'

186. జీవస్వరూపాక్షేపము.

భరద్వాజుడిలా అడిగాడు. 'వాయువే ప్రాణులను జీవింపజేస్తుంటే, వాయువే శరీరాన్ని ప్రవర్తింపజేస్తుంటే, వాయువే శ్వాసిస్తుంటే, వాయువే మాటాడుతుంటే ఇక శరీరంలో జీవు డెందుకు ? శరీరంలోని వేడి అగ్నిసంబంధమైనదై, అగ్నియే ఆహారాన్ని పచనం చేసి జీర్ణం చేస్తుంటే ఇక శరీరంలో జీవు డెందుకు? ఏ ప్రాణి అయినా మరణించినప్పుడు జీవుడు కనిపించడు? ప్రాణవాయువే శరీరాన్ని వీడిపోతుంది. శరీరంలోని వేడి నశిస్తుంది. జీవుడు వాయుమయు డయితే, వాయువుతోనే జీవుడు కలసి ఉంటే వాయుమండలంవలె జీవుడు కూడా కనిపించాలిగదా ! మరణకాలంలో వాయువుతో పాటు వెళ్తూ కనిపించాలి గదా ! జీవునకు వాయువుతో సంశ్లేషముంటే, వాయువుతోపాటే అది నశించేటట్లయితే జలపాత్రలో ఒక రాయినుంచి సముద్రంలోవేస్తే అది మునిగిపోయినట్లే వాయువుతో పాటే జీవుడూ నశించినట్లే భావించాలి. కానీ రాయికన్న భిన్నంగా జలపాత్ర ఉన్నట్లు వాయువు కన్న భిన్నంగా జీవు డుండాలి కదా ! బావిలో నీళ్ళుపోసినా, మంటలో దీపాన్ని విసిరినా అవి వెంటనే వాటిలో కలిసి తమ అస్తిత్వాన్ని కోల్పోతాయి. అట్లే జీవుడు కూడా పాంచభౌతిక శరీరం నశించినప్పుడు అస్తిత్వాన్ని కోల్పోవాలి. అలా అంగీకరిస్తే శరీరంలో జీవుని ఉనికి ఎక్కడ ? పంచభూతాలలో ఒకటి నశిస్తే మిగిలినవన్నీ నిస్సందేహంగా నశిస్తాయి కదా ! నీరు త్రాగటం మానితే శరీరంలోని జలాంశం నశిస్తుంది. శ్వాసను

ఆపితే వాయువు నశిస్తుంది. ఉదర కోశాన్ని బ్రద్దలు చేస్తే ఆకాశం నశిస్తుంది. భోజనాన్ని మానితే అగ్ని నశిస్తుంది. వ్యాధులు, వ్రణాలు, ఇతర బాధలవలన పృథివీతత్త్వం నశిస్తుంది. ఈ అయిదింటిలో ఏ ఒక్కటి హాని పొందినా ఈ పాంచ భౌతికశరీరం పంచత్వాన్ని పొందుతుంది. శరీరం పంచత్వాన్ని పొందినపుడు జీవుడు దేని వెంటపడతాడు ? ఏ అనుభవాన్ని పొందుతాడు ? వింటాడా ? పలుకుతాడా ? ఈ గోవు పరలోకంలో నన్ను తరింపజేస్తుందని గోదానం చేసి, జీవి మరణిస్తే ఆ గోవు ఎవరిని తరింపజేస్తుంది ? గోవు, గోవును స్వీకరించినవాడు, గోవును దానం చేసిన వాడు అందరూ సమానంగా ఇక్కడే మరణిస్తున్నారు గదా ! ఇక పరలోకంలో వారికి కలయిక ఎలా జరుగుతుంది? మరణించిన వాని శరీరాన్ని పక్షులు తినివేస్తాయి. లేదా గిరిశిఖరం నుండి పడితే అది ముక్కలయిపోతుంది. లేదా అగ్నిలో బూడిదయిపోతుంది. మరలా అవి ఎలా బ్రతుకుతాయి ? చెట్టును మొదలంటా నరికివేస్తే మరలా చిగురించదు. దాని గింజలు మాత్రమే మొలుస్తాయి. అదే రీతిగా మరణించిన వాడు మరల ఎక్కడనుండి వస్తాడు ? తొలుత బీజం మాత్రమే సృష్టించబడింది. దానివలన ఈ ప్రపంచం క్రమంగా సాగుతోంది. చనిపోయినవారు ఇక లేనట్లే. బీజం నుండి మరల బీజం జనిస్తుంది.'

187. జీవస్వరూపనిరూపణము.

భృగు విలా అన్నాడు. 'జీవుడు కాని, జీవుడు చేసిన దానకర్మలు కానీ నశింపవు. జీవుడు మరొకశరీరంలో ప్రవేశిస్తాడు. శరీరం మాత్రమే శిధిల మవుతుంది. శరీరాన్ని ఆశ్రయించిఉన్న జీవుడు శరీరం నశించినా నశించడు. సమిధలను ఆశ్రయించిన అగ్ని అవి తగులబడిన తరువాత కూడా కనిపిస్తున్నట్లు జీవుడు కూడా ప్రత్యక్షంగానే ఉంటాడు.' భరద్వాజు డిలా అడిగాడు. 'అగ్నికివలె జీవునకు కూడా నాశం లేదంటున్నావు. ఇంధనం పూర్తిగా తగులబడిన తర్వాత అగ్ని ఉండదు కదా ! ఇంధనం లేని అగ్ని శాంతించి, నశిస్తుందనే నేను భావిస్తున్నాను. గతి కానీ, ప్రమాణం కానీ, స్థితి కాని లేని పదార్థం నశించిపోయినట్లే గదా ! జీవుని స్థితి కూడా అదే.' భృగు డిలా అన్నాడు. 'సమిధలు తగులబడిన తర్వాత అగ్నిలేనట్లు అనిపించవచ్చు. కానీ అది ఆకాశాన్ని ఆశ్రయించి, అవ్యక్తంగా ఉంటుంది. ఏ ఆశ్రయమూ లేకుండా అగ్నిని నిలవరించటం చాలా కష్టం. అదే విధంగా శరీరాన్ని విడిచిన తర్వాత జీవుడు ఆకాశంవలె నిలుస్తాడు. అయితే బాగా సూక్ష్మంగా ఉన్నందువల్ల అగ్నివలె కనిపించడు. కానీ నిస్సందేహంగా ఉంటాడు. అగ్ని ప్రాణాలను ధరిస్తుంది. జీవుడు అగ్నివంటివాడు. శరీరంలో వాయువు అగ్నిని ధరించి

ఉంటుంది. శ్వాసను నిరోధించినపుడు అగ్ని కూడా నశిస్తుంది. శరీరంలోని అగ్ని నశించినపుడు దేహం అచేతనమై నేలబడి పృథివీత్వాన్ని పొందుతుంది. శరీరానికి పృథివియే ఆధారం గదా ! స్థావర జంగమాత్మకా లయిన సర్వజీవుల ప్రాణవాయువు ఆకాశంలో కలిసిపోతుంది. అగ్ని దానిని అనుసరిస్తుంది. అగ్ని, వాయు, ఆకాశాలు ఒక్కటవుతాయి. జలం, పృథ్వి భూమిపై నిలిచిపోతాయి. ఆకాశ మున్నచోట గాలి, గాలి ఉన్నచోట అగ్ని ఉంటాయి. అవి అమూర్త పదార్థాలు. కానీ ప్రాణుల శరీరంలో ఉన్నపుడు అవి మూర్తిమంతాలుగా భావింపబడతాయి.'

భరద్వాజు డిలా అడిగాడు. 'ప్రాణుల శరీరాలలో అగ్ని, మారుత, భూమి, ఆకాశ, జలతత్వాలే ఉన్నట్లయితే ఇక జీవునకు లక్షణ మేమిటి ? ఇది నాకు వివరంగా చెప్పు. ప్రాణుల శరీరం పాంచభౌతికం. ఇది అయిదు విషయాలపై ఆసక్తిగలది. అయిదు జ్ఞానేంద్రియాలకూ, చిత్తానికీ నిలయమిది. దీనిలోనున్న జీవుని స్వరూప మెటువంటిది ? తెలిసికొనగోరుతున్నాను. రక్తమాంసాల సంఘాతమూ, క్రొవ్వు, నాడులూ, ఎముకలు-వీటితో ఏర్పడిన ఈ శరీరం శిథిలమైనపుడు దానిలో జీవుడు కనిపించడు. పాంచభౌతిక మయిన ఈ శరీరంలో జీవుడు ఉండడని భావిస్తే ఈ శరీరానికి కలుగుతున్న శారీరక మానసిక బాధలను అనుభవిస్తున్న దెవరు ? మహర్షీ ! ఎవరయినా చెప్పిన మాటలను జీవుడు చెవులతో వింటున్నాడు. అయితే మనస్సు కలతచెంది ఉన్నప్పుడు విని కూడా ఆలకించడు. కాబట్టి మనస్సుకన్న భిన్నంగా మరొక జీవుని ఉనికి నిరర్థకం. మనోనేత్రాల సంయోగ మున్నపుడే చూడదగిన పదార్థాల నన్నింటినీ చూడటం జరుగుతుంది. మనస్సు వ్యాకుల మయితే కన్ను చూసినా కూడా రూపాన్ని గ్రహించదు. నిద్రిస్తున్న మనుష్యుడు చూడలేడు. వాసనల చూడ లేడు. వినలేడు. మాటాడలేడు. స్పర్శను గానీ, రుచిని గానీ తెలియలేడు. కాబట్టి శరీరంలో ఆనందించేవా డెవడు ? వ్యాపించే వాడెవడు ? శోకోద్వేగాలను అనుభవిస్తున్న దెవడు ? ఇచ్ఛా, ధ్యాన, ద్వేషాలను ప్రకటిస్తున్న దెవడు ? మాటాడుతున్న దెవడు ?

భృగు విలా అన్నాడు. మనస్సు కూడా పాంచభౌతికమే. అది పంచభూతాల కన్న భిన్నమైనది కాదు. అంతరాత్మ ఒక్కటే ఈ శరీరభారాన్ని వహిస్తుంది. అదియే గంధ, రస, శబ్ద, స్పర్శ, రూపాలనూ, ఇతర గుణాలను కూడా అనుభవిస్తుంది. పంచగుణాలను ధరించే మనస్సును అంతరాత్మ చూస్తుంది. పాంచభౌతికమైన ఈ శరీరమందంతటా అది వ్యాపించి, సుఖదుఃఖాలను అనుభవిస్తుంది. దానికి శరీరంతో సంబంధం

తొలగిపోయినపుడు సుఖదుఃఖానుభవ ముండదు. పాంచభౌతిక శరీరంలో రూపం, స్పర్శ ఉష్ణత లేని అవస్థలో అగ్ని శాంతించిన తర్వాత జీవాత్మ శరీరాన్ని విడిపోతుంది. కానీ నశించదు. ఈ ప్రపంచమంతా జలమయం. దేహధారుల శరీరం జలమయం. ఆ శరీరంలో మనస్సంభూత మయిన ఆత్మ ఉంటుంది. అదియే సమస్త ప్రాణులలో లోకస్రష్ట అయిన బ్రహ్మగా వ్యవహరింపబడుతుంది. ప్రాకృత గుణాలతో కలిసి ఉన్నపుడు ఆత్మను క్షేత్రజ్ఞుడు అంటాం. ప్రాకృతగుణాల నుండి విముక్తిని పొందితే అదే పరమాత్మ. సర్వలోకహితాత్మకుడై దేహాన్ని ఆశ్రయించి కూడా తామరాకుపై నీటి బొట్టువలె ఏమీ అంటక నిలిచినవానిని పరమాత్మగా తెలుసుకో. నిత్యమూ లోకహితాత్మకుడై, జీవగుణాలైన సత్త్వ రజస్తమస్సులకు లోనైన వానిని క్షేత్రజ్ఞునిగా భావించు. అతడే జీవుడు. సచేతనుడైన జీవుని సంబంధంవలన జీవగుణాలు కూడా సచేతనాలే. జీవుడు తాను ప్రవర్తిస్తూ అన్నింటినీ ప్రవర్తింప జేస్తాడు. సప్తభువనాలనూ ప్రవర్తింపజేసే పరమాత్మ జీవుని కన్న శ్రేష్ఠుడని శరీరతత్త్వ వేత్తలంటారు. **దేహం నశించినా జీవుడు నశింపడు. అజ్ఞానులు మాత్రమే జీవుడు మరణించా డంటారు. అది వాస్తవం కాదు. జీవుడు మరొక దేహంలోనికి ప్రవేశిస్తాడు. శరీరం పంచభూతాలుగా విడిపోవటమే దేహనాశనం.** ఈ రీతిగా ఆత్మ సమస్త ప్రాణులలోనూ నిగూఢంగా కప్పబడి ఉంటుంది. తత్త్వదర్శులు తీక్ష్ణసూక్ష్మబుద్ధితో పరమాత్మను సాక్షాత్కరింపజేసికొంటారు. మితంగా ఆహారాన్ని స్వీకరిస్తూ, రాత్రి తొలిజామున, చివరిజామున ధ్యానం చేస్తూ; నిర్మలాంతః కరణను పొందిన పండితుడు తనలోనే ఆత్మసాక్షాత్కారాన్ని పొందగలుగుతాడు. **నిర్మలాంతఃకరణుడై శుభాశుభకర్మలతో సంబంధాన్ని త్రెంచుకొని, ప్రసన్నచిత్తంతో ఆత్మస్వరూపుడై నిలిచి అనంతమైన ఆనందాన్ని పొందగలడు.** ప్రాణుల శరీరాలలో మనస్సు వెనుక అగ్నివలె ప్రకాశించే చైతన్యమే జీవుడు (జీవరూపంలోని పరమాత్మ). ఆ ప్రజాపతి నుండియే ఈ సృష్టి ఉద్భవించినదని అధ్యాత్మ తత్త్వనిర్ణయం.'

188. వర్ణవిభాగ కథనము.

భృగు విలా అన్నాడు. 'బ్రహ్మ సృష్ట్యారంభసమయంలో తమ తేజస్సుతో సూర్యాగ్నులవలె ప్రకాశించే బ్రాహ్మణులను, ప్రజాపతులను సృష్టించాడు. ఆ తరువాత బ్రహ్మ స్వర్గప్రాప్తికి సాధనాలయిన సత్యాన్ని, ధర్మాన్ని, తపస్సును, శాశ్వత మయిన వేదాన్ని, ఆచారాన్ని, శౌచాన్ని నియమించాడు. ఆపై దేవదానవ గంధర్వులను, దైత్యులను, అసురులను, సర్పాలను, యక్షులను, రాక్షసులను, యక్షరాక్షస నాగ పిశాచ మనుష్యులను

సృష్టించాడు. బ్రాహ్మణోత్తమా ! తరువాత బ్రాహ్మణులను, క్షత్రియులను, వైశ్యులను, శూద్రులను ప్రాణులకు సంబంధించిన ఇతర సంఘాలను సృష్టించాడు. బ్రాహ్మణులకు తెలుపు, క్షత్రియులకు ఎరుపు, వైశ్యులకు పసుపు, శూద్రులకు నలుపు వర్ణాలను నియమించాడు.' భరద్వాజు డిలా అడిగాడు. 'నాలుగు వర్ణాలలోనూ దేనిరంగు దానికి నియతమైతే నాలుగు వర్ణాలలో కూడా వేరువేరు రంగుల మనుష్యులు ఉన్నందువలన వర్ణసాంకర్యం కనిపిస్తుంది. కామం, క్రోధం, భయం, లోభం, శోకం, చింత, ఆకలి, శ్రమ - ఇవన్నీ అందరిలో సమానంగా ఉన్నాయి గదా ! మరి వర్ణభేద మెలా ఏర్పడింది ? అందరి శరీరాలనుండి స్వేదం, మూత్రం, మలం, శ్లేష్మం పిత్తం, రక్తం స్రవిస్తూనే ఉన్నాయి. మరి వర్ణభేద మెలా ఏర్పడింది ? జంగమ ప్రాణులలో లెక్కలేనన్ని జాతు లున్నాయి. స్థావరాలలో కూడా ఎన్నో జాతు లున్నాయి. అవి వివిధ వర్ణాలలో కనిపిస్తున్నాయి. వీటిలో వర్ణనిర్ణయ మెలా కుదురుతుంది?'

భృగు విలా అన్నాడు. 'తొలుత వర్ణభేదం లేదు. ఈ జగత్తంతా బ్రహ్మ నిర్మితం కాబట్టి బ్రాహ్మణమే. ఆ తరువాత కర్మ భేదాల్ని బట్టి వర్ణభేద మేర్పడింది. స్వధర్మాన్ని పరిత్యజించి కామభోగాసక్తులై, తీక్ష్ణస్వభావులై, కోపశీలురై, సాహసాన్ని ఇష్టపడిన బ్రాహ్మణులు రక్తవర్ణ లయ్యారు. క్షత్రియులుగా మారారు. గోపాలనను, వ్యవసాయాన్ని ఆశ్రయించి, జీవితాన్ని గడుపుతూ స్వధర్మాన్ని పాటించని బ్రాహ్మణులు పసిమివన్నెను పొంది, వైశ్యులుగా మారారు. సదాచారాన్ని వీడి హింసనూ, అసత్యాన్నీ ఇష్టపడుతూ లుబ్ధులై, సర్వకర్మలతో జీవితాన్ని గడుపుతున్న బ్రాహ్మణులు నల్లనివారై శూద్రత్వాన్ని పొందారు. ఈ రీతిగా తమ కర్మలకు దూరమయిన బ్రాహ్మణులు బ్రాహ్మణత్వాన్ని కోల్పోయి ఇతర వర్ణాలను పొందారు. కానీ ధర్మానుష్ఠాన, యాగక్రియలు వారికి నిషేధింపబడలేదు. ఈ విధంగా నాలుగు వర్ణాలు ఏర్పడ్డాయి. బ్రహ్మ వారికి వేదవాణిని అనుగ్రహించాడు. కానీ అజ్ఞానకారణంగా కొందరు వేదాధ్యయనానికి దూరమయ్యారు. బ్రాహ్మణులు వేదతంత్రానికి లోబడినవారు. వేద మంత్రాలను ధారణచేస్తూ నిత్యమూ వ్రతాలనూ, నియమాలనూ పాటిస్తూ ఉంటారు. వారి తపస్సు నశించదు. ఈ సృష్టినంతా పరబ్రహ్మ స్వరూపంగా గ్రహించలేనివారు ద్విజు లనిపించుకోరు. అటువంటివారు వివిధాలుగా ఉన్న ఇతర జాతులలో జన్మిస్తారు. వారు జ్ఞానాన్నీ, విజ్ఞానాన్నీ కోల్పోయి స్వేచ్ఛాచార వ్యవహారాలు కలిగి పిశాచాలు, రాక్షసులు, ప్రేతాలు మొదలయిన వివిధజాతులలో జన్మిస్తారు.

తొలగిపోయినపుడు సుఖదుఃఖానుభవ ముండదు. పాంచభౌతిక శరీరంలో రూపం, స్పర్శ, ఉష్ణత లేని అవస్థలో అగ్ని శాంతించిన తర్వాత జీవాత్మ శరీరాన్ని విడిపోతుంది. కానీ నశించదు. ఈ ప్రపంచమంతా జలమయం. దేహధారుల శరీరం జలమయం. ఆ శరీరంలో మనస్సంభూత మయిన ఆత్మ ఉంటుంది. అదియే సమస్త ప్రాణులలో లోకస్రష్ట అయిన బ్రహ్మగా వ్యవహరింపబడుతుంది. ప్రాకృత గుణాలతో కలిసి ఉన్నపుడు ఆత్మను క్షేత్రజ్ఞుడు అంటాం. ప్రాకృతగుణాల నుండి విముక్తిని పొందితే అదే పరమాత్మ. సర్వలోకహితాత్మకుడై దేహాన్ని ఆశ్రయించి కూడా తామరాకుపై నీటి బొట్టువలె ఏమీ అంటక నిలిచినవానిని పరమాత్మగా తెలుసుకో. నిత్యమూ లోకహితాత్మకుడై, జీవగుణాలైన సత్త్వ రజస్తమస్సులకు లోనైన వానిని క్షేత్రజ్ఞునిగా భావించు. అతడే జీవుడు. సచేతనుడైన జీవుని సంబంధంవలన జీవగుణాలు కూడా సచేతనాలే. జీవుడు తాను ప్రవర్తిస్తూ అన్నింటినీ ప్రవర్తింప జేస్తాడు. సప్తభువనాలనూ ప్రవర్తింపజేసే పరమాత్మ జీవుని కన్న శ్రేష్ఠుడని శరీరతత్త్వ వేత్తలంటారు. **దేహం నశించినా జీవుడు నశింపడు. అజ్ఞానులు మాత్రమే జీవుడు మరణించా డంటారు. అది వాస్తవం కాదు. జీవుడు మరొక దేహంలోనికి ప్రవేశిస్తాడు. శరీరం పంచభూతాలుగా విడిపోవటమే దేహనాశనం.** ఈ రీతిగా ఆత్మ సమస్త ప్రాణులలోనూ నిగూఢంగా కప్పబడి ఉంటుంది. తత్త్వదర్శులు తీక్ష్ణసూక్ష్మబుద్ధితో పరమాత్మను సాక్షాత్కరింపజేసికొంటారు. మితంగా ఆహారాన్ని స్వీకరిస్తూ, రాత్రి తొలిజామున, చివరిజామున ధ్యానం చేస్తూ; నిర్మలాంతః కరణను పొందిన పండితుడు తనలోనే ఆత్మసాక్షాత్కారాన్ని పొందగలుగుతాడు. **నిర్మలాంతఃకరణుడై శుభాశుభకర్మలతో సంబంధాన్ని త్రెంచుకొని, ప్రసన్నచిత్తంతో ఆత్మస్వరూపుడై నిలిచి అనంతమైన ఆనందాన్ని పొందగలడు.** ప్రాణుల శరీరాలలో మనస్సు వెనుక అగ్నివలె ప్రకాశించే చైతన్యమే జీవుడు (జీవరూపంలోని పరమాత్మ). ఆ ప్రజాపతి నుండియే ఈ సృష్టి ఉద్భవించినదని అధ్యాత్మ తత్త్వనిర్ణయం.'

188. వర్ణవిభాగ కథనము.

భృగు విలా అన్నాడు. 'బ్రహ్మ సృష్ట్యారంభసమయంలో తమ తేజస్సుతో సూర్యాగ్నులవలె ప్రకాశించే బ్రాహ్మణులను, ప్రజాపతులను సృష్టించాడు. ఆ తరువాత బ్రహ్మ స్వర్గప్రాప్తికి సాధనాలయిన సత్యాన్ని, ధర్మాన్ని, తపస్సును, శాశ్వత మయిన వేదాన్ని, ఆచారాన్ని, శౌచాన్ని నియమించాడు. ఆపై దేవదానవ గంధర్వులను, దైత్యులను, అసురులను, సర్పాలను, యక్షులను, రాక్షసులను, యక్షరాక్షస నాగ పిశాచ మనుష్యులను

సృష్టించాడు. బ్రాహ్మణోత్తమా ! తరువాత బ్రాహ్మణులను, క్షత్రియులను, వైశ్యులను, శూద్రులను ప్రాణులకు సంబంధించిన ఇతర సంఘాలను సృష్టించాడు. బ్రాహ్మణులకు తెలుపు, క్షత్రియులకు ఎరుపు, వైశ్యులకు పసుపు, శూద్రులకు నలుపు వర్ణాలను నియమించాడు.' భరద్వాజు డిలా అడిగాడు. 'నాలుగు వర్ణాలలోనూ దేనిరంగు దానికి నియతమైతే నాలుగు వర్ణాలలో కూడా వేరువేరు రంగుల మనుష్యులు ఉన్నందువలన వర్ణసాంకర్యం కనిపిస్తుంది. కామం, క్రోధం, భయం, లోభం, శోకం, చింత, ఆకలి, శ్రమ - ఇవన్నీ అందరిలో సమానంగా ఉన్నాయి గదా ! మరి వర్ణభేద మెలా ఏర్పడింది ? అందరి శరీరాలనుండి స్వేదం, మూత్రం, మలం, శ్లేష్మం పిత్తం, రక్తం స్రవిస్తూనే ఉన్నాయి. మరి వర్ణభేద మెలా ఏర్పడింది ? జంగమ ప్రాణులలో లెక్కలేనన్ని జాతు లున్నాయి. స్థావరాలలో కూడా ఎన్నో జాతు లున్నాయి. అవి వివిధ వర్ణాలలో కనిపిస్తున్నాయి. వీటిలో వర్ణనిర్ణయ మెలా కుదురుతుంది?'

భృగు విలా అన్నాడు. 'తొలుత వర్ణభేదం లేదు. ఈ జగత్తంతా బ్రహ్మ నిర్మితం కాబట్టి బ్రాహ్మణమే. ఆ తరువాత కర్మ భేదాల్ని బట్టి వర్ణభేద మేర్పడింది. స్వధర్మాన్ని పరిత్యజించి కామభోగాసక్తులై, తీక్ష్ణస్వభావులై, కోపశీలురై, సాహసాన్ని ఇష్టపడిన బ్రాహ్మణులు రక్తవర్ణ లయ్యారు. క్షత్రియులుగా మారారు. గోపాలనను, వ్యవసాయాన్ని ఆశ్రయించి, జీవితాన్ని గడుపుతూ స్వధర్మాన్ని పాటించని బ్రాహ్మణులు పసిమివన్నెను పొంది, వైశ్యులుగా మారారు. సదాచారాన్ని వీడి హింసనూ, అసత్యాన్నీ ఇష్టపడుతూ లుబ్ధులై, సర్వకర్మలతో జీవితాన్ని గడుపుతున్న బ్రాహ్మణులు నల్లనివారై శూద్రత్వాన్ని పొందారు. ఈ రీతిగా తమ కర్మలకు దూరమయిన బ్రాహ్మణులు బ్రాహ్మణత్వాన్ని కోల్పోయి ఇతర వర్ణాలను పొందారు. కానీ ధర్మానుష్ఠాన, యాగక్రియలు వారికి నిషేధింపబడలేదు. ఈ విధంగా నాలుగు వర్ణాలు ఏర్పడ్డాయి. బ్రహ్మ వారికి వేదవాణిని అనుగ్రహించాడు. కానీ అజ్ఞానకారణంగా కొందరు వేదాధ్యయనానికి దూరమయ్యారు. బ్రాహ్మణులు వేదతంత్రానికి లోబడినవారు. వేద మంత్రాలను ధారణచేస్తూ నిత్యమూ వ్రతాలనూ, నియమాలనూ పాటిస్తూ ఉంటారు. వారి తపస్సు నశించదు. ఈ సృష్టినంతా పరబ్రహ్మ స్వరూపంగా గ్రహించలేనివారు ద్విజు లనిపించుకోరు. అటువంటివారు వివిధాలుగా ఉన్న ఇతర జాతులలో జన్మిస్తారు. వారు జ్ఞానాన్నీ, విజ్ఞానాన్నీ కోల్పోయి స్వేచ్ఛాచార వ్యవహారాలు కలిగి పిశాచాలు, రాక్షసులు, ప్రేతాలు మొదలయిన వివిధజాతులలో జన్మిస్తారు.

ప్రాచీన మహర్షులు తమ తపోబలంతో వైదిక సంస్కార సంపన్నులై, స్వకర్తవ్య విషయంలో కృతనిశ్చయులయిన ప్రజలను సృష్టించారు. ఈ రీతిగా ప్రాచీన మహర్షుల ద్వారా అర్వాచీనమునుల సృష్టి జరిగింది. ఆది దేవుడయిన బ్రహ్మమనస్సు నుండి ఉద్భవించినది మానసీసృష్టి. దానికి బ్రహ్మయే మూలం. అది అక్షయం, అవ్యయం, ధర్మతత్పరం కూడా.'

189. వర్ణ స్వరూప కథనము.

భరద్వాజు డిలా అడిగాడు. 'ద్విజోత్తమా ! మహావాగ్మీ ! మనిషి ఏ కర్మలద్వారా బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు కాగలడో చెప్పవలసినది.' భృగు విలా చెప్పాడు. 'జాతకర్మాది సంస్కారాలచే పవిత్రుడై, వేదాధ్యయన సంపన్నుడై, షట్కర్మ (యజనం, యాజనం, అధ్యయనం, అధ్యాపనం, దానం, ప్రతిగ్రహణం) నిరతుడై, సదాచారియై, యజ్ఞశేషాన్ని భుజిస్తూ, గురుప్రియుడై, వ్రతశీలుడై, సత్యాసక్తుడైనవాడు బ్రాహ్మణుడు. **సత్యమూ, దానమూ, ద్రోహ చింతారాహిత్యం, క్రౌర్యం లేక పోవటం, బిడియం, దయ, తపస్సూ కలిగినవాడు బ్రాహ్మణుడు.** వేదాధ్యయనం చేస్తూ, క్షత్రియోచితమయిన కర్మను ఆచరిస్తూ, దానాలు చేస్తూ, పన్నులు వసూలు చేసి ప్రజలకై వినియోగించేవాడు క్షత్రియుడు. వేదాధ్యయన సంపన్నుడై; వ్యాపారం, గోపాలన చేస్తూ; వ్యవసాయాసక్తుడై ఆహారాన్ని సమీకరిస్తూ, పవిత్రంగా జీవించేవాడు వైశ్యుడు. వేదాధ్యయనాన్ని వీడి, నిత్యమూ అన్నింటినీ తినడంలో ఆసక్తికలిగి, అన్ని కర్మలనూ చేయటానికి సిద్ధపడి, అపవిత్రుడై ఉన్నవాడు శూద్రుడు. బ్రాహ్మణలక్షణాలుగా చెప్పబడిన ఏడుగుణాలూ శూద్రునిలో ఉంటే అతడు శూద్రుడు కాదు. బ్రాహ్మణునిలో లేకపోతే అతడు బ్రాహ్మణుడు కాదు.

సర్వోపాయాలద్వారా క్రోధలోభాలను జయించ గలగాలి. అదియే సర్వజ్ఞానాలలో పవిత్ర మయినది. అదే ఆత్మనియంత్రణం. **మానవశ్రేయస్సును భంగపరచేందుకే వీర్పడిన క్రోధలోభాలను అన్నివిధాలుగా నివారించాలి. కోపం నుండి ధనాన్ని, మాత్సర్యంనుండి తపస్సును, మానావమానాల నుండి విద్యను, వీమరుపాటు నుండి తనను రక్షించుకోవాలి.** బ్రాహ్మణా ! కామబంధం లేకుండా సర్వకర్మలనూ నిర్వర్తిస్తూ, సమస్తాన్నీ త్యాగాగ్నిలో హోమం చేస్తున్నవాడు త్యాగిగా, బుద్ధిమంతుడుగా పరిగణింపబడతాడు. **ఏ ప్రాణినీ హింసించకుండా సర్వప్రాణులతోనూ మైత్రితో ప్రవర్తిస్తూ, భార్యాపుత్రులపై మమకారాన్ని వీడి, జితేంద్రియుడైనవాడు ఇహపరలోకాలలోనూ శోకరహితమైన స్థానాన్ని పొందగలుగుతాడు.** నిత్యమూ తపస్సు

నాచరిస్తూ, జితేంద్రియుడై, మననశీలుడై, మనస్సును సంయమనం చెయ్యాలి. ఆసక్తి కలిగించే దేహగేహాదులపై ఆసక్తి విడిచి బంధవిరక్తుడై పరమాత్మను పొందటాన్ని మాత్రమే కోరుకోవాలి. ఇంద్రియాలు గ్రహించే సమస్త పదార్థాలకూ వ్యక్తమని పేరు. అతీంద్రియమై, అనుమాన ప్రమాణంచే గ్రహింపదగినది అవ్యక్తం. **వమ్మదగని దారిలో నడవరాదు. నమ్మదగిన దారిపై మనస్సు పెట్టాలి. మనస్సును ప్రాణాలపై, ప్రాణాలను పరబ్రహ్మపై లగ్నం చేయాలి. నిర్వేదం వలననే మోక్షం సిద్ధిస్తుంది. ముక్తిని పొందిన తర్వాత మరిదేనినీ ఆలోచింప పనిలేదు. సంసార విరక్తుడైన బ్రాహ్మణుడు సుఖస్వరూప మయిన పరబ్రహ్మను పొందగలడు.** నిత్యమూ శుచిగా నిలిచి, సదాచారాలను పాటిస్తూ భూతదయ గలిగి ఉండటమే బ్రాహ్మణ లక్షణం.'

190. సత్యాసత్య, సుఖదుఃఖ విచారణ.

భృగు విలా చెప్పాడు. 'సత్యమే బ్రహ్మ, సత్యమే తపస్సు. సత్యమే ప్రజలను సృష్టిస్తుంది. సత్యాన్ని ఆధారం చేసికొనే లోకం నిలుస్తుంది. సత్యం వలననే మనిషి స్వర్గాన్ని చేరగలుగుతాడు. అసత్యం అంధకారరూపం. తమస్సు మనిషిని క్రిందకు లాగుతుంది. చీకటిచే కప్పబడి తమోగుణానికి లోనైనవారు వెలుగు చూడలేరు. **స్వర్గం కాంతిమయం. నరకం తమోమయం. సత్యా సత్య స్వరూప మయిన మానవజన్మ జ్ఞానాజ్ఞానాలు రెండింటితో కూడి ఉంటుంది.** మానవజన్మలో కూడా లోకప్రవృత్తి సత్యాసత్య స్వరూపంగా, ధర్మాధర్మ మిశ్రితంగా, వెలుగు చీకటుల కలయికగా, సుఖ దుఃఖాత్మకంగా ఉంటుంది. లోకంలో సత్యమే ధర్మం. ధర్మమే ప్రకాశం. ప్రకాశమే సుఖం. అసత్యమే అధర్మం. అధర్మమే అంధకారం. అంధకారమే దుఃఖం.

ఈ విషయంలో పెద్ద లిలా అంటారు. లోకసృష్టి శారీరిక మానసిక దుఃఖాలకు నిలయం. సుఖాలు కూడా కడకు దుఃఖాన్నే మిగుల్చుతాయి. ఈ రీతిగా లోకాన్ని చూసినవారు మోహానికి లోనుకారు. కాబట్టి వివేకవంతుడు దుఃఖవిముక్తికై యత్నించాలి. ఇహపర లోకాలలోనూ ప్రాణులకు లభించే సుఖం శాశ్వతంగా ఉండేదికాదు. రాహుగ్రస్తు డయిన చంద్రుని వెన్నెల ప్రకాశించనట్లే తమోగ్రస్తులయిన ప్రాణుల సుఖం కూడా నశిస్తుంది. సుఖం శారీరికం, మానసికం అని రెండురకాలు. ఇహపర లోకాలలో వస్తుప్రాప్తికై చేసే ప్రయత్నాలన్నీ సుఖం కోసమే. అంతకుమించి విశిష్టమయిన ధర్మార్థకామ ఫలం లేదు. ధర్మార్థాలు సుఖానికి అంగాలు. సర్వకర్మాచరణం ఆ సుఖం కోసమే. ఆ సుఖోత్పత్తికి ప్రయత్నమే కారణం. కాబట్టి సుఖదృష్టితోనే కర్మారంభం.' భరద్వాజు డిలా అడిగాడు.

సుఖాలు పరమోన్నతాలని నీవన్నదానిని సరిగా గ్రహించ లేకపోతున్నాం. ఘోరతపస్సులో మగ్నులయిన మహర్షులు దీనిని పొందగలిగినా కూడా వారు దీనిని కోరటం లేదు. త్రిలోక ప్రభువయిన బ్రహ్మ ఒంటరిగానే ఉంటాడని వినికిడి. ఆయన బ్రహ్మచారి. కామసుఖాలను కోరనివాడు. ఉమాపతి అయిన పరమేశ్వరుడుకూడా ఎదుట నిలిచిన కాముని దహించి ఆయనను అనంగుని చేశాడు. కాబట్టి మహాత్ము లెవ్వరూ దీని నంగీకరించినట్లు అనిపించదు. వారి దృష్టిలో సుఖం సర్వోన్నతగుణం కాదు. కానీ మీ మాటలలో ఆ భావం లేదు. సుఖాన్ని మించినది లేదని అంటున్నట్లుంది. లోక ప్రచారం మేరకు సుకృతంవలన సుఖం, దుష్కృతం వలన దుఃఖం అని ఫలప్రాప్తి రెండు రకాలు.'

భృగు విలా అన్నాడు. 'అసత్యం నుండి అజ్ఞానం పుట్టింది. ఆపై తమోగ్రస్తులైన మనుష్యులు అధర్మాన్నే అనుసరిస్తున్నారు. ధర్మాన్ని అనుసరించటం లేదు. క్రోధ-లోభ-హింసా-అసత్యాలకు లోనై ఇహపరాలలో సుఖానికి దూరమవుతున్నారు. వివిధ రోగాలతో, వ్యాధులతో, తాపాలతో బాధపడుతున్నారు. వధ బంధనాది క్లేశాలతో, ఆకలి దప్పులతో, బాధలతో పీడింపబడుతుంటారు. వాన, గాలి, ఎండ, చలి - వీటి కారణంగా భయంకరమయిన శారీరకష్టాలను అనుభవించవలసి వస్తోంది. బంధువినాశం, ధననష్టం, ప్రియ వియోగం మొదలయిన కారణాలతో మానసిక శోకాన్ని అనుభవించవలసి వస్తోంది. వార్ధక్యం, మృత్యువు. ఈ కారణాలవల్ల కూడా బాధపడవలసి వస్తోంది. ఈ శారీర మానస దుఃఖాలు అంటనివాడే సుఖాన్ని పొందగలడు. స్వర్గంలో ఈ దోషాలు ఉండవు. అక్కడ ఈ క్రింది విశేషాలుంటాయి. స్వర్గంలో గాలి సుఖకరంగా ఉంటుంది. గంధం పరిమళ భరితంగా ఉంటుంది. ఆకలిదప్పుల శ్రమ ఉండదు. వార్ధక్యం కానీ, పాప ఫలానుభవం కానీ అక్కడుండవు. **స్వర్గంలో నిత్యమూ సుఖమే. ఈ లోకంలో సుఖ దుఃఖాలు రెండూ ఉంటాయి. నరకంలో దుఃఖమే ఉంటుంది. అసలు సుఖం పరమపద మయిన పరమాత్మయే. సర్వప్రాణులకు కన్నతల్లి పృథివి. స్త్రీలు కూడా అటువంటివారే. పురుషుడు బ్రహ్మసమానుడు. శుక్రం తేజస్స్వరూప మంటారు.** ఈ రీతిగా తొలుత బ్రహ్మచేత లోకసృష్టి చేయబడింది. తమ తమ కర్మలచే ఆవరింపబడి ప్రజలు సుఖదుఃఖాల ననుభవిస్తారు.'

191. బ్రహ్మచర్య గృహస్థాశ్రమ ధర్మవర్ణన.

భరద్వాజు డిలా అడిగాడు. 'దానరూపమయిన ధర్మాన్ని ఆచరించినందువలన ఫలితమేమిటి ? తీవ్రతపస్సు యొక్క ఫలితమేది ? స్వాధ్యాయ ఫల మేది ? అగ్నిహోత్ర ఫలిత మేమిటి ?' భృగు విలా అన్నాడు. **'అగ్నిహోత్రంవలన పాపం శమిస్తుంది.**

స్వాధ్యాయంవలన గొప్పశాంతి కలుగుతుంది. దానం వలన భోగాలు లభిస్తాయి. తపస్సు వలన స్వర్గం సిద్ధిస్తుంది. పరలోకం కోసం చేసే దానం, ఐహిక ఫలాలకోసం చేసేదానం అని దానం రెండు రకాలు. మంచివారికిచ్చిన దానఫలం పరలోకంలో ఉపకరిస్తుంది. అసత్పురుషులకిచ్చిన దానం ఇహలోకంలోనే ఫలిస్తుంది. దానాన్ని బట్టి ఫలితం కూడా అనుభవానికి వస్తుంది.' భరద్వాజు డిలా అడిగాడు. 'ఎవరి ధర్మాచరణ మెలా ఉండాలి ? ధర్మానికి లక్షణ మేమిటి ? ధర్మం ఎన్నిరకాలు ? తమరు నాకు తెలియజేయాలి.' భృగు విలా చెప్పాడు. 'బుద్ధిమంతులై వర్ణాశ్రమాల ననుసరించి స్వధర్మాచరణం చేసినవారు స్వర్గఫలాన్ని పొందుతారు. అజ్ఞానులై ధర్మాచరణ చేయనివారు మోహపరవశు లవుతారు.' భరద్వాజు డిలా అడిగాడు. 'ప్రాచీనకాలంలో బ్రహ్మర్షులు విధించిన నాలుగు ఆశ్రమాలలో పాటించవలసిన ధర్మాలేవి ? నాకు చెప్పవలసినది.'

భృగు విలా చెప్పాడు. 'లోకహితాన్ని కోరుతూ పూజ్యుడైన బ్రహ్మ తొలుత ధర్మసంరక్షణకై నాలుగు ఆశ్రమాలను విధించాడు. వాటిలో గురుకుల వాసమే మొదటి ఆశ్రమం. అక్కడ బాహ్యాభ్యంతరశుచియై సంస్కారనియమాలను పాటిస్తూ మనస్సును వశపరచుకొని ఉభయసంధ్యలలో సూర్యుని, అగ్నినీ ఉపాసించాలి. శారీరికంగా, మానసికంగా అలసతలేక గురువందనం ద్వారా, వేదాభ్యాసం ద్వారా, వేదశ్రవణం ద్వారా అంతఃకరణను శుద్ధిపరచుకోవాలి. త్రికాలాలలో స్నానమాచరించి బ్రహ్మచర్యాన్నీ, అగ్నిహోత్రాన్నీ, గురుశుశ్రూషను అలవరుచుకోవాలి. నిత్యమూ భిక్షాటన చేస్తూ దొరికిన భిక్షనంతటినీ అంతరాత్మతో పాటు గురువుకు సమర్పించాలి. గురువాక్యాన్ని అతిక్రమించక, గురువు అనుగ్రహంద్వారా లభించిన స్వాధ్యాయంపై ఆసక్తితో మెలగాలి. ఈ విషయమిలా కీర్తింపబడింది. గురువు నారాధించి, వేదాధ్యయనం చేసిన ద్విజుడు స్వర్గఫలాన్ని పొందుతాడు. అతడి సంకల్పం కూడా సిద్ధిస్తుంది. రెండవ ఆశ్రమాన్ని గార్హస్థ్య మంటారు. దానిలో పాటించవలసిన సమస్తాచారాలను వివరిస్తాము. సదాచారాలను పాటించి, విద్యాభ్యాసం పూర్తిచేసి, స్నాతకుడై వచ్చిన బ్రహ్మచారి సహధర్మ చారిణితో కలిసి ధర్మాచరణం చేయదలిస్తే వానికై గృహస్థాశ్రమం విధింపబడింది. ఈ ఆశ్రమంలో ధర్మం, అర్థం, కామం మూడు లభిస్తాయి. ఈ త్రివర్గాన్ని సాధించటానికై అనిందితమైన కర్మను ఆశ్రయించి, ధనసంగ్రహం చేయాలి. ధన సమీకరణకు, మూడు మార్గాలు. స్వాధ్యాయంచేత లభించిన యోగ్యత, ధర్మశాస్త్ర నిశ్చితమయిన ఏదయినా పద్ధతి, పర్వతాలనుండి సంపదలు- ఆ మూడు మార్గాలు. లేదా యాగాలు, శ్రాద్ధాలు, నియమాలు, వేదాభ్యాసాలు, దేవతానుగ్రహం- ఈ మార్గాల్లో సాధించిన ధనంతో గృహస్థుడు గృహస్థాశ్రమాన్ని కొనసాగించాలి. అన్ని

ఆశ్రమాలకు గృహస్థా శ్రమమే మూల మంటారు. అందువలననే గురుకుల వాసులయిన బ్రహ్మచారులు, పరివ్రాజకులు, వ్రత నియమాది పాలన చేసే ఇతరవానప్రస్థులు కూడా గృహస్థులనుండి భిక్షను, బలిని స్వీకరించి ధర్మాచరణం కొనసాగిస్తారు. వానప్రస్థులు ధనాన్ని సమీకరించకూడదు. ఈ సజ్జనులు సాధారణంగా శుద్ధమూ, హితకరమూ అయిన అన్నాన్ని స్వీకరిస్తూ, స్వాధ్యాయ తీర్థయాత్రా దేశదర్శనాలకై దేశ పర్యటన చేస్తారు. వారు వచ్చినపుడు లేచి, ఎదురేగి, స్వాగతించటం, అరమరికలు లేకుండా మాటాడటం, సుఖాసన, సుఖశయనాలు, ఏర్పరచటం, భోజనం పెట్టడం గృహస్థుల కర్తవ్యం. **ఈ విషయ మిలా కీర్తింపబడింది. నిరాశతో అతిథి గృహస్థుని ఇంటినుండి మరలిపోతే ఆ అతిథి తన పాపాన్ని గృహస్థుల కిచ్చి, గృహస్థుని పుణ్యాన్ని కొనిపోయినట్లే.** అంతేకాదు. గృహస్థాశ్రమంలోని యజ్ఞ క్రియలతో దేవతలు తృప్తి పడతారు. నివాపాంజలులతో పితరులు, విద్యాభ్యాస శ్రవణ ధారణలతో ఋషులు, సంతానోత్పాదనతో ప్రజాపతి తృప్తిపడతారు. ఈ విషయంలో రెండు శ్లోకాలున్నాయి. సర్వప్రాణులయెడ వాత్సల్యంతో చెవికింపయిన మాటలనే పలకాలి. ఇతరులను నొప్పించుట, పరుషంగా మాటాడుట, చంపబూనుట ఇక్కడ నిందింపదగిన అంశాలు. **ఇతరులను తిరస్కరించుట, అహంకారం, దంభం నిందార్హాలు. అహింస, సత్యం, అక్రోధం- ఇవి ఏ ఆశ్రమంలో నయినా తపస్సువంటివి.** ఇంతేకాక పూలమాలలు, నగలు, వస్త్రాలు, అభ్యంగస్నానాలు, నిత్యోపభోగాలు, నృత్యం, గీతం, వాద్యాలు, చెవికింపయిన శబ్దాలు, అందమయిన రూపదర్శనాలు లభిస్తాయి. భక్ష్య, భోజ్య, లేహ్య, పానీయ, చోష్యరూపాలయిన ఆహార పదార్థాలు ఆస్వాదించవచ్చు. విహారాలు, కామసుఖాలు కూడా పొందవచ్చు. గృహస్థాశ్రమంలో నిత్యమూ ధర్మార్థ కామాలు సిద్ధిస్తాయి. ఇహలోకంలో సుఖాల ననుభవించి, పరలోకంలో ఉత్తముల స్థితిని పొందుతాడు గృహస్థుడు. స్వధర్మాచరణ తత్పరుడై, ఉంఛవృత్తిని ఆశ్రయించిన గృహస్థుడు కామసుఖాసక్తిని విడనాడితే అతనికి స్వర్గం దుర్లభం కాదు.'

192. వానప్రస్థ సంన్యాస ధర్మవర్ణన.

భృగు విలా చెప్పాడు. 'వానప్రస్థాశ్రమాన్ని పాటించేవారు ధర్మపాలన చేస్తూ పుణ్యతీర్థాలలో, నదీతీరాల్లో, జింకలు, దున్నపోతులు, పందులు, పులులు, అడవిఏనుగులు సంచరించే దుర్గమారణ్యాలలో తపోదీక్షతో తిరుగుతారు. గ్రామీణులు అనుభవించే వస్త్రభోజన సౌఖ్యాలను విడనాడి, అడవులలో అప్రయత్నంగా లభించే అన్న ఫల, మూల, పర్ణాదులతో విచిత్రంగా, పరిమితంగా, నియతంగా ఆహారాన్ని స్వీకరిస్తారు. నేలపై కూర్చుంటారు.

నేలపై గానీ, రాళ్ళపై కానీ, ఇసుకపై గానీ, కంకర మట్టిపై కానీ, గండ్ర ఇసుకపై గానీ, బూడిదపై కానీ శయనిస్తారు. రెల్లు, దర్భలు, మృగచర్మాలు చెట్టుబెరళ్ళతో శరీరాన్ని కప్పుకొంటారు. జటలు, గెడ్డం, మీసాలు, గోళ్ళు, వెంట్రుకలు ఎప్పుడూ కలిగిఉంటారు. నియతకాలంలో స్నానాలు చేస్తూ, వేళ అతిక్రమించక బలిహోమాలను అనుష్ఠిస్తారు. సమిధలను, దర్భలను, పూలను సేకరించి; ఆశ్రమాలలో సమ్మార్జనను పూర్తిచేసి, ఆపై విశ్రమిస్తారు. చలిని, వేడిని, వానను, గాలిని భరించి భరించి వారి చర్మం చిట్లి ఉంటుంది. వివిధ నియమపాలనల వల్ల, సత్కర్మాచరణం వల్ల వారి రక్తమాంసాలు శోషించి ఉంటాయి. శరీరంలో ఎముకలు, చర్మం మాత్రం మిగిలి ఉంటాయి. అయినా ధైర్యంతో, శక్తితో శరీరాన్ని భరిస్తారు. నియమశీలుడై బ్రహ్మర్షి నిర్దిష్ట మయిన ఈ విధిని పాటించిన వానప్రస్థుడు అగ్నివలె దోషాలను దహించగలడు. గెలువరాని లోకాలను గెలువగలడు. పరివ్రాజకుల ఆచార మీ రీతిగా ఉంటుంది. అగ్ని హోత్రాన్ని, ధనాన్నీ, కళత్రాన్ని, శయన సామగ్రిని పరిత్యజించి, బంధాల నుండి తన స్నేహపాశాలను విడిపించుకొని, తిరుగుతుంటారు పరివ్రాజకులు. వారు మట్టి బెడ్డలు, రాళ్ళు, బంగారం – వీటిని సమానంగా చూస్తారు. ధర్మార్థ కామాసక్తులపై వారికి ఆసక్తి ఉండదు. శత్రువులను, మిత్రులను, తటస్థులను ఒకటిగానే చూస్తారు. స్థావరాలకు కానీ, పిండజ, అండజ, స్వేద, ఉద్భిజ్జ ప్రాణులకు కానీ వాఙ్మనఃకర్మలతో ద్రోహం తలపెట్టరు. ఇళ్ళులేక పర్వతాలలో, నదీతీరాలలో, చెట్ల క్రింద, దేవాలయాలలో విశ్రమిస్తుంటారు. విడిదికై గ్రామానికి కానీ నగరానికి కానీ వెళ్తారు. నగరంలో అయిదు రాత్రులు, గ్రామంలో ఒక రాత్రి విడిది చేస్తారు. ప్రాణధారణకై సంకరం కాని ద్విజాతుల ఇళ్ళముందుకు వెళతారు. అడగకుండానే భిక్షాపాత్రలో లభించినదానిని స్వీకరిస్తారు. కామ, క్రోధ, దర్প, లోభ, మోహ, కృపణతా, దంభ, నిందా, అభిమాన, హింసలకు దూరంగా ఉంటారు.

ఈ విషయంలో ప్రసిద్ధశ్లోకా లున్నాయి. **సర్వప్రాణులకూ అభయమిచ్చి ప్రవర్తించిన మునికి ఏ ప్రాణి నుండీ కూడా ఎప్పుడూ భయముండదు.** అగ్నిహోత్రాన్ని తన శరీరమందు ఆరోపించుకొని, భిక్షద్వారా లభించిన ఆహారాన్ని హవిస్సుగా తలలోని అగ్నిని ఉద్దేశించి, ముఖంలో ఆహుతి చేసిన విప్రుడు అగ్నిచయనం చేసిన బ్రాహ్మణులు చేరే లోకాలను పొందుతాడు. సంకల్ప రహితమైన బుద్ధితో పవిత్రుడై, శాస్త్రోక్తవిధితో సంన్యాస నియమాలను పాటించినవాడు ఇంధనం లేని అగ్నివలె పరమ ప్రశాంతమైన జ్యోతిర్మయ బ్రహ్మలోకాన్ని పొందుతాడు.' భరద్వాజ డిలా అడిగాడు. 'ఈ లోకాన్ని మించిన పరలోక మొక టుందని వినడమే కానీ కనిపించటం లేదు. దానిని

తెలియదలచుకొన్నాను. తమరు వివరించాలి.'

భృగు విలా అన్నాడు. 'ఉత్తర దిక్కున, హిమాలయ పర్వతానికి ప్రక్కన సర్వగుణ సంపన్నమై, పవిత్రమైన ప్రదేశమున్నది. అది పుణ్యప్రదం, క్షేమప్రదం, కమనీయం కూడా. అది శ్రేష్ఠలోకమని వ్యవహరింపబడుతుంది. అక్కడున్న మానవులు పాపకర్మలు చేయనివారు, పవిత్రులు, నిర్మలులు, లోభమోహాలు లేనివారు. వారి కే ప్రమాదాలు లేవు. అది స్వర్గతుల్యమయిన ప్రదేశం. అక్కడ అన్నీ శుభలక్షణాలే. అక్కడన్నీ సకాలసహజమరణాలే. వ్యాధులేవీ అంటవు. అక్కడ పరకాంతలపై వ్యామోహ ముండదు. జనులందరూ స్వభార్యా సక్తులే. ఒకరినొకరు బంధించటమన్నది అక్కడ లేదు. ద్రవ్యప్రాప్తి అక్కడ ఆశ్చర్యకరం కాదు. అనాత్మభూత మయిన అధర్మ మక్కడ ఉండదు. అక్కడ సందేహాలు కూడా కలుగవు. అక్కడచేసిన కర్మలఫలం ప్రత్యక్షంగా లభిస్తుంది. కొందరక్కడ పెద్ద పెద్ద భవనాలలో నివసిస్తారు. ఉత్తమాసనాలు, మంచి అన్నపానీయాలూ అనుభవిస్తారు. సర్వకామ సంపన్నులు కొందరు ఆభరణాలు ధరిస్తారు. కొందరు ప్రాణధారణకే ఆహారం స్వీకరిస్తారు. కొందరు పరిశ్రమతో తపస్సుతోనే ప్రాణధారణ చేస్తారు. ఇహలోకంలో కొందరు ధర్మపరాయణులు. మరికొందరు నరులు వంచకులు. అందువలననే కొందరు సుఖపడితే కొందరు దుఃఖిస్తారు. కొందరు దరిద్రులు, కొందరు ధనికులు అవుతారు. ఇక్కడ శ్రమ, భయం, మోహం తీవ్ర మయిన ఆకలి కలుగుతాయి. నరులకు అర్థలోభ ముంటుంది. దానితో అజ్ఞానులు వ్యామోహంలో పడతారు. ఇక్కడ కుశలులు ధర్మా ధర్మాలను బహువిధాలుగా చేస్తూ ఉంటారు. గ్రహింపదగిన ధర్మాన్ని, హేయమయిన అధర్మాన్ని తెలిసిన ప్రాజ్ఞునికి పాపం అంటదు. వంచన, కపటత, దొంగతనం, పరనింద, అసూయపడుట, పరులకు హానిచేయుట, పరహింస, లోభం, అసత్య కథనం- ఈ దుర్గుణాలు కలవారి తపస్సు నిరర్థకం. ఈ అవలక్షణాలు లేని పండితుల తపస్సు వృద్ధిచెందుతుంది.

ఈ లోకంలో ధర్మాధర్మ కర్మల గురించి వివిధ చర్చ జరుగుతుంటుంది. ఇది కర్మభూమి. ఈ లోకంలో శుభాశుభ కర్మలు చేసిన మనిషి శుభకర్మలవలన శుభ ఫలితాన్ని, అశుభకర్మల వలన అశుభఫలితాన్ని అనుభవిస్తాడు. ఈ లోకంలో గతంలో ప్రజాపతి, దేవతలు, ఋషులు యాగాలను, తపస్సులను ఆచరించి, పవిత్రులై బ్రహ్మలోకాన్ని పొందారు. ఉత్తర భూభాగం పరమపవిత్రం, శుభప్రదం కూడా. ఇహలోకంలో పుణ్య కర్మలు చేసిన జనులు ఆ భూభాగంలోనే జన్మిస్తారు. అసత్కర్మలు చేసేవారు పశుపక్షిజాతులలో జన్మిస్తారు. ఎంతోమంది ఆయుస్సు క్షీణించిన తర్వాత నశించి,

పాతాల లోకాలకు వెళతారు. లోభమోహావిష్టులై, పరస్పరభక్షణాసక్తి గల జనులు ఉత్తర దిక్కున గల ఉత్కృష్టలోకాలను పొందలేరు. ఇక్కడే తిరుగుతుంటారు. జితేంద్రియులై, బ్రహ్మచారులై గురువులను ఉపాసించిన బుద్ధిమంతులు సర్వలోకాల మార్గాలను తెలిసికొన గలుగుతారు. ఈ రీతిగా నేను బ్రహ్మ నిర్మించిన ధర్మాన్ని గురించి సంక్షిప్తంగా తెలియజేశాను. లోకంలోని ధర్మాధర్మ స్వరూపాన్ని గ్రహించ గలవాడే బుద్ధిమంతుడు.' భీష్ముడిలా అన్నాడు. 'రాజా ! భృగువు ప్రతాపశాలి అయిన భరద్వాజునకు ఇదంతా చెప్పాడు. పరమ ధర్మాత్ముడైన భరద్వాజుడు ఆశ్చర్యపడి భృగువును పూజించాడు. రాజా ! మహాప్రాజ్ఞా ! ఈ జగత్సృష్టిని గూర్చి నీకు సంపూర్ణంగా తెలియజేశాను. ఇంకా ఏం వినా లనుకొంటున్నావు ?'

193. ఆచార విధి.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'అనఘా ! ధర్మజ్ఞా ! పితామహా ! నీవు చెపితే ఆచారవిధిని గురించి వినాలని ఉంది. నీవు సర్వజ్ఞుడ వని నా అభిప్రాయం.' భీష్ము డిలా చెప్తున్నాడు. 'దురాచారులు, దుష్టచేష్టలు, దుష్టబుద్ధులు, సాహస ప్రియులు చెడ్డవారుగా పేరు బడతారు. ఆచార లక్షణాలు గలవారు సజ్జనులు. రాజమార్గంలో, గోవులమధ్యలో, ధాన్యమధ్యంలో మల మూత్ర విసర్జన చేయనివారు సజ్జనులు. నిత్యశౌచమూ, ఆచమనమూ, నదులు దాటే సమయంలో దేవతా తర్పణమూ మానవులకు ధర్మం. **నిత్యమూ సూర్యోపాసన చేయాలి. సూర్యోదయ వేళలో నిదురించకూడదు. ప్రాతఃకాలంలో పూర్వాభిముఖంగాను, సాయంకాలం పశ్చిమాభిముఖంగానూ సంధ్యోపాసన చేసి గాయత్రిని జపించాలి.** కాళ్ళూ, చేతులూ, ముఖమూ (అయిదూ) కడుగుకొని, పూర్వాభిముఖుడై మౌనంగా భోజనం చేయాలి. అన్నాన్నీ, భక్ష్యాలనూ నిందించకూడదు. రుచించినా, రుచింపకపోయినా ఇష్టంగా తినాలి. **చేతులు ఆరకముందే భోజనం నుండి లేవాలి. తడికాళ్ళతో రాత్రి నిదురించరాదు. ఇది దేవర్షి అయిన నారదుడు చెప్పిన ఆచార లక్షణం.** పవిత్ర స్థానాలకూ, గోవులకూ, దేవాలయాలకూ, బ్రాహ్మణులకూ, ధార్మికులకూ, పవిత్ర వృక్షాలకూ ప్రదక్షిణం చేసి వెళ్ళాలి. గృహస్థుడు అతిథులకు, సేవకులకూ, బంధువులకూ, తన వారికీ అందరికీ ఒకే రకమైన భోజనాన్ని ఏర్పాటుచేయటం శ్రేష్ఠం.

ప్రాతఃకాలం, సాయంకాలం రెండు పూటలు మాత్రమే భోజనం వేదసమ్మతం, మధ్యలో భోజనం చేయకూడదు. అలా ఉన్నవాడు ఉపవాస ఫలాన్ని పొందుతాడు. హోమకాలంలో హోమం చేస్తూ, ఋతుకాలంలో పత్నితో సంగమిస్తూ,

తెలియదలచుకొన్నాను. తమరు వివరించాలి.'

భృగు విలా అన్నాడు. 'ఉత్తర దిక్కున, హిమాలయ పర్వతానికి ప్రక్కన సర్వగుణ సంపన్నమై, పవిత్రమైన ప్రదేశమున్నది. అది పుణ్యప్రదం, క్షేమప్రదం, కమనీయం కూడా. అది శ్రేష్ఠలోకమని వ్యవహరింపబడుతుంది. అక్కడున్న మానవులు పాపకర్మలు చేయనివారు, పవిత్రులు, నిర్మలులు, లోభమోహాలు లేనివారు. వారి కే ప్రమాదాలు లేవు. అది స్వర్గతుల్యమయిన ప్రదేశం. అక్కడ అన్నీ శుభలక్షణాలే. అక్కడన్నీ సకాలసహజమరణాలే. వ్యాధులేవీ అంటవు. అక్కడ పరకాంతలపై వ్యామోహ ముండదు. జనులందరూ స్వభార్యా సక్తులే. ఒకరినొకరు బంధించటమన్నది అక్కడ లేదు. ద్రవ్యప్రాప్తి అక్కడ ఆశ్చర్యకరం కాదు. అనాత్మభూత మయిన అధర్మ మక్కడ ఉండదు. అక్కడ సందేహాలు కూడా కలుగవు. అక్కడచేసిన కర్మలఫలం ప్రత్యక్షంగా లభిస్తుంది. కొందరక్కడ పెద్ద పెద్ద భవనాలలో నివసిస్తారు. ఉత్తమాసనాలు, మంచి అన్నపానీయాలూ అనుభవిస్తారు. సర్వకామ సంపన్నులు కొందరు ఆభరణాలు ధరిస్తారు. కొందరు ప్రాణధారణకే ఆహారం స్వీకరిస్తారు. కొందరు పరిశ్రమతో తపస్సుతోనే ప్రాణధారణ చేస్తారు. ఇహలోకంలో కొందరు ధర్మపరాయణులు. మరికొందరు నరులు వంచకులు. అందువలననే కొందరు సుఖపడితే కొందరు దుఃఖిస్తారు. కొందరు దరిద్రులు, కొందరు ధనికులు అవుతారు. ఇక్కడ శ్రమ, భయం, మోహం తీవ్ర మయిన ఆకలి కలుగుతాయి. నరులకు అర్థలోభ ముంటుంది. దానితో అజ్ఞానులు వ్యామోహంలో పడతారు. ఇక్కడ కుశలులు ధర్మా ధర్మాలను బహువిధాలుగా చేస్తూ ఉంటారు. గ్రహింపదగిన ధర్మాన్ని, హేయమయిన అధర్మాన్ని తెలిసిన ప్రాజ్ఞునికి పాపం అంటదు. వంచన, కపటత, దొంగతనం, పరనింద, అసూయపడుట, పరులకు హానిచేయుట, పరహింస, లోభం, అసత్య కథనం- ఈ దుర్గుణాలు కలవారి తపస్సు నిరర్థకం. ఈ అవలక్షణాలు లేని పండితుల తపస్సు వృద్ధిచెందుతుంది.

ఈ లోకంలో ధర్మాధర్మ కర్మల గురించి వివిధ చర్చ జరుగుతుంటుంది. ఇది కర్మభూమి. ఈ లోకంలో శుభాశుభ కర్మలు చేసిన మనిషి శుభకర్మలవలన శుభ ఫలితాన్ని, అశుభకర్మల వలన అశుభఫలితాన్ని అనుభవిస్తాడు. ఈ లోకంలో గతంలో ప్రజాపతి, దేవతలు, ఋషులు యాగాలను, తపస్సులను ఆచరించి, పవిత్రులై బ్రహ్మలోకాన్ని పొందారు. ఉత్తర భూభాగం పరమపవిత్రం, శుభప్రదం కూడా. ఇహలోకంలో పుణ్య కర్మలు చేసిన జనులు ఆ భూభాగంలోనే జన్మిస్తారు. అసత్కర్మలు చేసేవారు పశుపక్షిజాతులలో జన్మిస్తారు. ఎంతోమంది ఆయుస్సు క్షీణించిన తర్వాత నశించి,

పాతాల లోకాలకు వెళతారు. లోభమోహావిష్టులై, పరస్పరభక్షణాసక్తి గల జనులు ఉత్తర దిక్కున గల ఉత్కృష్టలోకాలను పొందలేరు. ఇక్కడే తిరుగుతుంటారు. జితేంద్రియులై, బ్రహ్మచారులై గురువులను ఉపాసించిన బుద్ధిమంతులు సర్వలోకాల మార్గాలను తెలిసికొన గలుగుతారు. ఈ రీతిగా నేను బ్రహ్మ నిర్మించిన ధర్మాన్ని గురించి సంక్షిప్తంగా తెలియజేశాను. లోకంలోని ధర్మాధర్మ స్వరూపాన్ని గ్రహించ గలవాడే బుద్ధిమంతుడు.' భీష్ముడిలా అన్నాడు. 'రాజా ! భృగువు ప్రతాపశాలి అయిన భరద్వాజునకు ఇదంతా చెప్పాడు. పరమ ధర్మాత్ముడైన భరద్వాజుడు ఆశ్చర్యపడి భృగువును పూజించాడు. రాజా ! మహాప్రాజ్ఞా ! ఈ జగత్సృష్టిని గూర్చి నీకు సంపూర్ణంగా తెలియజేశాను. ఇంకా ఏం వినా లనుకొంటున్నావు ?'

193. ఆచార విధి.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'అనఘా ! ధర్మజ్ఞా ! పితామహా ! నీవు చెపితే ఆచారవిధిని గురించి వినాలని ఉంది. నీవు సర్వజ్ఞుడ వని నా అభిప్రాయం.' భీష్ము డిలా చెప్తున్నాడు. 'దురాచారులు, దుష్టచేష్టలు, దుష్టబుద్ధులు, సాహస ప్రియులు చెడ్డవారుగా పేరు బడతారు. ఆచార లక్షణాలు గలవారు సజ్జనులు. రాజమార్గంలో, గోవులమధ్యలో, ధాన్యమధ్యంలో మల మూత్ర విసర్జన చేయనివారు సజ్జనులు. నిత్యశౌచమూ, ఆచమనమూ, నదులు దాటే సమయంలో దేవతా తర్పణమూ మానవులకు ధర్మం. **నిత్యమూ సూర్యోపాసన చేయాలి. సూర్యోదయ వేళలో నిదురించకూడదు. ప్రాతఃకాలంలో పూర్వాభిముఖంగాను, సాయంకాలం పశ్చిమాభిముఖంగానూ సంధ్యోపాసన చేసి గాయత్రిని జపించాలి.** కాళ్ళూ, చేతులూ, ముఖమూ (అయిదూ) కడుగుకొని, పూర్వాభిముఖుడై మౌనంగా భోజనం చేయాలి. అన్నాన్నీ, భక్ష్యాలనూ నిందించకూడదు. రుచించినా, రుచింపకపోయినా ఇష్టంగా తినాలి. **చేతులు ఆరకముందే భోజనం నుండి లేవాలి. తడికాళ్ళతో రాత్రి నిదురించరాదు. ఇది దేవర్షి అయిన నారదుడు చెప్పిన ఆచార లక్షణం.** పవిత్ర స్థానాలకూ, గోవులకూ, దేవాలయాలకూ, బ్రాహ్మణులకూ, ధార్మికులకూ, పవిత్ర వృక్షాలకూ ప్రదక్షిణం చేసి వెళ్ళాలి. గృహస్థుడు అతిథులకు, సేవకులకూ, బంధువులకూ, తన వారికీ అందరికీ ఒకే రకమైన భోజనాన్ని ఏర్పాటుచేయటం శ్రేష్ఠం.

ప్రాతఃకాలం, సాయంకాలం రెండు పూటలు మాత్రమే భోజనం వేదసమ్మతం, మధ్యలో భోజనం చేయకూడదు. అలా ఉన్నవాడు ఉపవాస ఫలాన్ని పొందుతాడు. హోమకాలంలో హోమం చేస్తూ, ఋతుకాలంలో పత్నితో సంగమిస్తూ,

పరదారాభిగమనం లేని బుద్ధిమంతుడు బ్రహ్మచారితో సమానం. బ్రాహ్మణోచ్ఛిష్టం అమృతప్రాయం. అది తల్లిపాల వలె హితకరం. దానిని సేవించిన సజ్జనులు సత్యస్వరూపుడైన పరమాత్మను పొందగలరు. మట్టిబెడ్డలు చిదిమేవాడు, గడ్డిపరకలు త్రుంచేవాడు, గోళ్ళతో తినేవాడూ, ఎప్పుడూ సోమపానం చేసేవాడు, ముల్లుగ్రుచ్చుకొన్న చిలకవలె పరాధీనుడు పరమాత్మను దీర్ఘాయువును పొందలేరు. మాంసాహారాన్ని తిననివాడు యజుస్సులతో పవిత్రమైన మాంసాన్ని కూడా తినరాదు. సంస్కరింపబడని మాంసాన్ని కానీ, శ్రాద్ధశేషమైన మాంసాన్ని కానీ తినరాదు. స్వదేశంలో కానీ, పరదేశంలో కానీ అతిథిని పస్తుపెట్టరాదు. కామ్యకర్మల వలన లభించిన ఫలితాన్ని గురువులకు నివేదించాలి. గురువులు వచ్చినప్పుడు వారికి ఆసనాన్ని చూపించాలి. అభివాదన చేయాలి. గురువులను అర్చించినపుడే ఆయుస్సు, కీర్తి, సంపద సమకూరుతాయి. ఉదయిస్తున్న సూర్యుని చూడరాదు. పరస్త్రీని నగ్నంగా చూడరాదు. ఎప్పుడూ ధర్మబద్ధంగా ఋతుకాలంలోనే ఏకాంత ప్రదేశంలోనే భార్యతో సంగమించాలి.

హృదయమే తీర్థాలలో ఉత్తమమైన తీర్థం. హృదయమే పవిత్రాలలో పవిత్రం. పెద్దలు పాటించినదే శ్రేష్ఠమైన ఆచారం. గోపృష్ఠప్పర్శనాదికం శిష్టాచారాన్ని బట్టి పవిత్రం. పరిచితులు కనిపించిన ప్రతిసారీ కుశలప్రశ్నలు అడగాలి. ఉదయమూ, సాయంకాలమూ విప్రులకు అభివాదన చేయాలి. అది శాస్త్రవిధి. దేవాలయాలలో, గోవుల దగ్గర, బ్రాహ్మణులు చేసే యాగాది క్రియలలో, స్వాధ్యాయవేళలో, భోజన సమయంలో కుడిచేతితో పని చేయాలి. ప్రాతఃకాలంలో, సాయంకాలంలో యథావిధిగా బ్రాహ్మణుల నర్చించాలి. వ్యాపారాలలో ఉత్తమ వ్యాపారం వంటి దది. వ్యవసాయంలో శ్రేష్ఠవ్యవసాయం వంటి దది. అలా అర్చించినవారికి సస్యవృద్ధి, ఉత్తమ వాహన సిద్ధి కలుగుతాయి. భోజనం పెట్టిన తరువాత సంపన్నంగా ఉన్నదా ? అని అడగాలి. పానీయ మిచ్చిన తరువాత తృప్తికలిగిందా ? అని అడగాలి. పాయసం పెట్టిన తరువాత బాగున్నదా? అని అడగాలి. అలాగే గంజి పోసినప్పుడు కానీ పొంగలి పెట్టినప్పుడు కానీ ప్రశ్నించాలి. క్షౌరం చేసికొన్న తర్వాత, తుమ్మిన తర్వాత స్నానభోజనా నంతరం, రోగులయితే సర్వావస్థలయందు బ్రాహ్మణులకు నమస్కరించాలి. అది ఆయుర్వృద్ధికరం. సూర్యాభిముఖంగా మూత్ర విసర్జన తగదు. తనమలాన్ని తాను చూడరాదు. స్త్రీతో కలిసి ఒకే శయ్యపై పరుండటాన్ని, ఒకే కంచంలో అన్నం తినటాన్ని విసర్జించాలి. పెద్దవారిని ఏకవచనంలో గానీ, పేరుతో గానీ పిలువరాదు. సమానులు గానీ, చిన్నవారిని గానీ పేరుతో పిలిచినా, ఏకవచనంతో పిలిచినా తప్పులేదు.

పాపపు పనులు చేసిన వారి మనస్సు, ముఖవికారాలు ఆ పాపాన్ని తెలియజేస్తూనే ఉంటాయి. తెలివిగా పెద్దవారి దగ్గర ఆ పాపాన్ని కప్పిపుచ్చుకొనేవారు నశిస్తారు. మూర్ఖులు తెలివితేటలతో తాము చేసిన పాపాన్ని కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తారు. మనుష్యులు దానిని చూడలేకపోయినా దేవతలు చూస్తూనే ఉంటారు. **పాపి కప్పిపుచ్చుకొన్న పాపం పాపాన్నే పెంచుతుంది. ధర్మంచేత, లేదా ధార్మికునిచేత కప్పిపుచ్చబడిన ధర్మం ధర్మాన్నే పెంచుతుంది.** పాపి తాను చేసిన పాపాన్ని గుర్తుంచుకొనక పోయినా ఆ పాపం మాత్రం అతనిని అనుసరిస్తూనే ఉంటుంది. రాహువు తానే చంద్రుని చేరినట్టు పాపం స్వయంగా ఆ పాపం చేసిన కర్త దగ్గరకు చేరుతుంది. ఆశతో ధనాన్ని కూడబెడితే ఆ ధనానుభవం దుఃఖపూర్వకంగానే ఉంటుంది. పండితులు దానిని అభినందించరు. మృత్యువు కోరికలు తీరేదాకా ఎవ్వరి కోసమూ ఆగదు. **సర్వప్రాణులూ మనః పూర్వకంగా చేసినదే ధర్మ మని పెద్ద లంటారు. కాబట్టి మనః పూర్వకంగా సర్వప్రాణులకూ శుభాన్నే కోరుకోవాలి. శాస్త్ర విధి ననుసరించి ఒంటరిగానే ధర్మాచరణ చేయాలి. ధర్మాచరణలో ఎవ్వరి సహాయమూ అవసరం లేదు. ఎవరో సహకరించటానికి వచ్చినా ఏం చేయగలుగుతారు ?** ధర్మమే మానవులకు బీజం. అదియే స్వర్గంలో దేవతలకు అమృతం. ధర్మపరులు మరణానంతరం ధర్మంవలననే సుఖాల ననుభవిస్తారు.'

194. అధ్యాత్మజ్ఞాన కథనము.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'పితామహా ! ఇహలోకంలో శాస్త్రాలలో మనుషులు అధ్యాత్మమంటూ ఆలోచనలు చేస్తున్నారు. అధ్యాత్మజ్ఞానమంటే ఏమిటి ? ఎలా ? నాకు చెప్పు. బ్రహ్మ స్వరూపా ! స్థావర జంగమాత్మక మయిన ఈ సృష్టి దేనినుండి వచ్చింది ? ప్రలయకాలంలో ఎటు పోతుంది ? దానిని నాకు చెప్పాలి.' భీష్ముడు డిలా చెప్తున్నాడు. 'నాయనా ! పార్థా ! అధ్యాత్మాన్ని గురించి నన్ను అడుగుతున్నావు. దానిని గురించి వివరిస్తాను. అది శ్రేయస్కరమూ, సుఖరూపమూ కూడా. ఆచార్యులు సృష్టి ప్రలయాలతో కూడా అధ్యాత్మ జ్ఞానాన్ని గూర్చి చర్చించారు. ఆ జ్ఞానాన్ని పొందిన పురుషుడు ఇహలోకంలో ప్రీతిని, సౌఖ్యాన్ని పొందుతాడు. అభీష్టఫలాలు కూడా పొందగలడు. ఆ అధ్యాత్మజ్ఞానం సర్వప్రాణులకూ హితకరం. పృథివి, వాయువు, ఆకాశం, జలం, తేజస్సు- ఈ అయిదు పంచమహా భూతాలు. ఇవియే ప్రాణుల ఉత్పత్తి వినాశ స్థానాలు. **పరమాత్మ నుండి ఉద్భవించిన ఈ మహాభూతాలు సర్వప్రాణులతో సహా కడలిలోని అలలవలె మాటిమాటికి ఆ పరమాత్మలోనే లీన మవుతుంటాయి. తాబేలు తన అవయవాలను**

చాపి, మరల ముడుచుకొంటుంది. అదే విధంగా సర్వభూతాత్మ అయిన పరమాత్మ తాను సృష్టించిన భూతాలను తనలో లీనం చేసికొంటాడు. పరమాత్మ ఈ పంచభూతాలను సర్వప్రాణులలోను ప్రతిష్ఠించాడు. అయితే సమానంగా కాదు. కానీ ఆ వైషమ్యాన్ని జీవుడు గ్రహింపలేడు. శబ్దం, చెవి, సర్వరంధ్రాలు–ఈ మూడు ఆకాశం కారణంగా ఏర్పడినవి. స్పర్శ, చేష్ట, చర్మం– ఈ మూడు వాయువువలన ఏర్పడినవి. రూపమూ, కన్ను, పాకమూ ఈ మూడు తేజస్సుకు సంబంధించినవి. రసమూ, ఆర్ద్రత, నాలుక– ఈ మూడు జలగుణాలు. వాసన, ముక్కు, శరీరమూ– ఈ మూడు పృథివీగుణాలు. ఈ అయిదు మహాభూతాలు. మనస్సు ఆరవభూతం. భారతా ! ఇంద్రియాలూ, మనస్సు ఇవి విషయ జ్ఞానాన్ని కల్గించేవి. బుద్ధి ఏడవది. క్షేత్రజ్ఞుడు ఎనిమిదవ వాడు. నేత్రాదులు విషయాలను గ్రహిస్తాయి. మనస్సు సంకల్పవికల్పాత్మకం. బుద్ధి నిశ్చయజ్ఞానాన్ని కలిగించేది. క్షేత్రజ్ఞుడు సాక్షిమాత్రుడు. పాదాలనుండి తలదాకా ఉన్న ఈ శరీరాన్ని పైనుండీ క్రింది దాకా అన్నివైపులా చూస్తుంటాడు జీవుడు. శరీరం లోపలా, బయటా అంతా వ్యాపించి ఉంటాడు. దీనిని గ్రహించు.

మనుజులు ఈ ఇంద్రియాలను గురించి పూర్తిగా గ్రహించాలి. సత్త్వరజస్తమోగుణాలు వాటిని ఆశ్రయించి ఉంటాయి. **మనుజుడు తన బుద్ధిబలంతో జీవేంద్రియాల రాకపోకలను గ్రహించి, మెల్లమెల్లగా వాటిని చక్కగా పరిశీలించి, ప్రశాంతిని పొందగలడు.** గుణాలు బుద్ధిని పదే పదే విషయాల వైపు కొనిపోతాయి. బుద్ధితోపాటు మనస్సును, పంచేంద్రియాలను వాటి ప్రవృత్తులను విషయాలవైపు లాగుతాయి. బుద్ధి లేకపోతే గుణాలకు ఉనికి లేదు. స్థావర జంగమాత్మక మయిన ఈ విశ్వమంతా బుద్ధితో పాటు పుట్టి, దానితోపాటు లయ మయిపోతుంది. కాబట్టి ఈ ప్రపంచమంతా బుద్ధిమయం. శ్రుతులుకూడా ఆ రీతిగానే నిర్దేశిస్తాయి. బుద్ధి దేని ద్వారా చూస్తుందో అది కన్ను. దేనితో వింటుందో అది చెవి. దేనితో వాసన చూస్తుందో అది ముక్కు. అది నాలుక ద్వారా రసాన్ని గ్రహిస్తుంది. బుద్ధి చర్మంద్వారా స్పర్శను అనుభవిస్తుంది. ఈ రీతిగా బుద్ధి మాటిమాటికి వికారాలు పొందుతుంది. దేనినైనా కోరుకొనే సమయంలో అది మనోరూపాన్ని ధరిస్తుంది. విషయాలను గ్రహించటానికి బుద్ధికి అయిదు అధిష్ఠానాలున్నాయి. వాటినే ఇంద్రియాలంటాము. అదృశ్యంగా ఉన్నా జీవుడు ఇంద్రియాలకు ప్రేరకుడు. బుద్ధి జీవాత్మను ఆశ్రయించి మూడు భావాలలో ప్రవర్తిస్తుంది. ఒకప్పుడు ఆనందిస్తుంది. ఒకప్పుడు బాధపడుతుంది. ఒకప్పుడు సుఖ దుఃఖాల కతీతంగా మోహపరవశమై ఉంటుంది. ఈ రీతిగా బుద్ధి మనుజుల మనస్సులలో మూడు భావాలలో నిలిచి ఉంటుంది.

భావాత్మకమయిన ఈ బుద్ధి ఈ మూడు భావాలను అతిక్రమించి, కూడా సమాధిస్థితిలో నిలువగలుగుతుంది. అది నదీవల్లభుడైన సాగరుడు తన అలలతో తీరాన్ని దాటడం వంటిది. సుఖ దుఃఖ మోహాలను అతిక్రమించిన బుద్ధి భావాత్మకమయిన మనస్సులో సూక్ష్మరూపంలో ఉంటుంది. సమాధి నుండి లేచిన తర్వాత ప్రవృత్తి రూప మయిన రజోగుణం బుద్ధిని అనుసరిస్తుంది. రజోగుణంతో కూడిన ఆ బుద్ధి ఇంద్రియాలను నడిపిస్తుంది. దానినుండి విషయ సంబంధంవలన ప్రీతి (సత్త్వగుణం), ఆసక్తి దోషం వలన తమోగుణం ఏర్పడుతాయి. ప్రీతి సత్త్వగుణ కార్యం. శోకం రజోగుణ కార్యం. మోహం తమోగుణకార్యం. లోకంలోని భావాలన్నీ ఈ మూడింటిలోనే అంతర్భవిస్తాయి. భారతా ! ఈ ప్రకారంగా నేను నీకు బుద్ధిగతిని గురించి సమస్తం వివరించాను. బుద్ధిమంతుడు ఇంద్రియాలను అన్నింటినీ జయించాలి.

సత్త్వరజస్తమోగుణాలు మూడూ ఎప్పుడూ ప్రాణుల నాశ్రయించి ఉంటాయి. సర్వప్రాణులయందు సాత్త్విక, రాజస, తామసరూప మయిన త్రివిధవేదన కనిపిస్తుంది. సత్త్వగుణం సుఖానుభూతిని, రజోగుణం దుఃఖానుభూతిని కలిగిస్తాయి. సత్త్వరజోగుణాలు తమోగుణంతో కలిసినపుడు సుఖదుఃఖ వ్యవహార ముండదు. కేవలం మోహం మిగులుతుంది. శరీరంలో కానీ, మనస్సులో కానీ ప్రీతి కలిగితే అది సాత్త్విక భావోదయ మని చెప్పాలి. అదే రీతిగా మనస్సులో దుఃఖమయ మయిన అనిష్టభావం కలిగితే దాన్ని రజోగుణప్రవృత్తిగా భావించాలి. ఆ దుఃఖవేళలో మనస్సు చింతకు లోను కారాదు. మనస్సులో మోహం జనించి, ఇంద్రియవిషయంలో అస్పష్టత ఏర్పడి, ఏ తర్కానికీ లొంగని, ఏరీతిగానూ అర్థం కాని స్థితి ఏర్పడితే దానిని తమోగుణ ప్రవృత్తిగా భావించాలి. ఏ రీతిగా అయినా మనస్సులో హర్షం, ప్రేమ, ఆనందం, సుఖం, ప్రశాంతత అనుభవానికి వస్తే వానిని సాత్త్విక గుణాలుగా గ్రహించాలి. అసంతృప్తి, పరితాపం, శోకం, లోభం, అసహనం- ఇవి రజోగుణ చిహ్నాలు. అవి సకారణంగానూ, నిష్కారణంగానూ కలుగుతాయి. ఏ రీతిగానయినా అవమానం, మోహం, ప్రమత్తత, స్వప్నం, అలసత కలిసి ఉంటే అవన్నీ తమోగుణరూపాలని తెలిసికోవాలి. మనస్సు ఎంతో దూరం వెళుతుంది. ఎన్నో విధాలుగా నడుస్తుంది. అది కోరికలకు నెలవు. సంశయాలకు ఆకరం. అటువంటి మనస్సును చక్కగా నియంత్రించుకొనినవాడు ఇహ పరలోకాలలో సుఖిస్తాడు. సత్త్వం, క్షేత్రజ్ఞుడు ఇవి రెండూ సూక్ష్మతత్త్వాలు. అయినా వాటి మధ్య భేదముంది. గమనించు, సత్త్వం గుణాలను సృష్టిస్తుంది. క్షేత్రజ్ఞుడు గుణాలను సృష్టించడు. మేడిపండు, దానిలోని కీటకాలు ఎప్పుడూ ఒకేచోట ఉంటాయి. అయినా వాటి ఉనికి విడివిడిగానే. అలాగే సత్త్వం (బుద్ధి),

క్షేత్రజ్ఞుడు (ఆత్మ) ఒకే చోట ఉన్నా వేరువేరుగానే వాటిని భావించాలి. చేప ఎప్పుడూ నీటిలోనే నీటితో కలిసి ఉంటుంది. అయినా అవి రెండు వేరువేరే. అదే రీతిగా బుద్ధి, ఆత్మ స్వాభావికంగా కలిసి ఉన్నా అవి రెండూ భిన్నపదార్థాలే. గుణాలు ఆత్మను తెలియలేవు. కానీ చైతన్య రూపమైన ఆత్మ గుణాలను పూర్తిగా గ్రహిస్తుంది. అది గుణాలకు సాక్షిమాత్రమే అయితే గుణాలతో కలిసి ఉన్నట్లు తనను తాను భావిస్తుంది.

గదిలోని దీపం గదికున్న రంధ్రాలద్వారా కాంతిని ప్రసరింపజేసి, వస్తువును గ్రహించినట్లు ఆత్మకూడా జ్ఞానచేష్టా శూన్యాలయిన ఏడు ఇంద్రియాల (పంచేంద్రియాలు, మనస్సు, బుద్ధి) పదార్థానుభవాన్ని పొందుతుంది. బుద్ధి గుణాలను సృష్టిస్తుంది. ఆత్మ సాక్షియై వాటిని చూస్తుంది. బుద్ధి క్షేత్రజ్ఞుల ఈ కలయిక అనాదిగా ఉన్నది. బుద్ధికి క్షేత్రజ్ఞుడు తప్ప మరొక ఆశ్రయం లేదు. క్షేత్రజ్ఞునకు బుద్ధి తప్ప మరొక ఆశ్రయం లేదు. బుద్ధి మనస్సుతో సంబంధం కలిగి ఉంటుంది. గుణాలతో దానికి ప్రత్యక్ష సంబంధం లేదు. **బుద్ధి సారథి. మనస్సు కళ్ళెం. వీటితో జీవుడు ఇంద్రియా లనే అశ్వాలను చక్కగా నియంత్రిస్తాడు. అప్పుడు ఘటంలో ప్రకాశించే దీపంవలె జీవునిలోని ఆత్మ ప్రకాశిస్తుంది.** సాంసారిక కర్మలను పరిత్యజించి ఎప్పుడూ తనయందే అనురక్తుడయిన ముని సర్వభూతాత్మ స్వరూపుడై ఉత్తమ గతిని పొందుతాడు. **జలచరమయిన పక్షి నీటిలో తిరిగినా నీరంటనట్లు జ్ఞాని అయిన మనుజుడు కూడా నిర్లిప్తతతోనే సర్వప్రాణుల మధ్య సంచరిస్తాడు. ఇదే రీతిగా ఈ ఆత్మతత్వం కూడా నిర్లిప్తమయినది. ఈ అంశాన్ని తన బుద్ధితో గ్రహించిన జ్ఞాని హర్షశోక మాత్సర్యరహితుడై సర్వసమభావంతో సంచరించాలి.** ఆత్మ స్వస్వరూపంతో ఉండియే సదాగుణాలను సృష్టిస్తాడు. అది సాలెపురుగు దారాలను సృష్టించడం వంటిది. ఈ గుణాలన్నీ సాలెపురుగు సృష్టించిన దారాలవంటివే. ఆత్మ సాక్షాత్కారం తర్వాత కూడా గుణాలు వెనుదిరగవు. గుణ నివృత్తి ప్రత్యక్షంగా కనిపించదు. అనుమాన ప్రమాణం చేతనే అది సిద్ధిస్తుంది. కొందరు ఇలా భావిస్తారు. మరికొందరు గుణ నివృత్తిని అంగీకరిస్తారు. రెండింటినీ చక్కగా ఆలోచించి స్వబుద్ధిని అనుసరించి నిర్ణయించుకోవాలి. బుద్ధి ద్వారా కల్పించబడిన ఈ భేదాలు హృదయానికి ముడివంటివి. ఆ హృదయగ్రంధిని విప్పుకొని సంశయరహితుడై, జ్ఞాని సుఖంగా జీవించాలి. ఎప్పుడూ దుఃఖించకూడదు. మైలపడిన మానవులు నిండైన నదిలో స్నానంచేసి, శుద్ధిని పొందినట్లే జ్ఞాననదిలో మునిగిన మలినచిత్తులు కూడా పరిశుద్ధులై జ్ఞానసంపన్నులు కాగలరని తెలుసుకో.

మహానది ఆవలితీరం తెలిసినంత మాత్రాన మనిషి సఫలుడు కాలేడు. దానిని

దాటేదాకా విచారిస్తూనే ఉంటాడు. కాని తత్త్వజ్ఞుడైన మనిషి జ్ఞానం వలననే సంసార సాగరాన్ని తరించగలడు. ఇక్కడ జ్ఞానమే ఫల స్వరూపం. **బుద్ధిద్వారా ప్రాణుల గమనాగమనాలను గూర్చి మెల్ల మెల్లగా ఆలోచించి, గ్రహింపగలవాడు ఉత్తమ మయిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొంది, పరమశాంతిని కూడా పొందగలడు.** ధర్మార్థ కామాల స్వరూపాన్ని తెలిసికొని, వాటిని గూర్చి చక్కగా ఆలోచించి, వాటికి దూరమైన మనస్సుతో ఆత్మతత్త్వాన్ని అనుసంధానం చేసి యోగియై, ఆత్మేతర విషయాలపై అనాసక్తుడైన వాడు తత్త్వదర్శి. ఇంద్రియాలు భిన్నభిన్న విషయాలపై ప్రసరించే స్వభావం గలవి. వాటిని నివారించటం కష్టం. మనస్సును అదుపు చేయలేనివాడు అటువంటి ఇంద్రియాల ద్వారా ఆత్మ సాక్షాత్కారాన్ని పొందలేడు. దీనిని తెలిసికోవటమే జ్ఞానం. జ్ఞానానికి దీనికన్న వేరు లక్షణం లేదు. బుద్ధిమంతులు ఆ పరమాత్మ తత్త్వాన్ని తెలిసికొని, తమను తాము కృతకృత్యులనుగా భావిస్తారు. **అజ్ఞానులు తీవ్రంగా భయపడే సంసారాన్ని గూర్చి జ్ఞానులకు భయ ముండదు. జ్ఞాను లందరికీ ఒకేవిధమైన ఫల ముంటుంది. గుణభేద మున్నపుడే ఫల భేదం. జ్ఞానులు గుణ భేదం లేనివారు. నిష్కామభావనతో చేసినకర్మ, గత జన్మలలో ఆ కర్త చేసిన కర్మ సంస్కారాలను కూడా నశింపజేస్తుంది. గత జన్మలోనూ, ఈ జన్మలోనూ ఆ కర్త చేసిన కర్మల ఫలితం అతనికి ప్రియమూ కాదూ, అప్రియమూ కాదు.** ఆతురుడైన వానిని జ్ఞానులు ధిక్కరిస్తారు. అటువంటి వాడు చేసిన ఆ దుష్కర్మ అతనికి అన్నిజాతులలోనూ జన్మ కల్గిస్తుంది. లోకంలో ఆతురుడైన వాడు అంతా కోల్పోయి, శోకంతో ఆక్రోశిస్తాడు. ఆ దుస్థితిని చూడు. సజ్జనులు పాటించే సగుణోపాసన, నిర్గుణోపాసనల ఫలాన్ని గ్రహించిన వాడు శోకరహితుడై, కుశలుడై జీవించటాన్ని కూడా చూడు.'

195. ధ్యానయోగ వర్ణన.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'పార్థా ! నీకిక నాలుగు విధాలయిన ధ్యానయోగాన్ని గురించి చెప్తాను. దానిని గ్రహించియే మహర్షులు శాశ్వతసిద్ధిని పొందగలుగుతున్నారు. మోక్షంపై మనస్సును పెట్టి, జ్ఞానతృప్తులై యోగులయిన మహర్షులు ధ్యానాన్ని చక్కగా అనుష్ఠించటానికి అనువయిన మార్గాలను అవలంబించారు. కౌంతేయా ! సాంసారిక దోషాలనుండి విముక్తులై, జననదోష రహితులై, పరమాత్మ స్వరూపాన నిలిచిన ఆ మహర్షులు పునర్జన్మను పొందరు. ధ్యానయోగ సాధకులు ద్వంద్వరహితులు, నిత్యమూ సత్త్వగుణ సంపన్నులు, దోషరహితులు, నియమవంతులు కావాలి. సంగరహితులయి,

ధ్యానవిరోధులు కాక, మనః శాంతిని కల్గించగల ఇంద్రియాలను ఒక్కటిచేసి, కట్టివలె స్థిరంగా నిలిచి, ముని మనస్సును ఏకాగ్రం చేసి పరమాత్మ ధ్యానంలో నిలపాలి. **సమర్థుడైన యోగవేత్త ధ్యానవేళలో చెవితో శబ్దం వినరాదు. చర్మంతో స్పర్శను గ్రహించరాదు. కంటితో రూపాన్ని చూడరాదు. నాలుకతో రసాలను తెలియరాదు. ఎటువంటి వాసనలను చూడరాదు. ఇంద్రియాలను మథించే విషయాలను మనసా కూడా భావించరాదు.** ఆ తర్వాత విచక్షణుడైన యోగి పంచేంద్రియాలను మనస్సులో స్థిరం చేయాలి. ఆ తర్వాత పంచేంద్రియాలతో పాటు చంచలమయిన మనస్సును పరమాత్మధ్యానంలో నిలపాలి. మనస్సు నానావిధాలుగా సంచరించేది. ఆలంబనం లేనిది. పంచేంద్రియాలనే ద్వారాలు గలది. చాలా చంచల మయినది. అటువంటి మనస్సును ధీరుడైన యోగి ధ్యానమార్గంలో తనలో లగ్నం చేయాలి. **యోగి ఇంద్రియాలతో సహా మనస్సును ఏకాగ్రం చేయటం ధ్యానమార్గంలో మొదలు. నేను ధ్యానమార్గంలో తొలిధ్యాన మార్గాన్ని వర్ణించి చెప్పాను.**

ఈ రీతిగా ప్రయత్నించి ఇంద్రియ సహితమైన మనస్సు కొంతసేపు స్థిరంగా ఉంటుంది. ఆ తరువాత మేఘంలోని మెరుపులాగా వీలుచిక్కగానే మరల ఇంద్రియాలవైపు చలిస్తుంది. **ఆకు మీద పడిన నీటి బొట్టు నిలకడలేక అంతటా కదులుతున్నట్లు ధ్యానమార్గంలో ఉన్న వాని మనస్సు కూడా అంతటా కదులుతుంటుంది.** ఏకాగ్రమయిన తర్వాత క్షణకాలం ధ్యానమార్గంలో నిలకడగా నిలుస్తుంది. ఆ పై మరల నాడీ మార్గంలో ప్రవేశించి, భ్రాంతిపడి, గాలివలె చలిస్తుంటుంది. ధ్యానయోగ మెరిగినవాడు మనస్సు చలించిన వేళలో బాధ పడకుండా, కష్టపడకుండా, అలసత లేకుండా, మాత్సర్యం లేకుండా మరల ధ్యానంలో మనస్సును లగ్నం చేయాలి. ధ్యానాన్ని ఆరంభించిన యోగికి ముందుగా మనస్సులో ధ్యానసంబంధ మయిన విచారం, వివేకం, వితర్కం కలుగుతాయి. ధ్యానసమయంలో మనస్సు కష్టపడినా యోగి నిర్వేదానికి లోనుకారాదు. ఇంకా ఏకాగ్రతతో సాధన చేయాలి. ఆత్మహితానికై ప్రయత్నించాలి. దుమ్ము, బూడిద, ఎండిన పేడపొడి- వీటిని కుప్పలుగా పోసి, ఒకేసారిగా నీటిని క్రుమ్మరించినా కొంతమేర తడుస్తాయి కానీ పూర్తిగా తడవవు. కొంచెం కొంచెంగా మెల్లగా తడుపుతూ ఉంటే అవి ముద్ద అవుతాయి. అదే రీతిగా ఇంద్రియసముదాయాన్ని కూడా మెల్లమెల్లగా విషయాలవైపు నుండి మరలించాలి. మనస్సును ధ్యానంవైపు క్రమంగా నడిపించాలి. అప్పుడే చిత్తశాంతి లభిస్తుంది. భారతా ! యోగి స్వయంగా మనస్సును, పంచేంద్రియాలను ధ్యానమార్గంలో నిలపాలి. ఆపై ధ్యానయోగాన్ని నిత్యమూ అభ్యాసం చేస్తూ శాంతిని పొందవచ్చు. **ఈ రీతిగా**

మనోనిగ్రహంతో ధ్యానయోగి పొందే సుఖం మరే పురుషప్రయత్నంవలన కానీ, మరే అదృష్టయోగంవలన కానీ సిద్ధించదు. ఈ సుఖాన్ని అనుభవించిన యోగి మరింతగా ధ్యానయోగంపై ఆసక్తిని పెంచుకొంటాడు. తద్వారా యోగులు శోకరహితమయిన నిర్వాణ పదాన్ని పొందుతారు.'

196. జాపకోపాఖ్యానము - 1.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. 'నాకు నాలుగు ఆశ్రమాలను గురించి రాజధర్మాలను గురించి తెలియజేశావు. అలాగే వివిధ విషయాలకు సంబంధించిన భిన్న భిన్న కథల నెన్నింటినో చెప్పావు. ధీమంతుడా ! ధర్మ సంగతాలయిన కథలను నీ ద్వారా విన్న తరువాత నాకొక సందేహం కలుగుతోంది. దానిని తమరు తీర్చాలి. భరతనందనా ! జపతత్పరులయినవారు పొందగల ఫలాన్ని గూర్చి వినగోరుతున్నాను. జపించేవారు పొందే ఫలిత మేమిటి ? జపతత్పరులు ఏ లోకాలను అధిష్ఠించగలరు ? అనఘా ! జపాన్ని గూర్చిన సంపూర్ణవిధానాన్ని నాకు చెప్పాలి. జాపకులు అనగా ఎవరు ? ఇది సాంఖ్య యోగమా ? ధ్యానయోగమా ? క్రియాయోగమా ? లేక జపమన్నది యాగ విధియా ? జపింపబడేది ఏది ? ఇదంతా నాకు చెప్పు. నీవు సర్వజ్ఞ డవని నా అభిప్రాయం.'

భీష్ముడిలా చెప్తున్నాడు. 'పూర్వకాలంలో యమునకు, కాలునకు, బ్రాహ్మణునకు మధ్య జరిగిన సంఘటన ఈ సందర్భంగా ఉదాహరిస్తారు. మోక్షద్రష్ట లయిన మునులు సాంఖ్య యోగాలను చెప్పారు. వాటిలో సాంఖ్యంలో జపపరిత్యాగాన్నే ప్రకటించారు. ఉపనిషత్తులు పరమానందాన్ని, శాంతిని, బ్రహ్మనిష్ఠను బోధించేవి. వాటిలో జపప్రసక్తి లేదు. సమదర్శు లయిన మునులు బోధించిన సాంఖ్యయోగాలు జ్ఞానప్రాప్తి మార్గాలు. కాబట్టి అవి జపాన్ని ఆశ్రయించవచ్చు. ఆశ్రయించకపోవచ్చు కూడా. రాజా ! దీనికి సంబంధించి లోకంలో ఉన్న కారణాన్ని తరువాత చెపుతాను. సాంఖ్య యోగాలు రెండింటిలోనూ మనస్సమాధి, ఇంద్రియనిగ్రహమూ ఆవశ్యక మయిన అంశాలు. సత్యమూ, అగ్నిహోత్రమూ, ఏకాంత సేవనమూ, ధ్యానమూ, తపస్సు, దమమూ, సహనమూ, అనసూయత, మితాహారమూ, విషయ సంకోచమూ, మిత భాషణమూ, శమమూ - ఇవి ప్రవృత్తి మార్గయజ్ఞం. ఇక నివృత్తి యజ్ఞాన్ని గూర్చి విను. దీనిలో జపిస్తున్న సాధకుని కర్మలన్ని నివర్తిస్తారు. ప్రవృత్తిమార్గంలో ముందు చెప్పిన లక్షణాల నన్నింటినీ నిష్కామ దృష్టితో అనుసరిస్తూ, ప్రవృత్తికి భిన్నమయిన నివృత్తి మార్గానికి మరలించాలి. నివృత్తి మార్గం వ్యక్తమూ, అవ్యక్తమూ, అనాశ్రయమూ అని మూడు విధాలు.

జాపకుడు దర్భాసనంపై కూర్చొని, దర్భలను చేతబట్టి, శిఖను దర్భలతో ముడివేసి, చుట్టూ దర్భలనుంచుకొని, మధ్య భాగంలో కూడా దర్భలతో కప్పాలి. విషయాలకు నమస్కరించాలి. విషయాలను గూర్చి ఆలోచించరాదు. మనస్సులో సమతాభావాన్ని కుదుర్చుకొని మనస్సును మనస్సులోనే లీనం చేయాలి. బుద్ధిమార్గంలో పరబ్రహ్మనే ధ్యానం చేస్తూ హితకారిణి అయిన వేద సంహితను జపించాలి. ఆ పై సమాధి కుదిరిన తర్వాత ఆ సంహితాజపాన్ని కూడా పరిత్యజించాలి. సంహితాజపం వలన పొందిన బలాన్ని ఆశ్రయించి, సాధకుడు ధ్యానసిద్ధిని పొందగలడు. శుద్ధచిత్తుడై తపస్సుతో ఇంద్రియాలను జయించి రాగద్వేషాలకు, కామ మోహాలకు, శీతోష్ణాది ద్వంద్వాలకు దూరమవుతాడు. అప్పుడు శోకమూ ఉండదు. ఆసక్తి ఉండదు, కారణాలకు కానీ, కార్యాలకు కానీ తాను కర్తకాడు. మనస్సు నెప్పుడూ అహంకారంతో ప్రవర్తింపజేయరాదు. స్వప్రయోజనసాధనలో లగ్నం కారాదు. ఎవ్వరినీ అవమానింప దగదు. క్రియాశూన్యంగా ఎప్పుడూ ఉండకూడదు. ధ్యానక్రియాపరుడై, ధ్యానియై, ధ్యాననిష్ఠుడై, ధ్యానమార్గం ద్వారా తత్త్వ నిశ్చయాన్ని పొంది, ధ్యానంలోనే సమాధి స్థితిని పొంది, క్రమంగా ధ్యానకర్మను కూడా విడనాడాలి. ఆ స్థితిలో ఆ యోగి అన్నింటినీ విడనాడిన సుఖాన్ని పొందగలడు. దేని మీదనూ కోరికలు లేక ప్రాణాలను పరిత్యజించి, పరమాత్మ స్వరూపంలో ప్రవేశిస్తాడు. అలాకాక బ్రహ్మసాయుజ్యం కూడా ఇష్టం లేకపోతే దేవయాన మార్గంలో ఊర్ధ్వలోకాలకు చేరుతాడు. మరల జన్మ ఉండదు. ఆత్మజ్ఞాన సిద్ధివలన రజోహీనుడై, నిర్మలుడై, శాంతి స్వరూపుడై, నిరామయుడైన ఆ యోగి అమృత స్వరూపమైన శుద్ధపరమాత్మను పొందగలడు.

197. జాపకోపాఖ్యానము - 2.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. 'జాపకులు గతులలో ఉత్తమగతినే పొందుతారన్నావు. వారి కది యొక్కటియే ప్రాప్తిస్థానమా ? మరేవయినా గతులున్నాయా ?' భీష్ముడిలా చెప్తున్నాడు. 'రాజా ! పురుషశ్రేష్ఠా ! సావధానుడవై జాపకుల గతిని గురించి విను. వారు చాలా నరకాలను పొందటాన్ని గురించి ఇప్పుడు చెప్తున్నాను. **ఇంతకు ముందు చెప్పిన నియమాలను పూర్తిగా అనుష్ఠించక, కొంత భాగాన్ని మాత్రమే పాటించిన జాపకుడు నరకంలో పడతాడు. జపంమీద ప్రేమ కానీ, ప్రసన్నదృష్టి కానీ లేక అవహేళనాత్మకంగా జపించే జాపకుడు నరకానికే వెళతాడు. ఈ విషయంలో సందేహం లేదు. జపకారణంగా అహంకరించే వారందరూ నరకానికే పోతారు. ఇతరులను అవమానించే జాపకుడు కూడా నరకానికే వెళతాడు. మోహంతో**

ఫలకామనను మనస్సులో నుంచుకొని జపించేవాడు, తాను కోరినకోరికకు అనుగుణ మయిన నరకాన్ని పొందుతాడు. జాపకునకు జపఫలంగా ఐశ్వర్యం సిద్ధించినప్పుడు దానిపై అనురక్తిని పొందినవాడు నరకాన్ని పొందుతాడు. దాని నుండి విముక్తిని పొందలేడు. జాపకుడు మోహంతో విషయాసక్తితో జపాన్ని చేస్తే, ఫలాపక్తికి అనుగుణ మయిన శరీరంతో మరలా జన్మిస్తాడు. దుర్బుద్ధి, అవివేకశీలుడూ అయి చంచలమనస్సుతో జపించిన జాపకుడు అస్థిరస్థితినే పొందుతాడు. లేదా నరకంలో పడతాడు. అవివేకియై, మూఢుడై మోహానికి లోనయిన జాపకుడు మోహంకారణంగా నరకానికి వెళతాడు. అక్కడ దుఃఖిస్తాడు. గట్టిపట్టుతో అనుష్ఠానం చేస్తానని నిర్ణయం తీసికొని, జపాన్ని ప్రారంభించిన జాపకుడు దానిని పూర్తిచేయలేక పోయినా, దానిపై లగ్నం కాలేక పోయినా నరకానికే వెళతాడు.' యుధిష్ఠిరుడు అడిగాడు. 'అవ్యక్త సనాతన పరబ్రహ్మ స్వరూప మయిన గాయత్రిని జపించిన జాపకుడు ఏ కారణంవలన మరలా జన్మిస్తాడు?' భీష్ముడు ఇలా చెప్తున్నాడు. 'కామాది దోషాలతో బుద్ధి కలుషితమైనపుడు కలిగే వివిధ నరకాలను, జన్మలను గురించి చెప్పాను. వాస్తవంగా జపం ప్రశస్తమయినదే. దోషాలు మాత్రం బుద్ధికి సంబంధించినవి.'

198. జాపకోపాఖ్యానము - 3.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. 'రాజా ! జాపకుడు తన దోషాలవలన ఎటువంటి నరకాలకు వెళతాడు ? నాకు వివరించి చెప్పు. తెలుసు కోవాలని నాకు కుతూహలంగా ఉంది. చెప్పదగినవాడవు నీవే.' భీష్ముడిలా చెప్తున్నాడు. 'అనఘా ! నీవు యమధర్మరాజు అంశతో పుట్టినవాడవు. స్వభావం చేతనే నీవు ధర్మిష్ఠుడవు. ధర్మమూల మయిన వేదాన్నీ, పరమాత్మనూ అనుసరించిన మాట చెపుతాను. సావధానంగా విను. పరమ బుద్ధిమంతు లయిన దేవతల క్రీడాస్థానాలు అనేక రూపాలతో, వివిధ వర్ణాలతో, వివిధ ఫలాలతో కూడినవి. కామచారు లయిన దేవతల దివ్యవిమానాలు, దివ్య సభాస్థలాలు ఇక్కడ శోభిల్లుతాయి. కాంచన పద్మలతలు గల జలక్రీడా ప్రదేశాలు ఇక్కడుంటాయి. ఇంద్ర, యమ, వరుణ, కుబేరులు లోకపాలకులు. వారి లోకాలూ; శుక్రుడు, బృహస్పతి, మరుత్తులు, విశ్వేదేవులు, సాధ్యులు, అశ్వినులు, రుద్రులు, ఆదిత్యులు, వసువులు, ఇతర దేవతల లోకాలూ పరమాత్మ పరమధామంముందు నరకం వంటివే. పరమాత్మ సన్నిధిలో భయంలేదు. ఆస్థితి అనిమిత్తం కాబట్టి వశించదు. అక్కడ క్లేశాలుండవు. రెండింటి నుండి, మూడింటినుండి, ఎనిమిదిటి నుండి,

మూడింటి నుండి అది ముక్తి వందినది.* ఆ పరమపదంలో నాలుగు లక్షణా లుండవు. నాలుగు కారణాలు ఉండవు. అక్కడ తృప్తి ఉండదు, ఆనందము ఉండదు. శోకమూ ఉండదు, శ్రమా ఉండదు.** కాలం అక్కడ నుండియే పుడుతుంది. కాలమే అక్కడ ప్రభువు. రాజా ! ఆ పరమాత్మ కాలానికీ, స్వర్గానికీ కూడా అధిపతి. ఆత్మకైవల్యాన్ని పొందిన మనిషి ఆ పరంధామాన్ని చేరి, శోకవిముక్తు డవుతాడు. పరమపద మిటువంటిది. దీని ముందు సుఖాస్పదస్థానాలుగా ముందు చెప్పిన వన్నీ నరకసదృశాలే. రాజా ! ఈ రీతిగా నీకు నరకాలను గురించిన విషయ మంతా యథాతథంగా చెప్పాను. ఆ పరమపదం ముందు అన్ని లోకాలు నరకాలే.'

199. జాపకోపాఖ్యానము - 4.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'కాలమూ, మృత్యువూ, యముడూ, ఇక్ష్వాకువు, బ్రాహ్మణుడు - వీరి మధ్య వివాదమంటూ ఇంతకు ముందన్నావు కదా ! దానిని వివరించవలసినది.' భీష్ముడిలా చెప్పున్నాడు. 'ఈ విషయానికి సంబంధించిన ప్రాచీనేతిహాస మొకటుంది. ఇక్ష్వాకుమహారాజు, యముడు, బ్రాహ్మణుడు, కాలుడు, మృత్యువు - వీరి మధ్య జరిగిన సంవాదరూపమది. అది ఎక్కడ ఎలా జరిగిందో చెపుతాను విను. హిమాలయపర్వతాలకు దగ్గరలో మహాయశస్వి, ధర్మవర్తనుడు అయిన ఒక బ్రాహ్మణు డుండేవాడు. పిప్పలాదుని కొడుకు, కౌశిక వంశోత్పన్నుడు అయిన ఆ జాపకుడు మహాప్రాజ్ఞుడు, వేదపండితుడు. వేదాంగవిజ్ఞానం ఆయనకు గోచరించింది. కాబట్టి ఆరువేదాంగాలలో ఆయన పండితుడు. ఆ బ్రాహ్మణుడు నియతేంద్రియుడై సార్థకంగా సంహితను జపిస్తూ, బ్రాహ్మణోచితంగా తపస్సు చేశాడు. ఆ రీతిగా నియమపూర్వకంగా జపతపాలు చేస్తుండగానే వేయిసంవత్సరాలు గడిచిపోయాయి. ఆయన జపానికి సంతసించి సావిత్రి సాక్షాత్కరించి "నేను ప్రీతిచెందాను" అన్నదట. కానీ ఆయన జపాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. గాయత్రీదేవీ

---

* *వి॥సం॥ రెండు = ప్రియం, అప్రియం మూడు = సత్త్వం, రజస్సు, తమస్సు*
ఎనిమిది = పంచభూతాలు, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, ఉపాసన, కర్మ, ప్రాణం, అవిద్య
భూతేంద్రియమనోబుద్ధి వాసనా కర్మవాయవః ।
అవిద్యా చేత్యముం వర్గమాహుః పుర్యష్టకం బుధాః ॥
మూడు = జ్ఞానం, జ్ఞేయం, జ్ఞాత (నీల)

** *వి॥సం॥ నాలుగు లక్షణాలు = దృష్టి, శ్రుతి, మతి, విజ్ఞాతి*
నాలుగు కారణాలు = ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం.

సాక్షాత్కారాన్ని పట్టించుకొనలేదు. ఆమెకు బదులివ్వలేదు. గాయత్రీ దేవీ అతనిపై దయచూపింది. ఆయన ప్రవర్తనతో సంతృప్తి చెందింది. ఆయన చేస్తున్న జపాన్ని ఆ వేదమాత మనసా అభినందించింది. ఆ ధర్మాత్ముడు జపాన్ని ముగించి, లేచి, ఆమె పాదాలపై తలవాల్చి, ఈ రీతిగా పలికాడు. దేవీ ! నా భాగ్యంవలన నీవు ప్రసన్నురాలవయ్యావు. నాకు దర్శన మిచ్చావు. నా జపంతో, తపంతో సంతసించినదాన వయితే జపంపై నా మనస్సు కుదిరేటట్టు అనుగ్రహించు.'

సావిత్రి ఇలా అన్నది. 'బ్రహ్మర్షీ ! నీకేమి కావాలి ? నీకిష్టమయిన దేది ? చెప్పు. నేను అనుగ్రహిస్తాను. జాపకశ్రేష్ఠా ! ఏం కావాలో చెప్పు. నీ కోరికంతా తీరుతుంది.' ఆదేవి అలా అనగానే ధర్మవేత్త అయిన విప్రుడు ఈ రీతిగా పలికాడు. 'నాకు జపంపై ఆసక్తి ఎప్పటికప్పుడు వృద్ధి చెందాలి. కళ్యాణీ ! అనుదినమూ నా మనస్సమాధి వర్ధిల్లాలి.' సావిత్రీదేవి మధురవచనాలతో "అది అలాగే జరుగుతుంది" అన్నది. ఆయనకు మేలుచేయగోరిన సావిత్రి ఇంకా ఇలా అన్నది "ద్విజశ్రేష్ఠులు పొందే సాధారణలోకాలకు నీవు వెళ్ళవు. అనిమిత్తమూ, అనిందితమూ అయిన బ్రహ్మపదాన్ని పొందగలవు. నీవు నన్ను కోరినది అలాగే జరుగుతుంది. నియతితో, ఏకాగ్రతతో జపించు. ధర్ముడు నిన్ను సేవిస్తాడు. కాలుడు, మృత్యువు, యముడు - ముగ్గురూ నీ సన్నిధిలో ఉంటారు. వారితో నీకు ధర్మసంబంధమయిన చర్చకూడా జరుగుతుంది." భీష్మ డిలా చెప్తున్నాడు. 'ఈ రీతిగా పలికి సావిత్రీదేవి నిజనివాసానికి వెళ్ళింది. ఆ బ్రాహ్మణుడు కూడా నూరు దివ్య సంవత్సరాల పర్యంతం అలాగే జపాన్ని కొనసాగించాడు. ఆ విప్రుడు ఎల్లప్పుడూ ఇంద్రియ నిగ్రహం, సత్యసంధత, అనసూయత, క్రోధజయం కలిగి, ప్రవర్తించేవాడు. తన నియమాన్ని తాను పూర్తిచేసిన తరువాత ధర్ముడు ప్రసన్నుడై, ఆ ద్విజునకు సాక్షాత్కరించాడు.

ధర్మ :- బ్రాహ్మణా ! ఇటు చూడు. నేను ధర్ముడను. నిన్ను చూడదలచి వచ్చాను. ఈ జపానికి నీవేం ఫలితాన్ని పొందబోతున్నావో చెపుతాను. సజ్జనా ! నీవు దివ్య మానుషలోకాల నన్నింటినీ జయించావు. దేవలోకాల నన్నింటినీ అతిక్రమించి, నీవు వెళ్ళగలవు. మునీ ! ప్రాణత్యాగం చేసి నీ కభీష్టమయిన లోకాలకు వెళ్ళు. నీ శరీరాన్ని కూడా త్యజించిన పిదప నీ వా లోకాలను పొందగలవు.

బ్రాహ్మణ :- ధర్మా ! ఆ లోకాలన్నీ నాకెందుకు ? నీవు సుఖంగా వెళ్ళిపో ! ఈ శరీరంతో ఎన్నో దుఃఖాలనూ, ఎన్నో సుఖాలనూ అనుభవించాను. ప్రభూ ! దీనిని విడువలేను.

ధర్మ :- ముని శ్రేష్ఠా ! నీవు తప్పని సరిగా శరీరాన్ని పరిత్యజించాలి. అనఘా ! బ్రాహ్మణా ! స్వర్గలోకానికి వెళ్ళు. లేదా నీ కిష్టమయిన స్థానానికి వెళ్ళు.

బ్రాహ్మణ :- ప్రభూ ! ఈ దేహంలేని స్వర్గ నివాసం నాకిష్టంలేదు. ధర్మా ! వెళ్ళు. శరీరం లేకుండా స్వర్గానికి వెళ్ళటంపై నాకు శ్రద్ధలేదు.

ధర్మ :- ఈ దేహంమీద మనస్సు ఆసక్తి పడరాదు. దేహాన్ని వీడి సుఖాన్ని అనుభవించు. రజోహీన మయిన లోకాలకు వెళ్ళు. అక్కడకు వెళ్ళిన తరువాత దుఃఖ ముండదు.

బ్రాహ్మణ :- మహాభాగా ! జపం చేస్తూనే నేను ఆనందిస్తాను. సనాతన లోకాలు నాకవసరం లేదు. ప్రభూ ! నేను శరీరంతోపాటు స్వర్గానికి వెళ్ళాలి. వీలవుతుందో లేదో చెప్పు.

ధర్మ :- బ్రాహ్మణా ! నీవు శరీరాన్ని వీడటానికి ఇష్టపడకపోతే అటుచూడు. కాలుడూ, మృత్యువు, యముడూ నీ దగ్గరకు వచ్చారు.

భీష్మ డిలా అన్నాడు. 'అప్పుడు వైవస్వతుడు, మృత్యువు, కాలుడు ముగ్గురూ ఆ బ్రాహ్మణుని దగ్గరకు వచ్చి ఆ మహాభాగునితో ఇలా అన్నారు.' యము డిలా అన్నాడు. 'చక్కగా సాగించిన నీ తపస్సుకూ, నీ సత్ప్రవర్తనకూ తగిన ఉత్తమ ఫలం నీకు లభించింది. నేను యముడను నీ దగ్గరకే వచ్చి చెప్తున్నాను.' కాలు డిలా అన్నాడు. 'నీ జపానికి తగినట్లు నీవు ఉత్తమ ఫలితాన్ని పొందావు. నీకిది స్వర్గానికి వెళ్ళవలసిన కాలం. అది చెప్పటానికి కాలుడను నేను నీ దగ్గరకు వచ్చాను.'

మృత్యు విలా అన్నాడు. 'ధర్మజ్ఞా ! నేను మృత్యువును. గ్రహించు. రూపధారినై స్వయంగా వచ్చాను. విప్రా ! కాలప్రేరణచే నేను నిన్ను ఇక్కడ నుండి నేడు కొనిపోవటానికి వచ్చాను.'

బ్రాహ్మణ :- సూర్యసుతుడైన యమునకు, మహాత్ముడైన కాలునకు, మృత్యువునకు, ధర్మునకు స్వాగతం. మీకోసం నేనేమి చేయాలి ?

భీష్ముడిలా అన్నాడు. 'బ్రాహ్మణుడు తన చెంతకు వచ్చిన వారికి అర్ఘ్యపాద్యాల నిచ్చి, పరమానందాన్ని పొంది "నాశక్తికి తగినట్లుగా నేను మీకై ఏమి చేయగలను ?" అని అడిగాడు. రాజా ! అదే సమయంలో తీర్థయాత్రలు చేస్తున్న ఇక్ష్వాకువు వారందరూ కూడియున్న చోటికి వచ్చాడు. రాజసత్తము డయిన ఆ రాజర్షి వారి కందరికీ నమస్కరించి, సత్కరించి, అందరి కుశలాన్ని అడిగాడు. ఆ బ్రాహ్మణుడు ఇక్ష్వాకునకు కూడా ఆసనాన్నీ, అర్ఘ్యపాద్యాలనూ ఇచ్చి, కుశలమడిగి ఈ విధంగా పలికాడు. 'మహారాజా ! మీకు స్వాగతం. మీకేమి కావాలో చెప్పండి. నాశక్తి ననుసరించి మీకోసం ఏం చేయాలో నాకు చెప్పండి.

రాజ :- నేను రాజును. షట్కర్మనిరతుడ వయిన బ్రాహ్మణుడవు నీవు. కాబట్టి నీకు కొంత ధన మివ్వదలచాను. ప్రసిద్ధ మయిన ధన మేది కావాలో నాకు

చెప్పు.

బ్రాహ్మణ :- రాజా ! ధర్మం రెండు రకాలు. దానిని బట్టి బ్రాహ్మణులు కూడా ప్రవృత్తులు, నివృత్తులు అని రెండు రకాలు, నేను ప్రతిగ్రహం (దానం పట్టడం) నుండి నివృత్తుడను. **రాజా ! ప్రవృత్తి ధర్మంలో ఉన్నవారికి దానాల నివ్వు. నేను దానం తీసుకోను. రాజోత్తమా ! నీకేదిష్టమో, నీకేది కావాలో నాకు చెప్పు. నా తపశ్శక్తితో నీకేం సాధించిపెట్టాలో చెప్పు.**

రాజ :- నేను క్షత్రియుడను. 'దేహి' అన్న మాట నా కెప్పుడూ తెలియదు. ద్విజోత్తమా ! యుద్ధాన్ని మాత్రమే యాచించే వారం మేము.

బ్రాహ్మణ :- రాజా ! నీవు నీ ధర్మంతో తృప్తిపడుతున్నావు. మేముకూడా అలాగే మాధర్మంతో ఆనందిస్తున్నాము. మన ఇద్దరికీ భేదం లేదు. నీకేది ఇష్టమయితే అది చేయి.

రాజ :- బ్రాహ్మణా ! నాశక్తి ననుసరించి దానం చేస్తానని నీవు ఇంతకుముందు చెప్పావు. యాచిస్తున్నాను. నీ జపఫలాన్ని నా కిమ్ము.

బ్రాహ్మణ :- నేను యుద్ధాన్ని మాత్రమే యాచిస్తానని ప్రగల్భాలు పలికావు గదా ! మరి నాతో యుద్ధాన్ని ఎందుకు యాచించటం లేదు ?

రాజ :- బ్రాహ్మణా ! బ్రాహ్మణులకు మాటయే వజ్రం వంటి ఆయుధం. శత్రువులు బాహుబలంతో జీవించేవారు. నీతో నాకిప్పుడు తీవ్రమయిన వాగ్యుద్ధమే జరుగుతున్నది కదా!

బ్రాహ్మణ :- రాజా ! ఇప్పటికీ నా ప్రతిజ్ఞ అదియే. నా శక్తి ననుసరించి ఇస్తాను. ఏం కావాలో చెప్పు. ఆలస్యం చేయవద్దు. నా శక్తికి మించనిది తప్పక ఇస్తాను.

రాజ :- నాకు నీవు దానమివ్వాలనుకొంటే నూరు సంవత్సరాలు జపంచేసి, నీవు పొందిన ఫలితాన్ని నాకిమ్ము.

బ్రాహ్మణ :- రాజా ! నా జపంవలన కలిగిన ఉత్తమ ఫలితంలో సగాన్ని నీవు ఏ ఆలోచనా లేకుండా తీసికో. లేకపోతే నీకిష్ట మయితే నా జపఫలాన్ని మొత్తం స్వీకరించు.

రాజ :- నేను యాచించిన జపఫల మంతా నాకు లభించినట్లే. నీకు మేలు జరుగుగాక. నేను వెళ్తున్నాను. అయితే నాకు లభించిన ఆ జపఫల మేమిటో చెప్పు.

బ్రాహ్మణ :- జపఫల మేమిటో నాకు తెలియదు. కానీ నేను చేసిన జపాన్ని మొత్తం నీకిచ్చాను. ఈ ధర్ముడు, కాలుడు, యముడు, మృత్యువు దీనికి సాక్షులు.

రాజ :- ఫలిత మేమిటో తెలియని నీ జపధర్మం నాకు ఏం మేలు చేస్తుంది.

జపఫలితాన్ని నాకు చెప్పు. లేదా ఆ ఫలిత మంతా నీవే ఉంచుకో. సందిగ్ధమైన ఫలం నాకు అవసరం లేదు.

రాజర్షీ ! నేను జపఫలాన్ని నీకిచ్చి వేశాను. మరో మాటకు అవకాశం లేదు. ఈ విషయంలో ఇప్పటి వరకు జరిగిన మన సంభాషణమే ప్రమాణం. **రాజోత్తమా ! నాకు ఇంతకు ముందెప్పుడూ జపం చేసేవేళలో ఫలాపేక్ష లేదు. కాబట్టి నేను చేసిన జపఫల మేమిటో నాకెలా తెలుస్తుంది ?** ఇవ్వమని నీవు అడిగావు. ఇస్తానని నేనన్నాను. నేను మాట తప్పను. సత్యాన్ని కాపాడు. స్థిరంగా నిలబడు. రాజా ! ఇంత చెప్పినా కూడా నా మాటను నీవు పాటించకపోతే అసత్యకారణంగా నిన్ను మహాపాపం చుట్టుకొంటుంది. అరిందమా ! రాజా ! నీవు అసత్య మాడరాదు. నేను కూడా నేనన్న మాటను తప్పిపోనివ్వను. నేను ముందుగా ఏమీ ఆలోచించకుండానే ఇస్తా నన్నాను. నీవు కూడా సత్యవంతుడ వయితే ఏమీ ఆలోచించక స్వీకరించు. రాజా ! ఇక్కడకు నా దగ్గరకు వచ్చి జపఫలితాన్ని యాచించావు. నేనిచ్చిన దానిని స్వీకరించు. మాట మీద స్థిరంగా నిలబడు. **అసత్యవాదులకు ఇహపరలోకాలు ఉండవు. అతడు పితరులను తరింపజేయలేడు. రాబోయే తరాలను తరింపజేసే ప్రశ్నయే లేదు. పురుషోత్తమా ! పరలోకంలో సత్యం తరింపజేసి నట్లు యజ్ఞంకానీ, అధ్యయనం కానీ, దానం కానీ, నియమాలు కానీ తరింపజేయలేవు. ఇంతవరకు చేసిన తపస్సులు కానీ, చేయబోయే తపస్సులు కానీ అవి వందలూ, లక్షలూ అయినా సరే సత్యాన్ని మించిపోలేవు. సత్యమే అక్షరమయిన బ్రహ్మ. సత్యమే నశించని తపస్సు. సత్యమే అక్షరయజ్ఞం. సత్యమే అక్షరవేదం. వేదాలలో సత్యమే నిలిచి ఉంటుంది. సత్యఫలమే సర్వశ్రేష్ఠమయిన ఫలం. సత్యం ద్వారానే ధర్మం, ఇంద్రియ నిగ్రహం కలుగుతాయి. సర్వమూ సత్యం మీదనే ఆధారపడి నిలుస్తుంది. సత్యమే వేదాలు, సత్యమే వేదాంగాలు. సత్యమే విద్యలు. సత్యమే విధి. సత్యమే వ్రతాచరణం. సత్యమే ఓంకారం. సత్యమే ప్రాణులకు జన్మ నిచ్చేది. సత్యమే సంతతి. సత్యం వలననే గాలి చలిస్తుంది. సత్యం వలననే సూర్యుడు తపిస్తాడు. సత్యం వలననే అగ్ని మండుతుంది. స్వర్గం సత్యమందే నిలిచి ఉంటుంది. యజ్ఞమూ, తపస్సూ, వేదాలూ, స్తోభాలు, మంత్రాలు, సరస్వతీ అన్నీ సత్యస్వరూపాలే. రెండు వైపులా సమానమైన బరువుగల త్రాసులో సత్యాన్నీ, ధర్మాన్నీ ఇరుప్రక్కల ఉంచి తూచినప్పడే సత్యం వైపే మొగ్గుచూపిందట. ధర్మమున్నవైపే సత్య ముంటుంది. సత్యంవల్లనే అన్నీ వృద్ధి చెందుతాయి. రాజా ! అసత్య మయిన కర్మను చెయ్యాలని ఎందుకు**

అనుకొంటున్నావు ? రాజా ! సత్యం మాదనే స్థిరంగా ఆలోచనను నిలుపుకో. అసత్య వ్యవహారం వలదు. యాచన ఇష్టంలేనివాడివి 'దేహి' అని అశుభవచనాన్ని పలుకుతా వెందుకు ? రాజా ! నేనిచ్చిన జపఫలాన్ని స్వీకరించటానికి ఇష్టపడకపోతే ధర్మభ్రష్టుడవై, లోకాలన్నీ తిరుగుతుండవలసి వస్తుంది. మాట ఇచ్చికూడా దానం చేయటానికి ఇష్టపడనివాడూ, అడిగికూడా తీసికోవటానికి ఇష్టపడనివాడూ ఈ ఇద్దరూ అసత్యవాదుల క్రిందనే లెక్క. కాబట్టి నీవు మనవ్యవహారాన్ని అసత్యం చేయవద్దు.

రాజ :- బ్రాహ్మణా ! ప్రజారక్షణమూ, యుద్ధమూ క్షత్రియ ధర్మం గదా ! క్షత్రియులు దాతలే ! నీవిచ్చేదానిని నేనెలా స్వీకరించ గలను ?

బ్రాహ్మణ :- రాజా ! దానం స్వీకరించమని నేను నిన్ను నిర్బంధించలేదు. నీ ఇంటికి కూడా నేను రాలేదు. నా దగ్గరకే వచ్చి యాచించావు. మరి ఎందుకు స్వీకరించవు ?

ధర్మ :- మీ ఇరువురికీ వివాదం వలదు. సాక్షాత్తూ ధర్ముడను నేనిక్కడకు వచ్చి ఉన్నాను. దానఫలాన్ని బ్రాహ్మణుడు, సత్యఫలాన్ని రాజు స్వీకరించవచ్చు.

స్వర్గ :- అన్నది. 'రాజేంద్రా ! నేను స్వర్గాన్ని. శరీరాన్ని ధరించి ఇక్కడకు వచ్చాను. మీ ఇద్దరికీ వివాదం వద్దు. మీ రిరువురూ సమానంగా ఫలితాన్ని పొందండి.'

రాజ :- నాకు స్వర్గం అవసరం లేదు. స్వర్గమా ! నీవు వచ్చినట్లే వెళ్ళిపో. ఈ బ్రాహ్మణుడు స్వర్గానికి వెళ్ళదలిస్తే నేను సంపాదించిన పుణ్యాన్ని కూడా స్వీకరించవచ్చు.

బ్రాహ్మణ :- నేను చిన్నతనంలో అజ్ఞానంతో చేయుచూపి ఉండవచ్చు. కానీ ఇప్పుడు గాయత్రిని జపిస్తూ నివృత్తి మార్గాన్ని ఉపాసిస్తున్నాను. రాజా ! ఎప్పటినుండియో నివృత్తి మార్గంలో ఉన్న నన్ను ప్రలోభపెడతా వెందుకు ? నా పనిని నేనే వెరవేర్చుకొంటాను. నీ నుండి ఫలిత మవసరం లేదు. రాజా ! నేను తపస్సు నందు, స్వాధ్యాయమందు లగ్నమయిన వాడిని. ప్రతిగ్రహాన్ని విడిచిపెట్టినవాడను.

రాజ :- బ్రాహ్మణా ! జపంద్వారా సిద్ధించిన ఉత్తమ ఫలాన్ని నీవు పరిత్యజిస్తే ఇలా చేద్దాం. మనమిద్దరం సాధించిన పుణ్యఫలాన్ని కలిపి ఇద్దరమూ సమానంగా అనుభవించుదాం. బ్రాహ్మణులు ప్రతిగ్రహింపదగినవారు. క్షత్రియులు దానం చేయదగివారు. బ్రాహ్మణా ! ఈ ధర్మం నీవెరిగినదే గదా ! మన ఇద్దరి ఫలితాన్ని కలిపి మన మనుభవించుదాం. నీ కిష్టం లేకపోతే మనం కలిసి అనుభవించ నవసరం లేదు. నా పుణ్యఫలాన్ని స్వీకరించు.

నీకు నాపై అనుగ్రహ ముంటే నేను చేసిన ధర్మఫలితాన్ని తీసికో.

భీష్ముడిలా చెప్తున్నాడు. అప్పుడు వికృతవేషధారు లయిన ఇద్దరు పురుషులు అక్కడకు వచ్చారు. మలినవస్త్రాలను ధరించిన ఆ ఇద్దరూ ఒకరి చేతులొకరు పట్టి కొగిలించుకొని ఉన్నారు. ఇద్దరూ ఇలా అన్నారు. నీవు నాకు బాకీ పడలేదని ఒకడంటున్నాడు. బాకీ ఉన్నానని మరొక డంటున్నాడు. మొదట వాడిలా అన్నాడు. 'మా ఇద్దరి మధ్య వివాదమిది. ఈ రాజే ఈ తగవు తీర్చాలి.' రెండవవా డిలా అన్నాడు – 'నేను సత్యమే చెప్తున్నాను. నీవు నాకు ఋణపడలేదు.' మొదటి వాడిలా అన్నాడు. 'అసత్యమాడుతున్నావు. నీకు నేను బాకీ పడి ఉన్నాను.' ఆ ఇద్దరూ ఎంతో బాధపడుతూ రాజుతో ఇలా అన్నారు. తమరు పరీక్షించి, మేము నిందా పాత్రులం కాని రీతిగా తీర్పు నివ్వండి.

విరూపు డిలా అన్నాడు. 'నరోత్తమా ! వికృతునకు నేను ఒక గోదానఫలాన్ని బాకీ ఉన్నాను. రాజా ! నేను బాకీ తీర్చబోయినా వికృతుడు స్వీకరించటం లేదు.'

వికృతు డిలా అన్నాడు. 'రాజా ! విరూపుడు నాకసలు బాకీ లేడు. ఇతడు సత్యంలా కనిపించే అసత్యాన్ని పలుకుతున్నాడు.'

రాజు ఇలా అన్నాడు. 'విరూపా ! వికృతునకు నీవేమి బాకీపడి ఉన్నావో చెప్పు. అది విని నిర్ణయించాలని నా మనస్సు నిశ్చయంతో ఉంది.

విరూపు డిలా అన్నాడు. 'రాజా ! సావధానుడవై విను. వికృతునకు నేను ఏమి బాకీపడి ఉన్నానో వివరంగా చెపుతాను.' అనఘా ! రాజర్షీ ! వికృతుడు ధర్మప్రాప్తికోసం తపస్స్వాధ్యాయ సంపన్నుడైన ఒక బ్రాహ్మణునకు ఒక మంచి గోవును ఇంతకు ముందు దానం చేశాడు. నేను ఈ వికృతుని ఇంటికిపోయి ఆ గోదానఫలాన్ని యాచించాను. నిర్మలహృదయంతో విశుద్ధుడు దానిని నాకు దానంగా ఇచ్చాడు. ఆ తరువాత నేనుకూడా ఆత్మశుద్ధికై పుణ్యకర్మ చేశాను. బాగా పాలిచ్చే రెండు కపిలగోవులను దూడలతో పాటు కొని, వాటిని ఉంఛవృత్తితో జీవించే ఒక బ్రాహ్మణునకు యథావిధిగా, శ్రద్ధగా దానం చేశాను. రాజా ! గోదాన ఫలాన్ని తిరిగి వికృతున కివ్వదలచాను. నరోత్తమా ! ఒక గోదానఫలాన్ని స్వీకరించి నేడు రెట్టింపుఫలాన్ని తిరిగి ఇస్తున్నాను. ఈ స్థితిలో మాలో దోషి యెవరో, నిర్దోషి యెవరో తమరే నిర్ణయించాలి. ఈ రీతిగా వివాదపడుతూ తమ దగ్గరకు వచ్చాం. ధర్మాధర్మ నిర్ణయం చేయండి. మా ఇద్దరినీ న్యాయమార్గంలో నడపండి. అతడు దానమిచ్చినట్లే నేను దానమిస్తున్నాను. కానీ నా దానాన్ని స్వీకరించటం లేదు. ఈ విషయంలో తమరు స్థిరంగా నిలిచి మమ్ములను తగినదారిలో నిలపండి.

రాజ :- వికృతా ! విరూపుడు నీ ఋణాన్ని తీర్చుతానంటే నీవెందుకు స్వీకరించవు ? నీవు ఇచ్చినదానిని తాను తీసికొని నట్లే తానిస్తున్న దానిని నీవూ స్వీకరించు.

జాగుచేయవద్దు.

వికృతు డిలా అన్నాడు - ఋణపడి ఉన్నానని తానంటున్నాడు. దానం చేస్తున్నానంటూ నేనిచ్చాను. కాబట్టి నాకతడు బాకీలేడు. తన ఇచ్చవచ్చినట్లు వెళ్ళవచ్చు.

రాజ :- తానిస్తానంటే నీవు తీసికొనటం లేదు. ఇది సరియైనది కాదని నా కనిపిస్తోంది. నీవు నిస్సందేహంగా శిక్షింపదగినవాడవు.

వికృత :- రాజర్షీ ! నేనతనికి దానం చేశాను. దానిని తిరిగి ఎలా తీసికొనగలను ? రాజా ! నాది తప్పే. అయినా దానాన్ని తిరిగి తీసికొనలేను. తగినట్లు శిక్షించండి.

విరూప :- నేను ఇస్తున్న దానిని నీవు ఏ స్థితిలోనూ స్వీకరించనట్లయితే ధర్మరక్షకుడైన ఈ రాజు నిన్ను బంధించగలడు.

వికృత :- నీవు అడిగినప్పుడు నా ధనాన్ని దానంగా ఇచ్చాను. ఈ రోజు దానిని తిరిగి ఎలా తీసికొనగలను ? నాకు బాకీ లేవని చెప్తున్నాను. నీవిక వెళ్ళవచ్చు.

బ్రాహ్మణ :- రాజా ! ఈ ఇద్దరూ చెప్పింది విన్నావుగా ! నిస్సంకోచంగా నేను నీకిస్తానన్న జపఫలాన్ని స్వీకరించు.

రాజ :- ఈ ఇద్దరి వివాదం ఇప్పుడు వచ్చి పడింది. ఇది చాలా క్లిష్ట మయిన విషయం. అటు ఆ బ్రాహ్మణుడు గట్టిగా ఒత్తిడి చేస్తున్నాడు. ఇది ఎలా పరిణమిస్తుందో !

బ్రాహ్మణుడు ఇచ్చిన జపఫలాన్ని స్వీకరించకపోతే నేడు మహాపాపం నుండి ఎలా బయటపడగలను ? అప్పుడు ఆ రాజర్షి వికృత, విరూపులతో ఇలా అన్నాడు. మీ వివాదం తీరిన తరువాతనే వెళ్ళవచ్చు. ఇప్పుడు నా దగ్గరకు వచ్చి పని ముగియకుండా వెళ్ళదగదు. నా రాజధర్మం మిధ్య కారాదు. రాజులు స్వధర్మపరిపాలన చేయాలన్నది శాస్త్రవిధి. కానీ ఇప్పుడు జితేంద్రియుడను కాని నన్ను గహన మయిన బ్రాహ్మణధర్మం ఆవేశించింది.

బ్రాహ్మణుడు ఇలా అన్నాడు. రాజా ! నీవు అడిగినదానిని నేను ఇస్తా నన్నాను. ఇప్పుడది నీవు నాదగ్గరుంచిన తాకట్టువలె ఉన్నది వెంటనే తీసికో ! స్వీకరించకపోతే నేను నిన్ను శపిస్తాను. సందేహంలేదు.

రాజు ఇలా అన్నాడు. రాజధర్మం ఎంత క్లిష్ట మయినదో ! దాని పరిణామమే ఇది. బ్రాహ్మణునకూ, నాకూ ఒకే ఫలంలో సమభాగమా ? అనుకొంటూ కూడా నేను దానాన్ని స్వీకరించవలసి వస్తోంది. బ్రాహ్మణా ! ఈ నా చేతిని ఇంతకుముందెప్పుడూ లేని రీతిగా తాకట్టుపెట్టిన సొమ్మును తీసికొనేందుకు చాపుతున్నాను. నీ దగ్గరున్న నా సొమ్మును నాకు ఇచ్చివేయి.

బ్రాహ్మణు డిలా అన్నాడు. సంహితను జపిస్తూ నేను కూడబెట్టిన గుణాన్ని, పుణ్యాన్ని మొత్తంగా స్వీకరించు. అది గాక మరేదయినా పుణ్యం నాదగ్గరున్నా దానిని కూడా ప్రతిగ్రహించు.

రాజు ఇలా అన్నాడు. ద్విజోత్తమా ! నీ దానజలం నా చేతిలో పడింది. మనయిద్దరి పుణ్యాన్ని కలిపి చెరిసగం చేసికొని ఇద్దరం అనుభవిద్దాం. ఆమేరకు నేనిచ్చే దానాన్ని కూడా నీవు స్వీకరించు.

విరూపు డిలా అన్నాడు. మేము కామక్రోధులం. మేమే నీచేత ఈ పని చేయించాం. చెరిసగం చేసికొని కలిసి అనుభవిద్దామన్న నీ మాట వలన నీకూ, ఈ బ్రాహ్మణునకూ ఒకే లోకం లభిస్తుంది. నా సహచరుడైన వికృతుడు నాకేమీ బాకీపడలేదు. నిన్ను పరీక్షించటానికే ఈ వ్యవహారమంతా నడిపించాం. కాలుడు, ధర్ముడు, మృత్యువు, కామ క్రోధులు, (విరూప వికృతులు), నీవూ, ఈ బ్రాహ్మణుడు – అందరూ ఒకరికొకరు ఒరిపిడిరాయిగా నిలిచి వన్నె నిలిపారు. ఈ కర్మ ఫలంగా నీవు ఇష్టపడిన లోకాలకు నీవు వెళ్ళు.

భీష్ముడు ఇలా అన్నాడు. 'యుధిష్ఠిరా ! జాపకులు పొందే ఫలాన్ని నీకు సూచనాత్మకంగా చూపాను. జాపకులు పొందే గతిని, స్థానాన్నీ, లోకాలనూ ఇక వివరిస్తాను. సంహితాధ్యయనం చేసేవాడు పరబ్రహ్మలోకాన్ని పొందుతాడు. లేదా అగ్నిలో కానీ, సూర్యునిలో కానీ ప్రవేశిస్తాడు. ఆ జాపకుడు తేజశ్శరీరంతో ఆ లోకాలలో క్రీడిస్తే రాగమోహితుడై ఆ గుణాలనే తనలో నిలిపికొంటాడు. అదే రీతిగా జాపకుడు చంద్రలోక, వాయులోక, భూలోక, అంతరిక్షలోకాలకు అనుగుణమైన శరీరాన్ని ధరించి అక్కడ అనురక్తితో నివసిస్తే ఆ యా లోకుల గుణాలను అనుసరిస్తాడు. ఒక వేళ జాపకుడు ఆ యా లోకాల మహత్యాన్ని సంశయిస్తూ వాటిపై విరక్తి గొని, అంతకన్నా ఉత్కృష్టమై అనశ్వరమైన మోక్షాన్ని అభిలషిస్తే, ఆ జాపకుడు పరమాత్మలో లీనమవుతాడు. అమృతరూప మయిన పరబ్రహ్మ భావాన్ని పొంది, అంతకన్న ఉత్కృష్టమయిన కైవల్యాన్ని పొంది, ఆ జాపకుడు శాంతుడై, అహంకార రహితుడై, ద్వంద్వాలకు అతీతుడై, సుఖియై, శాంతి పరాయణుడై, రోగరహితుడై బ్రహ్మ స్వరూపు డవుతాడు. బ్రహ్మపదం అద్వితీయం. దానికి నాశంలేదు. ఇదమిత్థంగా పేరు కూడా లేదు. అక్కడ జరా దుఃఖా లుండవు. అది శాంతికి స్థానం. అక్కడ చేరినవాడు మరలిరాడు. అటువంటి బ్రహ్మపదాన్ని కూడా జాపకుడు పొందుతాడు. జాపకుడు ఇంతకు ముందు చెప్పిన పరమేష్ఠిస్థానాన్ని అతిక్రమించి, ఆకాశ స్వరూపమైన నిర్గుణ పరబ్రహ్మను

పొందుతాడు. అక్కడ నాలుగు లక్షణాలు, ఆరు లక్షణాలు, పదహారు లక్షణాలు ఉండవు.* అలాకాక రాగబద్ధుడై, నిర్గుణ పరబ్రహ్మను చేరటానికి ఇష్టపడకపోతే పుణ్యలోకాల కన్నిటికీ అధిష్ఠాత అవుతాడు. తాను మనసా కోరుకొన్న దేనినయినా వెంటనే పొందగలుగుతాడు. **అలా కాక పుణ్యలోకాల నన్నింటినీ కూడా నరక తుల్యంగా భావించి, అన్నింటా నిస్పృహుడై, ముక్తు డయితే ఆ నిర్గుణ పరబ్రహ్మలో సుఖంగా క్రీడిస్తాడు.** మహారాజా ! ఈ రీతిగా జాపకుల గతిని వివరించాను. చెప్పవలసినదంతా చెప్పాను. ఇంకా ఏమి వినాలను కొంటున్నావు ?'

200. జాపకోపాఖ్యానము - 5.

యుధిష్ఠిరు డిలా అన్నాడు. పితామహా ! విరూపుడు ఆ రీతిగా పలికిన తర్వాత ఆ బ్రాహ్మణుడు కానీ, రాజు కానీ ఏమన్నారో నాకు చెప్పు. అసలు నీవు చెప్పిన గతులలో (సద్యోముక్తి, క్రమముక్తి, లోకాంతర ప్రాప్తి) ఏ గతిని ఆ ఇద్దరూ పొందారు ? అసలు వారిద్దరి మధ్య ఎటువంటి సంవాదం జరిగింది ? వారేం చేశారు ?' భీష్మ డిలా చెప్తున్నాడు. 'రాజా ! అలాగే అని అంగీకరించి అప్పుడు బ్రాహ్మణుడు పూజ్యులైన ధర్మని, యముని, కాలుని, మృత్యువును, స్వర్గాన్ని, పూజించి, అంతకు ముందే అక్కడున్న విప్రులకు, అప్పుడే అక్కడకు వచ్చిన విప్రు లందరికీ శిరసా నమస్కరించి, పూజించి, రాజుతో ఇలా అన్నాడు. 'రాజర్షీ ! ఈ ఫలితాన్ని పొంది నీవు శ్రేష్ఠలోకాలకు వెళ్ళు. నీ అనుమతితో నేను మరల జపాన్ని చేస్తాను. మహాబలా ! రాజా ! జపంలో నాకు ఎప్పుడూ శ్రద్ధ నిలిచి ఉంటుందని సావిత్రిదేవి నాకు ముందే వరమిచ్చింది.' రాజు ఇలా అన్నాడు. 'బ్రాహ్మణా ! నాకు జపఫలాన్ని సమర్పించినందువలన నీకు ఫలసిద్ధి లేకపోయినట్లయితే మరల జపాసక్తి కలిగేటట్లయితే నాతో రా ! జపదాన ఫలితాన్ని కలిసి అనుభవిద్దాం.' బ్రాహ్మణు డిలా అన్నాడు. 'నా జపఫలాన్ని నీకు దాన మిచ్చేందుకు నేను అందరిముందు ఎంతో ప్రయత్నం చేశాను. నీవేమో కలిసి అనుభవిద్దా మంటున్నావు. సరే ! కలిసే సమానంగా ఫలితమనుభవిద్దాం, ఎక్కడకు వెళ్ళగలమో వెళ్దాం పద !'

భీష్ము డిలా అన్నాడు. రాజా ! ఆ ఇద్దరి ఆ నిర్ణయాన్ని గ్రహించి దేవేంద్రుడు

---

* *viii సం॥ 1. నాల్గు లక్షణాలు = ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం ఈ ప్రమాణాలు*
2. ఆరు లక్షణాలు = ఆకలి, దప్పిక, శోకం, మోహం, జర, మృత్యువు.
3. పదహారు లక్షణాలు = అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, అయిదు ప్రాణాలు, మనస్సు. *(నీల)*

లోకపాలురతో, సమస్త దేవతలతో కలిసి అక్కడకు వచ్చాడు. సాధ్యులు, విశ్వేదేవతలు, మరుత్తులు కలిసి వచ్చారు. గొప్ప గొప్ప వాద్యాలు మ్రోగసాగాయి. నదులు, కొండలు, సముద్రాలు, వివిధ తీర్థాలు, తపస్సులు, సంయోగవిధి, వేదాలు, స్తోభాలు, సరస్వతి, నారదుడు, పర్వతుడు, విశ్వావసువు, హాహాహూహూలు, సపరివారంగా గంధర్వుడు చిత్రసేనుడు, నాగులు, సిద్ధులు, మునులు, దేవాధిదేవుడయిన ప్రజాపతి, వేయితలల ఆదిశేషువు, అచింత్య మహానుభావుడైన విష్ణువు అక్కడ చేరారు. అంతరిక్షంలో భేరీధ్వనులు, తూర్యనాదాలు వినిపించాయి. ఆ మహాత్ములపై దివ్యపుష్పవృష్టి కురియసాగింది. అన్ని వైపుల అచ్చరలు నృత్యమాడసాగారు. అప్పుడు స్వర్గం రూపుదాల్చి బ్రాహ్మణునితో ఇలా అన్నది. "మహాభాగా ! నీవు సిద్ధమేనా ?" "రాజా ! నీవుకూడా సిద్ధమేనా" (అని రాజును అడిగింది). రాజా ! అప్పుడు ఆ ఇరువురూ ఒకరికొకరు ఉపకారం చేస్తూ ఒక్కటయ్యారు. ఒక్కటిగానే ఇద్దరూ తమ మనసులను విషయాల నుండి ఉపసంహరించుకొన్నారు. ఆపై ప్రాణ, అపాన, ఉదాన, సమాన, వ్యానాలనే పంచప్రాణాలను మనస్సులో నిలిపారు. ఈ రీతిగా నిలిచి వారిద్దరూ మనస్సును ప్రాణాపానాలతో సంయోజించారు. కనుబొమల క్రింద, నాసిక మీద దృష్టిని స్థిరపరచి, మనస్సుతో కూడిన ప్రాణాపానాలను కనుబొమల మధ్య నిలిపారు. ఆ రీతిగా స్థిరదృష్టితో మనస్సును లోబరుచుకొని ప్రాణ సహితమయిన మనస్సును (సుషుమ్నద్వారా) మూర్ధస్థానంలో నిలిపారు. సమాధిగతు లయ్యారు. అప్పుడు వారి శరీరాలు నిశ్చేష్ట మయ్యాయి. ఆ సమయంలో మహాత్ముడైన ఆ బ్రాహ్మణుని బ్రహ్మ రంధ్రాన్ని భేదించుకొని, వెలువడి జ్యోతిర్మయ మయిన ఒక గొప్ప జ్వాల స్వర్గం వైపు వెళ్ళింది. అన్ని దిక్కులలో హాహాకారాలు చెలరేగాయి. ఆ జ్యోతిని అందరూ ప్రస్తుతింపసాగారు. రాజా ! ఆ తేజఃపుంజం లొడితెడు పురుషుడుగా మారి బ్రహ్మ సన్నిధికి చేరింది. బ్రహ్మ ఎదురువచ్చి దానిని స్వాగతించాడు. స్వాగతం పలికిన బ్రహ్మ మరల మధురవాక్కులతో ఇలా అన్నాడు. "బ్రాహ్మణా ! యోగులతో సమానమైన ఫలితాన్ని జాపకులు కూడా పొందుతారు. ఈ విషయంలో సందేహం లేదు. యోగులు పొందే ఫలితాన్ని ఇక్కడ సభాసదులందరూ ప్రత్యక్షంగా చూశారు. జాపకులు అంతకన్న శ్రేష్ఠతర మయిన ఫలితాన్ని పొందుతారని చెప్పటానికే నేను లేచి, ఎదురువచ్చి, స్వాగతించాను. నాలోనే నిలిచిపో" ! అని బ్రహ్మ మరలా తత్త్వజ్ఞానాన్ని కలిగించాడు. ఆ విప్రుడు జ్వరవిముక్తుడై బ్రహ్మావదనంలో ప్రవేశించాడు. అప్పుడు ఇక్ష్వాకురాజు కూడా ఆ విప్రశ్రేష్ఠునివలె విధిపూర్వకంగా భగవాను డయిన బ్రహ్మావదనంలో ప్రవేశించాడు. అప్పుడు దేవతలందరూ బ్రహ్మకు ప్రణమిల్లి ఇలా అన్నారు. "లేచి, ఎదురేగి, స్వాగతించటం ద్వారా యోగఫలం కన్న జాపకులు పొందే

ఫలం విశిష్టమని నిరూపించారు. జాపకుడైన ఈ బ్రాహ్మణుని కృతార్థుని చేయటానికే అలా ప్రవర్తించారు తమరు. అది చూడటానికే మేమంతా వచ్చాం. తమరు ఇద్దరినీ సమానంగా ఆదరించారు. ఒక్కటిగా వచ్చిన ఈ ఇద్దరూ కూడా సమాన ఫలాన్ని పొందారు. యోగి, జాపకుడు పొందే మహాఫలాన్ని మే మీ నాడు ప్రత్యక్షంగా చూచాం. ఈ ఇద్దరూ సర్వలోకాలనూ అతిక్రమించి, వారికిష్ట మయిన ప్రదేశానికి వెళ్ళవచ్చు". బ్రహ్మ ఇలా అన్నాడు.

"మహాస్మృతిని, శుభకరమయిన అమస్మృతిని పఠించిన వాడు కూడా ఇదే రీతిగా నా సాలోక్యాన్ని పొందవచ్చు. యోగ భక్తు డయిన వాడును దేహాన్ని విడిచిన తరువాత ఈ ప్రకారంగా నాలోకాన్ని పొందవచ్చు. సందేహం లేదు. ఇష్టసిద్ధికై మీరు మీ మీ స్థానాలకు వెళ్ళండి. నేను మీ కోరికలను తీర్చుతుంటాను". భీష్ముడిలా చెప్తున్నాడు. 'బ్రహ్మ దేవతలతో ఆ రీతిగా చెప్పి అక్కడే అదృశ్య డయ్యాడు. అప్పుడు దేవతలు బ్రహ్మదగ్గర వీడ్కోలు తీసుకొని తమ తమ నివాసాలకు వెళ్ళారు. రాజా ! అక్కడున్న మహాత్ములందరూ కూడా ధర్మాన్ని అభినందిస్తూ, ప్రసన్నచిత్తులై మరలిపోయారు. మహారాజా ! నేను విన్నది విన్నట్లుగా జాపకులు పొందే ఫలితాన్ని, వారు పొందే గతులను వివరంగా చెప్పాను. ఇంకా ఏం వినాలనుకొంటున్నావు ?'

201. మను బృహస్పతి సంవాదము - 1.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'పితామహా ! జ్ఞానయోగానికి, వేదాలకు, వేదోక్త నియమాలకు ఫలితమేమిటి ? భూతాత్మ అయిన పరమాత్మను ఎలా తెలిసికోవాలి ? అది నాకు చెప్పు.' భీష్ము డిలా అన్నాడు. 'ఈ విషయంలో కూడా మనుప్రజాపతికి, మహర్షియైన బృహస్పతికి మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీనేతి హాసాన్ని గూర్చి చెప్తుంటారు. ఒకప్పుడు దేవర్షి సమూహంలో శ్రేష్ఠుడైన మహర్షి బృహస్పతి, ప్రజలలో శ్రేష్ఠుడైన ప్రజాపతిని గురువుగా భావించి, శిష్యభావంతో నమస్కరించి ఇలా అడిగాడు. 'భగవాన్ ! జగత్తునకు మూలమేది ? వైదిక కర్మానుష్ఠానం దేని కొరకు ? విప్రులు జ్ఞానఫలంగా దేనిని చెప్తున్నారో, మంత్ర పదాల ద్వారా కూడా దేని స్వరూపం స్పష్టంగా తెలియబడదో అటువంటి పరమాత్మను గూర్చి యథాతథంగా నాకు చెప్పు. అర్థశాస్త్రం, వేదాలు, మంత్రాలు తెలిసిన పండితులు అనేక మహాయాగాలతో, గోదానాలతో ఏ ఫలితాన్ని సేవిస్తారో అది ఏది ? దానిని పొందట మెలా ? అది ఎక్కడుంటుంది ? స్వామీ ! భూమి, భూమినుండి పుట్టినవి, గాలి, ఆకాశం, జలజంతువులు, జలం, దివం,

దేవతలు – ఇవన్నీ దేనినుండి ఉద్భవిస్తాయో ఆ పురాతన పదార్థమేది ? నాకు చెప్పండి. మనిషి తనకు తెలిసిన వస్తువునే కోరుతాడు. దానిని పొందటానికి ప్రయత్నిస్తాడు. నాకు ఆ పరమోత్కృష్ట ప్రాచీన పదార్థాన్ని గురించి తెలియనే తెలియదు. తెలియనిదానికై మిథ్యాప్రయత్న మెలా చేయగలను ? నేను ఋగ్వేదాన్ని, సామవేదాన్ని, యజుర్వేదాన్ని, అథర్వవేదాన్ని, నక్షత్రగతిని, నిరుక్తాన్ని, వ్యాకరణాన్ని, కల్పాన్ని, శిక్షను అధ్యయనం చేశాను. అయినా పంచమహాభూతాల మూలకారణాన్ని తెలియను. ఇదంతా సామాన్య శబ్దాలతో విశేష శబ్దాలతో కలిపి మీరు నాకు చెప్పండి. జ్ఞానంవలన కానీ, కర్మవలన కానీ లభించే ఫల మేమిటో చెప్పండి. దేహాన్ని వీడిన ప్రాణి మరల మరొక దేహంలో ఎలా ప్రవేశిస్తాడో అదంతా నాకు చెప్పండి.'

మనువు ఇలా చెప్పాడు. 'ఎవరికి ఇష్టమయినది వారికి సుఖం. ఎవరికి నచ్చనిది వారికి దుఃఖం. 'నాకు ఇష్టమైనదే లభించాలి. ఇష్టంలేనిది ఎదురుకారాదు.' అన్న భావం నుండి కర్మానుష్ఠానం మొదలవుతుంది. ఇష్టమూ, అనిష్టమూ రెండూ నన్ను చేరకూడదు అనే భావం కలగడానికి జ్ఞానవిధి ప్రారంభ మయినది. **వేదాలలో విధింపబడిన కర్మయోగాలన్నీ సకామకర్మలు. ఆ కోరికల నుండి విముక్తుడైనవాడే పరమాత్మను చేరగలడు. అనేక విధాలయిన కర్మమార్గం ద్వారా సుఖాన్ని కోరుతూ, ప్రవర్తించినవాడు పరమాత్మను పొందలేడు.'** బృహస్పతి ఇలా అన్నాడు. 'సుఖం అందరికీ ఇష్టం, దుఃఖం అందరికీ అప్రియం. కాబట్టి ఇష్టప్రాప్తి, అనిష్టనివారణకై కామన కలుగుతుంది. తద్వారా మనిషి కర్మలలో ప్రవర్తిస్తాడు. మరి కామనలు పరిత్యజింపదగిన వెలా అవుతాయి ?' మనువు ఇలా చెప్పాడు. **'కామనలను విడనాడినప్పుడే పరమాత్మప్రాప్తి. దాని కోసమే కర్మవిధి ఏర్పడింది. వేదవిధులను సకామంగా అనుష్ఠించినపుడు అవి మనుష్యునకు బంధనా లవుతాయి. వాటి నుండి బయటపడి పరమాత్మ ప్రాప్తికై ప్రయత్నించాలి.** మనస్సు నిత్యకర్మానుష్ఠానంచే రాగాదిదోషాలకు దూరమై, అద్దంవలె నిర్మలమై, కాంతిమంతమై శాశ్వతసుఖాన్ని అపేక్షిస్తుంది. అప్పుడు ముముక్షుభావంతో ధర్మాసక్తమై, కర్మమార్గానికి అతీతమై, కామనారహితమై పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందుతుంది. బ్రహ్మ మానసికంగానూ, కర్మద్వారానూ ప్రజలను సృష్టించాడు. ఈ రెండు మార్గాలే లోకులు ఆదరించిన సన్మార్గాలు. కర్మ సనాతనమనీ, నశ్వరమనీ రెండు రకాలు. (సనాతన కర్మ మోక్షహేతువు. నశ్వరకర్మ భోగహేతువు). కర్మ ఫలంపై మనస్సు పెట్టకపోవటమే సనాతన కర్మ. పరమాత్మ ప్రాప్తికి మరోదారి లేదు. రాత్రి గడచిపోయిన తరువాత, అంధకారావరణం తొలగిపోయిన తర్వాత మనలను నడిపించే కన్ను తన తేజస్సుతో దారిచూపినట్లు బుద్ధి కూడా మోహం తొలగిపోయిన తర్వాత విజ్ఞాన యుక్తమై పరిత్యజింపదగిన అశుభకర్మలను చూడగలుగుతుంది. మనుష్యులు

దారిలో పాములను, దర్భల మొనలను, బావులను గమనించి వాటిని తప్పించుకొని నడుస్తారు. గమనించనివారు వాటి బారిన పడతారు. జ్ఞానఫలం ఎంత విశిష్టమైనదో చూడు ! మంత్రపఠనమూ, యథావిధిగా వేదోక్తరీతిలో అనుష్ఠానమూ, యథోక్తరీతిలో దక్షిణల నిచ్చుట, అన్నదానమూ, మనస్సు యొక్క ఏకాగ్రత- ఈ అయిదు అంగాలు సరిగా నిర్వర్తింపబడినప్పుడే యజ్ఞఫలం పూర్తిగా లభిస్తుందని పండితాభిప్రాయం. వేదాలు కర్మలను సాత్త్విక, రాజస, తామసభేదాలతో మూడు రకాలు అంటాయి. కర్మ మంత్రపూర్వకం కాబట్టి అదేరీతిగా మంత్రాలూ మూడు రకాలు. అదే రీతిగా విధి, విధేయకార్యం; మనసా ఫలానుభవం; ఫలభోక్త- ఇవన్నీ మూడు మూడు రకాలు. శబ్దాలు, రూపాలు, పవిత్రరసాలు, సుఖస్పర్శలు, పరిమళ గంధాలు- ఇవి కర్మఫలాలు. కానీ దేహగతుడైన జీవి వీటిని అనుభవింపజేయటానికి అధికారి కాడు. కర్మఫలాన్ని అనుభవింపజేయటానికి దైవమే అధికారి. **ఈ శరీరంతో చేసిన శుభాశుభకర్మఫలాలను శరీరంతోనే అనుభవించాలి. సుఖానికైనా, దుఃఖానికైనా శరీరమే భోగస్థానం.** మాటతో చేసిన కర్మఫలాన్ని మాటలతోనే అనుభవించాలి. మనస్సుతో చేసిన కర్మల ఫలితాన్ని జీవుడు మనసుతో కలిసి మనసా అనుభవించాలి. **ఫలాకాంక్షియై, ఫలాసక్తితో సాత్త్వికరాజసతామసాలలో ఏ గుణంతో కూడిన కర్మను ఆచరిస్తాడో, ఆయా గుణాలకు అనుగుణంగానే శుభాశుభకర్మల ఫలితాన్ని అనుభవిస్తాడు. చేప ప్రవాహంతో పాటు కొట్టుకొనివచ్చినట్టు మనిషి తాను ముందు చేసిన కర్మల ఫలితాన్ని అనుసరిస్తాడు. కర్మప్రవాహంలో కొట్టుకొనిపోతాడు. ఆ దశలో శుభకర్మలు కలిస్తే సుఖాన్ని, అశుభ కర్మలు కలిస్తే దుఃఖాన్ని అనుభవిస్తాడు.** ఈ జగత్తు ఎక్కడనుండి ఉద్భవించిందో తెలిసి, మనస్సును వశపరుచుకొనిన జ్ఞానులు సంసారాన్ని అతిక్రమించి, పరమపదాన్ని చేరుతారు. వేదమంత్రాల ద్వారా కూడా సరిగా వెల్లడికాని సర్వోత్కృష్టతాత్త్విక పదార్థాన్ని గూర్చి చెపుతాను, విను. **ఆ మహాపదార్థం వివిధరసాలకు, వివిధ గంధాలకు దూరమైనది. దానికి శబ్ద, స్పర్శ, రూపా లుండవు. మనస్సు, బుద్ధి దానిని గ్రహించలేవు. అవ్యక్తమూ, అద్వితీయమూ, రూపాదిరహితమూ అయిన ఆ మహాపదార్థమే ప్రజల కొరకు రూపరసాది పంచవిషయాలను సృష్టించింది. ఆ మహాపదార్థం స్త్రీ కాదు, పురుషుడు కాదు, నపుంసకమూ కాదు. అది సత్తూ కాదు, అసత్తూ కాదు, సదసత్తు కూడా కాదు. బ్రహ్మ వేత్తలయిన మనుష్యులు దానిని చూడగలరు. అది- ఆ పరమాత్మ అక్షరం. దానికి నాశం లేదని తెలుసుకో.'**

202. మనుబృహస్పతి సంవాదము - 2.

మనువు ఇలా చెప్పాడు. 'అక్షర పరబ్రహ్మ నుండి ఆకాశం, ఆకాశం నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్నినుండి జలం, జలం నుండి పృథివి, పృథివి నుండి జగత్తు ఉద్భవించాయి. ఈ శరీరాన్ని వీడిన తర్వాత ప్రాణులు జలంలో లయిస్తారు. జలం నుండి అగ్నిలో, అగ్నినుండి గాలిలో, గాలినుండి అంతరిక్షంలో లీనమవుతాయి. ఆకాశం నుండి మరల అదే క్రమంలో వెనుకకు వచ్చి, మరల జన్మిస్తాయి. అయితే జ్ఞానులు ఆకాశం నుండి మోక్షస్వరూప మయిన పరమాత్మను చేరుతారు. మరల వెనుకకు రారు. ఆ పరమాత్మతత్త్వం ఉష్ణమూకాదు, శీతలమూకాదు. మృదువూ కాదు, కఠినమూ కాదు. ఆమ్లమూ కాదు, కషాయమూ కాదు. తీపీ కాదు, చేదూ కాదు. అక్కడ శబ్ద, గంధ, రూపాలు కూడా ఉండవు. అది సర్వవిలక్షణం. శరీరం స్పర్శను గ్రహిస్తుంది. నాలుక రసాన్ని, నాసిక గంధాన్ని, చెవులు శబ్దాన్ని, కన్ను రూపాన్ని గ్రహిస్తాయి. అయితే ఈ ఇంద్రియాలు పరమాత్మ ప్రత్యక్షంలో పనిచేయవు. అధ్యాత్మజ్ఞానహీనులయిన మనుష్యులకు పరమాత్మ తత్త్వం అనుభవానికి రాదు. నాలుకను రసాల నుండి, నాసికను గంధం నుండి, చెవులను శబ్దం నుండి, శరీరాన్ని స్పర్శనుండి, కంటిని రూపం నుండి మరలించి, అంతర్ముఖుడైనవాడు తన మూల స్వరూపమైన పరమాత్మను సాక్షాత్కారించుకొనగలడు. కర్త ఏ కారణం వలన, ఏ ఫలాన్ని ఆశించి, ఏదేశంలో, ఏకాలంలో, ప్రియాప్రియాలలోని ఏ కారణంతో, ఏ రాగద్వేషాల ప్రభావంతో ప్రవృత్తి మార్గాన్ని ఆశ్రయించి ఏ పని చేస్తున్నాడో... ఈ సమస్త వ్యవహారసముదాయానికి ఏది కారణమో అదే పరమాత్మ అని పెద్దలు చెప్తుంటారు. వ్యాపకమూ, వ్యాప్యమూ, ఈ రెండింటికీ సాధనమూ అయి, లోక మందంతటా ఎప్పుడూ కూటస్థుడై నిలిచి, అన్నింటికీ తానే కారణమై అన్నింటినీ చేసేవాడే పరమకారణం. మిగిలిన దంతా కార్యరూపమే. ఏ మనిషి అయినా తాను చక్కగా చేసిన కర్మలద్వారా నిరాటంకంగా శుభాశుభఫలితాలను అనుభవించినట్లు, తన కర్మల ననుసరించి కలిగిన ఉత్తమాధమ శరీరాలలో నిరాటంకంగా పరమాత్మజ్ఞానం నిలిచి ఉంటుంది. వెలిగించిన దీపం తాను ప్రకాశిస్తూ, తన సమీపాన గల ఇతరవస్తువులను కూడా ప్రకాశింపజేసినట్లు; శరీర మనే వృక్షంలోనున్న పంచేంద్రియాలు జ్ఞానంతో తాము ప్రకాశిస్తూ, విషయాలను కూడా ప్రకాశింపజేస్తాయి.

రాజు వేరువేరు విషయాలకు వేరు వేరు అమాత్యులను నియమిస్తాడు. వారు తమ తమ విషయాలను రాజుకు తెలియజేస్తుంటారు. అలాగే శరీరాలలోని ఇంద్రియాలు అయిదూ తమకు సంబంధించిన విషయజ్ఞానాన్ని బుద్ధికి అందిస్తాయి. మంత్రులకన్న

రాజు శ్రేష్ఠుడైనట్లు ఇంద్రియాలకన్న జ్ఞానం (బుద్ధి) శ్రేష్ఠం. **అగ్నిజ్వాలలు, పవనవేగం, సూర్యకిరణాలు, నదీ ప్రవాహజలం వచ్చి పోతుంటాయి. అదే రీతిగా దేహధారులయిన ప్రాణుల శరీరాలు కూడా వచ్చి పోతుంటాయి.** గొడ్డలి తీసికొని కట్టెను నరికేవాడికి కట్టెలోని అగ్ని కానీ, పొగ కానీ కనిపించదు. అదే విధంగా శరీరాన్ని కానీ, ఉదరాన్ని కానీ, కాళ్ళు చేతులను కానీ ఖండించే వాడు ఆ శరీరానికి వేరై లోనున్న ఆత్మను చూడలేడు. ఆ కట్టెలనే తగినరీతిగా మధించినవాడు ధూమాన్ని, అగ్నిని కూడా చూడగలిగినట్లు యోగశక్తితో మనస్సును, ఇంద్రియాలను బుద్ధితో సమాహితం చేయగల జ్ఞాని పరమాత్మను సాక్షాత్కారించుకొన గలుగుతాడు. కలలో తన శరీరమే తన నుండి వేరుపడి పడిపోయిన వైనాన్ని చూసినట్లు; పది ఇంద్రియాలు, పంచ ప్రాణాలు, మనస్సు, బుద్ధి – వీటిని అభిమానించే మనిషి నిర్మల మనోబుద్ధులతో తన కన్న శరీరం వేరని గ్రహించగలగాలి. అలా గ్రహించనివాడు ఒక శరీరం నుండి మరొక శరీరానికి మారుతుంటాడు. **ఆత్మ శరీరం కన్న భిన్నమైనది. అందుకే శరీరోత్పత్తి, శరీరవృద్ధి, శరీరం తగ్గుదల, శరీరనాశం ఇవి ఆత్మకు అంటవు. కానీ పూర్వకర్మఫల సంబంధంవలన ఈ విషయాన్ని గ్రహించలేనివాడు ఒక శరీరం నుండి మరొక శరీరానికి మారుతుంటాడు.** ఎవ్వడూ కూడా కంటితో ఆత్మస్వరూపాన్ని చూడలేడు. చర్మంతో ఆత్మను స్పృశించలేడు. ఇంద్రియాల ద్వారా ఆత్మజ్ఞాన రూపమైన కార్యాన్ని సాధించలేడు. అవి ఆత్మను చూడలేవు. కానీ ఆత్మ అన్నింటినీ చూడగలదు. అగ్ని ఏ పదార్థానికి అయినా దగ్గరగా మండినప్పుడు ఆ పదార్థం ఎట్టబడుతుంది. వెచ్చబడుతుంది. అంతమాత్రాన అగ్ని యొక్క వాస్తవికరూపం దానికి రాదు. అదే రీతిగా ఆత్మ స్వరూపం చైతన్యమాత్రంగా ఇంద్రియాదులలో కనిపిస్తుంది కానీ ఆ ఇంద్రియాలకు వాస్తవిక చైతన్య రూపం రాదు. వస్తురూపమే అగ్నిరూప మనిపించినట్లు ఇంద్రియ చైతన్యమే ఆత్మగా అనిపిస్తుంది. అంతే.

మనిషి కనిపిస్తున్న ఈ శరీరాన్ని వీడి, కనిపించని మరో శరీరంలో ప్రవేశిస్తాడు. అప్పుడు తొలిరూపం పంచమహా భూతాలలో కలుస్తుంది. మరో శరీరంలో ప్రవేశిస్తున్న తాను దానినే తన స్వరూపంగా భావించి, ధరిస్తాడు. జీవుడు శరీరాన్ని విడిచినప్పుడు శరీరంలోని ఆకాశాంశ ఆకాశంలో, పవనాంశ పవనంలో, అగ్నిఅంశ అగ్నిలో, జలాంశ జలంలో, పృథివి అంశ పృథివిలో లీన మవుతాయి. అయితే వివిధ ప్రాణుల నాశ్రయించియున్న శ్రోత్రాదితత్త్వాలు తమ తమ కర్మలలో ప్రవర్తిస్తూనే ఉంటాయి. మరో శరీరంలో ప్రవేశించి, పంచభూతాలను ఆశ్రయిస్తాయి. ఆకాశం నుండి శ్రోత్రేంద్రియం, పృథివి నుండి ఘ్రాణేంద్రియం ఏర్పడుతాయి. చక్షురింద్రియ విషయాలయిన రూపపరిణామాలు

తేజోమయాలు. స్వేదమూ, రసనేంద్రియమూ జలాశ్రయాలు. స్పర్శ, స్పర్శేంద్రియమూ వాయువు నాశ్రయించినవి. అయిదు ఇంద్రియాలు, అయిదు ఇంద్రియవిషయాలు సూక్ష్మరూపంలో నున్న పంచమహాభూతాలతో ఉంటాయి. శబ్దాదివిషయాలు, ఆకాశాది భూతాలు, శ్రోత్రాదు లయిన ఇంద్రియాలు మనస్సు ననుసరిస్తాయి. మనస్సు బుద్ధిని, బుద్ధి ఆత్మను అనుసరిస్తాయి. **తన కర్మ ననుసరించి నూతన శరీరాన్ని ధరించిన జీవుడు తాను చేసిన శుభాశుభకర్మల ఫలితాన్ని ఈ శరీరంతో అనుభవిస్తాడు. జలజంతువులు ప్రవాహానుగుణంగా పయనించినట్లు గతంలోని శుభాశుభకర్మలు మనస్సును అనుసరిస్తాయి.** వేగంగా ప్రయాణిస్తున్నప్పుడు ప్రక్కనున్న స్థిరపదార్థాలు వెనక్కు వెళ్తున్నట్లు కనిపిస్తాయి. పెద్దవస్తువు చిన్నవస్తువుగా కనిపిస్తుంది. అదే విధంగా నిర్వికారుడైన ఆత్మ బుద్ధివికారం వలన వికారం గలవాడుగా, రూపరహితుడు రూపసహితుడుగా కనిపిస్తాడు. నిర్మల దర్పణం స్వరూపాన్ని ప్రతిబింబింప జేయగలినగినట్లు బుద్ధిమార్గం ఆత్మ స్వరూపాన్ని ప్రదర్శింపజేయ గలుగుతుంది.'

203. మను బృహస్పతి సంవాదము - 3.

మనువు ఇలా చెప్పాడు. **'బుద్ధితో కలిసి, తాద్రూప్యాన్ని పొందిన జీవుడు గతంలో ఇంద్రియాల ద్వారా దీర్ఘకాలం అనుభవించిన విషయాలను తర్వాత కాలంలో స్మరిస్తాడు. అప్పుడు ఇంద్రియాలకు విషయ సంబంధం లేకపోయినా అవి సంస్కారరూపంగా బుద్ధితో ఉంటాయి.** జీవుడు ఒకే సమయంలో కానీ, వేరువేరు సమయాల్లో కానీ, ఈ జన్మలో కానీ, గత జన్మలలో కానీ తన అనుభవంలోనికి వచ్చిన భూతభవిష్య పదార్థాలను విస్మరించడు. వాటిని ప్రకటిస్తూనే ఉంటాడు. స్వప్న జాగ్రత్ సుషుప్త్యవస్థలలో సంచరిస్తూనే ఉంటాడు. అందువలన సర్వసాక్షి అయిన ఆత్మయే శరీరానికి యజమాని. జాగ్రత్ స్వప్నసుషుప్త్యవస్థలలో జీవు డనుభవించే సుఖ దుఃఖాదిగుణాలు పరస్పరం విలక్షణమైనవి. సత్త్వరజస్తమో గుణ భేదాలను బట్టి అవి వేరువేరుగా ఉంటాయి. ఆత్మ బుద్ధిద్వారా వాటిని అనుభవిస్తుంది. కట్టెలోని అగ్నిలో వాయువు ప్రవేశించినట్లు జీవుడు శరీరేంద్రియాలలో ప్రవేశిస్తాడు. ఇంద్రియాలకు చైతన్యాన్ని కల్పిస్తాడు.

మనిషి కంటితో ఆత్మను చూడలేడు. చర్మంతో ఆత్మను స్పృశింపలేడు. ఆత్మ ఇంద్రియాలకే ఇంద్రియం. చెవితో విని, ఆత్మజ్ఞానాన్ని పొందలేడు. ఆ ఆత్మ శబ్దరహితం. జ్ఞానవిచారం ద్వారానే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. అప్పుడు సాధనాలయిన

ఇంద్రియాల ప్రవృత్తి నశిస్తుంది. చెవి మొదలయిన ఇంద్రియాలు స్వయంగా తమను తాము చూడలేవు. ఆత్మ సర్వజ్ఞుడు, సర్వదర్శి కాబట్టి తాను ఇంద్రియాలను అన్నింటిని చూడగలడు. మనిషి హిమాలయం రెండవ పార్శ్వాన్ని కానీ, చంద్రుని వెనుక భాగాన్ని కానీ చూడలేడు. అంత మాత్రాన అవి లేనట్లుకాదు. అదే రీతిగా సర్వప్రాణులలోనున్న జ్ఞాన స్వరూపుడైన ఆత్మ కళ్ళు చూడలేనంత సూక్ష్మంగా ఉంటాడు. కనిపించడు కాబట్టి లేనట్లు కాదు. చంద్రునిలో కనిపించే కళంకం అక్కడున్న పృథివికి గుర్తు. కానీ మనిషి దానిని చూస్తూ కూడా పృథివీచిహ్నంగా గుర్తించలేడు. అదే రీతిగా 'నేను' అని వ్యవహరిస్తున్న అందరూ ఆత్మజ్ఞానం కలవారి క్రిందనే లెక్క, అయితే అది వాస్తవికమైన ఆత్మజ్ఞానంకాదు. అందుకే మనిషి దానిని ఆశ్రయించి ఉండడు.

ఉత్పత్తికి ముందు వినాశానంతరం వస్తువులు రూపాన్ని కోల్పోయి మూల పదార్థంగా మిగిలిపోతాయి. అందుకే జ్ఞానులు వస్తుదశలో కూడా మూలపదార్థాన్నే చూడగలుగుతారు. సూర్యగమనం కనిపించకపోయినా ఉదయాస్తమయాల ద్వారా ఊహించగలుగుతారు. అలాగే వివేకులు బుద్ధిదీపం ద్వారా ఇంద్రియాతీతమయిన బ్రహ్మను సాక్షాత్కారించుకొంటారు. కనిపిస్తున్న ప్రపంచాన్ని జ్ఞానరూప మయిన పరమాత్మలో విలీనం చేయగోరుతారు. ఉపాయం లేకుండా ఏ ప్రయోజనమూ సిద్ధించదు. మత్స్యోపజీవులు (పల్లెకారులు) వలలతోనే చేపలను పడతారు. మృగాలతోనే మృగాలను పట్టుకొంటారు. పక్షులతోనే పక్షులను, ఏనుగులతోనే ఏనుగులను పట్టుకొంటారు. అలాగే జ్ఞానంతోనే జ్ఞేయాన్ని గ్రహించాలి. పాముకాళ్ల గుర్తులు పాములకే తెలుస్తాయంటారు. అలాగే అందరిలోను ఉన్న జ్ఞేయ స్వరూపుని జ్ఞానం ద్వారానే గ్రహించాలి. ఇంద్రియాలతోనే ఇంద్రియాలను తెలుసుకోవాలనుకోరు. అలాగే ఇక్కడ పరాబుద్ధి కూడా పరమ బోధ్యమయిన తత్త్వాన్ని స్వయంగా చూడలేదు. కాని పురుషుడు బుద్ధిద్వారా దానిని సాక్షాత్కరించుకొంటాడు.

అమావాస్యనాడు చంద్రుడు కనపడడు. అంత మాత్రాన చంద్రుడు నశించలేదు. అలాగే ఆత్మ కనపడనంత మాత్రాన నశించలేదు. ఉపాధి లేకపోవడమే కనపడక పోవటానికి కారణం. అమావాస్యనాడు చంద్రుని స్థూల శరీరం క్షీణించింది. అంతే. అలాగే రూపం నుండి విముక్తుడై శరీరి కనపడటం లేదు. మళ్లీ ఉపాధి దొరికితే ఆకాశంలోనే మరోచోట కనిపిస్తాడు చంద్రుడు. అలాగే మరో ఉపాధిని పొంది మళ్లీ శరీరి కనిపిస్తాడు. జననం - వృద్ధి - నాశం - ఈ మూడూ దేహానికి ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి. అది చంద్ర మండలం యొక్క ధర్మంకాని ఆత్మది కాదు. ఉదయం, పెరుగుట, వయస్సు - ఈ మూడింటి వలన ఇతడే చంద్రుడని అనుకొంటున్నాము. అలాగే అమావాస్య నాడుకూడ

ఆ చంద్రునికి రూపం కలిగి ఉన్నట్లు తెలుసుకోవాలి. (బాల్యాది అవస్థలు మారినా ఆత్మఒక్కటే అన్నట్లు మరో శరీరంలో చేరినా ఆత్మఒకటే) చీకటి చంద్రుని సమీపిస్తున్నా తెలియదు. విడిచి పెడుతున్నా తెలియదు. అలాగే ఆత్మకూడా శరీరాన్ని విడిచి పెడుతున్నా, పొందుతున్నా తెలియదు. సూర్యచంద్రుల కలయిక కలవాడు రాహువని తెలుస్తోంది. అలాగే శరీరంతో కలిశాక ఆత్మ శరీరి అని తెలుస్తోంది. చంద్రుని, సూర్యుని విడిచిన రాహువు కనపడడు. అలాగే శరీరం విడిచిన ఆత్మకూడా కనపడదు. అమావాస్య నాడు చంద్రుడు నక్షత్రాలతో కూడి ఉన్నాడు. అలాగే శరీరం వదలిన జీవుడు కర్మఫలాలతో కూడి ఉన్నాడు.'

204. మను బృహస్పతి సంవాదము - 4.

మనువు చెపుతున్నాడు. 'స్థూల శరీరం నిద్రించేటప్పుడు చేతన స్వప్నంలో తిరుగుతుంది. లింగ శరీరం కూడ ఇంద్రియాలతో కలిసి నిద్రిస్తుంది. నిద్రలో లింగశరీరం విడిచి జ్ఞానం తిరుగుతూఉంటుంది. ఇవే భవమూ, అభవమూ. (నిర్మలంగా) ప్రసన్నంగా ఉన్న నీటిలో జనులు తమకంటితో తమ రూపాన్ని చూస్తున్నారు. అలాగే ఇంద్రియాలు ప్రసన్నంగా ఉంటే జ్ఞానంతో జ్ఞేయాన్ని చూస్తాం. నీరు కదలి, కలుషితమై పోతే రూపం కనపడదు. అలాగే ఇంద్రియాలు చలించి, కలుష మయితే ఆత్మను బుద్ధితో పట్టుకోలేడు. అజ్ఞానం చేత అబుద్ధి ఏర్పడుతుంది. అబుద్ధి (అవిద్య) మనస్సును ఆకర్షిస్తుంది. మనసు పాడయితే మనస్సంబంధమయిన శ్రోత్రాది ఇంద్రియాలు పాడవుతాయి. అజ్ఞానంతో (మోహంతో) విషయాలలో మునిగిన జీవుడు శబ్దాది విషయాలతో తృప్తి పడడు. తిరిగి వస్తాడు. (మళ్లీ మళ్లీ పుడతాడు) **తృష్ణ పోవడం అనేది పురుషుడికి పాపం వల్ల కలగదు. పాపం అంతమయినపుడు తృష్ణ పోతుంది.** విషయ సంసర్గంవల్ల, అదే శాశ్వతం అని ఆశ్రయించడంవల్ల, కోరదగినదానికంటె ఇతరమయిన దానిని కోరుతూ పరతత్త్వాన్ని పొందలేకపోతున్నాడు. పాపకర్మ నశిస్తే మానవులకు జ్ఞానం కలుగుతుంది. అద్దంలో మానవుడు తనరూపాన్ని చూసుకొన్నట్లు ఆత్మలో ఆత్మను దర్శిస్తాడు. **విషయాల మీదికి ప్రసరించే ఇంద్రియాల వల్లనే మానవుడు దుఃఖం పొందుతాడు. వాటిని నియమిస్తే సుఖపడతాడు. అందుచేత ఇంద్రియరూపాల నుండి ఇంద్రియాలను మనసుతోనే నియమించాలి.** ఇంద్రియాలకు మనస్సు పూర్వమైనది. దానికంటె తరువాతిది బుద్ధి. బుద్ధికంటె పరమైనది జ్ఞానం. జ్ఞానాన్నిమించినది మహత్తు (ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, జ్ఞానం, మహత్తు ఇది వరుస).

అవ్యక్తం నుండి జ్ఞానం ప్రసరిస్తుంది. దాని నుండి బుద్ధి, దాని నుండి మనస్సు ప్రసరిస్తుంది. చెవి మొదలయిన వానితో కలిసివమనస్సు శబ్దాదులను గ్రహిస్తుంది. శబ్దాదులను, సర్వవ్యక్తీకరణాలను విడిచి, ప్రకృతి వలన ఏర్పడిన స్థూల సూక్ష్మ కారణదేహాలను వదలినవాడు మోక్షానందాన్ని పొందుతాడు. ఉదయిస్తూ సూర్యుడు కిరణ సమూహం సృష్టిస్తాడు. అస్తమిస్తూ ఆ కిరణసమూహం తనలోనే కలుపుకొంటాడు. అలాగే అంతరాత్మ కూడా శరీరాన్ని ఆవేశించి, ఇంద్రియాలనే కిరణాలతో ఇంద్రియగుణాలు అయిదింటిని పొంది, మళ్లీ అస్తమిస్తాడు. కర్మ చేత తీసికొనిరాబడిన దారిలోకి మళ్లీమళ్లీ వస్తూ జీవుడు కర్మఫలం అనుభవిస్తాడు. ప్రవృత్తి ప్రధానమైన ధర్మం పొందాడు కదా ! ఆహారం విడిచిపెట్టిన దేహికి విషయాలు వెనుదిరిగి పోతాయి. కాని వాసనాత్మకమైన ప్రీతి ఉంటుంది. పరమాత్మను దర్శిస్తే ఆ వాసన కూడ ఉండదు. కర్మగుణాలు లేని బుద్ధి మనసులో ప్రవర్తిస్తూ ఉన్నా అతడు బ్రహ్మమే అవుతాడు. మనస్సు అక్కడే ప్రవిలాపం/నాశం చెందింది గనుక. ఆ బ్రహ్మము స్పర్శలేనిది. వినలేము - రుచికి అందదు - చూడలేము - వాసనకు అందనిది - ఊహకందనిది - అటువంటి పరబ్రహ్మమును బుద్ధి ప్రవేశిస్తుంది. ఆకారాలన్నీ మనసులో మునిగిపోతాయి. మనసు బుద్ధితో చేరుతుంది. బుద్ధి జ్ఞానం (జీవుడు)లో చేరుతుంది. జ్ఞానం పరమాత్మలో ప్రవేశిస్తుంది. ఇంద్రియాలతో మనస్సుకు సిద్ధిలేదు. బుద్ధిని మనస్సు ఎరుగదు. బుద్ధి అవ్యక్తాన్ని తెలుసుకోలేదు. సూక్ష్మం మాత్రం వీటి అన్నిటినీ దర్శిస్తుంది.'

205. మను బృహస్పతి సంవాదము - 5 (పరబ్రహ్మ పాప్త్యుపాయము).

మనువు చెపుతున్నాడు. 'శారీరిక, మానసిక దుఃఖాలతో యోగానికి విఘ్నం కలిగి, యోగాభ్యాసం చేయలేనపుడు ఆ విఘ్నం గురించి ఆలోచించకూడదు. అలా ఆలోచింపక పోవడమే ఆ దుఃఖానికి చికిత్స. చింతిస్తూ ఉంటే అదే మళ్లీ మళ్లీ కలుగుతూ ఉంటుంది. ప్రజ్ఞతో మానసిక దుఃఖాన్ని, మందులతో శరీర దుఃఖాన్ని పోగొట్టుకోవాలి. ఈ విజ్ఞానసామర్థ్యం బాలురలో సమంగా ఉండదు. యౌవనం, రూపం, జీవితం, ధనసంగ్రహణం, ఆరోగ్యం, ప్రియులతో కలిసి ఉండటం - ఇవన్నీ అశాశ్వతాలు. తెలివైనవాడు వీటికోసం వెంపర్లాడరాదు.* అందరికీ సంబంధించిన దుఃఖం గురించి ఒక్కడుగా విచారింపరాదు. విచారించకుండా

* అనిత్యం యౌవనం రూపం జీవితం ద్రవ్యసంచయః ।
ఆరోగ్యం ప్రియసంవాసః గృధ్యేత్తత్ర వ పండితః ॥ 4

ప్రతీకార మార్గం తెలిస్తే దాన్ని ఆచరించాలి. జీవితంలో సుఖం కంటె దుఃఖమే అధికం. సందేహంలేదు. ఇంద్రియాసక్తితో మోహం కలుగుతుంది. దానితో చావు అప్రియంగా కనిపిస్తుంది. సుఖ దుఃఖాలు రెంటినీ విడిచిన మానవుడు తప్పక బ్రహ్మమును పొందుతాడు. అలా పొందిన పండితులు దేనికీ విచారించరు.* ధనాలు దుఃఖంతో సాధించాలి. వాటి రక్షణంలో కూడ సుఖం లేదు. దుఃఖంతోనే నశిస్తాయి. అందుచేత అర్థాలను గురించి ఆలోచించరాదు. జ్ఞేయం (తెలియదగినది) నుండి జ్ఞానం ఏర్పడుతుంది. జ్ఞానమే గుణంగా కలది మనస్సు. ఆ మనస్సు జ్ఞానేంద్రియాలతో కూడితే అపుడు బుద్ధి ప్రవర్తిస్తుంది. కర్మ గుణ రహితమైన బుద్ధి మనస్సులో ప్రవర్తిస్తున్నపుడు ధ్యానయోగ సమాధిచేత పరబ్రహ్మ తెలియవస్తుంది. ఇంద్రియగుణోపేతమయిన బుద్ధి అజ్ఞానం నుండి బయటపడి, పర్వత శిఖరం మీద నుండి ప్రవహించే నీటివలె గుణాల మీదనే సంచరిస్తూ ఉంటుంది. పూర్వమే పుట్టిన ధ్యేయవస్తువు బుద్ధి వృత్తిలో నిర్గుణత్వం పొందితే, అపుడు ఒరపిడి రాతి మీది బంగారు రేఖలాగా బ్రహ్మ తెలియవస్తుంది.

మనస్సు ఇంద్రియార్థాలను నిరూపిస్తుంది. కాబట్టి ముందే కనబడకుండా పోయింది. ఆ స్థితి ఇంద్రియాలకు దగ్గరగా ఉన్న గుణాలను కోరదు. గుణాలు లేని పరబ్రహ్మను ప్రదర్శిస్తుంది. ఇంద్రియా లనే ద్వారాలన్నింటిని మూసి మనస్సును ఏకాగ్రంచేసి, బుద్ధిలో లయం చేయాలి. దాని తరువాతి స్థితి - పరమాత్మస్థితి అపుడు పొందుతాడు. గుణాలయిన శబ్దాదులు నశించితే వాని కార్యాలు అనగా మహాభూతాలు లయమవుతాయి. అలా మనసులో లయమవుతున్న బుద్ధి ఇంద్రియాలను గ్రహించియే లయ మవుతుంది. మనసులో తిరుగుతూ బుద్ధి ప్రవర్తించేటప్పుడు నిశ్చయాత్మక గుణం కలిగి ఉన్నా అది మనస్సే. ధ్యానగుణం కల మనస్సు శబ్దాదులతో పాటు గుణాలు పొందినపుడు, అన్ని గుణాలను పట్టుకొని నిర్గుణ పరబ్రహ్మను పొందుతుంది. అవ్యక్తానికి సంబంధించిన విజ్ఞానంలో తుల్యమయిన నిదర్శనం ఏదీ లేదు. వాగ్వ్యవహారం లేని విషయాన్ని ఎవడు పొందగలడు ? తపస్సు, అనుమానం, గుణాలు, జాతి, వేదాంతం, విశుద్ధమైన అంతరాత్మ - వీటిచేత పరబ్రహ్మను పొందవచ్చు. గుణస్పర్శ లేనివాడు పరమాత్మను వెలుపలి ఆకారాల్లో సమన్వయించుకొంటాడు. జ్ఞేయ మని (తెలియదగినదని) ప్రసిద్ధి కెక్కిన ఆ పరమాత్మ తర్కానికి అందదు. కారణం నిర్గుణత్వం కావచ్చు. స్వభావం కావచ్చు. గుణాల్లో తిరగటం

* పరిత్యజతి యో దుఃఖం సుఖం వాప్యుభయం నరః ।
అభ్యేతి బ్రహ్మ సోఽత్యంతం న తే శోచంతి పండితాః ॥ 7

అలవాటు పడింది బుద్ధి. దాన్ని నిర్గుణం చేసుకొంటే బ్రహ్మను దర్శిస్తుంది. గుణ సంపర్కం వల్ల దానినుండి మరలిపోతుంది. తడివస్తువుపై అగ్ని ప్రసరించదు. ఎండు వస్తువుపై సులభంగా ప్రసరిస్తుంది. నిద్రలో అయిదు ఇంద్రియాలూ తమ పనులనుండి వేరయిపోయినట్లు పరబ్రహ్మ ప్రకృతి నుండి సంపర్కం లేనిదవుతుంది. ఇలా జీవు లందరూ ప్రకృతితో ప్రవర్తిస్తారు. ప్రకృతి మరలితే ముక్తు లవుతున్నారు. అలా నివారింప బడకపోతే ప్రవృత్తి ఫలంగా స్వర్గం పొందుతారు. పురుషుడు, ప్రకృతి, బుద్ధి, విషయాలు, ఇంద్రియాలు, అహంకారం, అభిమానం - ఈ సముదాయమే భూతం అనేపేరు కలది. ఈ భూత సంఘం యొక్క మొదటి ప్రవృత్తి ప్రధానం వల్ల ప్రవర్తిస్తుంది. రెండవ సృష్టి మిథునధర్మంతో నియమింపబడింది. **ధర్మం వల్ల భూతసంఘం శ్రేయస్సును పొందుతోంది. అధర్మం వల్ల ప్రేయస్సును పొందుతోంది. రాగం కలవాడు ప్రకృతిని పొందుతాడు. విరక్తుడు జ్ఞానవంతు డవుతాడు.'**

206. మను బృహస్పతి సంవాదము - 6.

మనువు చెపుతున్నాడు. 'శబ్దం మొదలయిన అయిదు విషయాలలో అయిదు ఇంద్రియాలనూ, మనసునూ నిగ్రహించగలిగినపుడు మణులలో ఉన్నదారం వలె పరబ్రహ్మ దర్శింపబడుతుంది. అదే దారం బంగారంలోను, ముత్యాల లోను, పగడాలలోను, మట్టిపూసలలోను, వెండి నగలలోను కూడ ఉంటుంది. అలాగే ఆసక్తమైన చిత్తం కలవాడు తనకర్మలతో ఆవు, గుర్రం, మానవులు, ఏనుగులు, మృగాలు, పురుగులు పక్షులు, అనే వాటిలోనూ తిరుగుతూ ఉంటాడు. జీవుడు ఏ శరీరంతో ఏకర్మ చేస్తాడో ఆ శరీరంతో ఆ ఫలం అనుభవిస్తాడు. భూమి ఒకే రసంకలదయినా, ఓషధులను బట్టి వేర్వేరు పంటలను పండిస్తుంది. అలాగే బుద్ధి అంతరాత్మ సాక్షిక మయినా కర్మలను అనుసరిస్తుంది. బుద్ధిని బట్టి రాగం, రాగాన్ని బట్టి ప్రయత్నం, ప్రయత్నాన్ని బట్టి కర్మ, కర్మను బట్టి ఫలమూ కలుగుతుంది. ఫలం కర్మనుబట్టి పుడుతుంది. కర్మం జ్ఞేయాన్నిబట్టి, జ్ఞేయం జ్ఞానాన్ని బట్టి, జ్ఞానం సదసదాత్మకమైన దానిని బట్టి పుడతాయి. ఇంద్రియజ్ఞానాలు, ఫలాలు, జ్ఞేయాలు, కర్మలు - అన్నీ నశించిన తరువాత మిగిలే ఫలం జ్ఞానం. అది జ్ఞేయంలో చక్కగా ప్రతిష్ఠితమై ఉంది. మహత్తు అనేది పరమ మయిన భూతం. దాన్ని యోగులు చూస్తారు. గుణ బుద్ధు లయిన అబుద్ధులు ఆత్మలో ఉన్న దాన్ని చూడలేరు. **పృథివీరూపం కంటె జలరూపం పెద్దది. దానికంటె మహత్తరం అగ్ని. అగ్ని కంటె గొప్పది వాయువు. వాయువు కంటె ఆకాశం గొప్పది. దానికంటె గొప్పది మనస్సు.**

మనస్సు కంటె బుద్ధి గొప్పది. బుద్ధి కంటె కాలం, కాలం కంటె విష్ణువు గొప్పవాడు. ఈ జగత్తు అంతా తనదే. ఆయనకు ఆది, మధ్యం, అంతం లేదు. ఆది మధ్యాంతాలు లేక పోవడం చేత అతడు అవ్యయుడు. దుఃఖా లన్నిటిని దాటిపోయినవా డతడు. దుఃఖానికి అంతం ఉంటుందంటారు. అతడే పరబ్రహ్మమని చెప్పబడినాడు. అతని స్థానమే పరమపదం. దాన్నిచేరి కాల విషయ విముక్తులై మోక్షాన్ని పొందుతారు. వీరు గుణాలలో (శరీరాలలో) ప్రకాశిస్తారు. పరమాత్మ నిర్గుణు డవడం వలన వీరిని మించినవాడు. ఇలా నివృత్తి లక్షణమైన ధర్మం మోక్షానికి కారణ మవుతుంది. బుగ్యజుస్సామాలు అధ్యయన సమయంలో శరీరాలను ఆశ్రయించి, జిహ్వాగ్రాల మీద ఉంటున్నాయి. ఆవి యత్న సాధ్యాలు. వినాశ స్వభావాలు.

కాని పరమాత్మ శరీరాశ్రయంతో పుట్టినా వేదాధ్యయనంవలె యత్న సాధ్యంకాదు. దానికి ఆది మధ్యాంతాలు లేవు. బుగ్యజుస్సామాలకు ఆది ఉందంటారు. ఆది ఉంటే అంతం ఉన్నట్లే. బ్రహ్మమునకు ఆది అనేది లేదు. ఆద్యంతాలు లేకపోవడం వలన అది అనంతం, అవ్యయం అవుతుంది. అవ్యయమవడంవల్ల దుఃఖం లేనిది అవుతుంది. ద్వంద్వరహిత మవుతుంది. అదృష్టం వల్లనూ, ఉపాయం లేకపోవడం వల్లను, కర్మ ఫలాసక్తి వల్లను మానవులు బ్రహ్మపదమును తెలిసికొనే మార్గం పొందలేకపోతున్నారు. విషయాసక్తి వల్లను, దానిని శాశ్వతమని భావిస్తున్నందు వల్లనూ మనసుతో మరో దాన్ని కాంక్షిస్తూ మానవుడు పరాన్ని పొందలేక పోతున్నాడు. మరికొందరు ఇక్కడ చూచిన గుణాలనే కోరుతూ ఉంటారు. గుణాలను కోరేవారు నిర్గుణమవటంవల్ల పరాన్ని కోరరు. హీనగుణాలతో కూడిన వాడు ఉత్తమగుణాలను ఎలా తెలుసుకోగలడు ? అవయవాలయిన గుణాలతో అనుమానం వల్లనేకదా పరం పొందదగినది ! **సూక్ష్మమనస్సుతో దానిని తెలుసుకొంటాం. కాని వాక్కుతో చెప్పలేం. మనస్సుచేత మనస్సు, కంటితో కన్ను మాత్రమే గ్రహింపబడుతుంది.** జ్ఞానం చేత బుద్ధిని, బుద్ధిచేత మనస్సును, మనస్సు చేత ఇంద్రియ సముదాయాన్ని నిర్మలంగా చేసికొని అక్షరమైన బ్రహ్మను పొందవచ్చు. బుద్ధి ప్రవీణుడై మనస్సుతో సమృద్ధుడైన వ్యక్తి ఆశలు, గుణాలు లేని పరమాత్మను పొందుతాడు. కట్టెలో దాగిన అగ్నిని వాయువు త్యజించినట్లు కల్లోలితమైన మనస్సుకల వారు పరాన్ని విడిచిపెడతారు.

గుణాలను రూపుమాపి వేయడంలో మనస్సు సదా బుద్ధికి పరమైన బ్రహ్మను చేరుతుంది. గుణాల ఎడబాటులో బుద్ధికంటె తక్కువయిన ఐశ్వర్యాన్ని మనసు చేరుతుంది. అలాగే గుణాలను తొలగించుకోవా లనుకొన్నవాడు బ్రహ్మస్వరూపాన్ని పొందుతాడు.

అవ్యక్తమయిన ఆత్మకల పురుషుడు వ్యక్తకర్మలతో అంతకాలంలో వ్యక్తతను పొందుతున్నాడు. వృద్ధి పొందే, నలిగిపోయే ఆ ఇంద్రియాలతో నిష్కామరూపుడై తిరుగుతూ ఉంటాడు. ఈ జీవతత్త్వం సర్వేంద్రియాలతో కూడి, దేహం పొంది, పంచభూతాలను ఆశ్రయించి ఉంటోంది. అందులో పరమమూ, అవ్యయమూ అయిన తత్త్వం లేదు. అందువల్లనూ, అసమర్థత వల్లనూ ఏ కర్మమూ చేయలేకపోతోంది. భూమియొక్క అంతాన్ని నరుడు చూడడు కాని దానికి అంతం ఉంది అని తెలుసుకో. అలాగే దుఃఖానికి అంతం ఉంది. సముద్రంలోని గడ్డిని ప్రవాహాని కనుగుణంగా గాలి కదిలిస్తూ, ఒడ్డుకు చేరుస్తుంది. అలాగే కర్మలు జీవుని ఒడ్డుకు చేరుస్తాయి. సూర్యుడు కిరణాలను స్వీకరించి ఉదయిస్తాడు. గుణాలను కిరణాలను వదలి అస్తమిస్తాడు. అలాగే జీవుడు సుఖిత్వాది ధర్మాలు వదలి అవ్యయమూ, నిర్గుణమూ అయిన బ్రహ్మాను ప్రవేశిస్తాడు. (సూర్యునకు ఉదయాస్తమానాలు ఉన్నట్లే చైతన్యం భాసించిన వారికీ ఉన్నాయని భావం). పరబ్రహ్మం ఎక్కడ నుంచో రాకుండా స్వయంగా ఉద్భవిస్తుంది. పుణ్యాత్ములకు పరమగతి అవుతుంది. స్వయంభువు, అన్నిటికి ప్రభవమూ, నిధానమూ కూడా. అది సనాతనం, అమృతం, అవ్యయం, ధ్రువం. అటువంటి పరబ్రహ్మాను తెలిసిన మానవుడు మోక్షం పొందుతాడు.'

207. సర్వభూతోత్పత్తి.

ధర్మరాజు ఇలా అన్నాడు. 'మహాప్రాజ్ఞా ! తాతా ! పుండరీకాక్షుడు, అచ్యుతుడు, సర్వానికీ కర్త, తనకు కర్త లేనివాడు, విష్ణువు, భూతాలకు పుట్టుక స్థానం, నారాయణుడు, హృషీకేశుడు, గోవిందుడు, అపరాజితుడు అయిన కేశవుని గురించి తాత్త్వికంగా వినాలనుకొంటున్నాను.' భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ విషయం నాకు పరశురాముడు, నారదుడు, వ్యాసుడు చెపితే తెలిసింది. కుమారా ! అసితుడైన దేవలుడు, మహాతపస్వి వాల్మీకి, మార్కండేయుడు, గోవిందుని అద్భుతమాహాత్మ్యాన్ని చెపుతూ ఉంటారు. కేశవుడు భగవంతుడు, ఈశ్వరుడు, ప్రభువు, పురుషుడు, విభువు, సర్వమునూ అని ఎన్నోవిధాల వినబడుతోంది. శార్ఙ్గధన్వుడు, మహాత్ముడూ అయిన శ్రీకృష్ణుని గురించి బ్రాహ్మణు లెరిగిన మాహాత్మ్యాలను చెపుతాను విను. పురాణవేత్తలయిన జనులు ప్రీతితో ప్రశంసించే గోవిందుని సత్కృత్యాలను కీర్తిస్తాను విను.

మహాత్ముడు, భూతాత్ముడూ అయిన పురుషోత్తముడు వాయువు, అగ్ని, జలం, ఆకాశం, భూమి అనే మహాభూతాలను సృష్టించాడు. భూమిని సృష్టించాక పురుషోత్తముడూ, సర్వభూతేశ్వరుడూ అయిన ప్రభువు నీటిలోనే తన నివాసం

ఏర్పరచుకొన్నాడు. (నీరు గల దేహాలలో అని భావం) సర్వతేజోమయుడయి నీటిపై పవళించిన పురుషోత్తముడు భూతా లన్నిటికీ ముందు సంకర్షణుని సృష్టించాడు. మనసుతోపాటు సృష్టింపబడిన ఆ సంకర్షణుడు సర్వభూతాలకూ ఆశ్రయమని విన్నాము. అతడు భూత భవిష్యత్ప్రాణులన్నిటిని నిలుపుతాడు. మహాత్ముడు, మహాబాహువు అయిన అతడు పుట్టాక అతని బొడ్డులో సూర్యునిలా వెలిగిపోతున్న పద్మం ఒకటి ఉద్భవించింది. ఆ పద్మంలో దిక్కులను వెలిగిస్తూ, భగవంతుడు, సర్వభూత పితామహుడూ అయిన బ్రహ్మ పుట్టాడు. మహోత్తుడు, మహాబాహువు అయిన బ్రహ్మ పుట్టాక తమోగుణంతో అనాది అయిన మధువనే రాక్షసుడు పుట్టాడు. బ్రహ్మకు ఉన్నతిని కలిగిస్తూ ఉగ్రుడు, ఉగ్రకర్ముడు అయిన మధువును పురుషోత్తముడు సంహరించాడు. కుమారా ! ఆ మధువును సంహరించడం చేత దేవదానవులూ, మానవులూ అందరూ యోగేశ్వరు డయిన అతనిని మధుసూదనుడని కీర్తించారు.

మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు అని ఏడుగురు మానపుత్రులను బ్రహ్మ సృష్టించాడు. ఆ మానసపుత్రులలో పెద్దవాడయిన మరీచి తేజోరూపునిగా, బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠునిగా కశ్యపుని పుట్టించాడు. బ్రహ్మ తన బొటన వ్రేలినుండి మరీచి కంటె పూర్వమే దక్షుడనే వానిని సృష్టించాడు. అతడు ప్రజాపతి అయ్యాడు. అతనికి పూర్వమే ప్రజాపతి కూతుళ్లు పదమూడు మంది పుట్టారు. వారిలో పెద్దది దితి. ధర్మవిశేషాలన్నీ తెలిసి పుణ్యకీర్తి, మహాయశస్వి అయిన కశ్యపుడు అందరికీ పతి అయ్యాడు. వారిలో చివరి పది మందిని పుణ్యాత్ముడు, ధర్మజ్ఞు డయిన దక్ష ప్రజాపతి ధర్మునకు భార్యలుగా ఇచ్చాడు. ధర్మువునకు వసువులు, అమిత తేజస్వులయిన రుద్రులు, విశ్వేదేవులు, సాధ్యులు, మరుత్వంతులు పుత్రులయ్యారు. వారికి చెల్లెళ్లు ఇతరులు ఇరవై ఏడుగురు. వారికి చంద్రుడు భర్త అయ్యాడు. కశ్యపుని ఇతర భార్యలు గంధర్వులను, గుర్రాలను, పక్షులను, గోవులను, కింపురుషులను, చేపలను, వృక్షాలను, వనస్పతులను పుట్టించారు. అదితి మహాబలంతో దేవశ్రేష్ఠులయిన ఆదిత్యులను కన్నది. వారిలో విష్ణువు, గోవిందుడు, వామనుడు ఉన్నారు. ఆ వామనుని విక్రమణం వల్ల కూడా దేవతల సంపద వృద్ధి పొందింది. దానవులు పరాభవం పొందారు. దితి సంతానమయిన ఆసుర సంతతి పరాభవం పొందింది. దనువు విప్రచిత్తి మొదలయిన దానవులను కన్నది. దితి బలవంతులయిన అసురుల నందరను కన్నది. మధుసూదనుడు ఋతువుల ననుసరించి రాత్రింబవళ్లు కల కాలమూ, పూర్వాహ్ణము అపరాహ్ణము అనే కాలభాగాలను అన్నిటిని ఏర్పరిచాడు. అతడే చక్కగా భావించి మేఘాలను, స్థావర జంగమాలను, సమస్త పృథివిని

భూరితేజస్సుతో సృజించాడు.

ధర్మజా ! తరువాత కృష్ణుడు తన ముఖం నుండియే అనంత బ్రాహ్మణులను సృష్టించాడు. బాహువుల నుండి క్షత్రియ సముదాయాన్ని, తొడలనుండి వైశ్యులను, పాదాలనుండి శూద్రులను కేశవుడు సృష్టించాడు. మహాతపస్వి ఇలా నాల్గువర్ణాలను పుట్టించి సర్వభూతాలకూ అధ్యక్షునిగా బ్రహ్మదేవుని స్వయంగా నియమించాడు. వేదవిద్యావిధాత, అమిత వర్చస్సు కలవాడు, భూతాలకు మాతృగణాలకు అధ్యక్షు డయిన విరూపాక్షుని కేశవుడు సృష్టించాడు. పాపులను, పితృదేవతలను శాసించే సమవర్తిని, ధనేశ్వరుడు అయిన కుబేరుని సర్వభూతాత్ముడు సృష్టించాడు. జలజంతువులకు, జలాలకు ఈశ్వరుడయిన వరుణుని సృష్టించాడు. దేవత లందరికీ అధ్యక్షునిగా ఇంద్రుని సృష్టించాడు. నరులకు దేహాలమీదగల శ్రద్ధ ననుసరించి వారు బ్రతికే వారు. వారికి యముని వలన భయం లేకుండా ఉండేది. అప్పటి వారికి మిథునకర్మ లేదు. సంకల్పమాత్రం చేతనే వారికి సంతానం కలిగేది. తరువాత త్రేతాయుగంలో సంస్పర్శ వల్లనే సంతానం కలిగేది. వారికీ మిథున కర్మ లేదు. ద్వాపరంలో ప్రజలకు మిథునకర్మ ఏర్పడింది. అలాగే కలియుగంలోనూ మైథున కర్మను జనులు పొందారు. ఈ కేశవుడు భూతపతి, అందరికీ అధ్యక్షుడు. ఇక నిరపేక్షులను గురించి వివరిస్తాను ధర్మజా ! విను. దక్షిణాపథంలో జన్మించిన ఆంధ్రకులు, గుహులు, పుళిందులు, శబరులు, చూచుకులు, మద్రకులు- వీరు నిరపేక్షులు. నరకాన్ని చూసేవారు ఉత్తరాపథంలో జన్మించిన వారిని గురించి కూడా చెపుతాను. యౌనులు, కాంబోజులు, గాంధారులు, కిరాతులు, బర్బరులు- వీరు పాప కృత్యాలు చేస్తూ భూమిమీద సంచరిస్తూ ఉంటారు. వీరి లక్షణాలు కుక్కమాంసం తినేవారితో, రాబందులతో, గ్రద్దలతో సమానంగా ఉండేవి. వీరు కృతయుగంలో ఈ భూమిపై సంచరించలేదు. త్రేతాయుగంనుండి ఇటువంటివారు పెరగడం మొదలయినది. త్రేతాద్వాపర యుగాల సంధికాలం వచ్చినపుడు రాజులంతా ఒకరికొకరు తలపడి యుద్ధం చేయ మొదలు పెట్టారు. ఇలా మహాత్ముడయిన శ్రీకృష్ణుని ద్వారా భూత సృష్టి ఏర్పడింది.

తపః స్వరూపుడు, మహాదేవుడు, దేవకి పుత్రుడు, అయిన కృష్ణుని అనుగ్రహంతో దుఃఖనాశం పొందుతావు ధర్మజా ! అన్నిటికీ కర్త కృష్ణుడు ఒక్కడే. అతడే జ్ఞానులకు పరమగతి అయినవాడు. దీన్ని ఆశ్రయించి దేవేంద్రుడు, దేవతలు, రుద్రులు, అశ్వినులు, భుక్తి ముక్తులు ఎరిగిన మహర్షులూ తమ తమ పదాలలో ప్రవేశించారు. అతడు ప్రాణు లన్నిటి అంతరాత్మ. వైకుంఠంలో యోగమాయతో ఆవృతమై ఉంటాడు. అతని ఉనికిని గురించి విను. నీకు చక్కని జ్ఞానం కలుగుతుంది. పూర్వం దేవర్షి, పరమార్థం తెలిసినవాడు అయిన నారదుడు తీర్థసేవనం చేస్తూ భూమి అంతటా తిరుగసాగాడు.

అతడు చాలా ఆలోచించి హిమవత్పర్వత పాదాన్ని చేరి పద్మాలతో, కలువలతో నిండిన ఒక సరస్సును చూశాడు. మహాతేజస్వి అయిన అతడు స్నానంచేసి, ఇంద్రియ సంయమనంతో, మౌనంగా భగవంతుని అద్భుతరహస్యం తెలుసుకోవాలని అతనిని స్తుతించాడు. అలా నూరు సంవత్సరాలు నిండాయి. అపుడు నారదుని మీది సౌహార్దంతో భగవంతుడయిన లోకభావనుడు ప్రత్యక్షమయ్యాడు. అతడు జగన్నాథుడు. సర్వకారణాలకూ కారణ రూపుడు. దేవతల కిరీటాలలోని బంగారు కాంతులచే ఎర్రబడిన పాదాలు కలవాడు. గరుత్మంతుని పాదాల రాపిడికి అతని మోకాళ్లమీద కిణాలేర్పడ్డాయి. కటీతటం మీద పీతాంబరం, దాని మీద బంగారు మేఖల ఉంది. రొమ్ము మీద శ్రీవత్సం ఉంది. మెడలో కౌస్తుభమణి ఉంది. నవ్వుతున్నట్లున్న పద్మంవంటి ముఖం, విశాలమయిన చంచల నేత్రాలు, వింటివలె వంగిన కనుబొమ లున్నాయి. అతని చెవికి నానారత్నాలూ, మణులూ, వజ్రాలూ పొదిగిన మకర కుండలాలు ఉన్నాయి. ఇంద్ర నీలమణివలె నీలవర్ణంతో శోభిల్లుతున్నాడు. భుజాల మీదకేయూరాలూ, శిరసుపై కిరీటం ధరించాడు. ఇంద్రుడు, దేవతలు, ఋషి సంఘాలూ స్తుతిస్తున్నారు. అటువంటి జగన్నాథుని చూసి నారదుడు జయశబ్దపూర్వకంగా తలవంచి నమస్కరించాడు. పాదాభివందనం చేసిన నారదునితో సర్వభూత నాథు డయిన భగవంతుడు మేఘగంభీర మయిన వాక్కులతో ఇలా అన్నాడు. 'మహర్షీ ! నీకు శుభమస్తు. సువ్రతా ! నీమనసులో ఉన్న స్పష్టమయిన వరం కోరుకో ఇస్తాను.' భీష్ముడు చెపుతున్నాడు. 'జయ జయ శబ్దం చేస్తూ ఆతురు డయిన నారద మహర్షి శంఖ చక్రగదాధరు డయి మనసులో నిలిచిన భగవంతునితో 'జగన్నాథా ! అనుగ్రహించు నేను మనసులో అనుకొన్నది నీకు ముందే తెలుసును. అదే నేను వినాలను- కొంటున్నాను. నా మీద ప్రసన్నుడవు కమ్ము.' అన్నాడు. అపుడు నవ్వుతూ నారదునితో శ్రీ మహావిష్ణువు ఇలా అన్నాడు. 'నిర్ద్వంద్వులూ, అహంకార రహితులు, శుచులు, నిర్మలలోచనులు నన్ను సతతమూ చూస్తూ ఉంటారు. నీకేదయినా కోరిక ఉంటే వారి నడుగు. నారదా ! యోగులూ, మహాప్రాజ్ఞులూ నా అంశతో నిలిచిన వారు. వీరి అనుగ్రహం నా అనుగ్రహమే అని తెలుసుకో !' అని చెప్పి భూతభావను డయిన భగవంతుడు వెళ్లి పోయాడు. అందుచేత హృషీకేశుడు, దేవకీసుతుడు అయిన కృష్ణుని శరణు వేడు. ఈ గోవిందుని ఆరాధించి మహర్షులు ముక్తి పొందారు. అతడు సృష్టి, లయం చేస్తాడు. సర్వకారణాలకూ కారణం అతడే. ఇదంతా కూడా నేను నారదుని వల్లనే విన్నాను. తెలుసుకో ధర్మజా ! నారద భగవానుడే నాతో స్వయంగా చెప్పాడు. **సంసార భంజనం చేయగల విష్ణుని ఏకాగ్ర మనస్సుతో కొలిచే వారికి, దుర్లభమైన సాయుజ్యం కలుగుతుంది అని మహర్షులు కూడా వర్ణిస్తారు.**

సర్వలోక సందర్శకుడయిన దేవర్షి నారదుడు దేవుని గురించి ఇలా చెప్పాడు. రాజా ! నారదుడు కృష్ణుని శాశ్వతత్వాన్ని ఉన్నదున్నట్లు భావించాడు. ఇలా ఈ మహాభుజుడయిన కేశవుడు సత్యవిక్రముడు, చింతింపశక్యంకానివాడు, పుండరీకాక్షుడు. ఇతడు కేవల మానవుడు కాడు.'

208. దిశా స్వస్తికము.

యుధిష్ఠిరుడు చెపుతున్నాడు. 'భరతోత్తమా ! పూర్వం ఏ ఏ దిక్కుల ప్రజలకు ఎవరెవరు రాజు లయ్యారు ? ఋషు లయ్యారు ?' భీష్ముడు ఇలా చెపుతున్నాడు. 'ధర్మజా ! నన్ను అడిగినది చెపుతాను విను. ఏ దిక్కుల ప్రజలకు ఎవరు పతులో, ఎవరు ఋషులో చెపుతాను. ఆద్యుడు, స్వయంగా జన్మించినవాడు, సనాతనుడు అయిన బ్రహ్మ ఒకడే. ఆయనకు ఏడుగురు పుత్రులు. 1. మరీచి 2. అత్రి 3. అంగిరసుడు 4. పులస్త్యుడు 5. పులహుడు 6. క్రతుడు 7. బ్రహ్మసమానుడు అయిన వసిష్ఠుడు. ఈ ఏడుగురు బ్రహ్మాలని పురాణాలు నిశ్చయించాయి. ఇక ప్రజాపతు లందరిని గురించి చెపుతాను. అత్రి వంశంలో పుట్టినవాడు, బ్రహ్మ కుమారుడు సనాతనుడు అయినవాడు ప్రాచీన, బర్హి. అతనికి పది మంది ప్రాచేతసులు జన్మించారు. ఈ పది మందికి దక్షుడనే ప్రజాపతి ఒకడే కొడుకు. అతనికి దక్షుడు, 'క' అని రెండు పేర్లు. మరీచికి కశ్యపుడు పుత్రుడు. అతనికి అరిష్టనేమి, కశ్యపుడు అని రెండు పేర్లు. అత్రి ఔరసపుత్రుడు శ్రీమంతుడు, వీర్యవంతుడు, రాజు అయిన సోముడు. అతడు వేయి దివ్యయుగాలు తపస్సు చేశాడు. అర్యముడు ప్రజాపతి. అతడూ, కుమారులూ ఈ లోకా లన్నిటిని సృష్టించి, పాలించే శీలం కలవారు. శశబిందునికి పదివేల మంది భార్యలు. వారికి ఒక్కొక్కరికి వెయ్యిమంది చొప్పున పుత్రులు జన్మించారు. ఇలా కోటి మంది పుట్టారు. వీరిలో ఏ ఒక్కడూ ఇతరుని ఎవరినీ ప్రజాపతిగా అంగీకరించలేదు. ప్రాచీన బ్రాహ్మణులు ప్రజోత్పత్తి శశిబిందుని నుండియే ఎక్కువగా జరిగిందంటారు. అతడు వృష్టివంశ కారకుడు. అది మహావంశం. ఈ యశస్వులు ప్రజాపతులని పేరు పొందారు. త్రిభువనాలకూ నాథు లయిన దేవతలను గురించి చెపుతాను విను.

భగుడు, అంశుడు, అర్యముడు, మిత్రుడు, వరుణుడు, సవిత, ధాత, వివస్వంతుడు, త్వష్ట, పూష, ఇంద్రుడు, విష్ణువు- ఈ పండ్రెండుమంది కశ్యపపుత్రు లయిన ఆదిత్యులు. ఎనిమిదవ ఆదిత్యుడు మార్తండుడు. వీని కుమారులు నాసత్యుడు, దస్రుడు. వీరిని అశ్వినులనీ అంటారు. (మార్తండుడే వివస్వంతుడు) వీరూ, ముందు చెప్పిన దేవతలు - ఈ ఇద్దరూ పితృదేవతలుగా వ్యవహరింపబడతారు. త్వష్ట కుమారుడు విశ్వరూపుడు శ్రీమంతుడు, మహాయశస్వి. అజైకపాదుడు, అహిర్బుధ్న్యుడు, విరూపాక్షుడు, రైవతుడు, హరుడు, బహురూపుడు, సావిత్రుడు, త్ర్యంబకుడు, పినాకి - వీరు ఏకాదశ రుద్రులు. అష్టవసువులు పూర్వమే చెప్పబడినారు. ఈ దేవతలంతా మను వను ప్రజాపతికి సంబంధించినవారే. వారు, దేవతలూ తరువాత పితృదేవతలుగా చెప్పబడ్డారు. సిద్ధులు,

సాధ్యులు అనేవారిలో మొదటి సిద్ధగణం శీలాన్ని బట్టి, రెండవ సాధ్యగణం పరువాన్ని బట్టి ఏర్పడ్డాయి. దేవతలగణం ఋభువులు, మరుత్తులు అయ్యారు. ఇలా వీరు విశ్వేదేవులు, అశ్వినులు అని పేరు పొందారు. వారిలో ఆదిత్యులు క్షత్రియులు. మరుత్తులు. వైశ్యులు తీవ్రతపస్సుచేసే అశ్వినులు శూద్రులు. అంగిరసులు బ్రాహ్మణులు అని నిశ్చయింపబడ్డారు. ఇలా దేవతలలో చాతుర్వర్ణ్యం కూడ చెప్పబడింది. వీటిని ఉదయమే లేచి కీర్తించినవానికి స్వయంకృత మయిన పాపమూ, ప్రేరణచే చేసిన పాపమూ రెండూ పోతాయి. యవక్రీతుడు, రైభ్యుడు, అర్వావసువు, పరావసువు, జౌశిజుడు, కక్షీవంతుడు, బలుడు (అంగిరసుని పుత్రుడు), మేధాతిథి పుత్రుడు కణ్వుడు, బర్హిషదుడు, ఇంకా సప్తర్షులు- మూడులోకాలకూ మార్గదర్శకులయిన వీరంతా తూర్పు దిక్కున ఉండేవారు. ఉన్ముచుడు, విముచుడు, వీర్యవంతుడైన స్వస్త్యాత్రేయుడు, ప్రముచుడు, ఇధ్మవాహుడు, దృఢవ్రతుడు, మిత్రావరుణుల పుత్రుడైన అగస్త్యుడు - ఈ బ్రహ్మర్షులంతా దక్షిణంలో ఉన్నారు. ఉషంగుడు, కవషుడు, ధౌమ్యుడు, పరివ్యాధుడు, ఏకతుడు, ద్వితుడు, త్రితుడు అనే మహర్షులు, (అత్రికుమారుడయిన) సారస్వతుడు - ఈ మహాత్ములంతా పశ్చిమ దిక్కున ఉన్నారు. ఆత్రేయుడు, వశిష్ఠుడు, కశ్యపుడు, గౌతముడు, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, (బుచీకుని కొడుకు) జమదగ్ని- ఈ ఏడుగురూ ఉత్తర దిక్కున ఉన్నారు. ప్రతి దిక్కులోనూ ఉన్న తేజస్వులైన ఋషులను గూర్చి చెప్పాను. వీరంతా సాక్షి భూతులు, మహాత్ములు, సృష్టికర్తలు. ఇలా వీరంతా ఒక్కొక్క దిక్కున ఉన్నారు. వీరిని స్తుతించి సర్వపాపవిముక్తి పొందుతాడు. ఆయా దిక్కులలో శరణుపొంది, సర్వపాప విముక్తుడై శుభాలతో గృహాన్ని చేరుతాడు.'

209. అంతర్భూమి విక్రీడనము (అనుస్మృతి).

ధర్మరాజు ఇలా అడిగాడు. 'సత్యపరాక్రమా ! మహాప్రాజ్ఞా ! అవ్యయుడు, ఈశ్వరుడు అయిన కృష్ణుని గురించి పూర్తిగా వినాలనుకొంటున్నాను తాతా ! అతని తేజస్సు, పూర్వం అతడు చేసిన మహాకార్యాలు- అన్నీ తత్త్వ సహితంగా చెప్పండి. ప్రభువయిన అతడు ఏపని చేత పశుపక్ష్యాది రూపం ఎందుచేత పొందాడో చెప్పండి.' భీష్ముడు చెపుతున్నాడు. 'పూర్వం నేనొకసారి వేటకు వెళ్లి మార్కండేయాశ్రమంలో ఉన్నాను. అక్కడ వేలమంది మునులసమూహాలు కూర్చుని ఉన్నారు. అపుడా మునులు నన్ను మధుపర్కంతో సత్కరించారు. ఆ పూజను గ్రహించి నేను మళ్లీ వారిని గౌరవించాను.' అక్కడ కశ్యపమహర్షి నాకీ కథ చెప్పారు. మనస్సంతోషకారి అయిన ఆ కథను ఏకాగ్రతతో విను.

పూర్వం క్రోధంతో, లోభంతో నిండిన దానవముఖ్యులు, బలంతో మదించిన

మహాసురులు వందలకొలది ఉండేవారు. అలాగే ఇంకా చాలా మంది దానవులు యుద్ధ గర్వంతో ఒళ్లు తెలియక దేవతల ఉత్తమ సమృద్ధిని చూసి ఓర్వలేకపోయేవారు. దానవులు పీడించేవారు. దేవతలూ, దేవర్షులూ సుఖం లేక ఎక్కడెక్కడికో పారిపోయేవారు. మహాబలులు, ఘోరరూపులూ అయిన దానవులతో నిండిపోయి భూమి అంతా కుమిలిపోతున్నట్లు దేవతలు గమనించారు. భారంతో సంతోషం లేక దుఃఖితయై, మునిగి పోతున్నట్లున్న భూమిని చూసి, భయపడి, దేవతలు వెళ్లి బ్రహ్మతో ఇలా అన్నారు. 'పితామహా ! ఈ రాక్షసుల మహాబాధను ఎలా సహిస్తాం ?' అనేసరికి బ్రహ్మ "దీని కొక ఏర్పాటు నేను చేసేఉంచాను" అన్నాడు.

'వారు వరంతో, బలంతో, మదంతో, బలిసి ఒళ్లు తెలియక అవ్యక్తదర్శను డయిన విష్ణుని తెలియలేకపోయారు. ఆ విష్ణువు వరాహరూపుడు. అమరులకూ అణచరాని వాడు. అపు డతడు వేగంగా వెళ్లి, భూమిలోపల వేలకొలదిగా ఉన్న భయంకరులైన దానవాధములను అణిచివేస్తాడు'. అన్నాడు. దేవతలు ఆ మాటలు విని సంతోషించారు. తరువాత మహాతేజస్వి అయిన విష్ణువు వరాహరూపం దాల్చి, భూమిలోపలికి ప్రవేశించి, రాక్షసుల మీదికి వెళ్లాడు. దివ్యుడూ, సత్త్వసహితుడూ అయిన విష్ణువును చూసి, దైత్యులంతా కాలమోహితులై, ఒక్కసారిగా ఎదిరించి నశించారు. వారంతా వరాహరూపుని ఒక్కసారిగా పట్టుకొన్నారు. కోపంతో వారు చుట్టూరా వరాహస్వామిని లాగి వేశారు. ఆ 'రాక్షసులు పెద్ద పెద్ద శరీరాలు కలిగి బలవిక్రమాలతో ఉప్పొంగుతున్నారు. అయినా స్వామిని ఏమీ చేయలేకపోయారు. దానితో వేలకొలదిగా ఉన్న దానవులకు ఆశ్చర్యమూ, భయమూతోపాటు సంశయం కూడా కలిగింది. అపుడు దేవాధిదేవుడు, యోగాత్ముడు, యోగసారథి అయిన భగవానుడు యోగం ధరించి, దైత్య దానవులకు భయంకలిగేటట్లు మహానాదం చేశాడు. దానితో లోకాలూ, దిక్కులూ అన్నీ మారుమ్రోగాయి. దానితో లోకాలకు క్షోభకలిగింది. ఇంద్రునితో సహా దేవతలకు కూడా చాలా భయం కలిగింది. లోకమంతా నిశ్చేష్ట మయిపోయింది. ఆ ధ్వనితో స్థావర జంగమాలన్నీ విమోహిత మయ్యాయి. ఆ దానవులంతా ఆ నాదంతో భయపడి, విష్ణు తేజస్సుతో మోహితులై ప్రాణాలు విడిచి, నేలగూలారు. రసాతలంలో ఉన్నా వరాహస్వామి రాక్షసుల మాంసాన్ని, మేదస్సును, ఎముకల ప్రోవులను గిట్టలతో చీల్చివేశాడు. ఆ మహాధ్వనితో పద్మనాభుడు, మహాయోగి, భూతా చార్యుడు, భూతరాట్టు అయిన స్వామి సనాతను డని తెలిసింది.

అపుడు దేవగణాలన్నీ జగత్పతి అయిన బ్రహ్మ దేవుని చేరి ఇలా అన్నాయి. 'ప్రభూ ! ఈ మహాధ్వని ఎవరిది ? ఏమిటి ? ఎటువంటిది ? మాకు తెలియటంలేదు.

లోకమంతా భయపడుతోంది, దేవతలూ దానవులూ కూడా ఆ తేజస్సుకు కళవళపడుతున్నారు. మోహితు లవుతున్నారు.' ఇంతలో విష్ణువు వరాహరూపం ధరించి, మహర్షులస్తుతులతో ఉద్భవించాడు. అపుడు పితామహుడు ఇలా అన్నాడు. 'ఈ మహాకాయుడు దానవ పతులను సంహరించిన మహాబలుడు. ఇతడు మహాయోగి, భూతాత్ముడు, భూత భావనుడు, సర్వభూతాలకూ ఈశ్వరుడు, యోగి, ముని, ఆత్మలకు ఆత్మ, సర్వ విఘ్న వినాశకుడు. ఇతడు కృష్ణుడు. మీరంతా కుదుట పడండి. ఇతడు మిక్కిలి సాధువు. ఇతరులు చేయలేని పనిచేసేవాడు. అంతులేని కాంతులు కలవాడు. మహావర్చస్వి అయిన ఈ స్వామి తన రూపం పొందాడు. ఇతడు పద్మనాభుడు, మహాయోగి, మహాత్ముడు, ప్రాణులను రక్షించేవాడు. దేవతలారా ! భయ సంతాపాలు పొందకండి. ఈతడే విధి. ప్రభావుడు. లయం చేసే కాలుడు. లోకాలను ధరించే ఇతడు చేసిన మహానాదం ఇది. ఇతడే మహాబాహువు, సర్వలోకాలూ ఇతనికే నమస్కరిస్తాయి. అచ్యుతుడు, పుండరీకాక్షుడు సర్వ భూతాలకూ ఆది అయిన ప్రభువు ఇతడే.'

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. పితామహా ! మహాప్రాజ్ఞా ! సర్వశాస్త్ర విశారదా ! తత్త్వ చింతన చేసే మోక్షకాంక్షులు మరణ సమయంలో ఏ మంత్రం జపించాలి ? మరణ సమయం సమీపించినపుడు మానవుడు దేన్ని స్మరిస్తే పరమసిద్ధిని పొందుతాడో యథార్థం వినాలనుకొంటున్నాను.' భీష్ముడు ఇలా అన్నాడు. *'రాజా ! పుణ్యాత్మా ! నీ ప్రశ్న చాలా యుక్తితో కూడినది. సూక్ష్మం. సావధానంగా విను. పూర్వం నేను నారదుని నుండి ఇది విన్నాను. శ్రీవత్సుడు, జగత్తుకు కారణ భూతుడు, అనంతుడు, లోకసాక్షి అయిన శ్రీమన్నారాయణుని నారదుడు ఇలా ప్రశ్నించాడు. నారదుడు అడిగాడు. 'భగవన్ ! నీవు నాశరహితుడవు. పరబ్రహ్మవు. నిర్గుణుడవు, తమో దూరుడవు, తెలుసుకోదగిన పరంధాముడవు, బ్రహ్మపుట్టిన ఆదికమలానికి మూలానివి. భూత భవిష్యత్తులకు అధిపతి అయిన భగవానుడా ! శ్రద్ధాపరులు, జితేంద్రియులు అయిన భక్తులు, మోక్షకాంక్ష కల యోగులూ మీ స్వరూపాన్ని ఎలా ధ్యానించాలి ? ఉదయమే లేచి, మానవుడు ఏమి జపించాలి ? యోగులు నిరంతరంగా దేన్ని ధ్యానించాలి ? ఈ సనాతన తత్త్వం చెప్పండి.' దేవర్షి అయిన నారదుని వాక్యం విని; వాక్కులకు అధిపతి, వరదుడు, భగవంతు డయిన విష్ణువు నారదునితో ఇలా అన్నాడు.*

'నీకే దివ్యమయిన అనుస్మృతిని చెపుతాను. దీనిని మరణ సమయంలో పరించినా, విన్నా అతడు నాభావం/రూపం పొందుతాడు. **ఓంకార పూర్వకంగా నాకు నమస్కరించి, ఏకాగ్రతతో వ్రయతుడై "ఓం నమో భగవతే వాసుదేవాయ" అనే మంత్రాన్ని వరించాలి.** *భగవంతుని మాట విని, నారదుడు చేతులు జోడించి నిలిచి, సర్వదేవేశ్వరుడు, సర్వాత్ముడు, పాపసంహర్త అయిన విష్ణునితో ఇలా అన్నాడు. 'అవ్యక్తుడు, శాశ్వతుడు, ఉత్పత్తి కారణుడు, పురుషోత్తముడు, అక్షరుడు, వరమపద స్వరూపుడు అయిన విష్ణువును శరణు పొందుతున్నాను. పురాణ పురుషుడు, ఉత్పత్తి కారణుడు, నిత్యుడు, అక్షయుడు, లోకసాక్షి, పుండరీకనేత్రుడు, భక్తవత్సలుడు అయిన పరమేశ్వరుని*

శరణ మందుతున్నాను. లోకాలకు నాధుడు, సహస్రనేత్రుడు, అద్భుతుడు, పరమపద స్వరూపుడు, భూతభవిష్య ద్వర్తమానాలకు ప్రభువు, భగవంతుడు అయిన విష్ణువును శరణుపొందుతున్నాను. లోక సృష్టికర్త, అంతం లేనివాడు, అన్నివైపుల ముఖాలు కలవాడు, పద్మనాభుడు, సర్వేంద్రియాలకు ఈశుడు అయిన భగవంతుని శరణువేడుతున్నాను. హిరణ్యగర్భుడు, అమృత స్వరూపుడు, భూమిని గర్భమందు ధరించినవాడు, పరాత్పరుడు, ప్రభువులకు ప్రభువు, ఆది అంతము లేనివాడు, సూర్యకాంతి సమస్వితుడు అయిన శ్రీహరిని శరణు వేడుతున్నాను. సహస్ర శిరస్సులు కల అంతర్యామి, తత్త్వభావుకు డయిన కపిల మహర్షి స్వరూపుడు, సూక్ష్ముడు, నిశ్చలుడై, అభయ మిచ్చే శ్రీహరిని శరణు పొందుతున్నాను. పురాతను డయిన నారాయణ మహర్షి, యోగాత్ముడు, సనాతన పురుషుడు, సకల తత్త్వాలకూ ఆధార భూతుడు, అవినాశి, ఈశ్వరుడు అయిన శ్రీహరిని శరణు వేడుతున్నాను.

అతడు సర్వభూతాలకు ప్రభువు. అతడు అంతటా వ్యాపించి ఉన్నాడు. చరాచర ప్రాణులకు గురువు అయిన విష్ణువు నాకు ప్రసన్ను డగుగాక. పితామహునిపుట్టుకకు కారణమైన వాడు, వేదాలకు బ్రాహ్మణులకు కారణభూతుడు, విశ్వాత్ముడు అయిన విష్ణువు నాకు ప్రసన్ను డగు గాక ! పూర్వం ప్రలయం వచ్చినపుడు ప్రాణు లన్నీ నశించాయి. బ్రహ్మాది దేవతలు కూడా లయమయ్యారు. చిన్న పెద్ద తేడా లేకుండా అన్నీ నశించి పోయాయి. ప్రకృతిలో మహత్తత్వం కూడా లీనమై పోయింది. అపుడు మిగిలిన వీకైక పురుషుడు, విశ్వాత్ముడు అయిన విష్ణువు నాకు ప్రసన్ను డగుగాక ! **ఆత్రావయ అనే నాలుగు అక్షరాలతోను అస్త్రశ్రౌషట్, అనే నాలుగింటితోను, యజ అనే రెండింటితోను, యే యజామహే అనే అయిదింటితోను, వషట్ అనే రెండింటితోను ఆహుతు లీయబడే విష్ణువు నాకు ప్రసన్ను డగుగాక.*** మేఘుడు, భూమి, పంట, కాలం, ధర్మం, క్రియ, అక్రియ- ఇవి స్వరూపంగా కల గుణాకరుడు, శ్యామవర్ణు డయిన వాసుదేవుడు నాకు ప్రసన్ను డగుగాక. అగ్ని, చంద్రుడు, సూర్యుడు, నక్షత్రాలు, బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు, యోగులు - వీరి తేజస్సులను జయించే విష్ణుమూర్తి నాకు ప్రసన్ను డగుగాక. యోగనివాసా ! నీకు నమస్కారం. సర్వావాసా, వరప్రదా ! యజ్ఞ గర్భా ! హిరణ్యాంగా, పంచయజ్ఞ స్వరూపా ! నీకు నమస్కారం.**

శ్రీకృష్ణుడు, బలరాముడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అని నాలుగు రూపాలు కలవాడా ! పరంధామ స్వరూపుడా! లక్ష్మీ నివాసా ! పరమ పూజితా ! సర్వావాసా ! ప్రకృతిని ప్రవర్తింపజేసే వాడా ! వాసుదేవా ! నీకు మనస్సు. నీకు జన్మలేదు. ఇతరులు చేరలేని మార్గంలో ఉంటావు. నీకు ఆకారంలేదు. విశ్వరూపం ధరిస్తావు, సంహార కర్తవు. ప్రాతఃకాలం, సంగవ కాలం, మధ్యాహ్నం,

---

* **చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభిరేవ చ ।**
హూయతే చ పునర్వాభ్యాం స మే విష్ణుః ప్రసీదతు ॥

** పంచయజ్ఞములు

1. వేదాధ్యయనం - బ్రహ్మయజ్ఞం.
2. హోమం - దేవయజ్ఞం
3. అతిథి పూజ - మనుష్య యజ్ఞం
4. పితృతర్పణం - పితృయజ్ఞం
5. భూతబలి - భూత యజ్ఞం

అపరాహ్ణం, సాయాహ్నం అనే పంచకాల స్వరూపుడవు. జ్ఞాన సాగరుడవు. నీకు నమస్కారం. అవ్యక్తమైన పరమాత్మనుండి వ్యక్తమయిన జగత్తు ఉద్భవించింది. వ్యక్తానికి పరుడై, అవినాశియై, తనకంటె శ్రేష్ఠుడులేని వానిని శరణు పొందుతున్నాను. ప్రకృతి మహత్తత్వాలు జడాలు. పురుషుడు చైతన్య స్వరూపుడు. అతనికి జన్మలేదు. క్షరాక్షర పురుషులకంటె పరుడు, విలక్షణుడు అగు పురుషోత్తముని శరణు పొందుతున్నాను. బ్రహ్మ, ఈశానుడు మొదలయిన వారంతా సదా ధ్యానిస్తూ ఉన్నా ఆయనను గురించి ఒక నిశ్చయానికి రాలేకపోయారు. అటువంటి పరమేశ్వరుని శరణుపొందుతున్నాను.

జ్ఞానులు, ధ్యానపరులు, జితేంద్రియులు, మహాత్ములు తనను పొంది మళ్లీ వెనుకకురారు. అటువంటి వానిని శరణువేడుతున్నాను. సర్వవ్యాపి అయిన భగవంతుడు ఈ లోకాలన్నీ తన ఒక్క అంశతో ధరిస్తున్నాడు. అతడు ఇంద్రియాలకు అందడు. నిర్గుణుడు, నిత్యుడు. అటువంటి వానిని శరణు పొందుతున్నాను. ఆకాశంలో సూర్య చంద్రుల తేజస్సుగా, తారామయ కాంతిగా, భూమి మీద అగ్నిమయ తేజస్సుగా ప్రకాశించే మహాత్ముడు నాకు ప్రసన్ను డగుగాక ! గుణాలకు ఆది, నిర్గుణుడు, ఆది పురుషుడు, లక్ష్మీవంతుడు, చేతనుడు, అజుడు, సూక్ష్మరూపంలో అంతటా వ్యాపించి ఉన్నయోగి, మహాత్ముడు నాకు ప్రసన్ను డగుగాక. జ్ఞానయోగులు, కర్మయోగులు, సిద్ధులు, మహర్షులు, పరమాత్మను తెలిసి సంసార విముక్తు లవుతారు. అట్టి శ్రీహరి నాకు ప్రసన్ను డగుగాక. అవ్యక్తుడు, అన్నిటికి అధిష్ఠానం, అచింత్యుడు, సత్-అసత్తులకు అతీతుడు, ఆధార రహితుడు, ప్రకృతి కంటె శ్రేష్ఠుడు అయిన మహాత్ముడు ప్రసన్ను డగుగాక. జీవరూపుడయి, అయిదు జ్ఞానేంద్రియా లనే ముఖాలతో శబ్దాది విషయాలను అనుభవిస్తాడు. తాను మహత్తరు డయినా గుణాలను అనుభవించే శ్రీహరి నాకు ప్రసన్ను డగుగాక. సూర్య మండలంలో సోమరూపునిగా, సోమునిలో అలౌకిక కాంతిగా, ఉన్న పరమాత్మ రూపు డయిన శ్రీహరి ప్రసన్ను డగుగాక ! అన్ని వైపుల కనులు, శిరసులు, ముఖాలూ ఉన్న నీకు అన్ని వైపుల నుండి నమస్సులు. నిర్వికారుడవు. పరమాత్మా నమస్కారం. నీవు అందరిలోను సాక్షి రూపంగా ఉన్నావు. అతీంద్రియుడ వైన నీకు నమస్కారం. వ్యక్తము లయిన చిహ్నాలతో నిన్నెరుగ లేరు. నిన్ను ఎరుగని వారు జనన మరణ పరిభ్రమణంలో పడతారు. కామక్రోధాలు, రాగద్వేషాలు లేని మీ ఏకాంత భక్తులు నిన్ను తెలుసుకోగలరు. నరకంలో ఉన్న ద్విజులు కూడ నిన్ను తెలుసుకోలేరు. **ఏకాంతభక్తులు, ద్వంద్వరహితులు, నిష్కామంగా కర్మ చేసేవారు, జ్ఞానాగ్నితో కర్మలను దహింపజేసుకొన్నవారు, దృఢమైన భగవన్నిష్ఠ కలవారు నీలో ప్రవేశిస్తారు.**

శరీరంలో ఉన్నా నీవు శరీర రహితుడవు. వేర్వేరు దేహాల్లో ఉన్నా వారియందు సమభావం కలవాడవు. పుణ్య పాపాల నుండి విడివడిన భక్తులు నీలో ప్రవేశిస్తారు. అవ్యక్త ప్రకృతి, బుద్ధి, అహంకారం, మనస్సు పంచభూతాలు, ఇంద్రియాలు నీలో ఉన్నాయి. వాటిలో నీవున్నావు. నిజానికి నీవు వానిలో లేవు. అవి నీలో లేవు. ఏకత్వం, అన్యత్వం, నానాత్వం అనే వాని రహస్యం తెలిసినవారు పరమాత్మయైన నిన్ను పొందుతారు. నీవు అన్ని ప్రాణుల పట్ల సమానుడవు. నీకు ద్వేషింపదగినవారు లేరు. ప్రియులూ లేరు. అనన్య చిత్తంతో నీ మీది భక్తితో సమత్వం పొందాలనుకొంటున్నాను.

స్వేదజాలు, అండజాలు, ఉద్భిజాలు, జరాయుజాలు అనే చరాచర ప్రాణికోటి అంతా నీతో నిండి ఉంది. దారానికి గ్రుచ్చబడిన మణుల సముదాయం వలె ఈ జగత్తు అంతా నీలోనే ఓతప్రోతంగా ఉంది. ఈజగత్తుకు స్రష్టవు. భోక్తవు, కూటస్థుడవు. తత్త్వస్వరూపుడవు అయినా అతత్త్వ స్వరూపుడవు. కర్మహేతువు కాని వాడవు. నిశ్చలమైన పరమాత్మవు. అయినా వేరువేరు శరీరాల్లో జీవాత్మగా ఉన్న వాడవు. నిజానికి నీకు ప్రాణులతో సంబంధం లేదు. పంచభూతాలకంటె, తత్త్వాలకంటె, గుణాల కంటె పరుడవు నీవు. అహంకారం, బుద్ధి, గుణత్రయం- వీనితో నీకు ఏ సంబంధమూ లేదు. నీకు ధర్మాధర్మాలు లేవు. ఆరంభం కాని, మళ్లీ జన్మ కాని లేవు. జరామరణాలనుండి మోక్షంకోసం నిన్ను సర్వాత్మనా ఆశ్రయించాను. జగన్నాథా ! నీవు ఈశ్వరుడవు. నీవు పరముడవు. దేవా ! భక్తుల హితమైన దానిని ధ్యానించు. విషయాలతో కాని, ఇంద్రియాలతో కాని నాకు మళ్లీ ఎన్నడూ కలయిక లేకుండుగాక. నా ఘ్రాణేంద్రియం పృథివీ తత్త్వము నందూ, రసన నీటిలోనూ కలియుగాక ! రూపం అగ్నియందు, స్పర్శ గాలిలోను, శ్రోత్రం ఆకాశంలోను, మనస్సు వైకారి కాహంకారంలోను కలియుగాక. ఇంద్రియాలు తమ తమ కారణాలను చెందుగాక. పృథివి నీటియందు, నీరు అగ్నియందు, అగ్ని వాయువులోను చేరుగాక. వాయువు ఆకాశంలోను, ఆకాశం మనసులోను, మనస్సు అహంకారంలోను (ఈ అహంకారమే దేహధారులను మోహపెడుతుంది), అహంకారం బుద్ధిలోను, బుద్ధి అవ్యక్త ప్రకృతి లోను లీనమగు గాక ! ప్రధానం ప్రకృతిని పొందితే గుణసామ్యం (మహాప్రళయం) కలుగుతుంది. అపుడు నా ఇంద్రియా లన్నిటికీ వాని విషయాలతో వియోగం కలుగుగాక!

తండ్రీ ! నేను మోక్షం కోరుతున్నాను. నీతో నాకు ఐక్యం కలుగుగాక. ఈ లోకంలో మళ్లీ జన్మ కలుగకుండును గాక ! మరణ సమయంలో నాబుద్ధి నీయందే లగ్న మగు గాక. నా ప్రాణాలు నీలోనే కలియు గాక. నేను నీ భక్తుడను, నిన్నే పరమగతిగా భావిస్తాను. నిన్నే స్మరిస్తాను. పూర్వ జన్మలో మిగిలిన నారోగాలు ఇపుడు నాలో ప్రవేశించు గాక. వాని దుఃఖాలు నన్ను ప్రవేశించు గాక. ఋణం నుండి నేను విముక్తుడ నగుదును గాక. దేవేశ ! నాకు మళ్లీ జన్మకలుగరాదని మిమ్ము ధ్యానిస్తున్నాను. అందుచేత మళ్లీ చెపుతున్నాను. నా కర్మలన్నీ నశించుగాక. నాకెటువంటి ఋణమూ మిగులకుండును గాక. పూర్వజన్మలో నా కర్మలతో సంచితాలయిన రోగాలన్నీ నా ఈ శరీరంలో ప్రవేశించును గాక. అందువల్ల నేను ఋణ రహితుడనై విష్ణు పదం చేరగోరుతున్నాను.'

భగవంతుడు చెపుతున్నాడు. 'నారదా ! నేను ఆ భక్తునివాడనే. ఆ భక్తుడూ నా సనాతన సఖుడే. నేనాతనికి కనపడకుండా ఉండను. నా దృష్టి పథం నుండి అతడూ అదృశ్యుడు కాడు. సాధకుడు అయిదు కర్మేంద్రియాలను, అయిదు జ్ఞానేంద్రియాలనూ స్వాధీనం చేసుకొని మనసులో లీనంచేసుకోవాలి. మనస్సును అహంకారంలో లీనం చేసుకోవాలి. అహంకారాన్ని బుద్ధిలోను, బుద్ధిని ఆత్మలోను సంయోజనం చేయాలి. అయిదు జ్ఞానేంద్రియాలను వశపరచుకొని బుద్ధితో పరాత్పరు డయిన పరమాత్మను అనుభవంలోకి తెచ్చుకోవాలి. పరమాత్మ నావాడు. నేను ఆయనవాడను. ఆయన ఈ జగమంతా వ్యాపించి ఉన్నాడు' అని తెలుసుకోవాలి. తనను తాను పరమాత్మ

ధ్యానంలో నియోగించుకోవాలి. నిరంతరంగా స్మరించాలి. అలా బుద్ధికి అతీతునిగా పరమాత్మను తెలిసికొనిన మానవుడు మళ్లీ ఈ సంసారంలో పడడు. మరణ సమయంలో నన్ను ఇలా స్మరించేవాడు పూర్వం పాపాలు చేసినా వాడు పరమగతిని పొందుతాడు. సర్వప్రాణులకూ పరమాత్మ, భక్తులపట్ల ఏకనిష్ఠ కలవాడూ, సనాతనుడు, ఓంకార రూపుడూ, భగవంతుడు అయిన నారాయణునకు నమస్కారం. ఇది విష్ణు మూర్తి దివ్యమయిన అనుస్మృతి. మానవుడు పండుకొనబోయే ముందు, లేచేటప్పుడు, స్వాధ్యాయ సమయంలోను, ఎక్కడయినా దీన్ని పఠించవచ్చు. విశేషించి పూర్ణిమ, అమావాస్య, ద్వాదశి రోజులలో శ్రద్ధాళువు లయిన నా భక్తులకు దీనిని వినిపించాలి. అహంకారంతో యజ్ఞ, దాన, తపస్సులు చేస్తే వాటిఫలం కర్తకు లభిస్తుంది. అది సంసారంలోకి రాకపోకలు, జనన మరణాలు కలిగిస్తుంది. దేవతలను, పితృదేవతలను పూజిస్తూ, పఠిస్తూ, హోమం వైశ్వదేవం చేస్తూ, అగ్నిలో ఆహుతులు వేస్తూ నన్ను స్మరించేవాడు పరమగతి పొందుతాడు.

యజ్ఞం, దానం, తపస్సు ఇవి విద్వాంసులను పవిత్రులను చేస్తాయి. అందుచేత యజ్ఞదాన తపస్సులను నిష్కామంగా చెయ్యాలి. నారదా ! శ్రద్ధతో నాకు నమస్కారం మాత్రమే చేసే నా భక్తుడు చండాలు డయినా అక్షయ లోకాలు పొందుతాడు. మనస్సునూ, ఇంద్రియాలను నియమించుకొని నన్ను ఆశ్రయించి, శ్రద్ధగా నన్ను ఆరాధించే వారు నన్ను పొందుతారని వేరే చెప్పనక్కరలేదు. నారదా ! కర్మలన్నీ ఆది, అంతమూ కలవి. కాని నా భక్తుడు వినాశం పొందడు. అందుచేత నన్నే సదా పరాకులేక ధ్యానించు. దీనివల్ల నీకు పరమసిద్ధి కలుగుతుంది. నీవు నా పరమపదాన్ని చూడగలవు. ధర్మోపదేశ పూర్వకంగా అజ్ఞానికి జ్ఞానోపదేశం చేస్తే ఆఫలం భూమండలమంతా దానం చేసిన ఫలంతో సమానం. అందుచేత జన్మబంధ భయం పోగొట్టే ఈ అనుస్మృతిని సజ్జనులకు ఇవ్వాలి. అలా ఇచ్చిన వాడు శ్రేయస్సును, బలాన్ని పొందుతాడు. పదిలక్షల అశ్వమేధయాగాలు చేసినవాడు కూడా నాభక్తులు పొందే పరమ పదాన్ని పొందలేడు.

భీష్ముడు ఇలా అన్నాడు. 'ధర్మరాజా ! పూర్వం నారదుడు అడిగితే మంగళమయు డయిన విష్ణువు చెప్పినది నీకు చెప్పాను. నీవు కూడా ఏకాగ్ర చిత్తుడవై గుణాతీతంగా పొందదగిన పరమాత్మను ధ్యానించు. అవ్యయు డైన పరమాత్మను భక్తితో సేవించు. విష్ణుమూర్తి చెప్పిన దివ్య మయిన ఈ అనుస్మృతిని విని, మిక్కిలి భక్తి పూర్ణుడయిన నారదుడు భగవంతుని విషయంలో ఏకాగ్ర చిత్తు డయ్యాడు. అనన్య భావంతో పది సంవత్సరాలు నారాయణుని ధ్యానిస్తూ, అనుస్మృతిని జపిస్తే వాడు విష్ణువు యొక్క పరమ పదాన్ని పొందుతాడు. జనార్దనుని యందు భక్తి కల వానికి చాలా మంత్రాలతో పనిలేదు. 'ఓం నమో నారాయణాయ' అనే మంత్రం ఒక్కటే సర్వ ప్రయోజనాలూ సమకూరుస్తుంది. పరమ రహస్య మయిన ఈ అనుస్మృతిని అధ్యయనం చేసి, మానవుడు భగవంతుని మీద దృఢమైన బుద్ధి పొందుతాడు. అతడు సకల కష్టాలకూ దూరుడై, దుఃఖవిముక్తుడై, వీతరాగుడై భూమండలం అంతటా సంచరిస్తాడు.'

210. వార్ష్ణేయాధ్యాత్మ కథనము - 1.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'వక్తలలో శ్రేష్ఠుడవైన భరతనందనా ! తాతా ! మోక్షానికి సాధన భూతమైన పరమయోగాన్ని గూర్చి చెప్పండి. దాని తత్త్వాన్ని తెలుసుకోవాలనుకొంటున్నాను.' భీష్ముడు చెపుతున్నాడు. 'మోక్ష విషయకంగా గురుశిష్యులకు జరిగిన సంవాదాన్ని ఈ సందర్భంగా పండితులు ఉదాహరిస్తూ ఉంటారు. ఆచార్యుడు, ఋషిసత్తముడు, తేజోరాశి, మహాత్ముడు, సత్యసంధుడు, జితేంద్రియుడు అయిన ఒకానొక బ్రాహ్మణుడు ఆసీనుడై ఉండగా, పరమమేధావి, శ్రేయస్కాముడు, సమాహిత చిత్తుడు అయిన శిష్యుడు అతని పాదాల చెంత మోకరిల్లి, చేతులు జోడించి, ఇలా అన్నాడు. 'దేవా ! నా సేవవలన మీరు ప్రసన్నులు అయినట్లయితే, నాకు కలిగిన ఈ మహాసంశయాన్ని మీరే తీర్చగలరు. నేను ఎక్కడ నుండి వచ్చాను ? మీరెక్కడి నుండి వచ్చారు? ఇదే కాక, ఇకపై పరమమైన తత్త్వం ఏదయితే ఉందో, అదంతా వివరంగా చెప్పండి. ద్విజోత్తమా ! పృథివ్యాది పంచభూతాలు అంతటా సమానంగానే వ్యాపించి ఉండి, సమస్త ప్రాణుల శరీరాలు వాటితోనే నిర్మిత మయినపుడు, వాటిలో పరస్పర విరుద్ధమైన క్షయవృద్ధులు ఎలా కలుగుతున్నాయి ? విద్వాంసుడా ! వేదాలలోను, స్మృతులలోను ఉన్న లౌకిక ధర్మాలు, వ్యాపక ధర్మాలలో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. కాబట్టి వాటి యథార్థ స్వరూపాన్ని గురించి కూడా వివరించండి.' గురువు చెప్పసాగాడు. 'మహాప్రాజ్ఞుడవైన శిష్యుడా ! ఇది వేదాలలో నిగూఢమైన ఉత్తమ విద్య. అధ్యాత్మవిద్య. సమస్త విద్యలలోని, శాస్త్రాలలోని సంపద. **అన్నివేదాలకు ముఖస్వరూపమైన ఓంకారం, సత్యం, జ్ఞానం, యజ్ఞం, తితిక్ష, దమం, ఆర్జవం - ఇవన్నీ వాసుదేవుడే.** వేదవేత్తలు అతనినే సనాతన పురుషుడని, విష్ణు వని, సృష్టిలయకారు డని, అవ్యక్త బ్రహ్మ అని, శాశ్వతు డని గ్రహిస్తారు.

ఈ పరబ్రహ్మయే వార్ష్ణేయు డైన కథను విను. అధిక తేజస్వంతుడు, దేవదేవుడు అయిన విష్ణువు యొక్క మాహాత్మ్యం బ్రాహ్మణుడు బ్రాహ్మణులవలన, క్షత్రియుడు క్షత్రియుల వలన, అలాగే వైశ్యుడు వైశ్యులవలన, మహామనస్వి అయిన శూద్రుడు శూద్రులవలన వినదగినది. వార్ష్ణేయునియొక్క ఉత్కృష్టమైన కల్యాణ స్వరూపాన్ని గూర్చి తెలుసుకోవడానికి నీవూ అర్హుడవే. సృష్టి ప్రళయలక్షణాలతో కూడిన అనాద్యంతమైన కాలచక్రం వాసుదేవుని స్వరూపమే. సర్వ భూతాత్మకు డైన వాసుదేవునిలో ముల్లోకాలూ చక్రం లాగా తిరుగుతున్నాయి.

పురుష వ్యాఘ్రమా ! పురుషోత్తము డయిన కేశవునే అక్షరు డని, అవ్యక్తు

డని, అమృతు డని, శాశ్వతు డైన బ్రహ్మ అనీ చెపుతూ ఉంటారు. పరముడు, అవ్యయుడు అయిన అతడు పితరులను, దేవతలను, ఋషులను, యక్షరాక్షసులను, నాగాసురులను, మనుష్యులను సృష్టిస్తున్నాడు. అలాగే ప్రళయానంతరం యుగాదియందు ప్రకృతిని ఆధారంగా చేసుకొని వేదాలను, శాస్త్రాలను, శాశ్వతమైన లోకధర్మాలను తిరిగి సృష్టిస్తున్నాడు. ఆ యా ఋతువులు మారినప్పుడు ఆయాలక్షణాలను బట్టి పర్యాయంగా అనేకరూపాలు ఉద్భవించినట్లే, ఆ యా యుగారంభాలలో ఆ యా భావాలు తదనుగుణంగా కనిపిస్తూ ఉంటాయి. కాలక్రమంలో యుగాదియందు భాసించే వస్తువులు లోకవ్యవహారవశాత్తు ఆ యా సమయాల్లో ఆ యా విషయాలను గూర్చిన జ్ఞానాన్ని ప్రకటిస్తూ ఉంటాయి. యుగాంతమందు అంతరించిపోయిన వేదాలను, ఇతిహాసాలనూ, బ్రహ్మదేవుని అనుజ్ఞపొందిన మహర్షులు తపస్సుచేత ముందుగా పొందారు. బ్రహ్మదేవుడు వేదాన్ని, బృహస్పతి వేదాంగాలను, శుక్రాచార్యుడు నీతిశాస్త్రాన్ని లోకహితం కోసం ఉపదేశించారు. గాంధర్వవేదం నారదునికి, ధనుర్వేదం భరద్వాజునికి, దేవర్షి చరితం గార్గ్యునికి, చికిత్సా విధానం కృష్ణాత్రేయునికి తెలిశాయి. తర్కపండితులు న్యాయతంత్రాలను గూర్చిన అనేక గ్రంథాలను ఉపదేశించారు. వారు చెప్పిన దానిని హేత్వాగమ సదాచారాల ద్వారా నీవు కూడా పాటించు. అనాది అయిన ఆ పరబ్రహ్మను దేవతలు గాని, ఋషులు గాని ఎరుగరు. భగవానుడు, నారాయణుడు సృష్టికర్త అయిన ప్రభువు ఒక్కడు మాత్రమే ఎరుగును. ఋషిగణాలు, ముఖ్యులైన సురాసురులు, ప్రాచీనులైన రాజర్షులు, నారాయణుని వలననే బ్రహ్మను గూర్చిన జ్ఞానాన్ని పొందారు. ఆ బ్రహ్మజ్ఞానమే సమస్త దుఃఖాలకు పరమౌషధం. పురుషుడు సంకల్పించిన వివిధ పదార్థాలను, ప్రకృతియే రచిస్తూ ఉంటుంది. ఈ ప్రకృతి నుండియే సర్వప్రథమమై, కారణసహితమైన జగత్తు ఉత్పన్న మవుతుంది. దీపం నుండి వేలకొద్దీ ఇతరదీపాలు ప్రభవించినట్లుగా ప్రకృతి అనంతమైన పదార్థాలను సృష్టిస్తుంది కాని క్షీణించిపోదు.

అవ్యక్తకర్మనుండి పుట్టిన బుద్ధి అహంకారాన్ని పుట్టిస్తుంది. అహంకారం నుండి ఆకాశం, ఆకాశం నుండి వాయువు పుట్టాయి. వాయువునుండి అగ్ని, అగ్ని నుండి నీరు, నీటి నుండి భూమి పుట్టాయి. ఈ ఎనిమిది మూల ప్రకృతులు. వీటి యందే జగత్తు నిలిచిఉంది. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు, ఐదు విషయాలు, మనస్సు- ఈ పదహారు వికారాలని చెప్తారు. (ఇందులో మనస్సు అహంకార వికారం, మిగిలిన పదిహేను తమ తమ కారణరూపా లయిన సూక్ష్మ మహాభూతాల యొక్క వికారాలు). చెవి, చర్మం, కన్నులు నాలుక, ముక్కు - ఇవి జ్ఞానేంద్రియాలు. పాదాలు, పాయువు,

ఉపస్థ, చేతులు, వాక్కు - ఈ ఐదు కర్మేంద్రియాలు. శబ్ద స్పర్శ రూపరసగంధాలు- ఈ ఐదు విషయాలు. వీటియందు వ్యాప్తమై ఉండే చిత్తం మనస్సు అని గ్రహించాలి. ఇది సర్వగతం. రసాన్ని గ్రహించేటపుడు జిహ్వగా, మాట్లాడేటపుడు వాక్కుగా ఈ మనసే ఉంటుంది. ఈ రీతిగా భిన్న భిన్న ఇంద్రియాలతో కలిసి, ఆ అన్ని రూపాలలోనూ మనస్సే వ్యక్త మవుతూ ఉంటుంది. పంచ జ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలు, పంచవిషయాలు, ఒక్క మనస్సు- ఈ పదహారు తత్వాలు ఈ శరీరంలో విభాగపూర్వకంగా ఉన్నాయి. వాటిని దేవతా స్వరూపంగా భావించుకోవాలి. జిహ్వ నీటి గుణం. ఘ్రాణేంద్రియం పృథివీగుణం. శ్రోత్రం నభోగుణం. చక్షువు అగ్నిగుణం. స్పర్శ వాయుగుణం. ఇలా ఇవి సర్వ ప్రాణులయందు సర్వదా ఉంటాయని తెలుసుకోవాలి. మనస్సు మహత్తత్వం యొక్క కార్యం. మహత్తు అవ్యక్త ప్రకృతి యొక్క కార్యం. కాబట్టి బుద్ధిమంతుడు సర్వభూతాత్మకుడయిన పరమేశ్వరుని ప్రాణు లన్నిటియందు ఉన్నవాడుగా తెలుసుకోవాలి. ఈ భావాలు (సమస్త పదార్థాలు) చరాచర సహితమైన సంపూర్ణ జగత్తును భరిస్తున్నాయి. ఇవన్నీ ప్రకృతికి అతీతమై, రజోగుణ రహితమై, పరమదైవంగా చెప్పబడే వానిని ఆశ్రయించి ఉంటాయి. ఈ ఇరవై నాలుగు పదార్థాలతో కూడి, నవద్వారాలు గల పవిత్రమైన పురంలో వ్యాప్తమై అందులో అన్నిటికంటె గొప్పదైన ఆత్మ శయనించి ఉంటుంది. కనుక దానిని "పురుషుడు" అంటున్నారు.

ఆ పురుషుడు అజరుడు, అమరుడు, స్థూల సూక్ష్మతత్వాలను బోధించేవాడు, వ్యాపకుడు, సర్వజ్ఞత్వాది గుణాలతో కూడినవాడు, సూక్ష్మరూపుడు, సమస్త ప్రాణులను, వారిలోని గుణాలను ఆశ్రయించినవాడు. చిన్నదయినా, పెద్దదయినా దీపం ఎలా ప్రకాశిస్తుందో అలాగే సమస్త ప్రాణుల యందు జ్ఞానాత్మరూపుడైన పురుషుడు ప్రకాశిస్తుంటా డని తెలుసుకోవాలి. అతడే తెలుసుకోదగిన శబ్దరూపాన్ని తెలియజేస్తాడు. చెవులద్వారా, కన్నుల ద్వారా అతడే వింటాడు. చూస్తాడు. ఈ శరీరం ఆ శబ్దాదివిషయాలను అనుభవించడానికి నిమిత్తం అవుతుంది. ఆ జీవాత్మ సమస్తకర్మలకు కర్త. కట్టలో అగ్ని వ్యాపించి ఉన్నప్పటికీ, ఆ కట్టను చీరినా కూడా దానిలో అగ్ని కనపడదు. అలాగే ఆత్మ శరీరంలోనే ఉంటుంది. కాని కనపడదు. యోగంలోనే దానిని దర్శించవచ్చును. కట్టను మథించడం వంటి ఉపాయాల ద్వారా దానిలో అగ్నిని ప్రత్యక్షం చేయవచ్చును. అలాగే యోగం ద్వారా శరీరస్థమైన ఆత్మను దర్శించవచ్చును. నదిలో నీరు, సూర్యునిలో కిరణాలు ఉంటాయి. నీరు, కిరణాలు నదితో, సూర్యునితో నిత్య సంబంధం కలిగి ఉండడం వలన వాటితో కలిసే సాగుతాయి. అలాగే దేహధారులయొక్క సూక్ష్మ శరీరాలు కూడా జీవాత్మతోపాటే

ఉంటాయి. దానిని వెంటతీసుకునే రాకపోకలు సాగిస్తాయి. పంచజ్ఞానేంద్రియాలలో కూడిన జీవాత్మ కలలో ఈ శరీరాన్ని విడిచి ఇంకొక చోటికి పోయినట్లుగా, మరణించిన వెనుకకూడా ఈ శరీరాన్ని విడిచిపెట్టి వేరేశరీరాన్ని గ్రహిస్తాడు. కర్మచేతనే ఈ దేహం బాధింపబడుతోంది. కర్మ చేతనే వేరే శరీరాన్ని పొందుతోంది. తాను చేసుకొన్న గట్టి కర్మల ద్వారానే ఇతర శరీరాలకు కొనిపోబడుతున్నాడు. ఆ జీవాత్మ ఒక శరీరాన్ని విడిచి, మరొక శరీరాన్ని ఎలా పొందుతుందో తమ కర్మల ద్వారా ఉత్పన్నమయ్యే ప్రాణి సముదాయం ఇతర దేహాలను ఎలా ధరిస్తుందో, అదంతా నీకు నేను చెపుతాను.'

211. వార్ష్ణేయాధ్యాత్మ కథనము - 2.

గురువు చెపుతున్నాడు. 'నాలుగురకాల ప్రాణులు, (జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజాలు) స్థావర జంగమాలు- ఇవన్నీ అవ్యక్తం నుండిపుట్టి, అవ్యక్తంలోనే లీనమవుతాయి. వ్యక్తమైన లక్షణం లేనిదానిని అవ్యక్తం అని గ్రహించాలి. మనస్సు అవ్యక్తాత్మకం. అంటే ప్రకృతివలె త్రిగుణాత్మక మైనది. చిన్న రావిగింజలో అంతర్భూతమై ఉన్న మహావృక్షం పైకి వచ్చి కనబడినట్లుగానే అవ్యక్తం నుండి పుట్టిన జగత్తు వ్యక్తమై కన్పిస్తుంది. **అచేతనమైన ఇనుము అయస్కాంతం వైపు ఆకర్షింపబడినట్లుగా, శరీరం పొందాక ప్రాణులయొక్క స్వాభావికమైన సంస్కారం, అవిద్య, కర్మ, కామం, మొదలైన ఇతర గుణాలు దానివైపు ఆకర్షింపబడతాయి.** అలాగే అవ్యక్తం నుండి పుట్టిన కారణ స్వరూపమైన భావాలు అచేతనమైనప్పటికీ చేతనకర్త యొక్క సంపర్కం చేత చేతనమై తెలుసుకోవడం మొదలైన పనులకు హేతువు లవుతున్నాయి. పూర్వం పృథ్వి, ఆకాశం, స్వర్గం, భూతగణం, ఋషిగణం, దేవతలు, అసురులు ఏవీ లేవు. చైతన్యం తప్ప వేరే దానికి ఉనికియే లేదు. జడ చైతన్యాల సంయోగం కూడా లేదు. నిత్యమూ, సర్వగతమూ, మనోహేతువూ, లక్షణరహితమూ అయిన ఆత్మ ప్రప్రథమంలో ఉండేది. ఈ కారణ స్వరూపమైన సమస్తజగత్తు అజ్ఞానం యొక్క కార్యంగానే చెప్పబడుతుంది. ఈ కారణాలతో కూడి జీవుడు కర్మసంగ్రహం చేస్తాడు. కర్మల వలన వాసనలు, వాసనల వలన తిరిగి కర్మలు వస్తూ ఉంటాయి. ఈ రీతిగా అనాదినిధనమైన ఈ మహాసంసారచక్రం నడుస్తూ ఉంటుంది.

ఈ సంసారచక్రానికి అవ్యక్తం నాభి. వ్యక్తం (దేహేంద్రియాలు) ఆకులు. సుఖ దుఃఖాదులు, ఇచ్ఛ మొదలైన వికారాలు నేమి. ఆసక్తి ఇరుసు. క్షేత్రజ్ఞుడు (జీవాత్మ) నడిపేవాడు. ఇది నిరంతరం తిరుగుతూ ఉంటుంది. **తెలికలవాడు, మానెతో కూడిన కారణంగా నువ్వులను గానుగలోవేసి త్రిప్పినట్లుగా ఈ జగత్తు అంతా ఆసక్తి**

కారణంగా అజ్ఞాన జనితమైన భోగాలలో వలిగి వలిగి ఈ సంసార చక్రంలో త్రిప్పబడుతోంది. జీవుడు అహంకారానికి లోనై తృష్ణ కారణంగా కర్మ చేస్తూ ఉంటాడు. ఆ కర్మ రాబోయే కార్యకారణ సంయోగానికి హేతువు అవుతోంది. కారణం కార్యంలో గాని, కార్యం కారణంలో గాని ప్రవేశించవు. కాలమే కార్యం సిద్ధించడానికి గాని, సిద్ధించకపోవడానికి గాని హేతువు అవుతోంది. హేతుసహిత మైన ఎనిమిది ప్రకృతులు, పదహారు వికారాలు. పురుషాధిష్ఠితాలై ఎల్లప్పుడూ ఒకదానితో ఒకటి కలిసి సృష్టిని విస్తరింపచేస్తూ ఉంటాయి. రాజస తామస భావాలతో కూడి, హేతుబలంతో ప్రేరేపింపబడిన సూక్ష్మశరీరం వాయువుచేత ఎగురగొట్టబడిన దుమ్ము ఆ వాయువునే వెన్నంటి వెళ్లినట్లుగా క్షేత్రజ్ఞు డైన జీవాత్మతో కలిసి వేరొక స్థూలశరీరానికి చేరుకొంటుంది. దుమ్మును రేపిన వాయువుకు ఆ దుమ్ము అంటుకొంటుంది. అటుకోకుండానూ ఉంటుంది. అలాగే రాజసతామస భావాలు జీవాత్మకు అంటుకొంటాయి, అంటుకోకుండానూ ఉంటాయి. కాబట్టి వివేకశీలుడైన పురుషుడు క్షేత్ర క్షేత్రజ్ఞుల మధ్యగల అంతరాన్ని తెలుసుకోవాలి. ఆ రెండింటి మధ్య తాదాత్మ్యాన్ని అభ్యసించితే జీవునకు తన శుద్ధస్వరూపం యొక్క జాడ లేకుండా పోతుంది. (భీష్ముడు చెపుతున్నాడు) ఈ రీతిగా ఆ ఋషిసత్తము డైన గురువు శిష్యునికి కలిగిన సందేహాన్ని తొలగించాడు. కాబట్టి పండితుడు క్రియలద్వారా ఉద్దేశ్యాలను సిద్ధింపచేయడంలో సహాయకమైన ఉపాయాల మీద దృష్టి ఉంచాలి. **నిప్పు మీద వేగిన విత్తనాలు మొలకెత్తనట్లుగా జ్ఞానరూపమైన అగ్ని చేత అవిద్యాదిక్లేశాలన్నీ దగ్ధమైపోయాక జీవాత్మకు తిరిగి ఈ లోకంలో పుట్టవలసిన పనిలేదు.'**

212. వార్ష్ణేయాధ్యాత్మ కథనము - 3.

భీష్ముడు చెపుతున్నాడు. 'కర్మనిష్ఠ కలిగిన వారికి ప్రవృత్తి ధర్మం ఎలా లభిస్తుందో అలాగే వారికి రుచిస్తుంది. అలాగే జ్ఞాననిష్ఠులకు జ్ఞానం తప్ప వేరేదీ రుచించదు. వేదవిద్వాంసులు, వేదోక్తమైన కర్మలయందు నిష్ఠకలవారు ప్రాయికంగా దుర్లభులు. బుద్ధిమంతులు వేదోక్తమైన రెండు మార్గాలలోను మహత్త్వ పూర్ణమై, అందరిచే ప్రశంసింపబడిన మోక్షమార్గాన్నే కోరుకొంటారు. సత్పురుషులు ఎప్పుడూ ఈ మార్గాన్నే స్వీకరిస్తారు. కాబట్టి అదే అనింద్యం, దోషరహితం. దేనివలన మనుష్యుడు పరమగతిని పొందుతాడో అదే ఈ బుద్ధి. దేహాభిమానం కలవాడు మోహవశుడై, క్రోధలోభాలతో, రాజసతామసాలతో కూడి అన్ని రకాలవస్తువులను సంగ్రహిస్తూ ఉంటాడు. **కాబట్టి దేహబంధాన్నుండి ముక్తిని పొందగోరేవాడు ఎప్పుడూ అశుద్ధవర్తనుడు కాకూడదు. నిష్కామ కర్మద్వారా**

మోక్షద్వారాన్ని తెరుచుకోవాలి. స్వర్గాదిపుణ్యలోకాలను పొందాలని ఎప్పుడూ కోరుకోకూడదు. లోహంతో కూడిన బంగారం అగ్నిలో పుటం పెట్టకుండా ఎలా ప్రకాశించదో, అలాగే చిత్తంలోని రాగద్వేషాలను నాశనం చేయకుండా, అందులోని జ్ఞాన స్వరూపమైన ఆత్మ ప్రకాశించదు. లోభానికి వశమై, కామక్రోధాలను అనుసరిస్తూ, ధర్మమార్గాన్ని ఉల్లంఘించి, అధర్మాచరణం చేస్తూండేవాడు రక్తసంబంధీకులతో సహా నశించిపోతాడు. శ్రేయస్సును కోరుకొనేవాడు రాగవశుడై శబ్దాదివిషయాలను సేవించరాదు. ఎందుకంటే అలా చేస్తే హర్షం, క్రోధం, విషాదం- ఈ సాత్త్విక రాజసతామస భావాలు ఒకదానివలన ఒకటి పుడుతూ ఉంటాయి. ఈ శరీరం పంచభూతాల వికారరూపం. సత్త్వరజస్తమో గుణాలతో కూడినది. ఇందులో ఉండి ఈ నిర్వికారమైన ఆత్మ ఏమని చెప్పి, ఎవరిని నిందిస్తుంది ? ఎవరిని స్తుతిస్తుంది ? అజ్ఞానులు స్పర్శరూపరసాదులయిన విషయాలలో ఆసక్తు లవుతారు. విశిష్ట జ్ఞానంలేని కారణంగా ఈ శరీరం పార్థివ మని వారు తెలుసుకోలేరు. మట్టిఇల్లు మట్టితో అలికితే సురక్షితంగా ఉంటుంది. అలాగే పార్థివమైన ఈ దేహం పృథివీ వికారా లయిన అన్న జలాలు సేవించడంవలననే నశించిపోకుండా ఉంటుంది. తేనె, నూనె, పాలు, నేయి, మాంసం, ఉప్పు, బెల్లం ధాన్యం, ఫలమూలాలు, జలం- ఇవన్నీ పృథివీ వికారాలే.

అడవిలో ఉండే సంన్యాసి రుచికరమైన ఆహారంపై ఆసక్తి చూపడు. శరీరయాత్రకోసం అతడు చుట్టుప్రక్కల దొరికే గ్రామ్యమైన ఆహారాన్నే స్వీకరిస్తాడు. అలాగే పంపారమనే అడవిలో ఉంటూ మోక్షకాంక్షి అయిన గృహస్థు పరిశ్రమ చేస్తూ శరీరయాత్ర కోసమే రోగి ఔషధాన్ని సేవించినట్లుగా సాత్త్వికాహారాన్ని తీసుకోవాలి. ఉదారచరితుడు సత్యం, శౌచం, ఆర్జవం, త్యాగం, తేజస్సు, పరాక్రమం, క్షమ, ధైర్యం, బుద్ధి, మనస్సు, తపస్సులతో సమస్త విషయాత్మక భావాలను మరలిపోవునట్లుగా చూసుకొని, శాంతిని కోరుతూ ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. జితేంద్రియత్వం లేని జీవులు అజ్ఞానం వలన సత్త్వరజస్తమస్సుల చేత మోహితులై నిరంతరం చక్రంవలె తిరుగుతూ ఉంటారు. కాబట్టి వివేకి అజ్ఞానంవలన పుట్టే దోషాలను చక్కగా విమర్శించుకోవాలి. ఆ అజ్ఞానంవలన కలిగే దుఃఖాన్ని, అహంకారాన్ని విడిచిపెట్టాలి. పంచమహాభూతాలు, ఇంద్రియాలు, శబ్దాది గుణాలు, సత్వరజస్తమస్సులు, లోకపాలురతో సహితంగా ముల్లోకాలు, సమస్తమూ అహంకారమందే ప్రతిష్ఠితమై ఉన్నాయి. ఈ లోకంలో నియతమైన కాలం ఆయా ఋతుసంబంధమైన గుణాలను ప్రకటించినట్లుగా జీవులలో అహంకారం ఆ యా కర్మలను ప్రవర్తింపచేసేదిగా తెలుసుకోవాలి. అహంకారం సాత్వికి, రాజస, తామసాలని

మూడు రకాలు. తమస్సు మోహం కలిగిస్తూ నల్లగా ఉంటుంది. అది అజ్ఞానంవలన పుడుతుంది. ప్రీతిని ఉత్పాదించేది సాత్వికం. దుఃఖం రాజసంవలన కలుగుతుంది. ఈ రీతిగా సమస్త త్రిగుణ స్వరూపాలను తెలుసుకోవాలి. సత్త్వరజస్తమోగుణాలను విను. ప్రసన్నత, హర్షం వలన కలిగే ప్రీతి, అసందేహం, ధైర్యం, స్మృతి - ఇవన్నీ సత్త్వగుణం యొక్క కార్యాలని తెలుసుకో. కామక్రోధాలు, ప్రమాదం, లోభమోహాలు, భయం, అలసత - ఇవి రాజసగుణాలు. విషాదం, శోకం, అరతి, మానం, దర్పం, అనార్యత్వం - ఇవి తమో గుణ కార్యాలు. వీటియొక్క, ఇంకా ఇటువంటివే అయిన దోషాల యొక్క హెచ్చు తగ్గులను బాగా పరిశీలించాలి. ఆపై ఇందులో ఒక్కొక్క దోషం తనలో ఉన్నదీ లేనిదీ, ఉంటే ఎంత పరిమాణంలో ఉందో తరచి చూసుకోవాలి. (అలా ఆలోచించి చూడడంవలన దోషవిముక్తి కలుగుతుంది).

యుధిష్ఠిరుడు అడిగాడు. 'పూర్వం ముముక్షువులు ఏదోషాలను మనస్సుచేత విడిచిపెట్టారు ? వేనిని బుద్ధి చేత శిథిలం చేశారు ? మాటిమాటికి వచ్చే దోషాలు ఏవి ? ఏ దోషాలు ఫలిత మివ్వడంలో అసమర్థాలుగా ఉంటాయి ? పితామహా ! పండితుడు బుద్ధిచేత, యుక్తులచేత ఏదోషాల యొక్క బలాబలాలను విమర్శించుకో గలుగుతాడు ? తాతా! ఇది నాకు కలిగిన సందేహం. కాబట్టి ఇది నాకు చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు. 'అజ్ఞాన మూలకమైన దోషాలు నశింపచేసుకొన్నాక విశుద్ధాంతఃకరణం కలిగి సంసార బంధాల నుండి విముక్తు డవుతాడు. మరల పుట్టిన దోషాలను పదునైన ఆకురాయి ఇనుప సంకెలలను నశింపచేసి, మొక్క పోయినట్లుగా, విశుద్ధబుద్ధి (ధ్యానం చేత సంస్కరింపబడిన బుద్ధి) తనతో పాటు పుట్టిన తామసదోషాలను నశింపచేసి తాను కూడా నశించిపోతుంది. రజోగుణ తమోగుణాలు, కామమోహాది దోషాలు లేనిది శుద్ధ సత్త్వగుణం. ఈ మూడూ శరీర ధారులకు దేహం రావడానికి మూలకారణం. అయినా మనసును వశపరచుకొన్న ఆత్మవంతునికి సత్త్వగుణమే సమత్వ సాధనం. కాబట్టి ఆత్మవంతునికి రజోగుణతమోగుణాలు విడిచిపెట్టదగినవి. ఈ రజస్తమస్సుల నుండి విడుదల పొందితే బుద్ధి నిర్మలత్వాన్ని పొందుతుంది. బుద్ధిని వశపరచుకోవడానికి సమంత్రకంగా చేసే యజ్ఞాదికర్మలు దోష యుక్తాలని కొంద రంటారు. కాని అవి కూడా నిష్కామ భావంతో చేసినట్లయితే వైరాగ్యానికి, శమదమాది శుద్ధ ధర్మానుష్ఠానానికి నిమిత్తాలవుతాయి. రజోగుణానికి అధీనుడై రకరకాల అధర్మయుక్తా లయిన, అర్థయుక్తా లయిన కర్మలు చేయడం మొదలుపెడితే అతడు సమస్త భోగాలను మహాసక్తితో అనుభవిస్తాడు. మానవుడు తమోగుణం ద్వారా లోభంతో కూడుకొన్న, క్రోధంవలన పుట్టిన కర్మలను

సేవిస్తాడు. హింసాత్మక కర్మలలో అతనికి అత్యంతాసక్తి ఉంటుంది. అతడు ఎల్లప్పుడూ నిద్రా తంద్రలతో ఆవరింపబడి ఉంటాడు. సత్త్వగుణం కలిగిన మానవుడు శుద్ధసాత్త్విక భావాలనే దర్శిస్తూ, వానినే ఆశ్రయిస్తాడు. ఆ జీవుడు విమలుడు, కాంతిమంతుడు, శ్రద్ధావిద్యా సమన్వితుడు అవుతాడు.'

213. వార్షేయాధ్యాత్మ కథనము - 4.

భీష్ముడు చెపుతున్నాడు. 'భరతసత్తమా ! రజోగుణ తమోగుణాల చేత మోహం పుడుతుంది. దానివలన కలిగే క్రోధం, లోభం, భయం, దర్పం - వీటిని నశింపజేస్తేనే మానవుడు శుద్ధుడు అవుతాడు. అటువంటి విశుద్ధుడే అక్షయుడు, అవ్యయుడు, పరముడు, అవ్యక్త స్వరూపుడు, పరదైవతం, పరమాత్మ అయిన విష్ణువు యొక్క తత్త్వాన్ని తెలుసుకోగలుగుతాడు. అతని మాయచేత ఆవృతులైతే జ్ఞానం, వివేకం నశించిపోతాయి. బుద్ధివ్యామోహం వలన క్రోధానికి లోనవుతారు. క్రోధం వలన కామం పొందుతారు. ఆపై కామంవలన లోభం, మోహం, మానం, దర్పం, అహంకారం కలుగుతాయి. అహంకారం వల్లనే ఆపైన పనులన్నీ జరుగుతాయి. అటువంటి పనులవలన స్నేహం (మమకారం) ఏర్పడుతుంది. స్నేహం వలన శోకం కలుగుతుంది. సుఖ దుఃఖాలతో కూడిన పనులు ఆరంభించడంవలన జనన మరణరూపమైన బాధకు లోను కావలసివస్తుంది. జన్మ కారణంగా గర్భవాసక్లేశాన్ని అనుభవించాలి. శుక్ర శోణిత సంయోగం వలన గర్భవాసం సిద్ధిస్తుంది. మలమూత్రాలతో, రక్తంతో తడిసిన మలినస్థానంలో ఉండవలసివస్తుంది. తృష్ణాభిభూతుడై, కామక్రోధాది దోషాలచేత బద్ధుడై, వాటిని దాటగోరుతూ ఉండే మానవుడు స్త్రీలు సంసార మనే వస్త్రానికి తంతువాహిను లని తెలుసుకోవాలి. ఆ స్త్రీలు ప్రకృతికి క్షేత్రభూత మయినవారు. పురుషులు క్షేత్రజ్ఞలక్షణాలు కలవారు. కనుకనే సామాన్యంగాను, విశేషంగానూ కూడా నరుడు వారికి దూరంగా ఉండాలి. **ఘోరాకారం కలిగిన కృత్యలవంటి ఈ స్త్రీలు అజ్ఞానులను మోహ పెడతారు. ఇంద్రియాలు రూపుకట్టిన ఈ సనాతని రజస్సునందు దాగి ఉంది. కాబట్టి స్త్రీ సంబంధమైన రాగం అనే బీజం నుండి జీవులు పుడుతున్నాయి. తన శరీరం నుండే పుట్టిన, తనవి అనే పేరు లేని కీటకాలను శరీరం నుండి ఎలా తొలగిస్తామో, అలాగే తనవి అనే పేరు కలిగిన, తనవికాని, నుతు లనే పేరు కలిగిన కీటకాలను వదిలివేయాలి.** వీర్యం వలన, చెమటవలన, స్వభావతఃగాని, కర్మయోగం వలన గాని శరీరం నుండి ప్రాణులు (సంతానం-కీటకాలు) పుడుతున్నాయి. బుద్ధిమంతుడు వానిని ఉపేక్షించాలి. రజస్సు

తమస్సునందు పర్యవసించి ఉంటుంది. సత్త్వం రజస్సునందు నిలిచి ఉంటుంది. జ్ఞానానికి అధిష్ఠానమైన అవ్యక్తమైన ఆత్మ బుద్ధి, అహంకార లక్షణాలు కలది.

దేహధారులకు అవ్యక్తాత్మయే బీజం. ఆ బీజభూతమైన ఆత్మయే గుణాలతో సాంగత్యం కారణంగా జీవు డనే వేరు గలది అవుతుంది అని చెపుతారు. అదే కాలంతో కూడి, కర్మ ప్రేరితమై, సంసార చక్రంలో తిరుగుతూ ఉంటుంది. ఈ జీవుడు స్వప్నంలో మనసుచేత దేహం ఉన్నవానివలె రమించినట్లుగా కర్మగర్భితాలైన గుణాలచేత తల్లిగర్భంలో వాటిని పొందుతున్నాడు. బీజభూతమైన కర్మచేత ఏయే ఇంద్రియాల పుట్టుకకు ప్రేరణ లభిస్తుందో, రాగయుక్తమైన మనసుతో, అహంకారంతో ఆ యా ఇంద్రియాలు పుడుతూ ఉంటాయి. భావితాత్మునకు శబ్దమందలి రాగం వలన శ్రోత్రేంద్రియం పుట్టుతుంది. అలాగే రూపరాగం వలన కన్ను, వాసనమీది కోరికతో ఘ్రాణేంద్రియం పుడుతున్నాయి. స్పర్శయందు రాగం ఉండడం వలన త్వగింద్రియం పుడుతుంది. దేహయాత్రా నిర్వహణార్థం వాయువు ప్రాణాపానాలను ఆశ్రయించుకొని, వ్యానోదాన సమానాలని ఐదురకాలుగా ప్రకటమవుతుంది. జీవుడు జననసమయంలో సంపూర్ణంగా ఉత్పన్న మయిన, కర్మ జనితమైన అవయవాలతో, పూర్ణ శరీరంతో కూడి జన్మిస్తున్నాడు. ఆది మధ్యాంతాలలో కూడా శారీరక మానసిక దుఃఖాలను పొందుతున్నాడు. శరీరం పొందడంవలన, దానిమీద అభిమానం వలనా కూడా దుఃఖం వృద్ధిపొందుతుంది. వాటిని వదలడం వలన దుఃఖనిరోధం ఏర్పడుతుంది. నిరోధించడం తెలుసుకొన్నవాడు ముక్తుడు అవుతాడు. ఇంద్రియాల పుట్టుక, లయం రెండూ రజోగుణంలోనే సంభవిస్తాయి. పండితుడు శాస్త్రదృష్టితో చక్కగా పరీక్షించుకొని, యథోచితంగా నడుచుకోవాలి. తృష్ణ లేనివానికి జ్ఞానేంద్రియాలు ఇంద్రియార్థాలలో ప్రవర్తించవు. ఇంద్రియాలు విషయాసక్తిలో తగుల్కొన నప్పుడు జీవుడు తిరిగి శరీరాన్ని ధరించడు.'

214. వార్షేయాధ్యాత్మ కథనము - 5.

భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! శాస్త్ర దృష్టితో మోక్షం పొందడానికి ఉపాయాన్ని యథాతథంగా ఇప్పుడు చెప్తాను. శాస్త్ర విహితకర్మలను నిష్కామ భావంతో చేస్తూ, తత్త్వజ్ఞానంతో పరమ గతిని పొందవచ్చును. ప్రాణు లందరిలో మానవుడు శ్రేష్ఠుడని చెప్తారు. మానవులలో ద్విజులు, ద్విజులలో మంత్రద్రష్టలైన బ్రాహ్మణులు శ్రేష్ఠులని అంటారు. ఆ బ్రాహ్మణులు వేదశాస్త్రాలు చక్కగా తెలిసిన వారు సర్వప్రాణులకు ఆత్మభూతులు, సర్వజ్ఞులు, సర్వదర్శనులు. తత్త్వార్థమందు స్థిర నిశ్చయబుద్ధి కలవారు.

కన్నులు లేనివాడు ఒంటరిగా మార్గంలో వెళ్లేటపుడు అనేకకష్టాలు పడతాడు. అలాగే ఈ లోకంలో జ్ఞానహీనుడు కూడా. కాబట్టి జ్ఞానవేత్తలే శ్రేష్ఠులు. **ధర్మం కోరుకొనేవాడు శాస్త్రానుసారంగా ఆ యా యజ్ఞాదిసకామ ధర్మాలను అనుష్ఠిస్తాడు. కాని ఈ చెప్పబోయే గుణాలు లేకుండా అందరికీ సమానరూపంగా మోక్ష మనే పురుషార్థం ప్రాప్తించదు. మనోవాక్కాయ పవిత్రత, క్షమ, సత్యం, ధైర్యం, స్మృతి - వీనిని సర్వధర్మాలలోను ధర్మజ్ఞు లైనవారు శుభకరమైన గుణాలుగా చెపుతారు.** ఈ బ్రహ్మచర్యమనే గుణం శాస్త్రాలలో బ్రహ్మస్వరూపంగా చెప్పబడుతోంది. ఇది సర్వధర్మాలలోను శ్రేష్ఠం. దీనివలన మానవుడు పరమగతిని పొందుతాడు. ఆ పరమపదం (పంచప్రాణాలు, మనస్సు, బుద్ధి, దశేంద్రియాలతో కూడిన) శరీర సంయోగం లేనిది, శబ్ద స్పర్శరహితమైనది, చెవులతో విననిది, కన్నులతో చూడనిది, వాక్కుతో మాట్లాడనిది, మనోరహితమైనది. మనిషి బుద్ధితో నిశ్చయించి, దానిని పొందడానికి నిష్కలంకమైన బ్రహ్మచర్యాన్ని పాటించాలి. ఈ బ్రహ్మచర్య వ్రతాన్ని చక్కగా పాటించినవాడు బ్రహ్మలోకాన్ని పొందుతాడు. మధ్యమ శ్రేణికి చెందిన బ్రహ్మచారి స్వర్గలోకాన్ని పొందుతాడు. కనిష్ఠ శ్రేణికి చెందిన విధ్వంసుడైన బ్రహ్మచారి బ్రాహ్మణశ్రేష్ఠుడుగా జన్మిస్తాడు.

బ్రహ్మచర్య వ్రత పాలనం అత్యంతదుష్కరం. దానికి తగిన ఉపాయాన్ని వినుము. రజోగుణం పుట్టి, ప్రదీప్త మవుతున్నపుడు ద్విజుడు దానిని నిగ్రహించాలి. స్త్రీలను గురించిన ప్రసంగాలు వినకూడదు. వారిని వివస్త్రలుగా చూడకూడదు. వారిని ఎట్టిపరిస్థితులలో అయినా అలా చూసినట్లయితే దుర్బలహృదయంలో రాగం అనగా కామభావం ప్రకాశిస్తుంది. మనసులో రాగం ఉత్పన్నమైన బ్రహ్మచారి ఆత్మశుద్ధికోసం కృచ్ఛ్రవ్రతాన్ని ఆచరించాలి. వీర్యస్ఖలనం అయితే నీటిలో మునిగి ఉండి, మూడు సార్లు మనసులోనే అఘమర్షణ సూక్తాన్ని జపించాలి. వివేకి అయినవాడు ఈ రీతిగా జ్ఞానయుక్త మయి, సంయమశీల మయిన మనసుతో తన అంతరంగంలో పుట్టిన పాపమయ మైన కామవికారాన్ని దహించివేయాలి. దుర్గంధమయమై మలమూత్రాలతో నిండిన ప్రేగుల సముదాయం దేహంలో దృఢంగా బంధింపబడి ఉన్నట్లుగా దేహగతమైన ఆత్మ (ప్రత్యగాత్మ) దేహంతో ముడిపడి ఉన్నట్లుగా తెలుసుకోవాలి. అన్నరసాలు మనుషులలో నాడీసముదాయం ద్వారా వాత పిత్త కఫ రక్త త్వక్ మాంసాలను, స్నాయువులనూ, అస్థులను, మజ్జను, సంపూర్ణదేహాన్ని తుష్టిపొందిస్తాయి. పైన చెప్పిన వాతపిత్తాలైన పది వస్తువులను వహించే పదినాడులు పంచేంద్రియాల యొక్క శబ్దాది గుణాలను గ్రహించే శక్తి కలిగించేవి ఈ శరీరంలో ఉన్నాయి. వాటితో పాటే ఇతరమైన వేలకొద్దీ నాడులు ఈ

శరీరంలో వ్యాపించి ఉన్నాయి. నదులు తమ జలాలతో యథాసమయంలో సముద్రాన్ని తృప్తిపరచినట్లుగా రసాన్ని ప్రవహింపచేసే ఈ నాడీ రూపనదులు ఈ దేహసాగరాన్ని తృప్తి పొందిస్తూ ఉంటాయి. హృదయమధ్యంలో మనోవహమనే ఒక నాడి ఉన్నది. అది కామవిషయకమైన సంకల్పం ద్వారా సమస్త శరీరంలోని వీర్యాన్ని లాగివేసి, పైకి వెడలగొడుతుంది. ఈ నాడిని అనుసరించి ఉన్నట్టి, సమస్త శరీరంలోను వ్యాపించి ఉన్నట్టి ఇతర నాడులు తైజసగుణాన్ని వహిస్తూ ఆ శక్తిని నేత్రాలవరకు చేరుస్తాయి. **పాలలో దాగి ఉన్న నేతిని కవ్వాలతో చిలికి వేరు చేసినట్లుగా దేహస్థమైన సంకల్పాలు స్త్రీ దర్శనస్పర్శ లనే కవ్వాలతో మధించి శుక్రాన్ని పైకి వెలువరిస్తాయి. స్వప్నంలో సంసర్గం లేకపోయినప్పటికీ మనస్సంకల్పం చేత స్త్రీ విషయకమైన రాగం కలిగినట్లుగా మనోవహమనే నాడి మనిషి శరీరం నుండి సంకల్పజనితమైన వీర్యాన్ని స్రవింప చేస్తుంది.**

మహర్షిఅయిన అత్రిభగవానుడు ఈ వీర్యం యొక్క ఉత్పత్తి గతులను తెలిసినవాడు. ఈ మనోవహమనే నాడి, సంకల్పం, అన్నం- ఈ మూడూ వీర్యానికి కారణాలని, ఈ వీర్యానికి దేవత ఇంద్రుడని, అందుకని దీనిని 'ఇంద్రియం' అంటారని చెప్తారు. ప్రాణులలో వర్ణసాంకర్యాన్ని కలిగించేది వీర్యగతియే అని తెలుసుకొన్నవారు విరక్తులై తమ దోషాలను దగ్ధం చేసుకొంటారు. కాబట్టి వారు మరల దేహబంధాలలో చిక్కుకోరు. కేవలం శరీరరక్షణ కోసమే భోజనాది కర్మలు చేసేవాడు, అభ్యాసబలంతో గుణాలతో సామ్యాన్ని పొంది (నిర్వికల్ప సమాధిని పొంది), మనసు ద్వారా మనోవహమనే నాడిని అదుపులో ఉంచుకొని, అంతకాలంలో ప్రాణాలను సుషుమ్నా మార్గంలోకి తీసుకువెళ్లి, సంసార బంధం నుండి విముక్తు డవుతాడు. ప్రణవోపాసన చేత పరిశుద్ధమైన వారి మనస్సు నిత్యమూ ప్రకాశమయం, నిర్మలం అవుతుంది. ఆ మహాత్ముల మనసులో తత్త్వజ్ఞానం ఉదయిస్తుంది. **కాబట్టి మనసును అదుపులో ఉంచుకోవడానికి, మనిషి నిర్దుష్టమైన నిష్కామకర్మ చేయాలి. అలా చేయడంవలన రజోగుణ తమోగుణాల నుండి విముక్తుడై తనకు వచ్చిన గతిని పొందుతాడు.** యౌవనంలో పొందిన జ్ఞానం ప్రాయికంగా వృద్ధాప్యంలో క్షీణిస్తుంది. కాని పరిపక్వబుద్ధి కలిగిన మనిషి సమయానుసారంగా ఎన్నటికీ క్షీణించని జ్ఞానాన్ని కలిగించే మానసిక బలాన్ని పొందుతాడు. అటువంటి పరిపక్వ బుద్ధికలిగిన మనిషి అత్యంత దుర్గమమైన మార్గంతో సమానమైన గుణబంధాలను దాటి, ఎటువంటి దోషాలు కనపడినా వాటినన్నిటిని అతిక్రమించి, అమృతమయ మైన పరమాత్మపదాన్ని పొందుతాడు.'

215. వార్షేయాధ్యాత్మ కథనము - 6.

భీష్ముడు చెపుతున్నాడు. 'ఇంద్రియ విషయాలు తరింపశక్యం కానివి. వాటియందు ఆసక్తమైన ప్రాణులు దుఃఖాలను అనుభవిస్తారు. ఆసక్తులు కాని మహాత్ములు పరమగతిని పొందుతారు. జనన మరణ జరా దుఃఖాలతో, రకరకాల వ్యాధులతో, మానసిక చింతలతో వ్యాప్తమై ఉన్న ఈ లోకాన్ని చూసి, బుద్ధిమంతుడు మోక్షం కొరకు ప్రయత్నించాలి. వాక్కుతో, మనస్సుతో, శరీరంతో పవిత్రంగా ఉండి అనహంకారి, శాంతచిత్తుడు, జ్ఞానవంతుడు అయిన వాడు కోరికలను విడనాడి భిక్షావృత్తితో జీవితాన్ని గడుపుతూ, సుఖంగా చరించాలి. ప్రాణులపట్ల దయాభావాన్ని ప్రకటించినా మనస్సులో సంగం కలుగుతుందని గమనించాలి. ఈ జగత్తు కర్మలకు ఫలంగా లభించే దని తెలుసుకొని, దానిపై కూడా ఉపేక్ష వహించాలి. శుభకర్మఅయినా, అశుభకర్మ అయినా చేసిన దాని ఫలాన్ని అనుభవించాలి. కాబట్టి బుద్ధిచేత గాని, క్రియల చేత గాని ఎప్పుడూ శుభకర్మలనే చేయాలి. అహింస, సత్యవాక్కు, ప్రాణులందరియందు ఋజువర్తన, క్షమ, జాగరూకత - అనే గుణాలు ఉన్నవాడు సుఖంగా ఉంటాడు.* పైన చెప్పిన అహింసాది పరమధర్మాలు సమస్త ప్రాణులకు సుఖావహ మని, దుఃఖ నివారకా లని తెలుసుకొన్నవాడు సర్వజ్ఞుడు, సుఖి అవుతాడు. కాబట్టి బుద్ధిచేత మనసును సమాహితం చేసి, ప్రాణులలో ఉండే పరమాత్మయందు లగ్నం చేయాలి. ఎవరికీ అహితం చేయాలని ఆలోచించకూడదు. వస్తువును కోరుకోకూడదు. మిథ్యాపదార్థాలను గూర్చి చింతించకూడదు. గట్టి ప్రయత్నం చేసి, మనసును జ్ఞానధనంలో లగ్నం చేయాలి. వేదాంత వాక్యశ్రవణం చేయాలి. గట్టిప్రయత్నంచేత ఉత్తమజ్ఞానం కలుగుతుంది. సూక్ష్మ ధర్మాన్ని దర్శించే వాడు, సద్వాక్యాలను మాటలాడ గోరేవాడు సత్యమై, అహింసాయుతమై, పరనిందా రహితమైన మాటలను మాట్లాడాలి. ఆ మాటలలో మొండి తనం, కఠోరత, క్రూరత, చాడీకోరుతనం మొదలైన దోషాలు ఉండకూడదు. ఆ మాటలు కూడా దృఢచిత్తంతో చాలా కొద్దిగా పలకాలి. లోకంలోని వ్యవహారమంతా వాక్కులోనే బంధింపబడి ఉంది. కాబట్టి ఉత్తమమైన మాటనే మాట్లాడాలి. వైరాగ్యంతో మాటలాడితే బుద్ధితో మనసును కట్టడి చేసుకొని, తాను చేసిన హింసాది తామసకర్మలను గూర్చి కూడా లోకానికి చెప్పాలి. (వెల్లడి చేస్తే పాపం తగ్గుతుంది).

రజోగుణ ప్రభావితమైన ఇంద్రియాల ప్రేరణతో మనిషి విషయ భోగరూపమైన కర్మలను చేస్తున్నాడు. ఈ లోకంలో దుఃఖాన్ని పొంది, చివరకు నరకాన్ని చేరుకొంటున్నాడు.

---

* అహింసా సత్యవచనం సర్వభూతేషు చార్జవమ్ ।
క్షమా చైవాప్రమాదశ్చ యస్యైతే స సుఖీ భవేత్ ॥ 6

కాబట్టి మనస్సు, వాక్కు, శరీరం చేత తనకు ధైర్యాన్ని కలిగించే పనులను చేయాలి. చంపిన మేకల మాంసభారాన్ని దొంగలు మోసినట్లుగా అజ్ఞానులు సంసార భారాన్ని మోస్తున్నారు. వారు తమకు అననుకూలమైన దిక్కును గమనించి నట్లుగా, వీరు తమ బాధలను గమనిస్తారు. దొంగలు ఆ భారాన్ని విసిరివేసి, తమకు క్షేమకరమైన దిక్కుకు వెళ్లిపోయినట్లుగా రజస్తమః కర్మలను విడిచి శుభాన్ని పొందాలి. సమస్త పరిగ్రహాలనుండి ముక్తుడైనవాడు, కోరికలు లేనివాడు, ఏకాంతంలో గడిపేవాడు, తేలికగా తినేవాడు, తపస్సు చేస్తూ ఇంద్రియాలను అదుపులో ఉంచుకొనేవాడు, జ్ఞానం చేత దహింపబడిన క్లేశాలు కలవాడు, యోగానుష్ఠానంలో ఆసక్తి కలవాడు, మనసును నియంత్రించినవాడు, నిశ్చలమైన చిత్తంతో పరమాత్మను నిస్సందేహంగా పొందగలుగుతాడు. ధృతిమంతుడు, బుద్ధిమంతుడు తప్పకుండా బుద్ధిని నిగ్రహించాలి. బుద్ధితో మనసును, మనసుతో తన ఇంద్రియ విషయాలను అరికట్టి వశపరుచుకోవాలి. ఇంద్రియాలను నిగ్రహించి, మనసును వశపరచుకొనిన వానికి ఆ ఇంద్రియాధి దైవతాలు ప్రసన్నాలై ప్రకాశిస్తాయి. ఆ పరమాత్మవైపు మళ్లుతాయి. ఆ ఇంద్రియాధిష్ఠాన దైవతాలతో మనస్సు కూడినపుడు ఆ పరబ్రహ్మ అందులో ప్రకాశిస్తాడు. మెల్లమెల్లగా సత్త్వగుణాన్ని, పొంది బ్రహ్మభావాన్ని పొందుతాడు మనిషి.

అలా బ్రహ్మభావం ప్రకాశించకపోతే, యోగ తంత్రాలను అభ్యసించడం ఆరంభించాలి. యోగాభ్యాసం చేసే అతనికి దేనిచేత బ్రహ్మస్థితి కలుగుతుందో ఆ యా తంత్రాన్ని ఆచరించాలి. నూకలు, ఉడక బెట్టిన మినుములు, తెలకపిండి, యవలపిండి జావ, పేలపిండి, శాకాలు, దుంపలు, ఫలాలు, భిక్షాన్నం – ఇవన్నీ పర్యాయంగా ఉపయోగించాలి. దేశకాలాలను అనుసరించి సాత్త్వికమైన ఆహారాన్ని తీసుకొనే నియమం పెట్టుకోవాలి. దానిని కూడా గుణ దోషాలు పరీక్షించి, అది యోగసాధనకు అనువుగా ఉంటే స్వీకరించాలి. **సాధన ప్రారంభించాక దానిని మధ్యలో మానివేయకూడదు. జ్ఞానంతో కూడిన ఆ సాధనను మెల్లగా అగ్నినివలె ప్రజ్వరిల్ల చేయాలి. అప్పుడే జ్ఞానం సూర్యునిలా ప్రకాశిస్తుంది.** అజ్ఞానానికి కూడా జ్ఞానమే అధిష్ఠానం. అది ముల్లోకాలలోను వ్యాపించి ఉంది. విజ్ఞానయుక్తమైన జ్ఞానం అజ్ఞానం చేత తగ్గించివేయబడుతోంది. శాస్త్రాలలో జీవాత్మ పరమాత్మల పృథక్త్వం, అభేదం కూడ చెప్పబడుతుంది. అందులో దోషమెంచినవాడు సనాతన పరబ్రహ్మను తెలుసుకోలేడు. ఆ రెండింటిలోనూ మోక్షాన్ని గూర్చి తెలుసుకొన్నవాడు వీతరాగుడై విముక్తు డవుతాడు. అనంతరం జరామృత్యువులు వీడి, సనాతన బ్రహ్మను తెలుసుకొని, అక్షరం, అవ్యయం అయిన అమృతాన్ని పొందుతాడు.'

216. వార్షేయాధ్యాత్మ కథనము - 7.

భీష్ముడు చెపుతున్నాడు. 'సదా నిష్కలంకమైన బ్రహ్మచర్యవ్రతాన్ని పాటించాలని కోరుకొనేవాడు స్వప్నంలోని దోషాలను గమనించి, సర్వాత్మనా నిద్రను త్యజించాలి. స్వప్నంలో రజస్సు, తమస్సు దేహిని బాధిస్తాయి. అతడు కోరికలతో కూడి వేరే శరీరం పొందిన వానిలా ప్రవర్తిస్తాడు. జ్ఞానాభ్యాసం వలన మెలకువగా ఉండడం మొదట అలవాటు అవుతుంది. అటుతరువాత జిజ్ఞాసకోసం జాగరణ అనివార్యం అవుతుంది. విజ్ఞానమందలి అభినివేశం వలన నిరంతరం మెలకువగానే ఉంటాడు. స్వప్నంలో కనిపించే దేహాదిపదార్థాల యొక్క భావం ఏమై ఉంటుంది ? అని ఒకడు అడుగవచ్చును. ఇది సత్య మనడం సరికాదు. స్వప్నావస్థలో విషయాలన్నీ ఉన్నట్లు అనిపించినా వాస్తవానికి ఏవీ లేవు. అవన్నీ మనసులో లీనం అవుతాయి. వాటితోటే జీవుడు విషయవంతునిలా ప్రవర్తిస్తాడు. ఇది అసత్య మనడమూ సరికాదు. ఎందుకంటే సర్వధా అసత్తు అయినదానికి ప్రతీతియే ఉండదు. ఈ స్వప్నవిషయాన్ని యోగేశ్వరుడైన శ్రీహరియే ఎరుగును అని ఇక్కడ చెపుతూ ఉంటారు. మహర్షులు కూడా అలాగే చెప్తారు. అది యుక్తిసంగతంగానూ ఉంటుంది. ఇంద్రియాలు విషయాసక్తితో నిరంతరం శ్రమించడంవలన ప్రాణు లందరికీ అనుభవ మైనదే స్వప్నంగా కనిపిస్తుందని పండితులు చెప్తారు. ఇంద్రియాలు లయమయినా మనసు లయంకాదు కాబట్టి అది విషయాల నన్నిటినీ మనసుద్వారా అనుభవిస్తుంది. అదే స్వప్నం. ఇందుకు ఉదాహరణ ఒకటి చెపుతారు. జాగ్రదవస్థలో కార్యమందు ఆసక్త చిత్తు డయినప్పటికీ వాని యొక్క సంకల్పం మనోరధైశ్వర్యం అయినట్లుగానే స్వప్నంలోని భావాలు కూడా మనసుతోనే సంబంధం కలిగి ఉంటాయి.

కామాసక్తు డయినవాడు అసంఖ్యాకమయిన సంస్కారాలను అనుసరించి, దానిని స్వప్నంలో పొందుతాడు. మనసులో (నిగూఢంగా) దాగి ఉన్న ఆ సమస్త సంస్కారాలు పురుష శ్రేష్ఠ డయిన పరమాత్మకు తెలుసు. కర్మలను అనుసరించి సత్త్వాది గుణాలలో ఏదయితే ప్రాప్తిస్తుందో, అది మనసుమీద ఎటువంటి సంస్కారం చూపుతుందో, లేదా ఎప్పుడు ఏ కర్మచేత మనసు భావితమవుతుందో ఆ సమయంలో సూక్ష్మభూతం స్వప్నంలో అటువంటి ఆకృతినే కనిపింపజేస్తుంది. ఆ స్వప్నం కనబడగానే రాజసతామససాత్త్విక గుణాలు యధాయోగ్యంగా, సుఖ దుఃఖరూప ఫలానుభవంకోసం దాని చెంతకు చేరుకొంటాయి. తదనంతరం మనిషి స్వప్నంలో అజ్ఞానవశంచేత వాతపిత్త కఫాల ప్రాధాన్యంతో కూడి, కామమోహాదులైన రాజసతామస భావాలతో వ్యాప్తమైన అనేకవిధాల శరీరాలను దర్శిస్తాడు. తత్త్వజ్ఞానం లేనిదే ఆ స్వప్నదర్శనాన్ని దాటడం కష్ట మని చెప్తారు. జాగ్రదవస్థలో ప్రసన్నమైన ఇంద్రియాల ద్వారా మనస్సు దేనిని సంకల్పిస్తుందో స్వప్నావస్థలో అదే పూర్తికావటాన్ని

మనస్సు ఆనందంతో చూస్తుంటుంది. అప్రతిహత గమనం గల మనసు తనకు అధిష్ఠానమైన ఆత్మయొక్క ప్రభావం చేత సర్వభూతాలలో వ్యాప్తమై ఉంటుంది. ఆత్మయందు సర్వదేవతలు ఉంటారు కాబట్టి దానిని గూర్చి తప్పక తెలుసుకోవాలి.

స్వప్నానికి దూరంగా ఉండే స్థూల శరీరం సుషుప్త్యవస్థలో మనసులో లీన మవుతుంది. ఆ దేహాన్ని ఆశ్రయించుకొనియే మనస్సు అవ్యక్తమూ, సదసత్ప్ర రూపమూ, సాక్షీ భూతమూ అయిన ఆత్మను పొందుతుంది. ఆ ఆత్మ సమస్త ప్రాణులకు ఆత్మభూతం. జ్ఞాని దానిని అధ్యాత్మగుణంతో కూడిన దని భావిస్తాడు. మనసు ద్వారా సంకల్పంతోనే ఈశ్వరీయగుణాన్ని పొందాలనుకొనే యోగి, ఆ ఆత్మయొక్క అనుగ్రహాన్ని పొందుతాడు. ఎందుకంటే దేవతలందరూ ఆత్మలోనే ఉన్నారు. ఈ రీతిగా తపస్సుతో కూడిన మనస్సు అజ్ఞానాంధకారాన్ని చీల్చుకొని, పైకి వచ్చిన సూర్యునిలా జ్ఞానమయప్రకాశంతో వెలుగొందుతూ ఉంటుంది. ముల్లోకాలకు కారణభూత బ్రహ్మ అయిన జీవాత్మ అజ్ఞానం నివర్తించిన తదుపరి మహేశ్వర రూపు డవుతాడు. దేవతలు తపస్సును ఆశ్రయిస్తారు. అసురులు తపస్సుకు విఘ్నం కలిగించే దంభదర్పాది తమోగుణాలను ఆశ్రయించారు. కాని ఈ బ్రహ్మతత్త్వం దేవాసురులకు ఇద్దరికీ గుప్త మైనదే. తత్త్వజ్ఞులు దానిని జ్ఞాన స్వరూప మని చెపుతారు. సత్త్వరజస్తమోగుణాలు దేవాసుర గుణాలుగా భావింపబడతాయి. వీటిలో సత్త్వం దేవతల గుణం. మిగిలిన రెండూ ఆసురగుణాలు. బ్రహ్మ ఈ మూడుగుణాలకూ అతీత మైనది. అది అక్షరం, అమృతం, స్వయం ప్రకాశం, జ్ఞానస్వరూపం భావితాత్ములు దానిని తెలుసుకొని పరమగతిని పొందుతారు. జ్ఞానదృష్టి కలవాడు బ్రహ్మ విషయంలో యుక్తిసంగతమైన మాటలు చెప్పగలడు. లేక మనసును, ఇంద్రియాలను విషయాలనుండి మరల్చి ఏకాగ్రచిత్తుడై చింతన చేయడం ద్వారా కూడా బ్రహ్మసాక్షాత్కారం లభిస్తుంది.'

217. వార్షేయాధ్యాత్మ కథనము - 8.

భీష్ముడు చెపుతున్నాడు. 'పరమాత్మ, దృశ్యవర్గం, ప్రకృతి, పురుషుడు - అనే ఈ నాలుగింటిని తెలియనివాడు పరమాత్మను గూర్చి కూడా తెలుసుకోలేడు. పరమబుషి నారాయణుడు ప్రతిపాదించిన వ్యక్తావ్యక్తతత్త్వంలో వ్యక్తం అంటే మృత్యుముఖమని, అవ్యక్తం అంటే అమృతపద మని తెలుసుకోవాలి. ఇంకా నారాయణుడు చెప్పిన ప్రవృత్తి రూపధర్మం మీదనే చరాచర ప్రాణులతో కూడిన ముల్లోకాలు నిలిచిఉన్నాయి. నివృత్తిరూపధర్మం అవ్యక్తమైన సనాతన బ్రహ్మస్వరూపమే. **ప్రవృత్తి రూపధర్మాన్ని గూర్చి ప్రజాపతి బ్రహ్మ చెప్పాడు. ప్రవృత్తి పునరావృత్తికి కారణం. దానిని ఆచరించడం వలన లోకంలో మాటిమాటికి జన్మించాలి. నివృత్తి రూపధర్మం పరమగతిని కలిగించేది.**

జ్ఞాన తత్త్వచింతనలో మునిగి, శుభాశుభాలను దర్శించగలిగిన నివృత్తి పరాయణుడు అయిన ముని మాత్రమే పరమగతిని పొందుతాడు. విచక్షణశీలుడు అవ్యక్తం, పురుషుడు - ఈ రెండింటి గురించి ముందు తెలుసుకోవాలి. ఆ తరువాత ఈ రెండింటిలో శ్రేష్ఠ మయిన పరమపురుషతత్త్వాన్ని విశేషంగా తెలుసుకోవాలి. ఈ ప్రకృతి పురుషులు రెండూ కూడా అనాది, అనంతం. రెండూ కూడా లక్షణరహితాలు, నిరాకారాలు. అలాగే రెండూకూడా నిత్యాలు, నిశ్చలాలు మహత్తరాలు. ఈ లక్షణాలన్నీ రెండింటియందూ సమానమే. కాని ఈ రెండింటిలో అంతరం లేదా వైలక్షణ్యం ఉంది. అది వేరే సంగతి. దానిని చెప్తా.

ప్రకృతి త్రిగుణమయ మైనది. సృష్టించే ధర్మం కలది. క్షేత్రజ్ఞుని స్వరూపం దానికంటె విపరీత మని తెలుసుకోవాలి. అతడు గుణరహితుడు. ప్రకృతి యొక్క వికారాలను (కార్యాలను) దర్శించేవాడు. ఈ ప్రకృతి పురుషులు ఇద్దరూ కూడా ఆకార రహితులు, పరస్పరం విలక్షణులు కాబట్టి ఇంద్రియాల చేత గ్రహింపశక్యంకానివారు. ప్రకృతి పురుషుల సంయోగం చేత ఉత్పత్తి అవుతున్న ఈ జగత్తు కర్మచేత మాత్రమే గ్రహింపదగినది. జీవుడు మనస్సు ద్వారా, ఇంద్రియాల ద్వారా కర్మలు చేస్తూ ఉంటాడు. అతడు చేసే కర్మలకు అతడే కర్తగా చెప్పబడుతాడు. "ఎవరు ? నేను, వాడు, వీడు" అనే శబ్దాల ద్వారా, సంజ్ఞల ద్వారా అతనినే వ్యవహరిస్తూ ఉంటారు. తలపాగా చుట్టినవాడు (పైవంచె, ధోవతి, తలపాగా) మూడు వస్త్రాలచేత ఆవరింపబడినట్లుగా ఈ జీవుడు సత్త్వరజస్తమస్సు లనే మూడు గుణాలతో ఆవరింపబడి ఉన్నాడు. కాబట్టి ఈ హేతువుల చేత (ఆద్యంత రాహిత్యం, చిజ్జడత్వం, అసంహతత్వం, కర్తృత్వం) ఆవరింపబడియున్న ఈ నాలుగింటిని (పరమాత్మ, దృశ్యవర్గం, ప్రకృతి, పురుషుడు) తెలుసుకోవాలి. వీటి తత్త్వాన్ని చక్కగా తెలుసుకొన్నవాడు మరణసమయంలో మోహపడడు. దివ్య సంపత్తిని అనగా బ్రహ్మజ్ఞానాన్ని పొందగోరిన శరీరధారి మనస్సును శుద్ధి పరచుకోవాలి. శారీరకమైన కఠోరనియమాలను పాటిస్తూ నిర్దోషమైన తపస్సును అనుష్ఠించాలి. ఆంతరికమైన తపస్సు ప్రకాశమానమై, ముల్లోకాలలో వ్యాపిస్తుంది. ఆకాశంలో సూర్యచంద్రులు కూడా తపస్సుచేతనే ప్రకాశిస్తున్నారు. లోకంలో తపశ్శబ్దం విఖ్యాతం. జ్ఞానస్వరూపమైన ప్రకాశమే ఆ తపస్సునకు ఫలం. రజోగుణ తమోగుణాలను నాశనం చేసే నిష్కామకర్మ తపస్సు యొక్క స్వరూపబోధకమైన లక్షణం. **బ్రహ్మచర్యం, అహింస శారీరకమైన తపస్సు అని చెప్తారు. చక్కని వాఙ్నియమం, మనోనియమం మానసికమైన తపస్సుగా చెప్తారు.***

---

* బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ।
వాఙ్మనోనియమః సమ్యక్ మానసం తప ఉచ్యతే ॥ 17

వైదిక విధులను తెలిసి, ఆచరించే బ్రాహ్మణుల నుండి అన్నం స్వీకరించడం ఉత్తమ మని భావిస్తారు. ఇలాంటి అన్నాన్ని నియమబద్ధంగా భుజించి వట్లయితే రజోగుణం వలన పుట్టిన పాపం శాంతిస్తుంది. అందువలన సాధకుని ఇంద్రియాలు కూడా విషయాలనుండి విరక్తి పొందుతాయి. కాబట్టి ప్రాణరక్షణ కోసం ఎంత అవసరమో అంతమాత్రం అన్నమే స్వీకరించాలి.

ఈ రీతిగా యోగయుక్త మైన మనసుతో పొందుతున్న జ్ఞానాన్ని జీవితం చివరివరకు పూర్తిశక్తిని వినియోగించి, మెల్లమెల్లగా పొందుతూనే ఉండాలి. ఈ పనిలో ధైర్యాన్ని విడనాడకూడదు. యోగపరాయణుని బుద్ధి పనులద్వారా దెబ్బ తినదు. వైరాగ్యవశాత్తు అతని స్వభావంలోనే నిలిచి ఉంటుంది. రజోగుణరహితమై ఉంటుంది. దేహధారి అయినప్పటికీ శబ్దంవలె అడ్డులేకుండా సర్వత్ర చరిస్తుంది. దేహావసానం వరకు ఏమరుపాటు లేని యోగి దేహావసానం తరువాత మోక్షం పొందుతాడు. బంధాలకు కారణభూత మైన అజ్ఞానంతో కూడినవారికి సదా జననమరణాలు సంభవిస్తూ ఉంటాయి. బ్రహ్మజ్ఞానం పొందినవానిని ప్రారబ్ధం అనుసరించదు. అంటే అతడు ప్రారబ్ధబంధనాలనుండి ముక్తు డవుతాడు. కాని దానికి వ్యతిరేకంగా అజ్ఞానం దూరం కానివాడు ప్రారబ్ధవశమైన జన్మమృత్యు చక్రంలో తగుల్కొంటాడు. యోగులు కొంతమంది బుద్ధిద్వారా తమ చిత్తాలను విషయాలనుండి మరల్చి, స్థిరాసనంలో దృఢంగా ఉండి, దేహధారణ చేస్తూ, ఇంద్రియాలనుండి సంబంధాన్ని విడిచివేసి, సూక్ష్మ బుద్ధి ఉండడంవలన బ్రహ్మను ఉపాసిస్తారు. ఒక్కొక్కడు శాస్త్రంలో చెప్పబడిన క్రమంలో (ఉత్తరోత్తరం ఉత్కృష్టజ్ఞానాన్ని పొందుతూ పరాకాష్ఠవరకు చేరి అక్కడే) బుద్ధి ద్వారా బ్రహ్మానుభవం పొందుతాడు. యోగం ద్వారా తన బుద్ధిని శుద్ధం చేసుకొన్నవాడు దేహస్థితి పర్యంతం ఆశ్రయరహితుడై తనమహిమ యందు ప్రతిష్ఠితుడైన బ్రహ్మయందు నిలిచి ఉంటాడు. అలాగే కొంతమంది యోగధారణద్వారా సగుణబ్రహ్మో- పాసన చేస్తారు. కొంతమంది విద్యుత్తుతో సమానమైన జ్యోతిర్మయుడు, అక్షరుడు అని చెప్పబడే ఆ పరదైవతాన్ని గూర్చి చింతన చేస్తారు. కొంతమంది తపస్సులతో తమ పాపాలను దగ్ధం చేసుకొని అంతకాలంలో బ్రహ్మను పొందుతారు. ఈ మహాత్ము లందరూ ఉత్తమ గతినే పొందుతారు.

శాస్త్ర దృష్టితో ఆ మహాత్ములయొక్క సూక్ష్మవిశేషతను చూడాలి. దేహత్యాగ పర్యంతం నిత్యముక్తులు, అపరిగ్రహులు, ఆకాశం కంటె కూడా విలక్షణులు అయినవారు యోగధారణతో మనసును స్థిరంగా నిలిపి ఉంచి, ఆ పరబ్రహ్మను గూర్చిన జ్ఞానాన్ని పొందుతారు. జ్ఞానసాధనలో మనసు లగ్నం చేసినవారు మర్త్యలోక బంధనాలనుండి

విడుదల పొంది, రజోగుణరహితులై, బ్రహ్మ స్వరూపులై పరమగతిని పొందుతారు. వేదవేత్తలైన పండితులు ఈ రీతిగా ఏకమాత్రుడైన బ్రహ్మను పొందే సాధన మైన ధర్మాన్ని వర్ణించారు. తమ తమ జ్ఞానాన్ని అనుసరించి, ఉపాసన చేసే సాధకు లందరూ పరమగతిని పొందుతారు. రాగాది దోషరహితమై అస్థిరమైన జ్ఞానాన్ని పొందినవారు కూడా ఉత్తమ లోకాలను పొందుతారు. తదనంతరం సాధన బలంచేత పూర్ణజ్ఞానాన్ని పొంది, మోక్షాన్ని పొందుతారు. **ఐశ్వర్యయుక్తుడు, అజుడు, దివ్యుడు, అవ్యక్తుడు అనే పేర్లు కల విష్ణు భగవానుని భక్తిభావంతో శరణు పొందినవారు జ్ఞానానందంతో తృప్తులు, విశుద్ధులు, కామనారహితులు అవుతారు. వారు తమ అంతఃకరణంలో శ్రీహరి ఉన్నాడని తెలుసుకొని అవ్యయస్వరూపులు అవుతారు. వారు ఇక తిరిగి ఈ ప్రపంచలోకి రానక్కరలేదు. వారు అక్షరమూ, అవ్యయమూ అయిన పరమపదాన్ని పొంది, పరమానంద నిమగ్నులవుతారు.** ఈ విజ్ఞానం ఇంతమాత్రమే. ఈ జగత్తు ఉన్నదీ, లేనిదీ కూడా. (వ్యావహారిక దశలో ఉన్నది, పారమార్థిక దశలో లేనిది) జగత్తు అంతా తృష్ణతో బంధింపబడి చక్రంలా తిరుగుతోంది. తామరతూడులోని దారాలు తూడు అంతటా వ్యాపించి ఉన్నట్లుగా అనాది, అనంతమయిన తృష్ణాతంతువు ఎల్లప్పుడూ దేహగతమై ఉంటుంది. సాలెవాడు సూదితో దారాన్ని వస్త్రంలోకి ఎక్కించినట్లుగా, తృష్ణ అనే సూదితో సంసారసూత్రం నిబద్ధమవుతుంది. ప్రకృతిని, అది చేసే కార్యాన్ని, పురుషుని, సనాతన పరమాత్మను యథార్థరూపంతో తెలుసుకొన్నవాడు తృష్ణారహితుడై, మోక్షాన్ని పొందుతాడు. లోకానికి శరణు ప్రసాదించే ఋషి శ్రేష్ఠుడయిన నారాయణ భగవానుడు జీవుల యందు దయచూపడానికే ఈ అమృత మయజ్ఞానాన్ని ప్రకాశింప చేశాడు.'

218. పాఖండ ఖండనం.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'సదాచార వృత్తము నెరిగినవాడా ! మోక్ష ధర్మాన్ని తెలిసిన మిథిలానరేశుడు జనకుడు మానవభోగాలను పరిత్యజించి ఎలాంటి నడవడికతో మోక్షాన్ని పొందాడు ? భీష్ముడు చెపుతున్నాడు. 'ధర్మజ్ఞుడైన జనకమహారాజు ఏ ఆచరణ ద్వారా మహాసుఖాన్ని పొందాడో చెప్పడానికి విజ్ఞులు ఈ పురాతన ఇతిహాసాన్ని ఉదాహరిస్తూ ఉంటారు. పూర్వకాలంలో మిథిలానగరాన్ని జనక వంశీయుడైన జనదేవ రాజు పాలిస్తూ ఉండేవాడు. దేహాన్ని విడిచిన తర్వాత ఆత్మ పొందే స్థితిని గురించి ఆయన ఎప్పుడూ ఆలోచిస్తూండేవాడు. నానా ఆశ్రమాలలో నివసిస్తూ వేర్వేరు ధర్మాలను ఉపదేశించే వందమంది ఆచార్యులు అతని సభలో ఉండేవారు. "ఈ శరీరం విడిచాక జీవుడు ఉంటాడా ?

ఉండడా? లేదా దేహత్యాగానంతరం జీవునికి పునర్జన్మ ఉంటుందా ? ఉండదా ?" అనే విషయంలో ఆ ఆచార్యుల సునిశ్చిత సిద్ధాంతం కాని, వారు ఆత్మతత్త్వం గురించి వెలిబుచ్చిన ఆలోచన గాని శాస్త్రానుయాయి అయిన ఆ జనదేవునికి విశేష సంతోషం కలిగించలేదు. ఒకసారి కపిలా పుత్రుడు, మహాముని అయిన పంచశిఖుడు భూమి అంతా తిరుగుతూ మిథిలానగరానికి వచ్చాడు. అతడు సన్యాసధర్మాలన్నింటిలోను, తత్త్వజ్ఞాన నిర్ణయంలోను సునిశ్చతమైన సిద్ధాంతాన్ని పాటించేవాడు. అతనికి ఏ విషయంలోనూ సందేహం లేదు. ద్వంద్వరహితుడై తిరుగుతూ ఉంటాడు. అతడు ఋషులలో ఆద్వితీయుడని నరులలో కామరహితుడని చెప్తారు. శాశ్వతమై, మిక్కిలి దుర్లభమైన, సనాతన సుఖాన్ని ప్రజలకు తన ఉపదేశాల ద్వారా కలిగించాలని కోరుకొంటూ ఉంటాడు. సాంఖ్య విద్వాంసులు అతనిని సాక్షాత్తు ప్రజాపతి, మహర్షి అయిన కపిలుని స్వరూపంగా చెప్తారు. అతనిని చూస్తే సాంఖ్యశాస్త్ర ప్రవర్తకుడయిన కపిల భగవానుడే స్వయంగా పంచశిఖుని రూపంలో వచ్చి, లోకులకు ఆశ్చర్యం కలిగిస్తున్నట్లు అనిపిస్తుంది. అతనిని ఆసురి యొక్క ప్రథమ శిష్యుడని, చిరంజీవి అని చెప్పుకొంటారు. అతడు వేయి సంవత్సరాలు పంచస్రోతస్సు స్థానంలో (పంచేంద్రియాలతో కూడిన మనసు) యజ్ఞం చేశాడు. అనగా మానస యజ్ఞాన్ని అనుష్ఠించాడు.

ఒకసారి ఆసురిముని తన ఆశ్రమంలో కూర్చుని ఉండగా కపిలమతానుయాయులైన మునుల మహాసముదాయం అక్కడికి వచ్చింది. ప్రతి మనిషిలోపల ఉండే అవ్యక్తమైన పరమార్థ తత్త్వవిషయం గురించి ఏదైనా చెప్పమని వారు ఆ మునిని బలవంత పెట్టారు. వారిలో పంచశిఖుడు కూడా ఉన్నాడు. అతడు పంచ స్రోతస్సులు (ఇంద్రియాలు) కల మనస్సు యొక్క వ్యాపారంలో (ఊహాపోహాలు) కుశలుడు. పంచరాత్రా గమ విశేషాలు తెలిసినవాడు. పంచకోశాలను, తత్సంబంధమైన అయిదురకాల ఉపాసనలు తెలిసినవాడు. శమ, దమ, ఉపరతి, తితిక్ష, సమాధానాలు అనే ఐదుగుణాలతో కూడిన వాడు. ఆ పంచకోశాలకంటె భిన్నంగా ఉండి వాటికి శిఖాస్థానీయమైన బ్రహ్మ పంచశిఖగా చెప్పబడుతోంది. దాని గురించి తెలిసినవాడు కాబట్టి ఋషిని కూడా "పంచశిఖుడు" అని భావించారు. ఆసురి తపస్సుచేత దివ్యదృష్టి పొంది, జ్ఞానయజ్ఞం ద్వారా సిద్ధిని పొంది, క్షేత్రక్షేత్రజ్ఞ భేదాన్ని స్పష్టంగా తెలుసుకొన్నాడు. ఏకాక్షరమూ, అవ్యయమూ అయిన బ్రహ్మము నానా రూపాలుగా కనపడుతోం దని, దానిని గురించిన జ్ఞానాన్ని ఆసురి ఆ మునిమండలిలో ప్రతిపాదించాడు. అతని శిష్యుడే పంచశిఖుడు. మానవ స్త్రీ పాలు త్రాగి పెరిగాడు. కపిల అనే పేరుగల ఒక బ్రాహ్మణ కుటుంబిని ఉండేది. ఆమెకు పుత్రుడుగా అయి, అతడు

ఆమె స్తన్యాన్ని త్రాగాడు. అందువల్ల 'కాపిలేయుడు' అయ్యాడు. అతనికి నైష్ఠికబుద్ధి (బ్రహ్మ నిష్ఠ) అలవడింది. కాపిలేయుని ఈ జన్మ వృత్తాంతం, అతని యొక్క ఈ కాపిలేయత్వం, సర్వజ్ఞత, ఈ పరమోత్తమ వృత్తాంతం, నాకు భగవానుడు చెప్పాడు. జనకుడు ఆచార్యు లందరిపట్ల సమానభావం కలవాడని తెలిసికొని ధర్మజ్ఞుడు, ఉత్తమజ్ఞాని అయిన పంచశిఖుడు అతని దగ్గరకు వెళ్లి యుక్తియుక్తాలయిన మాటల ద్వారా వందమంది ఆచార్యులను మోహపెట్టాడు. అప్పుడు జనక మహారాజు కపిలానందను డైన పంచశిఖుని జ్ఞానాన్ని చూసి, అతనిపట్ల బాగా అనురక్తు డయ్యాడు. వందమంది ఆచార్యులను వదిలి అతనివెనుక వెళ్లాడు. మునిశ్రేష్ఠుడైన పంచశిఖుడు ధర్మానుసారంగా తనకు ప్రణమిల్లిన, పరమయోగ్యుడైన ఆ జనక మహారాజుకు సాంఖ్య శాస్త్రంలో చెప్పబడిన పరమమైన మోక్షాన్ని గూర్చి ఉపదేశించాడు.

అతడు జాతినిర్వేదాన్ని* 1. చెప్పి, కర్మ నిర్వేదాన్ని 2. ఉపదేశించాడు. కర్మనిర్వేదాన్ని చెప్పాక సర్వ నిర్వేదాన్ని 3. గురించి చెప్పాడు. అతడు చెప్పాడు. దేనికోసం ధర్మాచరణం చేయబడుతుందో, కర్మలకు ఫలోదయం ఏదో, ఆ ఇహలోక పరలోక భోగాలన్నీ నశించి పోయేవే. వాటిపై ఆశపడడం మంచిదికాదు. అది మోహరూప మైనది, చంచలమూ, అస్థిరమూ అయినది. కొంతమంది నాస్తికులు ఇలా అంటూ ఉంటారు. దేహరూపమైన ఆత్మ నశించిపోవడం ప్రత్యక్షంగా చూస్తున్నాం. లోకమంతా దీనికి సాక్ష్యమే. అయినా ఎవరయినా శాస్త్ర ప్రమాణాన్ని చాటుపెట్టుకొని దేహంకంటె భిన్న మయిన ఆత్మ ఉనికిని ప్రతిపాదిస్తే అది పరాస్తమవుతుంది. ఎందుకంటే అది లోకానుభవానికి విరుద్ధం. ఆత్మకు స్వరూపమైన శరీరం లేకపోవడమే దానికి మృత్యువు. ఈ దృష్టితో దుఃఖం, వృద్ధాప్యం, నానారోగాలు - ఇవన్నీ ఆత్మకు మృత్యువులే, (ఎందుకంటే వీనివల్ల శరీరాంశలు నశిస్తాయి). అయినా ఆత్మను శరీరం కంటె భిన్నంగా భావించేవారి భావన మిక్కిలి అసంగతం. లోకంలో సంభవం కానట్టి ఇటువంటి వస్తువు యొక్క అస్తిత్వాన్ని అంగీకరించినట్లయితే అంటే శాస్త్రం మీద ఆధారపడి శరీరంకంటె భిన్నంగా ఏదో అజరమైన, అమరమైన ఆత్మ ఉందని, స్వర్గాది లోకాలలో దివ్య సుఖాలు అనుభవిస్తుందని అంగీకరిస్తే వందిమాగధులు

---

* *1. జాతి నిర్వేదం - జనన సమయంలో గర్భవాసాది కారణంగా కలిగే బాధను, గురించి ఆలోచనచేసి, శరీరం పట్ల వైరాగ్యం పొందడం.*

2. కర్మ నిర్వేదం - నానా యోనులలో పుట్టడం, నరక యాతనలు పొందడం వీటిని గురించి ఆలోచించి పాపమయమైన కామ్యకర్మల నుండి విరమించడం.

3. సర్వ నిర్వేదము - ఈ జగత్తులోని అతి చిన్న వస్తువు మొదలుకొని బ్రహ్మలోకం వరకు ఉండే భోగాలన్నీ క్షణభంగురాలని, దుఃఖరూపాలని ఆలోచించి అన్నిటినుండి విరక్తుడవడం.(నీల)

రాజును అజరుడని, అమరుడని కీర్తించడం కూడా సమంజసమే అని అంగీకరించాలి. (వంది జనులు ఆశీర్వదిస్తూ మాటవరసకు అమరు డని అజరు డని అంటారు. అలాగే ఈ శాస్త్ర వాక్యం కూడా ఔపచారికమే. రోగం లేని శరీరాన్నే అజర మని, అమర మని, ఇక్కడి ప్రత్యక్ష సుఖభోగాలనే స్వర్గీయసుఖాలని అంటున్నారు.) ఆత్మ ఉందా లేదా అనే సంశయం కలిగినపుడు, అనుమాన ప్రమాణంతో దాని అస్తిత్వాన్ని సాధించాలనుకొన్నప్పుడు, దానికోసం ఏ దోషమూ లేని ఒక జ్ఞాపక హేతువు లభించనప్పుడు, ఇక ఏ అనుమానాన్ని ఆశ్రయించి లోక వ్యవహారం నిశ్చయించగలం ? అనుమానం, ఆగమం – ఈ రెండు ప్రమాణాలకూ మూలం ప్రత్యక్ష ప్రమాణమే. ఆగమం కాని, అనుమానం కాని ప్రత్యక్షానుభవానికి విరుద్ధ మయితే అది ఏదీ కానేరదు. దాని ప్రామాణికత స్వీకరింపబడజాలదు. ఎక్కడయినా కూడా ఈశ్వరుడు, అదృష్టం, లేదా నిత్యమైన ఆత్మ – వీటిని సిద్ధింపచేయడంకోసం అనుమాన ప్రమాణం చేపడితే, అక్కడ సాధ్య సాధనాలకోసం చేయబడిన భావన కూడా వ్యర్థమే. కాబట్టి నాస్తికుల మతంలో జీవాత్మకు శరీరంకంటె భిన్నమైన ఎలాంటి ఉనికీ లేదు. ఇది నిశ్చితమైన విషయం.

మట్టి విత్తనంలో ఆకులు, పువ్వులు, పళ్లు, వేళ్లు, బెరడు మొదలైనవి మరుగునపడి ఉన్నట్లు, ఆవు తిన్న గడ్డినుండే నెయ్యి, పాలు వచ్చినట్లు, అనేక ఔషధద్రవ్యాలు వండడం వలన, నీటిలో నాన వేయడం వలన వానిలో మత్తు కలిగించే శక్తి ఉత్పన్నమైనట్లు వీర్యం నుండే శరీరం మొదలైన వానితోపాటు చేతనత్వం కూడా వస్తుంది. అంతేకాక జాతి, స్మృతి, అయస్కాంతమణి, సూర్యకాంతమణి, బడబానలం సముద్రపు నీరు త్రాగడం వంటి దృష్టాంతాలతో కూడా దేహాతిరిక్తమైన చైతన్యం ఉందని సిద్ధించదు. (నాస్తికమతాన్ని ఖండిస్తున్నాడు). చనిపోయిన శరీరంలో చైతన్యం లేకపోవడమే దేహం కంటె వేరుగా ఆత్మ ఉందనడానికి ప్రమాణం. (చైతన్యం దేహధర్మమే అయితే మృతశరీరంలో కూడా అది ఉండాలి. కాని మరణించాక కొంత సమయం వరకు శరీరం అయితే ఉంటోంది. కాని దానిలో చైతన్యం ఉండదు. కాబట్టి చేతనాత్మ శరీరం కంటె భిన్నమని సిద్ధిస్తోంది.) నాస్తికులు కూడా రోగాదులు పోవడానికి మంత్ర జపాలతో, తాంత్రిక పద్ధతులతో దేవతాదులను ఆరాధిస్తారు. నాస్తికుల దృష్టితో ఇవ్వబడిన హేతుభూత దృష్టాంతాలన్నీ మూర్త పదార్థాలు. మూర్తజడ పదార్థం నుండి మూర్త జడపదార్థమే పుడుతుంది. ఇదే ఆ దృష్టాంతాల ద్వారా సిద్ధిస్తుంది. కాష్ఠం నుండి అగ్ని పుట్టినట్లు.

కొంతమంది అవిద్య, కర్మ, తృష్ణ, లోభం, మోహం, దోషాలను అనుభవించడం పునర్జన్మకు కారణ మని చెప్తారు. అవిద్యను వారు క్షేత్రమని చెపుతారు. పూర్వ

జన్మలలో చేయబడిన కర్మ బీజం. తృష్ణ మొలకెత్తించే స్నేహం లేదా జలం. ఇదే వారి మతంలో పునర్జన్మ విధానం. ఈ అవిద్యాదు లయిన కారణసమూహం సుషుప్తి లేదా ప్రళయంలో కూడా సంస్కార రూపంలో గూఢమై ఉంటుంది. అవి ఉండగా, మరణధర్మం కలిగిన ఒక శరీరం నశించిపోయినప్పుడు, దానినుండి పూర్వోక్తమైన అవిద్యాదుల కారణమైన వేరొక శరీరం పుడుతుంది. జ్ఞానం ద్వారా అవిద్యాది నిమిత్తాలు దగ్ధమైనపుడు, శరీరం నశించిన తరువాత సత్త్వం (బుద్ధి) యొక్క క్షయరూప మైన మోక్షం కలుగుతుంది. ఇది వారు చెప్పేది. (పైన చెప్పిన నాస్తికమతంలో ఆస్తికులు ఈ రీతిగా దోషం ఆపాదిస్తారు). క్షణిక విజ్ఞాన వాదులు అంగీకరించిన ప్రకారం శరీరం, జీవుడు క్షణికము లయినపుడు పూర్వక్షణం ఉన్నశరీరం కంటె పరక్షణం ఉన్న శరీరం రూపం, జాతి, ధర్మం, ప్రయోజనం. అన్ని రకాల దృష్టితోను భిన్నమే. ఇలాంటి దశలో 'ఇది అదే'. అనే ఈ రకమైన ప్రత్యభిజ్ఞ (స్మృతి) కలగజాలదు. లేదా భోగం, మోక్షం మొదలైనవన్నీ కోరకుండానే అకస్మాత్తుగా ప్రాప్తిస్తాయి అని అంగీకరించాలి (ఈ దశలో - మోక్షం కోరేవాడు వేరేవాడు. సాధన చేసేవాడు వేరేవాడు దాని నుండి ముక్తిపొందేవాడు వేరేవాడు. అని కూడా చెప్పడానికి వీలుపడుతుంది). విషయం ఇదే అయినపుడు దానం, విద్య, తపస్సు, బలం వీటితో ఎవరికయినా ఏమి ఆనందం ఉంటుంది ? ఎందుకంటే వాడు చేసిన సమస్త కార్యాలు వేరేవాడికి తమ ఫలాలను ఇవ్వవలసివస్తుంది. (అంటే దానం చేసేటపుడు ఉన్నవాడు క్షణిక విజ్ఞానవాదాన్ని అనుసరించి ఫలాన్ని అనుభవించేటపుడు ఉండడు. కాబట్టి పుణ్యం గాని పాపం గాని ఒకడు చేస్తే, దాని ఫలితాన్ని వేరొకడు అనుభవిస్తాడు). (పైన చెప్పిన ఆపత్తి అభీష్టమే అయితే కర్మ చేసే కర్త ఫలభోగసమయంలో ఉండడు. ఒక విజ్ఞానం పుడుతుంది వేరే విజ్ఞానం ఫలం అనుభవిస్తుంది). అప్పుడు ఈ లోకంలో దేవదత్తుడనే వాడు యజ్ఞదత్తుడు మొదలైన ఇతరులు చేసిన అశుభకర్మలతో దుఃఖితుడు, అలాగే శుభకర్మలతో సుఖి కాగలుగుతాడు. (ఎందుకంటే కర్త వేరు భోక్త వేరు అయినపుడు ఎవరి కర్మ అయినా ఎవరి కయినా సుఖదుఃఖాలను ఈయగలుగుతుంది). ఈ దశలో దృశ్యాదృశ్యాల నిర్ణయం కూడా ఇలాగే ఉంటుంది. పూర్వక్షణంలోని దృశ్యం వర్తమాన క్షణంలో అదృశ్యం అవుతుంది. అలాగే ముందు అదృశ్యం అయినదే ఈ సమయంలో దృశ్యం అవుతూ ఉంటుంది. దేవదత్తుని జ్ఞానం కంటె యజ్ఞదత్తుని జ్ఞానం వేరు, విజాతీయం; సజాతీయ విజ్ఞానధారలోనే కర్మ, దాని ఫలభోగం ప్రాప్తిస్తుంది. కాబట్టి దేవదత్తుడు చేసిన కర్మ యొక్క భోగం యజ్ఞదత్తునికి లభించదు. ఆ కారణంగా పూర్వోక్తదోషం యొక్క ఆపత్తి సంభవించదు అని చెప్పినప్పుడు మీ మతంలో ఈ సాదృశ్య, సజాతీయ

విజ్ఞానం ఉత్పన్నమవుతోంది కదా! దానికి ఉపాదానం ఏమిటి ? అని మేము అడుగుతాం. పూర్వక్షణవర్తి అయిన విజ్ఞానాన్నే ఉపాదానంగా చెప్పితే, అది సరికాదు. ఎందుకంటే ఆ విజ్ఞానం నశించిపోయింది. ఒక వేళ పూర్వక్షణ వర్తి అయిన విజ్ఞాన నాశనమే ఉత్తరక్షణ వర్తి అయిన సజాతీయవిజ్ఞానం యొక్క ఉత్పత్తికి కారణ మయినపుడు కొంతమంది ఎవరి శరీరా న్నయినా ముసలాలతో కొట్టినట్లయితే, ఆ చనిపోయిన శరీరం నుండి ఇంకొక శరీరం తిరిగి పుట్టగలుగుతుంది. (కాబట్టి ఈ మతం సరికాదు).

ఋతువులు, సంవత్సరాలు, యుగాలు, శీతోష్ణాలు, ప్రియా ప్రియాలు– ఇవన్నీ వచ్చిపోతూ ఉంటాయి. పోయి వస్తూ ఉంటాయి. దీనిని అందరూ ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నారు. అదే విధంగా సత్త్వ సంక్షయ రూపమైన మోక్షం కూడా మరలవచ్చి, నివృత్తం కాగలదు. (ఎందుకంటే విజ్ఞానధారకు ఎక్కడా అంతం లేదు). ఇల్లు బలహీనపడినచోట్ల ముందుగా శిధిలం అవుతుంది. ఆపై క్రమంగా మొత్తం ఇల్లంతా కూలిపోతుంది. అదే రీతిగా వృద్ధావస్థతో, నశింపచేసే మృత్యువుతో ఆక్రాంతమై ఉన్న శరీరంలోని అతిదుర్బలమైన అంగాలు క్షీణిస్తూ ఒక రోజున శరీరం మొత్తం నశించిపోతుంది. ఇంద్రియాలు, మనస్సు, ప్రాణం, రక్తం, మాంసం, ఎముకలు – ఇవన్నీ క్రమంగా నశించి, తమ కారణాలలో కలిసిపోతాయి. ఆత్మయొక్క ఉనికిని అంగీకరించకపోతే లోకయాత్రా నిర్వహణం జరుగదు. దానాలు ఇతర ధర్మాల యొక్క ఫలప్రాప్తికి ఎలాంటి ఆశా ఉండదు. ఎందుకంటే వైదిక శబ్దమూ, లౌకిక వ్యవహారమూ అన్నీ ఆత్మకు సుఖాన్ని ఇవ్వడం కోసమే. ఈ రీతిగా మనసులో అనేకరకాల తర్కాలు బయలు దేరుతాయి. పైగా ఈ తర్కంతోను, యుక్తులతోను ఆత్మయొక్క సత్త, అసత్త నిర్ధారణ ఏమాత్రం జరుగుతున్నట్లు కనబడదు. ఈ రీతిగా ఆలోచిస్తూ భిన్న భిన్న మతాలవైపు పరుగులు తీసే లోకుల బుద్ధి ఏదో ఒక చోట ప్రవేశిస్తుంది. ఇక అక్కడే వృక్షంలాగ పాతుకుపోయి శిథిల మయిపోతుంది. ఈ రీతిగా అర్థానర్థాల చేత ప్రాణులన్నీ దుఃఖిస్తున్నాయి. కేవలం శాస్త్రవచనాలే వారిని లాగి దారిలోకి తేగలవు. సరిగ్గా మావటివాడు ఏనుగుపై అంకుశాన్ని ఉంచి, దానిని వశపరచుకొన్నట్లే. చాలామంది శుష్కహృదయులు అత్యంత సుఖదాయక మైనటువంటి విషయాలపట్లనే లాలస వహిస్తారు. కాని ఈ లాలసలో వారికి అత్యంత భారమైన దుఃఖాన్ని ఎదుర్కొన వలసివస్తుంది. చివరికి వారు భోగాలను విడిచి, మృత్యువుకు ఆహారం అవుతారు. ఏదో ఒక రోజున నశించిపోయే, ప్రాణాలకు ఏమాత్రం నమ్మకం లేని ఇటువంటి అనిత్య శరీరాన్ని పొంది ఈ బంధువర్గం, భార్యాపుత్రులు మొదలైన వాటితో ఏమి లాభం? ఇది ఆలోచించి, వీరందరినీ క్షణకాలంలో వైరాగ్య పూర్వకంగా వదలి పెట్టినవాడు మరణించిన

తరువాత తిరిగి ఈ లోకంలో జన్మించ నక్కరలేదు. పృథ్వి, ఆకాశం, జలం, అగ్ని, వాయువు - ఇవి సదా శరీరాన్ని రక్షిస్తూ ఉంటాయి. ఈ విషయాన్ని గూర్చి చక్కగా ఆలోచించిన మీదట, దీనిపట్ల ఆసక్తి ఎలా కలుగగలదు ? ఒక రోజున మృత్యుముఖంలో పడవలసిన ఇటువంటి శరీరంతో సుఖం ఎక్కడిది ? భ్రమ గాని, వంచన గాని లేకుండా, సర్వథా నిర్దుష్టమై, ఆత్మసాక్షాత్కారం కలిగించే పంచశిఖుని యొక్క ఈ ఉపదేశాన్ని విని, జనకమహారాజుకు చాలా ఆశ్చర్యం కలిగింది. కాబట్టి అతడు మరల ప్రశ్నించాలని అనుకొన్నాడు.

219. పంచశిఖవాక్యము.

భీష్ముడు చెపుతున్నాడు. 'మహర్షి పంచశిఖుడు ఈ రీతిగా ఉపదేశించిన తరువాత జనకుడైన జనదేవుడు తిరిగి అతనిని మృత్యువు తరువాత ఆత్మ యొక్క ఉనికి, వినాశం విషయమై ప్రశ్నించాడు.' జనకుడు అడిగాడు. 'దేవా ! మరణించిన తరువాత ఎవరికైనా ఏ విశేష సంజ్ఞ లేకపోతే ఆ స్థితిలో అజ్ఞానం గాని, జ్ఞానం గాని ఏం చేస్తుంది ? ద్విజోత్తమా ! చూడండి. మనిషికి మరణంతోపాటు అతని సమస్త సాధనాలు నశిస్తాయి. అయినప్పుడు మొదటనే అతడు సావధానుడైనా, అసావధానుడైనా విశేషలాభం ఏం పొందగలడు ? మరణించాక జీవాత్మకు వినాశశీలమైన పంచమహా భూతాలతో ఏమైనా సంసర్గం ఉంటుందా ? ఉండదా ? ఉన్నట్లయితే ఎవరికోసం ఉంటుంది ? ఈ విషయంలో యధార్థానికి ఏమి నిశ్చయింపబడింది ?' భీష్ముడు చెపుతున్నాడు. 'జనకరాజు యొక్క బుద్ధి అజ్ఞానాంధకారంతో ఆచ్ఛాదితమై, ఆత్మ నశించిపోతుందనే ఊహతో భ్రాంతమూ, వ్యాకులమూ అయి ఉందని తెలిసికొని జ్ఞాని, మహాత్ముడు అయిన పంచశిఖుడు మధురవాక్కులతో అతనిని శాంతింప చేస్తున్నట్లుగా ఇలా అన్నాడు. మరణించాక ఆత్మ నశించదు. ఏ విశేషాకారంగా మారదు. ప్రత్యక్షంగా కనిపించే ఈ సంఘాతమంతా శరీరమూ, ఇంద్రియాలు, మనస్సు యొక్క సమూహంమాత్రమే. ఇవన్నీ వేర్వేరు అయినప్పటికీ పరస్పరాశ్రితాలై కర్మలయందు ప్రవర్తిస్తాయి. ప్రాణుల శరీరాలలో ఉపాదానరూపంలో ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వి- ఈ పంచధాతువులు ఉన్నాయి. ఇవి స్వభావసిద్ధంగానే కలుస్తూ ఉంటాయి, విడిపోతూ ఉంటాయి. ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి - ఈ పంచతత్వాల సమాహారంతోనే అనేక విధాల శరీరాల నిర్మాణం జరిగింది.

శరీరంలో జ్ఞానం (బుద్ధి), ఊష్మ, (జఠరానలం), వాయువు ((ప్రాణం) - వీటి సముదాయం సమస్త కర్మలను సంగ్రహించే గణం. ఎందుకంటే వీటి నుండే ఇంద్రియాలు,

ఇంద్రియ విషయాలు, స్వభావం, చేతన, మనస్సు, ప్రాణం, అపానం, వికారాలు, ధాతువులు ప్రకట మయ్యాయి. చెవి, చర్మం, నాలుక, కన్ను, ముక్కు – ఈ ఐదు జ్ఞానేంద్రియాలు. శబ్దాది గుణాలు చిత్తంతో కలిసి ఈ ఇంద్రియాలకు విషయాలు అవుతాయి. విజ్ఞానయుక్తమైన చైతన్యం (విషయాల యొక్క ఉపాదేయత, హేయత, ఉపేక్షణీయతల కారణం) నిశ్చయంగా మూడు రకాలు. అవి అదుఃఖం, అసుఖం, సుఖ దుఃఖం అని అంటారు. శబ్ద స్పర్శ రూప రస గంధాలు మూర్త ద్రవ్యాలు – ఈ ఆరుగుణాలు జీవుడు మరణించే ముందు వరకు ఇంద్రియజన్య జ్ఞానానికి సాధకాలు అవుతాయి. (వీటితో ఇంద్రియాలు సంయోగించాకనే భిన్న భిన్న విషయాల యొక్క జ్ఞానం కలుగుతుంది). శ్రోత్రాది ఇంద్రియాలలో వాటి విషయాలను విసర్జించడం (త్యాగం) వలన సంపూర్ణ తత్వాల యొక్క యథార్థ నిశ్చయరూపమైన మోక్షం ప్రాప్తిస్తుంది. ఆ తత్వనిశ్చయాన్నే మిక్కిలి నిర్మలమైన ఉత్తమ జ్ఞానమని, అవ్యయ మైన మహాబ్రహ్మ పద మని చెపుతారు. గుణాల సంఘాతరూపమైన ఈ శరీరాన్నే ఆత్మ అని భావించేవారికి మిథ్యాజ్ఞానం కారణంగా అనంతదుఃఖం ప్రాప్తిస్తుంది. దాని పరంపర ఎన్నటికీ శాంతించదు. పైన చెప్పిన దానికి వ్యతిరేకంగా ఈ దృశ్య ప్రపంచం అనాత్మ అని రూఢి అయిపోయిన వాని దృష్టిలో దీనిపట్ల అతనికి మమకారం ఉండదు. అహంకారం ఉండదు. ఇక అతనికి దుఃఖపరంపర ఎలా కలుగుతుంది ? ఆ దుఃఖాలకు ఆధారం మాత్రం ఏముంటుంది ?

ఇక నేను ఆ పరమోత్తమమైన సాంఖ్యశాస్త్రాన్ని వర్ణిస్తాను. సమ్యగ్వధ అని దానికి పేరు. (సమ్యగ్రూపంతో దుఃఖాలను నాశనం చేసేది) అందులో త్యాగానికి ప్రాధాన్యం ఉంది. నీవు శ్రద్ధగా విను. ఈ ఉపదేశం నీకు మోక్షదాయకం అవుతుంది. **ముక్తికోసం ప్రయత్నించే వారందరూ సమస్త కర్మలయందు అహంకారం, మమకారం, ఆసక్తి, కామనలను త్యజించాలి. వీటిని త్యజించకుండానే వినీతుడిని (శమదమాది సాధనాలలో తత్పరుడు) అనే మిథ్యావాదం చేసేవానికి అవిద్యాది దుఃఖదాయకమైన క్లేశాలు కలుగుతాయి.** శాస్త్రాలలో ద్రవ్యత్యాగానికి యజ్ఞాది కర్మలు, భోగత్యాగానికి వ్రతాలు, శారీరక సుఖ త్యాగానికి తపస్సు, సమస్తమూ (అహంకార మమకారాలు, ఆసక్తి, కామనలు మొదలైనవి). త్యాగం చేయడానికి యోగానుష్ఠానమూ ఆదేశించబడినాయి. ఇదే త్యాగానికి చివరిమెట్టు. **సర్వ త్యాగానికి ఈ ఏకైక మార్గమే దుఃఖాల నుండి విముక్తి పొందడానికి ఉత్తమ మని చెప్పబడింది. దీనికి విరుద్ధంగా ఆచరించేవారు దుర్గతిని అనుభవించక తప్పదు.** బుద్ధిలో ఉన్న మనస్సహితమైన పంచజ్ఞానేంద్రియాలను వర్ణించి, ఇక పంచకర్మేంద్రియాలను వర్ణిస్తాను. వీటికి ప్రాణశక్తి ఆరవదిగా చెప్పబడింది. రెండు చేతులను

పనిచేసే ఇంద్రియంగా తెలుసుకోవాలి. కాళ్లు రెండు గమనేంద్రియం. లింగం సంతానోత్పాదనకు, మైథున జనితమైన ఆనందప్రాప్తికి; గుదం అనే ఇంద్రియం మలత్యాగం కోసం పని చేస్తాయి. వాగింద్రియం శబ్దవిశేషాన్ని ఉచ్చరించడానికి. ఈ రీతిగా పంచకర్మేంద్రియాలు పంచ విషయాలతో కూడి ఉంటాయి అని భావింపబడింది. మనస్సహితంగా పదకొండు ఇంద్రియాల యొక్క విషయాలను బుద్ధిద్వారా శీఘ్రంగా త్యజించివేయాలి. శ్రవణ సమయంలో శ్రోత్రరూపమైన ఇంద్రియం, శబ్ద రూపమైన విషయం, చిత్తరూపమైన కర్త ఈ మూడు సంయోగం చెందుతాయి. ఈ రీతిగానే స్పర్శ రూపరసగంధాల యొక్క అనుభవ కాలంలో కూడా ఇంద్రియ, విషయ, మనస్సుల యొక్క సంయోగం అపేక్షితమే. ఈ రీతిగా ఈ మూడు మూడింటి యొక్క ఐదింటి సముదాయం. ఇవన్నీ గుణాలని చెప్పబడుతాయి. కర్త, కర్మ, కరణ రూపమైన మూడు భావాలు వంతులవారీగా ఉంటాయి. వీటితో శబ్దాదివిషయాలు గ్రహింపబడతాయి.

వీటిలో ఒక్కొక్కటి సాత్త్విక, రాజస, తామసాలని మూడు మూడు భేదాలుగా ఉంటాయి. వీటితో లభించే అనుభవాలు కూడా మూడు రకాలుగానే ఉంటాయి. అవి హర్షం, ప్రీతి మొదలైన భావాలకు సాధకాలు. **హర్షం, ప్రీతి, ఆనందం, సుఖం, చిత్తశాంతి - ఈ భావాలన్నీ కారణమేమీ లేకుండా స్వతహాగానో, లేక కారణ వశం (భక్తి, జ్ఞానం, వైరాగ్యం, సత్సంగం మొదలైన కారణాలు) గానో సాత్త్విక గుణాలుగా భావింపబడుతాయి. అసంతోషం, సంతాపం, శోకం, లోభం, అసహనశీలత - ఇవి సకారణంగానో లేదా అకారణంగానో - రజోగుణ చిహ్నాలు. అవివేకం, మోహం, ప్రమాదం, స్వప్నం, అలసభావం - ఇవి ఏ రకానికి చెందినవైనా తమోగుణానికి వివిధ రూపాలు.** వీటిలో శరీరంలో గాని, మనసులో గాని ప్రీతి సంయోగం చేత పుట్టినది సాత్త్విక భావం. దానిని సత్త్వగుణ వృద్ధిగా తెలుసుకోవాలి. తనకు అసంతోషజనకం, అప్రీతికరం అయినదానిని రజో గుణ ప్రవృత్తిగా, అభివృద్ధిగా భావించాలి. శరీరంలోగాని, మనసులోగాని పుట్టిన అతర్క్యం, అజ్ఞేయం, మోహసంయుక్తం అయిన భావాలను తమోగుణ జనితాలుగా తెలుసుకోవాలి. శబ్దానికి ఆధారం శ్రోత్రేంద్రియం. శ్రోత్రేంద్రియానికి ఆధారం ఆకాశం. కాబట్టి అది ఆకాశ రూపమే. ఈ స్థితిలో శబ్దాన్ని అనుభవించే సమయంలో ఆకాశం, శ్రోత్రం - ఈ రెండే జ్ఞానానికి గాని, అజ్ఞానానికి గాని విషయాలు కాలేవు. ఈ రకంగానే త్వక్కు, నేత్రం, జిహ్వ, నాసిక కూడా క్రమంగా స్పర్శ రూప రస గంధాలకు ఆశ్రయం, తనకు ఆధారభూతమైన మహాభూతాలకు స్వరూపం అవుతాయి. వీని అన్నింటికీ కారణం మనస్సు. కాబట్టి ఇవన్నీ మనస్స్వరూపమే.

ఈ దశేంద్రియాలలోను తమ తమ విషయాలను ఒకే సారిగా కూడా గ్రహించేశక్తి ఉంది. పదకొండవది అయిన మనస్సు, పన్నెండవది అయిన బుద్ధి - ఇవి ఇంద్రియాలకు సహాయకాలని తెలుసుకోవాలి. తమోగుణ జనితమైన సుషుప్తి కాలంలో తన కారణంలో విలీనం అవడం వలన ఇంద్రియాలు విషయాలను గ్రహించజాలవు. కాని వాని యొక్క నాశనం జరుగదు. వాటిలో ఉండే తమ విషయాలను ఒక్క సారిగా గ్రహించే శక్తి లౌకికవ్యవహారంలోనే కనపడుతుంది. (సుషుప్తి కాలంలో కాదు). ముందు జాగ్రదవస్థలోని చూడడం, వినడం మొదలైన వాని ద్వారా పూర్వవాసనా వశమైన శబ్దాది విషయాలు ప్రాప్తించడంతో స్వప్నాన్ని దర్శించే వాడు సూక్ష్మమైన పదకొండు ఇంద్రియాలను చూసి, విషయ సాంగత్యాన్ని భావిస్తూ, సత్త్వాది గుణాలతో కూడి, శరీరంలోపలే ఇచ్ఛానుసారంగా తిరుగుతూ ఉంటాడు. సుషుప్తికాలంలో చిత్తం తమోగుణంతో అభిభూతమై తన ప్రవృత్తిని, ప్రకాశ స్వభావాన్ని శీఘ్రంగానే సంహరించి, కొద్దిసేపు ఇంద్రియాల వ్యాపారాన్ని ఆపివేస్తుంది. ఆ సమయంలో శరీరంలో జరిగే సుఖ ప్రతీతిని విద్వాంసులు తామస సుఖమని చెప్తారు. సుషుప్తి కాలంలో స్వప్నం దర్శించినవాడు తనకు కలిగిన దుఃఖాన్ని ప్రత్యక్షంలోవలె అనుభవించడు. కాబట్టి అతడు సుషుప్తి కాలంలో కూడా తమోగుణయుక్తమైన మిథ్యా సుఖాన్ని అనుభవిస్తాడు.

ఈ రీతిగా తన కర్మానుసారం గుణప్రాప్తి విషయంలో చెప్పబడుతుంది. అజ్ఞానులకు ఈ గుణాలు సమ్యగ్రూపంతో ప్రవృత్త మవుతాయి. జ్ఞానులకు నివృత్త మవుతాయి. అధ్యాత్మతత్త్వచింతన చేసే విద్వాంసులు ఈ శరీరాన్ని, ఇంద్రియసంఘాతాన్ని క్షేత్రం అని అంటారు. మనసులో ఉండే చేతనసత్తయే క్షేత్రజ్ఞుడు (జీవాత్మ) అని చెప్తారు. ఈ దశలో ఆత్మ ఎలా నశించ గలుగుతుంది ? హేతుపూర్వకమైన ప్రకృతిని అనుసరించి ప్రవర్తిల్లే పంచభూతాలతో దానికి శాశ్వతమైన సంసర్గం కూడా ఎలా ఉండగలుగుతుంది ? నదీనదాలు సముద్రంలో కలిసి తమ పేర్లను, వ్యక్తిత్వాన్ని త్యజించినట్లు, పెద్ద పెద్ద నదాలు చిన్నచిన్న నదులను తమలో విలీనం చేసుకొన్నట్లు జీవాత్మ పరమాత్మలో విలీనం అవుతుంది. ఇదే మోక్షం. జీవుడు బ్రహ్మలో విలీనమయ్యాక అతని నామ రూపాలు ఏరకంగానూ గ్రహించబడవు. ఈ స్థితిలో మరణించాక జీవుని పేరు ఎలా ఉంటుంది ? ఈ మోక్ష విద్య తెలిసినవాడు, జాగరూకతతో ఆత్మ తత్త్వాన్ని అనుసంధానం చేసినవాడు, నీటిలో తామరాకులా కర్మ యొక్క అనిష్టఫలాలతో ఎప్పుడూ అంటుకోడు.

సంతానం మీది ఆసక్తి కారణంగా రకరకాల దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి అజ్ఞానులు చేసే సకామ కర్మలు అన్నీ మనుష్యులకు అనేక

విధాల సుదృఢమైన బంధాలు. ఈ బంధాల నుండి తప్పించుకొని, సుఖ దుఃఖాలను గూర్చి చింతించడం మానివేసినపుడు సూక్ష్మశరీరం మీది అభిమానాన్ని విడిచిపెట్టి, సర్వోత్తమమైన గతి పొందుతాడు. వేదాలు ప్రతిపాదించిన ప్రమాణాలను చింతన చేస్తూ, శాస్త్రాలలో చెప్పబడిన శుభకరమైన సాధనాలను అనుష్ఠిస్తూ ఉండడం వలన మనిషి జరామృత్యువుల భయం తొలగి సుఖంగా నిద్రిస్తాడు. పుణ్యపాపాలు క్షయించి, వాని వలన కలిగే సుఖ దుఃఖాది ఫలాలు నశించినపుడు, అన్నిటియందు అన్నివిధాల ఆసక్తి లేనివాడు ఆకాశంలాగ నిర్లేపుడు, నిర్గుణుడు అయిన పరమాత్మ యందు ఉంటూ, అతని సాక్షాత్కారాన్ని పొందుతాడు. సాలెపురుగు గూడు అల్లుకొని దానిలో తిరుగుతూ ఉంటుంది. ఆ గూడు నాశనమయితే ఒక చోట ఉండిపోతుంది. అలాగే అవిద్యకు వశీభూతుడై క్రిందికి దిగజారే జీవుడు కర్మజాలంలో చిక్కుకొని త్రిప్పట పొందుతూ ఉంటాడు. దానినుండి తప్పించుకొంటే దుఃఖరహితు డవుతాడు. పర్వతం మీదికి విసిరివేసిన మట్టిపెంకు పర్వతాన్ని ఢీకొని, నుగ్గునుగ్గు అయినట్లు వాని సమస్త దుఃఖాలు విధ్వంసం అయిపోతాయి. రురువు అనే మృగం తన పాతకొమ్మును, పాము తన కుబుసాన్ని వదిలివేసి, వాటివైపు చూడకుండానే వెళ్లిపోతాయి. అలాగే మమతాభిమానాలు లేనివాడు సంసార బంధాలనుండి ముక్తుడై, తన దుఃఖాల నన్నింటినీ దూరం చేసుకొంటాడు. చెట్టు నీటిలో పడిపోవడం చూసి, పక్షి దానిమీది ఆసక్తి విడిచి, చెట్టును విడిచిపెట్టి, ఎగిరిపోయినట్లు ముక్త పురుషుడు సుఖదుఃఖాలు రెండింటినీ విడిచిపెట్టి, సూక్ష్మశరీర రహితుడై ఉత్తమ గతిని పొందుతాడు.' భీష్ముడు చెపుతున్నాడు.

పంచశిఖాచార్యుడు చెప్పిన అమృతమయ మైన జ్ఞానోపదేశాన్ని విని, జనకరాజు ఒక నిశ్చిత సిద్ధాంతానికి వచ్చాడు. అన్ని మాటలను ఆలోచన చేసి, శోకరహితుడై గొప్ప సుఖంతో జీవించసాగాడు. ఆపై అతని స్థితి మారిపోయింది. ఒకసారి ఆ మిథిలానరేశుడు జనకుడు మిథిలానగరం అగ్నికి ఆహుతి కావడం చూసి "ఈ నగరం మండుతున్నా నాకు ఏమీ బాధగాలేదు" అని తానే తన భావాన్ని వెల్లడించాడు. రాజా ! ఇక్కడ చెప్పబడిన మోక్షతత్త్వాన్ని సదా అధ్యయనం, చింతన చేసినవాడు ఉపద్రవాలవలన కలిగే బాధలు అనుభవించనక్కరలేదు. దుఃఖం ఎప్పుడూ అతనివద్ద బ్రద్దలవదు. జనకరాజు కపిలమతావలంబి అయిన పంచశిఖుని యొక్క సమాగమంతో ఈ జ్ఞానాన్ని పొంది, ముక్తుడయినట్లు అతడు కూడా మోక్షాన్ని పొందుతాడు.

రాజోత్తమా ! మహామతీ ! పూర్వం మిథిలానగరం ఎందుకు అగ్నిదగ్ధ మయిందో

చెపుతాను విను. జనకవంశీయుడైన జనదేవుడు పరమాత్మయందు కర్మలను నిలిపి, సర్వాత్మతను పొంది, ఆదే భావంతో అంతటా తిరగసాగాడు. మహాప్రాజ్ఞుడైన జనకుడు అధ్యాత్మతత్వం తెలిసినవాడు అవడం వలన నిష్కామ భావంతో యజ్ఞదానహోమాలు, భూపరిపాలన చేస్తున్నా కూడా ఆ అధ్యాత్మజ్ఞానంలోనే తన్మయుడై ఉండేవాడు. ఒకసారి సమస్తలోకాలకు అధిపతి అయిన సాక్షాత్తు నారాయణ భగవానుడు జనకరాజయొక్క మనోభావాన్ని పరీక్షించా లనుకొన్నాడు. అందుకని అతడు బ్రాహ్మణ వేషంలో అక్కడికి వచ్చాడు. ఆ పరమబుద్ధిశాలి అయిన శ్రీహరి మిథిలానగరంలో కొంత ప్రతికూలం ఆచరించాడు. అప్పుడు అక్కడి ద్విజోత్తములు అతనిని పట్టుకొని రాజుగారికి అప్పగించారు. బ్రాహ్మణుని అపరాధాన్ని ఉద్దేశించి రాజు అతనితో ఇలా అన్నాడు. 'బ్రాహ్మణా ! నేను నిన్ను ఏవిధంగానూ దండించను. పాలిమేరల వరకు ఉన్న నా రాజ్యం నుండి నీవు వెళ్లిపో.' మిథిలానరేశుడు ఇలా అనగానే ఆ ద్విజోత్తముడు మంత్రులు చుట్టూ కూర్చుని ఉండగా ఆ జనకరాజుతో ఇలా అన్నాడు. 'నీవు సదా పద్మనాభుని చరణాలపై అనురాగం చూపేవాడవు. అతనిని శరణుచొచ్చినవాడవు. ఆహా ! నీవు కృతార్థరూపుడవు. నీకు శుభమగును. ఇక నేను వెళ్తున్నాను.' ఇలా అని ఆ బ్రాహ్మణుడు అక్కడినుండి వెళ్లిపోయాడు. వెళ్తూ వెళ్తూ రాజును పరీక్షించడానికి ఆ ద్విజోత్తముని రూపం ధరించిన భగవంతుడు శ్రీహరి స్వయంగా మిథిలానగరాన్ని అగ్నితో దహించివేశాడు. తగలబడిపోతున్న మిథిలా నగరాన్ని చూసి రాజు వీమాత్రం చలించలేదు. ప్రజలు ఆడిగితే ఆతడు ఈ మాటలు అన్నాడు. "నా వద్ద ఆత్మజ్ఞాన మనే అనంత ధనం ఉన్నది. కాబట్టి నాకు పొందవలసిన దేమీ మిగలలేదు. ఈ మిథిలా నగరం కాలిపోయినా నాకు వీమీ బాధలేదు." ఇలా అతడు అన్నమాటలను ద్విజోత్తముడు కూడా విన్నాడు. అతని మనోభావం తెలుసుకొన్నాడు. తిరిగి అతడు మిథిలా నగరాన్ని పూర్వంలాగ బ్రతికించాడు. వెంటనే అతడు రాజుకు తన స్వరూపాన్ని చూపించాడు. అతనికి తిరిగి వరం ఇస్తూ - "నరేశ్వరా ! నీ మనసు సద్భావంతో ధర్మంమీద లగ్నమగుగాక ! బుద్ధి తత్త్వ జ్ఞానమందు పరినిష్ఠితమగుగాక ! ఎప్పుడూ విషయ విరక్తుడవై సత్యమార్గమున నిలుచుదువుగాక ! నీకు శుభ మగుగాక ! నేను వెళ్తున్నాను" అన్నాడు. అతనితో ఇలా చెప్పి భగవంతుడైన శ్రీహరి అక్కడే అంతర్ధానం చెందాడు. రాజా ! ఈ కథను నీకు చెప్పాను. ఇంకా వీమి వినాలనుకొంటున్నావు ?"

220. దమ ప్రశంస.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'మహాప్రాజ్ఞా ! ప్రభూ ! గృహస్థుడై సర్వసంసారబంధాలకు అతీతంగా, సర్వద్వంద్వాలను విడిచిపెట్టి, పత్నీ సహితుడై, నియమబద్ధంగా జీవించినవా డెవడయినా ఉన్నాడా ? దుర్లభు డయిన అటువంటి మహాపురుషుని గురించి చెప్పు.' భీష్ము డిలా చెప్తున్నాడు. 'రాజా ! నీవు నన్ను అడిగిన విషయాన్ని యథాతథంగా చెపుతా విను. పవిత్రమైన ఈ ఇతిహాసం సంసారభయాలకు ఔషధప్రాయం. దేవలుడనే విప్రర్షి ఉండేవాడు. అతడు సర్వశాస్త్రార్థాలలో నిపుణుడు. క్రియాశీలుడు. ధార్మికుడు. నిత్యమూ దేవతలనూ, బ్రాహ్మణులనూ పూజించేవాడు. అతనికొక పుత్రిక. ఆమె పేరు సువర్చల. శుభలభక్షణాలుగల ఆ యశస్విని మరీ పొట్టీ కాదు, మరీ పొడుగూ కాదు.

బక్కచిక్కినదీ కాదు. ఆమెకు యుక్తవయస్సు రాగానే తండ్రి ఇలా ఆలోచింపసాగాడు. ఈమెకు తగిన భర్త ఎలా దొరుకుతాడు? అతడు ఉత్తమ శ్రోత్రియుడు, విద్వాంసుడు, విప్రుడు, అవివాహితుడు, ప్రియభాషణుడు, మహాతపస్వి అయి ఉండాలి. అతడు అలా ఆలోచిస్తుండగా ఒకనాడు ఏకాంతంలో సువర్చల ఇలా అన్నది. 'మహాప్రాజ్ఞా ! అంధుడై కూడా కళ్ళున్నవానికి నన్ను ఇవ్వు. మహామునీ ! ఈ నా ప్రార్థన ఎప్పుడూ గుర్తుంచుకో.' తండ్రి ఇలా అన్నాడు. 'అమ్మా ! నీవిప్పుడు కోరినది అసాధ్యమని నాకు అనిపిస్తోంది. అంధత్వమూ, చూపూ ఒక్కచోటనే ఎలా కుదురుతాయి? నాకు వికారంగా ఉన్నది. శుభలోచనా ! పిచ్చిదానివలె అశుభవచనాలు పలుకుతున్నావు.' సువర్చల ఇలా అన్నది. నేను పిచ్చిదాననుకాదు. బుద్ధిపూర్వకంగానే చెప్తున్నాను. అటువంటి వేదవేత్త భర్త అయితే నన్ను భరించి, పోషించగలడు. నీవు నన్ను ఎవ్వరి కివ్వదలచుకొన్నావో ఆ బ్రాహ్మణులను ఇక్కడకు రప్పించు. వారిలో నుండి నాకిష్ట మయిన వానిని అటువంటి భర్తగా వరిస్తాను.' అలాగే అని కుమార్తెతో చెప్పి ఆముని శిష్యులతో ఇలా అన్నాడు.

'శిష్యులారా ! నా కుమార్తెను పెండ్లి చేసికొనటానికి ఇష్టపడే వరులను వెదకి, తీసికొనిరండి. వారు బ్రాహ్మణులు, వేదసంపన్నులు, సద్వంశంలో, సద్గోత్రంలో పుట్టిన వారు, తల్లి వైపు నుండి, తండ్రి వైపునుండి కూడా నిష్కలంకులు, శుభాచారులు, శుభలక్షణులు, రోగరహితులు, బుద్ధిసంపన్నులు, శీల సత్త్వగుణాన్వితులు, గోత్ర సాంకర్యరహితులు, వేదవ్రత సహితులు, స్నాతకులు, జీవత్పితరులు అయి ఉండాలి.' ఆమాట విని శిష్యులు వెంటనే అక్కడక్కడ ఆశ్రమాలకు, గ్రామాలకు వెళ్ళి, అక్కడి బ్రాహ్మణులకు విషయాన్ని నివేదించారు. రాజా ! ఆ ఋషి ప్రభావాన్నీ, ఆ కన్యా స్వభావాన్నీ తెలిసి బ్రాహ్మణోత్తములూ, అనేక మహర్షులు దేవలుని ఆశ్రమానికి వచ్చారు. ఆ మహర్షి సువర్చల తండ్రి యథాశాస్త్రంగా మునులను, మునికుమారులను యథోచితంగా సత్కరించి, పూజించి, కుమార్తెతో ఇలా అన్నాడు. 'అమ్మా ! ఈ మునులంతా వేదవేదాంగ సంపన్నులు, కులీనులు, శీలవంతులు. నా బిడ్డలవలె నాకు ప్రియమైన వారు. కళ్యాణీ ! ఇక్కడకు చేరిన వీరిలో ఏ మహావ్రతుని నీవు భర్తగా కోరుతున్నావో అతనిని వరించు. అతనికి నిన్ను దానం చేస్తాను.' అలాగే అని తండ్రితో పలికి సర్వలక్షణ సంపన్నురాలు, బంగారువన్నె గలది, కళ్యాణి, యశస్విని అయిన ఆ సువర్చల విప్రసమూహాన్ని చూసి, నమస్కరించి, ఆ తపోధనులతో ఇలా అన్నది. 'ఈ బ్రాహ్మణ సమితిలో అంధుడూ, అనంధుడూ అయిన విప్రుడెవరయినా ఉంటే అతడే నా భర్తకాగలడు.' అది విని మహాత్ములయిన ఆ విప్రులందరూ ఒకరి వైపు మరొకరు చూస్తూ, ఆ కన్యను అజ్ఞానినిగా భావించి, ఎవ్వరూ సమాధానమివ్వలేదు. నానాదేశ నివాసులయిన ఆ మునిసత్తములు కోపించి, మనసా దేవలుని నిందించి, వచ్చినరీతిగానే వెళ్ళిపోయారు. ఆకన్య సువర్చల తండ్రి ఇంటనే నిలిచిపోయింది.

ఆ తరువాత ఒకసారి శ్వేతకేతు వని ప్రసిద్ధికెక్కిన ఒక ముని ఆ వృత్తాంతాన్ని విని సువర్చల కోసం వేగంగా, ఆదరంగా దేవలుని దగ్గరకు వచ్చాడు. ఆ శ్వేతకేతువు బ్రాహ్మణ భక్తుడు, విద్వాంసుడు, న్యాయవిశారదుడు, ఊహాపోహవిధాన మెరిగినవాడు, బ్రహ్మచర్య నిష్ఠుడు, వేదవేత్త,

వేద తత్వవేత్త, క్రియా కల్పవిశారదుడు, ఆత్మ తత్వవిభాగవేత్త, గుణసాగరుడు, జీవత్పితరుడు కూడ. ఉద్దాలకుని కుమారుడు, మహావ్రతుడు అయిన శ్వేత కేతువును చూసి దేవలుడు యథోచితంగా పూజించి కుమార్తెతో ఇలా అన్నాడు. 'సౌభాగ్యవతీ ! అమ్మాయీ ! ఈ ఋషి కుమారుడు వచ్చాడు. వేదవేదాంగ పారగుడైన ఈ మహాప్రాజ్ఞుని వరించు.' ఆ మాట విని ఆ కన్య ఋషి పుత్రుని వైపు కోపంగా చూసింది. ఆ విప్రర్షి సువర్చలతో ఇలా అన్నాడు. 'కళ్యాణీ! ఆ వచ్చినవాడను నేనే. నేను అంధుడనే. ఇది నిజం. ఎప్పుడూ అలాగే అనుకొంటుంటాను. అలాగే నేను సందేహాలు లేనివాడను కాబట్టి విశాలనేత్రుడను కూడా. వరారోహా ! నన్ను వరించు. అనిందితా ! నిన్ను సేవిస్తాను. పరమాత్మ శక్తితోనే జీవుడు నిత్యం చూస్తున్నాడు, గ్రహిస్తున్నాడు, స్పృశిస్తున్నాడు, వాసన చూస్తున్నాడు, మాటాడుతున్నాడు, ఆస్వాదిస్తున్నాడు, తత్త్వాలోచన చేస్తున్నాడు, తెలిసికొంటున్నాడు. అటువంటి పరమాత్మ రూపమైన కన్ను లేనివాడు గ్రుడ్డివాడి క్రింద లెక్క. (నాకున్నది కాబట్టి నేను అంధుడను కాదు). ఆ పరమాత్మయందే జగద్వ్యవహారమంతా నడుస్తోంది. ఈ జగత్తు కంటితో చూసినా, చెవితో విన్నా, చర్మంతో స్పృశించినా, నాసికతో వాసన చూసినా, రసనతో ఆస్వాదించినా, లౌకిక చక్షువుతో వ్యవహరించినా అంతా పరమాత్మ సంబంధమే. నాకు సంబంధం లేదు. కాబట్టి నేను అంధుడను. కాబట్టి నన్ను వరించు. లోకదృష్టితో నిత్యనైమిత్తికాది కర్మలను చేస్తున్నాను. ఆత్మదృష్టితో మాత్రం ఎప్పుడూ, అన్నింటా నిర్లిప్తుడనే. కార్యకారణరూపుడయిన పరమాత్మను భావిస్తూ ఎప్పుడూ శాంతంగా, నిండుగా ఉంటాను. అవిద్యతో – కర్మలతో – మృత్యువును అతిక్రమిస్తూ, విద్యతో అమృతత్వాన్ని పొందుతూ, ప్రారబ్ధంతో వచ్చిన దేనినైనా సమంగా భావిస్తూ మాత్సర్య హీనుడనై ప్రవర్తిస్తాను. 'కళ్యాణీ ! తగిన శుల్కమిచ్చి నిన్ను స్వీకరించాలని నిర్ణయించు కొన్నాను. నిన్ను పోషించగలను. నన్ను వరించు!' అప్పుడు సువర్చల ఆ బ్రాహ్మణోత్తముని చూసి ఇలా అన్నది. సువర్చల ఇలా అన్నది. 'పండితా ! నేను మనసా నిన్ను వరిస్తున్నాను. మిగిలిన పనిని నా తండ్రి చేస్తాడు. మా తండ్రి ద్వారా నన్ను స్వీకరించు. ఇదియే వేదవిహిత మయిన పద్ధతి.'

భీష్మ డిలా అన్నాడు. 'అది గ్రహించి మునిశ్రేష్ఠ డయిన ఆమె తండ్రి దేవలుడు శ్వేతకేతువును, ఉద్దాలకుని పూజించి మహర్షుల సన్నిధిలో జలధారా పూర్వకంగా కన్యాదానం చేశాడు. ఆ సమయంలో శ్వేతకేతువును చూసి మునులు ఇలా అన్నారు. అందరి హృదయ కమలాలలో నివసించే సర్వభూతాత్మకుడు, మధుసూదనుడూ అయిన హరియే శ్వేతకేతురూపంతో విరాజిల్లుతున్నాడు.' దేవలు డిలా అన్నాడు. 'వరరూపంలో నున్న లక్ష్మీనారాయణుడు ప్రసన్న డగుగాక! ఈ నా పుత్రిని ఇతనికి భార్యగా సమర్పిస్తున్నాను. కళ్యాణి అయిన సహధర్మచారిణిగా ఈ కన్యను దానం చేస్తున్నాను.' భీష్ముడిలా చెప్తున్నాడు. 'ఆ రీతిగా పలికి, మునిపుంగవుడైన దేవలుడు కన్యాదానం చేశాడు శ్వేతకేతువునకు. మహాయశస్వి అయిన శ్వేతకేతువు ఆమెను స్వీకరించి యథోచితంగా, యథావిధిగా వివాహమాడాడు. మునులద్వారా నిర్వహింపబడిన ఉత్తమ వివాహ తంత్రం ముగిసిన పిదప గృహస్థుడై సువర్చలతో ఇలా అన్నాడు. శ్వేతకేతు విలా అన్నాడు. 'శోభనా ! వేదాలు విధించిన కర్మల నన్నింటినీ నాతో కలిసి పాటించు. యథాన్యాయంగా నాకు సహధర్మచారిణివి కమ్ము. ఆ భావంతోనే నేనున్నాను. నీవు

కూడా అదే భావంతో ఉన్నావు. కాబట్టి నేను చెప్పిన పనులు నీవు చేయి. అలాగే నీవు చెప్పిన పనులు నేను చేస్తాను. ఆపై "ఈ పనులన్నీ నావి కావు, నేను వీటికి కర్తను కాను" అన్న జ్ఞానాగ్నిలో సర్వకర్మలను దగ్ధం చేయి. నీవు ఎప్పుడూ ఇలాగే చేయి. సౌభాగ్యవతివి కాగలవు. నేను కూడా అలాగే చేస్తాను. శ్రేష్ఠులు చేసిన పనినే ఇతర జనులు కూడా చేస్తారు. కాబట్టి లోకసిద్ధికోసం, ఆత్మసిద్ధికోసం మనం కర్మలను ఆచరించాలి.' భీష్ముడు ఇలా చెప్తున్నాడు. 'ఇలా చెప్పి సర్వజ్ఞానాలకు నిలయుడూ, మహాప్రాజ్ఞుడూ అయిన శ్వేతకేతువు ఆమెతో కొడుకులను కని, యాగాలతో దేవతలను తృప్తి పరిచాడు. నిత్యమూ ఆత్మయోగాసక్తుడై నిర్ద్వంద్వంగా దానాలు పట్టకుండా జీవించాడు. క్షేత్రజ్ఞుడు బుద్ధిని పొందినట్లు శ్వేతకేతువు తనకు తగిన భార్యను పొంది, శోభించాడు. ఆ భార్యాభర్తలు లోకాంతరాలకు కూడా వెళ్ళగలిగేవారు. ఈ లోకంలో సాక్షీమాత్రులై ఆనందంగా జీవింపసాగారు.

ఆ తరువాత ఒకసారి సువర్చల భర్తఅయిన శ్వేతకేతువుతో "ద్విజోత్తమా ! నీవెవడవు ? ఇది నాకు చెప్పు" అని అడిగింది. వాగ్మి అయిన శ్వేతకేతువు "నిస్సంశయంగా నీకు తెలును. ద్విజోత్తమా అని సంబోధించి మరల ఎవరిని అడుగుతున్నావు"? అని ఆమెతో అన్నాడు. అప్పుడు ఆమె "హృదయస్థుడైన ఆ మహాత్ముని అడుగుతున్నాను" అన్నది. అది విని శ్వేతకేతువు ఇలా సమాధాన మిచ్చాడు. 'భామినీ ! అతడు పలుకడు. ఆత్మకు నామగోత్రాలుంటాయని నీవు భావిస్తే అది మిథ్యాజ్ఞానం. గోత్ర ముంటే దేహబంధ ముంటుంది. ఆత్మలో నేను అన్నభావ మిక్కడ స్థాపించబడింది. నీలో కూడా ఆ భావమే ఉన్నది. నీవూ నేనే. ఇదంతా నేనే. దీనిలో ఆ పరమార్థతత్త్వ మేదీ లేదు. అయినా ఎందు కడుగుతున్నావు.' రాజా ! అప్పుడు ధర్మచారిణి అయిన సువర్చల ఆనందించి, నవ్వి, చిరునవ్వుతో కాలోచితంగా భర్తతో ఇలా అన్నది.

బ్రహ్మర్షీ ! అనేక విధాలుగా వికల్పించి ప్రయోజన మేమున్నది ? నిత్యమూ క్రియాకలాపాలలో పడి నీ జ్ఞానం నశిస్తోంది. మహాప్రాజ్ఞా ! దానికి కారణం నాకు చెప్పు. నేను నిన్ను అనుసరించేదానను.' శ్వేతు కేతు విలా అన్నాడు. 'శ్రేష్ఠులు ఆచరించిన దానినే ఇతరజనులు ఆచరిస్తారు. కాబట్టి మనం కర్మపరిత్యాగం చేస్తే లోకంకూడా కర్మలు మాని సాంకర్యానికి లోనవుతుంది.' ధర్మం సంకర మయితే వర్ణ సాంకర్యం కలుగుతుంది. వర్ణసాంకర్య మేర్పడితే లోకంలో మాత్స్యన్యాయ ప్రవర్తన కలుగుతుంది. కళ్యాణీ ! సర్వజగత్తును పరిపాలించే మహాత్మునకు శ్రీహరికి అది నచ్చదు. ఈ విశ్వసృష్టి అంతా పరమేశ్వర క్రీడయే గదా ! ధూళికణాలు ఎన్ని ఉన్నాయో అన్ని విభూతులు పరమేశ్వరున కున్నాయి. ఆయన మాయలూ, ఆయన శక్తులు కూడా అదే సంఖ్యలో ఉంటాయి. **"అత్యంత గహనమయిన ఈ గుహలో నుండి ముక్తిప్రాప్తికై జ్ఞానఖడ్గంతో జననమరణ బంధనాలను ఛేదించి, వస్తు వేరిన విద్వాంసుడే నాకిష్టమైనవాడు. నిస్సంశయంగా అతడే నేను"** అన్నది పరమాత్మ ప్రతిజ్ఞ. 'మూఢులై, దురాత్ములై, ధర్మసాంకర్యకారకులై హద్దుల నతిక్రమించి, ప్రవర్తించిన నీచప్రాణులు నరకానికి వెళ్ళుతారు. ఆపై అసురజాతిలో జన్మిస్తారు' అని పరమాత్మ అనుశాసనం. నీవు కూడా లోకరక్షణ కోసం లోకమర్యాదలను రక్షించాలి. ఈ విషయంలో సందేహం లేదు. అందుకోసమే నేను కూడా లోకమర్యాదలను పాటిస్తున్నాను.'

సువర్చల ఇలా అన్నది. 'మహామునీ ! శబ్ద మంటే వీమిటి ? అర్థ మంటే వీమిటి? వాటి స్వరూపలక్షణాలను విడివిడిగా చెప్పు.' శ్వేతకేతు విలా అన్నాడు. 'వర్ణసముదాయాన్ని క్రమంగా కానీ, వ్యతిక్రమంగా కానీ ఉచ్చరిస్తే ప్రకాశింపబడే పదార్థం శబ్దం. ఆ శబ్దంద్వారా ప్రతీతమయ్యే అభిప్రాయం అర్థం.' సువర్చల ఇలా అన్నది. 'శబ్ద ముంటేనే అర్థప్రతీతి అయితే శబ్దార్థాల మధ్య సంబంధ మున్నదా ? లేదా ? వాస్తవాన్ని నాకు చెప్పు.' శ్వేతకేతు విలా అన్నాడు. 'శబ్దార్థాల మధ్య నియతమయిన సంబంధమేమీ లేదు. తామరాకు మీది నీటి బొట్టుకు తామరాకుతో ఉన్న సంబంధం వంటిదే శబ్దార్థసంబంధం తెలుసుకో !' సువర్చల ఇలా అన్నది. 'మహాప్రాజ్ఞా ! అర్థ ముంటేనే శబ్ద ముంటుంది. అర్థంలేకపోతే శబ్దం నిలువదు. సజ్జన శ్రేష్ఠా ! అర్థం లేకుండా ఉన్న శబ్దమేదైనా ఉంటే చెప్పు.' శ్వేతకేతు విలా అన్నాడు. 'శబ్దానికి అర్థంతో వాచకత్వరూప సంబంధ ముంటుంది. అది మాత్రం నిత్యం. శబ్ద ముంటే అర్థమూ ఉంటుంది. విపరీతంగా ఉచ్చరించినా కూడా శబ్దానికి వీదో ఒక అర్థ ముంటుంది.' సువర్చల ఇలా అన్నది. 'ఇక్కడ శబ్దమంటే వేదం. అర్థమంటే పరమాత్మ అని నాభావం. ఆ పరమాత్మ ఆధారం లేకుండా శబ్దం-వేదం- నిలువదు. కానీ శబ్దార్థాలకు నియత సంబంధం లేదనటం విపరీత భాషణం.' శ్వేతుకేతు విలా అన్నాడు. 'నేను విపరీతంగా మాటాడలేదు. ఆకాశం లేకుండా పృథివి, పృథివి లేకుండా ఆకాశం లేవు. అయినా వాటి మధ్య నియత సంబంధం లేదు. శబ్దార్థాలు కూడా అటువంటివే.' సువర్చల ఇలా అన్నది. "అహన్' శబ్దం ఎప్పుడూ ఆత్మార్థంలో స్పష్టంగా ప్రయోగింపబడుతోంది. కానీ శబ్ద మక్కడకు చేరలేదు. కాబట్టి ఆత్మ అనే అర్థంలో అహం శబ్దప్రయోగం కూడా మిథ్యయే.'

శ్వేతేకేతు విలా అన్నాడు. 'శుభవ్రతా ! అహంభావమే ఆత్మభావంలో ప్రయోగింపబడుతోంది కానీ అహం శబ్దం ఆత్మభావంలో ప్రయోగించబడటం లేదు. సగుణ పదార్థబోధకమైన శబ్దం అచింత్య పరమాత్మ బోధకం కాలేదు. మట్టికుండలో మృత్తికాభావం కలుగుతుంది. ఆదేరీతిగా పరమాత్మ నుండి పుట్టిన ప్రతిపదార్థంలోనూ పరమాత్మ భావ ముంటుంది. అందుకే అచింత్య పరబ్రహ్మ విషయంలో కూడా అహంభావమే ఆత్మభావం. అదే వాస్తవం. నేను, నీవు, ఇది - ఈ వ్యవహారమంతా పరమాత్మలో మనం కల్పించినదే కానీ వాస్తవం కాదు. అందువలన "మాటలు ఆ పరమాత్మను చేరలేవు" అను శ్రుతివచనంతో వైరుధ్యం లేదు. పిరికిదానా ! అందువలనే చిత్తభ్రాంతితో అహం పదాన్ని ప్రయోగిస్తాం. ఆకాశంలో ఉన్న విశ్వమంతా ఆకాశంతో కలిసి ఉన్నట్లు కనిపిస్తుంది. అదే రీతిగా పరమాత్మయందున్న సర్వజగత్తు పరమాత్మతో కలిసి ఉన్నట్లు కనిపిస్తుంది. జగత్తుతో పరమాత్మకున్న సంబంధం కార్యకర్తృ సంబంధం. జగత్తు ఆకాశభిన్నమైనా ఆకాశ వికారాల కారణంగా ఆకాశంతో కలిసినట్లుంటుంది. అలాగే బ్రహ్మకు జగత్తుతో ఎటువంటి సంబంధమూలేదు. అక్కడనుండి పుట్టింది కాబట్టి తద్రూపంగా భావింప బడుతోంది. ఆ బ్రహ్మ పరమశుద్ధం. సాటిలేనిది అందుకే మాటలకు అందదు. చర్మచక్షువుతో పరమాత్మను చూడలేము కానీ జ్ఞానచక్షువుతో చూడవచ్చు. అది నా అభిప్రాయం.' సువర్చల ఇలా అన్నది. 'నిర్వికారమై, రూపరహితమై, హద్దులేనిదై, సర్వవ్యాపి అయిన ఆకాశం ఎప్పుడూ కనిపించినట్లు జ్ఞానరూపుడైన బ్రహ్మకూడా కనిపిస్తాడు.' శ్వేతకేతు విలా అన్నాడు.

'మనిషి చర్మంద్వారా ఆకాశగతమైన వాయువును పదే పదే స్పృశిస్తున్నాడు. ఆకాశగతమైన గంధాన్ని ఆఘ్రాణిస్తున్నాడు. అక్కడున్న జ్యోతిని కంటితో చూస్తూన్నాడు. అలాగే అందకారాన్నీ, కిరణ సమూహాన్ని, మేఘసముదాయాన్నీ, వానినూ, తారాగణాన్నీ చూడగలుగుతున్నాడు కానీ ఆకాశం కనిపించదు. సద్రూపుడైన పరమాత్మ ఆకాశానికే ఆకాశం. అనగా మహాకాశం. ఆయనకోసం, ఆయననుండీ ఈ సర్వజగత్తు ఏర్పడింది. పరమాత్మయే సత్యం, సర్వవ్యాపకం కూడా. పరమాత్మకున్న గుణసంబంధి నామాలన్నీ ఔపచారికాలే. కంటితో నయినా, మనస్సుతో నయినా, మరే ఇంద్రియంతో నైనా పరమాత్మను గ్రహింపలేము. ఆయన సర్వవ్యాపి. మాటలకు అందడు. సూక్ష్మబుద్ధితో ఆలోచిస్తేనే పరమాత్మను సాక్షాత్కారించుకొనగలం. పెద్దకుండా, చిన్నకుండా కూడా నేలపై నున్నట్లు ఈ సమస్త ప్రపంచమూ పరమాత్మయందే నిలిచి ఉంటుంది. ఆ పరమాత్మ స్త్రీ కాదు. పురుషుడు కాదు. నపుంసకుడూ కాదు. కేవలం జ్ఞానస్వరూపం. తదాధారంగానే జగత్తు నిలిచి ఉంటుంది. నీటిలో పాత్రభేదాన్ని బట్టీ, అన్యవస్తు సంయోగాన్ని బట్టి రుచిభేదం ఏర్పడినట్లు ప్రకృతి యోగాన్ని బట్టి ఆత్మనుండి వివిధ ప్రకారమైన సృష్టి జరుగుతుంది. దప్పిక గొన్నవాడు నీరుత్రాగి తృప్తినందినట్లు సాధకుడు బ్రహ్మబోధక వాక్యాన్ని నిత్యమూ స్మరించటం ద్వారా పరిపూర్ణ జ్ఞానాన్ని పొంది, సుఖాన్ని వృద్ధిచేసికొంటాడు.'

సువర్చల ఇలా అన్నది. 'అనఘా ! శబ్దంద్వారా ఏం సిద్ధిస్తుంది ? ఏమీ లేదని నా అభిప్రాయం. కానీ పౌరాణికులు పరమాత్మ అచింత్యుడు, వేదగమ్యుడూ అంటారు. లౌకికశబ్దాలు ఎన్నో నిరర్థకా లయినట్లు వైదిక శబ్దాలు కూడా నిరర్థకాలే. దీనిని గమనించి వాస్తవాన్ని నాకు చెప్పు.' శ్వేతకేతు విలా అన్నాడు. 'శబ్దపరమాత్మ పరస్వరూపుడు, శుద్ధుడు, వేదగమ్యుడూ అని శ్రుతివాక్యం సత్యం. నాస్తికులు దానిని కాదంటారు. కాని స్థూలశరీరంలో సూక్ష్మశరీరంతో జీవాత్మరూపంగా పరమాత్మ ఉంటాడు. ఉత్తమురాలా ! నిరర్థక మయిన లౌకికశబ్ద మేదీ లేదు. అన్వయం కుదరని శబ్దాలను నిరర్థకాలని లౌకికు లంటారు. కళ్యాణీ ! లౌకిక శబ్దాలవలె వైదిక శబ్దాలు కూడా సార్థకాలే అయినా అవి పరమాత్మను సాక్షాత్కరింపజేయలేవు. పరమాత్మ వాక్కులకు అందడు. అది యుక్తియుక్తమే. సాధనాలను ఉపదేశించినందువలన, ఉపాయాలను సూచించి నందువలన, ఉపలక్షణం యోగం (అన్యవస్తు సాహచర్యం) వలన, 'నేతి' (నిషేధ) వాక్యాలద్వారా ప్రదర్శించి నందువలన శుద్ధపరమాత్మ వేదగమ్యుడని నా నిశ్చయబుద్ధి. శుభాచరణా ! అధ్యాత్మ తత్త్వచింతన ద్వారా నిత్యమైన జ్ఞానం దీపంలా స్పష్టంగా తెలుస్తుంది. ఆ జ్ఞానంతో మనిషి పరమగతిని పొందుతాడు. శుభా ! శుద్ధా ! జ్ఞానవిలోచనా ! నేను గూఢమై, యథార్థమైన బ్రహ్మ జ్ఞానాన్ని గూర్చి చెప్పాను. విన్నావా ? లేదా ? శుభా ! పరబ్రహ్మ ఐశ్వర్యం వివిధరూపాలలో కనిపిస్తుంది. గాలి అక్కడ చొరలేదు. సూర్యుడు కానీ, అగ్ని కానీ దానిని ప్రకాశింపజేయలేవు. పరమాత్మతోనే ఈ సృష్టి పరిపూర్ణం. సర్వప్రాణుల హృదయాలలో పరమాత్మ జీవరూపంలో ఉంటుంది. ఇదియే ఆత్మవిజ్ఞానం. నేను ప్రకటించిన అహం పదార్థమిదియే. **మన ఇద్దరి సంబంధం శాశ్వతం కాదు. అలా భావించటం అజ్ఞానబంధం.**

భీష్ముడిలా చెప్పున్నాడు. 'భర్త ఈ రీతిగా యథార్థజ్ఞానాన్ని బోధించగా సువర్చల ఆనందించింది. ఎల్లప్పుడూ తత్త్వబుద్ధితో కూడి, తదనుగుణంగా ఆచరింపసాగింది. రాజా !

భర్త-శ్వేతకేతువు-కూడా భార్యతో కలిసి, నిత్యనైమిత్తిక కర్మల నాచరిస్తూ, మహాత్ముడు, పరమాత్ముడు, గోవిందుడు అయిన వానుదేవుని యందు కర్మలను నమర్పించి, తద్భావనతో తన్మయత్వాన్ని పొందుతూ చాలాకాలం జీవించి, పరమగతిని పొందాడు. రాజా ! నీవడిగిన ప్రశ్నకు సమాధానంగా దీనిని చెప్పాను. గార్హస్థ్యాన్ని పాటించి ఆ దంపతులు పరమగతిని పొందారు.'

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'భారతా ! ఏం చేస్తే సుఖాన్ని పొందవచ్చు ? ఏం చేస్తే దుఃఖం కలుగుతుంది ? ఏం చేస్తూ ఈ లోకంలో సిద్ధుడై నిర్భయంగా జీవించవచ్చు ?' భీష్ముడిలా చెప్తున్నాడు. 'ఏకాగ్రతతో వేదాలను అధ్యయనం చేసే పెద్దలు అందరూ సర్వవర్ణాలకూ, ప్రత్యేకించి బ్రాహ్మణులకు నిగ్రహాన్నే అభినందిస్తారు. నిగ్రహం లేనివానికి కర్మలకు తగిన ఫలితం లభించదు. క్రియలు, తపస్సు, సత్యం - ఇవన్నీ నిగ్రహంలోనే ప్రతిష్ఠింపబడ్డాయి. **నిగ్రహం తేజస్సును పెంచుతుంది. దమమే పరమ పవిత్ర మైనది. నిగ్రహంగల మనిషి పాపరహితుడూ, నిర్భయుడూ అయి మహాపదాన్ని పొందగలడు.*** **నిగ్రహవంతుడు సుఖంగా నిద్రిస్తాడు. సుఖంగా మేల్కొంటాడు. సుఖంగా లోకంలో చరిస్తాడు. నిగ్రహవంతుని మనస్సు కూడా ప్రసన్నమై ఉంటుంది. నిగ్రహంవలననే తేజోధారణ జరుగుతుంది. నిగ్రహం లేని రజోగుణుడు తేజస్సును పొందలేడు. అంతశ్శత్రువులయిన కామ క్రోధాదులను ఎప్పుడూ తనలోనే విడివిడిగా చూడగలుగుతాడు అతడు.** ప్రాణులు క్రూరజంతువులను చూసి, భయపడినట్లు నిగ్రహహీనులను చూసి, ఎప్పుడూ భయపడతారు. వారిని నిరోధించటానికే బ్రహ్మ రాజును సృష్టించాడు. సర్వాశ్రమాలలోనూ దమమే గొప్పది. సర్వాశ్రమాలలోనూ ధర్మపాలన చేసేవారు పొందగల ఫలాన్ని మించిన ఫలితాన్ని నిగ్రహశీలుడు పొందగలడు.

దమం వలన కలిగే లక్షణాలను వివరిస్తాను. కృపణత్వం లేకపోవటం, సంరంభం లేకపోవటం, సంతోషం, శ్రద్ధ, అక్రోధం, ఋజుత్వం, అతివాదాలు చేయక పోవటం, అభిమానిత్వం, గురుపూజ, అసూయ, భూతదయ, చాడీలు చెప్పకుండుట, లోకాపవాద మృషావాద స్తుతి నిందలను విడుచుట, సత్సంగేచ్ఛ, రాబోయే వాటిని గురించి చింతింపకుండుట. నిగ్రహశీలి ఎవ్వరితో సంఘర్షించడు. అందరితో చక్కగా వ్యవహరిస్తాడు. నిందా ప్రశంసలను సమంగా స్వీకరిస్తాడు. సదాచారం, శీలసంపద, ప్రసన్నచిత్తం, ధైర్యం, సామర్థ్యం కలిగి ఇహలోకంలో సత్కారాలు పొంది, మరణానంతరం స్వర్గానికి వెళతాడు. నిగ్రహశీలి సర్వప్రాణులు

---

* దమస్తేజో వర్ధయతి పవిత్రం దమ ఉచ్యతే ।
విపాప్మా నిర్భయో దాంతః పురుషో విందతే మహత్ ॥ 4

పొందలేనివానిని వారికి అందజేస్తూ, తాను ఆనందించి, సుఖంగా ఉంటాడు. సర్వప్రాణుల హితాన్ని కోరుకొంటాడు. ఎవ్వరినీ ద్వేషించడు. మహాజలాశయంవలె గంభీరంగా ఉంటాడు. జ్ఞానంతో తృప్తిపడి ఆనందంగా ఉంటాడు. దాంతుడు సమస్త ప్రాణుల నుండి నిర్భయంగా ఉంటాడు. అందరికీ నిర్భయత్వాన్ని కల్గిస్తాడు. అలా ధీమంతుడై సమస్త ప్రాణులకూ వందనీయు డవుతాడు. గొప్ప లాభం కలిగినా ఆనందించడు. ఎంత ఇబ్బంది కలిగినా బాధపడడు. అటువంటి బ్రాహ్మణుడే సూక్ష్మబుద్ధి, జితేంద్రియుడు అని వ్యవహరింపబడతాడు. వేదవేత్తయై, సదాచార పాలనవలన పవిత్రుడై నిగ్రహాన్ని పాటించేవాడు తన పుణ్యకర్మల మహాఫలాన్ని పొందగలుగుతాడు. అనసూయ, క్షమ, శాంతి, సంతోషం, ప్రియంగా మాటాడటం, సత్యం, దానం, అనాయాసం - ఇటువంటి సద్గుణాలను దుర్మార్గులు పాటించలేరు. కామం, క్రోధం, లోభం, ఇతరులపై ఈర్ష్య, ఆత్మస్తుతి ఇటువంటి లక్షణాలే దురాత్ములలో ఉంటాయి. కాబట్టి ఉత్తమ వ్రతాలను అనుష్ఠింపదలచిన బ్రాహ్మణుడు కామక్రోధాలను లోబరచుకొని, బ్రహ్మచారియై, జితేంద్రియుడై, సోత్సాహంగా ఘోరతపస్సు చేయాలి. మృత్యువు కోసం ఎదురు చూస్తూ నిరపాయంగా, ధైర్యంగా లోకంలో చరించాలి.'

221. అమృత ప్రాశనికము.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. 'పితామహా ! వ్రతనిష్ఠులయిన ద్విజులు బ్రాహ్మణ గ్రంథోక్తమైన స్వర్గాదిఫలాన్ని కోరుతూ హవిష్యాన్నాన్ని భక్షిస్తున్నారు గదా ! ఇది ఉచితమా ! అనుచితమా !' భీష్ముడిలా చెప్తున్నాడు. 'యుధిష్ఠిరా ! అవైదికాలయిన వ్రతాల నాశ్రయించి, కొందరు హవిష్యాన్నం తింటారు. వారు స్వేచ్ఛాచారులు. వేదోక్తవ్రతశీలురై సకామకర్మలను ఆశ్రయించి, మరికొందరు హవిష్యాన్నం తింటారు. సకామదృష్టిలో ఇద్దరూ సమానులే.' యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'మహారాజా ! లోకులు ఉపవాసాన్నే తపస్సు అంటుంటారు. ఇది తపస్సేనా ? కాకపోతే తపస్సంటే ఏమిటి ?' భీష్ముడిలా చెప్తున్నాడు. **'జనులు వెలరోజులో, పక్షం రోజులో ఉపవాసం చేసి దానిని తపస్సు అనుకొంటుంటారు. కాని ధర్మసాధనభూతమైన శరీరాన్ని శోషింపజేసే అది తపస్సు కాదు. సత్పురుషులు దానిని అంగీకరించరు.** సజ్జనుల అభిప్రాయంలో త్యాగమూ, వినయమే ఉత్తమతపం. వాటిని పాటించే మనుష్యులే నిత్యోపవాసులు, నిత్య బ్రహ్మచారులు అవుతారు. భారతా ! త్యాగవినయ సంపన్నుడైన బ్రాహ్మణుడే మహర్షి, దేవుడు కూడా. అటువంటివాడు గృహస్థుడైనా,

ధర్మరక్షకుడై నిద్రా ఆలస్యాలను దరిచేరనీయడు. **మాంస మెప్పుడూ తినరాదు. ఎప్పుడూ పవిత్రంగా ఉండాలి. వైశ్వదేవాది యజ్ఞశిష్టమై, అమృతమయమైన అన్నమే తినాలి. నిత్యమూ దేవతలనూ, అతిథులనూ పూజించాలి.** ఎప్పుడూ యజ్ఞశిష్టమైన అన్నాన్నే భక్షించాలి. అతిథిసేవనను వ్రతంగా స్వీకరించాలి. శ్రద్ధాళువై నిత్యమూ దేవతలను, బ్రాహ్మణులను పూజించాలి.'

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'ఏ రీతిగా నిత్యోపవాసి కాగలడు ? బ్రహ్మచారి ఎలా అవుతాడు ? విఘసాశి కావాలంటే ఎలా ఉండాలి ? అతిథివ్రతాన్ని ఎలా కొనసాగించగలడు ?' భీష్ముడిలా చెప్తున్నాడు. **'ప్రతిదినమూ ఉదయమూ, సాయంకాలమూ మాత్రమే భుజిస్తూ మధ్యలో ఏమీ తిననివాడు నిత్యోపవాసి. ఋతుకాలమందే భార్యతో సంగమిస్తూ, సత్యవాదియై, జ్ఞాననిత్యుడైన బ్రాహ్మణుడు బ్రహ్మచారియే. ఎప్పుడూ మాంసాన్ని తిననివాడు అమాంసాహారి. నిత్యమూ దానం చేసేవాడు పవిత్రుడు. పగలు ఎప్పుడూ నిదురించనివాడు ఎప్పుడూ మేల్కొనియున్నట్లే. యుధిష్ఠిరా ! నిత్యమూ తాను పోషించవలసిన కుటుంబ సభ్యులు, సేవకులు, అతిథులు భుజించిన తరువాతనే తాను తినేవాడు అమృతభోజను డని గ్రహించు.**

అతిథులకు అన్నం పెట్టకుండా తాను తిననివాడు అతిథిప్రియుడు. దేవతలకు నివేదించకుండా అన్నం తిననివాడు దైవభక్తుడు.

భృత్యులూ, అతిథులు భోజనం చేయకముందు భోజనం చేయని బ్రాహ్మణుడు ఆ పుణ్యఫలంగా స్వర్గలోకాన్ని గెలుచుకొన్నట్లే. దేవతలు, పితరులు, తల్లిదండ్రులు, భృత్యులు, అతిథులు, భోజనం చేయగా మిగిలిన దానినే భక్షించేవాడు విఘసాశి. అటువంటివారికి అక్షయలోకాలు సిద్ధిస్తాయి. బ్రహ్మ దేవుడు, అప్సరసలతో సహా దేవతలు ఆతని ఇంటి చుట్టూ తిరుగుతారు. దేవతలతో, పితరులతో కలిసి భోజనం చేసినవాడు పుత్రపౌత్రులతో ఆనందంగా జీవిస్తారు. వారు ఉత్తమగతులు పొందుతారు.

222. శక్ర ప్రహ్లాద సంవాదము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. పితామహా ! రాజా ! కొందరు బ్రాహ్మణులు రెండుతత్త్వాలనే ప్రతిపాదిస్తున్నారు. కొందరు మూడింటిని, మరికొందరు అనేక తత్త్వాలను చెప్తున్నారు. విశ్వాసమూ కుదరదు. అవిశ్వాసమూ లేదు. బ్రహ్మ అదృశ్యం. శాస్త్రాలు నానావిధాలు. యుక్తులు రకరకాలు నేను దేనిని నమ్మి ప్రవర్తించాలో చెప్పు.' భీష్ముడిలా చెప్తున్నాడు. 'మహాత్ములెందరో తమ తమ శాస్త్రాలలో నిష్ణాతులై ప్రతిపాదనలు చేస్తున్నారు. ఇటువంటి పండితు లెందరో ఉన్నారు. కానీ వారిలో ఎవరు తత్త్వవేత్తలో, ఎవరు పండితులో, ఎవరు కాదో చెప్పటం కష్టం. అన్ని తత్త్వాలను చక్కగా గ్రహించి,

ఇష్టమైనదానిని గ్రహించి పాటించాలి. ఈ విషయానికి సంబంధించి ప్రాచీనేతిహాస మొకటుంది. ఒకప్పుడు భావితాత్మ లయిన ఋషులమధ్య గొప్పవివాదం వీర్పడింది. హిమాలయపర్వత పార్శ్వభాగంలో వ్రతనిష్ఠ లయిన ఋషులు ఆరువేలమంది సమావేశమయ్యారు. వారిలో కొందరు విశ్వం శాశ్వత మన్నారు. కొందరు ఈశ్వరసహిత మన్నారు. మరికొందరు నిరీశ్వర మన్నారు. కొందరు దీనికి ప్రాకృత కారణమేదీ లేదన్నారు. కొందరు అసలు జగత్తు అనేదే లేదన్నారు. కొందరు స్వభావమే జగత్కారణ మన్నారు. కొందరు కర్మమా, మరికొందరు పురుషార్థాన్నీ, కొందరు దైవాన్నీ, ఇంకా కొందరు వీటి నన్నింటినీ కారణమన్నారు. రాజా ! వివిధ శాస్త్ర ప్రవర్తకులు, తమవాదానికి అనుగుణంగా వందలకొలది కారణాలు చూపగలవారు. ఆ బ్రాహ్మణులందరూ స్వాభావికంగానే ఒకరినొకరు గెలవా లనుకొనేవారు.

అప్పుడు వాదిప్రతివాదులలో మౌలికాంశంపై తీవ్ర మయిన ఘర్షణ చెలరేగింది. కొందరు కోపంతో ఇతరుల పాత్రలనూ, దండాలనూ, వల్కలాలనూ, మృగచర్మాలనూ, వస్త్రాలనూ పాడు చేశారు. తరువాత శాంతించిన ద్విజోత్తములు "మాకు సనాతన మార్గాన్ని తెలుపవలసిన" దని వశిష్ఠుని అడిగారు. "ద్విజత్తోములారా ! నాకేమీ తెలియదు" అని వశిష్ఠ డన్నాడు. వారంతా కలిసి "మహాభాగా ! నీవైనా మాకు చెప్పు. నీవు తత్త్వవేత్తవు" అని నారదమహర్షిని అడిగారు. "విప్రులారా ! నాకు తెలియదు. మనమంతా కలిసి ఎక్కడికైనా వెళదాం" అని వారితో పలికి నారదుడు ఇంకా ఇలా అన్నాడు. మోహరహితులై ఈ అమృతతత్త్వాన్ని చెప్పగలవారు ఈ లోకంలో ఎవరున్నారు ?' ఆ సమయంలో అక్కడ ఆ బ్రాహ్మణులు అశరీరవాణిని విన్నారు. "బ్రాహ్మణులారా ! సనత్కుమారుని దగ్గరకు వెళ్ళి అడగండి. ఆయన చెప్పగలడు". ఆ బ్రాహ్మణులలో ఒకడు వేదజ్ఞాన భూషితుడు. వేరు విభాండకుడు. ఆయన ఆ అశరీరవాణిని ఇలా అడిగాడు. "నీ వెవడివి? తాత్త్విక చర్చలో వీర్పడిన వివాదంలో జోక్యం చేసికొంటున్నావు. పైగా కనిపించటం లేదు." అప్పుడు అశరీరవాణిగా ఉన్న సనత్కుమారుడు ఇలా అన్నాడు. 'మహామునీ ! నీవు పండితుడవు. సతతం ఏకరూపంగా విచారణ చేసే పురాతన ఋషిని. సనత్కుమారునిగా నన్ను తెలిసికో. వేదవేత్తలు అక్షయునిగా భావించే పురుషుడను నేనే.' ధర్మజా ! అప్పుడు మహాత్ముడైన విభాండకుడు మరలా ఇలా అన్నాడు.

"ఆది మునిశ్రేష్ఠా ! మాకు కనిపించండి. మాలో తమరే విలక్షణులుగా కనిపిస్తున్నారు. తమ రూపం కనిపించటంలేదు. తమకు కూడా రూపమంటూ ఉంటే అది ఎలాంటిదో తెలియనివ్వండి" అప్పుడు అదృశ్యంగానే ఉన్న ఆ ఆదిముని గంభీరస్వరంతో ఇలా అన్నాడు. 'మునీ ! నీకు చెవిలేదు. ముఖంలేదు. కాళ్ళూ చేతులూ లేవు. పాదాలకు పంజాకూడా లేదు.' మహర్షులతో మాటాడుతూ ఉన్న విభాండకుడు సనత్కుమారుడు తన విషయంలో చెప్పినదంతా వాస్తవమని చూసి మనసా ఆలోచించి ఇలా అన్నాడు. 'మునీ ! ఇలా ఎందుకంటున్నావు. ఇదంతా ఆలోచించే వాడే లేకపోతే ఏమవుతుంది ?' కానీ దానికి సమాధానం ఆ బ్రాహ్మణోత్తములకు వినిపించలేదు. నవ్వుతూ ఆకాశంవైపు చూస్తూనే ఉన్నారు. ఇదంతా ఆశ్చర్యకర మనుకొంటూ వారంతా తమ తమ గణాలతో పాటు మహాగిరి అయిన మేరుపర్వతంపై నున్న సనత్కుమారుని దగ్గరకు పోయారు. వారంతా ఆ పర్వతమెక్కి, ధ్యానమగ్నుడై

నిరంతరాయంగా వేద పారాయణం చేస్తున్న ఆ మహనీయుని. సనత్కుమారుని చూశారు.

రాజేంద్రా ! సంవత్సరకాలం గడచిన తర్వాత ఆ మహాముని సనత్కుమారుడు సాధారణ స్థితికి వచ్చాడు. అప్పుడు బ్రాహ్మణులంతా ఆయనకు నమస్కరించి, నిలిచారు. జ్ఞానంచే కల్మషాలను తొలగించుకొన్న ఆ పూజ్యుడు ఇలా అన్నాడు. 'మునులారా ! అశరీరి మీతో అన్న మాట నాకు తెలుసు. ఇప్పుడు మీ ప్రశ్నలకు సమాధాన మివ్వాలి. మీ కిష్టమయినది అడగండి.' అప్పుడు వారంతా చేతులు జోడించి నిర్మలజ్ఞాననిధి, ద్విజోత్తముడు, మహాముని అయిన సనత్కుమారునితో ఇలా అన్నారు.

'కుమారా ! జ్ఞాననిధి, వరణీయుడు, విశ్వరూపుడూ అయిన ఆ పరమాత్మకై ఎలా యాగాలు చేయగలం ? మహామునీ ! మహానుభావా ! స్వామీ ! మా పై దయచూపండి. జ్ఞాన రూపమయిన అమృతాన్ని కొంచెం దానం చేయండి. సజ్జనులు సమీపించిన వారికి సుఖమే కలిగిస్తారు. విశ్వరూపపద మంటే ఏమిటి ? ఎక్కడుంటుంది? మాకు చెప్పండి.' బ్రాహ్మణులంతా ఇలా ఒత్తిడి చేసిన తరువాత పరబ్రహ్మయందు లగ్న హృదయుడైన ఆ సత్యవేత్త, పూజ్యమహాత్ముడు, సనత్కుమారుడు చెప్పినది చెపుతా విను. వేలమంది మునుల మధ్య కూర్చొని ఆ సనత్కుమారుడు వారి అభ్యర్థన మేరకు ఆనందరూపుడు, సద్రూపుడు అయిన పరమాత్మను గురించి ఇలా చెప్పసాగాడు.

బ్రాహ్మణ శ్రేష్ఠులారా ! అశరీరి ఇంతకుముందు చెప్పిన దంతా సత్యమే. మీరు దానిని తెలియలేక అశరీరితో మాటాడారు. వినండి. పరమాత్మ అన్నింటికీ పరమకారణం. ఆయనయే సర్వమూ అని తెలిసినవాడు భయపడడు, ఎటూ వెళ్ళడు. నేనెక్కడున్నాను ? ఎవరివాడను ? ఎవరివాడను కాదు ? దేనితో ప్రవర్తిస్తున్నాను ? అన్న ఆలోచన లేకుండానే ఆయనను గ్రహించగలడు. ఆ పరమాత్మ సర్వయుగవ్యాపి. ప్రపంచం కన్న భిన్నమైన వాడు. పరమాత్మ కన్న భిన్నమయిన జడపదార్థానికి పారమార్థికంగా ఉనికియే లేదు. గాలి ఒక్కటే అయినా బహుధా ప్రసరిస్తుంది. పక్షిలో, జంతువులో, వ్యాఘ్రంలో, మనుజునిలో, వేణువులో ప్రసరిస్తూ వికల్పరూపమైనా భిన్నరూపాలు పొందుతుంది. అటువంటిదే పరమాత్మ. కానీ జీవాత్మకన్న భిన్నంగా కనిపిస్తుంది. ఆ రీతిగా ఆత్మయే పరమాత్మ. అదియే కదులుతుంది. అదియే సర్వం చూస్తుంది. వింటుంది. ఆఘ్రాణిస్తుంది. మాటాడుతుంది. సూర్యభగవానుని చక్రంలో సర్వదిక్కుల నైపు వదికిరణాలు ఉంటాయి. అవి సూర్యుని నుండి వెలువడి ఆయనవెంటే ప్రసరిస్తుంటాయి. ఆ సూర్యుడు ప్రతిదినమూ ఉదయిస్తాడు. మరల అస్తమిస్తాడు. కానీ ఉదయాస్తమయాలు రెండూ సూర్యునిలో లేవు. శరీరంలోనున్న నారాయణుడు కూడా అట్టివాడే. విప్రేంద్రులారా ! మీ పతనంలో, భక్షణంలో, గమనంలో, పైకిపోవటంలో, క్రిందకు దూకటంలో - ఏ పనిలో అయినా సరే అద్వితీయుడైన ఆ నారాయణుడే నిలిచి ఉంటాడని భావించగలగాలి. ఆయన హిరణ్మయమయిన దివ్యసదనమే పరమపదం. దానిని పొంది ధన్యుల మవుతాం. తనను తానే ప్రకాశింపజేసికొంటాడు ఆయన. తనలో తానే అంతర్యామిగా ఉంటాడు. తుమ్మెద మకరందాన్ని సేకరించేవేళలో తిరుగుతూనే ఉంటుంది. అలాగే జ్ఞాని దేహాభిమానివలె లోకసంగ్రహంకోసం విషయాలను అనుభవిస్తుంటాడు. జ్ఞానికి మోహమూ లేదు, నాశమూ లేదు. పరమాత్మను చక్షువులతో ఎవ్వరూ చూడలేరు. మనస్సుతో, జ్ఞానంతో మాత్రమే పరమాత్మరూపాన్ని చూడగలం. పరమాత్మను మంత్రాలతో

యజించవచ్చు. కానీ ద్విజశ్రేష్ఠుడైన యజమానియే ఆ పని చేయగలడు. అమృత స్వరూపుడైన ఆ పరమాత్మ ధర్మికాదు. అధర్మికూడా కాదు. ఆయన ద్వంద్వాలకు అతీతుడు. మాత్సర్యశూన్యుడు. తాను జ్ఞానతృప్తుడై సుఖంగా శయనించియుంటాడు. ఈ రీతిగా ఆ ప్రభువు మాయద్వారా జగత్తును సృష్టిస్తాడు. మూఢుడు తనకు కారణమైన ఆ పరమాత్మను గూర్చి తెలిసికొనలేడు. తానే ధ్యాత. తానే ద్రష్ట. తానే విచారకుడు. కనిపించే వస్తువులను గ్రహించగలిగేది తానే. సమస్త లోకస్రష్ట, అనంతుడు అయిన ఆ పరమాత్మను ఏ పండితు డెరుగ గలడు ? నాకు చేతనయినంతలో చెప్పాను. ముని శ్రేష్ఠులారా ! ఇక వెళ్ళండి.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'ఈ రీతిగా జ్ఞాన సాగరోత్పత్తికి కారణభూతుడైన ఆ మనోహర రూపుని సనత్కుమారుని నమస్కరించి, దర్శించి ఆ విప్రోత్తములు వెళ్ళిపోయారు. కాబట్టి కొంతేయా ! మహారాజా ! నీవు కూడా జ్ఞాన యోగా సక్తుడవు కమ్ము. జ్ఞానమే సర్వదుఃఖాలనూ పోగొట్టగలది. మహాదుఃఖంలో మునిగిపోయిన మానవుల పరిరక్షణకై పూర్వం పురాణముని, మునిశ్రేష్ఠుడు, మహాత్ముడు అయిన నారాయణఋషి అందించిన జ్ఞాన మిది. ఇది నశించనిది.

యుధిష్ఠిరుడిలా అడిగాడు. 'భారతా ! పితామహా ! పురుషుడు లోకంలో శుభాశుభ కర్మలను చేసి వాటి ఫలితాన్ని అనుభవిస్తున్నాడు. వాస్తవంగా ఆ కర్మలకు తాను కర్త అవుతాడా ? లేదా ? అని సందేహం. దీనికి తాత్త్వికమైన సమాధానాన్ని నీ ద్వారా వినాలనుకొంటున్నాను.' భీష్ముడిలా చెప్తున్నాడు. 'యుధిష్ఠిరా ! ఈ విషయంలో ప్రహ్లాదునకు, ఇంద్రునకు మధ్య జరిగిన సంవాదాన్ని ప్రాచీనేతిహాసంగా ఉదాహరిస్తుంటారు. హిరణ్య కశిపుని కొడుకైన ప్రహ్లాదుడు విషయాసక్తి లేనివాడు. నిష్కలంకుడు. కులీనుడు. బాగా చదువుకొన్నవాడు. గర్వం, అహంకారం లేనివాడు. సత్త్వగుణోపేతుడు. ధర్మరతుడు. నిందాస్తుతులను సమానంగా స్వీకరించేవాడు. నిగ్రహశీలి. ఏకాంత ప్రియుడు. చరాచరప్రాణుల జననమరణాల నెరిగినవాడు. ప్రియాప్రియ విషయాలలో క్రోధహర్షాలు లేనివాడు. బంగార మైనా మట్టి అయినా సమదృష్టి గలవాడు. శ్రేయోదాయకమయిన ఆత్మజ్ఞానంలో స్థిరుడు. ధీరుడు, పరమాత్మ నిశ్చయం గలవాడు, పరావరుడైన బ్రహ్మనెరిగినవాడు, సర్వభూతసమదర్శి సర్వజ్ఞుడు, భక్తుడు, భాగవతుడు, నారాయణ పరాయణుడు, పరమాత్మ ధ్యానతత్పరుడు, విజితేంద్రియుడు. ఒకసారి ఏకాంతంగా ఉన్న ఆ ప్రహ్లాదుని కడకుచేరి, ఆయన ప్రజ్ఞను తెలిసికొనగోరి దేవేంద్రుడు ఇలా అన్నాడు. 'లోకంలో ఏ గుణాలతో పురుషుడు సమ్మానాన్ని పొందగలుగుతాడో ఆ గుణాలన్నీ నీలో స్థిరంగా ఉండటాన్ని గమనిస్తూన్నాం. నీ బుద్ధి బాలురబుద్ధివలె రాగద్వేషరహితమై కనిపిస్తోంది. ఆత్మానుభవం గలవాడవు కాబట్టి నీవిలా నిలువగలుగుతున్నావు. నీ ఆలోచననుబట్టి శ్రేయః ప్రాప్తికి తగిన సాధనమేది ? ప్రహ్లాదా ! పాశాలతో బంధింపబడ్డావు. స్థానభ్రష్టుడ వయ్యావు. శత్రువులకు వశ మయ్యావు. సంపదను

కోలుపోయావు. దుఃఖింపదగిన ఈ స్థితిలో ఎలా దుఃఖపడకుండా ఉన్నావు ? దైతేయా ! నీకు ఇబ్బందులు కలిగినా చూస్తూ కూడా నిశ్చింతగానే నిలిచావు. దీనికి కారణం ఆత్మజ్ఞానమా ? లేక ధైర్యమా ?' అలా ఇంద్రుడు అడుగగా పరమాత్మతత్త్వమెరిగిన ఆ ధీరుడు ప్రహ్లాదుడు తన జ్ఞానాన్ని వర్ణిస్తూ మధురంగా ఇలా పలికాడు.

ప్రహ్లాదు డిలా అన్నాడు. **'ప్రాణుల ప్రవృత్తి నివృత్తుల నెరుగనివాడే అవివేకంతో మోహానికి లోనవుతాడు. ఆత్మసాక్షాత్కారం గలవానికి మోహ ముండదు. సర్వభావాలూ, అభావాలూ కూడా స్వాభావికంగా వస్తుంటాయి, పోతుంటాయి. వాటి విషయంలో పురుష ప్రయత్న మేమీ లేదు. పురుషప్రయత్నమే లేనపుడు ఏ పురుషుడూ కర్త కాదు. కానీ తాను కర్తకాకపోయినా అప్పుడప్పుడు పురుషునకు కర్తృత్వాభిమానం కలుగుతుంది. మంచి పనిలో అయినా, చెడ్డపనిలో అయినా తనము తాను కర్తగా భావించుకుంటే అటువంటి వాని బుద్ధి దోషజుష్టమనీ, తత్త్వజ్ఞాన శూన్యమనీ నా అభిప్రాయం.** దేవేంద్రా ! పురుషుడే కర్త అయితే ఆత్మశ్రేయస్సుకై తాను చేసే పనులన్నీ తప్పక సిద్ధించేవి. ఎప్పుడూ పరాభవమన్నది కలిగేది కాదు. కోరనిది జరగటం, కోరినది జరగకపోవటం కార్యసిద్ధికై ప్రయత్నించే అందరి విషయంలోనూ చూస్తుంటాం, ఇక పురుష ప్రయత్నమెందుకు ? కొందరికి స్వాభావికంగానే అప్రయత్నంగానే అనిష్టం జరగటం, ఇష్ట మయినది నివారింపబడటం చూస్తూనే ఉన్నాం. ఎందరో సౌందర్యవంతులు, బుద్ధిమంతులు కూడా తమకన్న కురూపుల నుండీ, అల్ప బుద్ధుల నుండీ ధనాన్ని పొందాలని ఆశపడుతూ కనిపిస్తూనే ఉన్నారు. శుభ మయినా అశుభ మయినా అన్నీ స్వభావప్రేరణను బట్టి సంభవిస్తుంటాయి. అటువంటి స్థితిలో ఎవరికైనా వాటిపై అభిమానం కలగటానికి కారణ మేమున్నది ? అదంతా స్వాభావికమే అని నా అభిప్రాయం. ఆత్మ నిష్ఠమయిన నా బుద్ధి మరొకతీరున ఆలోచించదు. ఈ లోకంలో శుభాశుభ ఫలప్రాప్తికి కర్మలే కారణమని భావిస్తుంటాం. కాబట్టి కర్మలకు సంబంధించినదంతా చెపుతాను. విను.

ఒక కాకి అన్నాన్ని చూసి, దాన్ని తింటూ ఇతరకాకులకు కూడా అక్కడ అన్నమున్న విషయాన్ని అరిచి చెప్పినట్టు, కర్మలన్నీ తమ స్వభావాన్ని సూచించేవే. వికారాలను (కార్యాలను) మాత్రమే గ్రహించి, పరమప్రకృతిని (స్వభావాన్ని) గ్రహించలేని వానికి అవివేకం వలన మోహం కలుగుతుంది. ప్రకృతిని గ్రహించినవానికి మోహముండదు. భావాలన్నీ స్వభావం నుండి పుట్టేవే. ఈ విషయాన్ని నిశ్చితంగా గ్రహించినవానిని దర్పం కానీ, అభిమానం కానీ ఏమీ చేయలేవు. ఇంద్రా ! ధర్మవిధి నెరుగుదును. ప్రాణులు అనిత్యాలనీ ఎరుగుదును. "ఇదంతా నశించేదే" కాబట్టి దేనిని గురించీ శోకించను.

అహంకారమమకారాలు వీడి, కామనలను వదలి, బంధవిముక్తితో, ఆత్మనిష్ఠుడనై, అనాసక్తుడనై ప్రాణుల జనన మరణాలను చూస్తుంటాను. ఇంద్రా ! నిర్మలబుద్ధినై, జితేంద్రియుడనై; ఆశలను, కోరికలను వీడి, లోకాన్ని ఆత్మస్వరూపంగా భావించే నాకు ఎటువంటి కష్టమూ కలుగదు. ప్రకృతి మీద కానీ, ప్రకృతి వికారాల మీద కానీ నాకు రాగమూ లేదు, ద్వేషమూ లేదు. నాకు ఇప్పుడు శత్రువులూ లేరు, ఆత్మీయులూ లేరు. ఇంద్రా ! ఊర్ధ్వలోకాలపై కానీ, అధోలోకాలపై కానీ, మధ్య లోకాలపై కానీ నాకు కోరికలు లేవు. జ్ఞానం కోసం కానీ, విజ్ఞానం కోసం కానీ, జ్ఞేయం కోసం కానీ నేను చేయవలసినది ఏదీ లేదు.'

శక్రుడిలా అన్నాడు. 'ప్రహ్లాదా ! ఈ ప్రజ్ఞ ఎలా కలుగుతుంది ? ఈ శాంతి ఎలా లభిస్తుంది ? నేను అడుగుతున్నాను. ఆ ఉపాయాన్ని చక్కగా నాకు చెప్పు.' ప్రహ్లాదుడిలా అన్నాడు. **'ఇంద్రా ! ఋజుత్వం వలన, జాగరూకత వలన, ప్రసన్నత వలన, చిత్తస్థైర్యం వలన, వృద్ధసేవ వలన మనుష్యుడు మహత్పదాన్ని పొందుతాడు.** ప్రజ్ఞ స్వభావం వలననే సిద్ధిస్తుంది. స్వాభావికంగానే శాంతి లభిస్తుంది. నీవు చూస్తున్నది ఏదయినా అది స్వాభావికంగానే ప్రాప్తిస్తుంది.' రాక్షసరాజైన ప్రహ్లాదుడు అలా అనగానే ఇంద్రుడు ఆశ్చర్యానికి లోనయ్యాడు. మిగుల ప్రసన్నుడై అప్పుడు ప్రహ్లాదుని వచనాలను ప్రశంసించాడు. త్రిలోకాధిపతి అయిన దేవేంద్రుడు ఆ రాక్షసరాజును పూజించి, ఆయననుండి వీడ్కోలు తీసికొని తననివాసానికి వెళ్ళిపోయాడు.'

223. బలివాసవ సంవాదము - 1.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'పితామహా ! రాజ్యలక్ష్మిని కోలుపోయి, కాలదండోపహతుడైన రాజు ఏ బుద్ధితో లోకంలో సంచరించవలసి ఉంటుంది ? అది నాకు చెప్పు. భీష్ముడు డిలా చెప్తున్నాడు. 'ఈ విషయంలో కూడా గతంలో బలిచక్రవర్తి ఇంద్రుల మధ్య జరిగిన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. ఒకప్పుడు దేవేంద్రుడు అసురులనందరనూ జయించి, బ్రహ్మ దేవుని దగ్గరకు పోయి, నమస్కరించి, చేతులు జోడించి బలిని గురించి ఇలా అడిగాడు. **చతుర్ముఖా ! ఎంతదానం చేస్తున్నా సరే బలిధనాగారం ఎప్పుడూ శూన్యం కాదు. అత డెక్కడున్నాడో తెలియటం లేదు. ఆతని ఉనికిని తెలియజేయి.** చతుర్ముఖా ! ఆ బలి వాయువై, వరుణుడై, సూర్యుడై, చంద్రుడై వారు వారు చేసే పనులన్నీ చేయగలడు. అగ్నియై భూతాలను తపింపజేయగలడు. అవసరమయితే జలంగా మారగలడు. ఆ బలిని గురించి తెలియటంలేదు. ఎక్క డున్నాడో

నాకు చెప్పు. చతుర్ముఖా ! తానే కాలోచితంగా అలసత లేకుండా అన్నిదిక్కులనూ ప్రకాశింపజేయగలడు. అక్కడే అదృశ్యుడై పోగలడు. అక్కడే వర్షాలు కురిపించగలడు. ఆ బలి ఎక్క డున్నాడో తెలియటం లేదు. అతని ఉనికిని తెలుపు.' బ్రహ్మ ఇలా అన్నాడు. 'ఇంద్రా ! బలి ఉనికిని గురించి తెలియజేయమని నీవడగటం బాగా లేదు. అయినా అడిగినప్పుడు అసత్యం చెప్పగూడదు. కాబట్టి నీకు బలినిగురించి చెపుతాను.

ఇంద్రా ! శూన్యమైన ఏ ఇంటిలో ఒంటెగానీ, గోవుగానీ, గాడిద కానీ, అశ్వంగానీ తమజాతిలో శ్రేష్ఠమైనది ఉంటుందో అదే బలినివాసం. శక్రు డిలా అన్నాడు. 'చతుర్ముఖా ! ఏకాంతగృహంలో ఎక్కడైనా బలిచక్రవర్తి కలిస్తే నేను అతనిని చంపేదా ? వద్దా ? నన్ను ఆజ్ఞాపించండి.' బ్రహ్మ ఇలా అన్నాడు. 'ఇంద్రా ! బలిని చంపవద్దు. ఆయన చంపదగినవాడు కాదు. వాసవా ! ఆయన ఇష్టాన్ని అనుసరించి నీవు న్యాయవ్యవహారానికి సంబంధించి ఏమైనా అడగవచ్చు.' 'బ్రహ్మ అలా చెప్పగానే మహేంద్రుడు ఐరావతం ఎక్కి, రాజశోభతో ప్రకాశిస్తూ, భూమిపై తిరుగసాగాడు. ఆ తరువాత బ్రహ్మ చెప్పినట్లుగా ఒక శూన్యగృహంలో ఉన్న బలిని చూశాడు. అప్పుడు బలి ఒక గాడిద వేషం ధరించి, తనను తాను కప్పిపుచ్చుకొని ఉన్నాడు. ఇంద్రుడిలా అన్నాడు. 'దానవా ! గాడిదరూపాన్ని ధరించి పాట్టు తింటున్నావు. ఇది నీచమైన జన్మ. దీనికి నీవు బాధపడుతున్నావా ? లేదా? ఇంతకు ముందెన్నడూ చూడని స్థితిలో నిన్ను చూస్తున్నాను. శత్రువులకు లోబడిపోయావు. రాజలక్ష్మిని, మిత్రులను కోల్పోయావు. బలాన్ని, పరాక్రమాన్ని పోగొట్టుకొన్నావు. గతంలో వేలకొలదిగ వాహనాలపై దాయాదులు నిన్ను చుట్టిముట్టిఉండగా, ప్రజలను తపింపజేస్తూ, మమ్ములెక్క చేయకుండా, తిరిగేవాడివి. దైత్యులంతా నిన్ను ముందుంచుకొని నీ అనుశాసనంలో ఉండేవారు. నీ ఏలుబడిలో నేలను దున్నకుండానే పంటలు పండేవి. ఇప్పడింత సంకట స్థితికి వచ్చావు. దీనికి నీవు బాధపడుతున్నావా ? లేదా ? గతంలో నీవు సముద్రానికి తూర్పు తీరాన నిలిచి భోగాల ననుభవిస్తూ జ్ఞాతులకు ధనాన్ని పంచిపెట్టేవాడవు. అప్పటి నీ మనస్సు ఎలా ఉండేది ? దానవేశ్వరా ! నీవు చాలా సంవత్సరాలు రాజలక్ష్మితో వెలుగొందుతూ విహరిస్తూ గడిపావు. అప్పుడు వేలకొలదిగ దేవకాంతలు నీ చుట్టూ నృత్యం చేసేవారు. వారంతా సువర్ణకాంతితో, పద్మమాలలతో ప్రకాశించేవారు. అప్పటి నీ మనఃస్థితి ఏమిటి ? ఇప్పటి నీ పరిస్థితి ఏమిటి ? ఒకప్పుడు నీకు రత్న భూషితమైన బంగారు గొడుగు ఉండేది. ఆరువేల మంది గంధర్వులు సప్తస్వరాలతో గానం చేస్తూ, నీ ముందు నర్తించేవారు. దైత్యా ! నీవు యాగాలు చేసేటప్పుడు స్వర్ణమయమైన గొప్ప యూపస్తంభ ముండేది. అప్పుడు నీవు పదిపది కోట్ల గోవులను నిరంతరంగా వేలసార్లు దానం చేసే వాడివి.

అప్పుడు నీ మనస్సెలా ఉండేది ? నీవు శమ్యాక్షేప పద్ధతితో భూమినంతా దేవ యజనరూపంలో పరిహరించి వెళ్ళావు. అప్పుడు నీ మనస్సెలా ఉంది ?* అసురాధిపా ! ఇప్పుడు నీ దగ్గర భృంగారం (సువర్ణ పాత్ర విశేషం) లేదు. గొడుగు లేదు. చామరాలు లేవు. బ్రహ్మ ఇచ్చిన దివ్యమాల కూడా కనిపించటం లేదు.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'అప్పుడు బలి ఇంద్రుని మాటలు విని, నవ్వి, భావగాంభీర్యంతో దేవేంద్రునితో ఇలా అన్నాడు. అయ్యో ! దేవేంద్రా ! ఏమి నీ మూర్ఖత్వం ! దేవరాజువైన నీ కిది తగదు. నీ మాటలు కరినంగా ఉన్నాయి. వాసవా ! నీకు భృంగారం కానీ, గొడుగు కానీ, చామరాలు కానీ, బ్రహ్మ ఇచ్చిన దివ్యమాల కానీ కనిపించటం లేదు. గుహలో దాచిన రత్నాలను గురించి నీవు అడుగుతున్నావు. నాకు మంచిరోజులు వచ్చినపుడు నీవు వాటిని చూడగలవు. ప్రస్తుతం నీవు సమృద్ధిగలవాడవు. నేను సమృద్ధిని కోల్పోయిన వాడిని. ఈ స్థితిలో నీవు నా దగ్గర నీ గొప్పతనాన్ని చెప్పుకొనే ప్రయత్నం చేస్తున్నావు. నీ వంశస్థితికి, నీ కీర్తికి ఇది తగినది కాదు. నిర్మల బుద్ధులు, జ్ఞానతృప్తులు, సహనశీలులు, బుద్ధి మంతులు అయిన సజ్జనులు దుఃఖం కలిగినప్పుడు శోకించరు. సంపద కలిగినప్పుడు పొంగిపోరు. దేవేంద్రా ! నీవు మాత్రం సంస్కారహీనతతో ప్రవర్తిస్తున్నావు. నా పరిస్థితివంటి పరిస్థితి నీకు కూడా వీర్పడితే ఇలా మాటాడవు.

224. బలివాసవ సంవాదము - 2.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'భారతా ! అలా పలికి పాముపలె బుసకొడుతున్న బలితో ఇంద్రుడు మరల తన ఉత్కర్షను సూచిస్తూ, నవ్వుతూ ఇలా అన్నాడు. శక్రుడిలా అన్నాడు. 'గతంలో వేలకొలదిగ వాహనాలపై దాయాదులు నిన్ను చుట్టిముట్టియుండగా ప్రజలను తపింపిజేస్తూ మమ్ము లెక్కచేయకుండా తిరిగే వాడివి. బలీ ! ఇప్పుడు దాయాదులు, మిత్రులు నిన్ను వీడిపోగా దయనీయ మయిన నీ స్థితిని చూసి నీవు దుఃఖపడుతున్నావా ? లేదా ? గతంలో లోకాల నన్నింటినీ అదుపులో నుంచుకొని అసామాన్య మయిన ఆనందాన్ని అనుభవించినవాడివి. ఇప్పుడు ఈ ఘోరపతనాన్ని అనుభవిస్తూ దుఃఖపడుతున్నావా ? లేదా ?'

బలి ఇలా అన్నాడు. 'ఇంద్రా ! కాలం స్వాభావికంగానే పరివర్తన శీలం. కాబట్టి ఈ లోకంలో అన్నీ అనిత్యాలే. అందువలన దుఃఖించటం లేదు. ఈ విశ్వమంతా

---

* *విసం॥ పైన సన్నగా మూలంలో లావుగా ఉన్న ముప్పైయారు అంగుళాల దండం శమ్య. బలవంతుడు దానిని విసిరినప్పుడు ఎంత దూరంలో పడుతుందో అంతవరకు ఒక దేవయజనం. ఈ రీతిగా భూమి అంతా శమ్యాక్షేపం ద్వారా పోగా యజనాలు కొలవటానికి చాల లేదు. దానిని పరిహరించి వెళ్ళాడు బలి.* (నీల)

నశించేదేగదా ! సురాధిపా ! ప్రాణుల శరీరా లన్నీ నశించేవే. అందువలన శోకించటం లేదు. ఇంద్రా ! ఇప్పటి ఈ గార్దభదేహం కూడా అపరాధం వలన ఏర్పడినది కాదు. **జీవితమూ, శరీరమూ పుట్టుకతోనే వస్తాయి. రెండూ కలిసే పెరుగుతాయి. రెండూ కలిసే నశిస్తాయి.** నేను కేవలమీ గార్దభశరీరాన్ని పొంది కూడా వివశుడను కాను. ఈ రీతిగా దేహాలు అనిత్యాలనీ, ఆత్మ సంగరహిత మనీ తెలిసిన నాకు బాధ యెందుకు ? వజ్రధారీ ! నదులకు పర్యంతగతి సాగరమే. ప్రాణులకు అంతిమగతి మృత్యువే. ఇది స్పష్టంగా తెలియని నరులు మోహానికి గురి అవుతారు. రజోబుద్ధికి, మోహానికి లోనయినవారు ఈ విషయాన్ని గ్రహించలేరు. బుద్ధి నశించిన వారు మాత్రమే కష్టాలు కలిగినప్పుడు దుఃఖిస్తారు. బుద్ధిమంతుడు తన పాపాల నన్నింటినీ పోగొట్టుకొంటాడు. పాపరహితుడై సాత్త్వికు డవుతాడు. సాత్త్వికుడై ప్రసన్ను డవుతాడు. సత్త్వ గుణభ్రష్టులు మరల మరల జన్మిస్తుంటారు. రజోమోహప్రేరితులై, దీనులై పరితపిస్తుంటారు. అర్థసిద్ధిని కానీ, అనర్థాన్ని కానీ, జీవితాన్ని కానీ, మరణాన్ని కానీ, సుఖాన్ని కానీ, దుఃఖాన్ని కానీ నేను ద్వేషించను, ప్రేమించను. ఎవడయినా మరొకరిని చంపుతున్నా డంటే తాను చచ్చి, చచ్చినవాడిని మరొకడిని చంపుతున్నాడని అర్థం. ఆ ఇద్దరికీ - చంపిన వాడికీ, చచ్చిన వాడికీ - కూడా ఆత్మను గురించి తెలియదు. ఇంద్రా ! ఒకడిని చంపి, లేదా జయించి మరొకడు తన పౌరుషానికి గర్విస్తుంటాడు. కానీ వాస్తవంగా అక్కడ తనకు కర్తృత్వమే లేదు. జగత్కర్త అయిన పరమాత్మయే అన్నింటికీ కర్త. విశ్వసృష్టినీ, విశ్వసంహారాన్ని ఎవరు చేస్తున్నారు ? అవి ప్రాణుల కర్మలను బట్టియే చేయబడుతున్నాయి. ఆ కార్యానికి కూడా ప్రయోజకుడు పరమేశ్వరుడే.

ప్రాణుల శరీరం పాంచభౌతికం. పృథివి, తేజస్సు, ఆకాశం, నీరు, వాయువు - ఈ అయిదు శరీరానికి కారణాలు. ఇక దానిని గురించి బాధపడట మెందుకు ? మహావిద్యావంతుడు, విద్యాహీనుడు, బలవంతుడు, బలహీనుడు, అందగాడు, కురూపి, సౌభాగ్యవంతుడు, దౌర్భాగ్యుడు - అందరినీ గంభీరమయిన కాలం తన తేజస్సుతో లోబరచుకొంటుంది. సర్వమూ కాలాధీనమైనపుడు అంతా నశ్వరమని తెలిసిన నాకు బాధ యెందుకు ? కాలం దహించిన దానినే అగ్ని వెంటపడి దహిస్తుంది. కాలోపహతుడే ఇతరులచే చంపబడతాడు. కాలం నశింపజేసిన దానినే ఇతరులు నశింపజేయగలరు. కాలనిర్ణీతమైన దానినే మనిషి పొందగలుగుతాడు. సముద్రంలో ద్వీపాలు ఉంటాయి. కాలానికి అటువంటి ద్వీపాలు కూడా కనిపించవు ? ఇక అంతం ఎలా తెలుస్తుంది. కాలానికి అవతలి ఒడ్డు అసలు కనిపించదు. ఎంత ఆలోచించినా విధాత అయిన ఆ

దివ్యకాలం అంతు చిక్కటం లేదు. ఇంద్రా ! నా ఎదుటనే కాలం భూతాలను నశింపజేయకపోతే అప్పుడు నాకు ఆనందమూ, గర్వమూ, ఆ కాలం మీద కోపమూ కలుగుతాయి. శూన్యగృహంలో గార్దభరూపాన్ని ధరించి, పాట్టు తింటున్న నన్ను గుర్తించి, నా దగ్గరకు వచ్చి నిందిస్తున్నావు. నేను తలచుకొంటే నా రూపాలను రకరకాలుగా మార్చగలను. ఆ నా భీకర రూపాలను చూసి, నీవు పారిపోవలసి వస్తుంది. ఇంద్రా ! కాలమే అన్నింటినీ గ్రహిస్తుంది. కాలమే అన్నింటినీ నియంత్రిస్తుంది. సర్వవిధాత కాలమే. కాబట్టి పౌరుషాన్ని చూపించి గర్వించవద్దు. పురందరా ! గతంలో నేను కోపిస్తే ప్రపంచమంతా కలతపడేది. ఈ లోకం యొక్క సనాతన ధర్మం నాకు బాగా తెలుసు. నీవు కూడా అలాగే చూడు. ఆశ్చర్యపడవద్దు, పుట్టుక కానీ, ప్రభావం కానీ ఎప్పుడూ మన చేతిలోనివి కావు.

ఇంద్రా ! నీ మనస్సు ఇంకా చిన్నపిల్లల మనస్సు వలెనే ఉన్నది. అప్పు డెంతో ఇప్పుడూ అంతే. ఎదగలేదు, ఈ విషయం మీద మనస్సు పెట్టి నైష్ఠికబుద్ధిని అలవరచుకో. వాసవా ! దేవతలు, మనుష్యులు, పితరులు, గంధర్వులు, నాగులు, రాక్షసులు - అందరూ నా అధీనంలో ఉండేవారు. అదంతా నీకు తెలుసు. నా శత్రువులు బుద్ధిమాత్సర్యంవలన మోహితులై కూడా 'విరోచన సుతుడయిన బలి ఉన్న దిక్కునకు నమస్కారం' అంటూ నన్ను శరణుజొచ్చేవారు. **శచీపతీ ! నేను నా పతనాన్ని గురించి కొంచెం కూడా దుఃఖించటం లేదు. సర్వశాసకుడైన పరమేశ్వరుని వశంలో నేనున్నానని స్థిరంగా భావిస్తున్నాను.** ఉన్నత వంశంలో పుట్టి, సౌందర్యవంతుడై, ప్రతాప వంతుడై కూడా తమ అమాత్యులతో సహా దయనీయంగా గడిపే మనుషులు కూడా కనిపిస్తుంటారు. అది అలా జరుగవలసి ఉంటుంది. ఇంద్రా ! హీనవంశంలో పుట్టి, మూఢుడై, దుష్ప్రవర్తనుడై కూడా తన అమాత్యులతో కలిసి సుఖంగా జీవించటాన్నీ చూస్తున్నాం. అది అలా జరుగవలసి ఉంది. ఇంద్రా ! శుభలక్షణాలు గల సుందరి విధవయై కనిపిస్తుంది. అవలక్షణాలు గల కురూపి సుమంగలియై కనిపిస్తుంది. ఇంద్రా ! నీవు ఇలా ఉన్నత స్థితిలో ఉన్నావు. నేను ఇలా హీనస్థితిలో ఉన్నాను. వజ్రధారీ ! ఇది నీవు చేసినదీ కాదు, నేను చేసినదీ కాదు. శతక్రతూ ! నేను ఈ రూపంలో ఉండటానికి కారణమైన కర్మ నేను చేసినది కాదు. సమృద్ధి కానీ, దారిద్ర్యం కానీ వంతులవారీగా అందరికీ సంక్రమిస్తాయి. ఇప్పుడు నీవు దేవరాజపదాన్ని పొంది శ్రీమంతుడవై, తేజస్వివై విరాజిల్లుతూ నా మీదనే గర్జిస్తున్నావు. చూస్తూనే ఉన్నాను. కానీ కాలం నన్ను ఆక్రమించి లోబరచుకొనకున్నట్లయితే ఈ పాటికి నీవు వజ్రమెత్తినా సరే నా పిడికిలితో నిన్ను పడవేసి ఉండేవాడిని. అయితే ఇది పరాక్రమాన్ని ప్రకటించే కాలం కాదు నాకు. శాంతి కాలం మాత్రమే. కాలమే అన్ని

అవస్థలనూ కలిగిస్తుంది. అలాగే కాలమే అన్నిటినీ పక్వానికి తెస్తుంది. నేను కూడా గతంలో దానవరాజుల పూజలందుకొని, గర్జిస్తూ, ప్రతాపాన్ని ప్రదర్శించినవాడనే. అటువంటి నన్నే కాలం ఆక్రమించగలిగితే ఇతరుల నెవ్వరిని అది ఆక్రమించకుండా వదలుతుంది ?

దేవరాజా ! మీరంతా మహాత్ము లనే ఆ ద్వాదశాదిత్యుల తేజస్సును ధరించారు. వారందరి తేజస్సును నేను ఒక్కడనే ధరించాను. **వాసవా ! నేనే సూర్యుడనై నీటిని పైకి పంపేవాడను. నేనే మేఘమై వర్షించేవాడను. నేనే ముల్లోకాలనూ తపింపజేసేవాడను. నేనే మెరుపుగా ప్రకాశించేవాడను.** నేనే రక్షించేవాడను. నేనే దొంగలను దోచేవాడను. నేనే దానాలు చేసేవాడను. నేనే పన్నులు స్వీకరించేవాడను. నేనే ప్రభువునై, పాలకుడనై లోకాలను నిరోధించేవాడను, నియంత్రించేవాడను. అమరాధిపా ! ఇప్పుడు ఆ నా ప్రభుత్వమంతా పోయింది. కాలసైన్యం నన్ను ఆక్రమించింది. నాటివైభవ మేదీ ఇప్పుడు కనిపించదు. శచీపతీ ! దీనికి నీవు కానీ, నేను కానీ, మరెవ్వరూ కానీ కర్త కాదు. ఇంద్రా ! కాలం తన ఇష్టాన్ని అనుసరించి, వంతులవారీగా లోకాలను భుజిస్తుంది. వేదవేత్తలయిన పురుషులు మాసాన్నీ, పక్షాన్నీ కాల శరీరమంటారు. అహోరాత్రాలు దాని వస్త్రాలు. ఋతువులు దాని ద్వారం. (మనస్సు, ఇంద్రియాలు). సంవత్సరం దాని ముఖం. అది ఆయుస్స్వరూపం. కొందరు పండితులు తమ బుద్ధిబలంతో ఇదంతా కాలబ్రహ్మ మంటారు. దాని నలాగే ఆలోచించాలి. పైన చెప్పిన అయిదు ఆలోచనకు విషయాలు. అయిదు భేదాలు గల ఆ కాలాన్ని గూర్చి నాకు తెలుసు. అనంత జల సంపన్నమైన సముద్రంవలె ఆ కాలబ్రహ్మ గంభీరమైనది, అనంతమైనది. దానికి ఆద్యంతాలు లేవు. అదే అక్షరం, అదే క్షరం కూడా. తత్త్వవేత్తలు కాలస్వరూపమయిన పరబ్రహ్మ రూప రహితమయినా కూడా సమస్త ప్రాణులలోనూ జీవుని ప్రవేశ పెడుతుందని నిశ్చయంగా చెపుతారు. కాల స్వరూపమైన బ్రహ్మయే సర్వప్రాణుల అవస్థలనూ తారుమారు చేస్తుంటాడు. ఎటువంటివారూ ఆ మహాత్ముని అర్థం చేసికొనలేరు. కాలాన్ని ఎదిరించి ఎవ్వరూ ఏమీ చేయలేరు. సర్వప్రాణులకూ కాలమే గతి. దానిని కాదని నీవు ఎక్కడకు పోగలవు ? పరుగెత్తినా దానికి దూరం కాలేవు. నిలిచిఉన్నా దాని పట్టునుండి తప్పించుకొనలేవు. పంచేంద్రియాలు కూడా పంచధావిభక్త మయిన దానిని అనుభవంలోనికి తేలేవు. కొందరు కాలాన్ని అగ్ని అంటారు. కొందరు ప్రజాపతి అంటారు.

కొందరు కాలాన్ని ఋతువులు, నెలలు, పక్షాలు, దినాలు, క్షణాలు, పూర్వాహ్ణం, అపరాహ్ణం, మధ్యాహ్నం అంటుంటారు. కొందరు ముహూర్త మంటుంటారు. అది ఒక్కటే పలురకాలుగా వ్యవహారం. సమస్త విశ్వమూ దేనికి లొంగి ఉంటుందో అదే కాలమని

గ్రహించు. వాసవా ! శచీపతీ ! నీలాగే బలవీర్య సంపన్నులైన ఇంద్రులు వేలకొలదిగ గడచిపోయారు. శక్రా ! అత్యంత బలశాలివిగా, శక్తి సంపన్నుడవుగా నిన్ను నీవు భావించుకొంటున్నావు. కానీ నీ సమయం వచ్చినప్పుడు మహాపరాక్రమ సంపన్నమైన కాలం నిన్ను కూడా శాంత పరుస్తుంది. కాలమే ఈ సర్వజగత్తును లొంగదీసి కొంటుంది. కాబట్టి నీవు నిదానంగా నిలు. నేను కానీ, నీవు కానీ, మన పితరులు కానీ కాలాన్ని అతిక్రమించలేరు. పరమోత్తమమయిన ఈ రాజ్యశ్రీని పొంది అది నీ దగ్గర స్థిరంగా నిలుస్తుందను కొంటున్నావు. అది భ్రాంతి మాత్రమే. సంపద ఎప్పుడూ ఒక్కచోట స్థిరంగా నిలువదు. ఇంద్రా ! నిన్ను మించిన వేలవేలమంది దగ్గర ఈ రాజశ్రీ నిలిచింది. నా దగ్గర కూడా నిలిచింది. ఇప్పుడు నన్ను వీడి నీ దగ్గరకు చేరింది. శక్రా ! ఇంకెప్పుడూ ఇలా ప్రవర్తించవద్దు. శాంతంగా ఉండు. నిన్ను కూడా నావంటివాని గానే భావించి ఈ రాజశ్రీ వెంటనే మరొకరి దగ్గరకు పోతుంది.'

225. శ్రీ సంనిధానము.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'అప్పుడు మహాత్ముడైన బలిశరీరం నుండి కాంతిమతియై, మూర్తిమతియై, నిష్క్రమిస్తున్న లక్ష్మిని ఇంద్రుడు చూశాడు. పాకశాసనుడైన ఇంద్రుడు కాంతితో విరాజిల్లుతున్న ఆ లక్ష్మిని చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు. వికసించిన కళ్ళతో బలిని ఇలా అడిగాడు.

శుక్ర :- బలీ ! జడవేసికొని వెలుగొందుతూ నీ శరీరం నుండి నిష్క్రమిస్తున్న ఈమె ఎవరు ? అంగదాలు ధరించి అందంగా ప్రకాశిస్తోంది.

బలి :- వాసవా ! ఆమె రాక్షసస్త్రీయో, దేవకాంతయో, మానవకాంతయో నాకు తెలియదు. నీవే ఆమె నడుగు. లేదా అడగకు. నీ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించు.

శుక్ర :- శుచిస్మితా ! జడ ధరించి ప్రకాశిస్తూ బలినుండి నిష్క్రమిస్తున్న నీ వెవర్తెవు ? నాకు తెలియదు. చెప్పు. నీ తేజస్సుతో నన్ను కూడా ప్రకాశింపజేస్తూ నిలిచిన నీ వెవర్తెవు ? సుభ్రూ ! రాక్షస రాజును వీడి వెళ్తున్నా వెందుకు ? అడుగుతున్నాను చెప్పు.

శ్రీ :- నా గురించి విరోచనునకూ తెలియదు. ఆయన కొడుకైన బలికీ తెలియదు. నన్ను దుస్సహ అంటారు. విధిత్స అని కూడా నన్నంటారు. వాసవా ! నన్ను భూతి అనీ, లక్ష్మి అనీ, శ్రీ అని కూడా అంటారు. శక్రా ! నీవు నన్ను తెలియవు. దేవతలందరికీ కూడా నా గురించి తెలియదు.

శుక్ర :- దుస్సహా ! ఇంతకాలం బలిశరీరంలో ఉన్నావు. ఇప్పుడు బలిని వీడి వెళ్తున్నావు. ఇది నా కోసమా ? బలికోసమా?

శ్రీ :- శుక్రా ! ధాత కానీ, విధాత కాని నన్ను ఏ రీతిగానూ ప్రయోగించలేరు. బలిని వీడటానికి కాలం సమీపించింది. కాలాన్ని అవహేళన చేయవద్దు.

శుక్ర :- శిఖండినీ ? బలిని ఎందుకు ఎలా వదలుతున్నావు ? శుచిస్మితా ! నీవు నన్నెందుకు వదలటం లేదు. నాకు చెప్పు.

శ్రీ :- నేను సత్యంలో, దానంలో, వ్రతంలో, తపస్సులో, పరాక్రమంలో, ధర్మంలో నిలుస్తాను. బలి వాటి కన్నింటికీ విముఖు డయ్యాడు. ఒకప్పుడు బలి బ్రాహ్మణహితైషి, సత్యవాది, జితేంద్రియుడు. కానీ బ్రాహ్మణులను తక్కువగా చూసి, ఎంగిలి చేత్తో నేతిని ముట్టుకొన్నాడు. అప్పుడు నిత్యమూ యాగాలు చేసేవాడు. కానీ కాలపీడితుడై, మూఢుడై "నా గురించియే యాగాలు చేయండి" అని లోకులను శాసించాడు. ఇంద్రా ! అందుకని ఆయనను వీడి నీలో వసిస్తున్నాను. వాసవా ! జాగరూకతతో, తపస్సుతో, పరాక్రమంతో నన్ను నిలుపుకోవాలి.

శుక్ర :- లక్ష్మీ ! దేవతలలో కానీ, మనుష్యులలో కానీ, సర్వ ప్రాణులలో కానీ ఒంటరిగా నిన్ను భరించగల పురుషు డెవ్వడూ లేడు.

శ్రీ :- పురందరా ! దేవతలు కానీ, గంధర్వుడు కానీ, అసురుడు కానీ, రాక్షసుడు కానీ ఒంటరిగా నన్ను సహించగలవాడు ఒక్కడూ లేడు.

శుక్ర :- శుభా ! నీవు ఎప్పుడూ నాలోనే నిలిచి ఉండే దారి ఏది ? అది చెప్పు. నీ మాటను యథాతథంగా పాటిస్తాను. నీవే నాకు చెప్పగలదానవు.

శ్రీ :- దేవేంద్రా ! నీలో నిత్యమూ నిలిచి ఉండే ఉపాయం చెపుతాను. విను. వేదోక్తమైన విధానంతో నన్ను నాలుగు భాగాలు చెయ్యి.

శుక్ర :- లక్ష్మీ ! నా శరీరబలాన్నీ, మనోబలాన్నీ అనుసరించి నిన్ను ధరిస్తాను. కానీ నన్నెప్పుడూ వీడకూడదు. మానవలోకంలో సమస్త ప్రాణులనూ ఉద్భవింపజేసి ధరించేది భూమియే. నీ పాద భారాన్ని ఆ భూమి భరిస్తుంది. ఆ సామర్థ్యం భూమికున్నదని నా భావం.

శ్రీ :- ఇంద్రా ! నా పాదాన్ని ఒకదాన్ని భూమిపై ఉంచుతున్నాను. దాని నక్కడే నిలిపాను. నా రెండవ పాదాన్ని అలాగే నిలిపే ఏర్పాటు చేయి.

శుక్ర :- మానవలోకంలో నీళ్ళు అన్ని దిక్కులకూ ప్రవహింపగలవి. అవి నీ పాదాన్ని భరిస్తాయి. ఆ సామర్థ్యం వాటి కుంది.

శ్రీ :- ఇంద్రా ! నా పాదాన్ని నీటిపై నుంచుతున్నాను. దానినక్కడే నిలిపాను. మూడవ పాదాన్ని అలాగే నిలిపే ఏర్పాటు చేయి.

శుక్ర :- వేదాలు, యజ్ఞాలు, దేవతలు అగ్నిలో ప్రతిష్ఠింపబడ్డారు. నీ మూడవ పాదాన్ని ఆ అగ్ని చక్కగా ధరించగలడు.

శ్రీ :- ఈ పాదాన్ని అగ్నిపై ఉంచుతున్నాను. దాని నక్కడే నిలిపాను. ఇంద్రా ! నా నాలుగవ పాదాన్ని అలాగే నిలిపే ఏర్పాటు చేయి.

శుక్ర :- మానవలోకంలో బ్రాహ్మణ హితైషులు, సత్యవాదులు అయిన సత్పురుషు లున్నారు. వారు నీ పాదభారాన్ని చక్కగా ధరింప సమర్థులు.

శ్రీ :- నా ఈ పాదాన్ని సజ్జనులపై నుంచుతున్నాను. దాని నక్కడే నిలిపాను. ఇంద్రా ! ఇదే రీతిగా సమస్త ప్రాణులలోనూ నిలిపి నన్ను రక్షించు.

శుక్ర :- సమస్త ప్రాణులలోను నేను నిలిపిన నిన్ను ఎవరయినా పీడిస్తే వారిని దండిస్తాను. నా మాటను వారందరూ వినాలి.

ఆపై లక్ష్మి తనను విడిచివెళ్ళగా బలి ఇలా అన్నాడు. సూర్యుడు తూర్పున ఉదయించినంత కాలం దక్షిణ, పశ్చిమ, ఉత్తర దిక్కులను కూడా ప్రకాశింపజేస్తాడు. సూర్యుడు మధ్యాహ్న వేళలో మాత్రమే నిలిచి, పశ్చిమదిక్కుకు వెళ్ళినప్పుడు మరల దేవాసుర సంగ్రామం జరుగుతుంది. అప్పుడు దేవతలను ఓడిస్తాను. ఇంద్రా ! సూర్యుడు ఒకేస్థానంలో - బ్రహ్మలోకంలో - నిలిచి సమస్తలోకాలనూ తపింపజేసినప్పుడు జరిగే దేవాసుర సంగ్రామంలో నీపై గెలుస్తాను.

శక్రు డిలా అన్నాడు. 'బలీ ! నిన్ను చంపవద్దని బ్రహ్మ నన్ను ఆదేశించాడు. లేకపోతే నీ తలమీద వజ్రాన్ని విడిచేవాణ్ణి. దైత్యేంద్రా ! నీ ఇష్టం వచ్చిన చోటికి వెళ్ళు. మహాసురా! నీకు మేలు జరుగుతుంది. మధ్యాహ్న కాలంలో మాత్రమే సూర్యుడు తపింపజేసే రోజు ఎప్పుడూ రాదు. బ్రహ్మ ఇంతకు ముందే సూర్యునకు నియమాన్ని ఏర్పరచాడు. ఆ నియమాన్ని అనుసరించి సూర్యుడు ఎప్పుడూ ప్రజలను తపింపజేస్తూ తిరుగుతూనే ఉంటాడు. సూర్యుని గమనం ఆరునెలలు ఉత్తరాయణం, మరో ఆరునెలలు దక్షిణాయనం. లోకంలో శీతోష్ణాలను కలిపి ఇస్తూ సూర్యుడు ఆ మార్గాలలో పయనిస్తాడు.' భీష్ము డిలా అన్నాడు. 'భారతా ! దైత్యేంద్రుడైన బలితో ఇంద్రుడు అలా అనగా బలి దక్షిణ దిక్కుకూ, ఇంద్రుడు ఉత్తర దిక్కుకూ వెళ్ళిపోయారు. అనహంకార మని వ్యవహరింపబడే ఈ బలివచనాలను విని సహస్రాక్షుడు మరల గగనతలానికి ఎగిరిపోయాడు.'

226. శక్రనముచి సంవాదము.

భీష్ముడిలా అన్నాడు. 'యుధిష్ఠిరా ! ఈ విషయానికే సంబంధించిన ఇంద్ర నముచి సంవాదాన్ని ప్రాచీనేతిహాసంగా ఉదాహరిస్తుంటారు. ఒకప్పుడు దైత్యేంద్రు డయిన నముచి శ్రీని కోల్పోయాడు. అయినా కలతపడని సముద్రం వలె గంభీరంగా ఉన్నాడు. ప్రాణుల అభ్యుదయ పరాభవాల నెరిగినవాడు తాను. ఆయన దగ్గరకు వెళ్ళి ఇంద్రు డిలా అన్నాడు. నముచీ ! రాజ్యాన్ని కోల్పోయావు. పాశాలతో బంధింపబడ్డావు. శత్రువులకు లోబడ్డావు. సంపద పోయింది. ఈ స్థితిలో దుఃఖపడుతున్నావా ? లేదా ?'

నముచి ఇలా అన్నాడు. 'శోకాన్ని నిగ్రహించకపోతే శరీరం తపించి పోతుంది. శత్రువులు ఆనందిస్తారు. శోకం నుండి గట్టెక్కడానికి ఎవ్వరూ సహాయపడరు. అందువలన నేను శోకించటం లేదు. ఇంద్రా ! ఈ ప్రపంచమంతా నశించేదే. సంతాపంవలన రూపం నశిస్తుంది. సంతాపంవలన సంపద నశిస్తుంది. సంతాపంవలన ఆయుస్సు తగ్గుతుంది. ధర్మం కూడా నశిస్తుంది. కాబట్టి జ్ఞాని వైమనస్యం వలన పుట్టిన దుఃఖాన్ని తొలగించుకొని, కళ్యాణమయుడై హృదయంలోనున్న పరమాత్మను ధ్యానించాలి. **పురుషుడు కళ్యాణ స్వరూపుడైన పరమాత్మపై మనస్సు నుంచితే అతని మనోరథాలన్నీ నిస్సంశయంగా నెరవేరుతాయి.*** జగత్తునకు శాసకు డొక్కడే. రెండవవాడు లేడు. గర్భస్థ శిశువును కూడా ఆ శాసకుడు శాసించగలడు. నీరు పల్లానికి ప్రవహించినట్లు ప్రాణి ఆ శాసకుని అభీష్టం మేరకే పయనిస్తుంది. ఈశ్వర ప్రేరణ ఎలా ఉంటే అలా పని చేస్తుంటాను. ప్రాణుల అభ్యుదయ పరాభవాలు నాకు తెలుసు. ఉత్తమతత్త్వం కూడా తెలుసు. జ్ఞానం వలననే శ్రేయస్సు కలుగుతుందనీ తెలుసు. కానీ దానికై ప్రయత్నించను. ధర్మబద్ధాలో, అధర్మ సంగతాలో - ఎటువంటివైనా సరే - ఆశలను మనస్సులో నుంచుకొని పరమాత్మ ప్రేరణ ఎలా ఉంటే అలా పని చేస్తుంటాను. ఏది ఎలా లభించవలసి ఉంటే అది అలా లభిస్తుంది. ఏది ఎలా జరుగవలసి ఉంటే అది అలా జరుగుతుంది. **ఏ గర్భంలో నివసించాలని బ్రహ్మ వ్రాస్తాడో ఆ గర్భవాసంలోనే జీవుడు నివసిస్తాడు. అంతేకానీ తాను స్వయంగా కోరుకొన్న గర్భంలో నివసించ లేడు.** "నేను ఇప్పుడే అవస్థను పొందాను. నాకు ఇది ఇలా జరుగవలసినదే" అన్న ఆలోచన ఎప్పుడూ మనస్సులో ఉంటే ఆ మనిషి ఎప్పుడూ మోహానికి లోనుకాడు. **వంతుల వారీగా వచ్చే సుఖ దుఃఖాలతో మనిషి బాధపడతాడు. కానీ అక్కడ**

---

* యదా యదా హి పురుషః కల్యాణే కురుతే మనః ।
తదా తస్య ప్రసిధ్యంతి సర్వార్థా నాత్ర సంశయః ॥ 7

ఎవ్వరి తప్పులేదు. కాని పురుషుడు ఆ దుఃఖాన్ని ద్వేషిస్తూ కర్తృత్వాహంకారాన్ని పొందటమే దుఃఖానికి కారణం. లోకంలో ఋషులు కావచ్చు, దేవతలు కావచ్చు, మహోసురులు కావచ్చు, వేదజ్ఞాన వృద్ధులు కావచ్చు, అరణ్యంలోని మునులు కావచ్చు. వీరిలో ఎవరిని ఆపదలు లొంగదీయటం లేదు ? సదసద్వివేకం గలవారు భ్రాంతికి లోనుగారు.

పండితుడు కోపించడు. ఆసక్తి పడడు. దుఃఖించడు. సంతోషించడు. ఆర్థికమైన ఇబ్బందులలో కానీ, కష్టాలలో కానీ శోకించడు. స్వభావం చేత హిమాలయంవలె నిశ్చలంగా ఉంటాడు. గొప్ప ప్రయోజనం కలిగినా మోహం కలుగదు. అలాగే కష్టకాలంలో సంకట మేర్పడినా మోహానికి లోనుకాడు. ఆ రీతిగా సుఖమైనా, దుఃఖమైనా తటస్థంగా సేవించే నరుడే ధురంధరుడు. పురుషుడు ఏయే అవస్థను పొందినా పరితపించకుండా దానిలో ఆనందించాలి. అదే విధంగా సంతాపహేతువులైన పెద్ద పెద్ద కోరికల నన్నింటినీ మనస్సునుండి గెంటివేయాలి. **పురుషుడు ప్రవేశించి నిర్భయంగా నిలువగల సభ కానీ, పరిషత్తు కానీ, సమాజం కానీ ఏదీ లేదు. ధర్మతత్త్వం తెలిసి, దానిని సొంతం చేసికొన్న వాడే బుద్ధిమంతుడు, ధురంధరుడు కూడా.** మహాత్ముని పనులను సాధారణ జనులు గ్రహించలేరు. అటువంటి అసాధారణ కర్మ కర్త, ప్రాజ్ఞుడు మోహపడవలసిన వేళలో కూడా మోహపడడు. అంతటి వృద్ధుడు గౌతమముని ఇబ్బందులకు గురియై స్థాన భ్రష్ట డయినా కూడా మోహపడలేదు. తనది కాని వస్తువును మనిషి మంత్రబలంతో కానీ, పరాక్రమంతో కానీ, ప్రజ్ఞతో కానీ, పౌరుషంతో కానీ, శీలంతో కానీ, నడవడితో కానీ, అర్థసంపదతో కానీ పొందలేడు. ఆ విషయంలో బాధపడటమెందుకు ? నేను పుట్టక ముందే బ్రహ్మ నాకోసం నిర్ణయించిన దానినే పుట్టిన తర్వాత నేను అనుసరిస్తున్నాను, అనుసరిస్తాను కూడా. ఇక మృత్యువు నన్నేం చేయగలదు. **మనిషి ప్రారబ్ధాన్ని బట్టి పొందవలసివదే పొందుతాడు. చేరవలసిన చోటికే చేరుతాడు. దుఃఖమైనా, సుఖమైనా అనుభవించవలసివ దానినే అనుభవిస్తాడు. ఇదంతా తెలిసి, మోహానికి లోనుకానివాడే ఉత్తమ మానవుడు. ఎన్ని కష్టాలయినా అటువంటివాడు కుశలంగానే ఉంటాడు. ఎటుచూసినా ధనవంతుడు అతడే.**

227. బలివాసవ సంవాదము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'రాజా ! భరతర్షభా ! బంధునాశంవలన గానీ, రాజ్యనాశం వలన కానీ తీవ్ర సంకటంలో పడిన పురుషునకు శ్రేయోదాయకమైన మార్గమేది ? ఈ లోకంలో మాకు తమరే గొప్పవక్త. తమరిని అడుగుతున్నాను. నాకు చెప్పవలసినది.'

భీష్ముడిలా చెప్తున్నాడు. 'రాజా ! భార్యాపుత్రులకు దూరమై, సుఖాలను కోల్పోయి, ఘోర సంకటంలో పడినవానికి ధైర్యమే శ్రేయోదాయకం. ధైర్యంగా ఉన్నప్పుడే దుఃఖకారణంగా శరీరం నశించదు. బాధపడకుండటం సుఖాన్ని కలిగిస్తుంది. సుఖం ఉత్తమారోగ్యాన్ని కలిగిస్తుంది. శరీరం ఆరోగ్యంగా ఉంటే మరల సంపదను పొందగలడు. నాయనా ! బుద్ధిమంతుడు ఎప్పుడూ సాత్త్విక ప్రవృత్తిని ఆశ్రయిస్తాడు. అప్పుడే ఐశ్వర్యమూ, ధైర్యమూ, కర్మ ప్రవృత్తి కలుగుతాయి. యుధిష్ఠిరా ! ఈ విషయంలో మరల బలివాసవ సంవాద రూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. పూర్వం దైత్యులనూ, దానవులనూ నశింపజేసిన దేవాసుర సంగ్రామం ముగిసింది. విష్ణువు వామనరూపంలో ముల్లోకాలనూ ఆక్రమించాడు. నూరుయాగాలు చేసిన ఇంద్రుడు దేవరాజు అయ్యాడు. దేవతలు ఆరాధింపబడుతున్నారు. నాల్గువర్ణాలు తమ తమ ధర్మాన్ని పాటిస్తున్నాయి. లోకాలు వృద్ధి చెందుతున్నాయి. బ్రహ్మ ప్రీతిచెందాడు. ఆ రోజుల్లో దేవరాజైన ఇంద్రుడు అందమయిన నాలుగు దంతాలతో, దివ్యశోభతో నున్న తన గజేంద్రాన్ని-ఐరావతాన్ని- ఎక్కి, మూడులోకాలలో సంచరించేవాడు. ఆయన చుట్టూ రుద్రులు, వసువులు, ఆదిత్యులు, అశ్వినులు, మహర్షులు, గంధర్వులు, నాగులు, సిద్ధులు అందరూ ఉండేవారు. ఆ వజ్రి ఒకానొకప్పుడు సముద్రతీరాన ఉన్న ఒక కొండగుహలో విరోచనుని కుమారుడైన బలిని చూసి, ఆయన దగ్గరకు వెళ్ళాడు. దేవగణాలు చుట్టూ నడవగా ఐరావతంపై ఎక్కి వస్తున్న దేవరాజును - ఇంద్రుని - చూసి, దైత్యరాజు (బలి) దుఃఖించలేదు, బాధపడలేదు. అవికారుడై నిర్భయంగా నిలిచియున్న బలిని చూసి, ఐరావతాన్ని అధిష్ఠించియున్న దేవేంద్రుడు ఇలా అన్నాడు. దైత్యా ! నా ఔన్నత్యాన్ని చూసి కూడా నీవు బాధపడటం లేదు. కారణ మేమిటి ? శౌర్యమా ? వృద్ధ సేవయా ? తపస్సు వలన కలిగిన అంతఃకరణ నైర్మల్యమా ? ఎటు చూసినా ఇది అంత తేలికైన విషయం కాదు. బలీ ! శత్రువులచే లొంగదీసి కొనబడి, ఉత్తమ స్థానం నుండి భ్రష్టుడవయ్యావు. బాధపడవలసిన ఈ స్థితిలో కూడా బాధపడ వెందుకు ? సాటివారిలో శ్రేష్ఠుడవై, పరమోత్తమ భోగాలను అనుభవించావు. ఇప్పుడు సంపదనూ, రాజ్యాన్ని కోలుపోయావు. అయినా ఎందువలన బాధపడటం లేదు ? చెప్పు. వంశపారంపర్యంగా వచ్చిన రాజ్యాన్ని అధిష్ఠించి గతంలో లోకపాలకుడ వయ్యావు. అటువంటి నీవు ఇప్పుడు శత్రువులు నీ రాజ్యాన్ని అపహరించినా బాధపడ వెందుకు ? వరుణుని పాశాలతో బంధింపబడ్డావు. వజ్రంచేత కొట్టబడ్డావు. నీ భార్యనూ, నీ ధనాన్ని కూడా అపహరించారు. అయినా ఎందుకు బాధపడవో చెప్పు. రాజ్యశ్రీని కోల్పోయావు. వైభవాన్ని కోల్పోయావు. అయినా నీవు బాధపడటం లేదు. ఇది అంత తేలికయిన విషయంకాదు.

త్రైలోక్య రాజ్యం పోయిన తరువాత మరొక డయితే బ్రతకాలని కూడా అనుకోడు.' ఈ విధంగా, ఇంకా అనేకరీతులుగా పరుషంగా మాటాడి తనను అవమానిస్తున్న ఇంద్రుని మాటలను ఆనందంగా విని, విరోచన సుతుడైన బలి తొట్రుపడకుండా ఇలా సమాధాన మిచ్చాడు.

శక్రా ! నేను కట్టుబడియున్న సమయంలో ఇంతలా మాటాడితే నీకేం లాభం ? పురందరా ! ఈ రోజు నీవు వజ్రాన్ని ఎత్తి, నాముందు నిలిచినట్లు నాకనిపిస్తోంది. ఒకప్పుడు నీవు అశక్తుడవు. ఏదోరీతిగా శక్తిమంతుడ వయ్యావు. ఇంతక్రూర మయిన మాటలను నీవు తప్ప మరెవడు పలుకగలడు ? వీరుడై కూడా తనకు లొంగి, తన చేతికి చిక్కిన శత్రువుకు హాని చేయగలిగి కూడా దయచూపేవాడే ఉత్తమ పురుషు డంటారు. ఇద్దరు గొడవపడి యుద్ధం చేస్తుంటే ఫలితాన్ని ఎవ్వరూ ముందే నిర్ణయించలేరు. ఎవడో ఒకడే గెలుస్తాడు. రెండోవాడు ఓడిపోతాడు. దేవశ్రేష్ఠా ! నీ స్వభావ మిలా ఉండకూడదు. సర్వ ప్రాణులకూ ప్రభువైన బలిని నా పరాక్రమంతో నేనే ఓడించానని నీవు భావింపరాదు. శక్రా ! వజ్రధారీ ! నీవు ఆ స్థితిలో ఉన్నా, నేను ఈ స్థితిలో ఉన్నా అది నేను చేసినదీ కాదు, నీవు చేసినదీ కాదు. నీవిప్పు డున్నట్లు నేనొకప్పుడు ఉండేవాడిని. నేను ఇప్పుడున్న స్థితికి నీవు రేపు చేరవచ్చు. కాబట్టి "నేను చాలా గొప్ప పని చేశా"నని నీవు భావించుకొంటూ నన్ను పరాభవించవద్దు. **శక్రా ! సుఖదుఃఖాలు వంతులవారీగా పురుషుని చేరుతుంటాయి. నీవంతు వచ్చి నీవు ఇంద్రుడ వయ్యావే కానీ నీ పరాక్రమం వలన కాదు.** కాలమే నాకు చెడ్డరోజులు కల్పించింది. కాలమే నీకు మంచిరోజులు కల్గించింది. కాబట్టి ఇప్పుడు నీవున్నట్లు నేను లేను. నేనున్నట్లు నీవు లేవు. తల్లిదండ్రుల సేవ కానీ, దేవతల పూజ కానీ, మరేదయినా సత్ప్రవర్తన కానీ కాలం కలిసి రాకపోతే మనిషిని సుఖపెట్టలేవు. కాలపీడితుడైన నరుని విద్య కానీ, తపస్సు కానీ, దానం కానీ, మిత్రులు కానీ, బంధువులు కానీ రక్షించలేరు. **బుద్ధిబలంతో తప్ప, మరెన్ని ఉపాయాలతో ఎన్ని అడ్డంకులు కల్పించినా మనుషులు రాబోయే అనర్థాన్ని ఆపలేరు.** కాలక్రమాన్ని బట్టి తన వంతువచ్చినపుడు బాధపడ వలసిన వానిని ఎవ్వడూ కాపాడలేడు. అయితే ఇంద్రా ! నీ పరిస్థితికి నీవే కారణమని భావించటం మాత్రం అది విచారించ దగిన విషయం.

పనిచేస్తున్నవాడు తానే కర్త అయితే దానిని కల్పించే వాడు ఎప్పుడూ మరెవ్వడూ ఉండడు. కానీ అది ఇతరుల చేతనే చేయబడుతోంది. కాబట్టి కాలం తప్ప మరెవ్వరు దానికి కర్త కాదు. కాలం వలననే నేను నిన్ను గెలిచాను. కాలం వలననే నీవు నన్ను ఓడించావు. నడిచేవారిని తోడునడిచి నడిపించేది కాలమే. కాలమే ప్రజలను సంహరిస్తుంది.

ఇంద్రా ! నీవు పామరబుద్ధితో ఎప్పుడో ఒకప్పుడు నీవు నశించటాన్ని గ్రహింపలేకున్నావు. కొందరు నిన్ను నీ శక్తితోనే గొప్పవాడ వయినావని భావిస్తుంటారు. లోకప్రవృత్తుల నెరిగిన నా వంటివెవ్వడూ కాలం దెబ్బతీసినా దుఃఖించడు, మోహానికి లోనుకాడు, భ్రాంతికి గురికాడు. నేనయినా, నావంటివాడయినా కాలంచేత ఆక్రమింపబడినప్పుడు, బుద్ధి విపత్తులలోపడి బ్రద్దలయిన నౌకవలె శిథిల మవుతుంది. శక్రా ! నేనయినా, నీవయినా, సురాధిపత్యాన్ని పొందిన మరెవరయినా ఇప్పటికే వందల కొలది ఇంద్రులు వెళ్ళిన బాటలోనే వెళ్తారు. ఈ రీతిగా తిరుగులేనివాడవై, పరమకాంతితో వెలిగిపోతూ ఉన్న నిన్ను కూడా కాలం ముంచుకొని వచ్చినప్పుడు కాలమే నన్ను భ్రష్టుని చేసినట్లు నిన్ను కూడా భ్రష్టుని చేస్తుంది. యుగయుగంలోనూ వేలకొలదిగ దేవేంద్రులు కాలంలో కలిసిపోయారు. కాలాన్ని అతిక్రమించగలగటం కష్టం. నీవు ఇటువంటి శరీరాన్ని పొంది సర్వభూత సృష్టికర్త అయిన శాశ్వతపరబ్రహ్మను వలె నిన్ను నీవు భావించుకొంటున్నావు. ఎవ్వరి పదవీ నిశ్చలమూ కాదూ, శాశ్వతమూ కాదు. నీవు మాత్రం మూఢమతివై ఈ పదవి ఎప్పుడూ నీదే అనుకొంటున్నావు. సురేశ్వరా ! నమ్మదగని రాజ్యాదులను నీవు నమ్ముతున్నావు. కాలం పైబడిన వాడు ఇలాగే భావిస్తాడు. నీవు మోహంవలన "ఈ రాజ్యలక్ష్మి నాదే" అనుకొంటూ దానిని పొందాలనుకొంటున్నావు. కానీ ఇది నీదీ కాదు, నాదీ కాదు. మరెవ్వరిదగ్గరా కూడా ఇది ఎప్పుడూ స్థిరంగా ఉండదు. ఈ రాజ్యలక్ష్మి ఎందరినో దాటుకొంటూ ఇప్పుడు నీ దగ్గరకు వచ్చింది. ఇంద్రా ! ఇది చంచల. కొంతకాలం నీదగ్గర నిలిచి ఆపై నీళ్ళు త్రాగే తావును వీడి గోవు వెళ్ళినట్లు మరొకరి దగ్గరకు చేరుతుంది. ఇంతవరకు లెక్కించడానికి వీలుకానంత మంది రాజులను అతిక్రమించిపోయింది రాజ్యలక్ష్మి. పురందరా ? నీ తరువాత కూడా ఎంతోమంది రాజులుంటారు. గతంలో ఎంతో మంది వృక్ష - ఓషధి - రత్న - జంతు - వనాలతో కూడిన ఈ భూమిని అనుభవించారు. వారెవ్వరూ ఇప్పుడు కనిపించరు. పృథువు, ఐలుడు (పురూరవుడు), మయుడు, భీముడు, నరకుడు, శంబరుడు, అశ్వగ్రీవుడు, పులోముడు, స్వర్భానువు, అమిత ధ్వజుడు, ప్రహ్లాదుడు, నముచి, దక్షుడు, విప్రచిత్తి, విరోచనుడు, హ్రీనిషేవుడు, సుహోత్రుడు, భూరిహుడు, పుష్పవంతుడు, వృషుడు, సత్యేషుడు, బుషభుడు, బాహువు, కపిలాశ్వుడు, విరూపకుడు, బాణుడు, కార్తస్వరుడు, వహ్ని, విశ్వదంష్ట్రుడు, నైకృతి, సంకోచుడు, వరీతాక్షుడు, వరాహశ్వుడు, రుచిప్రభుడు, విశ్వజిత్తు, ప్రతిరూపుడు, వృషాండుడు, విష్కరుడు, మధువు, హిరణ్యకశిపుడు, కైటభుడు - ఇంకా ఎందరో దైత్యులు, దానవులు, రాక్షసులు ఈ భూమికి పాలకులయ్యారు. ప్రాచీనులు, మరీ మరీ ప్రాచీనులు అయిన

వీరూ, మరెందరో దైత్యదానవరాజులు, ఇతర రాజులు - పేరుకూడా తెలియనివారు - కాలపీడితులై ఈ నేలను వీడి వెళ్ళిపోయారు. **కాలమే మన కన్న శక్తిమంత మైనది.**

నూరుయాగాలు చేసినవాడవు నీవొక్కడవే కాదు. వారంతా శతక్రతులే. వారంతా ధర్మపరులు కూడా. ఎప్పుడూ యజ్ఞదీక్షితులే. అందరూ గగనసంచారులే. అందరూ శత్రువులను ఎదుర్కొన్నవారే. వారంతా బలమైనవారే. లోహదండాలవంటి బాహువులు గలవారే. అందరూ వందల కొలదిగ మాయల నెరిగినవారే. అందరూ కామరూపులే. యుద్ధంచేసి ఓడిపోయినట్లుగా వారెవ్వరిని గురించి వినలేదు. అందరూ సత్యనిష్ఠగలవారు. అందరూ స్వేచ్ఛగా విహరించిన వారే. అందరూ వేదవ్రతాసక్తులే. అందరూ చక్కగా చదువుకొన్నవారు. అందరూ పాలకులై మనోవాంఛాసిద్ధిని పొందినవారే. ఆ మహాత్ములకు ఎవ్వరకు అప్పుడెప్పుడూ ఐశ్వర్య గర్వం లేదు. వారు యోగ్యతలను బట్టి దానం చేసినవారు. ఈర్ష్యా ద్వేషాలు లేనివారు. వారంతా సర్వప్రాణులతోనూ తగినరీతిగా ప్రవర్తించారు. వారందరూ దాక్షాయణికి, కశ్యపప్రజాపతికి పుట్టిన బిడ్డలు. మహాబలశాలులు. వారంతా ఒక వెలుగువెలిగి, లోకాలను తపింపజేసి కాలానికి లొంగి పోయిన వారే. నీవు కూడా అంతా అనుభవించి రాజ్యాన్ని వదలి వెళ్ళవలసినవాడవే. ఇంద్రా ! అప్పుడు నీకు కలిగే ఏడుపును నీవు ఆపుకొనలేవు. **కామభోగాలమీద కోరికను వీడు. ఐశ్వర్య గర్వాన్ని వదలిపెట్టు. అప్పుడు నీ రాజ్యాన్ని కోల్పోతే ఆ దుఃఖాన్ని తట్టుకోగలవు. నీవు శోకకాలంలో శోకించవద్దు. హర్షసమయంలో పొంగిపోవద్దు. భూతాన్ని, భవిష్యత్తునూ వదలి వర్తమాన కాలంలో లభించిన దానితో జీవించు.** ఇంద్రా ! నేను ఎప్పుడూ జాగరూకతతో నున్నవాడను. అయినా అలసతలేని కాలం నన్నుకూడా ఆక్రమించింది. నిన్ను కూడా త్వరలో ఆక్రమిస్తుంది. ఇలా అంటున్నందుకు నన్ను క్షమించు.

దేవేంద్రా ! నన్ను బెదిరిస్తున్నట్లుగా నీమాటలతో నన్ను నరుకుతున్నావు. నేను నిగ్రహంతో ఉన్నాను. కాబట్టి నిన్ను నీవు చాలా గొప్పవాడ ననుకొంటున్నావు. కాలం ముందు నన్ను వెంటాడింది. ఇకపై నీవెంట బడుతుంది. దేవేంద్రా ! నేను ముందుగా కాలపీడితుడనయ్యాను కాబట్టి నీవు నాముందు గర్జిస్తున్నావు. నేను కోపిస్తే యుద్ధంలో నా ఎదుట నిలువగలవాడు లోకంలో ఎవ డున్నాడు ? వాసవా ? బలవంతమైన కాలం నన్ను లొంగదీసింది. అందుకే నా ఎదుట నిలువగలిగావు.

దేవతల కాలం వేయి సంవత్సరాలు ముగియబోతుంది. అప్పటివరకే నీవు ఇంద్రుడవు. నేను బలశాలినయినా ఇప్పుడు నా శరీరాంగాలు కుదురుగా లేవు. నేను ఇంద్రపదవిని కోల్పోయాను. నీవిపుడు ఇంద్రుడవై ఉన్నావు. కాలవైపరీత్యం వలన ఈ

విచిత్ర జీవలోకంలో నీవు ఇప్పుడు పూజింపబడుతున్నావు. ఏంచేసి నీవు ఇంద్రుడ వయ్యావు ? ఏ కారణంవలన నేను ఇంద్రపద భ్రష్టుడ నయ్యాను ? కలిగించేది కాలమే, నశింపజేసేది కాలమే. మిగిలినదేదీ కారణం కాదు. అందుకే పండితుడు నాశమో, వినాశమో, ఐశ్వర్యమో, సుఖమో, దుఃఖమో, అభ్యుదయమో, పరాభవమో. ఏది పొందినా ఆనందించడు, కలతపడడు. ఇంద్రా ! నేనేమిటో నీకు తెలుసు. నీవేమిటో నాకు తెలుసు. అయినా సిగ్గులేకుండా నిన్ను నీవు పొగడుకొంటున్నావు. కాలమే ఇదంతా చేయిస్తోంది. అప్పటి నా పౌరుష మెటువంటిదో నీకే అందరికన్న బాగా అప్పుడే తెలుసు. యుద్ధంలో నా పరాక్రమాన్ని ఎన్నోమార్లు చూశావు. ఒక ఉదాహరణం చెపుతాను. శచీపతీ ! పూర్వం దేవాసుర సంగ్రామ సమయంలో నేను ఆదిత్యులను, రుద్రులను, సాధ్యులను, వసువులను, దేవతలను జయించాను. శక్రా ! నీకు తెలుసుకదా ! మూకుమ్మడిగా వచ్చిన దేవతలనందరినీ నేను యుద్ధంలో భంగపరిచాను. వనాలు, వనవాసులతో సహా ఎన్నో పర్వతాలను మీ మీదకు విసిరాను. బండలతో, శిఖరాలతో సహా ఎన్నో కొండలను నీ తలమీద బ్రద్దలు చేశాను. ఇప్పుడు నేనేమీ చేయలేను. కాలాన్ని అతిక్రమించటం కష్టం. నీవు వజ్రధారివయినా పిడికిలితో చంపగలను. కానీ చంపా లనుకోవటం లేదు. ఇది సహించవలసిన సమయమే కానీ పరాక్రమానికి కాలం కాదు.

అందువలననే ఇంద్రా ! ఇప్పుడు నిన్ను క్షమిస్తున్నాను. నిజానికి ఇప్పుడయినా నీవు నన్ను సహించలేవు. అటువంటి నాకు కాలం ముంచుకొని వచ్చింది. కాలాగ్ని చుట్టుముట్టింది. కాలం నియంత్రించి, బంధించింది. ఇంద్రా ! అందువలననే ప్రగల్భాలు పలుకగలుగుతున్నావు. ఆ భయంకర కాల పురుషుని లోకాలు అతిక్రమించలేవు. పశువును త్రాటితో బంధించినట్లు అతడు నన్ను బంధించి ఉన్నాడు. లాభం కానీ, నష్టం కానీ, సుఖం కానీ, దుఃఖం కానీ, కామక్రోధాలు కానీ, అభ్యుదయ పరాభవాలు కానీ, చావు కానీ, బంధం కానీ, బంధమోక్షణం కానీ అన్నీ కాలంవల్లనే జరుగుతాయి. నేనూ కర్తను కాను. నీవూ కర్తవు కావు. అన్నింటికీ నిత్యమూ కర్తయై, సమర్థమైన కాలం చెట్టు మీది పండునువలె నన్ను పక్వస్థితికి తెచ్చింది. పురుషుడు కాలసహకార మున్నప్పుడు ఏ పనులు చేసినా సుఖంగా ఉంటాడు. కాలం సహకరించక పోతే అవే పనులు దుఃఖాన్ని కలిగిస్తాయి. కాల మహిమ నెరిగినవాడు కాలానికి లోనయి దుఃఖ పడవలసివచ్చినా దుఃఖించడు. ఇంద్రా ! అందువలననే నేను శోకించటం లేదు. కష్టాల నుండి బయటపడటానికి శోకం సహాయపడదు. **శోకించేవాడి శోకం బాధలను పోగొట్టలేదు. శోకించే వాడి శక్తి కూడా నశిస్తుంది. అందుకని నేను శోకించటం లేదు.'**

బలి అలా పలుకగా సహస్రాక్షుడు, పాకశాసనుడు, శతక్రతుడు, పూజ్యుడు అయిన దేవేంద్రుడు కోపాన్ని నిరోధించుకొని ఇలా అన్నాడు. 'వజ్రాన్నీ, వరుణ పాశాలను ధరించి పైకెత్తిన నా చేతిని చూస్తే చంపడానికి వచ్చిన మృత్యువుకు కూడా బుద్ధి కలతపడుతుంది. ఇతరుల విషయం చెప్పేదేముంది ? కానీ నీ బుద్ధి నిశ్చలం. తత్త్వ మెరిగినది కాబట్టి చలించటం లేదు. సత్యపరాక్రమా ! నీవు ధైర్యంవలననే నిశ్చితంగా వ్యధ చెందటం లేదు. విశ్వమంతా వినాశంవైపు కదలటం చూసి కూడా ఏ పురుషుడు ధన వైభవాల మీద కానీ, శరీరం మీద కానీ విశ్వాసం పెట్టుకొంటాడు ? నేను కూడా అలాగే సర్వవ్యాపీ, అవినాశీ, భీకరమూ, కాలాగ్ని పతితమూ అయిన ఈ లోకాన్ని క్షణభంగురంగా భావిస్తున్నాను. కాలం స్పృశించిన తరువాత తప్పించుకొనే అవకాశం ఎవ్వరికీ ఉండదు. సూక్ష్మభూతా లయినా, మహాభూతా లయినా కాలాగ్నిలో పక్వం కావలసిందే ! వీటికి కూడా పరిహార ముండదు. కాలం ఎవ్వరికీ లొంగదు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుంది. ప్రాణులను పక్వానికి తెస్తుంటుంది. దానికి తిరుగులేదు. కాలానికి ఎర అయినవాడు తప్పించుకొనే దారిలేదు. ప్రమత్తు లయిన ప్రాణులలో అప్రమత్తమై మేల్కొని ఉంటుంది కాలం. ఎంతప్రయత్నించినా కాలాన్ని వెనకకు మరల్చగలగటం ఇంతవరకూ ఎవ్వరూ చూడలేదు. కాలం అనాది, సనాతనం, ధర్మస్వరూపం, సర్వప్రాణులపై సమదృష్టిగలది కాలం. దానికి పరిహారం కానీ, దానిని అతిక్రమించటం కానీ లేదు. వడ్డీవ్యాపారం చేసేవాడు వడ్డీ లెక్క గట్టినట్లు కాలం కూడా అహోరాత్రాలను, మాసాలను, క్షణాలను, కాష్ఠలను, లవాలను, కళలను కూడా లెక్కగట్టి పీడిస్తుంది. **'ఈ పని ఈ రోజు చేస్తాను. మిగిలినది రేపు చేస్తాను' అనే వాడిని నదీవేగం చెట్టును కూల్చినట్టు కాలం పైబడి హరిస్తుంది.** "నేను వాడినిప్పుడే చూశానే ! ఎలా చనిపోయాడు" ? అని కాలోపహతులను గూర్చిన మాటలు మనుషుల మధ్య వినిపిస్తుంటాయి. సంపదలు నశిస్తాయి. భోగాలు నశిస్తాయి. స్థానమూ, ఐశ్వర్యమూ నశిస్తాయి. అలాగే ప్రాణుల జీవితాన్ని కూడా మిదికి వచ్చి కొనిపోతుంది కాలం. పడేదాకానే పైకి ఎక్కేది. మరణం దాకానే జీవించేది. కనిపించేదంతా నశించేదే. అస్థిరమే అయినా దానిని మననం చేయగలగటం దుష్కరం. నీ బుద్ధి స్థిరమైనది. తత్త్వ మెరిగినది. కాబట్టి నీవు వ్యధ చెందటం లేదు. 'నేను ఒకప్పుడు అలా ఉండేవాడిని' అన్న ఆలోచన కూడా నీ మనస్సులో లేదు. బలీయమయిన కాలం లోకాన్ని ఆక్రమించి, అందరినీ పక్వంచేస్తున్నప్పుడు పెద్ద, చిన్న అన్న భేదమేమీ ఉండదు. కాలాగ్నిలో పడిపోతున్నవాడు ఆ విషయాన్ని కూడా గ్రహించలేడు.

ఈర్ష్య, అభిమానం, లోభం, కామం, క్రోధం, భయం, స్పృహ, మోహం, అభిమానం - వీటిలో మునిగి లోకం మోహానికి గురి అవుతుంది. నీవు విద్వాంసుడవు, జ్ఞానివి, తపస్వివి, పదార్థ తత్త్వం తెలిసినవాడవు, కరతలామలకం వలె కాలాన్ని స్పష్టంగా చూడగలవు. కాలచారిత్ర తత్త్వవేత్తవు. సర్వశాస్త్ర విశారదుడవు. వివేచనలో నిపుణుడవు. జ్ఞానులు కోరదగినవాడవు. నీవు నీ బుద్ధితో లోకాన్ని అంతటినీ గ్రహించావని నేను అనుకొంటున్నాను. అంతటా విహరిస్తూ కూడా అన్ని వీడినవాడవు నీవు. దేని మీదా నీకు ఆసక్తి లేదు. నీవు జితేంద్రియుడవు కాబట్టి రజోగుణం కానీ తమోగుణం కానీ నిన్ను స్పృశించలేవు. హర్షరహితమూ, సంతాపరహితమూ, సర్వప్రాణులకూ మిత్రమూ, వైరరహితమూ, శాంతచిత్తమూ అయిన ఆత్మను నీవు ఉపాసిస్తున్నావు. నిన్ను చూసిన తరువాత నీపై నాకు దయ కలుగుతోంది. ఇంతటి జ్ఞానిని బంధించి, చంపాలని నేను కోరుకొనటం లేదు. క్రౌర్యం లేకపోవటం ఉత్తమధర్మం. నీపై నాకు దయ కలిగింది. కొంతకాలం తరువాత నిన్ను బంధించిన ఈ వారుణపాశాలు తమంతతామే విడిపోతాయి. మహాసురా ! ప్రజలలో సదాచారం నశించినప్పుడు నీకు మేలు కలుగుతుంది.

వృద్ధురాలయిన అత్తచేత కోడలు పరిచర్యలు చేయించుకొన్నపుడు, మోహవశుడైన కొడుకు తండ్రికి పనులు చెప్పి చేయించుకొన్నప్పుడు, శూద్రులు బ్రాహ్మణులచే కాళ్ళు పట్టించుకొన్నప్పుడు, శూద్రులు నిర్భయంగా బ్రాహ్మణ స్త్రీలను పెళ్ళాడినప్పుడు, పురుషులు హీన జాతులలో పిల్లలను కన్నప్పుడు, కంచుపాత్రలలో సర్వజాతులూ కలిసి భోజనాలు చేసినప్పుడు, అపవిత్రపాత్రలతో దేవతలకు బలిఇచ్చినప్పుడు, నాల్గువర్ణాల వారందరూ హద్దులను అతిక్రమించినప్పుడు నీ పాశాలు ఒక్కొక్కటిగా విడిపోతాయి. నావలన భయపడనవసరం లేదు. సమయానికై వేచి చూడు. బాధలు లేకుండా, రోగాలు లేకుండా స్వస్థచిత్తంతో సుఖంగా ఉండు.' ఈ రీతిగా పలికి పూజ్యుడైన దేవేంద్రుడు ఐరావతాన్ని ఎక్కి వెళ్ళాడు. అసురుల నందరనూ జయించి, ఆయన సురాధిపుడై, ఏకచ్ఛత్రాధిపతియై ఆనందించాడు. ఆ సమయంలో సమస్త చరాచరజగత్తుకు ప్రభువైన దేవేంద్రుని మహర్షు లెంతగానో కొనియాడారు. అగ్నిదేవుడు యాగహవ్య వాహకు డయ్యాడు. ఇంద్రుడు సేవకు లర్పించిన అమృతాన్ని ఆస్వాదించాడు. సర్వత్ర చరించగల ద్విజశ్రేష్ఠుల స్తుతులనంది దీప్తతేజస్కుడై, క్రోధశూన్యుడై, ప్రశాంతచిత్తుడై, ప్రసన్నుడై ఇంద్రుడు స్వర్గలోకాన్ని పొంది, ఆనందించాడు.'

228. శ్రీవానవ సంవాదము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'రాజా ! పితామహా ! ఎదగబోయేవానిలో, పతనం చెందబోయేవానిలో ముందుగా కనిపించే లక్షణాలేవి ? నాకు చెప్పు.' **భీష్ము డిలా చెప్తున్నాడు. 'ఎదగబోయే వానికైనా, పతనం చెందబోయేవానికైనా వారి మనస్సే పూర్వ లక్షణాలను ప్రకటిస్తుంది. నీకు మేలు కలుగుగాక !** యుధిష్ఠిరా ! ఈ విషయంలో కూడా గతంలో ఇంద్రునకూ, లక్ష్మికి మధ్య జరిగిన సంవాదాన్ని ప్రాచీనేతిహాసంగా ఉదాహరిస్తుంటారు.

ఒకప్పుడు పాపరహితుడు, మహాతపస్వి అయిన నారదుడు ముల్లోకాలలో స్వేచ్ఛగా సంచరించసాగాడు. ఆయన తన తపః ప్రభావంతో ఊర్ధ్వనిమ్నలోకాలను చూడగలడు. బ్రహ్మలోకంలో నివసించే మహర్షులతో సమానుడై బ్రహ్మవలె మిక్కిలిగా ప్రకాశించే తేజస్సు కలవాడు. ఒకసారి ఉదయకాలాన లేచి, పవిత్రోదకంలో స్నానం చేయాలనుకొని ధ్రువద్వారం నుండి ప్రవహించే గంగ ఒడ్డుకు పోయి, గంగలో దిగాడు. అదే సమయంలో పాకశంబరాసురలను చంపిన సహస్రాక్షుడు - ఇంద్రుడు కూడా నారదుడున్న గంగా తీరానికి వచ్చాడు. ఆ ఇద్దరూ గంగలో మునిగి, ఏకాగ్రచిత్తంతో సంక్షేపంగా జపాన్ని పూర్తిచేసి, ఒడ్డుకు చేరారు. అక్కడి ఇసుక రేణువులు చిన్న చిన్నవి కానీ స్వర్ణమయాలు. ఒడ్డున కూర్చొని వారిద్దరూ పుణ్యాత్ములు, దేవర్షులు, మహర్షులు చెప్పిన కథలను చెప్పుకోసాగారు. ఇద్దరూ అదేధ్యాసతో ప్రాచీనగాథలను చర్చించుకొంటున్నారు. అంతలో తన కిరణసమూహాలతో వెలుగొందుతూ భాస్కరుడు ఉదయించాడు. సంపూర్ణ సూర్యమండలాన్ని చూసి, వారు లేచి బయలుదేరారు. ఉదయిస్తున్న సూర్యునకు దగ్గరగా రెండవ సూర్యునివలె ఒక జ్యోతి కనిపించింది. అది అగ్నిజ్వాలవలె ప్రకాశిస్తోంది. భారతా ! అది ఇంద్రనారదుల సమీపానికి వస్తూ కనిపించింది. ఆ జ్యోతి విష్ణువుయొక్క విమానం. తన కాంతితో మూడులోకాలనూ ప్రకాశింపజేస్తున్న ఆ విమానం సాటిలేనిది. గరుడుడు, సూర్యుడు చరించే గగనమార్గాన అది వెళుతోంది. ఆ విమానంలో కమలదళాలపై కూర్చొని ప్రకాశిస్తున్న లక్ష్మిని ఆ ఇద్దరూ చూశారు. ఆమె ముందు దివ్యసౌందర్యంగల అప్సరసలున్నారు. ఆమె సూర్యునివలె, అగ్ని జ్వాలవలె విరాజిల్లుతోంది. ఆమె నగలు నక్షత్రాలవలె మెరుస్తున్నాయి. ముత్యాల వంటి హారాలను ఆమె అలంకరించుకొని ఉన్నది. స్త్రీలలో పరమోత్తమమహిళ అయిన ఆ లక్ష్మి విమానంనుండి దిగి, దేవర్షిఅయిన నారదుని, ఇంద్రునీ సమీపించింది. రాజా ! ముందు నారదుడు, ఆ వెనుక చేతులుజోడించి, ఇంద్రుడు లక్ష్మీదేవి వైపు వెళ్ళారు. తమను తాము లక్ష్మికి తెలుపుకొంటూ నిరుపమానంగా

పూజించారు. ఆపై సర్వవేత్త అయిన దేవేంద్రుడు లక్ష్మితో ఇలా అన్నాడు.

'చారుహాసిని ! నీవు ఎవరవు ? ఎందుకు వచ్చావు ? ఎక్కడ నుండి వస్తున్నావు ? కళ్యాణీ ! ఎక్కడకు వెళ్తున్నావు ?'

శ్రీ ఇలా అన్నది. 'మూడు పుణ్యలోకాలలోనూ చరాచర ప్రాణులందరూ నన్ను పొందాలని పరమోత్సాహంతో ప్రయత్నిస్తుంటారు. నేను సర్వప్రాణులకూ సంపదలను సమకూర్చాలని సూర్యకిరణాలవలన వికసించిన కమలంలో పుట్టిన పద్మాలయను, శ్రీని, పద్మను. బలసూదనా (ఇంద్రా) ! నేనే లక్ష్మిని. నేనే సంపదను. నేనే శ్రీని. శ్రద్ధ, మేధ, సంనతి, విజితి, స్థితి, ధృతి, సిద్ధి, కాంతి, స్వాహా, స్వధా, సంస్తుతి, నియతి, స్మృతి - అన్నీ నేనే. యుద్ధంలో విజయాన్ని పొందే రాజుల సేనలకుముందు, ధ్వజాలపై, ధర్మశీలుల నివాసాలలో, రాజ్యాలలో, నగరాలలో నేను నివసిస్తాను. బలసూదనా ! రణరంగంలో వెనుకంజవేయక విజయశీలుడై, శూరుడైన రాజు దగ్గర ఎడబాయక నిలుస్తాను. నిత్యమూ ధర్మాన్ని పాటిస్తూ మహాబుద్ధిమంతుడై, బ్రాహ్మణ భక్తుడై, సత్యభాషణుడై, వినయశీలుడై, దాతృత్వంగల పురుషునిలో కూడా సదా నేను నివసిస్తాను. సత్యధర్మాలకు బద్ధురాలనై గతంలో అసురుల దగ్గరున్నాను. వారి ప్రవృత్తి విపరీతంగా మారటాన్ని గ్రహించి నీదగ్గర ఉండదలచాను.' శక్రు డిలా అన్నాడు. 'వరాననా ! దైత్యులు ఎలా ఉన్నప్పుడు వారియందు నివసించావు ? ఏ వైపరీత్యాన్ని వారిలో చూసి దైత్యదానవులను వీడి, ఇక్కడకు వచ్చావు ?'

శ్రీ ఇలా అన్నది. 'స్వధర్మాన్ని పాటిస్తూ, ధైర్యాన్ని కోలుపోక, స్వర్గసాధన మార్గాల నిష్ఠపడే ప్రాణులలో నేను ఎల్లప్పుడూ నివసిస్తాను. తొలుత దైత్యదానవులు దానం, అధ్యయనం, యజ్ఞం, యాగం, పితృపూజ, దైవపూజ, గురుపూజ, అతిథిపూజ- వీటిలో ఆసక్తులై సత్యాన్ని పాలిస్తూ ఉండేవారు. ఇంటిని శుభ్రంగా ఉంచుకొనేవారు. ప్రేమతో తమ ఆడవారిని గెలువగలిగేవారు. నిత్యాగ్ని హోత్రాలు, గురుసేవకులు, జితేంద్రియులు, బ్రాహ్మణభక్తులు, సత్యవాదులూ అయి ఉండేవారు. వారికి శ్రద్ధ ఉండేది. కోపాన్ని జయించారు, దాన శీలులై ఈర్ష్యా సూయలకు దూరంగా ఉండేవారు. భార్యాపుత్రులను, అమాత్యులను భరించి పోషించేవారు. అమర్షతో ఒకరితోనొకరు ఎప్పుడూ ఘర్షణ పడేవారు కాదు. వారు ధీరులు. పరుల అభ్యుదయాన్ని చూసి, ఎప్పుడూ పరితపించేవారు కాదు. వారు ధనాన్ని సంగ్రహించేవారూ, దానంచేసేవారు, పెద్దతనంతో ప్రవర్తించేవారు. దయనెరిగిన వారు. ఇతరులపై బాగా అనుగ్రహం చూపే వారు. ఋజువర్తనులు, దృఢ భక్తులు, జితేంద్రియులు.

భృత్యులనూ, సచివులనూ తృప్తి పరచేవారు. కృతజ్ఞతతో ప్రవర్తించేవారు. ప్రియంగా మాటాడేవారు. అర్హతకు తగినట్లు సమ్మానించే వారు. ధనదానం చేసేవారు. బిడియాన్ని, వ్రతనియమాలనూ పాటించేవారు.

పర్వదినాలలో ఎప్పుడూ చక్కగా స్నానంచేసి, చందన చర్చలు చేసికొని, అందంగా అలంకరించు కొని ఉపవాసాలూ, తపస్సులూ చేసేవారు. అందరకూ విశ్వాసపాత్రులై వేదాధ్యయనం చేసేవారు. **దైత్యులు ప్రాతఃకాలంలో నిదురించే వారుకాదు. వారు నిదురిస్తుండగా సూర్యుడు ఉదయించేవాడు కాదు. ఎప్పుడూ రాత్రివేళలో పెరుగును, పేలపిండిని తినేవారు కాదు.** వారు నియతేంద్రియులై ఉదయం నిదురలేవగానే నేతిని చూసేవారు. వేదాలు వల్లించేవారు. మంగళ ప్రద మయిన వస్తువులను చూసేవారు. బ్రాహ్మణులను పూజించేవారు. ఎప్పుడూ ధర్మాన్ని గురించి చర్చించేవారు. ఎప్పుడూ దేనినీ దానంగా తీసికొనేవారు కాదు. రాత్రి సగభాగమే నిదురించేవారు. పగలు ఎప్పుడూ నిదురించేవారు కాదు. **కృపణులు, అనాథలు, వృద్ధులు, దుర్బలులు, రోగులు, స్త్రీలు - వీరిపట్ల దయ చూపుతూ వారికై అన్నవస్త్రాలను సమకూర్చటాన్ని వారు ఎప్పుడూ ఆమోదించేవారు.** భయపడినవానిని, విషాదానికి లోనయినవానిని, కలత పడినవానిని, భయపీడితుని, వ్యాధిగ్రస్తుని, దుర్బలునీ, ధనం పోగొట్టుకొన్నవానిని, వ్యసన పీడితుని ఎప్పుడూ ఓదార్చేవారు. ధర్మాన్నే పాటించేవారు. పరస్పరం హింసించుకొనే వారు కాదు. పనిబడినప్పుడు ఒకరినొకరు అనుకూలంగా మసలేవారు. గురువులను, వృద్ధులను సేవించేవారు.

పితరులను, దేవతలను, అతిథులను యథాశాస్త్రంగా వారు పూజించేవారు. వారికి నివేదించగా మిగిలినదానిని తినేవారు. ఎప్పుడూ సత్యవ్రతాన్ని, తపస్సును ఆశ్రయించేవారు. ఒంటరిగా విందుభోజనం చేసేవారు కాదు. పరస్త్రీల వైపు వెళ్ళేవారు కాదు. సర్వప్రాణులనూ తమతో సమానంగా భావిస్తూ దయజూపేవారు. శూన్యంలో కానీ, పశువులలో కానీ, తగనివారిలో కానీ, పర్వదినాలలో కానీ ఎప్పుడూ వీర్యత్యాగాన్ని ఇష్టపడేవారు కాదు. **ప్రభూ ! నిత్యదానమూ, సామర్థ్యమూ, ఋజుత్వమూ, ఉత్సాహమూ, అహంకార రాహిత్యమూ, పరమ సౌహార్దమూ, సహనమూ, సత్యమూ, దానమూ, తపస్సూ, శౌచమూ, కారుణ్యమూ, మృదుభాషణమూ, మిత్రులకు ద్రోహం చేయకుండుట వారిలో నిత్యమూ కనిపించేవి. నిద్ర, ఆలస్యం, అసంతృప్తి, అసూయ, అవివేకం, అనాసక్తి, విషాదం, కోరిక వారిలో ప్రవేశించగలిగేవి కావు.** అటువంటి గుణాలుగల దానవులలో నేను గతంలో సృష్ట్యాదినుండీ అనేక యుగాలపాటు నివసించాను.

ఆ తరువాత కాలం మారి, గుణాలు తారుమారై కామ క్రోధాలకు లోనై, ధర్మమార్గంనుండి వైదొలగిన దానవులను చూశాను. సభాసదులలో పెద్దలు సత్పురుషుల చరిత్రలను చెప్పేటప్పుడు గుణహీనులయిన దానవులు వారిపై అసూయపడుతూ పెద్దలను పరిహసింపసాగారు. ఆసనాసీను లయిన దానవయువకులు కూడా పెద్దలు వచ్చినా అంతకుముందువలె లేచి, ఎదురేగి, నమస్కరించి, ఆదరించటం మానివేశారు. తండ్రి ఉన్నాకూడా కొడుకు ప్రభువులా ప్రవర్తించసాగాడు. శత్రువులను సేవిస్తూ, తమ చేష్టలను సిగ్గులేకుండా గొప్పగా చెప్పుకొన నారంభించారు. అదే రీతిగా మహార్థసంప్రాప్తికై గర్హణీయమైన అధర్మకర్మాచరణం మీద వారికి కోరిక కలిగింది. రాత్రులలో పెద్దపెద్దగా గొడవ చేసేవారు. వారి అగ్నిహోత్రాల జ్వాలల జోరుతగ్గింది. కొడుకులు తండ్రులను, స్త్రీలు భర్తలను అతిక్రమించటానికి సిద్ధపడ్డారు. తల్లినీ, తండ్రినీ, పెద్దలను, ఆచార్యుని, అతిథిని, గురుజనాన్నీ సరిగా మన్నించటంలేదు. పిల్లలను సరిగా పోషింపరైరి. పితరులను, దేవతలను, అతిథులను, గురువులను పూజించి వారికి నివేదించకుండానే; భిక్షాదానాన్ని; వైశ్వదేవాన్ని నిర్వహించకుండానే దానవులు తాము భోజనం చేసేవారు. దైత్యులు, వారి వంటవారు కూడా మనస్సుతో, మాటతో, కర్మతో శౌచాన్ని పాటించటంలేదు. వారి ఆహారపదార్థాలపై మూతలుకూడా పెట్టలేదు. ధాన్యాన్ని ఇళ్లలో చెల్లాచెదురుగా ఉంచేవారు. కాకులు, ఎలుకలు వాటిని తినేవి. పాలపై మూతపెట్టేవారు కాదు. ఎంగిలిచేతితో నేతిని ముట్టుకొనేవారు. దానవుల గృహిణులు పార, కొడవలి, బుట్ట, కంచుగిన్నెలు, ఇతర ద్రవ్యాలు, ఉపకరణాలు - వీటిని సరిగా ఉంచుకొనేవారు కాదు. ప్రాకారాలు, ఇళ్ళు పడిపోతే వాటికి మరమ్మత్తులు చేసికొనే వారు కాదు. కట్టివేసిన పశువులకు మేత వేయకుండా నీళ్ళు పెట్టకుండా నిరాదరణ చూపేవారు.

చిన్నపిల్లలు ఆశగా చూస్తున్నా వారికి పెట్టకుండానే తినేవారు దానవులు. అలాగే సేవకులను తృప్తి పరచకుండానే తాము భక్షించేవారు. పాయసం, పులగం, మాంసం, అరిసెలు, చక్కిలాలు మొదలయినవి తమకోసమే వండుకొనేవారు. అనవసరంగా మాంసాలను తినేవారు. సూర్యోదయమయ్యే వరకూ నిదురిస్తూనే ఉండేవారు. ప్రాతఃకాలాన్ని కూడా అందరూ రాత్రిగా భావించేవారు. ప్రతిగృహంలోనూ రేబవళ్ళు కలహాలు చెలరేగుతుండేవి. సాధారణ దానవులు అక్కడనే పూజనీయులున్నా వారిని సేవించేవారు కాదు. ఆశ్రమవాసులూ, అధర్మవర్తనులూ పరస్పరం ద్వేషించుకొనేవారు. వర్ణసాంకర్యాలు జరిగేవి. పవిత్రత ఎవ్వరిలోనూ లేదు. వేదవేత్తలకూ, అసలు ఋక్కులే

రానివారికీ మధ్య దానవులకు తేడా తెలిసేది కాదు. వారిని సత్కరించటంలోనూ, పరాభవించటంలోనూ కూడా భేద మేమీ చూపేవారుకాదు. దుర్జనులు పాటించే ఆచారాలను పాటించేవారు, వేశ్యలవలె హారాలను, ఆభరణాలను, వేషాన్ని ధరించేవారు. వారివలె నడిచేవారు. వారివలె నిలిచేవారు, వారిలా వీక్షించేవారు. **ఆటలలో, రతులలో, విహారాలలో స్త్రీలు మగవారిలా, మగవారు ఆడవారివలె వేషధారణచేసి పరమానందాన్ని పొందేవారు.** సమర్థులయిన తమ పూర్వీకులు బ్రాహ్మణులకు ఇచ్చిన అగ్రహారాలను, వేదనిందకు లయిన దానవులు తిరిగి తీసికొనేవారు. తమకు అవసరం లేకపోయినా వారినుండి వాటిని లాగికొనేవారు. ధనవిషయంలో ఎప్పుడయినా వివాద మేర్పడినప్పుడు మిత్రుడు మధ్యస్థునిద్వారా వివాద పరిష్కారాన్ని అభ్యర్థించినా, తన వెంట్రుకకొన అంత స్వార్థం కోసం మిత్రుని సంపత్తిని నష్టపరచేవారు. **దానవులలోని వ్యాపారులు ఇతరుల సొమ్ము కొల్లగొట్టాలని ఇష్టపడేవారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతో బాటు శూద్రులు కూడా తపోధనులై ఉండేవారు. కొందరు బ్రహ్మచర్యాన్ని పాటించకుండానే వేదాధ్యయనం చేసేవారు. కొందరు అవైదిక వ్రతాలను ఆచరించేవారు.**

శిష్యులు గురువులకు శుశ్రూష చేసేవారు కాదు. కొందరు గురువులు శిష్యులకు మిత్రసమానులయ్యేవారు. వృద్ధులయిన తల్లిదండ్రులు అంతా అయిపోయిన వారిలా అలసిపోయి మాట చెల్లుబాటులేకుండా బ్రతికేవారు. వారు అన్నానికై పిల్లలను అర్థించవలసివచ్చేది. అక్కడి వేదవేత్తలు ప్రాజ్ఞులు. సముద్రమంత గాంభీర్యం గలవారు. కానీ వ్యవసాయంలో ఆసక్తులై ఉండేవారు. మూర్ఖులై శ్రాద్ధభోజనాలు చేసేవారు. గురువులు ప్రతిదినమూ ఉదయమే లేచి 'సుఖ నిద్ర పట్టిందా' అని శిష్యుల నడిగేవారు. వారికి అవసరమైనవి కల్పించేవారు. శిష్యులు అడగకపోయినా గురువులు స్వయంగా వారికి దూతలుగా వ్యవహరించేవారు. **అత్తమామల ఎదుటనే కోడలు సేవకులను శాసించేది. భర్తను కూడా ఆదేశించేది. అందరిఎదుట భర్తను పిలిచి మాటాడేది. తండ్రి ప్రయత్న పూర్వకంగా కొడుకు మనస్సును అదుపు చేసేవాడు. వారి కోపానికి భయపడి ఆస్తి పంచిపెట్టి, కష్టంగా జీవించేవాడు.** ఎవరయినా అగ్నిప్రమాదం వలన గానీ, దొంగలవలన గానీ, రాజు ద్వారా గానీ ధనాన్ని కోల్పోయినప్పుడు మిత్రులుగా భావింపబడినవారే ద్వేషంతో నవ్వేవారు. దైత్యులు కృతఘ్నులు, నాస్తికులు, పాపాత్ములు, గురుపత్నీ రతులు, అభక్ష్య భక్షకులు, హద్దుల నతిక్రమించినవారు, తేజోహీనులు అయి ఉండేవారు. దేవేంద్రా ! ఈ రీతిగా దైత్యులు ధర్మవైపరీత్యంతో చేయరాని పనులు చేస్తున్నప్పుడు ఇక వారిదగ్గర నిలువకూడ దని నాకనిపించింది. శచీపతీ ! ఆ రీతిగా స్వయంగా నీకడకు వచ్చిన నన్ను అభినందించు. దేవేశా ! నీవు నన్ను గౌరవిస్తే ఇతర

దేవతలు కూడా నన్ను ముందు నిలుపుకొంటారు. నేనున్నచోటనే వీడుగురు లక్ష్ములు జయలక్ష్మితో సహా ఎనిమిదిమంది నివసిస్తారు. వారు నా కిష్టమైనవారు. నాకన్న గొప్పవారు. నాకై ఆత్మసమర్పణ చేసినవారు. **పాకశాసనా ! ఆశ, శ్రద్ధ, ధృతి, శాంతి, విజితి, సన్నతి, క్షమ. ఈ వీడుగురు లక్ష్ములకు ముందునిలిచే ఎనిమిదవ దేవి వృత్తి (జయం) వారు, నేను అసురలను వీడి మీ లోకానికి వచ్చాం, ధర్మనిష్ఠగల దేవతలలో నివసిస్తాం.'**

లక్ష్మీదేవి ఇలా అనగానే దేవర్షి అయిన నారదుడు, వృత్ర సంహారకుడైన దేవేంద్రుడు ఆమెకు ప్రీతిని కల్పించాలని ఆమెను అభినందించారు. అంతలో దేవమార్గాలలో మనోరంజకమయిన గంధం, సుఖ స్పర్శగల గల వాయువు సర్వేంద్రియాలకు సుఖాన్ని కలిగిస్తూ వీచాడు. తమకు నచ్చిన ఆ పవిత్రప్రదేశంలో రాజ్యలక్ష్మీ సమేతంగా కూర్చొనిఉన్న ఇంద్రుని చూడాలని దాదాపు దేవతలందరూ వచ్చారు. అప్పుడు సహస్రలోచనుడు అయిన ఇంద్రుడు లక్ష్మితోనూ, తన మిత్రుడైన నారదునితోనూ కలిసి అందమయిన గుర్రాలను పూన్చిన రథాన్ని ఎక్కి స్వర్గలోకానికి వెళ్ళి, దేవతల అభినందనల నంది దేవసభను చేరాడు. అప్పుడు అమరుల పరాక్రమమెరిగిన నారద మహర్షి ఇతర మహర్షులతో కూడి, లక్ష్మీంద్రుల ఇంగితాన్ని గ్రహించి, మనసా ఆలోచించి, లక్ష్మీశుభాగమనాన్ని ప్రశంసించాడు. ఆ సమయంలో వెలుగు నిండిన గగనమండలం స్వయంభువు అయిన బ్రహ్మదేవుని నివాసంలో అమృత వర్షాన్ని కురిసింది. దుందుభులు స్వయంగా మ్రోగాయి. దిక్కులు నిర్మలంగా భాసించాయి. ఇంద్రుడు సకాలంలో వానలు కురిపించాడు. ఎవ్వరూ ధర్మమార్గాన్ని అతిక్రమించలేదు. అనేక సముద్రాలతో అలంకరింపబడిన భూమి సముద్ర ఘోష రూపంలో త్రిభువన విజయాన్ని ఆకాంక్షిస్తూ జయగర్జన చేసింది. అప్పుడు మానధను లయిన మానవులు పుణ్యాత్ముల మార్గంలో నడుస్తూ సత్కర్మలతో ప్రకాశించారు. నరులు, అమరులు, కిన్నరులు, యక్షులు, రాక్షసులు అందరూ సంపన్నులు, ఉదారచిత్తులు అయి ఉండేవారు. **ఆ సమయంలో గాలి ఎంత వీచినా అకాలంలో చెట్లనుండి పూలు కానీ, పండ్లు కానీ రాలేవి కావు. ధేనువులు కోరినన్ని పాల నిచ్చేవి. ఎవ్వరూ దారుణంగా మాటాడేవారు కాదు.** అన్ని కోరికలనూ తీర్చే ఇంద్రుడు మొదలగు దేవతలు చేసిన ఈ లక్ష్మీసేవను బ్రాహ్మణ సభలలో పరించినవారి కోరికలన్నీ తీరుతాయి. వారికి సంపద సమకూరుతుంది. కురుశ్రేష్ఠా ! యుధిష్ఠిరా ! అభ్యుదయ పరాభవాలను గురించి అడిగావు. దానిని సంపూర్ణంగా సోదాహరణంగా వివరించాను. నీవు స్వయంగా దీనిని పరిశీలించి తత్త్వ నిర్ణయం చేసికో ! '

229. జైగీషవ్య - అసిత సంవాదము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'మనిషి ఏ స్వభావంతో, ఏ నడవడితో, ఏ చదువుతో, ఏ పరాక్రమంతో ప్రకృతిని అతిక్రమించి, శాశ్వతమైన బ్రహ్మపదాన్ని పొందగలడు ?' భీష్ముడిలా చెప్తున్నాడు. 'మనిషి మితాహారియై, జితేంద్రియుడై, మోక్షధర్మాలను ఆచరిస్తే ప్రకృతిని అతిక్రమించి, శాశ్వతమైన బ్రహ్మపదాన్ని పొందగలడు. భారతా ! ఈ విషయంలో కూడా ఒకప్పుడు జైగీషవ్య- అసితుల మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీనేతిహాసాన్ని ఉదాహరిస్తుంటారు. ఒకప్పుడు మహాప్రాజ్ఞుడు, ధర్మవేత్త, శాస్త్రవేత్త, క్రోధహర్షరహితుడు అయిన జైగీషవ్యుని అసిత దేవలుడు ఇలా అడిగాడు. "నీకు నమస్కరించినా ఆనందించవు. నిందించినా కోపించవు. నీకు ఈ ప్రజ్ఞ ఎలా కలిగింది ? దేనిద్వారా క్లలిగింది ? నీ బుద్ధికి పరమాశ్రయ మేది ?" 'అని దేవలుడు ప్రశ్నించగా మహాతపస్వి అయిన జైగీషవ్యుడు ఇలా అన్నాడు. ఆయన మాట సంశయరహితమై ప్రచురార్థబోధకమైన పవిత్రవచనం, ఉత్తమవచనం కూడా.

'ఋషిసత్తమా ! పుణ్యకర్మల నాచరించే మహానుభావులకు ఏది ఆశ్రయమో, ఏది పరాకాష్ఠయో, ఏది శాంతికరమో ఆ మహాబుద్ధిని నీకు తెలియజేస్తాను. **దేవలా ! మహాత్ములను నిందించినా, ప్రశంసించినా, వారి సదాచారాలనూ, సుకృతాలనూ నిరోధించినా వారు సమానంగానే స్వీకరిస్తారు. ధీమంతులు తమతో కటువుగా మాటాడినా తిరిగి ఏమీ అనరు. తమకు కీడు చేసినా పరుల హితాన్నే కోరుతారు. తమను హింసించినా ప్రతిహింస చేయాలనుకోరు. దొరకనిదానికి బాధపడరు. దాటిపోయిన దానికై శోకించరు. వర్తమానానికి అనుగుణంగానే పనిచేస్తారు. దేనిని గురించీ ప్రతిజ్ఞలు చేయరు.* దేవలా ! ఏదేని కోరికను సిద్ధింపజేసికొనటానికి తన దగ్గరకు వచ్చిన పూజనీయులకు వ్రతశీలులు, శక్తి సంపన్నులైన మహాత్ములు యథాశక్తిగా సహకరిస్తారు. పండిన జ్ఞానంగల మహాప్రాజ్ఞులు క్రోధాన్ని జయించి, జితేంద్రియులై మనోవాక్కాయ కర్మలతో ఎవ్వరికీ కీడు చేయరు.** ధీరులకు ఈర్ష్య ఉండదు. ఎప్పుడూ ఎవ్వరూ ఎవ్వరినీ హింసించరు. పరుల సమృద్ధిని చూసి, ఎప్పుడూ పరితాపాన్ని పొందరు. **ధీరులు ఇతరులను నిందించరు. మరీ ఎక్కువగా ప్రశంసించరు. ఇతరులు తమను నిందించినా, ప్రశంసించినా ఎప్పుడూ**

---

* నాప్రాప్తమనుశోచంతి ప్రాప్తకాలాని కుర్వతే ।
న చాతీతాని శోచంతి న చైవ ప్రతిజానతే ॥ 10

వికారానికి లోను కారు.* ధీరులు సర్వవిధాలా ప్రశాంతంగా ఉంటారు. సమస్త ప్రాణుల హితం మీదనే ఆసక్తి చూపుతారు. ఎవ్వరి మీద కోపంచరు. దేనికీ ఆనందించరు. ఎవ్వరికీ కీడు చేయరు. హృదయగ్రంధి ముడివిప్పి, యథాసుఖంగా అంతటా సంచరిస్తారు. వారికెవ్వరూ బంధువులు కారు. వారూ ఎవ్వరికీ బంధువులు కారు. ధీరులకు ఎవ్వరూ శత్రువులు కారు. వారు ఎవ్వరికీ శత్రువులు కారు. ఇలా ఉన్న మర్త్యులు ఎప్పుడూ సుఖంగా జీవిస్తారు. ద్విజసత్తమా ! ధర్మానుసారం నడిచేవారే ధర్మజ్ఞులు. ఆ ధర్మమార్గం నుండి భ్రష్టులైన వారు హర్షాన్నీ, ఉద్వేగాన్నీ పొందుతారు. నేను ఆ ధర్మమార్గాన్ని అవలంబించేవాడను. కాబట్టి నన్ను ఎవరయినా నిందించినా నేను ఎందుకు అసూయపడాలి? ఎవరయినా ప్రస్తుతించినా నేనెందుకు ఆనందించాలి ? మానవులు నిందా ప్రశంసలద్వారా తాము ఆశించిన లాభాలను పొందితే పొందనీ ! నాకు మాత్రం నిందవలన హానీ లేదు, స్తుతి వలన లాభమూ లేదు. **జ్ఞాని అవమానం జరిగినా అమృతం త్రాగినట్లుగానే సంతోషించాలి. విచక్షణుడు సమ్మానాన్ని పొందితే విషసమానంగా భావించి, భయపడాలి.** సర్వదోష విముక్తుడైన జ్ఞాని అవమానాన్ని పొందినా ఇహపరలోకాలలో నిర్భయంగా నిదురిస్తాడు. అవమానించిన వాడే పాపాల్లో చిక్కుకొంటాడు. ఉత్తమ గతులను కోరుకొనే మనీషులు ఈ వ్రతాన్ని ఆశ్రయించి సుఖాన్ని, అభ్యుదయాన్నీ పొందుతారు. మనిషి సర్వకర్మలనూ పరిత్యజించి, జితేంద్రియుడు కావాలి. అప్పుడే ప్రకృతిని అతిక్రమించి, శాశ్వతమైన బ్రహ్మపదాన్ని పొందగలడు. పరమగతిని పొందిన మహాత్ముల స్థానాన్ని దేవతలు కానీ, గంధర్వులు, పిశాచాలు, రాక్షసులు ఎవ్వరూ కూడా పొందలేరు.'

230. వాసుదేవ - ఉగ్రసేన సంవాదము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'అందరికీ ఇష్టుడై, సర్వప్రాణులనూ ఆనందింపజేస్తూ, సమస్త గుణాలతో కూడిన మానవుడు లోకంలో ఎవడైనా ఉన్నాడా ?' భీష్ముడిలా చెప్తున్నాడు. 'భరతశ్రేష్ఠా ! ఈ ప్రశ్ననడిగావు కాబట్టి నారదుని గూర్చి ఉగ్రసేన కేశవుల మధ్య జరిగిన సంవాదాన్ని ఇప్పుడు నీకు చెప్పబోతున్నాను. ఉగ్రసేను డిలా అన్నాడు. 'లోకులంతా నారదుని ప్రస్తుతించాలని ఇష్టపడుతుంటారు. ఆయన సద్గుణ సంపన్నుడని నేను భావిస్తున్నాను. ఆయనను గురించి అడుగుతున్నాను. నాకు చెప్పు.'

వాసుదేవు డిలా చెప్పాడు. కుకురాధిపా ! రాజా ! నారదునిలో ఉత్తమ

---

* నిందాప్రశంసే చాత్యర్థం న వదంతి పరస్య యే ।
న చ నిందాప్రశంసాభ్యాం విక్రియంతే కదాచన ॥ 14

గుణాలుగా నేను భావించిన వాటిని సంక్షేపంగా చెపుతాను విను. **నారదునిలో శాస్త్రజ్ఞానమూ, సచ్ఛీలమూ రెండూ ఉన్నాయి. తన నడవడివలన నారదునిలో అహంకారం పుట్టలేదు. అహంకారం శరీరాన్ని తపింపజేస్తుంది. నిరహంకారి కాబట్టి అంతటా పూజింపబడుతున్నాడు.** అసంతృప్తి, కోపం, చాపలం, భయం - ఇవి నారదునిలో లేవు. పనులు ఆలస్యంగా చేయడు. సత్కర్మలు చేయటంలో శూరుడు. కాబట్టి అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు దృఢంగా ఉపాసింపదగినవాడు. కామంవలన కానీ, లోభంవలన కానీ మాట తప్పేవాడు కాదు. అందువలన అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు అధ్యాత్మ తత్త్వవేత్త, సహనశీలి, సమర్థుడు, జితేంద్రియుడు, ఋజువర్తనుడు, సత్యవాది. అందువలన అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు తేజస్సుచే, యశస్సుచే, బుద్ధిచే, జ్ఞానంచే, వినయంచే, జన్మచేత, తపస్సుచేత కూడా వృద్ధుడు, కాబట్టి అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు సుశీలుడు, సుఖంగా నిద్రించేవాడు. పవిత్రంగా భుజించేవాడు. ఆదరణీయుడు, పవిత్రుడు. మంచిమాటలు పలికేవాడు. ఈర్ష్యారహితుడు. అందువలన అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు మనః పూర్వకంగా పరులకు మేలు చేస్తుంటాడు. పాపదృష్టి తనలో ఉండదు. ఇతరుల అనర్థాలను చూసి ఆనందించడు. కాబట్టి అంతటా పూజింపబడుతున్నాడు. వేదోపనిషత్పురాణాలలోని కథల ద్వారా ప్రస్తుత ప్రయోజనాలను సాధించగోరుతాడు. సహనశీలి. ఎవ్వరినీ చులకన చేయడు. అందువలన అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు సమదృష్టి గలవాడు కాబట్టి తనకు ఇష్టమైన వారంటూ ఉండరు. ఏరీతిగానూ ఇష్టం లేనివారూ ఉండరు. పరుల మనస్సుల నెరిగి తదనుకూలంగా మాటాడుతాడు. కాబట్టి అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు బాగా అధ్యయనం చేసినవాడు, చిత్రంగా కథలు చెప్పేవాడు, పండితుడు. లాలసత్వం కానీ, వంచన కానీ తెలియనివాడు. దైన్యానికీ, క్రోధానికీ, లోభానికీ చోటు ఇవ్వనివాడు. కాబట్టి అంతటా పూజింబడుతున్నాడు. అర్థంకోసం కానీ, ధనం కోసం కానీ, కామంకోసం కానీ ఇంతవరకు ఎవ్వరితోనూ కలహించనివాడు నారదుడు. అతనిలో దోషాలు ఏవీ లేవు. కాబట్టి అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు దృఢభక్తి గలవాడు. నిందింపదగని నడవడి గలవాడు. పండితుడు. దయాళువు. మోహరహితుడు. అందువలన అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు ఏ ప్రాణులయందూ ఆసక్తి లేనివాడు కానీ ఆసక్తి ఉన్నట్లు కనిపించేవాడు. ఏ సంశయమూ ఆయనలో చిరకాల ముండదు. మంచి మాటకారి. కాబట్టి అంతటా పూజింపబడుతున్నాడు.

విషయోపభోగాలపై నారదువి మనస్సు నిలువదు. తనను తాను ఎప్పుడూ

పొగడుకొనడు. ఈర్ష్య లేనివాడూ మృదుభాషీ, కాబట్టి అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు లోకంలోని వివిధ మనస్తత్వాలనూ గర్హించక సాక్షిమాత్రుడై చూస్తుంటాడు. పరస్పరం సంబంధాలను కల్పించటంలో నిపుణుడు. అందువలన అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు ఏ శాస్త్రాన్నీ నిందించడు. తన నీతి ననుసరించి తాను జీవిస్తుంటాడు. కాలాన్ని వృథా చేయడు. జితేంద్రియుడు. అందువలన అంతటా పూజింపబడుతుంటాడు. యోగాభ్యాసంలో ఎంతో కృషి చేసినవాడు, పవిత్ర మతి. అయినా సమాధి విషయంలో తృప్తి లేనివాడు. జాగరూకుడై ఎప్పుడూ కర్తవ్యాన్ని నిర్వహించేవాడు. అందువలన అంతటా పూజింపబడుతున్నాడు. నారదుడు సిగ్గులేనివాడు కాదు. పరులకై ఎప్పుడూ సిద్ధమైనవాడు. ఇతరుల కళ్యాణ కార్యాలలో నియుక్తుడు. ఎవ్వరి రహస్యాలనూ బయటపెట్టనివాడు. అందువలన అంతటా పూజింపబడుతున్నాడు. అర్థసిద్ధి కలిగినా సంతోషించడు. లాభం కలుగకపోతే బాధపడడు. స్థిరచిత్తం గలవాడు. ఎందులోనూ తగుల్కొననివాడు. కాబట్టి నారదుడు అంతటా పూజింపబడుతున్నాడు. ఆ రీతిగా సర్వసద్గుణ సంపన్నుడై, సమర్థుడై, పవిత్రుడై, ఆరోగ్యవంతుడై, కాలజ్ఞానియై, ఆత్మజ్ఞాని యైన నారదుడంటే ఎవరు ఇష్టపడరు ?'

231. శుకునకు వ్యాసుడు కాలస్వరూప మెరిగించుట.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'కౌరవా ! సమస్త ప్రాణుల జననమరణాలను గురించి తెలియగోరుతున్నాను. ధ్యానస్వరూపమేమిటి ? కర్మ అంటే ఏది ? కాల స్వరూప మేది ? యుగయుగంలోనూ ప్రాణుల ఆయుః ప్రమాణ మేది ? లోకతత్వాన్ని పూర్తిగా తెలిసికొనగోరుతున్నాను. ప్రాణుల రాక, పోక, సృష్టి, లయాలను గూర్చి కూడా తెలిసికొనగోరుతున్నాను. ఇదంతా ఎలా జరుగుతోంది. సజ్జనశ్రేష్ఠ ! మా మీద తమకు అనుగ్రహభావన ఉంటే తమరి నిది అడుగుతున్నాను. నాకు చెప్పాలి. ఇంతకు ముందు విప్రర్షి అయిన భరద్వాజునకు భృగుడుచెప్పిన విషయాలను తమరు చెప్పగా విని, నాకు చక్కని జ్ఞానం కలిగింది. నా బుద్ధి పరమధర్మిష్ఠమై దివ్యస్థితిని పొందింది. అందువలన మరలా అడుగుతున్నాను. తమరు నాకు చెప్పాలి.' భీష్మ డిలా చెప్తున్నాడు. 'ఈ విషయంలో తన్ను ప్రశ్నించిన కుమారునకు వ్యాసభగవానుడు చెప్పిన విషయాలను ప్రాచీనేతిహాసంగా నీకు వినిపిస్తాను. వ్యాసపుత్రుడైన శుకుడు సకలవేదాలనూ, వేదాంగాలను, ఉపనిషత్తులను చక్కగా చదివి, నైష్ఠిక కర్మను తెలియగోరి, తన తండ్రిలోని ధర్మనైపుణ్యాన్ని గ్రహించి, తండ్రిద్వారా తన సందేహాలను తొలగింపజేసికోవాలని కృష్ణద్వైపాయనుడైన

వ్యాసుని ఇలా అడిగాడు. 'సమస్త ప్రాణులకూ కర్త ఎవరు ? కాలజ్ఞాన విషయంలో తమ నిర్ణయ మేది ? బ్రాహ్మణుని కర్తవ్య మేది ? ఇదంతా నాకు తమరు చెప్పాలి.'

'భూతభవిష్యత్తులను, సర్వధర్మాలను తెలిసి, సర్వజ్ఞుడైన తండ్రి (వ్యాసుడు) తన కొడుకు ప్రశ్నించగా సర్వవిషయాలనూ వివరించాడు. వ్యాసు డిలా అన్నాడు. 'సృష్ట్యారంభ దశలో అనాది, అనంతుడు, దివ్యుడు, అజరుడు, శాశ్వతుడు, అవ్యయుడు, వికారరహితుడు, అతర్క్యుడు, అవిజ్ఞేయుడు అయిన బ్రహ్మమాత్రమే ఉండేవాడు. **పదిహేను నిమేషాలు ఒక కాష్ఠ. ముప్పది కాష్ఠలు ఒక కల. ముప్పది కలలు, మూడు కాష్ఠలూ కలిస్తే ఒక ముహూర్తం.** ముప్పది ముహూర్తాలు ఒక రోజు. మహర్షులు ముహూర్తాన్ని అలాగే పరిగణించారు. ముప్పదిరోజులు ఒక నెల. పండ్రెండు నెలలు ఒక సంవత్సరం. ఉత్తరాయణం, దక్షిణాయనం అని రెండు అయనాలు సంవత్సరంలో ఉంటాయని సంఖ్యావేత్త లంటారు. మానవలోకంలో దివారాత్రాలను సూర్యుడు విభజిస్తాడు. ప్రాణులు నిదురించటానికి రాత్రి, పనులు చేసికొనటానికి పగలు ఏర్పడ్డాయి. మానవగణనలోని ఒక నెల పితరులకు ఒక రోజు. శుక్లపక్షం వారికి కర్మకాలం, పగలు – కృష్ణపక్షం నిద్రాకాలం, రాత్రి. మానవగణనంలో సంవత్సరం కాలం దేవతలకు ఒక రోజు. దినరాత్రి విభాగ మిలా ఉంటుంది. ఉత్తరాయణం వారికి పగలు. దక్షిణాయనం రాత్రి. మానవలోకంలోని దివారాత్రాలను గురించి చెప్పాను. ఆ లెక్క ప్రకారం బ్రహ్మలోకానికి సంబంధించిన దివారాత్రాలను గురించి చెప్తాను. దానితో పాటు కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలను గూర్చి చెప్తాను. యుగాల సంవత్సర సంఖ్య వేరువేరుగా ఉంటుంది. దేవగణనమేరకు నాలుగువేల సంవత్సరాలు ఒక సత్య (కృత) యుగం. నాలుగు వందల సంవత్సరాలు సంధ్య. మరో నాలుగువందల సంవత్సరాలు సంధ్యాంశం. మిగిలిన మూడు యుగాలలో కృతయుగంలోని సంవత్సర సంఖ్య సంధ్యాసంధ్యాంశాలతో సహా నాలుగవ భాగం చొప్పున తగ్గుతూ వస్తుంది. నాయనా ! ప్రవాహరూపంగా ఎప్పుడూ ఉండే ఈ నాలుగు యుగాలు సనాతనలోకాలను నిలుపుతుంటాయి. యుగరూపమైన ఈ కాలమే వేదవేత్తల దృష్టిలో సనాతన బ్రహ్మస్వరూపం.

కృతయుగంలో సత్యం, ధర్మం నాలుగు పాదాలతో నిలిచి ఉండేవి. ఏ ధర్మశాస్త్రమూ అధర్మంతో సంకరం కాలేదు. ధర్మాన్ని గొప్పగా పాటించేవారు. ఇతర యుగాలలో శాస్త్రోక్తధర్మం ఒక్కొక్క నాలుగవ భాగం క్షీణిస్తుంది. దొంగతనం, అసత్యం, మోసం – మొదలయిన పనులతో అధర్మం వర్ధిల్లుతుంది. కృత యుగంలో ప్రజలు రోగరహితులై ఉంటారు. వారి కోరికలన్నీ సిద్ధిస్తుండేవి. వారి ఆయుస్సు నాలుగు వందల సంవత్సరాలుగా ఉండేది. త్రేతాయుగంలో వయస్సులో నాలుగవ భాగం తగ్గుతుంది.

త్రేతాదియుగాల్లో వేదాధ్యయనం, ఆయుస్సు తగ్గుతూ ఉంటాయని విన్నాను. మనోరథ సిద్ధికూడా తగ్గుతుంది. వేదాధ్యయన ఫలం కూడా తగ్గుతుంది. యుగాల పరిమాణం తగ్గుతున్నందువలన కృత, త్రేతా, ద్వాపర కలియుగాల్లో ధర్మాలు కూడా వేరువేరుగా ఉంటాయి. కృతయుగంలో తపస్సే గొప్పది. త్రేతాయుగంలో ధర్మమే గొప్పది. ద్వాపరయుగంలో యజ్ఞం గొప్పది. కలియుగంలో దానమే గొప్పది. ఈ రీతిగా దేవమానంలోని పండ్రెండు వేల సంవత్సరాలు ఒక చతుర్యుగం అని విద్వాంసుల పరిగణనం. ఒక వేయి చతుర్యుగాలు బ్రహ్మకు ఒక పగలు. రాత్రి కూడా వేయిచతుర్యుగాలే. బ్రహ్మ దినారంభంలో విశ్వసృష్టి చేస్తాడు. రాత్రి ప్రళయకాలంలో అంతటినీ తనలో లీనం చేసికొని యోగనిద్ర పోతాడు. మరల ప్రలయానంతరం మేల్కొంటాడు. వేయి చతుర్యుగాలు బ్రహ్మకు ఒక పగలు. అంతే కాలం- వేయి చతుర్యుగాలు - ఒక రాత్రి. దానినెరిగిన వారే అహోరాత్రాలను కాలతత్త్వాన్ని ఎరిగినవారు. రాత్రి తరువాత మేల్కొన్న బ్రహ్మ ముందుగా తన అక్షయ రూపాన్ని మాయద్వారా వికారానికి గురిచేస్తాడు. మహత్తత్త్వాన్ని సృష్టిస్తాడు. దాని ద్వారా స్థూల జగత్తుకు కారణమైన మనస్సు ఉద్భవిస్తుంది.'

232. వ్యాసుడు శుకునకు సృష్టి యుత్పత్తిని యుగధర్మాలను వివరించుట.

వ్యాసు డిలా చెప్పాడు. 'తేజోమయబ్రహ్మమే అన్నింటికీ బీజం. దానినుండి సమస్తజగత్తు ఉద్భవించింది. ఒకే బ్రహ్మనుండి స్థావరాలు, జంగమాలు రెండూ జనించాయి. దినారంభంలో నిదురలేచి, అవిద్య ద్వారా సంపూర్ణ జగత్తును సృష్టిస్తాడు. ముందు మహత్తత్వం, దానినుండి స్థూలసృష్టికి ఆధారభూతమైన మనస్సు ఉద్భవిస్తాయి. మనస్సు ఎంతదూరమైనా, ఎన్ని రకాలుగా అయినా ప్రయాణించగలదు. అభ్యర్థనలకూ, అనుమానాలకూ అది నిలయం. అది చైతన్యంతో కూడి పదార్థాల నన్నింటిని తిరస్కరించి మానసికంగా ఏడ్గురు ఋషులను సృష్టించింది.* సృష్టించాలన్న కోరికతో మనస్సు ప్రేరణ పొంది, ఎన్నింటినో సృష్టిస్తుంది. ఆ మనస్సు నుండి ఆకాశం ఉద్భవిస్తుంది. శబ్దం ఆకాశగుణం. ఆకాశం వికృతిని పొందుతుంది. దానినుండి పవిత్రమూ, గంధవహమూ, బలిష్ఠమూ అయిన వాయువు జనిస్తుంది. స్పర్శ వాయుగుణం. వాయు వికారం నుండి ప్రకాశవంతమైన అగ్ని జనిస్తుంది. అది జ్వాలాసహితం, కాంతిమంతం కూడా. రూపం అగ్ని గుణం. వికృతినందిన జ్యోతినుండి రసాత్మక మయిన జలం జనిస్తుంది. జలం నుండి గంధాన్ని

* వి॥ సప్తర్షులు - మరీచి, అంగిరుడు, అత్రి, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వసిష్ఠుడు *(శాంతిపర్వం 340/69)*

వహించే భూమి జనిస్తుంది. ఇది పంచభూతాల ప్రాదుర్భావక్రమం. ఈ పంచ భూతాలలో ఉత్తరోత్తరమైన భూతం పూర్వ పూర్వ భూతాల లక్షణాలు అన్నీ కలిగి ఉంటుంది. భూతం ఎంతసేపు ఎలా ఉంటే భూతగుణం కూడా అంతసేపే, అలాగే ఉంటుంది. ఎవరైనా నీటిని వాసనచూసి, అజ్ఞానంతో గంధాన్ని జల గుణమనవచ్చు. కానీ అది మిథ్య. గంధం పృథివీ గుణమే. నీటిలోనూ, వాయువులోనూ అది సాంక్రామికంగా కనిపించే లక్షణం మాత్రమే. వివిధ శక్తిసంపన్నాలయిన ఈ ఏడు పదార్థాలు (మహత్తత్వం, మనస్సు, పంచభూతాలు.) ఒకదానితో మరొకటి కలియక విడివిడిగా ఉంటే అవి ప్రజలను సృష్టించలేవు. వ్యాపక లక్షణం గల ఈ సప్తపదార్థాలు ఒకదానితో ఒకటి కలిసి సహకరించుకొన్నప్పుడు భిన్న భిన్న శరీరాలుగా పరిణమిస్తాయి. ఆ శరీరమనే పురంలో నివసిస్తాడు కాబట్టి జీవుని పురుషు డంటాడు. పది ఇంద్రియాలు, అయిదు మహాభూతాలు, మనస్సు కలిపి ఈ పదహారు తత్త్వాలతో శరీర నిర్మాణం జరుగుతుంది. వీటికి ఆశ్రయమైనది కాబట్టి దేహాన్ని శరీర మంటారు. శరీరం ఏర్పడిన తరువాత ప్రారబ్ధకర్మతో పాటు సూక్ష్మ మహాభూతాలు శరీరంలోనికి ప్రవేశిస్తాయి.

భూతాలను తొలుత సృష్టించిన బ్రహ్మ తపస్సుకై సమస్త సూక్ష్మభూతాలతో సహా శరీరంలో ప్రవేశించి ఉంటాడు. అందుకే ఆయనను ప్రజాపతి అంటారు. ఆ తరువాత ఆ బ్రహ్మ చరాచరభూతాలను సృష్టిస్తాడు. దేవతలను, ఋషులను, పితరులను, మానవులను, లోకాలను, నదులను, సముద్రాలను, దిక్కులను, పర్వతాలను, చెట్లను, నరులను, కిన్నరులను, రాక్షసులను, పక్షులను, పశువులను, మృగాలను, నాగులను కూడా సృష్టిస్తాడు. అనశ్వరాలయిన ఆకాశాదులు, నశ్వరాలైన స్థావరజంగమాలు ఆయన సృష్టియే. ప్రాణి గడచిపోయిన కల్పంలో తాను ఆశ్రయించిన కర్మనే, ఈ కల్పంలో కూడా మరల మరల జన్మలెత్తుతున్నా ఆశ్రయిస్తుంది. **హింసయో, అహింసయో, మార్దవమో, క్రౌర్యమో, ధర్మమో అధర్మమో, సత్యమో, అసత్యమో - గతజన్మలో ప్రాణి దేనిని ఆచరిస్తే దానినే ఈ జన్మలో కూడా సంస్కారవిశేషాన్ని బట్టి ఇష్టపడి, ఆచరిస్తాడు.** మహాభూతాలలోనూ, ఇంద్రియార్థాలలోను, ఆకారాలలోనూ కనిపించే వైవిధ్యం, ప్రాణులను భిన్నభిన్న కర్మలలో నియోగించటం - ఇదంతా బ్రహ్మ ఏర్పరచిన విధానమే. కర్మసిద్ధిలో పురుషప్రయత్నమే ప్రధానమంటారు కొందరు మనుష్యులు. మరికొందరు దైవమే కారణ మంటారు. తత్త్వవిచారకులు మాత్రం స్వభావమే కార్యసిద్ధి కారణ మంటారు. పురుషప్రయత్నం, దైవం, స్వభావం - ఈ మూడింటి కలకయితో ఫలసిద్ధి జరుగుతుంది, ఇవి విడివిడిగా కార్యసిద్ధి హేతువులు కాజాలవు అని కొందరంటారు. పురుషార్థమే

కారణమని కానీ, కాదని కానీ, దైవమే కారణమని కానీ, కాదని కానీ, రెండూ కలిసి కారణమని కానీ, కాదని కానీ – ఏ రీతిగానూ నిర్ణయం లేదు. పరమాత్మయందు లగ్నమై సమదర్శనులయిన వారు మాత్రం బ్రహ్మమే కారణ మంటారు. తపస్సే జీవునకు శ్రేయోదాయకం. ఆ తపస్సునకు శమదమాలే కారణం. మనసా కోరుకొన్నవన్నీ ఆ తపస్సువలననే సిద్ధిస్తాయి. ప్రాణిసృష్టికర్త అయిన పరమాత్మను కూడా తపస్సు వలన పొందవచ్చు. తపస్సువలన పరమాత్మ స్వరూపుడై మనిషి సమస్త ప్రాణులమీదా ప్రభుత్వాన్ని సాధించవచ్చు. ఋషులు తపస్సువలననే రేబవళ్ళు వేదాధ్యయనం చేస్తారు. బ్రహ్మ కూడా తపస్సంపన్నుడై ఆద్యంతరహితమయిన వేద వాణిని ఉచ్చరించాడు.

ఋషుల పేర్లు, వేదోక్త సృష్టిక్రమాన్ని అనుసరించి పదార్థాల పేర్లు, ప్రాణుల రూపవైవిధ్యమూ, కర్మప్రవృత్తి – ఇవన్నీ కూడా పరమేశ్వరుడు వేదశబ్దాల ననుసరించియే తొలుత సృష్టించాడు. వేదాలలోని ఋషుల పేర్లు, ఆ క్రమంలో సృష్టించిన పదార్థాల పేర్లు – ఇవన్నీ రాత్రికడచిపోయిన పిదప ప్రభాత వేళలో వ్యవహారం కోసం బ్రహ్మ ఏర్పరచినవే. వేదాలు పేర్లు, వర్ణాశ్రమాది భేదాలు, తపోభేదాలు, కర్మభేదాలు, యజ్ఞాలు ఇవన్నీ కూడా లోకసిద్ధులు. వేదాలలో ఆత్మసిద్ధికై పదిఉపాయాలు చెప్పబడ్డాయి. వేద ద్రష్టలు వేదవాక్యాలలోనూ, వేదాంత వాక్యాలలోనూ చెప్పిన గహనమయిన బ్రహ్మను ఈ పది ఉపాయాల ద్వారా* కూడా సిద్ధింపజేసికొనవచ్చు. జీవునకు శీతోష్ణాది ద్వంద్వానుభవం కర్మజనితమే. జ్ఞాని అయిన మనుజుడు ప్రయత్నపూర్వకంగా ద్వంద్వాలను పరిత్యజించి, ఆత్మసిద్ధిని సాక్షాత్కరింపజేసికొనవచ్చు. బ్రహ్మకు రెండు రూపాలున్నాయి. ఒకటి శబ్దబ్రహ్మ. రెండవది పరబ్రహ్మ. శబ్దబ్రహ్మయందు (వేదాలలో) నిష్ణాతుడై, పరబ్రహ్మను సాక్షాత్కరింపజేసికొనవచ్చు. **క్షత్రియులకు హింసాప్రధానమైన యుద్ధమే యజ్ఞం. వైశ్యులకు హవిర్దానమే యజ్ఞం. శూద్రులకు పరిచర్యలు చేయటమే యజ్ఞం. బ్రాహ్మణులకు తపస్సే యజ్ఞం.** ఈ యజ్ఞవిధి త్రేతాయుగానికి సంబంధించినది. కృతయుగానికి సంబంధించినది కాదు. ద్వాపరంలో క్రమంగా క్షీణిస్తున్న యజ్ఞం కలియుగంలో అదృశ్యమై పోతుంది. కృతయుగంలో మనుజులు ధర్మనిష్ఠులై ఋక్ సామయజుర్వేదాలనూ, సకామయాగాలనూ తపస్సు కన్న వేరుగా భావించి, వాటిని వీడి, తపస్సులోనే లీనమయ్యేవారు. త్రేతాయుగంలో జనించిన మహాబలు లయిన రాజులు చరాచరప్రాణుల నన్నింటినీ నియంత్రించేవారు. త్రేతాయుగంలో వేదాలు, యజ్ఞాలు, వర్ణాశ్రమ ధర్మాలూ సువ్యవస్థితంగా

* *విసం॥ స్వాధ్యాయం, గార్హస్థ్యం, సంధ్యావందనాదులు, చాంద్రాయణాదివ్రతాలు, యజ్ఞం, పూర్తకర్మ, యోగం, దానం, గురుశుశ్రూష, సమాధి. ఇవి వది ఉపాయాలు. (నీల)*

ఉండేవి. ద్వాపరయుగంలో ఆయుఃక్షీణతవలన ప్రజలు వాటికి దూర మయ్యారు. కలియుగంలో సకలవేదాలు కనిపించీ కనిపించనట్టు ఉంటాయి. అప్పుడు అధర్మపీడవలన వేదాలు, యజ్ఞాలు అదృశ్యమవుతాయి.

కృతయుగంలో నాలుగు పాదాలమీద నిలిచిన ధర్మం ఇతర యుగాలలో జితేంద్రియులు, తపస్సంపన్నులు, వేదవేదాంగ వేత్తలూ అయిన బ్రాహ్మణులలోనే ఉంటుంది. కృతయుగంలో స్వభావాన్ని అనుసరించి యజ్ఞవ్రతాదులను ఆచరించేవారు. తరువాతి యుగాలలో వేదవాదులు, ధర్మనిష్ఠులు అయిన పురుషులు ఆగమాల ననుసరించి చూస్తే ధర్మలోపం వలన వికారాన్ని పొందుతారు. వానలు పడ్డప్పుడు చరాచరాలయిన సమస్త ప్రాణులు వృద్ధి నంది, వానలు ఆగిన తరువాత క్షీణించినట్టు యుగయుగాలలో ధర్మాలు కూడా వృద్ధిపొందుతూ, నశిస్తూ ఉంటాయి. వసంతాది ఋతువులలో ఆయా ఋతువుల లక్షణాలు కనిపిస్తూ ఇతర ఋతువులలో అదృశ్యమయినట్లు బ్రహ్మ విష్ణుమహేశ్వరులలో కూడా వారి లక్షణాలు హెచ్చుతగ్గులుగా కనిపిస్తుంటాయి. కృతయుగాది కాల భేదాలను బ్రహ్మయే చేశాడు. ఆ కాలం అనాది, అనంతం కూడా. కాలమే సృష్టి విలయాలను కల్పిస్తుంది. అది నీకు ముందే చెప్పిఉన్నాను. కాలమే ప్రాణులకు సంయమనియమాలను కల్గిస్తుంది. కాలమే వాటి ఉత్పత్తికి స్థానమై నిలుస్తుంది. ప్రాణులన్నీ స్వభావం చేతనే ద్వంద్వాలతో పెనవేసికొని కష్టాలను కొనితెచ్చుకొంటాయి. నాయనా ! నీ ప్రశ్నకు అనుగుణంగా సృష్టి, కాలం, క్రియ, వేదాలు, కర్త, కార్యం, క్రియాఫలం మొదలయిన విషయాల నన్నింటినీ వివరంగా చెప్పాను.

233. బ్రాహ్మప్రలయ - మహాప్రలయ వర్ణనము.

వ్యాసు డిలా చెప్పాడు. పగలు గడచి, రాత్రి ప్రారంభమయ్యే వేళలో బ్రహ్మ ఈ విశ్వాన్ని లయం చేస్తూ, స్థూల జగత్తును సూక్ష్మజగత్తుగా మార్చి, తనలో లీనం చేసికొనే విధానాన్ని చెప్పబోతున్నాను. ప్రళయకాలంలో పై నుండి సూర్యుడూ, క్రింద నుండి ఏడు అగ్నిజ్వాలలు విశ్వాన్ని దహిస్తాయి. అప్పుడు ఈ విశ్వమంతా జ్వాలలతో నిండి మండిపోతూ కనిపిస్తుంది. పృథివిలోని చరాచర భూతాలన్నీ ముందుగా దహింపబడి పృథివిగా మారిపోతాయి. స్థావరజంగమా లన్నీ లయమయిపోయిన తర్వాత భూమిపై చెట్లు, గడ్డి అన్నీ అదృశ్యమై భూమి తాబేటివీపులా కనిపిస్తుంది. ఆ తరువాత భూమిలోని గంధలక్షణాన్ని జలం స్వీకరిస్తుంది. దానితో గంధహీనమైన భూమి తనకు కారణమైన జలంలో కలిసి పోతుంది. అప్పుడు నీళ్ళు మాత్రమే ఉంటాయి. గంభీర ధ్వని రేగుతుంది.

అలలు ఎగిసిపడుతాయి. విశ్వాన్నంతా ముంచి నీళ్ళు కల్లోలంగా నిలుస్తాయి. ఆ తరువాత జలలక్షణాన్ని తేజస్సు స్వీకరిస్తుంది. అప్పుడు జలం రసహీనమై తేజస్సులో లీనమవుతుంది. అగ్నిజ్వాలలు సూర్యుని చుట్టుముట్టి తమలో లీనం చేసికొన్నప్పుడు ఆకాశమంతా జ్వాలలతో నిండి మండిపోతున్నట్టు కనిపిస్తుంది. జ్యోతిర్గుణమయిన రూపాన్ని వాయువు తాను స్వీకరించినపుడు అగ్ని శాంతించి, వాయువులో లీనమవుతుంది. వాయువు ప్రచండమై ఆకాశాన్ని క్షోభింపజేస్తుంది. ఆ తరువాత వాయువు తన వేగంవలన పుట్టిన ధ్వనితో కలిసి పైకీ - క్రిందకూ; అటూ - ఇటూ పది దిక్కులలోనూ వీస్తుంది. ఆ తరువాత వాయుగుణమైన స్పర్శను ఆకాశం కబళిస్తుంది. అప్పుడు గాలి ఉపశమిస్తుంది. ఆకాశం ధ్వనిస్తూ ఒంటరిగా నిలుస్తుంది.

అప్పుడు ఆకాశంలో రూపరస స్పర్శ గంధాలు అసలు ఉండవు. సర్వలోకాలనూ ధ్వనింపజేస్తూ శబ్దగుణంతో ఆకాశం ఒంటరిగా మిగులుతుంది. మూర్తపదార్థ మంటూ ఏదీ ఉండదు. ఆ తరువాత దృశ్యప్రపంచాన్ని వ్యక్తం చేసే మనస్సు తననుండి పుట్టిన ఆకాశగుణమైన శబ్దాన్ని, తనలో లీనం చేసికొంటుంది. వ్యక్తమైన మనస్సు, అవ్యక్తమైన మహత్తత్వం బ్రహ్మ మనస్సులో లయ మవుతాయి. ఇదే బ్రాహ్మప్రళయం. మహాప్రళయ సమయంలో మనస్సును ఆత్మగుణంలో ప్రవేశపెట్టి, చంద్రుడు మనస్సును కబళిస్తాడు. మనస్సు కూడా శాంతించగా చంద్రుడు మిగులుతాడు. ఆ తరువాత చాలా కాలానికి సంకల్పం (అవ్యక్తమనస్సు) చంద్రుని వశపరచుకొంటుంది. చిత్తం సంకల్పాన్ని మ్రింగుతుంది. ఆ చిత్తమే (బుద్ధి) పరమోత్తమ జ్ఞానం. కాలం విజ్ఞానాన్ని కబళిస్తుంది. కాలాన్ని బలం వశం చేసికొంటుంది. బలాన్ని మహాకాలం, మహాకాలాన్ని పరబ్రహ్మ తమ అధీనంలోనికి తెచ్చుకొంటాయి. ఆకాశం తన గుణమైన శబ్దాన్ని తనలో లీనం చేసికొన్నట్లు బ్రహ్మ మహాకాలాన్ని తనలో లీనం చేసికొంటుంది. ఆ పరబ్రహ్మమే పరమాత్మ, అవ్యక్తుడు, సనాతనుడు, సర్వోత్తముడు. ఈ రీతిగా సర్వ ప్రాణులూ లయమవుతాయి. అన్నింటికీ అధిష్ఠానం పరబ్రహ్మమే. ఈ రీతిగా పరమాత్మ స్వరూపులైన యోగులు విద్యామయమైన బోధ్యతత్వాన్ని సాక్షాత్కరింపజేసికొని, దానిని యథాతథంగా కీర్తించారు. అది అలాగే ఉంటుంది. సందేహం లేదు. ఈ విధంగా మరలా మరలా అవ్యక్త పరబ్రహ్మలో సృష్టివిస్తార విలయాలు జరుగుతాయి. వేయి చతుర్యుగాలు బ్రహ్మకు ఒక పగలు అనీ, అంతేకాలం రాత్రియనీ ముందే చెప్పాను.'

234. బ్రాహ్మణ కర్తవ్యము - బ్రాహ్మణ దానమహిమ.

వ్యాసు డిలా చెప్తున్నాడు. ప్రాణికోటికి సంబంధించి నీవడిగిన దానిని వివరించాను. ఇక బ్రాహ్మణకర్తవ్యాన్ని గురించి చెప్పబోతున్నాను విను. బ్రాహ్మణుడు పుట్టిన నాటినుండి సమావృత్తివరకు సర్వసంస్కారాలను వేదవేత్త అయిన ఆచార్యుని సమక్షంలో జరిపించాలి. ఆచార్యునకు తగిన దక్షిణ నివ్వాలి. బాలుడు గురుశుశ్రూషాతత్పరుడై సర్వవేదాలనూ అభ్యసించి, గురుదక్షిణ ద్వారా గురు-ఋణ విముక్తుడై, యజ్ఞవేత్తయై సమావర్తన తర్వాత ఇంటికి మరలాలి. ఆచార్యుని అనుమతి పొంది నాలుగు ఆశ్రమాలలో (బ్రహ్మ చర్య, గృహస్థ, వానప్రస్థ, సంన్యాసాలు) ఏదో యొకదానిని శాస్త్రోక్తంగా ఆచరించి జీవించినంత కాలం దానిలోనే నిలవాలి. వివాహమాడి సంతానాన్ని పొందటం, లేదా జీవితాంతం బ్రహ్మచారిగా ఉండటం, లేదా గురుసన్నిధిలో వానప్రస్థుడై ఉండటం, లేదా సంన్యాసం తీసికోవటం - ఏదో ఒక మార్గంలో జీవించాలి. **ఈ ధర్మాల కన్నింటికీ గృహస్థధర్మం మూలం. దానితో రాగద్వేషాదులను తొలగించుకొని జితేంద్రియుడైనవాడు అన్నింటా సిద్ధినందగలడు. బ్రాహ్మణుడు సంతానాన్ని పొంది పితృఋణాన్ని, శ్రోత్రియుడై ఋషిఋణాన్ని, యజమానియై దేవఋణాన్ని తీర్చి, ముక్తుడై, విహిత కర్మలద్వారా పవిత్రుడై, ఇతరాశ్రమాలలో ప్రవేశించాలి.** భూమండలంలో పరమ పవిత్రమయిన స్థానంలో తాను జీవించాలి. అక్కడ ఆదర్శంగా జీవిస్తూ, ఉత్తమకీర్తిని పొందటానికి ప్రయత్నించాలి. గొప్పతపస్సు వలన గానీ, విద్యాపారంగతత్వం వలన కానీ, యాగాల ద్వారా కానీ, దానాల ద్వారా గానీ బ్రాహ్మణుని కీర్తి వర్ధిల్లుతుంది. యశోవర్ధక మయిన కీర్తి ఈ లోకంలో నిలిచి ఉన్నంతకాలం బ్రాహ్మణుడు పుణ్యాత్ములు పొందే లోకాలను పొంది, అనంతసుఖాలను అనుభవిస్తాడు. బ్రాహ్మణులు అధ్యయనం - అధ్యాపనం, యజనం - యాజనం, దానం - ప్రతిగ్రహం వీటిని ఆశ్రయించి జీవించాలి. అయితే వృథాగా స్వీకరించకూడదు. వృధాగా దానమూ చేయకూడదు. యాజనంవలన కానీ, అధ్యాపనంవలన కానీ, కన్యాశుల్కంగా కానీ చాలా డబ్బు వచ్చినపుడు ఆ ధనాన్ని యాగాలు చేయటానికి, దాన మివ్వటానికి వినియోగించాలి కానీ ఒంటరిగా ఏ రీతిగానూ దానిని వాడుకొనరాదు.

దేవతలకు, ఋషులకు, పితరులకు, గురువులకు, వృద్ధులకు, రోగులకు, ఆకలిగొన్నవారికి వినియోగించటానికి గృహస్థుడు దానాలు పట్టవచ్చు. దానం తీసికోవటంకన్న ధన సంపాదనకు మరొక పవిత్రమార్గం బ్రాహ్మణునకు లేదు. దారిద్ర్య బాధతో లోలోన కుమిలిపోయేవారికి, ఆధ్యాత్మికోన్నతికై ప్రయత్నించే బ్రాహ్మణులకు

సంపాదనలో నుండి యథాశక్తి దానం చేయాలి. పూజార్హులకు, తగినవారికి ఇవ్వరాని వస్తువేదీ లేదు. అటువంటి యోగ్యులకు ఉచ్చైఃశ్రవసాన్ని (ఇంద్రుని అశ్వం) అయినా ఇవ్వవచ్చు అని సజ్జన నిర్ణయం. మహావ్రతధారి అయిన సత్యసంధనరపాలుడు ఇష్టపడి అనునయించి, తన ప్రాణాలతో బ్రాహ్మణుని ప్రాణాలను కాపాడి, స్వర్గానికి వెళ్ళాడు. సంకృతి కుమారుడైన రంతిదేవుడు మహాత్ముడైన వసిష్ఠునకు వెచ్చని నీటినిచ్చి, స్వర్గలోకంలో నిలిచి ఉన్నాడు. అత్రివంశజుడు, ధీమంతుడు అయిన ఇంద్రదమన మహారాజు యోగ్యుడైన బ్రాహ్మణునకు నానావిధాలుగా ధన మిచ్చి, అక్షయలోకాలను పొందాడు. ఉశీనరుని కొడుకయిన శిబి తన శరీర భాగాలను తనకు ఇష్టుడైన ఔరసపుత్రుని బ్రాహ్మణునకై దానంచేసి, ఇక్కడ నుండి స్వర్గలోకానికి వెళ్ళాడు. కాశిరాజయిన ప్రతర్దనుడు తన కళ్ళను బ్రాహ్మణునకు దానంచేసి, ఇహపరలోకాలలో సాటిలేని కీర్తిని అనుభవిస్తున్నాడు. దేవావృధ మహారాజు ఎనిమిదికమ్ములు గల విలువైన తన బంగారు గొడుగును దానంచేసి, దేశప్రజలతో సహా స్వర్గానికి వెళ్ళాడు. అత్రివంశజుడైన మహాతేజస్వి - సాంకృతి తన శిష్యులకు నిర్గుణబ్రహ్మను ఉపదేశించి, ఉత్తమలోకాలను పొందాడు. ప్రతాపవంతుడైన అంబరీషుడు బ్రాహ్మణులకు పదకొండు అర్బుదాల గోవులను దానం చేసి, దేశప్రజలతోపాటు స్వర్గానికి వెళ్ళాడు. (అర్బుదం = పదికోట్లు) సావిత్రి దివ్య కుండలాలను, జనమేజయుడు శరీరాన్ని బ్రాహ్మణులకై పరిత్యజించి, ఉత్తమ లోకాలను పొందారు. వృషదర్భుని కొడుకైన యువనాశ్వుడు సమస్త రత్నాలనూ, ఇష్టస్త్రీలనూ, అందమైన ఇంటినీ దానం చేసి, స్వర్గలోకంలో నిలిచిఉన్నాడు. విదేహరా జయిన నిమి రాజ్యాన్నీ, పరశురాముడు భూమిని, గయుడు నగరాలతో సహా రాజ్యాన్నీ బ్రాహ్మణులకు దానం చేశారు.

ఒకప్పుడు వానలు కురియకపోతే వసిష్ఠుడు ప్రాణిసృష్టికర్త అయిన ప్రజాపతి వలె సర్వప్రజలనూ బ్రతికించాడు. కరంధముని కొడుకు, పుణ్యాత్ముడు అయిన మరుత్త మహారాజు అంగిరునకు కన్యాదానంచేసి, వెంటనే స్వర్గానికి వెళ్ళాడు. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన పాంచాలరాజు / బ్రహ్మ దత్తుడు ద్విజశ్రేష్ఠులకు శంఖ నిధిని దానంచేసి, పుణ్యలోకాలను పొందాడు. మిత్రసహనరపాలుడు కూడా మహాత్ముడైన వసిష్ఠునకు తన కిష్టమైన మదయంతిని ఇచ్చి, ఆమెతో పాటు స్వర్గానికి వెళ్ళాడు. మహాయశస్వి అయిన రాజర్షి-సహస్రజిత్తు బ్రాహ్మణుకై తన ప్రియప్రాణాలను పరిత్యజించి, ఉత్తమ లోకాలను పొందాడు. శతద్యుమ్న మహారాజు ముద్గలునకు సర్వసౌకర్యాలు గల తన సువర్ణమయగృహాన్ని దానం చేసి, స్వర్గానికి పోయాడు. ప్రతాపవంతుడైన శాల్వరాజు - ద్యుతిమంతుడు ఋచీకునకు రాజ్యాన్ని దానంచేసి, ఉత్తమలోకాలను పొందాడు. రాజర్షి అయిన

లోమపాదమహారాజు తన కుమార్తెను ఋష్యశృంగునకు దానంచేసి, సర్వవిధకామాలను విరివిగా పొందాడు. మదిరాశ్వరాజర్షి కూడా అందమయిన తన కుమార్తెను హిరణ్యహస్తునకు దానం చేసి, దేవతలు కూడా ప్రస్తుతించే లోకాలను చేరాడు. మహాతేజస్వి అయిన ప్రసేనజిత్తు లక్షధేనువులను దూడలతో పాటు దానమిచ్చి, ఉత్తమలోకాలను పొందాడు. వీరే కాక, మహాత్ములు, శిష్టాత్ములు, జితేంద్రియులు అయిన వారెందరో దానంవలన, తపస్సువలన స్వర్గాన్ని పొందారు. భూమి ఉన్నంతకాలం వారి కీర్తి స్థిరంగా ఉంటుంది. దానాలవలన, యజ్ఞాలవలన, సంతానోత్పాదనం వలన వీరంతా స్వర్గానికి చేరారు.'

235. బ్రాహ్మణ కర్తవ్య ప్రతిపాదనము - కాలనదీతరణోపాయము.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'బ్రాహ్మణుడు వేదోక్తమైన త్రయీవిద్యను సందర్శించాలి. వేదాంగాలతో సహా ఋక్ సామ యజు రథర్వ వేదాలను స్వర సహితంగా అధ్యయనం చేయాలి.* షట్కర్మలలో ప్రకాశించే పవిత్రధర్మం వేదాలలో సుస్థాపిత మయింది. వేదప్రవచనంలో నిష్ణాతులై, అధ్యాత్మవిద్యలో నేర్పరులై, సత్య సంపన్నులైన అదృష్టవంతులు జగత్సృష్టి సంహారాలను గురించి సదాచారాన్ని పాటించాలి. **బ్రాహ్మణుడు ఇతరప్రాణులకు కష్టం కానీ నష్టం కానీ కలిగించకుండా తన జీవితాన్ని నడపుకోవాలి. సజ్జన సంసేవన ద్వారా తత్త్వజ్ఞానాన్ని పొంది, సజ్జనుడై, శాస్త్ర విచక్షణను పొందాలి.** సత్యప్రతిజ్ఞుడై స్వధర్మానుసారంగా లౌకికకర్మలను పాటించాలి. షట్కర్మలనూ అనుసరించాలి. బ్రాహ్మణుడు ధీరుడై, అప్రమత్తుడై, జితేంద్రియుడై, ధర్మవేత్తయై, ఆత్మవంతుడై ఎప్పుడూ శ్రద్ధాపూర్వకంగా పంచమహాయజ్ఞాసక్తుడు కావాలి.** హర్షమద క్రోధాలనుండి బయటపడిన బ్రాహ్మణుడు శోకానికి గురి కాడు. దానం, అధ్యయనం, యజ్ఞం, తపస్సు, బిడియం, ఋజుత్వం, ఇంద్రియ సంయమం - వీటి వలన తేజస్సు పెరుగుతుంది. పాపం నశిస్తుంది. పాపాలు నశించిపోయినపుడు ధీమంతుడైన బ్రాహ్మణుడు మితంగా భుజిస్తూ, జితేంద్రియుడై, కామక్రోధాలను అదుపులో నిలుపుకొని బ్రహ్మపదాన్ని చేరగోరాలి. అగ్నులను, బ్రాహ్మణులనూ అర్చించాలి. దేవతలకు నమస్కరించాలి. కటువుగా మాటాడకూడదు. అధర్మరూపమైన హింసను విడనాడాలి. బ్రాహ్మణులకై విధింపబడిన సనాతన కర్తవ్య మిది. కర్మల తత్త్వాన్ని తెలిసి, పాటించడం వలన సిద్ధి లభిస్తుంది. సంసారనది భయంకరమైనది. పంచేంద్రియాలు

---

* *విi 1. త్రయీ విద్య = అ - ఉ - మ్ - ఈ మూడు అక్షరాలతో సంబద్ధమైన ప్రణవవిద్య.*
2. షట్ కర్మలు = యజన, యాజన, అధ్యయన, అధ్యాపన, దాన, ప్రతిగ్రహాలు.

** *విi పంచమహా యజ్ఞాలు = దేవయజ్ఞం, పితృయజ్ఞం, భూతయజ్ఞం, మనుష్యయజ్ఞం, బ్రహ్మయజ్ఞం.*

జలం. లోభం ఒడ్డు. కోపం బురద. దాని వేగాన్ని నిరోధించటం కానీ, దాటటం కానీ చాలా కష్టం. కానీ ధీమంతుడు దానిని దాటుతాడు. ప్రాణిని మరీ మోహానికి గురిచేసే కాలం ఎప్పుడూ మీదపడటానికి ఉద్యమిస్తూ ఉంటుంది. జాగరూకతతో గమనించాలి.

స్వభావమనే స్రోతస్సు విధివిహితం. మహాశక్తి సంపన్నం. ఎదురులేనిది. అటువంటి స్వభావప్రవాహంలో విశ్వమంతా నిరంతరాయంగా ప్రవిహిస్తుంటుంది. కాలరూపమైన మహానది ప్రవహిస్తోంది. వర్షమనే సుడులు ఎప్పుడూ రేగుతుంటాయి. మాసాలు దానిలో అలలు. బుతువులు వేగం. పక్షాలు గడ్డి, తీవెలు నిమేషాలు, ఉన్మేషాలు నురుగు, దివారాత్రాలు జలప్రవాహం. కామదేవుడు భీకరమకరం. వేదాలు, యజ్ఞం నౌక. ధర్మం ప్రాణులకాశ్రయమైన ద్వీపం. అర్థకామాలు జలం. సత్యభాషణం, మోక్షం రెండూ ఒడ్లు. హింసావృక్షాలు కాలప్రవాహంలో కొట్టుకుపోతుంటాయి. యుగాలు హ్రదాలు. బ్రహ్మ కాలప్రవాహంలో పుట్టే పర్వతం. బ్రహ్మ సృష్టించిన ప్రాణులన్నీ ఆ కాలప్రవాహంలో పడి యమసదనం వైపు లాగబడతాయి. బుద్ధిమంతులు, ధీరులు అయిన మనుష్యులు ప్రజ్ఞానౌకను సహాయంగా తీసికొని, కాలప్రవాహాన్ని దాటిపోతారు. ఆ నౌకలేని అవివేకులు ఏం చేయగలరు ? ప్రాజ్ఞుడు కాలనదిని దాటగలగటం, అజ్ఞాని దాటలేకపోవటం యుక్తియుక్తమే. ఎందుకంటే ప్రాజ్ఞుడు అంతటా గుణదోషాలను ముందుగానే చూడగలుగుతాడు. కామాసక్తుడు, చంచల చిత్తుడు, మందమతి అయిన అజ్ఞాని సంశయకారణంగా కాలప్రవాహాన్ని దాటలేడు. అదే రీతిగా అచేతనంగా నిలిచినవాడు కూడా దానిని దాటలేడు. జ్ఞాననౌక లేనివాడు మోహచిత్తుడై, మూఢుడై మహాదోషాన్ని పొందుతాడు. కామ మనే మకరానికి పట్టుబడినవానికి జ్ఞానం కూడా నౌకలా సహకరించలేదు. కాబట్టి విచక్షణగలవాడు కాల ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయాలి. తాను బ్రహ్మజ్ఞాని కావటమే కాలప్రవాహాన్ని దాటటం. **ఉన్నతవంశంలో పుట్టిన బ్రాహ్మణుడు అధ్యాపన, యాజన,. ప్రతిగ్రహాలలో ఆసక్తి చూపరాదు. అధ్యయన, యజన, దానాలను ఆచరించాలి. తానెలా ఉన్నా ప్రజ్ఞ ద్వారా ఆత్మోద్ధరణకు ప్రయత్నించి, కాలప్రవాహాన్ని దాటాలి.** వైదిక సంస్కారాలు కలిగి, నియమపూర్వకంగా ప్రవర్తిస్తూ, ఇంద్రియాలను అదుపు చేయగల ప్రాజ్ఞునకు వెంటనే ఇహపరలోకాలలో సిద్ధి లభిస్తోంది. గృహస్థుడు క్రోధాసూయలు లేకుండా ముందుచెప్పిన నియమాలను పాటించాలి. ఎప్పుడూ పంచయజ్ఞాలను పాటిస్తూ, యజ్ఞశేషాన్ని మాత్రమే భుజించాలి.

బ్రాహ్మణుడు సత్పురుషుల ధర్మాన్ని అనుసరిస్తూ, శిష్టాచారాన్ని పరిపాలిస్తూ, జీవికను పొందే ప్రయత్నం చేయాలి. అది ఇతరుల జీవికకు హాని కల్పించకూడదు.

లోకనిందకు గురికాకూడదు. బ్రాహ్మణుడు వేదవేత్తయై, తత్త్వజ్ఞానియై, సదాచార వివేకియై స్వధర్మాన్ని అనుసరించి కార్యశీలుడు కావాలి. కర్మసాంకర్యానికి (స్వధర్మ పరధర్మాల కలయిక) అవకాశమివ్వరాదు. కర్మ శీలుడు, శ్రద్ధాళువు, జితేంద్రియుడు, ప్రాజ్ఞుడు, అసూయారహితుడు, ధర్మాధర్మవిశేషజ్ఞుడు అయిన బ్రాహ్మణుడు దాటశక్యం కాని దుఃఖాలను కూడా దాటిపోగలడు. ధీరుడు, అప్రమత్తుడు, జితేంద్రియుడు, ధర్మవేత్త, అభిమాని అయి హర్షమద క్రోధాలకు దూరమైన బ్రాహ్మణుడు శోకానికి గురికాడు. ఇది బ్రాహ్మణులకై విధింపబడిన సనాతన ధర్మం. కర్మతత్త్వం తెలిసి, కర్మల నాచరిస్తే అవి అంతటా సిద్ధిస్తాయి. విచక్షణ లేనివాడు ధర్మాన్ని కోరుతూ కూడా అధర్మాన్ని పాటిస్తాడు. ఒక్కొక్కప్పుడు దుఃఖంలో అధర్మతుల్యమైన ధర్మాన్ని పాటిస్తాడు. ధర్మాన్నే పాటిస్తున్నా ననుకొంటూ అధర్మాన్ని ఆచరిస్తాడు. అధర్మంమీది ప్రేమతో ధర్మాన్ని పాటిస్తాడు. ఈ రీతిగా అజ్ఞానంతో రెండురకాలుగా కర్మలను ఆచరిస్తూ మనుష్యుడు మరలమరలా పుడుతుంటాడు, చస్తుంటాడు.'

236. ధ్యాన - యోగ - సాంఖ్య నిరూపణము.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'మనిషి జలప్రవాహంలో మునుగుతూ, తేలుతూ కొట్టుకొని పోయేటప్పుడు ఏదైనా నావ దొరికితే ఒడ్డుకు చేరగలిగినట్టు సంసార ప్రవాహంలో కొట్టుకొని పోయేటప్పుడు విముక్తి కావాలంటే జ్ఞానమనే నౌకను ఆశ్రయించాలి. ప్రజ్ఞద్వారా నిశ్చితంగా తత్త్వాన్ని తెలిసిన ధీరులు అజ్ఞానులను జ్ఞాననౌక సహాయంతో ఒడ్డుకు చేరుస్తారు. అపండితులు ఇతరులను తరింపజేయలేరు. తమను తాము కూడా ఏ రీతిగానూ ఉద్ధరించుకోలేరు. **సమాహిత చిత్తుడైన యోగి రాగద్వేషాది దోషాలను తొలగించుకొని, ద్వాదశ యోగాలను ఆశ్రయించి, ధ్యానాన్ని అభ్యసించాలి. ఆ ద్వాదశయోగాలు ఇవి. దేశం, కర్మ, అనురాగం, అర్థం, ఉపాయం, అపాయం, నిశ్చయం, చక్షువు, ఆహారం, సంహారం, మనస్సు, దర్శనం.** ఉత్తమజ్ఞానాన్ని పొందగోరేవాడు బుద్ధితో వాక్కునూ, మనస్సునూ నియంత్రించాలి. ఆత్మశాంతిని కోరుకొనేవాడు జ్ఞానంతో బుద్ధిని నియంత్రించాలి. పురుషుడు పరమ భయంకరుడైనా, సర్వవేదవేత్త అయినా, అసలు ఋక్కులే రాని బ్రాహ్మణుడు అయినా, ధార్మికుడైనా, యజమాని అయినా పాపిష్ఠులలో శ్రేష్ఠుడైనా, పురుషోత్తముడైనా, కష్టాలు పడుతున్న వాడైనా సరే ఈ ద్వాదశయోగాలను తెలిసికొనినవాడు దుర్లభమైన ఈ జననమరణ సాగరాన్ని దాటిపోగలడు. ఈ రీతిగా సిద్ధి పర్యంతమూ ఈ యోగాలను ఆశ్రయించిన వాడు బ్రహ్మాన్ని తెలియగోరిన

వాడైతే వేదోక్తకామ్య కర్మలను అతిక్రమించగలడు. ఈ యోగమొక సుందరరథం. ధర్మమే దీనిపైనున్న ఆసనం. బిడియమే ఆవరణం (కవచం). ఉపాయాపాయాలు నొగళ్ళు. అపానమే ఇరుసు. ప్రాణవాయువు కాడి. బుద్ధి ఆయువు. జీవుడు బంధనం. చైతన్యమే కిరీటం. సదాచారమే నేమి. నేత్రం, చర్మం, నాసిక, శ్రవణం వాహనాలు. ప్రజ్ఞ నాభి. సర్వశాస్త్రాలు కొరడా. జ్ఞానం సారథి. జీవుడు రథియై దీని నధివసించి ఉంటాడు. మెల్లమెల్లగా సాగే ఈ రథానికి శ్రద్ధాదమాలు రక్షకులు. త్యాగమనే సూక్ష్మగుణం వెన్నంటి నడుస్తుంది. ఈ రథం ధ్యానమార్గంలో పయనిస్తుంది. ఈ రీతిగా జీవునితో కూడిన ఈ దివ్యరథం బ్రహ్మలోకంలో విరాజిల్లుతుంది.

ఈ రథాన్ని ఎక్కి సాధన చేయదలచుకొన్నవాడు, త్వరగా పరమాత్మను చేరదలచినవాడు పాటించవలసిన శీఘ్రఫలదాయి అయిన విధిని చెపుతాను. సాధకుడు వాక్కును నియంత్రించి పృథివీ, జల, తేజో, వాయు, ఆకాశ, బుద్ధి, అహంకార రూపాలయిన సప్తధారణలను సిద్ధం చేసికోవాలి. వాటికి విషయాలతో (గంధ, రస, రూప, స్పర్శ, శబ్ద, అహంవృత్తి, నిశ్చయాలతో) సంబంధించిన ప్రావరణాలు వాటి ప్రక్కనా, వెనుకా ఉంటాయి. సాధకుడు క్రమంగా పృథివీ, జల, తేజో, వాయు, ఆకాశ, అహంకార, బుద్ధులపై అధికారాన్ని పొందుతాడు. తరువాత క్రమంగా అవ్యక్త బ్రహ్మయొక్క ఐశ్వర్యాన్ని కూడా పొందుతాడు. యోగాభ్యాస ప్రవృత్తిగల యోగి పృథివ్యాదులపై అధికారాన్ని పొందే విధానాన్ని, ధారణా పూర్వకంగా ధ్యానం చేసే సమయంలో బ్రహ్మ ప్రాప్తిని అనుభవించే యోగసిద్ధిని వివరిస్తాను. స్థూలదేహాభిమానం వీడి, ధ్యానమగ్నుడైన యోగికి కొన్ని సూక్ష్మరూపాలు కనిపిస్తాయి. ప్రారంభంలో పృథివీధారణ చేసే సమయంలో శిశిరర్తువులోని పొగమంచువలె ఒక సూక్ష్మవస్తువు ఆకాశాన్ని ఆచ్ఛాదించటం చూస్తాడు. దేహాభిమాన విముక్తుడైన యోగికి ఇది తొలి అనుభవ రూపం. మంచువంటి పొగ తొలగిపోగానే మరొకరూపం కనిపిస్తుంది. ఆకాశమంతా జలంలా కనిపిస్తుంది. జలరూపంగా ఆత్మానుభవముంటుంది. నీరు తొలగి పోగానే అగ్నితత్త్వధారణ, ఆ సమయంలో అంతటా అగ్నిరూపం కనిపిస్తుంది. అగ్నిరూపం తొలగిపోగానే యోగికి ఆకాశమంతా వాయురూపంగా కనిపిస్తుంది. తన శిస్త్రాలయిన వృక్షపర్వతాదులను వాయువు కప్పివేస్తాడు. ఉన్నిదారంవలె సూక్ష్మరూపంతో తాను కూడా ఆకాశంలో వాయువుతో పాటు ఉన్నట్లనిపిస్తుంది సాధకునకు. ఆ తరువాత వాయుతత్త్వధారణ ముగిసిన తర్వాత - వాయువుయొక్క సూక్ష్మరూపం స్వచ్ఛాకాశంలో లీనమయిన తరువాత - కేవలం నీలాకాశం మిగులుతుంది. ఆ సమయంలో బ్రహ్మభావాన్ని పొందగోరిన యోగిచిత్తం అత్యంతమూ సూక్ష్మమై పోతుంది.

ఈ లక్షణాలన్నీ ప్రకటమైన పిదప యోగి పొందబోయే ఫలితాన్ని విను. పార్థివైశ్వర్యం సిద్ధించిన తరువాత యోగికి స్పష్టించే శక్తి కలుగుతుంది. ఆ యోగి ప్రజాపతివలె క్షోభరహితుడై తనశరీరం నుండి ప్రజాసృష్టి చేయగలడు. వాయుతత్త్వం సిద్ధించిన తరువాత ఎవరి సహాయం లేకుండా సాధకుడు ఒక వ్రేలితోనో, బొటన వ్రేలితోనో, చేతితోనో, కాలితోనో భూమిని కూడా కదలించగలుగుతాడు. ఆకాశతత్త్వం సిద్ధించిన తరువాత యోగి ఆకాశంలో ఆకాశంవలె అంతటా వ్యాపించగలడు. తన శరీరాన్ని అంతర్ధానం చేసికొనగలశక్తి కూడ వస్తుంది. జలతత్త్వంపై అధికారం పొందిన యోగి అనుకొన్నంతలో జలాశయాలను కూడా త్రాగివేయగలుగుతాడు. అగ్నితత్త్వాధికారి అయిన యోగి ఎవ్వరూ కన్నెత్తి చూడలేనంత తేజస్వి అవుతాడు. ఆ తేజస్సు నశించదు కూడా. అహంకారాన్ని జయించిన తరువాత యోగికి పంచభూతాలూ వశ మవుతాయి. పంచభూతాలకూ, అహంకారానికీ ఆత్మ బుద్ధి. ఆ బుద్ధిని గెలిచిన తరువాత యోగికి సంపూర్ణాధికారం సిద్ధిస్తుంది. అప్పుడు విశుద్ధ తత్త్వజ్ఞానం పూర్తిగా లభిస్తుంది. ఆపై ఈ జగత్తు పరమాత్మనుండి పుట్టి వ్యక్తమని వ్యవహరింపబడుతుంది కాబట్టి పదార్థకార్య భూత మయిన వ్యక్త జగత్తు అంతా అవ్యక్తంలో లీనమవుతుంది.

సాంఖ్య దర్శనంలో వివరింపబడిన అవ్యక్తవిద్యను సవిస్తరంగా చెపుతాను. విను - ముందు సాంఖ్యంలో చెప్పిన వ్యక్త విద్యను గూర్చి విను. సాంఖ్య యోగాలు రెండింటిలోనూ సమానంగా ఐరవై అయిదు తత్త్వాలుంటాయి.* ఈ విషయంలో విశేషవిషయాలను చెపుతా విను. పుట్టుట, పెరుగుట, శిథిలమగుట, మరణించుట - ఈ నాలుగు లక్షణాలు గలది వ్యక్తం. దీనికి భిన్నమైనది అవ్యక్తం. వేదాలలోనూ, శాస్త్ర సిద్ధాంతాలలోనూ అవ్యక్తం రెండు విధాలు. అవి జీవాత్మ, పరమాత్మ. అవ్యక్తుడై కూడా జీవాత్మ వ్యక్తసంబంధంవలన జనన, వృద్ధి, జరా, మరణాలు కలిగి ధర్మార్థకామమోక్షాలతో సంబంధాన్ని కల్పించుకొంటాడు. అవ్యక్తంలో మరో భేదమయిన పరమాత్మ జ్ఞానస్వరూపుడు. వ్యక్తాన్ని సత్త్వ (క్షేత్ర) మని, అవ్యక్తాన్ని క్షేత్రజ్ఞ డని అంటారు. వేదాలలో కూడా ఆత్మభేదాలు ఇలాగే చెప్పబడ్డాయి. విషయాసక్తుడైన జీవుడు విషయ విముఖుడై నివృత్తి పొందినపుడు

---

* *॥ పంచవింశతి తత్త్వాలు.*

సాంఖ్యం = మూల ప్రకృతి, మహత్తత్త్వం, అహంకారం, మనస్సు అయిదు పంచతన్మాత్రలు, అయిదు జ్ఞానేంద్రియాలు, అయిదు కర్మేంద్రియాలు, అయిదు మహాభూతాలు, పురుషుడు

యోగం = పంచ మహాభూతాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, పంచతన్మాత్రలు, మనస్సు, అహంకారం, మహత్తత్వం, మూల ప్రకృతి, పురుషుడు.

ముక్తు డవుతాడు. సాంఖ్య వాదంలో ఇదే మోక్షం. మమతాహంకారాలు లేనివాడు, ద్వంద్వరహితుడు, సంశయ రహితుడు, క్రోధ ద్వేషవిహీనుడు, సత్యభాషి, తిట్టినా కొట్టినా హాని తలపెట్టనివాడు, అందరిపై మైత్రీ భావం గలవాడు, త్రికరణాలతో ఎవ్వరికీ కీడు చేయనివాడు, సర్వసమ భావుడు అయిన యోగి బ్రహ్మభావాన్ని పొందగలడు. దేని మీదా రాగద్వేషాలు లేనివాడు, దొరికిన జీవికతో తృప్తిపడే వాడు, లోభరహితుడు, వ్యథారహితుడు, జితేంద్రియుడు, కర్తవ్యాకర్తవ్యాలలో సమదృష్టి గలవాడు, అచంచలేంద్రియుడు, నిశ్చలమనస్కుడు, సర్వప్రాణి సమమిత్రుడు, మట్టినీ రాతినీ బంగారాన్నీ ఒకటిగా చూడగలవాడు, ప్రియా ప్రియ భేదశూన్యుడు, ధీరుడు, స్తుతి నిందల నొకటిగా భావించేవాడు, కామనా రహితుడు, బ్రహ్మచర్యాన్ని దృఢంగా పాటించేవాడు, ఏ ప్రాణినీ హింసించని వాడు సాంఖ్యయోగి. ఆ జ్ఞాని సంసార బంధాలనుండి ముక్తినందుతాడు. యోగి ఏ కారణాలతో ఎలా ముక్తినందగలడో చెపుతాను. విను. యోగంవలన లభించిన ఐశ్వర్యాన్ని అతిక్రమించి, వాటి నుండి బయటపడిన యోగి ముక్తుడు. ఈ రీతిగా భావశుద్ధిని కలిగించే బుద్ధిని గూర్చి చెప్పాను. ఆ బుద్ధిబలంతో సాధన చేసి ద్వంద్వరాహిత్యాన్ని పొందినవాడు బ్రహ్మభావాన్ని పొందుతాడు.'

237. బుద్ధి ప్రాధాన్యము - ప్రాణుల తారతమ్య వర్ణనము.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'ధీరుడు జ్ఞానమనే నౌకను ఆలంబనంగా చేసికొని, సంసారసాగరంలో పడుతూ లేస్తూ, ఆత్మశాంతికై వాస్తవిక జ్ఞానాన్ని ఆశ్రయించాలి.' శుకు డిలా అడిగాడు. 'మనిషిని జననమరణా లనే ద్వంద్వం నుండి తరింపజేసే జ్ఞానం లేదా విద్య ఏది ? అది ప్రవృత్తి లక్షణమైన ధర్మమా? నివృత్తి రూపమైన జ్ఞానమా ? చెప్పు.' వ్యాసు డిలా చెప్తున్నాడు. 'జగత్తు స్వాభావికంగానే పుట్టిన దనీ, దీనికి ఏ చైతన్య శక్తి మూలకారణం కాదనీ భావించేవాడు హేతురహితమైన తన తర్కం ద్వారా ఆ భావాన్ని పెంచి పోషిస్తుంటాడు. వస్తుగత స్వభావమే జగత్తునకు కారణ మనీ, మరేదీ కాదని నిశ్చితంగా చెప్తుంటారు గదా ! దర్భవెలుపల కనిపించకుండా ఉన్న ఈనె దర్భను చీల్చినపుడు వారికి కనిపించదా ? ఈ మతాన్ని ఆశ్రయించి స్వభావాన్నే జగత్కారణంగా భావించి, పరమేశ్వరోపాసనకు దూర మయిన అల్పబుద్ధులు శ్రేయస్సును పొందలేరు. స్వభావాన్నే జగత్కారణంగా భావించి, ఈశ్వరాస్తిత్వాన్ని నిరాకరించటం కల్పనామాత్ర మయిన మోహచేష్ట. అది వినాశకారణం. స్వభావపరిభావాల తత్త్వాన్ని గూర్చి చెప్పబోయే

మాటలు విను. ఈ జగత్తులో భూమిని దున్నటం మొదలయిన పనులు, బీజసంగ్రహణం, వాహనాలు, ఆసనాలు, ఇళ్ళు ఇవన్నీ బుద్ధిమంతులు కల్పించినవే. ఇవి స్వాభావికంగానే జరిగేటట్లయితే ఎవ్వరూ ఆ పనులు చేయరు గదా ! క్రీడాస్థలాలు, ఇళ్ళు నిర్మించుకొంటున్నారు. రోగాలు వస్తే ఔషధసేవ చేస్తున్నారు. జ్ఞానులు వీటికి ప్రయోక్తలు. బుద్ధిమంతులు వాటిని యథాతథంగా పాటిస్తారు. బుద్ధియే అర్థాన్ని లభింపజేస్తుంది. బుద్ధియే శుభాలను కలిగిస్తుంది. సమానలక్షణాలు గల రాజులలో కూడా ప్రజ్ఞావంతుడు రాజ్యపాలన చేస్తూ, ఇతరులను శాసిస్తాడు. ప్రాణులలో పెద్ద, చిన్న భేదాలు బుద్ధివలన ఏర్పడినవే. ప్రాణుల సృష్టి విద్యవలన జరిగింది కాబట్టి ప్రాణులకు విద్యయే ఉత్తమగతి.

లోకంలో నాలుగువిధాలయిన ప్రాణులున్నాయి. అవి జరాయుజాలు, అండజాలు, ఉద్భిజాలు, స్వేదజాలు. వాటిని కూడా గమనించాలి. స్థావరాల కన్నా జంగమప్రాణులు విశిష్టాలు. స్థావరాలలో లేని చేష్ట జంగమాలలో విశేషంగా కనిపిస్తుంది. కాబట్టి ఆ విశేషం వలన జంగమాలలోని విశిష్టత స్వతస్సిద్ధం. జంగమ ప్రాణులలో కూడా రెండుకాళ్ళజంతువులు, చాలా కాళ్ళున్న జంతువులు అని రెండు రకాలు. వీటిలో చాలా కాళ్లున్న వాటికన్నా రెండుకాళ్ళ జంతువులు విశిష్టాలు. రెండు కాళ్ళప్రాణులలో కూడా పార్థివాలు (మనుష్యులు), అపార్థివాలు (పక్షులు) అని రెండు రకాలు. అపార్థివాలకన్న పార్థివాలు శ్రేష్ఠాలు. పార్థివప్రాణులు అన్నం తింటాయి. పార్థివ ప్రాణులు కూడా మధ్యమ-అధమప్రాణులని రెండు రకాలు. మధ్యమ ప్రాణులు జాతిధర్మాన్ని పాటిస్తాయి. అందువలన అధమ ప్రాణులకన్న అవి గొప్పవి. మధ్యమ ప్రాణులలో కూడా ధర్మమెరిగినవి, ధర్మమెరుగనివి అని రెండు రకాలు. వీటిలో కర్తవ్యాకర్తవ్య వివేకంతో కర్తవ్యాన్ని పాటిస్తాయి కాబట్టి ధర్మమెరిగిన ప్రాణులు గొప్పవి. ధర్మమెరిగిన ప్రాణులలో కూడా వేదజ్ఞులు, అవేదజ్ఞులు అని రెండు రకాలు. వేద ప్రతిష్ఠగలవారు కాబట్టి అవేదజ్ఞుల కన్న వేదజ్ఞులు గొప్ప. వేదజ్ఞులలో కూడా ప్రవక్తలు, ఇతరులు అని రెండు రకాలు. వీరిలో వేదధర్మాలను అన్నింటినీ ధారణచేసి ఉంటారు కాబట్టి ప్రవక్తలు ఇతరులకన్న గొప్పవారు. ప్రవక్తల ద్వారా ధర్మ, కర్మ, ఫలాలతో పాటు వేదజ్ఞానం ఇతరులకు అందుతుంది. ధర్మసహితంగా సకలవేదాలూ ప్రవక్తల ద్వారానే ప్రకటిత మవుతాయి. ప్రవక్తలలో కూడా ఆత్మజ్ఞులు, అనాత్మజ్ఞులు అని రెండు రకాలు. వీరిలో జననమరణ తత్త్వమెరిగిన ఆత్మజ్ఞులు అనాత్మజ్ఞుల కన్న శ్రేష్ఠులు. ధర్మం ప్రవృత్తి, నివృత్తి అని రెండు విధాలు గదా ! ఆ రెండూ తెలిసిన వాడే సర్వజ్ఞుడు, సర్వవేత్త. అతడే త్యాగి, సత్యసంకల్పుడు, సత్యవాది, పవిత్రుడు, సమర్థుడు కూడా. శబ్దబ్రహ్మ (వేద) నిష్ణాతుడై, పరబ్రహ్మతత్త్వాన్ని నిశ్చితంగా గ్రహించి, బ్రహ్మనిష్ఠుడైన వాడే బ్రాహ్మణు

డని దేవత లంటారు. జ్ఞానులై లోపల, వెలుపల వ్యాపించియున్న అధియజ్ఞాన్ని (పరమాత్మను), అధిదైవాన్ని (పురుషుని) సాక్షాత్కరించుకొన్నవారే దేవతలు. వారే ద్విజులు. అటువంటి వారిలోనే సంపూర్ణ విశ్వమూ, సంపూర్ణ జగత్తూ ప్రతిష్ఠింపబడిఉన్నాయి. వారి మాహాత్మ్యంతో సమానమైనది ఏదీ లేదు. వారు జన్మనూ, మృత్యువునూ, కర్మను పూర్తిగా అతిక్రమించి, చతుర్విధప్రాణులకూ అధీశ్వరులై స్వయంభువులు కాగలరు.

238. కర్మతత్త్వ వివేచన - యుగధర్మవర్ణన - కాలమాహాత్మ్యము.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'ఇది బ్రాహ్మణులకై విధింపబడిన పురాతన ప్రవృత్తి. జ్ఞానియై కర్మల నాచరించినవాడు అంతటా సిద్ధి నందగలడు. కర్మసంశయం లేకపోతే కర్మ సిద్ధిస్తుంది. అయితే ఈ కర్మ స్వాభావికమా ? జ్ఞానసిద్ధమా ? పురుషునకు ఆ కర్మ వేదవిహిత మయితే అది జ్ఞాన సిద్ధం. వేదవిహితం కాకపోతే స్వాభావికం. యుక్తి, ఫలప్రాప్తులతో సహా దానిని వివరిస్తాను, విను. కొందరు కర్మసిద్ధిలో పౌరుషమే కారణమంటారు. కొందరు మనుష్యులు దైవమే కారణమని గట్టిగా చెపుతారు. ఇతరజనులు స్వభావమే కారణమంటారు. కొందరు మనుష్యులు పౌరుషమూ, దైవమూ, కాలస్వభావమూ మూడూ కారణమంటారు. కొందరు వీటిలో ఏదో ఒకటి ప్రధాన కారణం, మిగిలినవి అప్రధాన కారణా లంటారు. మరికొందరు వీటి నన్నింటినీ కలిపి ఆ సముదాయం కారణమంటారు. కర్మ నిష్ఠమయిన విచారణ చేసేవారు (బౌద్ధికపక్షం) 'ఇది ఇలాగే ఉంది" "ఇది ఇలా లేదు" "ఈ రెండూ సంభవమే" "ఈ రెండూ సంభవంకాదు" ఇలా వివిధాభిప్రాయాలు ప్రకటిస్తారు. కానీ సత్త్వనిష్ఠులయిన యోగులు అంతటా బ్రహ్మనే కారణంగా భావిస్తారు. త్రేతా, ద్వాపర, కలియుగాలలో జనులు పరమార్థ విషయంలో సంశయగ్రస్తు లవుతారు. కృతయుగంలో తపస్సులుగా, సత్త్వగుణులుగా ఉన్నందువలన ప్రశాంతంగా ఉంటారు. కృతయుగంలో ఋక్ సామయజుర్వేదాలను సమానంగా చూసేవారు. కామద్వేషాలను ప్రక్కకు నెట్టి తపస్సునే ఆశ్రయించేవారు. తపోధర్మంతో కూడి సంయమశీలుడై ఎప్పుడూ తపస్సునందే ఆసక్తుడైన వాడు ఆ బలంతో తాను మనసా భావించిన కోరికల నన్నింటికీ పొందగలడు. తపస్సుతో మనిషి బ్రహ్మభావాన్ని పొందగలడు. పొంది జగత్తును సృష్టించగలడు. బ్రహ్మభావాన్ని పొందిన మనిషి సర్వప్రాణులకూ ప్రభువు కాగలడు.

బ్రహ్మను గూర్చి వేదాలలోని కర్మకాండలలో రహస్యంగా చెప్పబడింది. అందుకే వేదద్రష్టలు కూడా దానిని తెలియలేరు. కానీ వేదాంత గ్రంథాలలో స్పష్టంగా

ప్రతిపాదింపబడింది. కర్మయోగం ద్వారా ఆ బ్రహ్మను సాక్షాత్కరింప జేసికొనవచ్చు. క్షత్రియులకు ఆలంభమే* యజ్ఞం. వైశ్యులకు హవిర్దానమే యజ్ఞం. శూద్రులకు పరిచర్యయే యజ్ఞం. బ్రాహ్మణులకు జపమే యజ్ఞం. **వేదాధ్యయనం చేతనే బ్రాహ్మణుడు కృతకృత్యుడు కాగలడు. తాను మరే పనీ చేసినా, చేయకపోయినా సర్వప్రాణులపై మిత్రభావాన్ని ప్రదర్శించటంవలననే బ్రాహ్మణుడు అవుతాడు.** కృతత్రేతాయుగంలో వేదాలు, యజ్ఞాలు, వర్ణాశ్రమ ధర్మాలు పవిత్రంగా పాటింపబడతాయి. ద్వాపర యుగంలో ప్రజల ఆయుఃప్రమాణం తగ్గినందువలన అవన్నీ క్షీణిస్తాయి. ద్వాపర కలియుగాల్లో వేదాలు క్షీణిస్తాయి. కలియుగాంతంలో అయితే కనిపిస్తాయో - లేదో ? కలియుగాంతంలో అధర్మపీడవలన సర్వవర్ణాల ధర్మాలు నశిస్తాయి. గోవులు, భూమి, నీరు, ఓషధులు, వీటి రసం కూడా దాదాపు నశిస్తుంది. వేదాలు, వైదిక ధర్మాలు, ఆశ్రమ ధర్మాలు అన్నీ అప్పుడు అధర్మంతో కలిసి కనిపించకుండా పోతాయి. స్థావర జంగమ ప్రాణులన్నీ స్వధర్మపాలనలో వికృతాలవుతాయి. వాన భూతలంలోని సమస్త ప్రాణులనూ ఉద్భవింపజేసి, అన్నిరకాలుగా తదంగాలను పోషించినట్లు వేదాలు కూడా ప్రతియుగంలోనూ యోగాంగాలను పోషిస్తాయి. కాలంలో కూడా అనేకరూపా లుంటాయి. అది అనాది, అనంతం కూడా. అదే ప్రాణులను ప్రసవిస్తుంది. అదే ప్రాణులను కబళిస్తుంది. ఇది నీ కింతకుముందే చెప్పాను. కాల మనే తత్త్వమే ప్రాణులను పుట్టిస్తుంది, పోషిస్తుంది, నియంత్రిస్తుంది, సంహరిస్తుంది. ద్వంద్వాలుగా ఉన్న అనేక ప్రాణులు స్వాభావికంగానే కాలంలో నివసిస్తాయి. కుమారా ! నీవడిగినట్లుగా, సృష్టి, కాలం, ధారణం, వేదాలు, కర్త, కార్యం, క్రియాఫలం వీటిని గురించి నీకు చెప్పాను.

239. జ్ఞానసాధన - జ్ఞానమహిమ.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'ఈ రీతిగా వ్యాసుడు ఉపదేశించిన తరువాత శుకుడు తండ్రిని బాగా ప్రశంసించి మోక్షధర్మానికి సంబంధించి ఇలా అడుగసాగాడు. ప్రజ్ఞావంతుడు, శ్రోత్రియుడు, యజమాని, కృతప్రజ్ఞుడు, అసూయా రహితుడైన పురుషుడు ప్రత్యక్షానుమాన శబ్ద ప్రమాణాలతో కూడా ఇదమిత్థమని నిరూపించరాని బ్రహ్మను ఎలా పొందగలడు ? సాంఖ్యంలో కానీ యోగంలో కానీ తపస్సు, బ్రహ్మచర్యం, సర్వస్వత్యాగం, మేధాశక్తి - వీటిలో దేనితో బ్రహ్మసాక్షాత్కారం కలుగుతుంది ? ఇదే అడుగుతున్నాను. నాకు చెప్పండి.'

* *విసం॥ ఆలంభమంటే స్పర్శ, హింస క్షత్రియుడు దేనినైనా స్పృశించి దానంచేయటం ఆలంభయజ్ఞం. అలాగే ఇతరులను రక్షించటానికి చేసే యుద్ధం ఆలంభయజ్ఞం. (నీల)*

పురుషుడు ఏ ఉపాయం ద్వారా మనస్సును, ఇంద్రియాలనూ ఏకాగ్రతలో నుంచగలడు ? దానిని వివరంగా చెప్పండి.'

వ్యాసు డిలా చెప్తున్నాడు. **విద్య, తపస్సు, ఇంద్రియ నిగ్రహం, సర్వస్వపరిత్యాగం లేకుండా ఎవ్వడూ సిద్ధిపొందలేడు.*** మహాభూతాలన్నీ విధాత యొక్క తొలిసృష్టి. అవి సమస్త ప్రాణులలోనూ, సర్వదేహ ధారులలోనూ దాదాపు పూర్తిగా నిండి ఉంటాయి. దేహధారుల దేహం భూమినుండి, స్నేహం జలంనుండి, అగ్ని నుండి కళ్ళు, వాయువు నుండి ప్రాణాపానాలు ఏర్పాడ్డాయి. నాసిక, చెవి మొదలయిన రంధ్రాలలో ఆకాశ ముంటుంది. నడకలో విష్ణువు, బాహుబలంలో ఇంద్రుడు ఉదరంలో అగ్ని ఉంటారు. ఆ అగ్నికి బుభుక్ష ఉంటుంది. చెవులలో శ్రవణశక్తి, దిక్కులు ఉంటాయి. నాలుకపై సరస్వతి ఉంటుంది. చెవులు, చర్మం, కళ్ళు, నాలుక, నాసిక - ఈ అయిదు జ్ఞానేంద్రియాలు. ఇవే విషయానుభవానికి ద్వారాలుగా ప్రతిపాదింపబడ్డాయి. శబ్దం, స్పర్శ రూపం, రసం, గంధం - ఇవి ఇంద్రియ విషయాలు. ఇవి ఎప్పుడూ ఇంద్రియాలకన్న భిన్నమైనవే. సారథి అశ్వాలను తన అదుపులోనుంచుకొని స్వేచ్ఛను సారం నడిపించినట్లు మనస్సు ఇంద్రియాలను లొంగదీసికొని, తన ఇచ్ఛను బట్టి నడిపిస్తుంది. ఆ మనస్సును హృదయస్థుడైన జీవుడు సదా అనుశాసిస్తాడు. మనస్సు ఇంద్రియాధిపతియై ఇంద్రియ ప్రవృత్తికి ప్రేరకమయినట్లు హృదయస్థుడైన జీవుడు మనస్సును నిగ్రహించటంలోనూ, అనుగ్రహించటంలోనూ సమర్థుడు. ఇంద్రియాలు, ఇంద్రియార్థాలు, స్వభావం, చేతన, మనస్సు, ప్రాణాపానాలు, జీవుడు - ప్రాణుల శరీరాలలో ఎప్పుడూ ఉంటారు. బుద్ధికి శరీరం ఆశ్రయం కాదు. గుణాలు, శబ్దం, చేతన ఇవి కూడా బుద్ధికి ఆశ్రయాలు కావు. బుద్ధి చేతనను సృష్టిస్తుంది. కానీ గుణాలను సృష్టించలేదు. గుణాల కార్యమే బుద్ధి. ఈ రీతిగా ధీమంతుడైన బ్రాహ్మణుడు పంచ ఇంద్రియాలు, అయిదు ఇంద్రియార్థాలు, స్వభావం, చేతన, మనస్సు, ప్రాణం, అపానం, జీవుడు అనే షోడశగుణాలచే ఆవరింపబడిన పరమాత్మను బుద్ధి ద్వారా అంతఃకరణంలో సాక్షాత్కరించుకొంటాడు. పరమాత్మను కంటితో చూడలేము. సర్వేంద్రియాలతో కూడా గ్రహించలేము. మన స్సనే దీపంతోనే పరమాత్మ ప్రకాశిస్తాడు. ఆత్మకు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు లేవు. దానికి వికారం లేదు. శరీరంలేదు. ఇంద్రియాలు లేవు. అయినా శరీరాంతర్భాగంలోనే ఆత్మానుసంధానం జరగాలి

---

* నాన్యత్র విద్యాతపసోः నాన్యత్రేంద్రియనిగ్రహాత్ ।
నాన్యత్র సర్వసంత్యాగాత్ సిద్ధిం విందతి కశ్చన ॥ 5

వినాశ స్వభావంగల ఈ శరీరా లన్నింటిలో అవ్యక్తంగా ఉన్న పరమేశ్వరుని నిరంతరమూ చూడగలవాడు మరణానంతరం బ్రహ్మభావాన్ని పొందగలుగుతాడు. పండితులు విద్యచేత, ఉత్తమవంశంచేత సంపన్నుడైన బ్రాహ్మణునియందు, గోవునందు, ఏనుగునందు, కుక్కయందు, చండాలునియందు సమానంగా నున్న బ్రహ్మను చూడగలుగుతారు.* ఆ పరమాత్మయే స్థావరజంగమాత్మకాలయిన సమస్త ప్రాణుల్లో నివసిస్తాడు. ఆయన విశ్వమంతా నిండి ఉన్నాడు. జీవుడు సర్వప్రాణులలోనూ తననూ, తనలో సర్వప్రాణులనూ చూడగలిగినపుడు బ్రహ్మభావాన్ని పొందగలడు. జ్ఞాన స్వరూపుడైన ఆత్మ తనయందున్నట్లే అందరియందూ ఉన్నాడని నిత్యమూ ఎరుక కలిగినవాడు అమృతత్వాన్ని పొందగలడు. సర్వభూతాత్మయై సర్వభూతహితాన్ని కోరుతూ, అన్యస్థానాలను అపేక్షించకుండా బ్రహ్మపదాన్ని మాత్రమే పొందగోరే జ్ఞానయోగిమార్గాన్ని దేవతలు కూడా నిరోధించలేరు. ఆకాశంలో పక్షుల అడుగుజాడలు ఎవ్వరికీ కనిపించవు. నీటిలో చేపల అడుగుజాడలు కనిపించవు. అదేరీతిగా జ్ఞానుల గమనం కూడా ఎవ్వరికీ అంతుపట్టదు. కాలం సమస్త ప్రాణులను స్వయంగా తనలో పరిపక్వం చేస్తుంది. కాలం కూడా పరమాత్మయందు పక్వం చేయబడుతుంది. పరమాత్మ కాలానికే కాలం. ఆయన నెవ్వరూ తెలియరు. పరమాత్మ పైనా ఉండదు. క్రిందా ఉండదు. అడ్డంగా ఉండదు. అటు ఇటుగానూ ఉండదు. మధ్యలోనూ ఉండదు. ఏ స్థాన విశేషమూ దానిని గ్రహించలేదు. ఒక తావునుండి మరొకతావునకు అది వెళ్ళదు. లోకాలన్నీ పరమాత్మలోనే ఉంటాయి. పరమాత్మకు వెలుపల ఏదీ ఉండదు.

ఎవరైనా అల్లెత్రాటి నుండి వెలువడిన బాణంలా నిరంతరం మనోవేగంతో పరువెత్తినా జగత్కారణుడైన ఆ పరమాత్మ అంతు కనుగొనలేరు. సూక్ష్మమయిన పరమాత్మకన్న సూక్ష్మతరమైనది లేదు. ఆయన కన్న స్థూలతర మయిన వస్తువూ లేదు. పరమాత్మకు అన్ని వైపులా పాదాలే. అన్ని వైపులా కళ్ళు, తలలూ, ముఖాలే. అన్ని వైపుల చెవులే. సమస్తాన్నీ వ్యాపించి ఉంటాడు పరమాత్మ. అది అణువుకన్న అణుతర మైనది. మహద్వస్తువులకన్న మహత్తరమైంది. అది సమస్త ప్రాణులలోనూ నిశ్చయంగా ఉంటుంది. అయినా కనిపించదు. ఆత్మకు రెండు స్థితులు. క్షరమూ, అక్షరమూ అని. సమస్త ప్రాణులలోనూ క్షరరూప ముంటుంది. దివ్యమూ, చేతనా స్వరూపమైన

* విద్యాభిజనసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥ 19

ఆత్మ అక్షరం. స్థావర జంగమాత్మకా లయిన సర్వప్రాణులకూ ఈశ్వరుడై, అనన్యాధీనుడైన పరమాత్మ నవద్వారపురమైన ఈ శరీరంలోనికి ప్రవేశించి హంస (జీవ) రూపంగా స్థిరంగా ఉంటారు. తత్త్వజ్ఞాని హాని, భంగ, వికల్పాలతో కూడిన నూతనశరీరాలను మాటిమాటికి ఆశ్రయిస్తున్నందువలన జననరహిత పరమాత్మ అంశ అయిన జీవాత్మను **హంస** అంటారు. హంస పేరుతో ప్రతిపాదింపబడిన అనశ్వర జీవాత్మ కూటస్థుడైన పరమాత్మయే. ఆత్మసంబంధమైన ఆ యథార్థజ్ఞానాన్ని తెలిసినవాడు ప్రాణము, జన్మ, మృత్యువు అనే బంధనాల నుండి బయటపడతాడు.'

240. యోగము ద్వారా పరమాత్మప్రాప్తి.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'సత్కుమారా ! నీవడిగిన దానికి బదులుగా జ్ఞానాన్ని నీకు యథాతథంగా వివరించి చెప్పాను. ఇది సాంఖ్యసిద్ధాంతాను సారంగా జ్ఞానస్వరూపం. ఇక యోగానికి సంబంధించిన కృత్యాల నన్నింటిని చెపుతాను, విను. బుద్ధిని, మనుస్సును, ఇంద్రియాలను అన్నివైపులా నిరోధించి సర్వవ్యాపి అయిన ఆత్మతో వాటికి ఏకత్వాన్ని కల్పించటమే యోగమార్గంలో ఉత్తమజ్ఞానం. సాధకుడు అన్నివైపులనుండి మనస్సును మరలించి శమదమాది సాధనసంపన్నుడై ఆత్మతత్త్వాన్ని విచారించాలి. పరమాత్మయందే ఆనందించ గలగాలి. జ్ఞానుల నుండి జ్ఞానాన్నీ పొందాలి. పవిత్ర కర్మల నాచరించాలి. పరమాత్మ తత్త్వాన్ని గ్రహించాలి. అప్పుడు యోగసిద్ధి కలుగుతుంది. కామ, క్రోధ, లోభ, భయ, స్వప్నాలు యోగసాధనను ప్రతిబంధించే దోషాలు వాటిని భేదించాలి. శమంతో క్రోధాన్ని, సంకల్పపరిత్యాగంతో కామాన్ని, సత్త్వగుణాశ్రయంతో నిద్రను భేదించాలి. ఇది ధీరునకే సాధ్యం. **మనిషి ధీరుడై విషయోపభోగాలమా, భోజన చింతను విడనాడాలి. నేత్ర సహకారంతో కాళ్ళను, చేతులను నియంత్రించాలి. కళ్ళను, చెవులను మనస్సుతో, మనోవాక్కులతో కర్మను నియంత్రించాలి. జాగరూకతతో భయాన్ని, పండిత సేవనతో దంభాన్ని పోగొట్టుకోవాలి.** సదా సోమరితనాన్ని వీడి ఈ యోగదోషాలను జయించాలి. అగ్నులను, బ్రాహ్మణులను, అర్చించాలి. దేవతలకు ప్రణమిల్లాలి. మనస్సును నొప్పించే కటువచనాలను పరిత్యజించాలి. తేజోమయమైన నిర్మలబ్రహ్మ అన్నింటికీ కారణం. కనిపించే విశ్వమంతా బ్రహ్మ కార్యమే. స్థావర జంగమాత్మక మయిన బ్రహ్మ సంకల్పపరిణామమే. ధ్యానం, అధ్యయనం, దానం, సత్యం, బిడియం, ఋజుత్వం, సహనం, శౌచం, ఆచారసంశుద్ధి, ఇంద్రియనిగ్రహం- వీటిచేత తేజస్సు వృద్ధినందుతుంది. పాపం నశిస్తుంది. అంతేగాక సాధకుని మనోరథాలన్నీ తీరుతాయి.

జ్ఞానం వర్ధిల్లుతుంది. యోగికి సర్వభూత సమదృష్టి ఉండాలి. దొరికినా, దొరకకపోయినా తృప్తితో జీవించాలి. యోగి పాపాలను పోనాడి తేజస్వియై, మితాహారియై, జితేంద్రియుడై కామక్రోధాలను అదుపులో నుంచుకొని, బ్రహ్మపదాన్ని పొందే ప్రయత్నం చేయాలి. మనస్సును, ఇంద్రియాలను ఏకాగ్రతలో నిలిపి, సమాధి గతుడై రాత్రి తొలి, చివరి జాములలో మనస్సును ఆత్మలో లగ్నం చేయాలి.

తోలుతిత్తికి ఒకచోట రంధ్రం పడితే దానిలోని నీరంతా కారిపోయినట్లు ప్రాణికి గల పంచేంద్రియాలలో ఏ యొక్కటి భంగపడినా ఆ వైపుగా బుద్ధిఅంతా జారిపోతుంది. మత్స్యకారుడు వలను నాశనంచేసే చెడ్డచేపను ముందుగా తీసి బయట పడవేసినట్టు యోగమెరిగినవాడు ముందుగా మనస్సును లొంగదీసుకోవాలి. ఆ తరువాత చెవిని, ఆ తరువాత కంటిని, నాలుకను, నాసికను అదుపు చేయాలి. యతి ఈ ఇంద్రియాలను నియంత్రించి మనస్సులో నిలపాలి. అలాగే సంకల్పాన్ని పరిత్యజించి, మనస్సును బుద్ధిలో లీనం చేయాలి. యోగి పంచేంద్రియాలను లొంగదీసి, మనస్సులో దృఢంగా నిలపాలి. మనస్సుతో సహా ఆరు ఇంద్రియాలు బుద్ధిలో స్థిరపడి ప్రసన్నతను పొందినపుడు బ్రహ్మసాక్షాత్కారం కలుగుతుంది. అప్పుడు యోగి తన అంతఃకరణంలో ఆత్మను చూడగలడు. ఆ ఆత్మ పొగలేకుండా జ్వలిస్తున్న అగ్నిలా, వెలుగుతున్న సూర్యునిలా, మెరుపుతీగె కాంతిలా ప్రకాశిస్తుంటుంది. అంతా ఆ ఆత్మలోనే కనిపిస్తుంది. ఆత్మ వ్యాపకుడు కాబట్టి అన్నింటా కనిపిస్తాడు. ధీమంతులు, ధృతిమంతులు, మహాప్రాజ్ఞులు, సర్వభూతహితులు, మహాత్ములు అయిన బ్రాహ్మణులు ఆత్మను చూడగలుగుతారు. ఈ రీతిగా వ్రతనియమాలను పాటిస్తూ ప్రతిదినమూ నియతకాలంలో ఏకాంతంలో ఒంటరిగా కూర్చొని, కాలపరిమితితో యోగాన్ని అభ్యసించాలి. అప్పుడు అక్షర బ్రహ్మసమానుడవుతాడు.

యోగసాధనలో మోహం, భ్రమ, ఆవర్తాలు (సుడులు) మొదలగు విఘ్నాలు ఏర్పడుతాయి. దివ్యసుగంధాలు, దివ్యరూపాలు అనుభవానికి వస్తాయి. అద్భుతరసాలు, స్పర్శలు అనుభవానికి వస్తాయి. గాలి చల్లగా, వెచ్చగా తగులుతుంది. తాను గాలిగా మారి, ఆకాశంలో సంచరించే శక్తివస్తుంది. ప్రతిభ వృద్ధి నందుతుంది. దివ్యభోగాలు తమంత తాము దరిచేరుతాయి. యోగశక్తితో వీటినన్నింటినీ పొందిన తరువాత కూడా యోగి వాటిని నిరాదరించి మనస్సును వాటినుండి మరలించి ఆత్మయందే ఏకాగ్రుడు కావాలి. ఎందుకంటే అవన్నీ యోగవిఘ్నాలే. యోగి పర్వతశిఖరాల మీద నున్న దేవవృక్షాల సమీపంలో కానీ, ఏకాంతమందిరాలలో కానీ, చెట్లదగ్గర కానీ కూర్చొని నియమబద్ధంగా

నిత్యమూ ముమ్మారు యోగాభ్యాసం చేయాలి. వస్తువులు వినియోగించుకొనేవారు వస్తుసముదాయాన్ని ఎప్పుడూ ఇంట నుంచుకొన్నట్లు యోగి కూడా ఇంద్రియ సమూహాన్ని నియంత్రించి, ఏకాగ్రభావనతో నిత్యమూ ఆత్మను గూర్చి విచారించాలి. మనస్సు ఉద్విగ్నతకు లోనుకాకూడదు. చంచలమైన మనస్సును ఏ ఉపాయంతో నియంత్రించగలమో దానిని పాటించి, సాధనలో నిశ్చలంగా నిలుపగలుగుతాడు. ఏకాగ్రచిత్తతకై యోగి ముందుగా తగిన నివాసాన్ని ఎంచుకోవాలి. అది పర్వత గుహలు కానీ, దేవాలయాలు కానీ, ఏకాంతగృహాలు కానీ కావచ్చు. మనసా, వాచా, కర్మణా మరి దేనియందు ఆసక్తుడు కాకూడదు. అన్నింటినీ ఉపేక్షించాలి. ఆహారంలో నియంత్రణ ఉండాలి. లాభనష్టాలను సమానంగా స్వీకరించాలి. తనను ప్రశంసించిన వానిని కానీ, నిందించిన వానిని కానీ ఇద్దరినీ సమానంగా చూడగలగాలి. ఒకరికి మేలు. ఒకరికి కీడు కలగాలని భావించరాదు. **లాభాలు చూసి పొంగిపోకూడదు. నష్టాలు చూసి క్రుంగిపోకూడదు. సర్వప్రాణులయందు సమదృష్టి ఉండాలి. గాలి వలె అంతటా తిరుగుతూ కూడా అనాసక్తంగా సాగాలి. ఈ రీతి స్వస్థచిత్తుడై, సర్వత్ర సమదర్శనుడైన యోగి ఆరుమాసాల పాటు నిత్యమూ యోగాభ్యాసం చేస్తే పరబ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుంది.** ధనంకోసం బాధపడేవారిని చూసి ధనంపై విరక్తుడు కావాలి. మట్టిబెడ్డను, రాతినీ, బంగారాన్ని సమంగా చూడగలగాలి. విరక్తిగొన్న యోగి ఈ మార్గం నుండి తొలగిపోరాదు. మోహానికి లోనుకారాదు. తక్కువ కులంలో పుట్టిన పురుషుడైనా, స్త్రీ అయినా కూడా ఈ మార్గంలో పయనించి, పరమగతిని పొందవచ్చును. మనస్సును అదుపుచేసికొన్న యోగి మనస్సును, బుద్ధిని, ఇంద్రియాలను నిశ్చలంగా నిలిపి పరమాత్మానుభవాన్ని పొందవచ్చు. ఆ పరమాత్మ అజుడు, పురాతనుడు, అజరుడు, సనాతనుడు, నిత్యముక్తుడు, అణువుకన్న అణువు, పెద్ద వాటికన్న పెద్ద. మహాత్ముడైన వేదవ్యాస మహర్షి యథాతథంగా ఉపదేశించిన ఈ వచనాలను ఆలోచించి, అవగాహన చేసికొని, ఆచరించిన ధీమంతుడు పరబ్రహ్మ సమానుడై, ప్రళయ కాలంవరకు బ్రహ్మలోకంలో నిలిచి, ఆపై ముక్తుడు కాగలడు.'

241. కర్మజ్ఞాన తారతమ్యము - బ్రహ్మప్రాప్తికి ఉపాయము.

శుకు డిలా అడిగాడు. 'కర్మ చేయుమని, కర్మ మాను మనీ రెండురకాల మాటలు వేదాలలో కనిపిస్తాయి. జ్ఞానం ద్వారా కర్మపరిత్యాగం చేసినవాడు ఏ స్థితిని పొందుతాడు ? కర్మాసక్తుడైన వాడు ఏ స్థితిని పొందుతాడు ? ఈ విషయాన్ని వినగోరుతున్నాను. తమరు నాకు చెప్పాలి. ఈ రెండు మాటలు పరస్పరం ప్రతికూలంగా

ఉన్నాయి. ప్రతికూలఫలం కూడా కలుగవచ్చును గదా !' భీష్ముడిలా చెప్తున్నాడు. 'శుకుడు అలా అడగగానే వ్యాసుడు కొడుకుతో ఇలా అన్నాడు. కర్మమార్గం నశ్వరం. జ్ఞానమార్గం అనశ్వరం. వాటిని గురించి చెపుతా విను. వత్సా ! జ్ఞానమార్గం ద్వారా ఏ స్థితిని పొందుతారో, కర్మ మార్గం ద్వారా ఏ స్థితిని పొందుతారో సావధానంగా విను. ఈ రెండింటి మధ్య నున్న భేదాన్ని గ్రహించటం చాలా కష్టం. **ధర్మమున్నదని శాస్త్రాలు చెపుతాయి. ధర్మం లేదని ఎవరైనా అంటే వినటం ఆస్తికునకు ఎంత కష్టంగా ఉంటుందో అంతే కష్టం కర్మజ్ఞాన మార్గాల తారతమ్యాన్ని గూర్చిన ప్రశ్నకు సమాధానం చెప్పటం.** ప్రవృత్తిలక్షణ మైన ధర్మం, నివృత్తిపై దృష్టిపెట్టి చెప్పిన ధర్మం - ఈ రెండు మార్గాలలోనూ వేద ప్రతిష్ఠ నిలిచి ఉన్నది. కర్మ ప్రాణిని బంధిస్తుంది. జ్ఞానం విముక్తి కలిగిస్తుంది. కాబట్టి దూరదృష్టిగల యతులు కర్మను పరిత్యజిస్తారు. కర్మమార్గానుయాయి మరణానంతరం షోడశతత్వాలతో కూడిన శరీరాన్ని ధరించి మరల జన్మిస్తాడు. కానీ జ్ఞాన మార్గాన్ని అవలంబించినవాడు నిత్యుడు, అవ్యక్తుడు, అవినాశి అయిన పరమాత్మను చేరుతాడు. స్వల్పబుద్ధిగల కొందరు నరులు కర్మమార్గాన్ని ప్రశంసిస్తారు. అందువలన వారు భోగాసక్తులై, మరలమరల విభిన్న శరీరాలను సేవిస్తూ, ఆనందిస్తారు. **కానీ ధర్మతత్వాన్ని చక్కగా తెలిసి ఉత్తమ జ్ఞానాన్ని పొందిన వారు కర్మను ప్రశంసించరు. ఎప్పుడూ నదీజలాన్ని త్రాగేవాడు కూపోదకాన్ని అభినందించలేడు గదా !**

కర్మఫలాలు సుఖదుఃఖాలు జననమరణాలు. కర్మిష్ఠి ఆ ఫలితాలను పొందుతాడు. జ్ఞాని పునరావృత్తి లేని పరమపదాన్ని పొందుతాడు. అక్కడ శోకం ఉండదు. పరమాత్మను చేరిన తరువాత మరణం ఉండదు. జననమూ ఉండదు. అక్కడ పునర్జన్మ భయంకూడా ఉండదు. మరల సంసారబంధనాలలో పడరు. ఆ బ్రహ్మ సన్నిధిలో క్లేశ ముండదు. వియోగ ముండదు. పరమాత్మ అవ్యక్తుడు, అచలుడు, నిత్యుడు, అనిర్వచనీయుడు, వికార రహితుడు కూడా. జ్ఞాని ఆ పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడు. ఆ స్థితిని చేరిన వారికి సుఖదుఃఖాది ద్వంద్వాల బాధ ఉండదు. మనస్సంకల్పం కానీ, కర్మసంస్కార బాధ కానీ కలుగదు. అక్క డున్నవారు అందరినీ సమానంగా చూస్తారు. అందరికీ మిత్రులుగా ఉంటారు. సర్వభూతాల మేలును కోరుతుంటారు. జ్ఞాని ఒక విశిష్టుడు. కర్మాసక్తుడు జ్ఞానికన్న భిన్నంగా ఉంటాడు. చంద్రుడు తరిగిపోతూ అమావాస్య నాడు సూక్ష్మకలగా మిగులుతాడు. కర్మాసక్తుడు కూడా అలాగే వృద్ధిక్షయాలకు గురిఅవుతాడని గ్రహించు. అప్పుడే పుట్టి ఆకాశంలో నూలుదారంలాగా కనిపిస్తున్న నెలవంకను చూసి,

ఒక ఋషి హేతుదృష్టితో ఇలా విస్తారంగా చెప్పాడు. కర్మవలన పుట్టిన కలాభారాన్ని భరిస్తూ కర్మిష్ఠి మనస్సు, ఇంద్రియాలు అనే పదకొండు వికారాలతో కలిసి జన్మధరిస్తాడు. శరీరి అవుతాడు. కర్మఫలం వలన ఏర్పడిన త్రిగుణాత్మక శరీరాన్ని ధరించినవాడు చంద్రునివలె వృద్ధిక్షయాలకు లోనవుతాడు. ప్రాణుల అంతఃకరణంలో చిన్మయదేవుడు తామరాకు మీది నీటి బొట్టులా నిర్లిప్తభావంతో ప్రకాశిస్తుంటాడు. యోగశక్తి ద్వారా చిత్తాన్ని వశంచేసికొన్న ఆ ఆత్మతత్త్వమే క్షేత్రజ్ఞుడు అని గ్రహించు. తమస్సు, రజస్సు, సత్త్వం-అనేవి బుద్ధిగుణాలు. వీటితో సంబంధంవలన జీవుడు గుణస్వరూపుడుగా కనిపిస్తాడు. గుణాలు జీవస్వరూపాలుగా కనిపిస్తాయి. వాస్తవానికి జీవాత్మ పరమాత్మ అంశమే. శరీరం అచేతనం. కానీ చైతన్యంతో కలిసి ఉన్నందు వలన జీవాత్మ గుణచైతన్య సహితుడుగా భావింపబడతాడు. జీవాత్మయే శరీరంద్వారా చేష్టాసక్తు డవుతాడు. శరీరమంతటికీ చేతనను కల్గిస్తాడు. అయితే సప్తలోకాలను సృష్టించిన పరమాత్మయే జీవాత్మకన్న శ్రేష్ఠుడని క్షేత్రజ్ఞు లంటారు.

242. ఆశ్రమ ధర్మప్రస్తావన - బ్రహ్మచర్యాశ్రమ వర్ణన.

శుకు డిలా అన్నాడు. 'క్షరుని నుండి చతుర్వింశతి తత్త్వాలతో కూడిన సృష్టి ఈశ్వర సంబంధ మయినది. గుణ సహిత మయిన ఇంద్రియాది సృష్టి జీవసంబంధ మయినది. బుద్ధి సామర్థ్యం వలన ఏర్పడింది. ఇది అసాధారణం. బంధనహేతు వవుతుంది కాబట్టి ఇది ప్రధానం. ఇప్పుడు యుగానుసారంగా లోకంలోని శిష్టుల సదాచార విశేషాలు వినగోరుతున్నాను. వాటి ననుసరించి సత్పురుషులు ప్రవర్తిస్తారు నేను కూడా అనుసరించాలను కొంటున్నాను. వేదాలలో పనిచేయమనీ, మానుమనీ రెండు రకాలుగా కర్మవిషయం చెప్పబడింది. దాన్నెలా అర్థం చేసికోవాలి. దానిని వివరంగా చెప్పండి. తమవంటి గురువు ఉపదేశంవలన నేను పవిత్రుడ నయ్యాను. లోకవృత్తాంత తత్త్వాన్నీ గ్రహించాను. కాబట్టి ధర్మంద్వారా బుద్ధిని సంస్కరించుకొని విముక్తుడనై అవ్యయపరమాత్మను చూస్తాను.'

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'తొలుత బ్రహ్మయే స్వయంగా ఆచారవ్యవహారాలను విధించాడు. దానినే ప్రాచీనమహర్షులు, సత్పురుషులు పాటించేవారు. పరమర్షులు బ్రహ్మచర్య పరిపాలన ద్వారానే ఉత్తమలోకాలను పొందుతారు. కాబట్టి మనసా ఆత్మశ్రేయస్సును కోరుకొంటూ, ముందుగా బ్రహ్మచర్యాన్ని పాటించాలి. వానప్రస్థ ధర్మంతో వనంలో నివసిస్తూ ఫలాలు, మూలాలు భుజించాలి. ఘోరతపస్సు చేయాలి. పుణ్యతీర్థాలు సేవించాలి. ప్రాణిహింస చేయదగదు. తర్వాత సంన్యాసియై వానప్రస్థుల ఆశ్రమాలకు భిక్షాటనకు

వెళ్ళాలి. దానికి తగిన సమయ ముంది. ధాన్యాన్ని దంచే చప్పుడు రానప్పుడు, ఇంటి నుండి పొగరావటం ఆగినపుడు మాత్రమే భిక్షకై వెళ్ళాలి. ఇలా జీవించినవాడు బ్రహ్మభావాన్ని పొందటానికి అర్హుడు. స్తుతులకు, నమస్కారాలకు దూరమై, శుభాశుభకర్మాలను రెండింటినీ విడనాడి, దొరికిన దేదో తింటూ, అరణ్యంలో ఒంటరిగా తిరుగు.'

శుకు డిలా అడిగాడు. 'కర్మను గురించి విధినిషేధాలు రెండు ప్రతిపాదిస్తున్న వేదవచనం లోకానికి విరుద్ధంగా కనిపిస్తుంది. ఇది ప్రామాణికమా ? కాదా ? ప్రామాణికం కాకపోతే అది శాస్త్రమెలా అవుతుంది ? రెండూ ప్రమాణమెలా అవుతాయి ? కర్మ వైరుధ్యం లేకుండా మోక్షమెలా సిద్ధిస్తుంది ? ఇదంతా వినాలని ఉంది.' 'శుకుడలా ప్రశ్నించగానే పరమతేజస్వి అయిన తన కుమారుని మాటలను మన్నిస్తూ సత్యవతీ సుతుడైన వ్యాసుడు కొడుకు కిలా బదులిచ్చాడు.

'బ్రహ్మచారి అయినా, గృహస్థు డైనా, వానప్రస్థు డయినా, సంన్యాసి అయినా ఆ యా ఆశ్రమధర్మాలను పాటిస్తే పరమగతిని పొందగలడు. ఈ ఆశ్రమాలలో ఏ ఒక్కదానినయినా యథాశాస్త్రంగా, రాగద్వేషాలు లేకుండా అనుష్ఠించినవాడు పరమాత్మజ్ఞానాన్ని పొందగలడు. **పరబ్రహ్మ ప్రాప్తికై ఈ నాలుగు ఆశ్రమాలు నాలుగుమెట్లుగా తయారయిన నిచ్చెన. ఈ నిచ్చెనను ఎక్కి, ముందుకు పోయినవాడు బ్రహ్మలోకంలో సమ్మానాన్ని అందుకొనగలడు. ఆయుస్సులో నాలుగవభాగాన్ని బ్రహ్మచారియై, అసూయా రహితుడై గురుసన్నిధిలో కానీ, గురుపుత్ర సన్నిధిలో కానీ వసించిన వాడు ధర్మార్థకోవిదుడు కాగలడు. గురువు నిదురించిన తరువాత క్రింద పరుండి, గురువుకన్న ముందు నిదురలేవాలి. గురుగృహంలో శిష్యుడు కానీ, దాసుడు కానీ చేయదగిన పనుల నన్నింటినీ చేయాలి. గురువు పని చెప్పినప్పుడు "ఇప్పుడే చేస్తా" అంటూ దానిని పూర్తిచేసి గురుసన్నిధిలో నిలవాలి. ఆదేశాలకై ఎదురు చూస్తూ సేవకునివలె అన్నిపనులు చేయాలి. సర్వకర్మ నైపుణ్యాన్ని సంపాదించాలి.** ఆత్మోన్నతిని కోరుకొనే శిష్యుడు గురువు చెప్పిన పనుల నన్నింటినీ ముగించి, గురుసన్నిధిలో అధ్యయనం చేయాలి. అందరిపై దాక్షిణ్య ముండాలి. ఎవరి గురించి చెడు మాటాడకూడదు. గురువు పిలిచినపుడు వెంటనే దగ్గర చేరాలి. పవిత్రుడై, సమర్థుడై, గుణవంతుడై మధ్యమధ్య గురువుకు ఇష్ట మయిన మాటలు చెప్పాలి. ప్రశాంతంగా గురువు మోదనే దృష్టిని నిలపాలి. ఇంద్రియాలను జయించాలి. **గురువు భుజించక ముందు భుజించకూడదు. గురువు నీరు త్రాగకముందు తాను త్రాగరాదు. గురువు కూర్చొనక ముందు కూర్చొనరాదు. గురువు నిదురించకముందు**

నిదురించరాదు. రెండు చేతులూ చాపి కుడిచేతితో గురువుగారి కుడిపాదాన్ని, ఎడమ చేతితో గురువుగారి ఎడమ పాదాన్ని మృదువుగా స్పృశించాలి. గురువుకు నమస్కరించి 'స్వామీ ! చదువు చెప్పండి" అని అడగాలి. 'ఈ పని చేశాను. ఈ పని చేయబోతున్నాను' అని చెప్పాలి. "స్వామీ ! ఇంకా తమ రేదయినా చెపితే అదికూడా చేస్తాను" అని విషయాలన్నీ యథావిధిగా నివేదించాలి. ఆయన అనుమతితోనే పనిచేయాలి. చేసిన తర్వాత విషయమంతా మరల చెప్పాలి. బ్రహ్మచర్యంలో నిషేధింపబడిన గంధాలను కానీ, రసాలను కానీ బ్రహ్మచారి సేవించరాదు. సమావర్తన సంస్కారం తర్వాతనే వాటిని సేవించవచ్చు అవి శాస్త్ర నిర్ణయం. బ్రహ్మచారికై వివరంగా ప్రస్తావింపబడిన నియమాల నన్నింటినీ నిత్యమూ ఆచరించాలి. నిత్యమూ గురుసన్నిధిలోనే ఉండాలి. శిష్యుడు ఈ రీతిగా గురువుకు ఆనందాన్ని కలిగించి, యథాశక్తిగా గురుదక్షిణ నిచ్చి, బ్రహ్మచర్యాశ్రమం నుండి గృహస్థాశ్రమంలో ప్రవేశించి గృహస్థ ధర్మాలను పాటించాలి. వేదోక్తవ్రతాలతో, ఉపవాసాలతో ఆయుస్సులో నాలుగవ భాగం గడచిపోయిన తరువాత గురువుకు దక్షిణఇచ్చి, యథాశాస్త్రంగా సమావర్తన సంస్కారాన్ని పొందాలి. బ్రహ్మచారి ధర్మబద్ధంగా వివాహమాడి, ఆమెతో కలిసి యత్నపూర్వకంగా అగ్నిస్థాపన చేసి, ఆయుస్సులోని రెండవ పాదాన్ని గృహమేధియై వ్రతశీలుడై గడపాలి.'

243. గృహస్థ ధర్మ వర్ణన.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'ఆయుస్సులోని రెండవపాదాన్ని గృహస్థుడై గడపాలి. ధర్మబద్ధంగా వివాహమాడి, అగ్నిని ప్రతిష్ఠించి, నిత్యాగ్ని హోత్రియై, ఉత్తమ వ్రతశీలుడై జీవించాలి. గృహస్థుడు నాలుగు విధాలుగా బ్రతుకు తెరువు కల్పించుకో వచ్చని పండితు లన్నారు. కొట్టునిండా ధాన్యాన్ని సమకూర్చి పెట్టుకోవటం, గిన్నె నిండా అన్నం సంపాదించుకోవటం, ఆ రోజుకు అవసరమైనంత మాత్రమే సమకూర్చుకోవటం, ఉంఛవృత్తితో జీవించటం. ఈ నాలుగింటిలో ఉత్తరోత్తరం ఉత్తమమయినవి. గృహస్థులలో మొదటివారు షట్కర్మ నిరతులై ఉంటారు. రెండవశ్రేణివారు మూడు కర్మలలోనే (అధ్యయన, యజన, దానాలు) ఆసక్తులై ఉంటారు. మూడవ తరగతివారు దానాలకు పరిమిత మవుతారు. నాలుగవ తరగతివారు వేదాధ్యయనానికి పరిమిత మవుతారు. గృహస్థులకు శాస్త్ర విహిత నియమాలు చాలా ఉన్నాయి. గృహస్థుడు తనకోసం వంట చేసికొనరాదు. అనర్థహేతువయిన పశుహింస చేయరాదు. యాగవిధిలో యజమాని కానీ, ఇతరపదార్థాలు కానీ యజుర్వేద మంత్రాలతో

సంస్కరింపబడాలి. గృహస్థుడు పగలు ఎప్పుడూ నిదురించరాదు. రాత్రితొలి భాగంలో, చివరి భాగంలోనూ నిదురించరాదు. **రోజుకు రెండుపూటలే భోజనం చేయాలి. మధ్యమధ్య ఏమీ తినరాదు. ఋతుకాలంలో తప్ప మరెప్పుడూ భార్యతో సంగమించరాదు. గృహస్థుని ఇంట నిరాదరణతో కానీ, నిరాహారంగా కానీ అతిథుల నుంచకూడదు.** అతిథులుగా వచ్చిన వేదపండితులను, స్నాతకులను, శ్రోత్రియులను, వేదవ్రతశీలురను, హవ్య (యజ్ఞాన్ని) కవ్య (శ్రాద్ధాన్న) భోక్తలను, జితేంద్రియులను, కర్మ పరులను, స్వధర్మంతో జీవించేవారిని, తపస్సు లయిన బ్రాహ్మణులను యథావిధిగా పూజించి హవ్యకవ్యాలను సమర్పించాలి. వారి సత్కారంలో ఇది భాగం. **డాంబికత్వాన్ని ప్రదర్శించటానికి గోళ్ళను, జుట్టును పెంచుకొని కనిపించేవాడైనా, స్వధర్మాన్ని వాచా ప్రకటించుకొన్న వాడైనా, అగ్ని హోత్రాలను పరిత్యజించిన వాడైనా, గురువుతో అప్రియంగా ప్రవర్తించేవాడైనా, గృహస్థుని ఇంట అన్నాన్ని పొందటానికి అర్హుడే. సర్వప్రాణులకూ అన్నసంతర్పణ చేయవలసిన ధర్మం గృహస్థున కున్నది. తమకై వంట చేసికొన కూడని బ్రహ్మచారి, సంన్యాసులకు కూడా గృహస్థుడు అన్నం పెట్టాలి. గృహస్థుడు ఎప్పుడూ విషసాన్నాన్ని కానీ, అమృతాన్నాన్ని కానీ భుజించాలి. యజ్ఞశేషమయిన భోజనం హవిస్సుతో, అమృతంతో సమానం.**

తన మీద ఆధారపడిన వారికి పెట్టగా మిగిలినది విషసం. దానిని తినేవాడు విషసాశి. కాబట్టి భృత్యశేషం విషసం, యజ్ఞశేషం అమృతం. గృహస్థుడు తన భార్యయందే అనురక్తుడు కావాలి. జితేంద్రియుడు కావాలి. ఎవ్వరినీ తప్పుపట్టకూడదు. ఋత్విక్కులు, పురోహితులు, ఆచార్యులు, మేనమామ, అతిథులు, ఆశ్రితులు, వృద్ధులు, బాలురు, రోగులు, వైద్యులు, దాయాదులు, వియ్యంకులు, బంధువులు, తల్లిదండ్రులు, కుటుంబంలోని స్త్రీలు, సోదరుడు, కొడుకు, భార్య, సోదరి, సేవకబృందం - వీరితో వివాదపడకూడదు. వీరితో కలహపడని గృహస్థుడు సర్వపాప విముక్తి నందగలడు. వీరందరికీ లోబడి బ్రతుకుగలిగినవాడు నిస్సంశయంగా సర్వలోకాలను జయించినట్లే. ఆచార్యుడు బ్రహ్మలోక ప్రభువు. తండ్రి ప్రజాపతిలోకప్రభువు. అతిథి ఇంద్రలోకాధిపతి. ఋత్విక్కు దేవలోకాధిపతి. కుటుంబ స్త్రీలు (కోడలు, కూతురు) అప్సరోలోకాధిపతులు. జ్ఞాతులు విశ్వేదేవలోకాధిపతులు. వియ్యంకులు, బంధువులు దిక్కుల మీద; తల్లి, మేనమామ నేలమీద; వృద్ధులు, బాలురు, రోగులు, దుర్బలులు ఆకాశంమీద ఆధిపత్యం గలవారు. **పెద్ద అన్న తండ్రితో సమానం. భార్య, కొడుకు తన శరీరమే. సేవకగణం తన నీడయే. కూతురు పూర్తిగా దయ చూపదగినది.** కాబట్టి ఎప్పుడైనా వీరి

తిరస్కారానికి గురిఅయినా కోపించకుండా సహించాలి. గృహస్థధర్మపరుడు పండితుడై క్లేశాలను సహిస్తూ ధర్మపరాయణుడు కావాలి. ధర్మవంతు డెప్పుడు అర్థలోభంతో ధర్మకర్మలను పాటించరాదు. గృహస్థుకై చెప్పబోయే మూడు బ్రతుకు తెరువులలో ఉత్తరోత్తరం శ్రేష్ఠం. శుభకరం కూడా. నాలుగు ఆశ్రమాలలోనూ ఉత్తరోత్తరం శ్రేష్ఠం. ఎదగగోరిన వ్యక్తి ఆయా ఆశ్రమాలలోని విహిత కర్మలను అన్నింటినీ ఆచరించాలి. కుంభధాన్యశీలుడై కానీ, ఉంఛవృత్తి పరాయణుడై కానీ, కపోతవృత్తి ననుసరించి కానీ బ్రాహ్మణులు జీవించే రాష్ట్రం వర్ధిల్లుతుంది. కలత పడకుండా ఈ గృహస్థవృత్తుల నాశ్రయించి జీవించిన గృహస్థుడు తనకుముందున్న పదితరాలను, రాబోయే పది తరాలను కూడా పవిత్రం చేస్తాడు. అటువంటి గృహస్థుడు విష్ణులోకతుల్యమైన లోకాలను పొందుతాడు. లేదా జితేంద్రియులు పొందే ఉత్తమగతిని పొందగలడు. ఉదార మనస్కు లయిన గృహస్థులకు హితకర మయిన స్వర్గలోకం సిద్ధిస్తుంది. వేదాలలో వర్ణించినట్లు విమానసహితమైన, సుపుష్పితమైన స్వర్గలోకం వారికి సులభం. జితేంద్రియు లయిన గృహస్థులకు స్వర్గలోకమే ప్రతిష్ఠాస్థానం. బ్రహ్మ గృహస్థాశ్రమాన్ని స్వర్గప్రాప్తి కారణంగా విధించాడు. ఈ రీతిగా క్రమంగా ద్వితీయాశ్రమాన్ని (గృహస్థాశ్రమాన్ని) పొంది స్వర్గలోకంలో స్థిరపడవచ్చు. గృహస్థాశ్రమం తరువాత దీనికన్న గొప్పదయిన మూడవ ఆశ్రమం వానప్రస్థం. వానప్రస్థంలో శరీరం శోషిస్తుంది. వనవాసుడై తపః పూర్వకంగా శరీరాన్ని పరిత్యజించే వానప్రస్థులు దానిని ఆశ్రయిస్తారు. దీనిని గృహస్థాశ్రమం కన్న శ్రేష్ఠంగా భావిస్తారు. ఇప్పుడు వానప్రస్థధర్మాలు చెపుతా విను.'

244. వానప్రస్థ - సంన్యాస ధర్మవర్ణన.

భీష్ముడిలా చెప్తున్నాడు. 'యుధిష్ఠిరా ! పండితులు ప్రతిపాదించిన గృహస్థ వృత్తి ధర్మాలను వివరించాను. ఆ తరువాత వ్యాసమహర్షి మహాత్ముడైన తన కుమారునకు గతంలో చెప్పినది విను. కుమారా ! నీకుమేలు జరుగుగాక ! గృహస్థవృత్తులలో శ్రేష్ఠమైన మూడవవృత్తిని కూడా క్రమంగా కాదని, సహధర్మచారిణితో కలిసి చేసే వ్రతనియమాలవలన ఖిన్నులై వానప్రస్థాన్ని ఆశ్రయించి, సర్వలోకాలనూ, సర్వాశ్రమాలనూ ఆత్మస్వరూపంగా భావించి, తత్త్వచింతా పూర్వకంగా నియమాలను పాటిస్తూ, వనవాసులైన ముని ధర్మాలను విను. వ్యాసు డిలా చెప్తున్నాడు. 'గృహస్థుడు తన శరీరం ముడతలు పడి, వెంట్రుకలు తెల్లబడిన తరువాత, మనుమని చూసిన తరువాత వానప్రస్థుడు కావాలి. తన ఆయుస్సులో మూడవపాదాన్ని వానప్రస్థాశ్రమంలో గడపాలి. గృహస్థాశ్రమంలోని అగ్నులనే వానప్రస్థాశ్రమంలో

కూడా సేవిస్తూ దేవతల నారాధించాలి. వానప్రస్థుడు నియతుడై, నియమానుకూలంగా ఆహారాన్ని స్వీకరించాలి. పగటి మూడవ జామున భుజించాలి. అప్రమత్తుడై ఉండాలి. గృహస్థాశ్రమంలోని అగ్నులను, గోవులను, యజ్ఞాంగాలను అన్నింటినీ సాధించు కోవాలి. వానప్రస్థుడు దున్నకుండానే పండిన యవలను, నివ్వెరధాన్యాన్ని సంపాదించుకొని విఘసాన్నంతోనే జీవించాలి. వానప్రస్థంలో కూడా గృహస్థాశ్రమంలోని పంచమహాయజ్ఞాలలో హవిష్యదానం చేయాలి. **వానప్రస్థాశ్రమంలో నాలుగు రకాల జీవనవృత్తు లుంటాయి. కొందరు వండుకొని, తిని, వెంటనే గిన్నెలు కడుగు కొనేంత మాత్రమే సంపాదిస్తారు (ఏ పూటకా పూట సంపాదించుకొంటారు). కొందరు నెలకు సరిపడ ప్రోగు చేసి కొంటారు. కొందరు సంవత్సరానికి సరిపడ నిలవ చేసికొంటారు. కొందరు పండ్రెండు సంవత్సరాలకు సరిపడ నిలవచేసి కొంటారు. అయితే ఈ సంచయమంతా అతిథి సేవకోసం, యజ్ఞనిర్వహణ కోసం మాత్రమే.** వారు వర్షాసమయంలో కప్పులేని తావున, హేమంతంలో నీటిలో నిలుస్తారు. గ్రీష్మకాలంలో పంచాగ్ని మధ్యంలో శరీరాన్ని తపింప జేస్తారు. ఎప్పుడూ మితంగానే భుజిస్తారు. వానప్రస్థులు భూమిమీదనే పొర్లుతారు. వ్రేళ్ళ మీద నిలబడతారు. ఒకేచోట స్థిరంగా కూర్చుంటారు. త్రికాలాలలో స్నానసంధ్యలు చేస్తారు. కొందరు రోకలిపనిని దంతాలతోనే చేస్తారు. (పచ్చివే నమిలి నమిలి తింటారు). కొందరు దంచుకొని తింటారు. కొందరు శుక్లపక్షంలో ఒక్కసారి మరగ కాచిన యవల గంజిని త్రాగుతారు. కొందరు కృష్ణపక్షంలో త్రాగుతారు. కొందరు సమయానుకూలంగా లభించిన దానిని తింటారు. వానప్రస్థ ధర్మాన్ని ఆశ్రయించి దృఢవ్రతులై కొందరు మూలాలతో, కొందరు ఫలాలతో, కొందరు పుష్పాలతో యథాన్యాయంగా జీవితాన్ని గడుపుతారు. ఆ ధీమంతులకు ఇవి, ఇటువంటివి ఎన్నో దీక్షలున్నాయి. నాలుగవ ఆశ్రమమైన సంన్యాసాశ్రమంలో పాటించవలసిన ఉపనిషత్ ప్రతిపాదిత ధర్మాలు అన్ని ఆశ్రమాలవారూ పాటించాలి. సంన్యాసాశ్రమ విశేష ధర్మాలు వానప్రస్థ గృహస్థాశ్రమాల కంటె భిన్నమైనవి.

నాయనా ! ఈ యుగంలోనే సర్వార్థదర్శులయిన బ్రాహ్మణులు వానప్రస్థ ధర్మాన్ని పాటించారు. అగస్త్యుడు, సప్తర్షులు, మధుచ్ఛందుడు, అఘమర్షణుడు, సాంకృతి, సుదివుడు, తండి, యథావాసుడు, అకృతశ్రముడు, అహోవీర్యుడు, శుక్రాచార్యుడు, తాండ్యుడు, మేధాతిథి, బుధుడు, కర్ణనిర్వాకుడు, శూన్యపాలుడు, కృతశ్రముడు. వీరంతా వానప్రస్థధర్మాన్ని పాటించి, తత్ఫలంగా స్వర్గాన్ని పొందారు. నాయనా ! ఉగ్రతపస్సుకు, ధర్మమోక్షానికి, ధర్మానుభవానికి, ధర్మసాక్షాత్కారానికి గణుతికెక్కిన యాయావర మహర్షులు కూడా వానప్రస్థులే. వీరే కాక మరెందరో వానప్రస్థులు, వాలఖిల్యులు, సైకతులు అని ప్రసిద్ధి

గన్నవారు వైఖానస ధర్మాన్ని పాటించినవారే. వీరంతా ఉపవాసాది కర్మలను పాటించిన వారు కాబట్టి లౌకిక సుఖాలు పొందనివారు. నిత్యధర్మతత్పరులు. జితేంద్రియులు. ధర్మఫలాన్ని ప్రత్యక్షంగా అనుభవించినవారు. అందరూ వానప్రస్థులే. మరణానంతరం నక్షత్రాలుగాకాక జ్యోతిర్మయమైన తారలరూపాన్ని పొందినవారు. కళ్ళకు మిరుమిట్లు గొలుపుతూ కనిపిస్తారు. ఈ రీతిగా వానప్రస్థాశ్రమం ముగుస్తుంది. ఆయుస్సులో నాలుగవ పాదం మిగులుతుంది. వార్ధక్యం పైబడుతుంది. శరీరం దుర్బలమవుతుంది. రోగాలు పీడిస్తాయి. అప్పుడు సంన్యాసాశ్రమాన్ని స్వీకరించాలి. ఒక్కరోజులోనే ముగిసిపోయే యజ్ఞాలు చేస్తూ ఉన్నదంతా దానం చేయాలి. ఆత్మయందే ఆసక్తుడై, ఆత్మయందే క్రీడిస్తూ, ఆత్మనే ఆశ్రయించి, ఆత్మయాగాలు చేయాలి. అగ్నిహోత్రాలను ఆత్మయందే ఆరోపించుకోవాలి. దేనినీ స్వీకరించకూడదు. సాదృస్కయాగాలను, ఇష్టులను మానసికంగానే చేయాలి. కర్మయజ్ఞ స్థితి నుండి ఆత్మయజ్ఞ స్థితికి చేరేదాకా అలా చేస్తూనే ఉండాలి. తనయందే త్రేతాగ్నులను విధిపూర్వకంగా స్థాపించి శరీరం నశించేదాకా ప్రాణాగ్నిహోత్ర విధితో చక్కగా యాగం చేయాలి. యజుర్వేద మంత్రాలను ఉచ్చరిస్తూ ప్రాణాహుతులను సమర్పించి, మిగిలిన అన్నాన్ని నిందించకుండా మౌనంగా భుజించాలి.*

ఆ తరువాత వానప్రస్థుడు కేశాలను, లోమాలను, గోళ్ళను ఖండించుకొని, కర్మలచే పవిత్రుడై వానప్రస్థం నుండి పుణ్యమయమైన సంన్యాసాశ్రమంలోనికి ప్రవేశించాలి. సర్వప్రాణులకూ అభయాన్నిచ్చి సంన్యసించిన బ్రాహ్మణుడు మరణానంతరం తేజోమయలోకాలను చేరి, కడకు మోక్షాన్ని పొందుతాడు. ఆత్మజ్ఞాని అయిన నరుడు మంచి శీలమూ, మంచినడవడి కలిగి పాపవిముక్తి నందుతాడు. ఇహపరలోకాలకై ఏపనీ చేయాలనుకోడు. రోష, మోహ, సంధి, విగ్రహాలకు దూరంగా ఉదాసీనంగా నిలుస్తాడు. యమనియమాలను పాటించటానికి వ్యథ చెందడు. సంన్యాసాశ్రమానికి మూలభూతమయిన విధి వాక్యాల ననుసరించి, అగ్నిలో తన సర్వస్వాన్ని ఆహుతి చేయటానికి సిద్ధపడతాడు. ఈ రీతిగా జితేంద్రియుడు, ధర్మ పరాయణుడై ఆత్మజ్ఞుడు ముక్తి నందటంలో సంశయంలేదు.

---

* వి॥ ఓం ప్రాణాయ స్వాహా, ఓం అపానాయ స్వాహా, ఓం వ్యానాయ స్వాహా, ఓం ఉదానాయ స్వాహా, ఓం సమానాయ స్వాహా – ఇవి ప్రాణాగ్నిహోత్ర మంత్రాలు. భోజన ప్రారంభ సమయంలో ఒక్కొక్క మంత్రాన్ని పఠిస్తూ అయిదారు మెతుకులను నోట వేసికొంటారు. ఇది ప్రాణాగ్ని హోత్రం.

కొన్ని ప్రాంతాలలో పై అయిదు మంత్రాలతో పాటు ఓం బ్రహ్మణే స్వాహా అని ఆరవమంత్రాన్ని కూడా పఠించటం సంప్రదాయంగా వస్తోంది.

వానప్రస్థాశ్రమం కన్న తన సల్లక్షణాలతో అత్యంతం శ్రేష్ఠమైనది సంన్యాసాశ్రమం. ముందు చెప్పిన మూడు ఆశ్రమాలనూ మించినదీ నాలుగవ ఆశ్రమం. పరమ పరాయణంగా కీర్తింపబడే ఈ పరమాశ్రమాన్ని - సంన్యాసాశ్రమాన్ని - గురించి విను.'

245. సంన్యాసాశ్రమ పాలన - జ్ఞాని అయిన సంన్యాసి ప్రశంస.

శుకు డిలా అడిగాడు. 'బ్రహ్మచర్య, గృహస్థాశ్రమాలలో వలె వానప్రస్థంలో కూడా నియమపాలన మవసర మని తెలిసింది. వేద్యుడైన పరమాత్మను తెలియగోరినవాడు తన శక్తినను సరించి పరమాత్మ చింతన మెలా చేయాలో తెలియగోరుతున్నాను.' వ్యాసు డిలా చెప్తున్నాడు. 'బ్రహ్మచర్య, గృహస్థాశ్రమాల ద్వారా సంస్కారాన్ని పొందిన తరువాత ముక్తికై పాటించవలసిన కర్తవ్యాన్ని చెపుతాను. సావధానంగా విను. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థాశ్రమాలలో రాగద్వేషాలను పోగొట్టుకొని, సంస్కారాన్ని పరిపక్వం చేసికొని వెంటనే సర్వోత్తమమైన సంన్యాసాన్ని స్వీకరించాలి. నీవు సంన్యాస ధర్మనియమాలను విను. వాటిని ఆచరించు. సంన్యాసి సిద్ధిపొందటానికి ఎవ్వరితోడు లేకుండా ఒంటరిగానే సంన్యాస ధర్మాలను పాటించాలి. జ్ఞానియై ఒంటరిగా తిరుగుతాడు. కాబట్టి తానెవ్వరినీ విడువడు. తన నెవ్వరూ విడువరు. తనకంటూ ఇల్లు ఉండకూడదు. అగ్నిహోత్రాలూ ఉండకూడదు. ఆహారం కోసమే గ్రామంలోనికి వెళ్ళాలి. **మరునాటి కోసం అన్నసంపాదన చేయరాదు. ఏకాగ్రచిత్తుడై మౌనంగా ఉండాలి. మితాహారి, నియతాహారి కావాలి. రోజు కొక్కసారి మాత్రమే భుజించాలి.** భిక్షాపాత్ర, చెట్టుక్రింద నివాసం, అస్తవ్యస్తంగా వస్త్ర ధారణం, ఒంటరి జీవనం, సర్వప్రాణులమీదా ఉపేక్ష - ఇవి సంన్యాసి లక్షణాలు. బెదరిపోయి పరుగెత్తే ఏనుగులు బావిలో పడి తిరిగిపైకి రాలేని రీతిగా సంన్యాసిని నిందించినా, స్తుతించినా ఆ మాటలు తిరిగి వక్తదగ్గరకు రాకూడదు. అలా బదులివ్వక నిలువగలవాడే సంన్యాసి. ఇతరులను నిందించే వారివైపు కనీసం చూడకూడదు. ఆ నిందావచనాలను వినకూడదు. విశేషించి బ్రాహ్మణులతో అయోగ్యమైన విషయాలు చెప్పకూడదు. **బ్రాహ్మణులకు హితకర మయిన మాటలనే ఎప్పుడూ పలకాలి. తనను ఎవరైనా నిందిస్తే మౌనంగా నిలవాలి. దానినే సంసారరోగానికి మందుగా భావించాలి.**

తాను సర్వవ్యాపి కాబట్టి తానొక్కడు ఉన్నా శూన్యప్రదేశ మంతా నిండినట్లుండాలి. తానొక్కడు లేకపోతే గుంపులున్నా కూడా శూన్యంగా అనిపించాలి. ఆ స్థాయి కలవాడే బ్రాహ్మణు డని దేవతలంటారు. ఏదో ఒకటి కట్టుకొని, ఏదో ఒకటి తింటూ, ఎక్కడో అక్కడ పడుకొనే వాడే బ్రాహ్మణు డని దేవతలంటారు. **జనసమూహాన్ని చూసి పామును**

చూసినట్లు భయపడాలి. విందుభోజనంతో లభించే తృప్తిని నరకంలా భావించాలి. స్త్రీలను చూసి శవాలను చూసినట్లు విరక్తుడు కావాలి. అటువంటివాడే బ్రాహ్మణుడని దేవతలంటారు. సత్కరించినా, తిరస్కరించినా ఆనందించకూడదు. కోపగించకూడదు. సర్వప్రాణులకు అభయదానం చేయాలి. అటువంటివాడే బ్రహ్మజ్ఞుడని దేవతలంటారు. జీవితాన్నీ అభినందించ కూడదు. మరణాన్నీ అభినందించకూడదు. సేవకుడు యజమాని ఆదేశానికై ఎదురుచూసినట్లు కాలానికై నిరీక్షించాలి. చిత్తం మలినం కాకూడదు. వాక్కు మలినం కాకూడదు. సర్వపాపాలనుండి విముక్తిని పొందాలి. పాప మనే శత్రువు లేనప్పుడు ఇక భయ మెందుకు ? సమస్త ప్రాణులనుండి తనకు అభయం, తనవలన సర్వప్రాణులకు అభయం ఉండాలి. ఆ రీతిగా మోహవిముక్తిని పొందినవానికి ఎవరివలనా భయముండదు. పాదచారులయిన పశ్వాదుల పాదముద్రలు ఏనుగు పాద ముద్రలలో ఇమిడి పోతాయి - అలాగే సమస్తధర్మాలు అహింసలోనే అంతర్భవిస్తాయి. ఎవ్వరినీ హింసించనివాడు నిత్యమూ అమృతుడు కాగలడు అహింసకుడు, సమదర్శి, సత్యవాది, ధైర్యవంతుడు, జితేంద్రియుడు, సర్వభూత శరణ్యుడు అయినవాడు పరమోత్తమగతిని పొందగలడు.

ఈ రీతిగా ప్రజ్ఞానంతో తృప్తి నంది, నిర్భయుడై, కామనారహితుడైన వానిని మృత్యువు అతిక్రమించలేదు. ఆ జ్ఞానియే మృత్యువును దాటుతాడు. సర్వసంగవిముక్తుడై, ఆకాశంవలె నిర్లిప్తుడై, దేనినీ తనదిగా భావించక ఒంటరిగా, శాంతంగా సంచరించే మునిని దేవతలు బ్రాహ్మణు డంటారు. తన జీవితం ధర్మం కోసమే. ధర్మం శ్రీహరి కోసమే. అహోరాత్రాలు పుణ్యాచరణ కోసమే. అటువంటి వానినే దేవతలు బ్రాహ్మణుడంటారు. కామనలు లేవు. ఏ ప్రయత్నాలు లేవు. నమస్కారాలకు స్తుతులకు దూరంగా నిలుస్తాడు. సర్వబంధ విముక్తుడు, అటువంటి వానిని దేవతలు బ్రాహ్మణు డంటారు. ప్రాణులన్నీ సుఖం కలిగితే ఆనందిస్తున్నాయి. దుఃఖమంటే తీవ్రంగా భయపడుతున్నాయి. వాటికి భయంకలుగుతున్నందుకు బాధపడేవాడు శ్రద్ధతో భయహేతువు లయిన కర్మలను మానాలి. ఈ లోకంలో ప్రాణులకు అభయదక్షిణ నివ్వటమే సర్వదానాలలో గొప్పదానం. ముందుగానే హింసను పరిత్యజించినవాడు ఇతర ప్రాణులవలన భయంపొందక మోక్షాన్ని పొందగలడు. వైశ్వానరాగ్ని విశ్వమంతా వ్యాపించి ఉంటుంది. అది విశ్వానికి ఆశ్రయం. ప్రాణుల నాభిదేశంలో జఠరాగ్నిరూపంలో ఉంటుంది. నోరు తెరిచి అన్నంతో ప్రాణాహుతులను వేయకుండా ప్రాణాలనే హోమంచేసిన సంన్యాసిశరీరాంగాలు, చేసిన కర్మలు అగ్నికి అవయవాలు అవుతాయి. (తానే అగ్ని స్వరూపాన్ని పొందుతాడు.) ఆత్మయాజి ప్రాదేశమాత్రమైన (నాభినుండి హృదయం దాకా)

స్థానంలో ప్రకటమైన చైతన్యాగ్నిలో సమస్త ప్రాణాలనూ (ఇంద్రియాలు, మనస్సు) ఆహుతి చేయాలి. ఆ అగ్నిహోత్రం దేహగత మయినా దేవలోకంతో సహా సర్వలోకాలలోనూ సంపన్న మవుతుంది. ఆత్మతృప్తిలో విశ్వతృప్తి కనిపిస్తుంది. పరమాత్మ త్రిధాతువు (అకార, ఉకార, మకార ప్రణవ స్వరూపుడు), త్రివృతుడు (సత్త్వ, రజ, స్తమో వృతుడు), సుపర్ణుడు (చెట్టు ఆకులవలె వ్యాపనశీలుడు). ఇట్టి పరమాత్మను, పరమాత్మతత్త్వాన్ని గ్రహించినవారు సర్వలోకాలలో సత్కరింపబడతారు. దేవతలు, మానవులు వాని సత్కర్మలను ప్రశంసిస్తారు. వేదాలు, వేద్యం (తెలియదగినది), విధి, నిరుక్తం, పరమార్థత - ఇవన్నీ శరీరాంతర్వర్తి అయిన పరమాత్మలో ఉంటాయి. ఆ విషయాన్ని ఎరిగిన జ్ఞానిని సేవించటానికి దేవతలు కూడా తహతహపడతారు. భూమిపై నున్నా అనాసక్తుడు. ఆకాశంలా అప్రమేయుడు. హిరణ్మయుడు. బ్రహ్మాండంనుండి పుట్టినవాడు. హృదయ కమలవర్తి. అంగదేవతలు ఈకలుగా కనిపించగా మోద ప్రమోదాలు రెండు రెక్కలు కాగా ప్రకాశించేవాడు. శరీరంలో సువర్ణపక్షి రూపమైన జీవాత్మను, పరమాత్మను గ్రహించినవాడు జ్ఞానకిరణాలతో వెలుగొందగలడు. బుద్ధిరూపమైన గుహలో కాలచక్రమున్నది. అది నిరంతరం తిరుగుతుంటుంది. ఎప్పుడూ నశించదు. ప్రాణుల ఆయుస్సు క్షీణింపజేస్తుంది. ఋతువులు దాని నాభి. ద్వాదశమాసాలు దాని ఆకులు. అమావాస్య, పూర్ణిమ్ల దాని పర్వాలు. విశ్వమంతా దాని నోటిలో ఆహారమై పడుతుంది. దీని నెరిగిన వానిని దేవతలు ప్రస్తుతిస్తారు. జగత్తుకు శరీరమై, మనస్సుకు ప్రసన్నతను కల్పించే పరమాత్మ విశ్వంలోని సర్వలోకాలనూ నిండియున్నాడు. ధ్యానం ద్వారా దానిపై లగ్నమయిన మనస్సు శరీరంలోని దేవతలను తృప్తి పరుస్తుంది. తృప్తి పడిన దేవతలు జ్ఞానిముఖాన్ని జ్ఞానామృతంతో తృప్తి పరుస్తారు. బ్రహ్మతేజోమయు డయి, తేజస్సుతో సంపన్నుడై, పురాతన నిత్యబ్రహ్మపరాయణుడైన సంన్యాసి అనంత నిర్భయ లోకాలను పొందగలడు. ప్రాణులకు భయభ్రాంతులను కలిగించనివాడు ప్రాణులనుండి భయభ్రాంతులను పొంద నవసరం లేదు. తానెవ్వరినీ నిందించక, ఎవ్వరి నిందలకూ గురికాక నిలిచినప్పుడు పరమాత్మను సందర్శించగలడు. మోహ, పాపాలకు దూరమైన వాడు ఇహపరభోగాలపై ఆసక్తి కొనడు. ఇటువంటి సంన్యాసి రోషమోహాలకు లోనుకాడు. మట్టిబెడ్డను, బంగారాన్ని సమంగా చూడగలడు. పంచకోశాలపై అభిమానపడడు. సంధి విగ్రహాలు, నిందాస్తుతులు తన నుండి తొలుగుతాయి. ఏదీ ప్రియమూ కాదు, ఏదీ అప్రియమూ కాదు. ఉదాసీనుడై సర్వత్ర సంచరిస్తుంటాడు.

246. పరమాత్మ శ్రేష్ఠత - పరమాత్మ దర్శనోపాయము.

వ్యాసు డిలా చెప్తున్నాడు. 'దేహం, ఇంద్రియాలు, మనస్సు మొదలయినవన్నీ ప్రకృతి వికారాలే. అవి క్షేత్రజ్ఞునిపై ఆధారపడి ఉంటాయి. ఈ వికారాలు జడాలు. క్షేత్రజ్ఞుని తెలియలేవు. క్షేత్రజ్ఞునకు అన్నీ తెలుసు. శ్రేష్ఠాలు, బలిష్ఠాలు అయిన అశ్వాలను రథసారథి తన వశం చేసికొని, వాటితో రథాన్ని నడిపించినట్టు, క్షేత్రజ్ఞుడు మనస్సును నడిపిస్తుంటాడు. ఇంద్రియాలకన్నా ఇంద్రియార్థాలు బలవత్తరాలు. ఇంద్రియార్థాల కన్న మనస్సు బలీయం. మనస్సు కన్న బుద్ధి బలవత్తరం. బుద్ధికన్న జీవుడు బలవంతుడు. జీవుని కన్న అవ్యక్తం బలవత్తరం. అవ్యక్తం కన్న (మూల ప్రకృతి కన్న) అమృత స్వరూపుడైన పరమాత్మ గొప్పవాడు. ఆ పరమాత్మ కన్న గొప్పది ఏదీ లేదు. అదే పరాకాష్ఠ. అదే ఉత్తమగతి.

ఈ రీతిగా సమస్త ప్రాణుల హృదయగుహలలో నున్న పరమాత్మను ఇంద్రియాలద్వారా సాక్షాత్కరించుకొనలేము. జ్ఞానులు సూక్ష్మమూ, తీక్ష్ణమూ అయిన తమబుద్ధిచేతనే దానిని సాక్షాత్కరించుకొనగలరు. యోగి బుద్ధితో మనస్సును, పంచేంద్రియాలను, ఇంద్రియార్థాలను అంతరాత్మలో లీనం చేసి, విషయచింతన మాని, వివేక విశుద్ధమైన మనస్సును ధ్యానంద్వారా విషయాల నుండి మరలించి, కర్తృత్వభావ శూన్య డైనప్పుడు మనస్సు నిశ్చలమూ, ప్రశాంతి సంపన్నమూ అవుతుంది. అమృత స్వరూపుడైన పరమాత్మను చేరుతుంది. మనస్సు పూర్తిగా ఇంద్రియాలకు వశమయితే, వివేక శక్తి నశించి, కామాదిశత్రువులకు లొంగి, మనిషి మృత్యుదుఃఖాన్ని అనుభవించవలసివస్తుంది. సర్వసంకల్పాలను నశింపజేసి, చిత్తాన్ని బుద్ధిలో లీనం చేయాలి. ఈ రీతిగా చిత్తాన్ని బుద్ధిలో లీనం చేయగలిగిన తర్వాత మనిషి కాలంపై విజయాన్ని సాధించగలడు. చిత్తం ప్రసన్నమైన తర్వాత యోగి ఐహిక శుభాశుభాలను పరిత్యజిస్తాడు. ప్రసన్న చిత్తుడు, ఆత్మనిష్ఠుడూ అయి అక్షయసుఖాలను అనుభవించగలుగుతాడు. ప్రసన్న చిత్తతకు లక్షణా లివి. నిద్రాసమయంలో సుఖంగా నిద్రించాలి. గాలి లేనప్పుడు దీపం చలించకుండా వెలుగుతున్నట్లు మనస్సు నిశ్చలంగా నిలవాలి. యోగి మితాహారియై, పవిత్ర చిత్తుడై, రాత్రి తొలి, చివరి జాములలో ఆత్మను పరమాత్మధ్యానంలో లీనం చేయాలి. అప్పుడే తన అంతఃకరణలో పరమాత్మను సందర్శించగలుగుతాడు. కుమారా ! నేను నీకు ఉపదేశించిన ఈ శాస్త్రం ఆత్మజ్ఞానాన్ని కలిగించేది. ఇది సర్వవేద రహస్యం. ఇది ఆగమసిద్ధమో, ఐతిహ్యరూపమో కాదు. అనుభవంలో మాత్రమే అర్థమయ్యేది.

ధర్మసత్యాలకు సంబంధించిన సర్వకథనాలలోనూ ఇది సారభూతమయిన

ధనం. ఋగ్వేదంలోని పదివేల ఋక్కులను మథించి, ఈ అమృతతత్త్వాన్ని వెలికి తీశాను. పుత్రా ! పెరుగునుండి వెన్న తీసినట్లు, కట్టెలోనుండి నిప్పు పొందినట్టు శాస్త్రాలను మథించి విద్వాంసులకొరకు ఈ మోక్షజ్ఞానాన్ని వెలికితీశాను. పుత్రా ! వ్రతధారు లయిన స్నాతకులకే నీవు ఈ మోక్ష శాస్త్రాన్ని ఉపదేశించాలి. మనశ్శాంతి లేని వానికీ, ఇంద్రియాలను అదుపుచేయలేని వానికీ, తపస్వి కాని వానికి దీని నుపదేశించరాదు. వేదవేత్త కాని వానికీ, అనుగతంగా భక్తిలేని వానికీ, అసూయా పరునకు, బుజుత్వం లేనివానికీ, అనుశాసనానికి లోబడనివానికీ, హేతువాదంతో హృదయం శుష్కించినవానికీ, చాడీలు చెప్పేవానికీ దీని నుపదేశించరాదు. తత్త్వజ్ఞానాన్ని అభిలషించే వాడు, సద్గుణసంపన్నుడు, ప్రశాంతుడు, తపస్వి అయిన ప్రియ పుత్రునకు కానీ, అనుగత, శిష్యునకు కానీ ఈ రహస్యధర్మాన్ని ఉపదేశించవచ్చు. ఏ రీతిగానూ ఇతరులకు ఉపదేశించరాదు. రత్నపూర్ణ అయిన ఈ భూమినంతటినీ పొందినా దానికన్న ఈ తత్త్వజ్ఞానాన్నే శ్రేయస్కరంగా తత్త్వవేత్త భావించాలి. నీవు నన్ను అడిగినదాని కనుగుణంగా ఇంతకన్న గూఢతరమైన అలౌకికాధ్యాత్మ జ్ఞానాన్ని నీకు ఉపదేశిస్తాను. మహర్షులు దీనిని ప్రత్యక్షంగా అనుభవించారు. వేదాంతశాస్త్రం దీనినే దానం చేస్తుంది. పుత్రా ! నీవు నీమనస్సులో సర్వశ్రేష్ఠంగా భావిస్తున్నదానిని, నీకు ఏవైనా సంశయాలున్న విషయాన్ని గురించి అడుగు. దానికి సమాధానంగా నీకు నేను చెప్పేది విను. ఇప్పుడు ఏ విషయాన్ని చెప్పమంటావు చెప్పు.'

ఇది శాంతిపర్వం రెండవభాగం

భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందం తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నప్పుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను ఐక్యపరుస్తుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.